

## సమన్వయ భాగవతం

ఆధ్యాత్మికత అంటే చేతనత్వ విజ్ఞానము. భారతీయ దశావతార పరంపర, మానవీయ చేతనత్వము యొక్క పది ముఖ్యమైన స్థితులను సూచిస్తుంది.

చేతనత్వము యొక్క ఆయామాలు - కాలము, ఆకాశము. ఆకాశము మరియు కాలము పరిపూర్ణ అవగాహనతో కలిసి పనిచేసే చేతనత్వమే నారదుడు. ఏక మొత్తములో మానవజాతి యొక్క స్థాయి పెంచటానికి వచ్చిన రెండు ఖండావతారాలు శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీఅరవిందులు. వీరిలో శ్రీరామకృష్ణ పరమహంస భక్తి లేక ఇచ్ఛాశక్తికి ప్రతీక అయితే, శ్రీఅరవిందులు జ్ఞానానికి ప్రతీక. వీరి తర్వాత అరవిందుల ఉత్తరార్థముగా వచ్చిన పరమ పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య క్రియాశక్తికి ప్రతీక. ఈవిధంగా శ్రీరామకృష్ణ పరమహంస - శ్రీఅరవిందో - శ్రీరామశర్మ ఆచార్యులు సమస్త మానవజాతికి ఇచ్ఛా - జ్ఞాన - క్రియాశక్తులకు సమన్వయ రూపులు.

శ్రీమద్భాగవతంలోని భాగవతమాహాత్మ్యంలో మొదటి అధ్యాయం నారదుడు, (లేక మహాకాలుడు) భక్తితో సమాగమం చెంది నూతన యుగ ప్రవర్తనకు ఎలా దోహదం చేస్తున్నాడో తెలిపేదే ఈ **సమన్వయ భాగవతం.** ఈ పుస్తకంలో వివరించిన విధానము సమస్త భాగవతాన్ని - అధునిక విజ్ఞానంతో సమన్వయం చేసుకోవటానికి ఉపయోగపడుతుంది.

డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ సమన్వయ భాగవతం

# సమన్వయ భాగవతం

(భాగవత మహాత్మ్యము : భక్తి - నారద సమాగమ యోగము)



డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ M.Sc., Ph.D.

# సమన్వయ భాగవతము

( భాగవత మాహాత్మ్యము : భక్తి - నారద సమాగమము)


కులపతి :

డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ M.Sc.,P.hD



ఋతుంభరా పబ్లికేషన్స్

23-8-4, ఆదిశేషయ్యవీధి, సత్యనారాయణపురం

విజయవాడ - 520 011.

Phone : 530448

సమన్వయ భాగవతము

(భాగవత మాహాత్మ్యము : భక్తి - నారద సమాగమము)

ప్రథమ ముద్రణ :
23, డిశంబరు 2001
అశ్వమేధ యజ్ఞము

మూల్యం :
రు. 120.00

ప్రతులకు : 1. ఋతుంభరా పబ్లికేషన్స్
23-8-4, Adiseshaiah Street,
VIJAYAWADA - 11
Phone : 530448.

2. **Vibgyor Vedic Trust International**
50, Sukrutavilla, Venugopal Nagar,
G U N T U R - 4. Phone : 235777

3. **Sri Mahalakshmi Book Corporation**
VIJAYAWADA - 2,
Phone : (O) 432750, (R) 433322,530448

D.T.P :
Apoorva Publications,
R.K. Infosys,
Lawyerpet, ONGOLE.

Cover Design :
Chalam
Vijayawada, (0866) 574505.

Printers :
Bhavana Offset Printers
Vijayawada. (0866) 480514

# అంకితం

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య సన్నిధియైన
తిరుపతిలో పూజ్య గురుదేవులు, యుగద్రష్టలైన
**పండిత శ్రీరామ శర్మ ఆచార్య, మాతా భగవతీ దేవి గార్ల**
సూక్ష్మ సంరక్షణలో జరుగుచున్న
అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం - గీతా జయంతి
సందర్భంగా ప్రచురించుచున్న ఈ

## సమన్వయ భాగవత

పూజా సుమమును
పూజ్య గురుదేవుల మానస పుత్రులైన
**శ్రీ మారెళ్ళ శ్రీరామకృష్ణ M.Sc. PhD.**
గారి పాద పద్మములకు
వినమ్రతతో సమర్పించుకొనుచున్నాము.

# ముందుమాట

ఈనాడు ప్రకృతిలో జరుగుతున్న అనేక విపత్కర పరిణామాలైన యుద్ధవాతావరణం, అతివృష్టి, అనావృష్టిలాంటి ఈ పరిస్థితులన్నీ సూక్ష్మజగత్తులో చెలరేగిన చండ ప్రచండమైన తుపాన్‌లాంటి వాతావరణము యొక్క ఒక్క పాదము మాత్రమే. ఈ తీవ్రమైన పరిస్థితులకు సరైన రీతిలో దిశానిర్దేశాన్ని ఇవ్వగలందులకై 'ఋషి ప్రణాళిక'లో భాగంగా

మాస్టర్ **శ్రీరామకృష్ణ** M.Sc.Ph.D.గారు

సప్తర్షి ఆశ్రమం, గుంటూరులో జూలై 8వ తేదీ మొదలుకొని సెప్టెంబర్ 16వ తేదీ వరకు ప్రతీ ఆదివారం ఉదయం 9 గంటలకు

## "సమన్వయ భాగవతం"

పేరుతో భగవాన్ శ్రీ వేద వ్యాస మహర్షి వ్రాసిన శ్రీమద్భాగవతంలో - పద్మపురాణ ఉత్తరార్థంలో శ్రీమద్భాగవత మహాత్మ్యాన్ని ఖచ్చితంగా 12 వారాల పాటు చెప్పారు. ఈ భాగవత మహాత్మ్యాన్ని చెప్పటంలో అనేక భౌతిక, ఆధ్యాత్మిక రహస్యాలు దాగి వున్నాయి.

As above so below అన్న ప్రమాణ ఆధారంగా మార్పనేది సూక్ష్మజగత్తులో తీసుకువస్తే దాని ఫలితాలు స్థూల జగత్తులో ప్రకటీకరింపబడతాయి. అందుచేత ఈనాటి ఈ విభీషక వాతావరణాన్ని నివారించాలంటే సామూహిక చేతనత్వంలో మార్పు తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దానికి మాస్టర్‌గారు "శ్రీమద్భాగవత మహాత్మ్యం" - ఒక్కటే సరైన ఔషధంగా భావించి ఒక విశేషమైన లక్ష్యమును సాధించటానికి ఈ 12 ప్రవచనాలను మానవజాతికి అందించారు. వాతావరణంలోగానీ, మనుషుల మానసిక స్థితిలోగానీ, సామాజికస్థితిలోగానీ విశేషమైన మార్పు తీసుకురావాలనే ప్రయత్నం చేయటం జరిగింది. శ్రీమద్భాగవతం -మానవుడి కోరికలు తీర్చుట కొరకు ఒక అద్భుతమైన సూత్రాన్ని ఇచ్చింది.

మీకోరిక అది ఎలాంటిదైనా సరే - అది వ్యక్తిగతమైనది కావచ్చు సామాజికమైనది కావచ్చు - ఆ కోరిక తీరాలంటే ఖచ్చితంగా సామూహిక ప్రయత్నం ఉండి తీరాలి. అది రాజకీయ ప్రాబల్యమనండి, శాస్త్రీయ దృక్పథమనండి....... దానికి ఏ పేరైనా పెట్టండి. కానీ సమూహమంటే ఖచ్చితంగా ఆ కోరిక నెరవేరుతుందన్నది నిర్వివాదాంశము. తద్వారా ఒక దివ్యమైన, భవ్యమైన స్వర్గతుల్యమైన వాతావరణం ఏర్పడుతుందన్న దానికి అనేక ప్రమాణాలు ఈనాడు మనం చూపించవచ్చు.

ఉదా: అహింసాయుతమైన స్వాతంత్ర్య సమర పోరాటంలాంటివి.

ఇలాంటి సామూహిక ప్రయత్నాల వల్ల 'మానవ చేతనత్వంలో అద్భుత వికాసం వచ్చి తీరాలనేది' -ఈనాటి యుగధర్మం. దాని కొరకు పరమ గురు మండలి యావత్తూ తమ యొక్క విశేష కృషిని 'Man On the Road ' వరకు అందించటానికి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞాలలో - అద్భుతమైన చేతనత్వ జాగృతి జరిగి తీరుతుందని మాస్టర్‌గారు పదేపదే చెప్తున్నారు. దానికి నాందిగా 'ఈ చేతనత్వ విజ్ఞానమంతా శ్రీమద్భాగవత మహాత్మ్యంలో పొందుపరచబడిన కారణంగా' దానిని అత్యంత తీవ్రగతితో 12 వారాల్లో ముగించారు.

చేతనత్వ వికాసానికి 'సూర్యకిరణ విజ్ఞానానికి' ఎంతో దగ్గర సంబంధముంది. 'సమన్వయ భాగవతం' - 10వ వారం క్లాస్ జరుగుతుండగా 'అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం' చేయాలన్న సందేశాన్ని శాంత్‌కుంజ్, హరిద్వార్ నుండి గురు భాయీలు వచ్చి చెప్పారు. ఏ లక్ష్యం కోసమైతే మాస్టర్‌గారు ఈ ప్రవచనాలు ప్రారంభించారో -దాని ఫలితం డైరెక్ట్‌గా గురుదేవులు సమ్ముఖం నుంచే ఆంధ్రు లకు అందివ్వబడుతున్నది అనటంలో అతిశయోక్తి లేదు. మనమెంత అదృష్ట వంతులమో - మనకా వరాన్ని ప్రసాదిం చిన మాస్టర్‌గారికి ఎన్ని జన్మ జన్మాంతరా ల వరకు ఋణపడి ఉండాలో అనేది ఊహాతీతం. అయితే ఈ అవకాశాన్ని మనమే

కాక, యావత్ప్రజానీకానికి అందించటమనేది - మన కనీస ధర్మం-

చివరగా 9-9-2001 ప్రవచనం ముగించే ముందు "నా కోరికేంటంటే - 'చేతనత్వ విజ్ఞానం ఒక పరిశీలన' - వివరణ త్వరలో పూర్తి కావాలి. మొత్తం చేతనత్వ విజ్ఞానమంతా భాగవత మహాత్మ్యం మాత్రమే. ఏ టెక్ట్స్ బుక్ తీసినా 'స్కోప్' చెప్తుంటాడు గదా! ఇది స్కోప్. సెప్టెంబర్ 23వ తేదీ ప్రకృతిలోని ఒక అద్భుతమైన రోజు. సి.వి.వి. కల్ట్ వారికి దాని ప్రాముఖ్యత బాగా తెలుసు. అన్ని పండుగల్లాగే ఈ పండుగనీ మనం గ్రాండ్‌గా చేస్తున్నాం. ఆ రోజు ఈ బుక్ రిలీజ్ చేయాలి. 22వ తేది రాత్రి 12 గంటలకి ముందొస్తే 23 వ తారీఖు ఉదయం ఆ సి.వి.వి. గారికి ముఖ్యమైన రోజున దీనిని రిలీజ్ చేద్దాం. కానీ, నాకొక కోరిక ఉంది. ఈ పుస్తకం కవర్ డిజైనింగ్ దగ్గర్నుంచీ ప్రతి పేజీలో ఎక్కడ ఏముందో చూడాలనే కోరిక నాకుంది" అని మాస్టర్‌గారు అన్నారు.

వారి కోరికనెలాగైనా తీర్చాలనే తపన, ఆర్తి ఎలా ఇన్ని క్యాసెట్స్ వ్రాయాలి. డి.టి.పి. చేయాలి. ఏమో....... అంతా ఆయన మీదే భారంవేసి ఒక్క ఐదు రోజుల్లో అద్భుతమైన 'సామూహిక ప్రయత్న' ఫలితంగా మాస్టర్‌గారు కోరుకున్న టైంకి - సెప్టెంబర్ 23వ తేదీ ఉదయం - 6 గంటలకు పుస్తకం వారి చేతుల్లో ఉంచాము.

ఈ పుస్తక ప్రచురణ అసంభవాన్ని సంభవం చేయటానికి తోడ్పడిన సోదర, సోదరీమణులైన -డి.టి.పి. వర్క్ చేసిన శీతారాముడు, లక్కరాజు లక్ష్మీగోపాల్, తేజాశ్రీ, విద్యాసాగర్‌గార్లకు క్యాసెట్స్ వ్రాసిన లక్ష్మీ రమణ, సుధగార్లకు ప్రూఫ్‌రీడింగ్ నాతో సహకరించిన శీతారాం గారికి, జి.ఎస్.ప్రసాద్‌గారికి, సీతగారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

అదే రోజు 'సమన్వయ భాగవతం' - పుస్తకం నా చేతిలో చూస్తూనే దీని ప్రింటింగ్‌కి నా వంతు సహకారం (ధనరూపంలో) నేను ఇస్తాను అన్న శ్రీ కె.వి.జి.ఎం.కృష్ణారావు దంపతులను, పుస్తకం చదివి, ఆనందించి వెంటనే ప్రింటింగ్‌కు హితోధిక ధన సహాయం చేసిన శ్రీ టి. వాసుదేవరావు దంపతులకి, ఇంకా ప్రోత్సహించిన నామిత్రులకు నా కృతజ్ఞతలు.

'ఈక్వినాక్స్ డే' కి పుస్తకమైతే అయింది గానీ, దాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్ది అశ్వమేధ మహాయజ్ఞం రోజుకు అవిష్కరించటానికి తమ వంతు కృషినందించిన అపూర్వ పబ్లికేషన్స్, ఒంగోలు వారికి మా కృతజ్ఞతలు. మరొక్కసారి అందరికీ కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఇలాగే ఈ సమన్వయ భాగవత పుష్పాలు "శ్రీమద్భాగవత" నందనవనంలో సహస్రాధికం వెల్లివిరియాలనీ, మీ వంతు సహకారం మాకు ఎల్లవేళలా అందివ్వాలని కోరుకుంటూ -

రాజ్యలక్ష్మి

# విషయసూచిక


| | పేజి నెం. |
|---|---|
| 1. శ్రీ మద్భాగవత మాహాత్మ్యం | 11 |
| 2. చేతనత్వం యొక్క స్థాయిలు | 28 |
| 3. నారద మార్గదర్శనం | 78 |
| 4. సార్వజనీన విద్య | 113 |
| 5. ప్రపంచంపై విజయము | 153 |
| 6. ఆసురీ సంపత్తి అంటే? | 187 |
| 7. మన సిలబస్ | 195 |
| 8. అమరత్వాన్ని ప్రసాదించే విద్య | 224 |
| 9. నారద దర్శనమెప్పుడవుతుంది? | 237 |
| 10. జీవితంలో ఎవరు పైకి వస్తారు? | 247 |
| 11. కోరికలు తీరాలంటే ! | 258 |
| 12. పోలీషిప్ - అశ్వమేధం | 286 |


# సమన్వయ భాగవతము

## ఒక పరిచయము

వేదాలను క్రోడీకరించి, పురాణ ఇతిహాసాలు రచించి, ఉపనిషత్తులను, స్మృతులను, గీతలను వర్గీకరణము చేసి మహాభారతాన్ని రచించిన వ్యాసుడు సరస్వతీ నదీ తీరములో కూర్చుని తాను చేసిన అంతటి బృహత్ కార్యానికి సంతసించక ఏదో లోటుందని తీవ్రముగా దుఃఖించుచుండెను. అది వ్యక్తిగత దుఃఖముకాదు, సామూహిక చింతన. ఇంత వ్రాసినా మానవ జాతికి కావలసిన శాంతిని ఇవ్వలేకపోయాననే వ్యధ.

ఆ సమయంలో దేవర్షి నారదుడు అక్కడికి వచ్చి వ్యాసుని బాధను విని, అర్థము చేసుకుని అతనికి అశాంతి పోయే మార్గాన్ని ఉపదేశించాడు. అదే జగద్గురు చరిత్ర లేక **చేతనత్య విద్య**. ఇది మూడు విధాలుగా అందించబడింది.

1. గోకర్ణుడు ధుంధుకారికి చెప్పిన భాగవతము:- ఆత్మలేనటువంటి పంచ కోశములు ప్రేతములే. పంచ ప్రేతములకు వశమైన చేతనత్వమే ధుంధుకారి. అందుచేత భాగవతం మొదట ఈ పంచప్రేతాల నుంచి విముక్తిని కలిగిస్తుంది. అనగా ప్రేతయోనిని దాటిస్తుంది.

2. పరీక్షిన్మహారాజుకు శుక మహర్షి చెప్పిన భాగవతము:- కాలసర్పము ప్రతి ఒక్కరిని కాటు వేస్తుంది. మృత్యువు తప్పదని తెలిసిన వ్యక్తి, మృత్యువు తరువాత కూడా తన ఉనికి ఖచ్చితంగా ఉంటుంది అని తెలిస్తే, ఆ జీవితము యొక్క కాల పరిణామము జాగ్రదావస్థకంటే అనేక రెట్లు ఎక్కువని తెలుసుకుంటాడు. అప్పుడు ఈ భౌతిక జగత్తులో సాధించినది మృత్యుసమయంలో ఏమి ఉపయోగపడదు అని తెలుసుకుని మృత్యురహస్యం తెలుసుకోవటానికి ప్రయత్నిస్తాడు.

3. సనకాదులు, నారదునికి చెప్పిన భాగవతము:-మృత్యు భయము పోయిన వ్యక్తి, నారదుని వలె జీవిస్తూ దేశకాల పరిస్థితులలో జ్ఞాన, వైరాగ్యములు క్షీణించుట గమనిస్తాడు. తిరిగి మళ్ళీ మానవ జీవితంలో లక్ష్యం కొరకు నిరంతరం శ్రమించట

మనేది (భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు) ఎలా నాటాలో తెలుసుకుంటాడు. ఏనాటి సమాజము లోనైనా ఈ రకము వ్యక్తులు తారసపడతారు.

1. ధుంధుకారి:- శరీరానికి లొంగి జీవించేవారు. (సాధారణ మానవులలో ఎక్కువ శాతం వీరే).

2. పరిక్షిత్:- మృత్యువుని తెలుసుకుని, మృత్యువుని దాటి జీవించే వారు. (యోగులు, మహాత్ములు).

3. నారదుడు:- దైవీప్రణాళిక తెలిసి, దేవతలని కూడా దైవీ ప్రణాళికకు అనుగుణ్యంగా శాసించేవారు. (జగద్గురు పరంపర).

ఇవీ ఇందులో స్థూలంగా చర్చించబడిన విషయాలు.

వేదాలను క్రోడీకరించి, పురాణేతిహాసాలను రచించి ఉపనిషత్తులను, స్మృతులను, గీతలను వర్గీకరణ చేసి ప్రపంచానికి అందించారు భగవాన్ వేదవ్యాసుల వారు. సకల వేద, శాస్త్ర, పురాణేతిహాసాలకు, ధర్మానికి ప్రమాణమైన "మహాభారతాన్ని" రచించాడు. అయినా ఎక్కడో అశాంతి, తీరని వ్యధ! ఈ అశాంతిని దూరం చేసుకోవ టానికి ఆయన సరస్వతీ నది ఒడ్డునకూర్చుని తాను చేసిన బృహత్కార్యాన్ని ఒక్కసారి సింహావలోకనం చేసుకున్నాడు. ఇంతటి మహత్ జ్ఞానాన్ని ప్రపంచానికి అందించినా ఏదో తీరని అశాంతి, లోటు ఉందని తీవ్రంగా దు:ఖిస్తున్నాడు. అది వ్యక్తిగతమైన దు:ఖం కాదు. సామూహిక చింతన. ఇంత వ్రాసినా మానవ జాతికి కావలసిన శాంతి ఇవ్వలేకపోయానన్న వ్యధ.

ఆ సమయంలో నారదమహర్షి అక్కడికి వచ్చి వ్యాసుడి బాధను అర్థం చేసుకుని, అతని అశాంతి పోయే మార్గం ఉపదేశించాడు. కలియుగంలో మానవులు శక్తి హీనులు, భక్తిహీనులు, క్రియాహీనులు. వీరికి వేద, శాస్త్ర, పురాణేతిహాసాలు, ధర్మ శాస్త్రాలు చదివే తీరిక, ఓపిక ఉండవు. అటువంటి వారు తరించేందుకుగాను "శ్రీమద్భాగవత రచన"-అది శ్రీకృష్ణుని చరిత్ర, జగద్గురువు చరిత్ర కనుక అతని లీలలు,



మధురమైన భక్తి, ప్రేమల సమన్వయ స్వరూపంగా వ్రాసినట్లైతే అది తనకు ఆనందాన్ని, మానవాళికి తరుణోపాయాన్ని ఇస్తుంది కనుక తక్షణమే దానిని రచించమని ఆదేశిస్తాడు. శ్రీమద్భాగవతం 3 రకాల చేతనత్వాలలో అద్భుతమైన మార్పు తీసు కొస్తుంది.

## 1. గోకర్ణుడు ధుంధుకారికి చెప్పిన భాగవతం:-

పూర్వకాలంలో ఆత్మదేవుడు, ధుంధులి అను దంపతులుండేవారు. వారికి సంతానం లేదు. అందువల్ల విచారక్రాంతుడైన ఆత్మదేవుడు ఒక సాధువుని ఆశ్రయించి తన కోర్కెను తెలుపగా, నీ భార్యకు ఈ పండు తినిపింపుము, సత్పుత్రుడు ఉదయించు ననెను. అంతట పరమానంద భరితుడైన ఆత్మదేవుడు ఆ ఫలమును తినమని తన భార్యకివ్వగా, దుష్టబుద్ధి కల ఆమె ఆ పండుని తాను తినక ఆవుకి తినిపించెను. తాను తిన్నట్లు నటించెను. ఆ సమయంలో ధుంధులి చెల్లెలు గర్భవతి. నవమాసములు నిండి ఉండెను. ధుంధులి తన సోదరి సహకారముతో ఆమెకు పుట్టిన బిడ్డను తన బిడ్డగా భర్తకి చూపించెను. ఆత్మదేవుడు వానికి ధుంధుకారి అని పేరు పెట్టెను. తరువాత కొద్ది కాలమునకు గోవు సర్వాంగసుందరుడైన బాలుని ప్రసవించెను. ఆత్మదేవుడు ఆ బిడ్డను తెచ్చి ఆవు చెవుల నుండి పుట్టిన ఆ బాలునికి 'గోకర్ణుడని' పేరుపెట్టెను. యుక్తవయస్కుడగునప్పటికి గోకర్ణుడు సకలశాస్త్ర పారంగతుడవ్వగా, ధుంధుకారి మాత్రం వేశ్యాలోలు డయ్యెను. అది చూసి ఆత్మదేవుడు దు:ఖితుడై, గోకర్ణుని సలహాపై తీర్థయాత్రలకు వెళ్ళెను. కాలక్రమములో ధుందుకారిని వేశ్యలు (ఇంద్రియములు) చంపి, అతని ధనమును (ఆత్మ జ్ఞానమును) అపహరించిరి. చెడు కర్మలను ఆచరించిన ధుంధుకారి ప్రేతమయ్యెను.

ప్రేతాత్మ అయిన తమ్మునికి నిష్కృతి కలిగించుటకు గోకర్ణుడు సూర్యుని ఆదేశాల మేరకు భాగవత సప్తాహము చేసెను. ధుంధుకారి ఏడు కణుపులున్న వెదురులో ఉండి వినగా, రోజుకొక కణుపు చొప్పున వెదురు పగిలిపోయి పాపవిమోచనం కలిగెను.

ఆత్మలేనటువంటి పంచకోశములే ప్రేతములు. పంచ కోశములకు వశమైన చేతనత్వమే ధుంధుకారి. అందుచేత భాగవతం మొదట ఈ ప్రేతముల నుంచి విముక్తి కలిగిస్తుంది.

## 2. పరీక్షిన్మహారాజుకు శుకమహర్షి చెప్పిన భాగవతం:-

కురుక్షేత్ర సంగ్రామమైపోయాక అశ్వత్థామ ఉపపాండవులని హతమార్చిన తరువాత దాని తీవ్రపరిణామాలూహించుకుని, ఆత్మరక్షణార్థమై వ్యాసమహర్షి ఆశ్రమం లో ప్రవేశిస్తాడు. కుమారుల మరణం, ద్రౌపది దు:ఖం చూసిన అర్జునుడు గురు కుమారుని చంపుతానని ప్రతిజ్ఞ చేసి బయలుదేరగా, శ్రీకృష్ణుడు అతనిని అనుసరించి, వ్యాసమహర్షి ఆశ్రమానికి చేరుకుంటారు.

శ్రీకృష్ణార్జునుల ఆగమనం చూసిన అశ్వత్థామ మరణ భయంతో ముందుగానే 'అపాండవమస్తు' అంటూ బ్రహ్మాస్త్ర ప్రయోగం చేస్తాడు. దీని పర్యవసానాన్ని ఊహించిన శ్రీకృష్ణుడు పాండవులని రక్షిస్తూనే అంగుష్ఠ మాత్ర దేహుండై ఉత్తర గర్భంలోకి ప్రవేశించి, అక్కడ బ్రహ్మాస్త్ర అగ్నిజ్వాలల్లో అల్లల్లాడిపోతున్న గర్భస్థ శిశువుకు ప్రాణరక్షణ కల్పిస్తాడు. బిడ్డ జన్మించిన క్షణం నుంచీ ప్రతివారి ముఖంలోకి తనను రక్షించిన మహాత్ముని దివ్య దర్శనం కొరకు పరీక్షగా తేరిపార చూస్తుండే వాడు. శ్రీకృష్ణుని చూస్తూనే ఆ పిల్లవాడు నవ్వులు చిందిస్తాడు. అతడే పాండువంశానికి మిగిలిపోయిన ఏకైక వంశోద్ధారకుడు - పరీక్షిత్తు.

పరీక్షిత్తు పెరిగి పెద్దవాడై ధర్మాన్ని నాలుగు పాదాలమీద నడుపుతూ కలి ప్రవేశాన్ని సుమారు 36 సంవత్సరములు ఆపుతాడు. దేశాన్ని సుభిక్షంగా పరిపాలిస్తూ, ప్రజలను కన్న బిడ్డలవలె చూసే అతను ఒకరోజు అడవికి వేటకి వెళ్ళాడు. అక్కడ పిపాస పీడితుడై శమీకమహర్షి ఆశ్రమంలోకి ప్రవేశిస్తాడు. ధ్యాన నిమగ్నుడైన మహర్షిని మంచినీళ్ళిమ్మని అడుగగా అయన ప్రత్యుత్తరమివ్వడు. దానికి కోపించిన పరీక్షిత్తు మహర్షి మెడలో చనిపోయిన పామును వేసి వెళ్ళిపోతాడు. ఈ విషయమును విన్న మునికుమారుడు తన తండ్రిమెడలో చచ్చిన పామును వేసిన వాడు వారం రోజులలోగా



తక్షకుని కాటుకి గురై మరణించుగాక అని శపిస్తాడు. విషయ మెరిగిన శమీకమహర్షి, కుమారుడు చేసిన తప్పిదానికి వ్యథాభరిత చిత్తుడై శాపాన్ని వెనక్కి తీసుకోలేని పరిస్థితులలో పరీక్షిత్తు యొక్క ధర్మ పరిపాలనా దక్షత, అసమాన ప్రతిభను తలచుకుని ముందు జాగ్రత్తగా పరీక్షిత్తుకి శాపవృత్తాంతాన్ని తెలుపుతాడు.

అపుడు సుఖశాంతులతో ప్రజారంజకంగా తన రాజ్యాన్ని పరిపాలన సాగిస్తున్న పరీక్షిన్మహారాజు శాపవృత్తాంతం వింటూనే రాజ్యాన్ని, బంధు, మిత్ర, పరిజనులను వదలి సర్వసంగ పరి త్యాగియై గంగానదీ తీరానికి వెళ్ళి మోక్షప్రదమైన శ్రీమద్భాగవత సప్తాహ శ్రవణం చేయ సంకల్పిస్తాడు.

ఆ విషయం తెల్సిన శుకమహర్షి, గోదోహన కాలం కంటే ఎక్కువసేపు ఒకచోట ఉండని ఆ ఋషి పుంగవుడు పరీక్షిత్తుకు భాగవత సప్తాహ శ్రవణం చేయటానికి గంగానదీ తీరానికి వస్తాడు. 'మహారాజు - మహర్షుల' ఈ కలయిక ఎంతో ఆధ్యాత్మిక రహస్యాన్ని సంతరించుకున్నది.

మరణం తెలిసి, ఇంక నన్ను కాలసర్పం కాటువేయబోవుచున్నది, మృత్యువు తర్వాత కూడా నా ఉనికి తథ్యం కాబట్టి దానికి కావల్సిన భవిష్య ప్రణాళిక భాగవత సప్తాహ శ్రవణం వల్ల మాత్రమే సాధ్యమని రాజు నిర్ణయానికి వచ్చాడు. ఈ విపత్తునుండి విముక్తి పొందాలంటే అమృతపానమే తరుణోపాయం. అమృతపానం దేవతలకు మాత్రమే సాధ్యం. కాని ఈ భాగవతామృతాన్ని ఆర్తి, ఆసక్తి, ప్రేమ ఉన్న ప్రతీ వ్యక్తీ పొందవచ్చు. వారిలో ముసురుకుని ఉన్న అజ్ఞాన తిమిరాలను పారద్రోలి, జ్ఞానజ్యోతిని అది వెలిగిస్తుంది. దేవతలకి కూడా ఇది లభ్యం కాదు.

అటువంటి మానసికస్థితిలో ఉన్న మహరాజుకు జీవన్ముక్తుడైన శుకమహర్షి కథాశ్రవణం చేయించటం వల్ల చెప్పిన వారు, విన్నవారు ఒక నిర్ణీత లక్ష్యంతో చేయటం వలన లక్ష్యశుద్ధి ఏర్పడింది. భౌతికజగత్తులోనే రాజ్యాలు కాని, భోగభాగ్యాలు కాని, సంపదలు కానీ మరణ సమయంలో అవి తమ ప్రభావాన్ని చూపలేవు. నిస్సంగ స్థితిలో భాగవత చింతన ఏడు క్షణాలు చేసినా, ఏడు యుగాల ప్రభావం కలిగి

ఉంటుందనే నిత్యసత్యాన్ని గుర్తించిన వారు సైతం అన్ని పనులు మానివేసి, మృత్యు రహస్యం తెలుసుకోకపోవటం ఎంతో శోచనీయమైన విషయం.

నేను, నాది అన్న బంధ విముక్తికి గురువుగారు (శ్రీశ్రీరామశర్మ ఆచార్యులు) ఒక ధర్మసూత్రాన్ని ఇచ్చారు. దానినే 'అస్వాద, అపరిగ్రహమని' చెప్పారు. 'ఇంక నాకు ఈ ప్రపంచమూ వద్దు, రాజ్యమూ వద్దు' అన్నాడు పరీక్షిత్తు. అహంకార, చిత్తములను జయించిన ఋషి - మనసు, బుద్ధిలను జయించిన వానికి మాత్రమే ఈ భాగవత కథా శ్రవణం వినిపించాలి.

### 3. సనకాదులు నారదునికి చెప్పిన భాగవతం:-

మృత్యుభయం తొలగిన వ్యక్తి నారదుని వలె జీవిస్తున్నప్పుడు దేశకాల పరిస్థితులలో మనుష్యులలో భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు క్షీణించినట్లు గమనించారు. మృత్యువుని దాటిన వారు మానవ జాతిలో తిరిగి ఆధ్యాత్మిక జ్యోతుల్ని వెలిగించటానికి అనేకానేక పూజ, ఉపాసన కార్యక్రమాలు ప్రవేశ పెట్టి నిరంతరం శ్రమిస్తూనే ఉంటారు. దేవర్షి నారదునికి చతుర్ముఖ బ్రహ్మ భాగవత ఉపదేశం చేసినప్పటికీ, భాగవత సాప్తాహిక విధి విధానాలను సనకాదులు ఎంతో ప్రీతిపూర్వకంగా ఉపదేశిస్తారు. ఈ భాగవత సప్తాహం మానవుణ్ణి ధ్యానశ్లోకంలో కీర్తించినట్లుగా నాలుగు రకాల చేతనత్వ స్థితులు పొందగలిగేలా చేస్తుంది.

దీనిని భాద్రపద, ఆశ్వయుజ, కార్తీక, మార్గశిర, ఆషాఢ, శ్రావణ మాసాలలో నిర్వహించినచో అత్యంత ఫలదాయకంగా ఉంటుంది. భాగవత కథాశ్రవణానికి బంధుమిత్రులను ఆహ్వానించాలి. ఈ కార్యక్రమాన్ని పుణ్య తీర్థాలలో కాని, దేవాలయా లల్లో కాని, స్వగృహాలలో కాని చేసుకోవాలి. ముందుగా అందమైనటువంటి దేవతా మండపాన్ని ఏర్పరచి జగద్గురువును స్థాపించి, షోడశోపచార పూజలు చెయ్యాలి. అలాగే శ్రీమద్భాగవత గ్రంధానికికూడా పూజ చెయ్యాలి. సూర్యోదయ సుముహర్తంలో కథాశ్రవణం ప్రారంభించాలి, వీలైతే ఉపవాస దీక్షలో ఉండాలి.



సమన్వయ భాగవతం - ఈ గ్రంధానికి సమన్వయ భాగవతం అను పేరు పెట్టటంలో గల ఔచిత్యాన్ని గమనిద్దాం. సూర్యుని ఏడు కిరణాలలో ఏదో ఒక కిరణం కొంత కాలంపాటు అనగా సుమారు 2,160 సంవత్సరాలు చురుకుగా పనిచేస్తూ ప్రపంచ సంఘటనలను, జాతుల జీవిత విధానమును శాసిస్తూ ఉంటుంది. సూర్య కిరణ విజ్ఞానము - జ్యోతిర్విద్య తెలిసిన వారు ఏకాలంలో ఏకిరణం ఏ పనిచేస్తున్నదో గ్రహించగలరు. విషవద్ బిందువు ప్రస్తుతం కుంభరాశిలో, పూర్వాభాద్ర నక్షత్రంలో ఉంది. దీని ప్రభావం వల్ల సూర్యుని యొక్క 7వ కిరణం అయిన వ్యవస్థ మిగతా 6 కిరణాలతో సమన్వయ స్వరూపంగా రూపు దిద్దుకుంటుంది.

మీనరాశి లక్షణమైన 'భక్తి' - దాని పుత్రులైన జ్ఞానవైరాగ్యాలు క్షీణ దశలో ఉన్నవి. కనుక వ్యవస్థీకృతమైన జీవిత విధానం మానవజాతికి అందించాలనే ఉద్దేశ్యంతో ఈ 'సమన్వయ భాగవతం' అందించబడుతోంది. ఇందులో మూడు రకాల చేతనత్వ స్థితులను, వాటిని సమన్వయం చేసే నాలుగవ చేతనత్వ స్థితిని చర్చించారు.

### కృష్ణం వందే పృథాసుతం :-

ఈ పృథ్వి యావత్తు ఒక విశ్వవిద్యాలయం. ఇందులో భౌతిక శరీరం వల్ల పొందిన సంబంధ బాంధవ్యాలు, పేరుప్రతిష్టలు, భోగభాగ్యాలు ఆఖరికి రాజ్యాలతో సహా ఇవంతా ఏనాటికైనా అశాశ్వతాలు. కనుక ఈ అశాశ్వతమైన వాటి కోసం యుద్ధాలు, రక్తపాతాలు ఎందుకు?

అడుక్కుతినైనా బ్రతుకుతానుగానీ ఈ హింసాయుతమైన జీవిత విధానం నాకఖ్ఖర్లేదు అనే మానసిక స్థితి - అర్జునస్థితి -

ఈ స్థితిలో ఉన్న వారికి ప్రతినిధి ధుంధుకారి. ఇంద్రియలోలుడై, ఆసురీ సంపత్తితో నిండిన ఈ ధుంధుకారి - సప్తాహ పారాయణతో ప్రేత రూపానికి విముక్తి కలిగించినవాడు - గోకర్ణుడు. ధుంధుకారి చంచలాత్మక మైన మనస్సుకు ప్రతిక.

అనటమే కాదు, ఘంటాపథంగా ఒక ప్రతిజ్ఞను, ఆశ్వాసనను మానవులలో కలిగించాడు. అలాగే మాస్టర్ శ్రీరామకృష్ణుల వారు కూడా మానవజాతినెలా ఉద్ధరించాలి, వారిలోని అఖండ చేతనత్వాన్ని ఎలా జాగృతం చేయాలి అనే తపనతో, ఆర్తితో సమన్వయ భాగవతం పేరుతో శ్రీ మద్భాగవత మహత్యాన్ని నిర్వీర్యం అయిపోతున్న మానవజాతిలో తిరిగి నవనవోన్మేషమైన వేడిని, సక్రియతను చైతన్యం చేయుటకు అనేక రకాలైన మౌలిక సూత్రాలను, దీక్షలను, సాధనలను మానవ జాతికి అందించారు. వాటిని మళ్ళీ మళ్ళీ చదవి, హృదయంగనం చేసుకుని, ఆచరించినట్లైతే మాస్టర్‌గారి శ్రమకు తగిన ఫలితం ఇవ్వలేకపోయినా మనల్ని మనం ఉద్ధరించుకున్న వాళ్ళము అవుతాము.

యుగయుగాలుగా గురుపరంపర, అవతార పరంపర మానవజాతిని ఉద్ధరించుటకు సృజనాత్మకమైన నూతన ప్రణాళికలతో తమ వంతు కృషిని తాము చేస్తున్నారనే దానికి

కౌసల్యాశీత్ ప్రధమ జననీ దేవకీచ ద్వితీయా
విష్ణార్మాతా తదను మహితా సక్కుబాయీ తృతీయా
యస్త్రేతాయాం రఘుపతి రభూ ద్వాపరే శౌరి రాశీత్
త్రాతుం క్షోణీం సజయతి కలౌ శ్రీ రామకృష్ణావతారః

మన ప్రక్కనే, మనలోనే, మన వెనుకనే ఉన్న ఆ సర్వవ్యాపిని గుర్తించగలిగి ఆ చైతన్యమూర్తి మార్గదర్శనంలో అందరూ జీవితాల్ని ధన్యం చేసుకోవాలని కోరుతూ

**సర్వే జనా సుఖినో భవంతు**

ఇట్లు

సీతారాం

రాజ్యలక్ష్మి



# శ్రీమద్భాగవత మాహాత్మ్యం

ఓం నమో భగవతే వాసుదేవాయ
శ్రీమద్ భాగవత మహాత్యం ...
కృష్ణం నారాయణం వందే
కృష్ణం వందే వ్రజప్రియం ।
కృష్ణం ద్వైపాయనం వందే
కృష్ణం వందే పృథాసుతం ॥

భావం: నారాయణ స్వరూపుడైన శ్రీకృష్ణుని దేవునికి నమస్కారము. వ్రజప్రియుడైన శ్రీకృష్ణునికి నమస్కారము. ద్వైపాయన స్వరూపుడైన శ్రీకృష్ణ భగవానునికి నమస్కారము. పృథ్వీపుత్రుడుగా జగద్గురు చేతనత్వ ప్రతీకయైన శ్రీకృష్ణునికి నమస్కారము.

**అథ ప్రథమోధ్యాయః**

**దేవర్షి నారదుడు భక్తిని కలుసుకొనుట-**

సచ్చిదానంద రూపాయ విశ్వోత్పత్త్యాదిహేతవే।
తాపత్రయవినాశాయ శ్రీకృష్ణాయ వయం నుమః॥ ( శ్లో ॥ 1)

భావం: సత్, చిత్ ఆనంద స్వరూపము, విశ్వము యొక్క ఉత్పత్తి, స్థితి, వినాశనానికి కారణమైన మరియు ఆధ్యాత్మిక, ఆదిదైవిక, ఆదిభౌతికమైన మూడు రకాల తాపములను నాశనము చేసే ఆ శ్రీకృష్ణభగవానునికి మేము నమస్కరించుచున్నాము.

యం ప్రవ్రజంతమనుపేతమపేతకృత్యం
ద్వైపాయనో విరహకాతర ఆజుహావ।
పుత్రేతి తన్మయతయా తరవోభినేదు
స్తం సర్వభూతహృదయం మునిమానతోస్మి॥ ( శ్లో ॥ 2 )

భావం: ఎప్పుడైతే శుకదేవుడు యజ్ఞోపవీత సంస్కారము కూడా అయుండా మరియు

లౌకిక, వైదిక కర్మానుష్ఠానాలు చేసే అవసరము రాకుండా ఒంటరిగా సన్యాసం తీసుకోవడానికి ఇంటి నుండి వెడలుచున్నాడో, అది చూసిన ఆయన తండ్రి వ్యాస భగవానుడు విరహముతో పుత్రా, నీవెక్కడికి వెడుతున్నావని బాధతో అడిగారు. అప్పుడు వృక్షములు తన్మయము చెందినటువంటివై శ్రీశుకభగవానుల తరపు నుండి, అవే జవాబునిచ్చాయి. అలాంటి సర్వభూత హృదయస్వరూపుడైన శ్రీ శుకదేవ మహర్షికి నేను నమస్కరిస్తున్నాను.

*నైమిషే సూతమాసీనమభివాద్య మహామతిం।*

*కథామృతరసాస్వాదకుశలః శౌనకో ఽబ్రవీత్ ( శ్లో ॥ 3 )*

భావం: ఒకసారి భగవత్ కథామృత రసాస్వాదన చేయుటలో కుశలురైన శౌనకముని నైమిశారణ్య క్షేత్రములో మహామతి సూతునకు నమస్కరించి అడిగారు.

శౌనక ఉవాచ:

*అజ్ఞానధ్వాంతవిధ్వంసం కోటి సూర్యసమప్రభం।*

*సూతాఖ్యాహి కథాసారం మమ కర్ణరసాయనం॥ ( శ్లో ॥ 4 )*

గౌతమ మహర్షి చెబుతున్నాడు -

హే సూత మహాశయా! నీ యొక్క జ్ఞానము అజ్ఞానాంధకారమును నశింపచేయు కోటి సూర్యులవంటిది. మీరు మా చెవులకు అమృతోపమయమైన, సాగరగర్భితమైన కథను వినిపించండి.

*భక్తిజ్ఞానవిరాగాప్తో వివేకో వర్ధతే మహాన్।*

*మాయామోహనిరాసశ్చ వైష్ణవైః క్రియతే కథమ్॥ ( శ్లో ॥ 5 )*

భావం: భక్తి జ్ఞాన వైరాగ్యాలు పొందినప్పుడు వచ్చే మహా వివేకం యొక్క వృద్ధి ఎలా జరుగుతుంది? మరియు వైష్ణవులు మాయామోహం నుంచి ఎలా బయటపడతారు?

*ఇహ ఘోరే కలౌ ప్రాయో జీవశ్చాసురతాం గత : ।*

*క్లేశాక్రాంతస్య తస్యైవ శోధనే కిం పరాయణమ్ ॥ (శ్లో ॥ 6 )*

భావం: ఈ ఘోర కలియుగంలో జీవులు అసురీ స్వభావం కలవారు వివిధ క్లేశాలతో



ఆక్రాంతులైన ఆ జీవులు పరిశుద్ధులవడానికి సర్వశ్రేష్ఠ ఉపాయంబెట్టిది?

*శ్రేయసాం యద్భ వేచ్ఛ్రేయః పావనానాం చ పావనమ్ ।*

*కృష్ణప్రాప్తికరం శశ్వత్సాధనం తద్వదాధునా ॥ ( శ్లో ॥ 7 )*

భావం: అన్నిటికంటే కళ్యాణకరమైనది, పవిత్రమైనది, శ్రీకృష్ణప్రాప్తి ఇచ్చేట్టి శాశ్వత సాధననీనాడు చెప్పండి.

*చింతామణిర్లోకసుఖం సురద్రుః స్వర్గసంపదామ్ ।*

*ప్రయచ్ఛతి గురుఃప్రీతో వైకుంఠం యోగి దుర్లభమ్ ॥ ( శ్లో॥8)*

చింతామణి లౌకిక సుఖాన్నిస్తుంది. కల్పవృక్షము స్వర్గీయ సంపత్తులనిస్తుంది. కాని గురుదేవులు ప్రసన్నులైతే యోగులకుకూడా దుర్లభమైన నిత్యమైన వైకుంఠధామం ఇస్తారు.

సూత ఉవాచ:

*ప్రీతిః శౌనక చిత్తేతే హ్యతో వాచ్మి విచార్య చ ।*

*సర్వసిద్ధాంతనిష్పన్నం సంసారభయనాశనమ్ ॥ ( శ్లో ॥ 9 )*

భావం: హే శౌనక! నీ హృదయంలో భగవత్ ప్రేమ ఉన్నది. అందువల్ల నేను బాగుగా ఆలోచించి, సంసార భయనాశనకారము, సర్వసిద్ధాంత నిష్పన్నము, నిష్కర్షము లేక సమస్త సిద్ధాంతసారమైన దానిని నీకు చెప్పు చున్నాను.

*భక్త్యోఘవర్ధనం యచ్చ కృష్ణసంతోషహేతుకమ్ ।*

*తదహం తేఽభిధాస్యామి సావధానతయా శృణు ॥ ( శ్లో ॥ 10 )*

భావం: భక్తి ప్రవాహమును పెంచేది, భగవాన్ శ్రీకృష్ణునికి సంతోషమును ఇచ్చేది అయిన సాధనాన్ని నేను నీకు విన్పిస్తున్నాను. సావధానంగా వినుము.

*కాలవ్యాలముఖగ్రాసత్రాసనిర్ణాశహేతవే ।*

*శ్రీమద్భాగవతం శాస్త్రం కలౌకీరేణ భాషితమ్ ॥ ( శ్లో ॥ 11 )*

భావం: కాలసర్పముఖగ్రాసుడై కష్టాల నాశనం కొరకు శ్రీభాగవత శాస్త్రమును శుకుడు తెల్పినాడు.

*ఏతస్మాదపరం కించిన్మనః శుద్ధ్యైన విద్యతే*

*జన్మాంతరే భవేత్పుణ్యం తదా భాగవతం లభేత్ ॥ ( శ్లో ॥ 12 )*

భా॥: మనశ్శుద్ధి కొరకు ఇంతకంటే గొప్ప సాధన లేదు. అనేక జన్మ పరంపరల పుణ్యము వల్లన ఇది లభిస్తుంది.

*పరీక్షితే కథాం వక్తుం సభాయాం సంస్థితే శుకే ।*
*సుధకుంభం గృహీత్వైవ దేవాస్తత్ర సమాగమన్ ॥ (శ్లో ॥13 )*

భావం: శ్రీశుకుడు, రాజా పరీక్షిత్తునకు ఈ కథ తెల్పుటానికి సభలో ఆసీనులై ఉన్నప్పుడు, దేవతా గణములు అమృతభాండాన్ని తీసుకుని అక్కడకు వచ్చారు.

*అజోపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోపి సన్ ।*
*ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥ (గీ.4-6)*

భావం: నేను పుట్టుకలేని వాడను, నాశరహిత స్వరూపము కలవాడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను అయినప్పటికీ స్వకీయమగు ప్రకృతిని వశపరచుకుని నా మాయాశక్తిచేత పుట్టుచున్నాను.

*అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనా: పర్యుపాసతే ।*
*తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం ॥(గీ.9-22)*

భావం: ఎవరు ఇతర భావములు లేనివారై నన్నుగూర్చి చింతించుచు ఎడతెగక ధ్యానించుచున్నారో, ఎల్లప్పుడు నాయందే నిష్ఠగల్గియుండు అట్టి వారియొక్క యోగ క్షేమములను నేను వహించుచున్నాను.

*సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।*
*అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచ: ॥(గీ.18-66)*

భావం: సమస్త ధర్మములను విడిచిపెట్టి నన్నొక్కని మాత్రము శరణు బొందుము. నేను సమస్త పాపముల నుండియు నిన్ను విముక్తునిగ జేసెదను.

*ఏవం వినిమయేతే జాతే సుధారాజ్ఞా ప్రపీయతాం ।*
*ప్రపాస్యామో వయం సర్వే శ్రీమద్భాగవతామృతం॥ (శ్లో ॥15 )*

భావం: ఈ విధంగా వినిమయమైతే పరీక్షిన్మహారాజు అమృతాన్ని త్రాగుతారు. మేము



(దేవతలం) శ్రమతో భాగవతరూపమైన అమృతాన్ని త్రాగుతాం.

*క్వ సుధా క్వకథా క్వకాచః క్వమణిర్మహాన్ ।*
*బ్రహ్మరాతో తదా విచార్యైవం తదా దేవాంజహాసహ ॥ (శ్లో ॥16 )*

భావం: ఈ ప్రపంచంలో గాజుముక్క ఎక్కడ? బహుమూల్యమైన మణి ఎక్కడ? అని ఆలోచించి శుకమహర్షి 'అమృతమెక్కడ శ్రీమద్భాగవత శ్రవణమెక్కడ ' అని దేవతలని పరిహసించాడు.

*అభక్తాం స్తాంశ్చ విజ్ఞాయ నదదౌ స కథామృతం ।*
*శ్రీమద్భాగవతీ వార్తా సురాణామపి దుర్లభా ॥ (శ్లో ॥ 17 )*

భావం: అంతేకాక శ్రీశుకమహర్షి దేవతలు భక్తి శూన్యులని తలచి శ్రీమద్భాగవత కథామృతా శ్రవణ దానమియ్యలేదు. భాగవత కథా శ్రవణం దేవతలకి కూడా దుర్లభమే.

*రాజ్ఞో మోక్షం తథా వీక్ష్య పురాధాతాపి విస్మితః ।*
*సత్యలోకే తులాం బధ్వా తోలయత్ స్సాధానా న్యజః॥ (శ్లో ॥ 18)*

భావం: పూర్వ కాలంలో శ్రీమద్భాగవత శ్రవణం వల్ల పరీక్షిత్ మహారాజుకు వచ్చిన ముక్తిని చూసి బ్రహ్మకూడా ఆశ్చర్యపడెను. ఆయన సత్యలోకమున ఒక తులాదండమును కట్టి భాగవతమును, మిగతా అన్ని సాధనలతో తూచాడు.

*లఘూన్ న్యన్యాని జాతాని గౌరవేణ ఇదం మహత్ ।*
*తదా ఋషిగణాః సర్వే విస్మయం పరమం యయుః ॥ (శ్లో ॥19)*

భావం: మిగతా అన్ని సాధనలు శ్రీమద్భాగవతముతో పోలిస్తే, బరువులో 'తేలికని తెలుసుకున్నాడు. తన మాహాత్మ్యం వల్ల భాగవతం అన్నింటికంటే బరువైనదని తెలిసి ఋషులందరు ఆశ్చర్యచకితులైరి.

*మేనిరే భగవద్రూపం శాస్త్రం భాగవతం కలౌ ।*
*పఠనాత్ శ్రవణాత్ సద్యో వైకుంఠ ఫలదాయకం ॥ ( శ్లో ॥ 20 )*

భావం: భగవత్ స్వరూపమైన భాగవత శాస్త్రమును కలియుగంలో చదివినా, విన్నా తక్షణమే మోక్షం లభిస్తుందని ఋషులందరూ నిర్ణయించారు.

సప్తాహేన శ్రుతం చైతత్ సర్వథా ముక్తి దాయకం ।
సనకాద్యైః పురాప్రోక్తం నారదాయ దయాపరైః ॥ ( శ్లో ॥ 21 )

భావం: పూర్వకాలంలో దయామయులై సనకాదులు దేవర్షి నారదుడుకి దీనిని వినిపించిరి. సప్తాహవిధి ద్వారా శ్రవణం చేస్తే ఇది నిశ్చయంగా భక్తిని ప్రసాదిస్తుంది.

యద్యపి బ్రహ్మ సంబంధాత్ శృతమేత త్సురర్షిణా ।
సప్తాహ శ్రవణ విధిః కుమారై స్తస్య భాషితః ॥ (శ్లో ॥22 )

భావం: బ్రహ్మ యొక్క ముఖ కమలం నుంచి దేవర్షి నారదుడు దీనిని ముందుగానే విన్నప్పటికీ సప్తాహ శ్రవణ విధి విధానమును మహర్షికి సనకాదులే తెల్పినారు.

శౌనక ఉవాచః

లోక విగ్రహ ముక్తస్య నారదస్యా స్థిరస్యచ ।
విధిశ్రవే కుతః ప్రీతిః సంయోగః కుత్రతైః సహ ॥ (శ్లో ॥23 )

భావం: సాంసారిక ప్రపంచంలో ముక్తులుగాను, నిరంతరం తిరుగుతూ వుండే నారదమునికి సనకాదులతో ఎక్కడ సంయోగం లభించింది. అంతేకాక విధివిధాన శ్రవణం కొరకు ఆయనను కోరిక ఎందుకు కల్గినది.

సూత ఉవాచ :

అత్రతే కీర్తి యిష్యామి భక్తి యుక్తం కథానకం ।
శుకేన మమ యత్ ప్రోక్తం రహః శిష్యం విచార్యచ ॥ (శ్లో ॥24 )

భావం: సూతుడు చెప్పెను. ఇప్పుడు నేను మీకు శ్రీశుకమహర్షి నన్ను తన అనన్య శిష్యుడిగా ఎంచి ఏకాంతంలో చెప్పిన ఆ భక్తి పూర్వకమైన కథానకమును మీకు వినిపించెదను.

ఏక దాహ విశాలాయాం చత్వార ఋషయో మలాః ।
సత్సం గార్థం సమాయాతా దదృశు స్తత్ర నారదం ॥ । (శ్లో ॥25 )

భావం: ఒకరోజు నిర్మలులైన ఆ నల్గురు ఋషులు సత్సంగం కొరకు విశాలపురికి వచ్చిరి. అక్కడ వారు నారదుని చూసిరి.



కుమారా ఉవాచ:

కథం బ్రహ్మన్ దీన ముఖః కుతశ్చింతాతురో భవాన్ ।
త్వరితం గమ్యతే కుత్ర కుతశ్చాగమనం తవ ॥ (శ్లో ॥26 )

భావం: సనకాదులు అడిగిరి. హే బ్రహ్మన్! నీ ముఖ కమలం ఎందుకు నీరసంగా ఉన్నది. మీరు ఎందుకు చింతాతురులై ఉన్నారు. అంత తొందరగా ఎక్కడికి వెడుతున్నారు? మరియు మీరు ఎక్కడ నుండి వచ్చుచున్నారు? అని వివరములడిగారు.

ఇదా నీదం శూన్య చిత్తోసి గతవిత్తో యథాజనః ।
తవేదం ముక్త సంగస్య నోచితం వదకారణం ॥ (శ్లో ॥27 )

భావం: ఇప్పుడు తమరు యావత్ ధనమును పోగొట్టుకున్న పురుషుని వలె వ్యాకుల చిత్తులై కన్పించుచున్నారు. మీలాంటి ఆసక్తి రహిత పురుషులకిది ఉచితంగాదు. దీనికి కారణం చెప్పండి.

నారద ఉవాచః

అహంతు పృథివీం యాతో జ్ఞాత్వా సర్వోత్తమామితి ।
పుష్కరంచ ప్రయాగంచ కాశీం గోదావరీం తథా ॥ (శ్లో ॥ 28 )

భావం: నేను పృథ్వి సర్వోత్తమ లోకమని తెల్సి చూడటానికి వచ్చాను. ఇక్కడ పుష్కరం, ప్రయాగం, కాశీ, గోదావరి......

హరిక్షేత్రం కురుక్షేత్రం శ్రీరంగం సేతుబంధనం ।
ఏవమాదిషు తీర్థేషు భ్రమమాణ ఇతస్తతః ॥ (శ్లో ॥ 29 )

భావం: హరిద్వారం, కురుక్షేత్రం, శ్రీరంగం, సేతుబంధనం మొదలైన తీర్థాలలో తిరుగుతుంటిని.

నా పశ్యం కుత్ర చిచ్ఛర్మ మనః సంతోషకారకం ।
కలినా ధర్మ మిత్రేణ ధరేయం బాధితాధునాః ॥ (శ్లో ॥ 30 )

భావం: కానీ నాకు ఎక్కడా మనస్సుకు సంతోషం ఇచ్చే శాంతి లభ్యం కాలేదు. ఇప్పుడు

అధర్మ సహాయుడైన కలియుగం సమస్త పృథ్వీని పీడించుచున్నాడు.

సత్యం నాస్తి తపం శ్శౌచం దయా దానం నవిద్యతే ।
ఉదరం భరిణో జీవా వరాకాః కూటభాషిణః ॥ (శ్లో ॥31 )

భావం: సత్యం లేదు. తపస్సు లేదు. శౌచం లేదు. దయ లేదు. దానం లేదు. జీవులందరు కడుపునింపుకోవటానికే జీవిస్తున్నారు.

మందాః సుమంద మతయో మందభాగ్యాహ్యుపద్రుతాః ।
పాఖండ నిరతాః సంతో విరక్తాః సపరిగ్రహాః ॥ (శ్లో ॥32 )

భావం: మందబుద్ధులూ, భాగ్యహీనులు, ఉపద్రవగ్రస్తులై పోయారు. సాధువులు పాఖండులై పోయారు. విరక్తులందరు పరిగ్రహించటం మొదలెట్టారు.

తరుణీ ప్రభుతా గేహే శ్యాలనో బుద్ధి దాయకం ।
కన్యా విక్రయిణో లోభా ద్దంపతీ నాంచ కల్కనం॥ ( శ్లో ॥ 33 )

భావం: ఇండ్లలో స్త్రీల రాజ్యం, సలహానిచ్చేది బావమరుదులు, లోభముతో కన్యను విక్రయించటం, దంపతుల్లో కలహాలు ఈ భూమిమీదున్నాయి.

ఆశ్రమా యవనై రుద్ధాస్తీర్థాని సరితస్తథా ।
దేవతా యత నాన్యత్ర దుష్టైర్నష్టాని భూరిశః ॥( శ్లో ॥ 34 )

భావం: మహాత్ముల ఆశ్రమాలు, తీర్థస్థలాలు యవనుల అధికారమైపోయాయి. ఆ దుష్టులు చాలా దేవాలయములను నష్టపరచెను.

నయోగీ నైవసిద్ధోవా నజ్ఞానీ సత్క్రియోనరః ।
కలి దావానలేనాద్యా సాధనం భస్మతాం గతమ్ ॥ ( శ్లో ॥ 35 )

భావం: ఈనాడిక్కడ యోగులు లేరు. సిద్ధులు లేరు. సత్కర్మలు చేసేవారు లేరు. అన్ని సాధనలు కలిరూపం అయిన దావానలంలో కాలి భస్మమైపోయాయి.

అట్ట శూలా జనపదాః శివశూలా ద్విజాయతః ।
కామిన్యః కేశశూలిన్యః సంభవంతి కలావిహ ॥ ( శ్లో ॥ 36 )



భావం: ఈ కలియుగంలో దేశవాసులందరు బజారులో అన్నం అమ్ముకుంటున్నారు. బ్రాహ్మణులు డబ్బు తీసుకుని చదువు చెపుతున్నారు. స్త్రీలు వేశ్యావృత్తిలో జీవనం సాగిస్తున్నారు.

ఏవం పశ్యన్ కలేర్దోషాన్ పర్యటన్నవనీమహం ।
యామునం తటమాపన్నో యత్రలీలా హరేరభూత్ ॥ (శ్లో ॥37 )

భావం: మునివర్యులారా! అక్కడ నేను పెద్ద ఆశ్చర్యకరమైన విషయాన్ని చూచితిని. ఒక యువతి ఖిన్న మనస్కురాలై అక్కడ కూర్చుని ఉన్నది.

తత్రాశ్చర్యం మయాదృష్టం శ్రూయతాం తన్మునీశ్వరాం ।
ఏకాతు తరుణీ తత్ర నిషణ్ణా ఖిన్న మానసా ॥ (శ్లో ॥ 38 )

భావం: మునివర్యులారా! అక్కడ నేను పెద్ద ఆశ్చర్యకరమైన విషయాన్ని చూచితిని. ఒక యువతి ఖిన్న మనస్కురాలై అక్కడ కూర్చుని ఉన్నది.

వృద్ధౌ ద్వౌపతితౌ పార్శ్వే నిఃశ్వ సంతాపచేతనౌ ।
శుశ్రూషంతి ప్రబోధంతి రుదతీచ తయో పురః ॥(శ్లో ॥ 39 )

భావం: అక్కడ దగ్గిరలో ఇద్దరు వృద్ధ పురుషులు అచేతనావస్థలో దీర్ఘశ్వాస తీసుకుంటూ పడియున్నారు. ఈ తరుణి వారికి సేవ చేస్తోంది. ఒకసారి వారికి చేతనత్వం తీసుకురావటానికి ప్రయత్నిస్తున్నది. ఒక్కొక్కసారి వారి ముందు ఏడుస్తున్నది.

దశదిక్షు నిరీక్షంతి రక్షితారం నిజం వపుః ।
వీజ్యమానా శత స్త్రీభిర్ బోధ్యమాన ముహుర్ముహుః॥(శ్లో ॥ 40 )

భావం: తన శరీరాన్ని రక్షించే పరమాత్మను దశదిశలలో చూస్తున్నది. ఆమె నలువైపులా వందలాది స్త్రీలు విసన కర్రలతో విసురుతూ ఆమెను పదేపదే సముదాయిస్తున్నారు.

దృష్ట్వా దురాద్గతః సోహం కౌతుకేన తదంతకం।
తాన్ దృష్ట్వా చోద్ధితాబాలా విహ్వాలా చాభ్రవీద్వచః ॥ (శ్లో ॥ 41 )

భావం: దూరం నుంచి ఇదంతా చూస్తున్న నేను కుతూహలంతో దగ్గరకు వెళ్ళాను. నన్ను

చూసి ఆ యువతి లేచి నిలబడి ఎంతో విహ్వలంగా ఇలా చెప్పింది.

**బాల ఉవాచ:**

*భోభోః స్సాధో క్షణం తిష్ట మచ్చింతా మపినాశయ।*
*దర్శనం తవ లోకస్య సర్వదాఘ హరం పరం ॥ (శ్లో ॥ 42 )*

భావం: మహాత్మా! తమరు ఒక్క క్షణం ఇక్కడ నిలవండి. మీయొక్క దర్శన భాగ్యం సంసారంలో గల అన్ని పాపాలను ఎల్ల వేళలా నశింప చేయగలదు.

*బహుధా తవ వాక్యేన దు:ఖ శాంతి ర్భవిష్యతి ।*
*యదాభాగ్యం భవేద్భూరి భవతో దర్శనం తదా ॥ (శ్లో ॥ 43 )*

భావం: మీ వచనములు నా దు:ఖమును చాలావరకు శాంతింప జేస్తాయి. మనుష్యుని బాగ్యోదయం జరిగినపుడు మాత్రమే మీలాంటి పుణ్యాత్ముల దర్శనం లభిస్తుంది.

నారద ఉవాచ:

*కాసిత్వం కాలిమౌచేమా నార్యః కాః పద్మలోచనాః ।*
*వద దేవి సవిస్తారం స్వస్య దు:ఖస్య కారణం ॥ (శ్లో ॥ 44)*

భావం: అప్పుడు నేను ఆ స్త్రీని అడిగితిని. దేవి! నీవెవరివి? ఆ ఇద్దరు పురుషులకు నీకు సంబంధం ఏమిటి? నీ వద్దనున్న ఈ పద్మ నయనులకు నీకూ గల సంబంధమునకు గల కారణం ఏమిటో తెలుపుము.

బాల ఉవాచ:

*అహం భక్తి రితిఖ్యాతా తనయౌమితౌ ఇమౌమే ।*
*జ్ఞాన వైరాగ్య నామానౌ కాలయోగేన జర్జరౌ ॥*
*గంగాద్యాః సరితశ్చేమా మత్సేవార్థం సమాగతాః ।*
*తథాపి నచమే శ్రేయః సేవితాయాః సురైరపి ॥ (శ్లో ॥ 45 )*

భావం: ఈ దేవతలు, గంగాది నదులు వీరందరూ నా సేవ కొరకు వచ్చినారు. ఈ విధంగా ఇలా దేవతలతో నేను సేవింపబడుతున్నప్పటికీ నాకు ఏవిధమైన సుఖమూ, శాంతి లేదు.



*ఇదానీం శృణు మద్వార్తాం సచిత్తస్త్వం తపోధనా ।*
*వార్తామే వితతాప్యస్తి తాం శృత్వా సుఖమావహ ॥ (శ్లో ॥ 46 )*

భావం: ఏ తపోధనా! సావధాన చిత్తులై తమరు నా వృత్తాంతమును వినుడు. నా కధ చాలా ప్రసిద్ధి చెందినదైనప్పటికీ, దానిని మీరు విని నా బాధలను పోగొట్టి శాంతిని ప్రసాదించండి.

*ఉత్పన్నా ద్రవిడే సాహం వృద్ధిం కర్ణాటకే గతా ।*
*క్వచిత్ క్వచిన్ మహారాష్ట్రే గుర్జరే జీర్ణతాం గతా ॥ (శ్లో ॥ 47 )*

భావం: నేను ద్రవిడ దేశంలో పుట్టి, కర్ణాటకలో పెరిగి, మహారాష్ట్రలో అక్కడక్కడ సన్మానింపబడ్డాను. కాని గుజరాత్‌లో నాకు ముసలితనం ఆవరించింది.

*తత్ర ఘోరకలేర్యోగాత్ పాఖండైః ఖండితాంగకా ।*
*దుర్బలాహం చిరం యాతా పుత్రాభ్యాం సహమందతాం॥ (శ్లో ॥49)*

భావం: అక్కడ కలియుగ ప్రభావం వల్ల పాఖండులందరు నా అంగములను భంగం చేశారు. చాలాకాలంపాటు నేనిదే అవస్థలో ఉండటం వల్ల నేను కూడా నా పుత్రులతో పాటు దుర్బలనైతిని. నిస్తేజురాలనైతిని.

*వృదావనం పునః ప్రాప్య నవీనేవ సురూపిణి ।*
*జాతాహం యువతీ సమ్యక్ ప్రేష్టరూపా తు సాంప్రతమ్ ॥ (శ్లో॥ 50)*

భావం: ఇప్పుడు బృందావనమునకు వచ్చిన దగ్గర నుంచి నేను మళ్ళా పరమ సుందరిని, సరూపవతిని, నవయువతిని అయ్యాను.

*ఇమౌతు శైతావత్ర సుతౌ మే క్లిష్యతః శ్రమాత్ ।*
*ఇదం స్థానం పరిత్యజ్య విదేశం గమ్యతే మయా ॥ (శ్లో ॥ 51 )*

భావం: నాముందే అలసిపోయిన నా ఇద్దరు పుత్రులు దు:ఖితులౌతున్నారు. అందుచేత నేనీ స్థానమును విడిచి వేరొక చోటుకి వెళ్ళదలచాను.

*జరఠత్వం సమాయాతౌ తేన దు:ఖేన దు:ఖితా ।*

*సాహం తు తరుణీ కస్మాత్ సుతౌ: వృద్ధావిమౌ కుత: ॥(శ్లో ॥52 )*

భావం: వీరిరువురూ ముసలివారైపోయారు. నేను దీనికి ఎంతో దు:ఖిస్తున్నాను. నేను యువతిగా, తరుణిగా ఉండగానే ఎందుచేత నా ఇరువురు పుత్రులు ముసలివారు అయ్యారు?

*త్రయాణాం సహచారి త్వా ద్వైపరీత్యం కుత: స్థితం।*

*ఘటతే జరఠా మాతా తరుణౌ తనయా వితి ॥ (శ్లో ॥ 53 )*

భావం: మేము ముగ్గురం ఎప్పుడూ కలసి ఉండేవారం. ఈ వైపరీత్యమేమి? అసలేమి జరగవలె? సహజంగా తల్లి ముసలిదై పుత్రులు తరుణ వయస్కులుగా ఉండవలె కదా!

*అత: శోచామి చాత్మానం విస్మయావిష్ట మానసా ।*

*వద యోగనిధే ధీమన్ కారణం చాత్ర కిం భవేత్ ॥ (శ్లో ॥54 )*

దీనివల్లనే ఆశ్చర్యచకితమైన చిత్తంతో నాకు వచ్చిన దురవస్థకు శోకిస్తున్నాను. మీరు పరమ బుద్ధిమంతులు, యోగనిధులు. ఈ పరిస్థితికి కారణం ఏమిటో దయచేసి తెలపండి.

**నారద ఉవాచ:**

*జ్ఞానే నాత్మని పశ్యామి సర్వమేతత్త వానఘే ।*

*నవిషాద స్త్వయా కార్యో హరి: శం తే కరిష్యతి ॥ (శ్లో ॥ 55 )*

భావం: సాధ్వీ! నా హృదయంలో జ్ఞానదృష్టితో నీకు వచ్చిన దు:ఖములకు కారణం చూస్తున్నాను. నువ్వు బాధపడకు. శ్రీహరి నీకు శుభమే చేస్తాడు.

**సూత ఉవాచ:**

*క్షణ మాత్రేణ తజ్జ్ఞా త్వా వాక్యమూచౌ మునీశ్వర: ॥(శ్లో ॥ 56 )*

భావం: నారదముని ఒక్క క్షణం మౌనంగా ఉండి కారణం తెల్సుకుని ఆమెకు తెలిపెను.

*శృణు ష్వా వహితా బాలే యుగోయం దారుణ: కలి: ।*

*తేనలుప్త: సదాచారో యోగమార్గ స్తపాంసి చ ॥ (శ్లో ॥ 57 )*



భావం: ఈ కాలంలో సదాచారం, యోగమార్గం, తపము లుప్తమై పోయినవి. దేవీ! సావధానముగా వినుము. ఇది దారుణ కలియుగం.

*జనా అఘాసురా యన్తే శాఠ్య దుష్కర్మ కారిణ: ।*

*ఇహ సన్తో విషీదన్తి ప్రహృష్యన్తి హ్యా సాధవ:*

*ధత్తే ధైర్యం తు యో ధీమాన్ సధీర: పండితోధవా॥ (శ్లో ॥ 58 )*

భావం: మూర్ఖులు దుష్కర్మలు చేస్తూ, మనుష్యులు అఘాసురు లౌతున్నారు. సత్పురుషులు దు:ఖిస్తున్నారు. దుష్టులు సుఖంగా ఉన్నారు. ఈ సమయంలో ధైర్యం కోల్పోని బుద్ధిమంతుడే జ్ఞాని లేక పండితుడు.

*అస్పృశ్యానవలోక్యేయం శేషభార కరీధరా ।*

*వర్షేవర్షే క్రమాజ్జాతా మంగళమ్ నాపి దృశ్యతే ॥ (శ్లో ॥ 59 )*

భావం: పృథ్వీ ప్రతిసంవత్సరం క్రమక్రమంగా ఆది శేషునికి భారమౌతున్నది. ఇప్పుడిది చూడటానికి తగనిదిగా అయినది. ఎక్కడా శుభకరమైన వాతావరణం లేదు.

*నత్వామపి సుతై: సాకం కోపి పశ్యతి సాంప్రతమ్ ।*

*ఉపేక్షితాను రాగాద్యై జర్జరత్వేన సంస్థితా ॥ (శ్లో ॥ 60 )*

భావం: ఇప్పుడు నీకు నీ పుత్రులతో పాటు దర్శనం కావటంలేదు. విషయానురాగంవల్ల అంధులైన జీవులద్వారా ఉపేక్షింపబడిన నీవు జర్జరమైపోయావు.

*వృందావనస్య సంయోగాత్ పునస్త్వం తరుణీనవా ।*

*ధన్యం వృందావనం తేన భక్తి నృత్యతి యత్రచ ॥ (శ్లో ॥ 61)*

భావం: బృందావనం యొక్క సంయోగంతో నీవు మళ్ళీ తరుణావస్థ పొందావు. ఈ బృందావనధామం ధన్యము. ఇక్కడ భక్తి సర్వత్రా నృత్యము చేయుచున్నది.

*అత్రేమౌ గ్రాహకా భావాన్నజరామపి ముంచత: ।*

*కించిదాత్మ సుఖేనేహ ప్రసుప్తిర్మన్యతే నయో: ॥ (శ్లో ॥ 62 )*

భావం: కానీ ఇక్కడ నీ పుత్రులిరువురికీ గ్రాహకులు లేరు. అందువల్ల వారి ముసలితనం

పోవటం లేదు. ఇక్కడ వారికి కొద్దిగా ఆత్మ సుఖం ప్రాప్తించటం వల్ల వారు నిద్రపోయినట్లు కన్పిస్తున్నారు.

భక్తిరువాచ :

*కథం పరీక్షితా రాజ్ఞా స్థాపితో హ్యశుచిః కలిః ।*
*ప్రవృత్తేతు కలౌ సర్వసారః కుత్ర గతో మహాన్ ॥ (శ్లో ॥ 63 )*

భావం: పరీక్షిత్ మహారాజు ఈ పాపపుకలియుగమును ఎందుకు ఉండనిచ్చెను? ఇది రాగానే అన్ని వస్తువుల సారం అణగారిపోయినది.

*కరుణా పరేణ హరిణాప్యధర్మః కథమీక్ష్యతే ।*
*ఇమంమే సంశయం ఛిన్ధి త్వద్వాచా సుఖితా స్మ్యహమ్ ॥(శ్లో॥ 64 )*

భావం: మునీశ్వరా! కరుణామయుడైన శ్రీహరి ఈ అధర్మమును ఎలా ఒప్పుకొని నాడు. నా ఈ సందేహమును దూరం చేయుము. నీ వచనములతో నాకు శాంతి లభించుచున్నది.

నారద ఉవాచ:

*యదిపృష్ట స్త్వయా బాలే ప్రేమతః శ్రవణం కురు ।*
*సర్వం వక్ష్యామితే భద్రే కశ్మలంతే గమిష్యతి ॥ (శ్లో ॥ 65 )*

భావం: కళ్యాణీ! నీవడిగావు కనుక ప్రేమతో నీకు అన్నీ తెలిపెదను. నీ దుఃఖము దూరమౌతుంది.

*యదా ముకుందో భగవాన్ క్ష్మాం త్యక్త్వా స్వపదం గతః ।*
*తద్దినాత్ కలిరాయాతః సర్వసాధన బాధకః ॥ (శ్లో ॥ 66 )*

భావం: ఏరోజు శ్రీకృష్ణ భగవానుడు భూలోకం వదలి తన పరంధామమునకు చేరెనో, ఆ రోజునుంచే సంపూర్ణ సాధనలకు అడ్డు తగిలే కలియుగం వచ్చేసింది.

*దృష్టో దిగ్విజయే రాజ్ఞా దీన వచ్ఛరణం గతః ।*
*నమయా మారణీ యోయం సారంగ ఇవ సారభుక్ ॥ (శ్లో ॥ 67 )*

భావం: దిగ్విజయ సమయంలో పరీక్షిన్మహారాజు యొక్క దృష్టి పడినప్పుడు కలియుగము



దీనుడివలె ఆయనను శరణుజొచ్చెను. మధువును గ్రోలే భ్రమరంవంటి వాడైన పరీక్షిత్తు ఈ కలిని నేను చంపకూడదని నిశ్చయించుకొనెను.

*యత్ఫలం నాస్తి తపసా నయోగేన సమాధినా ।*
*తత్ఫలం లభతే సమ్యక్ కలౌ కేశవ కీర్తనాత్ ॥ (శ్లో ॥ 68 )*

భావం: ఈ కలియుగంలో తపస్సు, యోగము, సమాధుల వలన ఫలితములు రావు. శ్రీహరి నామస్మరణ చేసిన వారికి తప్పని సరిగా ఫలితములు వచ్చును.

*ఏకాకారం కలిం దృష్ట్వా సారవత్సార నీరసమ్ ।*
*విష్ణురాతః స్థాపితవాన్ కలిజానాం సుఖాయచ ॥ (శ్లో ॥ 69 )*

భావం: ఈ విధముగా సారహీనమైపోయినప్పటికీ కలియుగంలో జన్మించే జీవుల సుఖం కొరకు కలిని ఉండనిచ్చెను.

*కు కర్మాచ్చరణాత్సార: సర్వతో నిర్గతో అధునా ।*
*పదార్థా సంస్థితా భూమౌ బీజహీనా స్తుషాయథా॥ (శ్లో ॥ 70 )*
*విప్రైర్భా గవతీ వార్తా గేహేగేహే జనేజనే ।*
*కారితా కణలోభేన కథాసార స్తతోగతః ॥ (శ్లో ॥ 71 )*

భావం: బ్రాహ్మణులు కేవలం అన్నధనులై లోభవశమున ఇంటింటికీ వెళ్ళి జనులకు భాగవతం చెప్పటం మొదలిడిరి. అందువల్లనే కథ యొక్క సారం పోయినది.

*అత్యుగ్ర భూరి కర్మణో నాస్తికా రౌరవా జనాః ।*
*తేపి తిష్ఠంతి తీర్థేషు తీర్థసార స్తతోగతః ॥ (శ్లో ॥ 72 )*

భావం: తీర్థములలో అన్ని విధములైన ఘోరకర్మలూ చేసే నాస్తికులు ఉండటం మొదలిడిరి. అందువల్ల తీర్థముల పవిత్రత కూడా పోయినది.

*కామక్రోధమహాలోభతృష్ణావ్యాకులచేతసః ।*
*తేపి తిష్ఠంతి తపసి తపఃస్సారతతోగతః ॥ (శ్లో ॥ 73 )*

భావం: ఎవరి చిత్తమైతే కామక్రోధమదలోభతృష్ణలతో కొట్టుకుంటుందో వారుకూడా తపస్సు

అనే నటన చేయుచున్నారు. దానితో తపస్సు యొక్క సారం కూడా పోయినది.

*మనసశ్చజయల్లోభాదంభాత్ పాఖండ సంశ్రయాత్ ।*

*శాస్త్రా నభ్యసనా చ్చైవ ధ్యానయోగ ఫలం గతమ్ ॥ (శ్లో ॥ 74 )*

భావం: మనస్సుపై నిగ్రహం లేకుండా లోభ-దంభ-పాఖండములను ఆశ్రయించుట వలన, మరియు శాస్త్రములను అభ్యసింపకపోవటం వలన ధ్యానయోగ ఫలంకూడా నశించినది.

*పండితాస్తు కళత్రేణ రమన్తే మహిషా ఇవ ।*

*పుత్రస్యోత్పాదనే దక్షా అదక్షా ముక్తి సాధనే । ॥ (శ్లో ॥ 75 )*

భావం: పండితులు గేదెలవలె వారి స్త్రీలతో రమిస్తున్నారు. వారిలో సంతానం కలిగించే కుశలత్వం తప్ప ముక్తి సాధనలో కుశలురు కారు.

*నహి వైష్ణవ తా కుత్ర సంప్రదాయ పురః సరా ।*

*ఏవం ప్రళయతాం ప్రాప్తో వస్తుసారః స్థలేస్థలే ॥ (శ్లో ॥ 76 )*

భావం: సంప్రదాయానుసారం ప్రాప్తించిన వైష్ణవత్వం మచ్చుకైనా ఎక్కడా కన్పించటం లేదు. ఈ విధంగా అన్ని చోట్ల అన్ని వస్తువులు సారం కోల్పోయినవి.

*అయంతు యుగ ధర్మోహి వర్తతే కస్య దూషణమ్ ।*

*అతస్తు పుండరీకాక్షః సహతే నికటే స్థితః ॥ (శ్లో ॥ 76)*

భావం: ఇది ఈ యుగం యొక్క స్వభావం. దీనిలో ఎవరి దోషమూ లేదు. అందుకే పుండరీకాక్షుడు అతి సమీపంలో ఉంటూ కూడా దీనిని సహిస్తున్నాడు.

సూత ఉవాచ:

*ఇతి తద్వచనం శృత్వా విస్మయం పరమంగతా: ।*

*భక్తిరూచే వచో భూయ: శ్రూయతాం తచ్చ శౌనక: ॥ (శ్లో । 77 )*

భావం: శౌనకా! ఈ విధంగా చెప్పిన నారదుని వచనాలను విన్న భక్తి చాలా ఆశ్చర్య చకితురాలైంది. ఇంకా నారద మహర్షి ఏం చెప్పాడో వినండి.



భక్తి రువాచ -

*సురర్షే త్వం హి ధన్యోసి మద్భాగ్యేన సమాగత: ।*

*సాధూనాం దర్శనం లోకే సర్వ సిద్ధి కరం పరం ॥ (శ్లో ॥ 78 )*

భావం: దేవర్షి ! మీరు ధన్యులు. నా సౌభాగ్యవశాన మిమ్ములను కలిశాను. సంసార జీవులకు సాధుదర్శనమే సమస్త సిద్ధులకు కారణము.

*జయతి జయతి మాయాం యజ్య కాయాధ వస్తే*

*వచన రచన మేకం కేవలం చాకల య్యా।*

*ధ్రువ పదమపి యాతో యత్ కృపాతో ధ్రువోయం*

*సకల కుశల పాత్రం బ్రహ్మపుత్రం నతోస్మి ॥ ( శ్లో॥ 79 )*

భావం: కేవలం మీరు ఒకసారి ఉపదేశించినది ధారణ చేసిన ప్రహ్లాదుడు మాయ మీద విజయం సాధించాడు. ధృవుడు కూడా మీ యొక్క కృపతోనే ధృవత్వం పొందాడు. మీరు సర్వమంగళరూపులు, మరియు సాక్షాత్ బ్రహ్మ యొక్క పుత్రులు. నేను మీకు నమస్కరిస్తున్నాను.

**ఇది పద్మపురాణ ఉత్తరార్థములో శ్రీమద్భాగవత మహాత్మ్యంలో భక్తి - నారద సమాగ యోగము అనే ప్రథమోధ్యాయము.**

## చేతనత్వం యొక్క స్థాయిలు

ఓం............... ఓం.............. ఓం............

*గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।*
*గురుస్సాక్షాత్ పరబ్రహ్మాః తస్మై శ్రీగురవేనమః ॥*
*అఖండమండలాకారం వ్యాప్తంయేన చరాచరమ్ ।*
*యత్పదం దర్శితంయేన తస్మై శ్రీగురవేనమః ॥*

కృష్ణం నారాయణం వందే కృష్ణం వందే వ్రజప్రియం ।
కృష్ణం ద్వైపాయనం వందే కృష్ణం వందే పృథాసుతం ॥

కృష్ణచరిత్ర గురుచరిత్ర. గురుచరిత్ర అంటే ఒక వ్యక్తి యొక్క చరిత్ర కాదు అని గుర్తుచేసుకుందాం మనం. అంధకారాన్ని పోగొట్టేటటువంటి చరిత్ర. అదీ గురుచరిత్ర యొక్క ఉద్దేశ్యం.

అందుచేత ఏ గురుచరిత్ర చదివినా మీకు గుర్తుండవలసినటువంటి విషయం ఏమిటంటే, ఒక వ్యక్తి యొక్క జీవితగాథ మీరు చదవటం లేదు. భౌతిక శరీరధారి యొక్క జీవితాలు మీరు చదవటం లేదు.

ఎవరి జీవితాలు చదువుతున్నాం?

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్ ।
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥ (భ.గీ. 4-6)

నేను పుట్టుకలేనివాడను, నాశరహితస్వరూపము కలవాడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను అయినప్పటికి స్వకీయమగు ప్రకృతిని వశపఱచుకొని నా మాయాశక్తిచేత పుట్టుచున్నాను (అవతరించుచున్నాను).



అనగలిగేటటువంటి వ్యక్తుల యొక్క జీవితం చదువుతున్నాం.

అజోఽపి సన్ అంటే అర్థమేంటి?

పుట్టుకలేనివాడు. ఇది చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోండి. ఇదే భాగవతం అసలు, ఇప్పుడు చెప్తోన్న శ్లోకం. దీన్ని అర్థం చేసుకోవటానికి ఈ పన్నెండు స్కంధాలు ఉన్నాయి. ఏంటి?

అజోఽపి సన్ - పుట్టుకలేనివాడినైనప్పటికిని, ఎవడు పుట్టుకలేనివాడు? శ్రీకృష్ణుడే కాదు, రాముడే కాదు, వ్యాసుడే కాదు, ఋషులే కాదు, మనము కూడా.

**మనము కూడా పుట్టుకలేనివాళ్లమే.**

మీరు అది బుర్రకెక్కించేసుకోండి. అది అర్థమైపోతే భాగవతం అర్థం అయిపోయింది. పుట్టుక లేనటువంటివాడు పుట్టాడు.

పుట్టాక, "మరి మాకు ఆ విషయం ఎందుకు గుర్తుండటం లేదు మాస్టారూ" అని అడుగుతారు. చాలా సింపుల్ క్వశ్చన్. వక్కపొడి వేసుకొనే వాడ్ని భోజనం అయిపోయిన తరవాత వక్కపొడి మానెయ్యమనండి చూద్దాం. మానగలరా? కాని మానటానికి కష్టమేముంది? కాని వక్కపొడి మానడం మీకు కష్టమే! సిగరెట్ మంచిది కాదు అని తెలుసుకదా! తెలియనివాడు ఎవడైనా ఉన్నాడా? అంతేకాక వాడు సిగరెట్ ప్యాకెట్ మీదే చెప్తున్నాడుకదా, బాబూ ఇది నువ్వు తాగితే చస్తావ్ అని. మరి కోట్లకోట్లకోట్ల రూపాయలు పన్నులు కడుతున్నారు సిగరెట్ కంపెనీ ఓనర్స్. అలా కొన్ని బిలియన్ డాలర్స్ పన్నులు కట్టారు అమెరికాలో. అంత లాభం ఉండివుంటేనే కదా కట్టివుంటారు. మరి ఎందుకు తాగుతున్నావ్?

ఆ దురలవాట్లు ఎలా మానుకోలేకపోతున్నామో, భౌతిక శరీరంలో జీవించే అలవాటు కూడా మానుకోలేకపోతున్నాం.

మీకది అర్థమైపోతే ఈ క్షణంలో మీరూ శ్రీకృష్ణుడే. అందరం శ్రీకృష్ణులమే.

అది అర్థమైనటువంటి వాళ్ళు గోపికలు. రాసలీల యొక్క ఉద్దేశ్యం ఏమిటీ అంటే, అది. అర్థమైందా! గోపికకి గోపికకి మధ్య కృష్ణుడు, కృష్ణుడికి కృష్ణుడికి మధ్య గోపిక. ఎక్కడుంటారు అంతమంది? అంతమందేం లేరు. అందరిలోనూ ఆ అజోఽపి సన్ అనేటటువంటి దర్శనం మీరు చూడగలిగిననాడు, ఇంక మీకూ, మనకీ, కృష్ణుడికీ ఏంటి తేడా? ఏమీ తేడా లేదు.

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్ ।
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥ (భ.గీ. 4-6)

**నేను పుట్టుకలేనివాడను, నాశరహితస్వరూపము కలవాడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను అయినప్పటికి స్వకీయమగు ప్రకృతిని వశపఱచుకొని నా మాయాశక్తిచేత పుట్టుచున్నాను (అవతరించుచున్నాను).**

ఈ శ్లోకాన్ని మనం భాగవత సప్తాహం చేస్తున్నప్పుడు నిరంతరము గుర్తుంచుకోవాలి. ఆ స్థితికి వెళ్ళటానికి మనశక్తి సరిపోవటం లేదు. ఎన్నిసార్లు మనం చెప్పుకున్నా, నేను ఆత్మని అని మనం అంటాం తప్ప, ఆత్మలాగ మనం ప్రవర్తించలేక పోతున్నాం. అజోఽపి సన్నవ్యయాత్మా....

అవ్యయాత్మ అంటే ఏంటి?

వ్యయము లేనటువంటి ఆత్మ. నాశరహితుడను. నాకు ఏవిధమైనటువంటి నాశనము లేదు. అందుచేత వీడికి ఏ కోరికా ఉండదు. ఏదైనా వీడి దగ్గర నుంచి పోతేకదా కోరుకోవాలి. అంతా వీడిదే అయినప్పుడు, నాశనం లేనప్పుడు, ఇంక నువ్వు కోరుకునేదేముంది? ఈ మానసికస్థితే,

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్ ।
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥ (భ.గీ. 4-6)

**నేను పుట్టుకలేనివాడను, నాశరహితస్వరూపము కలవాడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను అయినప్పటికి స్వకీయమగు ప్రకృతిని వశపఱచుకొని నా మాయాశక్తిచేత పుట్టుచున్నాను (అవతరించు చున్నాను).**



పంచభూతాలకి నేను ఈశ్వరుడ్ని. ఈశ్వరుడు అంటే లార్డ్, అధిపతి, స్వామి. అతను చెప్పిన మాట విని తీరాల్సిందే అనే పరిస్థితి ఉన్నవాడు. ఎవరు? శ్రీకృష్ణుడే కాదు, నువ్వు కూడా. వింటున్న వాళ్ళు కూడా. అందుకే ధ్యానశ్లోకంలో ఏం చెప్తాడు?

కృష్ణం నారాయణం వందే - నారాయణ స్వరూపుడైన కృష్ణుడికి నమస్కారము.

కృష్ణం వందే వ్రజప్రియం.- వ్రజవాసులకు చాలా ప్రియుడు. అనంతమైన, అజోపిసన్, అవ్యయాత్మా, భూతానాం ఈశ్వరోపిసన్ అనే నారాయణతత్త్వము కలిగిన కృష్ణుడు ఎక్కడ పుట్టాడు? వ్రజభూమిలో పుట్టాడు. పుట్టాక ఏమయ్యాడు? అక్కడి వాళ్ళకి ప్రీతిపాత్రుడయ్యాడు. ఆ భౌతిక శరీరధారికి కృష్ణం వందే వ్రజప్రియం.

కృష్ణం ద్వైపాయనం వందే - ఆ కృష్ణుడే వ్యాసమునీశ్వరుడుగా ఇవన్నీ మనకు అందించాడు. ఆయనే ద్వైపాయనుడు.

కృష్ణం వందే పృథాసుతం - దానిని వీరాధివీరులులాగ ప్రపంచానికి అందజేయటానికి కావలసినటువంటి అడ్డంకులు తొలగించినవాడు పృథ్వీపుత్రుడు. కృష్ణం వందే పృథాసుతం. అర్జునుడు అనలేదు, పృథాసుతం. భూమి యొక్క పుత్రుడు.

మనమందరం కూడా పృథ్వీపుత్రులమే. మనమందరం కూడా అర్జునులం కాగలము. అది మీరు గుర్తుంచుకోవాలి. ఇక్కడ నారాయణ స్థితి నుంచి అర్జున స్థితి వరకు - ఒకే చేతనత్వము యొక్క భిన్నభిన్న స్థితులని - గుర్తుండాలి.

భాగవతం చదువుతోన్నప్పుడు మీరు ఆ స్థితికి ఈ ఏడు రోజులలో వెళ్ళిపోవాలి. మనం ఏడు రోజులలో వెళ్ళం, ఏడు వారాలలో వెళ్తాం. మనం వారం వారం చెప్పుకోవటానికి ప్రయత్నిద్దాం. ఎంతవుతుందో చూద్దాం. అవ్వకపోతే వుయ్ విల్ కంటిన్యూ ఇట్. కాని నిరంతరం మీరు గుర్తుంచుకోవలసింది ఏమిటీ అంటే,

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్ ।

ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥ (భ.గీ. 4-6)

నేను పుట్టుకలేనివాడను, నాశరహితస్వరూపము కలవాడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను అయినప్పటికి స్వకీయమగు ప్రకృతిని వశపఱచుకొని నా మాయాశక్తిచేత పుట్టుచున్నాను (అవతరించుచున్నాను). ప్రకృతిని అధిష్టించాను. సంభవామి ఆత్మమాయయా. ఆత్మ మాయతో పుట్టాను.

పుట్టాక ఏమయ్యాడు?

ఈ మిగతావన్నీ మర్చిపోయాడు. ఏమిటి? ప్రకృతిం స్వామధిష్ఠాయ, అజోఽపిసన్, అవ్యయాత్మా, భూతానామీశ్వరోఽపి సన్ అనేది మర్చిపోయాడు. ఇంక మర్చిపోయాక ఎదుటివాడు చెప్పినా వినటం లేదు. "బాబూ, అది నువ్వు కాదురా!" అనే దానికి వివేకానంద ఒక కథ చెప్పేవాడు. "ఉపనిషత్తు మీకు అర్థం కావాలి అంటే, ఉపనిషత్తులు మీరు పారాయణ చేయక్కర్లేదు, మంత్రజపాలు చేయక్కర్లేదు, ఒక చిన్న కథ గుర్తుంచుకోండి" అన్నాడు. ఏమిటా కథ?

ఒక గొర్రెలమందలో ఒక సింహం పిల్ల ఇరుక్కుపోయింది. ఏదో ప్రమాద వశాత్తూ కడుపుతో ఉన్న సింహం ఎగిరిందో, ఏదో చేసివుంటుంది. ఆ సింహం పిల్ల దొరికింది వాటికి. గొర్రెపిల్లలతో పాటు ఆ సింహం పిల్ల పెరిగింది. అది ఎలా పెరిగింది? గొర్రె పిల్లలాగే పెరిగింది. కాని తనను తాను అసహ్యించుకొనేది ఆ సింహం పిల్ల. "ఏంటో వాళ్ళలాగ నేను అందంగా లేను. ఎంత రంగు రంగులుగా ఉన్నారో వాళ్ళు. నేను ఏంటి లేత పసుపురంగులో, పాలిపోయిన రంగులో ఇలా గడ్డం పెంచుకుని... " సింహం కదా! గొర్రెలకి సింహంలాగ గెడ్డాలు అవీ ఉండవు కదా! అసహ్యించుకునేది తనను తాను ఆ సింహం పిల్ల. ఈ లోపల ఒక సింహం చూసింది దాన్ని. చూసిన తరవాత దాన్ని పిలవటానికి దగ్గరికి వెళ్తే పారిపోతోంది అది. సింహాన్ని చూస్తే సింహం పిల్లకి కూడా భయమే. ఎందుచేత? తనని తాను సింహం పిల్ల అనుకోవటం లేదది.

మన పరిస్థితి కూడా సరిగ్గా అదే. ఎన్నిసార్లు రకరకాలుగా ఎందరు చెప్పినా



కూడా, ఈ భౌతికమైనటువంటి బంధాల్లోంచి దూకలేకపోతున్నాము. దూకాల్సిందే, ఇవాళ కాకపోతే రేపు, లేకపోతే ఈ భాగవత సప్తాహం అయ్యేలోపల. దూకగలరు అనేది చరిత్ర చెప్తోంది. అలా దూకిన వాళ్ళ సంఘటనలు చాలా ఉన్నాయి. మీరు కూడా అలా దూకగలరు. కాని ఆ దూకటానికి కావలసిన ఆ మానసిక దారుఢ్యం తెచ్చుకోండి. ఇది వింటోన్నప్పుడు ఆ దృష్టికోణంతో వినండి. నేను ఆత్మని. నా లీలలే. "స్వ మాయయా". నా లీలతో నేను "పుడుతున్నాను". ఇదంతా కూడా కృష్ణుడు యొక్క లీల కాదు, భగవంతుడు యొక్క లీల కాదు. నా యొక్క లీల.

మరి నేనెందుకు ఇలాగ చేసుకుంటున్నా మాస్టారు, నేను కోరుకున్నట్లు పరిస్థితులను మార్చుకోవచ్చు కదా!

నేను చాలా సార్లు ఒక సినిమా ఉదాహరణగా చెప్తాను, మేరానామ్ జోకర్. తెలుసా? మేరానామ్ జోకర్ సినిమాని ఎంతమంది చూశారు? చూశారుకదా!

అందులో రాజకపూర్ ఫైనాన్సర్, ప్రొడ్యూసరు, డైరెక్టరు, యాక్టరు, స్టోరీ రైటరు, అంతా తనే. ఓపెనింగ్ షాట్‌లో ఒక సర్కస్ ఉంటుంది. సర్కస్‌లో ఒక పఠానుంటాడు, గేట్‌కీపరు. సర్కస్ అంటే చుట్టూ ఎంత రద్దీ ఉంటుందో తెలుసుకదా, చూట్టానికి వచ్చినవాళ్ళ రద్దీ. లోపల ధర్మేంద్ర, రాజేంద్రకుమార్, మిగతా వాళ్ళందరూ కూడా అజమాయిషీ చేస్తుంటారు. రాజ్‌కపూర్ ఈ రద్దీలో ఉన్నాడు. లోపల దూరతాను అంటే పఠాన్ వాడ్ని తోసేస్తున్నాడు, లోపలికి రావటానికి వీల్లేదని.

ఆ పఠాన్, రాజ్‌కుమార్ లోపలికి వస్తోన్నప్పుడు, "మీరు నాకు పాత్ర ఇచ్చారు మహానుభావా!" అని రాజ్‌కపూర్ కాళ్ళకి దణ్ణం పెట్టివుంటే ఏమయ్యుండేది ఆ సినిమా? సినిమా ఉండేదికాదు. అంతేకదా! ఆ లీల ఎందుకుంది? అందరూ ఎవరి పాత్రకి తగినట్లు వాళ్ళు నటిస్తున్నారు కనుక. అర్థమైందా?

అందుచేతే మీ బాధ్యతలు విస్మరించవద్దు అని చెప్పేది.

నీ లీలే కావచ్చు ఇదంతా. నీ ప్రొడక్షన్ అండ్ డైరెక్షన్‌లోనే జరుగుతూ వుండొచ్చు

కాని, ఈ పాత్రని మీరే ఎన్నుకున్నారు. 'నేనెందుకు ఎన్నుకున్నాను' అంటే రాజ్‌కపూర్‌ని అడగాలి, "ఏమయ్యా, నీకు బుద్ధుందా? నువ్వు ఆ పాత్ర ఎన్నుకున్నావేంటి? నువ్వేమో ధర్మేంద్రని హీరోని చేశావ్, ఆ రష్యా నుండి వచ్చినావిడని హీరోయిన్‌ని చేశావ్. వీళ్ళందర్నీ హీరోయిన్‌ని చేసి, హీరోలని చేసి, నువ్వెక్కడున్నావ్? బయట ఉండి, లోపలికి వద్దామనుకుంటున్నావు, తోసి వేయబడుతున్నావు. వద్దామనుకుంటున్నావు, తోసివేయబడుతున్నావు" అని.

మీ పరిస్థితి కూడా అదే. మీ యొక్క కృష్ణచేతనత్వం పరిస్థితి కాదు. నటన చేయాల్సిందే మీరు ఆ పాత్రలో. పాత్రలో నటించకపోతే ఆ కథ ఎందుకు వ్రాసుకున్నారో దాని అందం పోతుంది. మనం రాసుకొన్న 'పాత్రే' ఇప్పుడు మనకి తెలీదు, అది మర్చిపోయాం. స్క్రిప్ట్ మర్చిపోయాం అనుకోండి. చాలాసార్లు అది జరుగుతుంది కదా! ఇప్పుడు ఈ స్క్రిప్టే లేదనుకోండి, ఏం చెప్తాం? అందుచేత స్క్రిప్ట్ మర్చిపోయిన డైరెక్టర్లు, ప్రొడ్యూసర్స్ మీరు. అలా అని కృష్ణుడు తన గురించి చెప్పుకోవటం లేదు.

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్।
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥(భ.గీ. 4-6)

**నేను పుట్టుకలేనివాడను, నాశరహితస్వరూపము కలవాడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను అయినప్పటికి స్వకీయమగు ప్రకృతిని వశపఱచుకొని నా మాయాశక్తిచేత పుట్టుచున్నాను (అవతరించుచున్నాను).**

అని తన గురించి చెప్పుకోవటం లేదు. నువ్వు కూడా సృష్టించుకుంటున్నావ్. నువ్వు ఎప్పుడైతే సృష్టి మానేస్తావో, ఈ సృష్టి మొత్తం పోతుంది. ఇలా పోయిన క్షణాలు ప్రతిరోజు రాత్రి మీకు వస్తున్నాయి.

ప్రతిరోజు రాత్రి కేన్సర్ పేషెంట్ పడుకుంటాడు, ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా పడుకుంటాడు, అడుక్కుతినే వాడు పడుకుంటాడు, కోటీశ్వరుడు పడుకుంటాడు, మనమూ పడుకుంటాం. పడుకున్న తరవాత మెలకువ రానంతవరకు ఏముంది? ఒకవేళ మెలకువ రాలేదనుకోండి, ఏమవుతుంది? ఏమీ ఉండదు. అంతవరకు



అర్థమవుతోంది కదా, తరవాత ఏమౌతుంది అనేది తరవాత ఆలోచిద్దాం. ఈ పాయింట్ అర్థమైంది కదా! అందుచేత మళ్ళా నిద్రలేవగానే ఏమౌతోంది? మళ్ళీ కథ మొదలు. కాని కథలో సరిగా నటించడి. బాధ్యత అని చెప్పేది అందుకు నేను. కథలో సరిగా నటించకపోతే లీల పోతుంది, ఆనందం పోతుంది.

ఆటలో మోసం చేయటం మొదలెట్టాడనుకోండి ఎవడైనా, ఆట విలువ పోతుంది కదా! ఈ మూడు ముక్కలాట వాటిలో మోసం చేయటం మొదలెడితే ఒప్పుకోం. ఎందుకొప్పుకోం, ఆటే కదా!

ఎందుకొప్పుకోం అంటే, ఆట విలువ పోతుంది. నియమాలు పెట్టుకుంటాం క్రికెట్ లేక ఇంకో ఆట ఆడటానికో. నియమం ప్రకారం ఆడలేదనుకో, ఇంక ఆడటం ఎందుకు?

ఆటకే నియమాలు కావాలి అన్నది గుర్తుంచుకోండి ఎప్పుడూ కూడా. నియమాలు లేనటువంటి ఏ ఆటైనా మీరు చూపించగలరా?

ఒక్క ఆట చూపించండి, నియమాలు లేనివి. ముందు మనం అడుగుతాం అవి ఏదైనా ఒక ఆట ఆడాలంటే ఎలా ఆడాలో చెప్పండి అని. ఎలా ఆడాలో చెప్పండి అంటే మీరు ఏం అడిగారు? నియమాల్ని అడుగుతున్నారు.

అందుచేత ఈ జగన్నాటకానికి కూడా నువ్వు ఏర్పరుచుకున్న నియమాలే ఉన్నాయి. పంచతత్త్వాలు ఇలా ప్రవర్తించాలి. పృధ్వీతత్త్వం ఇలా ప్రవర్తించాలి. జలతత్త్వం ఇలా ప్రవర్తించాలి. అగ్నితత్త్వం ఇలా ప్రవర్తించాలి. వాయుతత్త్వం ఇలా ప్రవర్తించాలి. ఆకాశతత్త్వం ఇలా ప్రవర్తించాలి అని. "భూతానాం ఈశ్వరోపిసన్".

ఈ నియమాలన్నీ నువ్వే ఏర్పరుచుకున్నావ్. చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి అది. ఇంకోళ్ళెవరో ఏర్పరచలేదు. కృష్ణుడు ఏర్పరచలేదు. ఆ పరబ్రహ్మ ఎక్కడో వైకుంఠంలో కూర్చున్నవాడు ఏర్పర్చలేదు.

నువ్వే ఏర్పరచుకున్నావ్ ఆ నియమాలని.

నేను అనుకున్నాను ఇప్పుడు గంటన్నరసేపు కూర్చుని భాగవతం చెప్తాను అని. ఫోన్‌కాల్ వస్తుంది. వెళ్ళాలా వద్దా? నీ నియమం, నువ్వు ఏర్పరచుకున్న నియమమేగా అది.

"నేను ఈ నియమం ఏర్పరచుకున్నాను, ఖచ్చితమైన నియమం, నేను వెళ్ళను" అనుకున్నప్పుడు ప్రోగ్రామ్ బాగా జరుగుతుంది, అందంగా జరుగుతుంది, అనుకున్నట్టు జరుగుతుంది. ఫోన్ వచ్చింది, వెళ్ళిపోయాను. ఓ.కె. అప్పుడు ఈ ప్రోగ్రామ్ ఏమవుతుంది? పోయే కదా! అంటే నియమాలు మార్చుకోవచ్చు. కాని మార్చుకోము. ఎందువల్ల? ఆట అందం పోతుంది. అర్థమౌతోందా ఉదాహరణ? అందుచేత మనమే నిర్ణయించుకుంటున్నాం,

"ఇన్నాళ్ళు జీవిస్తాను, ఇన్నాళ్ళు రోగంతో జీవిస్తాను, ఇన్నాళ్ళు ఆనందంగా జీవిస్తాను, ఇన్నాళ్ళు ఉద్యోగం లేకుండా జీవిస్తాను, ఇన్నాళ్ళు ఉద్యోగంతో జీవిస్తాను" అని. సరే ఏర్పరచుకుంటావ్ ఇది. ఏర్పరచుకున్న తరవాత ఈ గురుతత్వం ఏం చేస్తుందో చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. భాగవతం చదవటానికి ఒక విశేషమైన అర్హత కావాలి. ఆ అర్హత ఉన్నవాళ్ళే వింటారు. లేకపోతే వినరు. మీరు వింటున్నారు అంటే అర్హత ఉన్నట్లే లెక్క. ఏంటా అర్హత అంటే -

పంచతత్వాలు మీద ఆధిపత్యం సాధించుకోగలిగే స్థితికి వచ్చినవాళ్ళే

భాగవతం వింటారు.

అందువల్లే ఇన్నాళ్ళూ భాగవతం మరుగున పడిపోయింది. భగవద్గీత చెప్తూ వచ్చారు మనుష్యులు, అన్నీ చెప్తూ వచ్చారు కాని, భాగవతాన్ని ఈ మధ్యనే చెప్పటం మొదలెట్టారు. గురుదేవులు శ్రీరామశర్మ ఆచార్యకి అది ఒక తీరని కోరిక, నిరంతరమూ భాగవత సప్తాహాలు, సంవత్సరానికి 52 వారాలూ జరగాలని. ఒకసారి అన్నారు కూడా.

ఎందుకు? ఆ స్థితిలో ఉన్నప్పుడు భాగవతం వింటారు మీరు. కాని మళ్ళా



మధ్యలో మర్చిపోతూ ఉండొచ్చు. దానికేముంది? మిమ్మల్ని మౌనంగా ఉండమంటాను ఆశ్రమంలో, మర్చిపోతూవుంటారు. మర్చిపోయి ఏంచేయాలి మళ్ళా? మళ్ళీ మొదలెట్టు కుంటారు. మనం ఏర్పరచుకున్న నియమాలే. కాని ఆ నియమాల్ని ఎప్పుడైనా బ్రేక్ చెయ్యొచ్చు. పృథ్వీతత్వం- పృథ్వీతత్వంలాగ ప్రవర్తించకుండా గాలిలో తేలిపోవచ్చు. గురువులు అది చేస్తారు. సాయిచరిత్రలో మీకు కనిపిస్తోందికదా! అందుచేత సాయియే అలా చేయగలడనా మీ ఉద్దేశ్యం? మీరూ చేయగలరు. సాయి అభ్యాసం చేసుకు న్నాడు. 12 సంవత్సరాలు అభ్యాసం చేశానన్నాడు సాయి. ఆ అభ్యాసమే మీకు వివరిస్తు న్నాను. ఏమిటా అభ్యాసం?

1. నిరంతరమూ గురువుని ఆజ్ఞాచక్రం దగ్గర చూసుకోవటం.

ఆ గురువు యొక్క చరిత్ర మనం చదువుకుంటున్నాం. మీలో ఉన్న గురువు, నాలో ఉన్న గురువు, ప్రతీ కణములో ఉన్న గురువు యొక్క స్వభావాన్ని మనం నేర్చుకుంటున్నాం.

ఎందుకు నేర్చుకుంటున్నాం?

దాన్ని చదివితే అలా చేయాలన్పిస్తుంది. అలా చేయాలనిపిస్తే చేస్తాం. చేస్తే ఫలితాలొస్తాయి. అందుచేత మీరు నీరసించిపోకండి. భయపడకండి ఎప్పుడూ కూడా. సింహం పిల్ల కథ చెప్తూ చెప్పాను ఇదంతా కూడా.

ఆ సింహం పిల్ల ఏం చేసింది?

సింహాన్ని చూసి పారిపోయింది. సింహం దాన్ని పట్టుకుంది. మ్మెమ్మెమ్మె అందది. అది ఆ మ్మెమ్మెమ్మెకూడా సరిగా అనలేదు. దానిది సింహగర్జన స్వరమాయె! ఎక్కడ పెరిగింది అది? గొర్రెల్లో పెరిగింది. అందుచేత కష్టాలు రాగానే మ్మెమ్మెమ్మె అనటం తెలుసు తప్ప గర్జించడం రావటంలేదు. రామరక్షా స్తోత్రంలో ఉంది.

భర్జనం భవబీజానామర్జనం సుఖసంపదామ్ ।
తర్జనం యమదూతానాం రామరామేతి గర్జనమ్ ॥

అందుచేత జీవితంలో గర్జించటం నేర్చుకోండి ఇది చదివితే. మ్మెమ్మెమ్మె అనొద్దు ఆ గొర్రెపిల్లలాగ. కాని సింహం పిల్లే అది. కాని అది ఎంత ఏడ్చిందో మీకు ఊహ ఉందా అసలు? "నా గొంతుక ఇలా ఉంది, మిగతావాళ్ళ గొంతుక ఎంత బావుందో, మ్మెమ్మెమ్మె అంటున్నాయి అవి. నేనేమో హ్హా అంటున్నాను" అని. దాని గొంతుక మార్చుకుందామని ఎన్ని రకాలుగా ప్రయత్నించిందో కాస్త మీరు ఊహించ వచ్చు ఎంతమంది ఇ.యన్.టి. డాక్టర్లను కలిసిందో!

కాని ఇప్పుడు ఏమైంది? ఆ సింహం దాన్ని పట్టుకుంది. పట్టుకున్న తరవాత నువ్వు ఆగు ఒక్క క్షణం, నువ్వు ఆరవకు. ఒక్కసారి నీళ్ళల్లోకి చూడు అంది. నీళ్ళల్లోకి చూస్తే ఏముంది? ఆ తరవాత అది ఏం సాధనలు చెయ్యాలి సింహంగా మారటానికి. ఆ సింహప్పిల్ల ఏం సాధనలు చెయ్యాలి? చెయ్యాలా ఏమైనా సాధవలు? అందుకే సాయి ఏమన్నాడు?

నన్ను మంత్రం అడుగుతారేంట్రా బాబూ, నన్ను అనుష్ఠానాలు అడుగుతా రేంట్రా బాబూ, నేనేం చెప్పేది అని వాపోయాడు. "కాదండి నా చెవులో మంత్రం చెప్పండి, లేకపోతే భోజనం మానేస్తా"నని బెదిరించే వాళ్ళు వచ్చారు పాపం అయన దగ్గరికి. "సరే, నీ ఆట నువ్వే ఆడుకో" అన్నాడు. ఎందుచేత?

ఆయన దృష్టిలో ఇది ఆటేగా! నీకు ఇది ఆటగా అవగాహన అవ్వాలి. ముందు అవగాహన వచ్చేస్తే, అదేమైపోతుంది, ఇదేమైపోతుంది అనే టెన్షన్స్ ఉండవు మీకు. ఏదీ ఏమీ అవదు. ఎందుచేతంటే ఇవన్నీకూడా భ్రమలు మాత్రమే. కాని చెప్తే అర్థం కాదది. వినగా, వినగా, వినగా, వినగా మీకు అర్థం అవుతుంది ఇదంతా భ్రమలు మాత్రమే అని. ప్రతిరోజు రాత్రి ప్రకృతి మీకు చెప్తోంది, ఇదంతా భ్రమ అని. పడుకున్నారు, పడుకున్న తరవాత సృష్టి ఏది? లయమైపోయింది, సృష్టి మొత్తం లయమైపోయింది.

మీ రోగం లయమైపోయింది, మీ శత్రువులు లయమైపోయారు, మీరు కూడా లయమైపోయారు. మీరున్నారా నిద్రలో? గాఢనిద్రలో మీరు లేరు, మీరూ



లయమైపోయారు. మరి ఇంతకీ మీకు సృష్టి ఉన్నట్టా, లేనట్టా? నిద్రాస్థితిలో మీకు ఏదీ లేదు. సృష్టి ఉన్నట్టా, లేనట్టా అంటే, సృష్టి ఉంది. కాని అది మీకు లేదు. మీరు మళ్ళా ఆ ఆటలో పాల్గొదల్చుకున్నారనుకోండి, మెలకువ వస్తుంది. మీరు ఆటలో పాల్గొనదల్చుకోలేదనుకోండి, చనిపోతారు. ఇంతకీ చనిపోవటం మంచిదా, చెడ్డదా?

డెత్ ద గ్రేట్ ఎడ్వెన్‌చెర్ అని జ్వాలాకూల్ మహర్షి ఒక పుస్తకం వ్రాశాడు.

యా నిశా సర్వభూతేషు తస్యాం జాగర్తి సంయమీ ।
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥ (భ.గీ. 2-69)

భావం: సమస్త ప్రాణులకును ఏది రాత్రియై యున్నదో, దానియందు ఇంద్రియ నిగ్రహపరుడగు యోగి మేలుకొనియుండును. దేనియందు ప్రాణులు మేలుకొనియున్నారో **అది పరమార్థతత్త్వమును దర్శించు మునీంద్రునకు రాత్రిగా నుండును.**

మెలకువగా ఉన్నవాడికి రాత్రి లేదు. రాత్రి ఉన్నవాడికి మెలకువ లేదు. ఆ మెలకువ ఈ క్షణంలో అయినా వచ్చేయొచ్చు మీకు. ఒక్క క్షణంలో ఈ భాగవతం విని మారిపోయిన వాళ్ళున్నారు.

మారిపోవటానికి ఏం ఉంది? మీరు అలా ఉండిపోండి నిరంతరమూ, ఈ వారం అంతా ఇది అభ్యాసం చేసుకోండి, ఈ భావనలు వినండి. విని మర్చిపోకండి. ప్రతిమాటా కూడా మిమ్మల్ని నిద్ర లేపటానికే ఉపయోగిస్తున్నాను నేను. రేపు ప్రాబబ్లీ నేను అనుకున్నట్టు జరిగితే ప్రపంచం అంతా ఇది వింటుంది.

ముందు మీరు నిద్ర లేవాలి. మీరు ఈ శరీరాలు కాదు. "స్వ మాయయా". మీరే ఇది కల్పించుకొన్నారు. కల్పించుకొన్న తరవాత నేను అక్కడే ఉంటాను అంటారు. దానికి గురుదేవులు ఒక ఉదాహరణ ఇచ్చారు. ఒకడు కావాలని తలుపు తాళం వేసుకున్నాడు లోపల్నుంచి. స్నేహితులు ఉంటారు కదా అల్లరివాళ్ళు. వాళ్ళేం చేశారు తాళం వేసుకుంటే వేసుకున్నావుకాని, తాళం మాకిచ్చేయ్ అన్నారు. వీడికి ఉక్రోషం వచ్చి ఏంచేశాడు? కిటికీలోంచి తాళం బయటకి విసిరేశాడు. ఇంక బయటకి రమ్మనండి

వాడ్ని? తాళంచెవి మర్చిపోయాం. ఆజ్ఞాచక్రం దగ్గరుంది ఆ తాళంచెవి.

అక్కడ మీరు ఉండకుండా మిగతా అన్ని చోట్లా అంతా వెతుకుతాను అంటే తలుపు తెరుచుకోదు. అక్కడ ఉండాలి అంటే ఈ పంచతత్వాల మీద ఆధిపత్యం ఉండాలని అర్థమౌతోంది కదా మీకు.

మూలాధారం దాటివుండాలి. ఎందుచేతంటే, వాసనలకి అతీతంగా ఉండాలి. ఏ వాసనలు? సువాసనలు, దుర్వాసనలు కాదు. మీరు శరీరం ధరించటమే వాసనల వల్ల. మీ యొక్క పూర్వ వాసనల వల్ల శరీరం ధరిస్తారు. ఆ మాత్రం థియరీ మీకు తెలుసుకదా. మళ్ళీ అదీ వివరించాలా మీకు?

2. మీరు శరీరం ధరించేది - మీ యొక్క వాసనల వల్లే.

స్త్రీ శరీరం కావచ్చు, పురుష శరీరం కావచ్చు, అందమైన శరీరం కావచ్చు, అందంలేని శరీరం కావచ్చు, రోగగ్రస్తమైన శరీరం కావచ్చు, ఆరోగ్యంగా ఉన్న శరీరం కావచ్చు, 50 ఏళ్ళ తరవాత వచ్చే బట్టతల శరీరం కావచ్చు, పొడుగ్గా జుట్టున్న శరీరం కావచ్చు, పొడుగ్గా జుట్టున్న తల మధ్యలో జుట్టు ఊడిపోయే శరీరం కావచ్చు, ఇవన్నీ కూడా, **మీ వాసనల వల్ల వస్తాయి - మీ అలవాట్ల వల్ల వస్తాయి.** మరి ఇది అలవాటు చేసుకొండి. ఎందుకిది తిరిగి తిరిగి చెపుతున్నానంటే ఇదే రేపు రాబోయే జీవితంలో మానవుల యొక్క బైబిల్ అవుతుంది. ఖురాన్ అవుతుంది. భగవద్గీత అవుతుంది. ఈ నియమాలే. ఆ నియమాలు వేరే వాళ్ళు చెప్పొచ్చు, ఇంకొక భాషలో చెప్పొచ్చు, ఇంకొక సమూహం దాన్ని పాటించవచ్చు. ఇది గొప్పదని మీ కర్థమైతే మీరెందుకిది పాటించలేరు? అందుచేత మీరు ఆ నలుగురి కృష్ణుల గురించి, ఆ నాలుగు మానసిక స్థితుల గురించి తెలుసుకుంటున్నారు.

కృష్ణం నారాయణం వందే కృష్ణం వందే వ్రజప్రియం ।
కృష్ణం ద్వైపాయనం వందే కృష్ణం వందే పృథాసుతం ॥

స్త్రీ శరీరం కావచ్చు, పురుష శరీరం కావచ్చు, అందమైన శరీరం కావచ్చు,



అందంలేని శరీరం కావచ్చు, రోగగ్రస్తమైన శరీరం కావచ్చు, ఆరోగ్యంగా ఉన్న శరీరం కావచ్చు. అందుచేత అలవాట్లు లేని స్థితికి మీరు రాగలుగుతే, ఆ స్థితికి తొందరగా వెళ్తారు కనుక, ఆహార నియమాలు పెట్టబడ్డాయి.

ఆహార నియమాలు ఎందుకూ అంటే - నేను రుచికి బానిసగా తింటాను, కాని ఆ గురుచేతనత్వం రావాలి అంటే ఎలా వస్తుంది? ఈ చిన్న అలవాటే మీరు మానుకోలేకపోతే ఆ పెద్దదాన్ని ఎలా పొందుతారు? అది అర్థం చేసుకోండి ఎప్పుడూ కూడా. అందుచేత ఆహారనియమాలు చాలా అవసరం. చెప్పిన నియమాలన్నీకూడా భాగవతం కోసమే చెప్పాను.

అది మీరు పాటించగలిగారు కనకే, ఇది నేను మొదలెట్టగలిగాను.

కాని పాటించటానికి మళ్ళీ కొన్ని అడ్డంకులు తెచ్చుకున్నారు మీరు. ఆ అడ్డంకులు పోగొట్టుకోండి. ఆహారనియమాలు సామూహికంగా పాటించాలి. అన్ని చోట్లా సామూహికత పాటించాలి. "ఇది సామూహికంగా" వింటున్నారుకదా! మరి అలవాటు చేసుకోండి.

### ఏంటి ఆ నాలుగు స్థితులు?

ఒకటి మీ యొక్క ఆత్మ స్థితి. మీ యొక్క నారాయణ స్థితి. మీ యొక్క వాసుదేవ స్థితి. మీ యొక్క సర్వాంతర్యామి స్థితి. ఆ స్థితికి వెళ్ళాలి అని కోరు కుంటున్నారు మీరు.

రెండవది ఏంటి? కృష్ణం వందే వ్రజప్రియం.

ఆ స్థితిని గుర్తుంచుకొని; నేను లీలామానుష విగ్రహ స్వరూపుడ్ని, లీలా పురుషోత్తముడిని అని గుర్తుంచుకొని పుట్టినటువంటి శరీరం కృష్ణుడిది. కృష్ణుడి యొక్క భౌతిక శరీరము పాంచభౌతికము కాదు. ఇది బాగా గుర్తుంచుకోండి.

కృష్ణతత్వము గురించి చెప్తున్నాను నేను. అలాంటి కృష్ణతత్వము ఉన్నవాళ్ళు చాలా మంది పృథ్వి మీద ఈనాడూ జీవించి ఉన్నారు. కాని వాళ్ళ శరీరాలు మనలాగ

పాంచభౌతికమైనవి కాదు. ఎందుచేత? వాళ్ళకి తెలుసు. ఏమని?

*అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్।*
*ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా॥ (భ.గీ. 4-6)*

**నేను పుట్టుకలేనివాడను, నాశరహితస్వరూపము కలవాడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను అయినప్పటికి స్వకీయమగు ప్రకృతిని వశపఱచుకొని నా మాయాశక్తిచేత పుట్టుచున్నాను**

**ఆ భావనతో పుట్టినటువంటి వ్యక్తి కనుక, కృష్ణం వందే వ్రజప్రియం.**

ఎక్కువ మంది గురువులు కృష్ణస్థితిలో ఉంటారు. అందుచేత వాళ్ళందరూ కూడా జగద్గురువులే, శ్రీకృష్ణులే. కృష్ణుడే కాదు, ఆ స్థితిలో ఉన్న వాళ్ళందరూ కూడా. ఇంజనీరింగ్ చదివిన వాళ్ళంతా ఇంజనీర్లే. డాక్టరీ చదివిన వాళ్ళందరూ డాక్టర్లు. ఈ కృష్ణతత్త్వం తెలిసిన వాళ్ళందరూ జగద్గురువులే. అంటే ఏంటి? వాళ్ళ లీలలు. ఒకేసారి అనేక చోట్ల ఉండగలగటం, ఏదైనా అంగం ఖండం అయిపోతే, మళ్ళా అలాగే మార్చేసుకోవటం, ఇవన్నీ అందరి గురువుల చరిత్రలలోనూ ఉంది కదా! ఆహారం తగ్గితే, దానిని హెచ్చింపుచేయటం, చనిపోయిన వాళ్ళని బ్రతికించటం.

"మరి చనిపోయిన వాళ్ళందర్నీ వాళ్ళు బ్రతికించేయొచ్చు కదా" అని మీరు ప్రశ్నించవచ్చు. ఈపాటికి మీకు అర్థమైవుంటే జవాబు మీకు వచ్చే వుంటుంది. నువ్వు వేసుకున్నటువంటి డ్రామాయే అదంతా. నేనేం చేసేది?

నాకు తెలియకూడదనుకున్నావ్ నువ్వు, తెలియటం లేదు. నాకు తెలియాలి అనుకున్నావు, తెలియటం మొదలెడుతుంది. నువ్వు ఏర్పరచుకొన్న నియమాలివి. ఇది చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోండి. అందుకే ఉపనిషత్తులలో పదేపదే చెప్తాడు

**మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయో:**
*మనస్సే బంధానికికాని, మోక్షానికి కూడా కారణం.*

అంత తెలిశాక మనస్సుని లొంగదీయటానికి ఈ నియమాలన్నీ మనం పెట్టుకుంటున్నాం - మౌనం అని, ఆజ్ఞాచక్రం దగ్గరే చూస్తూవుంటాం అని, కలిసి భోంచేస్తాం



అని, ఒకవేళ కాలాతీతం అయిపోతే భోంచేయమని. మరి నీరసం వస్తుంది కదా మాస్టారు! నువ్వు ఏర్పరచుకున్న నియమది, భోజనం చేయక పోతే నీరసమొస్తుందని.

ఈనాడు కూడా ఒక నాలుగైదు ఏళ్ళ క్రిందట పత్రికలో పడింది, ఒక వ్యక్తి సూర్యకిరణాల్ని మాత్రమే ఆహారంగా తీసుకొంటున్నాడని. ఆ వ్యక్తి భోజనం ఏమీ చేయటం లేదని. మరి వాడికేం నీరసం లేదే!

అందుచేత ఆహారం తింటే నీరసం పోతుంది అనే భ్రమ నువ్వు ఏర్పరచుకున్న నియమం. నీ లీల.

## స్వలీల ఎప్పుడౌతుంది?

వ్రజప్రియం. వ్రజభూమిలోని వారికి ప్రియమైన వాడు. కృష్ణ చేతనత్వం యొక్క రెండవ చరణం. ఇది ప్రతి గురువుకీ వర్తిస్తుంది. క్రీస్తుకీ వర్తిస్తుంది. గురుగోవింద్ సింగ్‌కి, మహమ్మద్‌కి వర్తిస్తుంది. పుట్టారు శరీరంతో. తరవాత వాళ్ళకి అర్థమైంది, ఈ శరీరము యొక్క అధిపతులం మేమే అని. అలా ప్రతీ యోగికీ వర్తిస్తుందిది. అందుచేత "కృష్ణం వందే వ్రజప్రియం" అనేది గురువులందరికీ వర్తిస్తుంది. దీని తరవాతవి సాధులకి వర్తిస్తాయి. అవి ద్వైపాయన, అర్జున స్థితులు.

కృష్ణం ద్వైపాయనం వందే. ద్వైపాయనుడు అంటే వ్యాసుడు. వ్యాస చేతనత్వ స్థితి.

**వ్యాసుడు యొక్క లక్షణం ఏమిటి?**

వేదాలను క్రోడీకరించాడు. మహాభారతం వ్రాశాడు, ఉపనిషత్తులు వ్రాశాడు, 24 స్మృతులు, 24 గీతలు, 108 ఉపనిషత్తులు, ఇవన్నీ వ్రాశాడు.

అంత జ్ఞానం మనం సంపాదించుకోగలిగే మానసికస్థితిలో ఉన్నామా? ఖచ్చితంగా ఉన్నాం. భాషలు మారుతున్నాయి కాని, వేదాలు మనమూ చదువు తున్నాం. సంస్కృతంలో చదువుకోవటం లేదు, తెలుగులో చదువుకుంటున్నాం.

**ద్వైపాయనం అంటే ద్వంద్వం ఉన్నటువంటిది.**

అంటే ఏంటి? ఇదీ తెలుస్తుంది, అదీ తెలుస్తుంది. అందుకే అతనికి దుఃఖమూ ఉంది, సుఖమూ ఉంది. శుకమహర్షి వెళ్ళిపోతుంటే మరి ఆయన ఏడ్చాడు కదా! మరి దాని అంతరార్థం ఏంటో, ఇప్పుడు మనం డిస్టర్బ్ కావద్దు. ఫండమెంటల్స్ అర్థం చేసుకోవటానికి చెప్తున్నాను నేను.

కృష్ణం-ద్వైపాయనం అంటే ఏంటి?

ద్వంద్వం ఉంది. రాత్రి ఉంది, పగలూ ఉంది. ఇదంతా విన్నప్పుడు మీకు హుషారు వచ్చేసి, నేను ఆత్మని అనుకుంటారు, బయటకెళ్ళిపోగానే నీరసపడిపోతారు. ఇక్కడ సింహమే, అక్కడికి వెళ్ళేసరికి మేక. అక్కడ నిత్యజీవితంలో ఆ సింహంలాగ గర్జించండి. గర్జించటం మొదలెట్టి మేకల్ని తినేయకండి. ఎందుచేతంటే అవి కూడా మేకలు కాదు, అవి కూడా సింహాలే. వాటికి తెలియటం లేదు అంతే. అందుచేత మీరు సింహం అయిపోయి, అవి మేకల్లాగా కనిపించాయనుకోండి, మీకేం దృష్టి రాలేదని అర్థం. అర్థమైందా? గొర్రెల్ని తింటానికి సింహం ఎగిరింది. కాని గొర్రెల్ని తినలేదు, కానీ ఎవర్ని పట్టుకుంది అది? సింహం పిల్లని పట్టుకుని తిన్నదా, లేకపోతే దాని అసలు స్వరూపాన్ని గుర్తుచేసిందా? మరి మీరది చేయాలి. అంతేతప్ప మీరు బయటకెళ్ళిపోయాక, మీరందరూ నేను చెప్పినట్టు వినండి వాళ్ళు మేకలవ్వాలి, మీరు సింహం అవ్వాలి. కుదరదది. వారిని జాగృతం చేయాలి.

వయం రాష్ట్రే జాగృయామ పురోహితాః

అందుచేత అన్ని కోణాలలోనూ మీరు ఆలోచించటం నేర్చుకోవాలి. ద్వైపాయనం అంటే అర్థం అది. ద్వంద్వంలోనే ఉన్నాడుకాని, వాడికి అవగాహనుంది, నేను ఎలాగైతే ద్వంద్వంలో ఉన్నానో, అందరూ కూడా అదే ద్వంద్వంలో ఉన్నారు, ఎవరి ఆట వాళ్ళు ఆడుకుంటున్నారు అని. ఈ జ్ఞానం వచ్చిన తరవాత ఏం చెయ్యాలి? ఇంక యుద్ధం చెయ్యాలి. దేనితో యుద్ధం చెయ్యాలి?

ఈ ద్వంద్వ ప్రవృత్తితో యుద్ధం చెయ్యాలి. మహాభారత యుద్ధంలో అర్జునుడు



పాత్ర వెయ్యాలి. అందుచేత మీరు చేతనత్వపు నాలుగు పాత్రలలో ప్రస్తుతం అర్జును పాత్రకి సిద్ధమౌతున్నారు. యుద్ధానికి సిద్ధమౌతున్నారు. అర్జునుడు పాత్ర నుంచి ఎక్కడికి రావాలి మీరు? వ్యాసుడు పాత్రలోకి వస్తారు. వ్యాసుడు పాత్రలోంచి ఎక్కడికి వెళ్తారు? జగద్గురువు యొక్క పాత్రలోకి వస్తారు. జగద్గురువు పాత్రలోకి వచ్చేశాక, చేసేదేం లేదు. చేసేదేదో ఆ జగద్గురు చేతనత్వమే చేస్తుంది.

అందుచేత ఈ ధ్యాన శ్లోకంతో మొదలుపెట్టాడు భాగవత మాహాత్మ్యం. ఒక శ్లోకంలో ఇదంతా చెప్పాడు. అందుచేత మళ్ళీ ఆ శ్లోకాన్ని నాతో పాటు ఉచ్చారణ చెయ్యండి. నేను చెప్పేక అది పలకండి.

కృష్ణం నారాయణం వందే కృష్ణం వందే వ్రజప్రియం ।
కృష్ణం ద్వైపాయనం వందే కృష్ణం వందే పృథాసుతం ॥

**అథ ప్రథమోధ్యాయః**

**దేవర్షి నారదుడు భక్తిని కలుస్తాడు. ఇది ప్రథమోధ్యాయంలోని విషయం.**

దేవర్షి నారదుడు అంటే మూడు లోకాల్లోనూ సుఖంగా తిరగ్గలిగేవాడు.

గాయత్రీ మంత్రోచ్చారణ చేసేవాళ్ళందరూకూడా నారదస్థితిలోకి వెళ్ళే వాళ్ళే.

ఇవాళ కాకపోతే రేపు, రేపు కాకపోతే ఎల్లుండి, ఎల్లుండి కాకపోతే ఇంకో జన్మలో, లేకపోతే ఇంకొన్ని జన్మల తరవాత గాయత్రీ మంత్రోచ్చారణ చేసే వాళ్ళందరూ కూడా ఏ స్థితికి వెడతారు? నారదస్థితిలోకి.

ఓం భూర్భువః స్వః తత్సవితుర్ వరేణ్యం
భర్గో దేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ ॥

ఈ మంత్రాన్ని మీరు రోజూ గంట జపం చేయమన్నాను కదా! ఈ భావనతో చేసుకోండి. నారద స్థితికి వెళ్తారు మీరు. గాయత్రీ మంత్రం చేసేవాళ్ళందరూ కూడా నారదస్థితికి వెళ్తారు. అందుచేత గాయత్రీ జపము యొక్క అతి ముఖ్యమైన ఫలితము

ఏమిటి అంటే సద్గురుప్రాప్తి.

**నారదుడు ఎవరికి గురువయ్యాడు?:-**

తరవాత అన్నీ వస్తాయి. మీరు గాయత్రీ చిత్రావళి (రచయిత పండిత శ్రీరామ శర్మ ఆచార్య, శాంతికుంజ్, హరిద్వార్ ) కనుక జాగ్రత్తగా చూస్తే, ఇప్పుడు ఇక్కడ నేను చెప్పే పుస్తకాలన్నీ మీరు దుమ్ము దులిపి బయటకి తీయండి. గాయత్రీ చిత్రావళిలో మొదటి బొమ్మే గాయత్రీ మంత్రం. దాని తరవాత బొమ్మ సద్గురుప్రాప్తి. అంటే నారదప్రాప్తి. నారదుడు ఎవరెవరికి లభించాడో, వాళ్ళంతా మహామానవులు అయిపోయారు. లేదా భగవంతుడిలో ఐక్యం అయిపోయారు.

నారదుడు రావణాసురుడితో కలిశాడు, రావణాసురుడు రాముడితో ఐక్యం అయిపోయాడు. కంసుడితో కలిశాడు, కంసుడు కృష్ణుడిలో కలిసిపోయాడు. అందుచేత నారదుడు ఎప్పుడు ఎవరి దగ్గరికి వచ్చినా వాళ్ళు నారాయణతత్త్వంలో లీనమైపోతారు. మీరూ ఆ నారాయణతత్త్వంలో లీనమైపోతారు కనుకనే అస్తమానం ఏం అంటూ ఉంటాడాయన? నారాయణ నారాయణ. అంటే ఏంటి? అసలు రూపు దాల్చిన నారాయణతత్త్వం - నారదుడు. నారము అంటే నీరు అని అర్థం. ద అంటే ఇచ్చేవాడు. అంటే నీళ్ళని ఇచ్చేవాడనా?

**నీ దాహాన్ని, ఏ దాహం ఉంటే ఆ దాహాన్ని తీర్చేవాడు.**

దాన్ని చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోండి, ఎందుకు నారదుడు మధ్య మధ్యలో వచ్చేస్తూ ఉంటాడో. నారదుడు వస్తే కాని నారాయణతత్త్వం అర్థంకాదు. ఆయనే మూర్తీభవించిన నారాయణతత్త్వం.

అతని దగ్గరున్నటువంటి వీణ ఏంటి? మహతి. భూర్ భువః స్వః తరవాత మహః. మహః అనేది ఈ మూడు లోకాల తరవాత వచ్చేది. ఆ వీణ వాయిస్తూ వుంటాడు. అంటే ఏంటి? మూడు లోకాలకీ అతీతమైన స్థితిలో ఉంటాడు. అతను భక్తిని కలిశాట్ట. అదీ మనం చదవబోతున్నాం. ఇప్పుడు భక్తి అంటే ఏంటో చాలా



జాగ్రత్తగా అర్థం చేసుకోండి మీరు. సూర్యుడు యొక్క ఏడు కిరణాలలో ఆరవ కిరణము - భక్తి. నాలుగు స్థితులులోంచి మీరు అంచెలంచెలుగా వెళ్ళాలి.

నీవు మొదట అర్జునస్థితికి రావాలి.

నీవు అర్జునస్థితి నుంచి వ్యాసస్థితికి రావాలి.

నీవు వ్యాసస్థితి నుంచి వ్రజభూమిలో పుట్టినటువంటి శ్రీకృష్ణస్థితికి రావాలి.

నీవు అక్కడ్నుంచి నారాయణతత్త్వానికి వెళ్ళిపోవాలి.

అందుచేత నారాయణతత్త్వంలో ఉన్నవాడే కదా మిమ్మల్ని నారాయణుడి దగ్గరికి తీసుకెళ్ళగలడు. అందుచేత నారదుడు ఈ స్థితి గురించి చెప్పినప్పుడు సూటిగా ప్రవేశిస్తాడు. అందుచేత మీకు కనుక మీ పాత్ర మార్చుకోగలిగే మానసికస్థితి వస్తే, ఇప్పుడే మీరు నారదుడ్ని గురువుగా వరించేయవచ్చు. నారదుడు ఎవరెవరికి గురువయ్యాడో, వాళ్ళందరూ అద్భుతమైన వ్యక్తులుగా మారారు. నారదుడు ఎవరెవరికి గురువయ్యాడు? వాల్మీకి తెలుసు కదా! ధృవుడు, ప్రహ్లాదుడు. వీళ్ళనీ స్థితికి తీసుకెళ్ళిన వాడు నారదుడు. అందుచేత ఆ స్థితికి వెళ్ళేటటువంటి స్థాయిలో మీ పాత్రలు ఉన్నాయి ఇప్పుడు. ఆ పాత్ర మీరు ఒప్పుకుంటారా, ఒప్పుకోరా? కాల్ షీట్స్ ఇస్తారా, ఇవ్వరా అన్నది మీ చేతిలో ఉంటుంది.

ఇప్పుడు హీరో దగ్గరికి వెళ్ళాడు డైరెక్టరు. అయామ్ నాట్ ఫ్రీ, నేను ఆ సినిమాలో నటిస్తున్నాను, ఆ సినిమాలో నా నటన పూర్తయ్యాకే ఈ వేషం వేస్తాను అనొచ్చు. లేదా ఏం చెయ్యొచ్చు? దీనికీ సమయాన్ని ఇవ్వొచ్చు వాడు. కాని ఆ కాల్‌షీట్ మానుకుని దీనికి సమయం ఇవ్వలేడు అన్నది మీకు అర్థమైందా? తెలుసా మీకిది? నేను చెప్తోన్న భాష అర్థమౌతోందా మీకు?

సినిమా భాషే చెప్తున్నాను నేను. హీరోలు రెండు మూడు సినిమాల్లో పనిచేస్తూ ఉంటారు. కాల్‌షీట్స్ ఇస్తారు. ఇంకో సినిమాలో వాడు నటించాలి. ఇంకో సినిమాలో ఎప్పుడు నటించగలడు వాడు? దానికి ఎక్కువ సమయం ఇవ్వాలి. లేకపోతే ఇందులో

ఏదో ఒక సినిమాని వాడు పూర్తిచేసేసుకోవాలి.

మిమ్మల్ని బాధ్యతలు నిర్వర్తించమని చెప్పేది అందుకు. నేను ఇది చేస్తా. బాధ్యతలు వదిలేస్తాను అంటే కాల్‌షీట్ దెబ్బకొడుతుంది. ఆ డైరెక్టరు కేస్ పెడతాడు నిన్ను ఆ సినిమాలోనూ నటించనివ్వడు, ఉన్న సినిమాలోంచి తీసేస్తాడు. బాధ్యతలు ఎందుకు ముఖ్యమో? అందుచేత ఇదంతా విన్నాక నేను సింహం పిల్లనని మీరు వెళ్ళిపోవచ్చు. శుకమహర్షిలాగ వెళ్ళిపోగలిగే వాళ్ళు వెళ్ళిపోతారు. మీరు వెళితే అంతకంటే అదృష్టం మీ జీవితంలో లేదు. కాని వెళ్ళిపోయాక కాలికి చిన్న రాయి గుచ్చుకుంటే నా శరీరానికి రాయి గుచ్చుకుంది అంటే కష్టాలొస్తాయి.

అందుచేత కాల్‌షీట్స్ ఇచ్చేటప్పుడు నారదుడికి కాల్‌షీట్ ఇస్తున్నాం మనం. నారదుడు సర్దుకుంటాడు పాపం, రావణాసురుడితోనే సర్దుకుపోయిన వాడు మనతో ఎందుకు సర్దుకోలేడు? అందుచేత భక్తితో నారదుడు యొక్క కలయిక గురించి చెప్తూ, ఇప్పుడున్న సృష్టిలో భక్తి యొక్క "ఓవర్ రూలింగ్ పవర్" అర్థం చేసుకొందాం.

భక్తి మనందర్నీ నియంత్రిస్తోంది. ఎవరి మీద భక్తి అన్నది వేరే విషయం. డబ్బు మీద భక్తి ఉందా? అధికారం మీద భక్తి ఉందా? నిద్రపోవటం మీద భక్తి ఉందా? నిద్రపోవటం మీద భక్తి ఉంది అని దేనితో నిరూపణ అవుతుంది? అలారం పెట్టుకుంటాం మూడున్నరకి లేవాలని. అలారం కొట్టగానే టప్‌మని నొక్కేస్తాం. దేని మీద భక్తి ఉంది? అందుచేత భక్తి ఈజ్ డామినేటింగ్. భక్తి అనే సూర్యకిరణాన్ని, క్రిస్టలైజేషన్ ప్రక్రియకు తోడ్పడే కిరణాన్ని, " మనం అర్థం చేసుకోవటానికి సాధనలో", అలవాటు అనే సూర్యకిరణంగా పెట్టుకోవచ్చు మీరు. మీరు అలవాట్లకి భక్తులు. రాముడ్ని చూసేసరికి హిందువులకి భక్తి వచ్చేస్తుంది. క్రైస్టుని చూసేసరికి భక్తిరాదు. క్రిస్టియన్స్‌కి? క్రైస్టుని చూస్తే భక్తి వస్తుంది, రాముడ్ని చూస్తే విరక్తి వస్తుంది.

ఇంతకీ ఎవరు రైటు? రైటు, తప్పుకాదు, ఇద్దరిలోనూ భక్తి ఉన్నది, అది గుర్తించండి మీరు. **భక్తి అంటే ఏంటో అర్థమైందికదా!** అలవాటు. అందుచేత ఎవరి అలవాటు మీకంటే డామినేటింగ్ అలవాటుగా ఉంటుందో వాడు మిమ్మల్ని



డామినేట్ చేసేస్తాడు. అర్థమైంది కదా! భక్తి అనే పదాన్ని చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. భక్తి అంటే ఏంటి? **భావ తీవ్రత భక్తి.** దేవర్షి నారదుడు భక్తిని కలిశాడు అని హెడ్డింగ్ ఇది - ప్రథమోధ్యాయంలో. అసలు నారదుడు ఎవడో అర్థమయింది కదా! ఎవడు నారదుడు?

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ ॥

అనే సాధన చేసుకుంటూ, చేసుకుంటూ, చేసుకుంటూ ఈ మూడు లోకాలనూ దాటినవాడు. దీనితోనే దాటతారు. ఆ మంత్రజపం చేయటానికి సమయం దొరకదు మీకు. మీరు అది అలవాటు చేసుకోండి. భక్తి లేదనేది అందుకు.

**భక్తి ఉంటే సమయముంటుంది.**

అందుచేత ఒక గంట చేసుకోమంటే మీరు ఎలా అయిపోవాలంటే, మిమ్మల్ని నేను వచ్చి బాబూ మీరు జపం తగ్గించండయ్యా, మానండయ్యా బాబూ, బాధ్యతలు ఉన్నాయి అని మీ వెంటపడాల్సింది పోయి, మీరు చేసుకోండి మొర్రో అని వెంట పడాల్సి వస్తోంది. ఎందువల్ల? భక్తులు మారాయి. భక్తి లక్ష్యం మారింది.

భక్తిని ఎందుకంత ముఖ్యమైనదిగా పెట్టాడు వ్యాసుడు?

రెండు రకాలుగా ఉపయోగించుకోవచ్చు. వ్యాసుడు రాసిన వాటిని మామూలు కథలాగ చదువుకుని, చదవగా, చదవగా మార్పువచ్చే విధానం ఒకటి. అదే పారాయణ. రెండవది జ్ఞానంతో చదువుకోవటం. అంటే, ఒక లైను, ఒక శ్లోకం చాలు మిమ్మల్ని లాగించేయటానికి. అందుచేత హెడ్డింగ్‌లోనే మనకి ఏం అర్థమవుతోంది? ఏ మంత్రజపం చేసుకోవాలి? గాయత్రీ మంత్రజపం చేసుకోవాలి.

ఏ ఉద్దేశ్యంతో చేసుకోవాలి?

నారదస్థితికి వెళ్ళటానికి. గురువు అవ్వటానికి. నీ గురువు ఏ స్థితిలో ఉన్నాడో నువ్వు ఆ స్థితిలోకి వెళ్ళటానికి. అందుచేత ఇవాళ నుంచి మీకందరికీకూడా నారదుడే

గురువు అవ్వాలి. అలా అనుకున్న వాళ్ళు **నారదుడి నుంచి దీక్ష తీసుకోండి.** మిగతా వాళ్ళు తీసుకుని మానేసినా నాకభ్యంతరం లేదుకాని, ఈ బట్టలేసుకున్నవాళ్ళు (పసుపు స్కార్ఫ్, రిస్ట్ బేండ్ ఉన్నవాళ్ళు) మీరు సీరియస్‌గా తీసుకోండి దీక్ష. కళ్ళు మూసుకోండి.

నానుంచి తీసుకోవటం లేదిది. మూడు లోకాలను దాటినటువంటి చేతనత్వం ఒకటి ఉంది. అందులో మనకి అనుమానం లేదుకదా! ఆ చేతనత్వము ఖచ్చితంగా కాలాతీతమైన చేతనత్వము, సర్వసమర్థమైన చేతనత్వము, సర్వవ్యాపక చేతనత్వము, సర్వజ్ఞ చేతనత్వము. అందులో కూడా అనుమానం లేదు కదా! అందుచేత సర్వజ్ఞ, సర్వవ్యాపి అయిన చేతనత్వము ఇక్కడకూడా ఉంది కదా! అందులోంచి తీసుకోండి ఈ దీక్షను. అతనికి మీరు బాధ్యులు. ఆ పరమేవ్యోమన్‌కి మీరు బాధ్యులు. అర్థమౌతోంది కదా! హాయిగా కళ్ళు మూసుకోండి. **నారదుడి నుంచి దీక్ష తీసుకోండి.**

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ ॥
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ ॥
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ ॥

మూడుసార్లు చెప్పాను నేను. ఈ మూడింటిని దాటి ఉన్న ఈ మహతీవీణ మీలో పలకాలి. పలికితేకదా మీరు నారదులు అవుతారు. ఈ మహతీవీణ మీ మేరు దండము. మీ వెన్నుపూసే ఈ మహతీ వీణ. దీనిని ఎవడు పలికించుకోగలుగుతే, వాడు నారదుడు అవుతాడు.

ఓం - మూలాధారం, భూర్ - స్వాధిష్ఠానం, భువః - మణిపూరకం,

స్వః - అనాహతం, అంత వరకు వచ్చారుకదా!

మహః - విశుద్ధి, జనః - ఆజ్ఞా , తపః - నీ యొక్క సహస్రారం



సత్యం - సర్వాంతర్యామి. ఉన్నది ఆ ఒక్కటే. సత్యాన్నాస్తి పరోధర్మః

ఓం భూర్ భువః స్వః - ఎంత వరకు వచ్చారు?, ఓం - మూలాధారం,

భూర్ - స్వాధిష్ఠానం, భువః - మణిపూరకం, స్వః - అనాహతం.

అంత వరకు వచ్చారుకదా!

ఓం భూర్ భువః స్వః అంటే అనాహతం వరకూ వచ్చారు కదా. అనాహత చక్రం ఏ తత్త్వం? వాయుతత్త్వం.

వాసుదేవస్సర్వమితి సమహాత్మా సుదుర్లభః *(భ॥గీ॥)*

అంతవరకు, అన్నిచోట్లా ఆ వాసుదేవుడే ఉన్నవాడు అనేటటువంటి, ఆ వాయువే ఉన్నది అనే భావన పటిష్ఠం కానంత వరకు మీరు ఇక్కడే తిరుగుతూ వుంటారు. అందుచేత గాయత్రీ మంత్రజపం ఇంతవరకు చేసుకుంటూ వుంటారు, మళ్ళా క్రిందకి వస్తూ వుంటుంది, మళ్ళా పైకి వెళ్తూవుంటుంది, మళ్ళా క్రిందకి వస్తూ వుంటుంది, మళ్ళా పైకి వెళ్తూవుంటుంది.

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ ॥
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ ॥
ఋచో అక్షరే పరమేవ్యోమన్
యస్మిన్‌దేవా అధివిశ్వే నిషేదుః ।
యస్తన్నవేద కిం ఋచాకరిష్యసి
య ఇతద్విదుః స ఇమే సమాసతే ॥

మహః - విశుద్ధి , జనః - ఆజ్ఞా , తపః - నీ యొక్క సహస్రారం, సత్యం - సర్వాంతర్యామి. ఉన్నది ఆ ఒక్కటే.

సత్యాన్నాస్తి పరోధర్మః అది నీకు తెలియకపోతే నన్నేం చేయమంటావ్

అంటుంది వేదం. నేను చెప్తున్నానుకదా, అంతా ఇక్కడే ఉందని. నాకు తెలియటం లేదండి! టీ.వీ. పెట్టుకుంటే తెలుస్తుంది అంతా ఇక్కడుందో లేదో. జెమినీ టీ.వీ. ఇక్కడేవుంది. ఈ.టీ.వీ. ఇక్కడేవుంది. రేపు ఏదైనా ప్రత్యేక కార్యక్రమాలు వచ్చాయనుకోండి ఇంకో గ్రహం నుంచి, అదికూడా ఇందులోంచే వస్తుందికదా! అందుచేత ఈ పరమేవ్యోమ్మన్‌లోనే అంతా ఉన్నది.

ఓం భూర్భువః స్వః

తత్సవితుర్వరేణ్యం - ఆ శ్రేష్ఠమైన సవితాశక్తి

భర్గోదేవస్య ధీమహి - ఏం చేయాలి ఆ సూర్యుడు? నా అంధకారాన్ని పోగొట్టాలి. భర్గో - వేపుడు వేయించినట్లు, సంస్కారాల్ని పోగొట్టాలి.

ధియోయోనః ప్రచోదయాత్ - మేమందరూ కూడా కలిసి సన్మార్గము వేపు వెళ్ళాలి.

ఎవరు? అందరమూ కలిసి. నేనొక్కడినే వెళతాను అంటే, నారదుడూ కనిపించడు, గాయత్రీ మంత్రమూ పనికిరాదు, అందుచేత నేను ఒక్కడినే అంటే గాయత్రీ మంత్రం గంగలో దిగుతోంది.

## గాయత్రీ మంత్రము సామూహిక మంత్రము.

నః అంటే మా యొక్క అని అర్థం. అంతేకాని ఏకాకిగా, ఒంటరిగా చేసుకునే మంత్రం కాదది. ఒంటరిగా చేయటానికి అలవాటు పడిపోయిన భ్రష్టులం మనం. ఎక్కడ దెబ్బతింటున్నాం? వాసనలు. మన వాసనలు అలావున్నాయి.

నా పూజ చేసుకుంటానండి! ఈ ఆశ్రమంలో నేను ఒకర్ని చూశాను వేరే ఫొటోలు పెట్టుకుని పూజచెయ్యటం. ఈ ఆశ్రమంలో ఇన్ని దేవాలయాలు ఉంటే, మళ్ళా నాది ఆ దేవతా ఫొటో అంటారు. "మీ దగ్గరకి వస్తున్నాంకదా మాస్టారు, మా దేవుడికి నైవేద్యం పెట్టిరావాలా?" అని నన్ను చాలామంది ప్రశ్నిస్తూవుంటారు. ఏంటా



మూర్ఖత్వం? మీ దేవుడు, మా దేవుడు ఏంటి, అంతా ఒకడే దేవుడు అని చెప్తూవుంటే. మీరు నోటితో ఒకటి అంటూ, ఇంకోటి చేస్తున్నారు. మరి ఆ మూర్ఖత్వం వదులుకోండి.

నారదుడు రావణాసురుడు దగ్గరికి వెళ్ళాడు, ఋషులు దగ్గరికీ వెళ్ళాడు.

తేడా అర్థం చేసుకోండి. ఋషులు రావణాసురుడు దగ్గరికి వెళ్ళలేదు. రావణాసురుడికీ, ఋషులకీ పడదు. కాని నారదుడుకో? ఇద్దరితోనూ పడింది. వాడిబాగూ చూశాడు, వీడిబాగూ చూశాడు. వాడు శత్రువు అని చెప్పి, శత్రుకూటమి వాడు మాట్లాడనన్నాడా? వాడికి వార్నింగ్స్ మీద వార్నింగ్స్ ఇచ్చాడు పాపం. "నువ్వు చూసుకోరా నాయనా, జాగ్రత్త. పాడైపోతున్నావురా!" అని.

కాదు, మేం పాడైపోతాం! అంటావు. ఎక్కడికి పోతావ్? సర్వాంతర్యామిని వదిలేసి ఎక్కడికి పోతావ్? మళ్ళా ఇక్కడే కలుస్తావ్. భ్రష్టుపట్టి, మళ్ళీ ఎన్ని జన్మలు తరవాతో కాని, మళ్ళా ఈ మానసిక స్థితులు రావు. ఆ మానసిక స్థితి సరిగ్గా ఉండటానికే గాయత్రీ మంత్రం చెయ్యాలి. అందుచేత గాయత్రీ మంత్రం అందరూ చేసుకోవచ్చా, చేసుకోకూడదా? అదో పిచ్చి ప్రశ్న.

నువ్వు భగవంతుడిలో లీనమవ్వాలి, భగవద్దర్శనం కావాలి, నేను మంచిగా ఉండాలనుకుంటే, గాయత్రీ చెయ్. నేను మంచిగా ఉండను! గాయత్రీ చెయ్యకు.

ఆడవాళ్ళు చెయ్యొచ్చా, మగవాళ్ళు చెయ్యొచ్చా? హాయిగా నిస్సంకోచంగా చేసుకోవచ్చు. ధియోయోనః ప్రచోదయాత్ మీద ఒత్తిడి ఇవ్వండి. మేమందరం కలిసి జీవించాలి. ఒంటరిగా జీవించకండి. వేరుగా జీవించకండి. కుటుంబాలలో కాని, బయట కాని కలిసి జీవించటం నేర్చుకోండి.

"కలవటం లేదండి!" ఫోన్ల మీద ఫోన్లు వస్తాయి. నాకో ఫోను వచ్చింది. మీరు వినే ఉంటారు.

"నేను కలవాలని కోరుకుంటున్నాను మాస్టారు, వాళ్ళు కలవటం లేదు". అదీ ఫోన్‌లో వాళ్ళు చెప్పేది. ఈ మాట నిజమా? "నేను కలవాలని కోరుకుంటు

న్నాను, కాని కుటుంబం వాళ్ళు కలవటం లేదు మాస్టారు" అని ఏడుపు. నువ్వు కలవాలి అనుకున్నప్పుడు నీ ఇష్ట ప్రకారం వాళ్ళు ఎందుకుండాలి? వాళ్ళిష్ట ప్రకారం నువ్వు ఉంటే అయిపోయేదిగా! మనం మారం. వాళ్ళు మారాలి.

మీరుకూడా అలాంటి తప్పులే చేస్తారు. నేను మళ్ళా నోర్మయ్ అని అరవాల్సి వస్తుంది. కలవాలి అనుకున్నప్పుడు నీ ఇష్ట ప్రకారం వాళ్ళు ఉండాలి అనుకోవద్దు. కలవాలి అనుకున్నప్పుడు ఏం నిర్ణయించుకొని వెళ్తాం మనం? వాళ్ళ ఇష్ట ప్రకారం నేను జీవిస్తాను అని. అలా జీవించండి. అందుచేత ఈ గాయత్రీ మంత్రం చేస్తున్నప్పుడు

*ఓం భూర్ భువః స్వః తత్సవితుర్వరేణ్యం*
*భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ ॥*
*ఓం భూర్ భువః స్వః తత్సవితుర్వరేణ్యం*
*భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ ॥*
*ఓం భూర్ భువః స్వః తత్సవితుర్వరేణ్యం*
*భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ ॥*

ఈ గాయత్రీ మంత్రము రూపు దాల్చినటువంటి స్వరూపము, జగద్గురు స్వరూపము, నారద స్వరూపము, నారాయణతత్త్వము, భక్తిని కల్పింది.

భక్తికి ఒక పెద్దరోగం ఉంది. ఆ రోగం ఏంటంటే, క్రిస్టలైజ్ అయిపోతుంది.

ఒకడి మీద భక్తి ఉంటే, ఆ భక్తి ఎంత వరకు వెళ్ళిపోతుందంటే, రెండవ వాళ్ళ వైపు చూడడు. శివుడి మీద భక్తుంటే, కేశవుడి వైపు చూడడు. నాకు ఇక్కడే, ఈ లోకంలోనే శివాలయానికి వెళ్ళని సన్యాసులు తెలుసు. సన్యాసులు అంటేనే శివుడు ఆరాధ్యదైవం అవుతాడని నా ఊహ. నాకు ఈ విషయంలో అంత అవగాహన లేదు. కాని నాకు తెలుసున్నంతవరకు శివుడు సన్యాసులకి ఆరాధ్య దైవం. కాని ఆయన సన్యాసి అయినప్పటికీ కూడా శివాలయంలోకి వెళ్ళడు. వెళ్ళకూడదు. తప్పా, ఒప్పా?



ఆ మహానుభావుడ్ని నేను కించపర్చటం లేదు. భక్తి యొక్క పరాకాష్ఠ అది. హనుమంతుడికీ అదే రోగం ఉంది. కృష్ణుడిలో ఉన్న రాముడ్ని గుర్తించలేక పోయాడు. కృష్ణుడ్ని రాముడిగా ఎప్పుడు గుర్తించగలిగాడు? మళ్ళీ కృష్ణుడు రాముడిగా దర్శనం ఇస్తే. అది భక్తి. అంటే నువ్వు ఏది నమ్మావో, అది తప్ప ఇంకేదీ బుర్రకెక్కదు.

ఆ కాలము అయిపోయింది. ఆ కాలం దాటిపోయింది. ఇప్పుడు మీకు భక్తి అక్ఖర్లేదు. ఇంక జ్ఞానం కావాలి. భక్తి అనవసరం. మేం గాయత్రీ చేస్తున్నాం కనుక ఇంకోటి చెయ్యం. ఈ గురువుని నమ్మాను కనుక ఇంకో గురువు దగ్గరికి వెళ్ళను. వెళ్ళవు, ఎందుకంటే నువ్వు ఎదగలేదు కాబట్టి. ఏ విధంగా అయితే తేనెటీగ అనేక పువ్వుల నుంచి తేనెను ఎలా సంగ్రహిస్తుందో, అదే విధంగా నువ్వు అనేక మంది గురువుల నుంచి జ్ఞానాన్ని సంగ్రహించు అని గురుగీతలో చెప్తాడు. ఆ శ్లోకం వ్రాసి ఇక్కడ పెట్టండి ఇవాళ సాయంత్రం. గురుగీతలో ఉందా శ్లోకం-

మధులుబ్ధో యథాభృంగః పుష్పాత్పుష్పాన్తరం వ్రజేత్ ।
జ్ఞానలుబ్ధ స్తథాశిష్యో గురోర్గుర్వన్తరం వ్రజేత్ ॥ (గురుగీత ॥ 89 )

తుమ్మెద మధువు కొరకు ఒక పుష్పం నుండి వేరొక పుష్పాని కెళ్ళినట్లుగా శిష్యుడు గురువుల వద్ద కెళ్ళి జ్ఞానాన్ని సంగ్రహించాలి.

## ఏం అభ్యాసం చేసుకోవాలి ?

గాయత్రీ మంత్రాన్ని, నారదుడ్ని గురువుగా పెట్టుకొని అభ్యాసం చేయాలి. నారదుడ్ని గురువుగా పెట్టుకోవటానికి గాయత్రి చిత్రావళిలో ఉన్నటువంటి ఫొటో తీసుకోండి. దాన్ని ఎదురుగుండా పెట్టుకోండి. దాన్ని ఎలా చేస్తారో కాస్త బాగా తయారు చేయండి. మెట్లున్నాయి, నారదుడు మహతీవీణ పట్టుకొని ఎక్కుతూ వుంటాడు, వెనకాతల శిష్యుడు ఎక్కుతూ వుంటాడు. ఆ బొమ్మ చూసుకోండి. ఆ బొమ్మ మీ అందరికీ కూడా ఆరాధ్యదైవం అవుతుంది.

"అరె, నాకు వీలు దొరకలేదు మాస్టారు" అనకండి. మళ్ళా మళ్ళా నా చేత

చెప్పించుకోకండి. ఒక వారం సమయమిస్తున్నాను కదా, నేను చెప్పినవాటికి. ఇంకోటేం చెప్పాను?

మీ మానసికస్థితి మార్చుకోండి. సింహంలాగ జీవించండి. మేకల్లాగ జీవించకండి. ఈ సృష్టి మీరు సృష్టించింది. ఈ నియమాలు మీరు ఏర్పరచుకొన్నవి. కాని నియమాలు తప్పుతే సృష్టి తప్పుతుంది కదా! సృష్టి తప్పుతే ఆట పోతుందికదా!

అందుచేత మీరు ఈశ్వరులైనప్పటికీ కూడా మీ పాత్రలే మీరు సరిగా నటించండి.

రాజ్‌కపూర్ ఉదాహరణ గుర్తుంచుకోండి. వాడే అంతా అయినప్పటికీకూడా పఠాన్ బయటకి నెట్టివేస్తూవుంటే ఏం చేశాడు? సరిగా నెట్టలేదట వాడు. అప్పుడు వాడ్ని తీసి ఇంకోడికి ఆ వేషం ఇచ్చాడు, నెట్టటం కూడా రానివాడికి నీకెందుకయ్యా ఈ వేషం అని. ఎందుచేత? బాధ్యత సరిగా నెరవేర్చుకోలేదు కనుక. అది కూడా గమనించుకోండి.

**సింహంవలె జీవించాలి. బాధ్యతలను మర్చిపోకూడదు. నియమాలు మార్చం.** పకృతిలో నాకు ఇదొచ్చేసింది కదా, హం హూట్ అని మార్చేస్తాను అంటే మీరు, అలా జరగదు. ఎందుచేతంటే, మీరు ఆ ప్రమాదం చేస్తారనే నారదుడు రాడు. మీకు ఆ శక్తి ఇచ్చేస్తే మీరు వెనువెంటనే మార్చేసుకుంటారు, మీ ఇష్టం వచ్చినట్టు. మీకు ఇష్టం వచ్చినట్టు మారిస్తే ఎట్లా సృష్టిని. అర్థమౌతోంది కదా. బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించండి.

**గాయత్రీ మంత్రాన్ని ఎలా జపం చేస్తారు?**

మూలాధారం నుంచి ఓం భూర్ భువః స్వః వరకూ వచ్చాక, అక్కడ (అనాహతం వద్ద) ఉన్నటువంటి సూర్యకిరణాలు నెత్తురు ద్వారా, మన రక్తప్రసరణ ద్వారా, రక్తప్రసరణ ఎక్కడ జరుగుతోంది? మొత్తం శరీరంలో జరుగుతోంది కదా! అక్కడ మొత్తము భర్గోదేవస్య ధీమహి. మొత్తం శరీరము కాంతివంతం అయిపోతోంది అనే



భావన చేసుకోండి. చేసుకున్నాక ఏం చేయాలి?

ధియోయోనః ప్రచోదయాత్ - మేమందరమూ కలిసి జీవించాలి.

ఎవరు మేము?ఇక్కడున్న వాళ్ళు. మనము, ఈ ఆలోచనలు ఉన్నవాళ్ళు. ఈ ఆలోచనలు లేనివాళ్ళకి మీరు వెళ్ళి చెప్పక్కర్లేదు. నేను చాలాసార్లు చెప్తున్నాను. ఈ ఆలోచనలున్న వాళ్ళు దారితప్పుతే, మళ్ళీ ఈ స్థితికి రావటానికి కొన్ని జన్మలు పడుతుంది. మళ్ళీ మళ్ళీ దీన్ని అర్థం చేసుకోండి.

ఈ మానవశరీరంలో పుట్టారు మీరు. చిన్న చిన్న ఈర్ష్యలు, ద్వేషాలు, అహంకారాలతో మీకు వచ్చిన అవకాశాన్ని మర్చిపోకండి. చాలామందిని తీసుకురండి. కాని మీరు దారి తప్పకండి. అర్థమౌతోందికదా! ఎలాంటి స్థితిలో ఉండాలి మీరు?

కృష్ణం నారాయణం వందే । కృష్ణం వందే వ్రజప్రియం ॥
కృష్ణం ద్వైపాయనం వందే । కృష్ణం వందే పృథాసుతం ॥

అర్జునులవలె మారి, వ్యాసుడులాగ పరిణతి చెంది, వ్రజగోపికలతో ఆడుకున్నటు వంటి లీలామానుష విగ్రహుడిగా మారి, నారాయణ తత్త్వంలో ఐక్యమైపోయే స్థితి మీకు కలగాలి అని ఆ శ్లోకం వ్రాయటంలో వ్యాసుడు యొక్క ఉద్దేశ్యం. అందుచేత ముందు మీరు అర్జునులుగా మారాలి. యుద్ధం చేయ గలగాలి.

ఎవరితో యుద్ధం చేయగలగాలి?

మీ వాళ్ళతోనే యుద్ధం చెయ్యాలి. మీ వాళ్ళే మీకు అడ్డు తగులుతారు. మీ చేతనత్వమే, మీ సంస్కారాలే అడ్డు తగులుతాయి. బయటివాళ్ళకి అసలు మీరు ఏమవుతారో ఎవడికి కావాలి? నవ్వి ఊరుకుంటారు. అడ్డుతగిలేది మీ వాళ్ళే. కాని మీరు ఏదో చేసేస్తున్నారని చెప్పుకుంటే అడ్డుతగులుతారు. లేకపోతే మీరు మారారని కూడా వాళ్ళకి తెలియదు, అది గుర్తుంచుకోండి.

బొట్టు కాటుకా పెట్టి నేను మారిపోయానహో అని చెప్తే కదా. వాళ్ళు పిచ్చివాళ్ళు నమ్మేస్తారు మీరు అన్నమాటకి. మీరు నిజంగా మారారో లేదో చూసు కుంటే

సరిపోతుంది. కారం తిననహో అనేసరికల్లా భార్యగారో, భర్తగారో గాభరా పడి పోతారు. ఎందుకు గాభరాపడిపోవటం? ఇంత అవకాయ ప్రక్కన పెడితే ఆయనే కలుపుకు తింటాడు. అయిపోయే. మీ నియమాలు ఎంటో మీకు తెలుసు కదా! అందుచేత ముందే మీరు చాటింపు వేసేసుకుని వాళ్ళతో యుద్ధాలవీ ఎందుకు తెచ్చుకోవటం?

నిజంగా మీరు ఆవకాయ పెట్టినా తిననప్పుడు, వాళ్ళు గాభరాపడిపోతే మీరు కాలర్ ఎగరేసుకోవచ్చు, నేను నియమాన్ని పాటించానని. కాని మనమేం చేస్తాం? వాళ్ళని పాటించమంటాం, మనం పాటించం. ద్వైపాయనుడు యొక్క ద్వంద్వం మన మనస్సులో ఉన్నది జాగ్రత్తగా ఈ వివరణ అర్థం చేసుకోండి. మీరు క్షణంలో మారిపోవచ్చు, ఆ మారిపోయిందాన్ని అలాగే ఉంచుకోండి. అందుచేత నారదుడు భక్తితో కలిశాట్ట. శ్లోకం చదవండి నాతో పాటు.

సచ్చిదానందరూపాయ విశ్వోత్పత్త్యాదిహేతవే ।
తాపత్రయవినాశాయ శ్రీకృష్ణాయ వయం నుమః ॥

వయం అంటే? మేము. ఎప్పుడూ సామూహిక ప్రయత్నం చేస్తామని. దయచేసి చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. సాధనలు ఎప్పుడూ ఒంటరిగా చేసుకుంటాను అనే భ్రమలోంచి మీరు బయటపడకపోతే, భక్తి యొక్క లొంగుబాటులోకి వెళ్ళిపోతారు. మీ యొక్క భక్తే మిమ్మల్ని గంగలోకి దింపుతోంది.

భక్తి అంటే ఏం చెప్పాను నేను?

అలవాట్లు. ఒక రూపంతో చూడటం అలవాటు అయిపోయాక, ఇంకో రూపంలో చూస్తే నచ్చదు. గుండు గీయించుకుంటాడు, గెడ్డం అదీ గీయించు కుంటాడు. అది చూసేసరికల్లా ఇంట్లో వాళ్ళు ఏం అంటారు? నచ్చదు. గుండుతో చూసిన తరవాత వాడు గెడ్డం పెంచుకుంటే నచ్చదు. ఇది భక్తి అంటే. భక్తి అనే మాటని అర్థం చేసుకోండి.

మన జీవితాలలో అనేక మాటలకి అర్థాలుకూడా క్రిస్టలైజ్ అయిపోయాయి.



పంకజము అంటే అర్థం ఏంటి అసలు? అసహ్యించుకోవాలి మీరు, బురదలో పుట్టినది అని. కాని పంకజము అని పేరు పెట్టుకుంటాం. ఎందుకు? పంకజం అంటే మన దృష్టిలో ఏంటి? పద్మం. కాని పంకజం అంటే బురదలో పుట్టింది అని అర్థం. తామర పువ్వు కూడా బురదలో పుట్టింది. కాని బురదలో ఇంకా చాలా పుట్టాయి. అలా పుట్టినవన్నీ పంకజాలే. కదా!

అలాగే భక్తి అంటే భగవంతుడి మీద భక్తే కాదు,

భక్తి అంటే మీకు ఏది చాలా ఇష్టమో, అది.

నిద్రపోవటం మీకు చాలా ఇష్టం, మీకు నిద్ర మీద భక్తి ఉంది. కారం తింటం చాలా ఇష్టం, కారం మీద భక్తి ఉంది. పిల్లల మీద చాలా ఇష్టం, పిల్లల మీద భక్తి ఉంది. గురువు మీద చాలా ఇష్టం, అబద్ధం చెప్తున్నారు, గురువు మీద మీకు ఇష్టం లేదు. ఎందుచేతంటే, గురువు మీద ఇష్టం ఉంటే ఇవన్నీ పోతాయి. అందుచేత గురువు మీద ఇష్టం ఉందనకండి, ఇష్టం నటిస్తున్నారు. **నటించండి, నటన ఎప్పుడో సరిగా అయిపోవచ్చు**, అది వేరే విషయం. భక్తి అనే పదానికి నిర్వచనం చెప్తున్నాను, మీకు అర్థమైంది కదా! ఆ విశాల మైనటువంటి నిర్వచనం.

దేనిమీద మీకు భక్తి ఉన్నదో మీరు అదే పొందుతారు. అది నియమము.

ఆ నియమము తప్పదు. నోట్ చేసుకోండి అది కూడా. మీరు దాన్ని వ్రాసి ఆశ్రమంలో ఒకచోట పెట్టండి. "మీకు దేని మీద భక్తి ఉన్నదో అదే మీరు పొందుతారు"

డబ్బు మీద భక్తి ఉంది కనుక, ప్రపంచం మొత్తంలో మీరు ఆలోచించే దేమిటి అంటే, మీరు గాయత్రీ పూజ చేశారా! ఎంత డబ్బు వచ్చింది? ప్రమోషన్ వచ్చిందా? అని. కాని ప్రమోషన్ వచ్చాక గాయత్రీదేవికి మీరేం ఇచ్చారు? నమస్కారం ఇచ్చారు. అది కూడా ఆవిడ అదృష్టం, మీరు మనస్ఫూర్తిగా పెట్టారో, లేదో!

కాని నమస్కారం పెట్టటంలో అర్థం ఏంటో తెలుసా అసలు? మొత్తం ఇచ్చేశారని. నమస్కారం పెట్టటంలో అర్థమేమిటంటే- మీ కర్మేంద్రియాలను,

జ్ఞానేంద్రియాలనూ కూడా ఇచ్చేశారని. జాగ్రత్త, ఈసారి నమస్కారం పెడుతున్నప్పుడు ఆ అర్థం ఎవడైనా తీసుకొని వింటే ప్రమాదాల్లో చిక్కుకుంటారు మీరు.

అందుచేత ఇప్పుడు మీకు ఏకైక భక్తి డబ్బు మీద మాత్రమే ఉన్నది. ఇష్టం ఉన్నా, లేకపోయినా నిజమదే. అందుచేత మీ కొలబద్ద ఏంటీ అంటే డబ్బు. డబ్బున్న వాళ్ళు కూడా వస్తూవుంటే, ఆయన గొప్ప గురువు. అవునా, కాదా? ఒక వ్యక్తి నాకు భగవంతుడి మీద భక్తి లేదన్నాడు. కాని అతను నాకు ఉద్యోగం ఫలానా వ్యక్తి వలన వచ్చింది. అతనికి నేను నమస్కరిస్తానన్నాడు. అందుచేత ఎవరి మీద అతని భక్తి ఉంది? ఆ వ్యక్తి మీద. అందుచేత భక్తి ఉంది కదా!

నేను అదే చెప్పాను. నీకు భక్తి ఉందయ్యా. వ్యక్తి మీద ఉంటేనేం, వెంకటేశ్వర స్వామి మీద ఉంటేనేం. భక్తి అంటూ నీకు ఉంది. అవునా కాదా? "నువ్వు అలా తిరకాసు వేస్తే ఎట్లా?" అన్నాడు. నేను ఉన్నది చెప్పాను. అవునా, కాదా? కాని చాలా మంది వణుకు నటిస్తున్నారు తప్ప, భక్తి లేదని చెప్పాను. "నువ్వేం కంగారుపడకు. నీకే కాదు, వెంకటేశ్వరస్వామి మీద చాలామందికి భక్తి లేదు."

అందుచేత మీరు నేర్చుకోవలసినది, అవగాహన చేసుకోవాల్సింది ఏంటంటే, మీ భక్తి ఎవరి మీద ఉన్నది అని. ఇతరుల్ని కించపర్చటానికి కాదు, మిమ్మల్ని మీరు విశ్లేషణ చేసుకోండి. మీకు ఏది ముఖ్యము? దేనికి మీరు ఎక్కువ ఓటు వేస్తున్నారు? ఈ వారం మొత్తం మీరు విశ్లేషణ చేసుకోండి. మీ భక్తి దేనిమీద ఉన్నది? ఆ భక్తిని మళ్ళించుకోండి. ఎవరి మీదకి మళ్ళించుకోవాలని చెప్తున్నాడు,

సచ్చిదానంద రూపాయ. సత్ చిత్ ఆనంద్. భూర్ భువః స్వః. త్రిపుటీలుగా ఉంటాయి అన్నీ కూడా. ఇక్కడ కూడా మీకు తరవాత ఇంకో త్రిపుటీ వస్తుంది, భక్తి, జ్ఞానము, వైరాగ్యము. ఇవన్నీ - మూడు, మూడు, మూడు కలిసివుంటాయి ఎప్పుడూ కూడా. ఇచ్ఛ, క్రియ, జ్ఞానము అని మూడు వస్తాయి. అహంకారానికి మూడున్నాయి. అహంకారం ఎందులో కలుస్తుంది అంటే మనస్సు, బుద్ధి, చిత్తము కలిస్తే అహంకారము వస్తుంది. ఈ త్రిపుటీలు గురించి చెప్తూ, సచ్చిదానంద రూపాయ. సచ్చిదానందమైన



స్వరూపం ఒకటుంది, **ఆజ్ఞాచక్రం దగ్గర మీరు ఉన్నప్పుడు ఆ సచ్చిదానంద స్వరూపమే మీకు గోచరిస్తుంది.**

కాని ఆ గోచరించటానికి మంత్రపుష్పంలో ఇంకో శ్లోకం ఉంది. ఏ శ్లోకం గురించి చెప్తున్నాను నేను? అందరూ కలిసి ఆ శ్లోకం చదవండి.

సన్తాప యతి స్వం దేహ మాపాద తల మస్తకః ।
తస్య మధ్యే వహ్ని శిఖా అణీయోర్ధ్వా వ్యవస్థితః ॥

వైశ్వానరమనబడు ఆ మహానగ్ని, తననుండి-సర్వత్రా వ్యాపించే అగ్ని కిరణాల వేడిమిచేత, తాను ధరించిన దేహమును అరికాళ్ళనుండి బ్రహ్మరంధ్రము వరకును తపింపచేయుచుండును. అట్టి మహాతాపకమైన రశ్మలు కలిగిన అగ్ను(ల) నడుమ-ఆ అగ్ని చక్రమునకు ఇరుసుకొనయో అన్నట్లు ఒక విశిష్ఠాగ్ని ఊర్ధ్వముఖమై వెలుగుచున్నది.

నీల తోయద మధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా ।
నీవారశూక వత్తన్వీ పీతా భాస్వ త్యణూపమా ॥

ఆ అగ్నిధార నీలిమబ్బు నడుమ మెరుపు తీగవలె, సూక్ష్మతమమైన నివ్వరి ధాన్యపు గింజ యొక్క పైములుకంత ప్రమాణమున బంగారుకాంతులు విరజిమ్ముచూ ప్రకాశించు చున్నది.

తస్యా శ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః ।
సబ్రహ్మ స్సశివ స్సహరిస్సేన్ద్ర స్సోఽ క్షరః పరమస్స్వరాట్॥

(పూర్వ శ్లోకమున కన్వయము) ఆ సూక్ష్మాగ్ని యొక్క అగ్రభాగపు నట్టనడుమనే పరమాత్మ వ్యవస్థితుడై వున్నాడు. అతడే సృష్టికర్తయగు బ్రహ్మ. అతడే లయంకరుడగు శివుడు. అతడే స్థితికరుడైన విష్ణువు. అతడే జగత్పాలకుడగు ఇంద్రుడు. అతడే నాశనములేని శాశ్వతుడు. అతడే శుద్ధ చిదానంద రూపుడైన పరముడు. అతడే స్వరాట్టు (స్వయంరాజా). ఆ ఆజ్ఞాచక్రం గురించి చెప్తున్నాడు. ఇక్కడ గాయత్రీ మంత్రం చేసుకుంటున్నప్పుడు ఎలా చేసుకుంటున్నాం? మళ్ళా అభ్యాసం చేసుకోండి.

ఓం భూర్ భువః స్వః తత్ సవితుర్ వరేణ్యం
భర్గో దేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ ॥

ఇప్పుడు హృదయం దగ్గరది, ఆ శ్లోకం చదువు.

నీల తోయద మధ్యస్థా - నీలిరంగు ఊహించుకోండి అక్కడ.

నీల తోయద మధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా - ఒక మెరుపు హృదయం నుంచి ఆజ్ఞాచక్రానికి వస్తుంది. తరవాత,

నీవారశూక వత్తన్వీ - అంటే చాలా సన్నగా, వెరీ ఫైన్‌గా ఉంటుంది. అమృత బిందూ పనిషత్‌లో-ముఖ్యమైన 101 నాడులలో, నూరు నాడులు అధోముఖంగా ఉంటాయి. ఒక్కనాడి మాత్రమే ఊర్ధ్వముఖంగా పైకివెళ్తుంది. దాన్నే అమృత నాడి అంటాం అని చెపుతాడు.

మా అమృతానందమయి మాత పేరు విన్నారా మీరు, ఆవిడది కేరళ. ఈ సాధనలో ఆమె నిపుణురాలు. ఇక్కడ నుంచి అది లోపలికి వెళ్తుంది, ఆజ్ఞాచక్రం దగ్గర ఓ మెరుపులాగ. విద్యుల్లేఖేవ భాస్వరా. ఇంత వరకు అర్థమైంది కదా భావన. ఏం చేసుకుంటారు?

ఓం భూర్ భువః స్వః తత్ సవితుర్ వరేణ్యం - శ్రేష్ఠుడైన ఆ సూర్యుడు

భర్గో దేవస్య ధీమహి-అతని కిరణాలతో నెత్తురు ద్వారా అంధకారాన్ని పోగొట్టు తున్నాడు. ధియోయోనః ప్రచోదయాత్ - నీలమేఘశ్యాముడైపోతాడు. నీలిరంగుకి మారుతుంది. ఆ నీలిరంగు ఏమౌతుంది? ఒక మెరుపులాగ ఆజ్ఞాచక్రం దగ్గరికెళ్తుంది. ఈ పాయింట్ అర్థమైందికదా! ఇప్పుడు చదవండి ఆ మంత్రం మొదటి నుంచి.

సన్తాప యతి స్వం దేహ మాపాద తల మస్తకః ।
తస్య మధ్యే వహ్ని శిఖా అణీయోర్ధ్వా వ్యవస్థిత ॥

వైశ్వానరమనబడు ఆ మహానగ్ని, తన నుండి-సర్వత్రా వ్యాపించే అగ్ని కిరణముల వేడిమిచేత, తాను ధరించిన దేహమును అరికాళ్ళనుండి బ్రహ్మరంధ్రము



వరకును తపింపచేయుచుండును. అట్టి మహాతాపకమైన రశ్ములు కలిగిన అగ్ను(ల) నడుమ-ఆ అగ్ని చక్రమునకు ఇరుసుకొనయో అన్నట్లు ఒక విశిష్టాగ్ని ఊర్ధ్వముఖమై వెలుగుచున్నది.

నీల తోయద మధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా ।
నీవారశూక వత్తన్వీ పీతా భాస్వ త్యణూపమా ॥

ఆ అగ్నిధార నీలిమబ్బు నడుమ మెరుపు తీగవలె, సూక్ష్మతమమైన నివ్వరి ధాన్యపు గింజ యొక్క పై ములుకంత ప్రమాణమున బంగారుకాంతులు విర జిమ్ముచూ ప్రకాశించుచున్నది.

తస్యా శ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః ।
సబ్రహ్మ సశివ సహరిస్సేన్ద్ర స్సోఽ క్షరః పరమస్స్వరాట్॥

(పూర్వ శ్లోకమున కన్వయము) ఆ సూక్ష్మాగ్ని యొక్క అగ్రభాగపు నట్టనడుమనే పరమాత్మ వ్యవస్థితుడై వున్నాడు. అతడే సృష్టికర్తయగు బ్రహ్మ, అతడే లయంకరుడగు శివుడు. అతడే స్థితికరుడైన విష్ణువు. అతడే జగత్పాలకుడగు ఇంద్రుడు. అతడే నాశనము లేని శాశ్వతుడు. అతడే శుద్ధ చిదానంద రూపుడైన పరముడు. అతడే స్వరాట్టు.

వాడే హరి, వాడే అంతా. వాడే స్వరాట్, వాడే సచ్చిదానంద స్వరూపుడు. ఆ శ్లోకాన్ని చెప్తున్నాడు, భక్తి దాని మీద పెట్టుకోండి అని. మన భక్తి దేని మీద పెట్టుకున్నామో, అది మనం పొందుతామని అర్థమయిందికదా. అందుచేత మీ బాధ్యతలు నెరవేరుస్తూ, మళ్ళీ చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోండి, ముందు చెప్పిన ఉదాహరణ. బాధ్యతలు నెరవేర్చలేని వాడు, ఇంత అద్భుతమైన సాధన ఎలాగూ నెరవేర్చలేడు, వాడి గురించి నాకు అనవసరం. వాడు అది వదిలి ఇక్కడకొస్తాడు, ఇది వదలి ఇంకో చోటకి వెళ్తాడు, ఇది వదిలి ఇంకోచోటకి వెళ్తాడు. మీరు ఎక్కడికీ వెళ్ళిపోవద్దు. మీరు ఎక్కడున్నారో, అక్కడే ఉండండి. మీ ఇళ్ళల్లోనే ఉండండి. ఆ బాధ్యతలు సక్రమంగా నెరవేర్చండి.

ఒక డైరెక్టర్ కనుక వచ్చి చూస్తే, జీవితంలో మీ పాత్ర తండ్రిగా, కొడుకుగా, భర్తగా, స్నేహితుడుగా, శత్రువుగా, తల్లిగా, కూతురుగా, భార్యగా, ఉద్యోగస్తుడిగా ఎంత అద్భుతంగా మీరు జీవించాలి అంటే, ఆ పాత్ర మీకు ఇచ్చేయ్యాలి. అంత అద్భుతంగా ఆ పాత్రలో నటించగల్గాలి. పాత్రలో నటించేస్తున్నాం అన్నది గుర్తుంచు కోండి. ఆ పాత్రలో నటించండి. కానీ మీరు నటిస్తున్నారు అని వాళ్ళకి చెప్పకండి, వాళ్ళు బాధపడతారు. ఎలాగూ మీరు నటించలేరు, ఉన్నది ఉన్నట్టు చేస్తారు. అర్థమౌతోందా చెప్తోన్నది.

మనం సమన్వయ భాగవతం మొదలెట్టాం. ఈ వారమంతా మీరు చెయ్య వలసింది చెప్తున్నాను నేను. - భక్తి దేని మీద ఉంచుకోమని చెప్తున్నాను,

సచ్చిదానంద రూపాయ విశ్వోత్పత్యాధిహేతవే ।
తాపత్రయవినాశాయ శ్రీకృష్ణాయ వయం నుమః ॥

సత్ చిత్ ఆనంద స్వరూపము, విశ్వము యొక్క ఉత్పత్తి, స్థితి, వినాశనానికి కారణమైన మరియు ఆధ్యాత్మిక, ఆదిదైవిక, ఆదిభౌతిక మూడు రకాల తాపము లను నాశనము చేసే ఆ శ్రీకృష్ణ భగవానునికి మేము నమస్కరించుచున్నాము.

ఇందాక చెప్పానుకదా, ఆ ఆజ్ఞాచక్రం నుంచి మీ సృష్టి అంతా వస్తోంది. రాత్రి మీరు నిద్రపోతోన్నప్పుడు ఆ ఆజ్ఞాచక్రంలోనే లీనమౌతారందరూ తెలిసో, తెలియకో. లీనం కాలేనివాళ్ళు అనిద్రా రోగగ్రస్తులు. వాళ్ళు మందుల్తో లీనమౌతారు.

అందుచేత ఆజ్ఞాచక్రం దగ్గర కనుక మీరు మనసు ఉంచుకొని పడుకో గలుగుతే, నిద్ర సులభంగా వచ్చేస్తుంది. మీకు ఏ నిద్ర మాత్రలూ అక్కర్లేదు. 1. సుఖంగా నిద్ర పట్టాలంటే ఎలా? ఇలాంటి టిప్స్ కూడా గుర్తుంచుకోండి.

కాని దీన్ని అత్యద్భుతంగా సాధన చేసిన ఒక వ్యక్తి ఉన్నాడు పుట్టుకతోనే. మనకి తెలుసున్నటువంటి వాడు. అలాంటివాళ్ళు చాలామంది ఉండొచ్చు భారత దేశంలో. అతను వివేకానంద.



రామకృష్ణ పరమహంస దగ్గరికి వివేకానంద వచ్చినప్పటి సంగతి. రామకృష్ణ పరమహంసకి కూడా కొన్ని అలవాట్లు ఉండేవి. గబుక్కుని దేన్నీ నమ్మేవాడుకాదు. ఆయన తన అంతర్‌దృష్టిని కూడా నమ్మేవాడు కాదు. ఆయన పరీక్ష చేసుకునే వాడు. కాళికాదేవి చెప్పినా గూడా, పైకి అమ్మ చెప్పింది అనేవాడే, కాని లోపల మళ్ళా పరీక్ష చేసుకునేవాడు. ఆ పేరులోనే ఉందనుకుంటా, ఆ పరీక్షచేసే రోగం. అందుచేత వివేకానందని ప్రశ్నించాడు "నువ్వు రాత్రి నిద్రపోతున్నప్పుడు ఏమౌతుంది" అని. "ఏమవుతుంది, పడుకుంటాను" అన్నాడు.

ఫోన్‌లో కొంతమంది అడుగుతూంటారు నన్ను, "మీరు ఏం చేస్తున్నారు" అని. "ఫోన్‌లో మాట్లాడుతున్నాను!" అని జవాబిస్తాను. అలాగే వివేకానందని అడిగాడు రామకృష్ణ పరమహంస. "నువ్వు ఎలా నిద్రపోతావ్?"అని. "ఎలా నిద పోతానేంటి? అందరూ ఎలాగ నిద్రపోతారో, అలాగ నిద్రపోతాను" అన్నాడు. "అందరూ ఒకేలాగ నిద్రపోరు, నీ నిద్రకి ఒక ప్రత్యేకత ఉండుంటుంది, చెప్పు" అన్నాడు.

పడుకుంటాను, రక్తప్రసరణ అంతా కూడా నా ఆజ్ఞాచక్రం దగ్గరికి వస్తుంది అన్నాడు. అదో జువ్వమని, చూశారా మీలో కొంతమంది ఇప్పుడు అలా అనుభూతి చెంది వుండొచ్చు కూడా ఆ జువ్వమనేది. ఆ అనుభూతి వస్తుంది. అనుభూతి వచ్చినప్పుడు అక్కడొక జ్యోతి వెలుగుతుంది.

తస్యా శ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః ।
సబ్రహ్మా సశివ సహరిస్సేన్ద్ర స్సోఽ క్షరః పరమస్స్వరాట్ ॥

ఆ సూక్ష్మాగ్ని యొక్క అగ్రభాగపు నట్టనడుమనే పరమాత్మ వ్యవస్థితుడై వున్నాడు. అతడే సృష్టికర్తయగు బ్రహ్మ. అతడే లయంకరుడగు శివుడు. అతడే స్థితికరుడైన విష్ణువు. అతడే జగత్పాలకుడగు ఇంద్రుడు. అతడే నాశనములేని శాశ్వతుడు. అతడే శుద్ధ చిదానంద రూపుడైన పరముడు. అతడే స్వరాట్టు (స్వయంరాజా). అలా అనుకునేవాడు వివేకానంద. **ఆ జ్యోతి కనిపించేది. కనిపించ గానే నిద్రలోకి వెళ్ళిపోయేవాడు. మీకు కూడా కనిపిస్తుంది, అభ్యాసం**

**చెయ్యండి. ఇది నిద్రపోయే ముందు చెయ్యాల్సిన సాధన.**

ఇక్కడ నేను చెప్పినవన్నీ కూడా విని ఊరుకోవటానికి కాదు. ఇవాళ రాత్రి నుంచి మీరిది చెయ్యాలి. అప్పుడు తర్వాత వారం నేను సమన్వయ భాగవతం కొనసాగిస్తాను. భగవంతుడికి తెలియాలి ఎన్ని సంవత్సరాలు పడుతుందో ఇది, ఎన్ని రోజులు చెప్తానో! తిక్కమనుష్యులం కదా! అందుచేత చెప్పించుకునే బాధ్యత మీది. అభ్యాసం చేసుకోండి. కష్టమైనవేం చెప్పటం లేదుకదా!

సామూహిక జీవితం కొరకు ప్రయత్నించండి. ఎక్కువ కాలం ఇక్కడ ఆశ్రమంలో జీవించటానికి  ప్రయత్నించండి. బయట నుంచి వస్తున్నవాళ్ళు కూడా ఇక్కడ జీవించటానికి ప్రయత్నించండి. జీవించే నియమాలు ఉన్నాయి. ఇక్కడకొచ్చి మీ ఇష్టం వచ్చినట్టే చేస్తారు. మా జీవిత విధానాలు మార్చేసుకుంటామనే వాళ్ళు కొంతమంది వచ్చారు. వాళ్ళకి నేను చెప్పేది ఇదే. మీ జీవిత విధానాలు ఇక్కడ మార్చుకోవటానికి మీరు రావటంలేదు. ఎవరి గురించి మాట్లాడుతున్నాను?

సచ్చిదానంద రూపాయ విశ్వోత్పత్త్యాధిహేతవే ।
తాపత్రయవినాశాయ శ్రీకృష్ణాయ వయం నుమః ॥

సత్ చిత్ ఆనంద స్వరూపము, విశ్వము యొక్క ఉత్పత్తి, స్థితి, వినాశనానికి కారణమైన మరియు ఆధ్యాత్మిక, ఆదిదైవిక, ఆదిభౌతిక మూడురకాల తాపములను నాశనము చేసే ఆ శ్రీకృష్ణ భగవానునికి మేము నమస్కరించు చున్నాము. ఏది హేతువు? మీ ఆజ్ఞా చక్రమే. మీ యొక్క ఆజ్ఞాచక్రం వల్లే ఈ సృష్టి అంతా ఉంది.

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్ ।
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥ (భ.గీ. 4-6)

నేను పుట్టుకలేనివాడను, నాశరహితస్వరూపము కలవాడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను అయినప్పటికి స్వకీయమగు ప్రకృతిని వశపఱచుకొని నా మాయాశక్తిచేత పుట్టుచున్నాను (అవతరించుచున్నాను).

దీనిని మీరు నిరంతరమూ తిరిగి చెప్పుకోండి. మీరు కూడా వాడే. ఈ సృష్టి



అంతా మీ వల్లే ఉత్పత్తి అయింది. అందుచేత నేను దోమగా ఊహించుకుంటానా? చెప్పేగా ఇందాక రాజ్‌కపూర్ కథ. అంతా చేసుకొని నేను పరాయివాడిగా ఉంటానన్నాడు. సినిమా తీశాడు. అందుచేత మీరు దోమగా ఉండాలనుకున్నారు, ఉన్నారు. మారాలనుకోండి సింహంగా, మారతారు.

*తాపత్రయ వినాశాయ ఏంటా తాపత్రయం?- భూర్ భువః స్వః*

ఖనిజ జగత్తు యొక్క తాపంలో ఇరుక్కొని ఉన్నావు. ఐరన్ తక్కువగా ఉందండి, హిమోగ్లోబిన్ తక్కువగా ఉందండి, ఐరన్ మాత్రలు వేసుకోమన్నామని డాక్టర్లు అంటారు. ఖనిజ జగత్తు యొక్క తాపం.

పిల్లలు నా మాట వినటం లేదండి. కోడలు నా మాట వినటం లేదండి. కాని కూతురు మాత్రం అత్త మాట వినకూడదు. ద్వంద్వం. అందుచేత మీకు కష్టాలొస్తున్నాయి. అది మీరు ఎప్పుడైనా ఆలోచించారా? మీ కొడుకు అత్త మాట వినకూడదు. కాని మీ అల్లుడు? అత్త మాట వినాలి.

ప్రకృతి పాపం గుడ్డిదది. ఏదో ఒకటి చేస్తుంది. రెండు పనులూ చేయలేదది.

అంతేకదా! ప్రమాదం అక్కడ జరుగుతోంది. ఆ తాపం గురించి చెప్తున్నాను నేను. దుఃఖాలు ఎందుకొస్తాయి అంటే, ఇందుకొస్తాయి. మీరే దుఃఖం ఏర్పరచుకొని వాడు బాధపెడుతున్నాడు అంటారు. జాగ్రత్తగా ఆలోచించండి. ఇది కామమయ శరీరానికి సంబంధించిన దోషము, వృక్షజగత్తుకి సంబంధించిన దోషము. ఇందాక నేను చెప్పింది ఏంటి?

ఖనిజ జగత్తుకి సంబంధించింది, భౌతిక శరీరానికి సంబంధించిన తాపం గురించి చెప్పాను. రెండవది, వృక్షజగత్తుకి సంబంధించిన తాపము. కోరికల జగత్తుకి సంబంధించిన తాపము. **3. కోరికలు తీరాలంటే ఏం చేయాలి?** కోరికలు తీరని వాళ్ళకి ఒక చిన్న టిప్, వృక్షాలకి, చెట్లకి నీళ్ళు పోస్తే కోరికలు తీరతాయి. అవి పోయటం మానేశాం కనుకే ఇలావుంది జీవితం. చెట్లకి నీళ్ళు పోయండి. ఇక్కడకూడా అందుకే

మూడు పూటలా నీళ్ళు పోయమని చెప్పాను, నాకు తెలీదు మరి నీళ్ళు పోస్తున్నారో, లేదో. కాని చేయండది.

దీనిని మీరు ఒక ఆనవాయితీ పెట్టుకుని సమయం ప్రకారం చేయండి. చెప్పినవి చేస్తూ, మిగతావి మానేయకండి. అర్థమైంది కదా, చెట్లకి నీళ్ళు పోయటం నేర్చుకోండి. మా ఇంట్లో చెట్లు లేవండి. మీ ఇంట్లో చెట్లకి ఎవడు నీళ్ళు పోయమన్నాడు? ఏ చెట్టుకి నీళ్ళు పోసినా ఫర్వాలేదు. బయట ఏదో చెట్టు ఉంటుంది కదా, లేకపోతే గడ్డి అయినా ఉంటుందికదా, ఆ గడ్డిమొక్కకి నీళ్ళు పోయండి. మీ కోరికలు ఎలా తీరతాయో చూడండి, మీ దృష్టి ఎల్లా మారుతుందో చూడండి. కాని, "ఒకరోజు పోశానండి." ఒక రోజులో చెట్టు మొలుస్తుందా? అలవాటు చేసుకోండది. కనీసము ఐదారు నెలలు వరసాగ్గా ఈ పని మీరు చేస్తే, రోజూ మనం భోజనం ఎలాగ చేస్తామో, **అలాగ చెట్లకి నీళ్ళు పోయండి. మీ కోరిక తీరుతుంది.**

మీ యొక్క కామమయ జగత్తు వల్ల వచ్చే అనేక రోగాలు ఉన్నాయి. మూర్ఛ అలాంటి రోగం. మూర్ఛ ఉన్న వాళ్ళు, ఎవరైనా తెలుస్తే, వాళ్ళకీ సలహా చెప్పండి. వాళ్ళచేత చెట్లకి నీళ్ళు పోయిస్తే, ఓ 15 చెట్లు, చెట్లు అంటే చెట్లని కాదు నా ఉద్దేశ్యం. కుండీల్లో క్రోటన్స్ లాంటివి ఏవైనా నాటించి 15 చెట్లకి నీళ్ళు పోయమనండి. ఖచ్చితంగా మూర్ఛరోగం పోతుంది. **మూర్ఛ రోగం తగ్గాలంటే ఏం చేయాలి?**

అంత సులభంగా నయం అవుతుందా, చెయ్యం అంటారు. దానికి నేనేం చేస్తాను? అంటే మీ భక్తి దేని మీద ఉంది? మూర్ఛ మీద ఉంది. నయమవ్వాలని లేదు. లేకపోతే ఏం పోయిందిట మీకు. "ఒకరోజు పోశామండి, తగ్గలేదు."

ఒకరోజులో తగ్గుతుందా? మూర్ఛకి మందు ఎన్నాళ్ళు వేసుకోవాలి అల్లోపతీలో? కనీసం మూడేళ్ళు. తరవాత కూడా వేసుకుంటూ ఉండాల్సిందే. కాని ఓ 3 నెలలు పాటు ఇది చేసిచూద్దాం అనిపించదు. మూర్ఛ అనే కాదు. ఫిట్స్ అండ్ స్టార్ట్స్ అంటే అర్థమైందికదా, మొదలెడతాడు, వదిలేస్తాడు. వాళ్ళు కనుక ఇలా నీళ్ళు



పోస్తే, క్రమం తప్పకుండా చేయగలిగితే వాళ్ళకా రోగం పోతుంది.

అందుకని కుండీలు పెట్టి నీళ్ళు పోయమనేది ఆశ్రమంలో. వాటిల్లో తెలిసో తెలియకో అది చేస్తే, మీ కామమయ శరీరంలో ఉన్నటువంటి రోగాలూ పోతాయి, కోరికలూ తీరతాయి. కర్మ సంబంధమైనవి వీలువుంటే. మళ్ళా కర్మ కూడా ఒకటి ఉంది. గందరగోళం ఒకటి తెచ్చుకుని ఉన్నాం మనం. పైనుంచి డౌన్‌లోడ్ చేసుకున్నాం అది. అది మూడవది. తాపత్రయవినాశాయ. రెండవది అర్థమైంది కదా, రెండవది **దేనితో చేయమన్నాను నేను? చెట్లకు నీళ్ళు పోయటంతో.**

మూడవది చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి, మీ మానసిక ప్రవృత్తులతో వచ్చే కష్టాలు. మీ మానసిక ప్రవృత్తి. ఆ మానసిక ప్రవృత్తితో వచ్చే కష్టాలు, ఇది వరకు జన్మతో ఉన్న ఋణానుబంధాలు వల్ల వస్తాయి. అది మెల్లిమెల్లిగా మనం అర్థం చేసుకుందాం.

శ్రీకృష్ణాయ వయం నుమః - మేము శ్రీకృష్ణుడికి నమస్కారం చేస్తాం. ఈ శ్లోకం మళ్ళీ నాతో చెప్పండి.

సచ్చిదానంద రూపాయ విశ్వోత్పత్త్యాధిహేతవే
తాపత్రయవినాశాయ శ్రీకృష్ణాయ వయం నమః ॥

సత్ చిత్ ఆనంద స్వరూపము, విశ్వము యొక్క ఉత్పత్తి, స్థితి, వినాశనానికి కారణమైన మరియు ఆధ్యాత్మిక, ఆదిదైవిక, ఆదిభౌతిక మూడు రకాల తాపమును నాశనము చేసే ఆ శ్రీకృష్ణ భగవానునికి మేము నమస్కరించుచున్నాము.

గాయత్రీ మంత్రం, నారదుడు యొక్క దీక్షలో నః - మనము. ఇక్కడ కూడా వయం - మనము.

అందుచేత భాగవతం యొక్క ఫలసిద్ధి మీకు ఎప్పుడొస్తుంది అంటే, కలిసి చేయగలిగితే. అది మీరు అలవాటు చేసుకోండి. ఎలా అలవాటు చేసుకుంటారు అన్నది అభ్యాసం చేసుకోండి. మీరు అందరూ కలిసి అలవాటు చేసుకోండి. మీరు

ప్రణాళికలు వేసుకోండి, ఎలా కలిసి తింటాం, కలిసి ఆడుకుంటాం, కలిసి జపం చేస్తాం, కలిసి, కలిసి కలిసి కలిసి అనేది కనుక మీరు చేసుకోగలుగుతే, ఈ భాగవతం యొక్క మొదటి శ్లోకం మీకు ఫలిస్తుంది. తరవాత,

యం ప్రవ్రజంతమనుపేతమపేతకృత్యం ।
ద్వైపాయనో విరహకాతర ఆజుహావ ॥
పుత్రేతి తన్మయతయా తరవోఽభినేదు ।
స్తం సర్వభూతహృదయం మునిమానతోస్మి ॥

ఎప్పుడైతే శుకదేవుడు యజ్ఞోపవీత సంస్కారము కూడా అవకుండా మరియు లౌకిక, వైదిక కర్మానుష్ఠానాలు చేసే అవసరము రాకుండా, ఒంటరిగా సన్యాసం తీసుకోవడానికి ఇంటి నుండి వెడలుట చూసి, ఆయన తండ్రి వ్యాస భగవానుడు విరహముతో పుత్రా, పుత్రా! నీవెక్కడికి వెడుతున్నావని బాధతో పలికారు. అప్పుడు వృక్షములు తన్మయము చెందినటువంటివై శ్రీశుకభగవానుల వైపు నుండి అవి జవాబిచ్చాయి. అలాంటి సర్వభూత హృదయ స్వరూపుడైన శ్రీశుకదేవమునికి నేను నమస్కరిస్తున్నాను.

ఇక్కడ శుకమహర్షికి నమస్కారం చేస్తున్నాం మనం. శుకుడు అంటే, శుకం అంటే చిలుక. చిలుక యొక్క మొదటి లక్షణం చెప్పింది వల్లె వేస్తుంది, అర్థమైనా అర్థమవకపోయినా. కదా! ముందు ఆ వల్లె వేయటం వస్తే తరవాత అర్థం చేసుకోవటం నేర్చుకుంటాం. అప్పుడు ఆ శుకము దేవతా స్థితికి వెళ్తుంది. **దేవతా స్థితి ఎలా వస్తుంది?** అందుచేత అక్కడ రెండు ఉన్నాయి. పేరట్ లైక్ రిపిటిషన్. శుకుడులాగ ముందు వల్లె వేద్దాం. అర్థం చేసుకోవటానికి ప్రయత్నించకుండా, ముందు రిపీట్ చేస్తాం. రిపీట్ చేసిన తర్వాత, తిరిగి తిరిగి చేయగా, చేయగా, చేయగా, చేయగా ఆ **దేవతా స్థితి** వస్తుంది. దేన్ని మీరు, తిరిగి తిరిగి చేస్తారో, ఆ స్థితి మీకు వస్తుంది. జప విజ్ఞానం అంతా అంతే. మీరు ఇది చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. శాస్త్రవేత్తలందరూ కూడా ఈ జపవిజ్ఞానం నిష్ణాతులే.

కేన్సర్‌కి మందు కావాలి, కేన్సర్‌కి మందు కావాలి, కేన్సర్‌కి మందు కావాలి.



ఈ జపం ఇప్పుడు ఎన్ని చోట్ల జరుగుతోంది? ఎన్ని కేన్సర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్ ఉన్నాయో, అన్ని చోట్లా జపం జరుగుతోంది. మీకు నమ్మకం ఉంది కదా! ఏదో ఒక రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి మందు వస్తుంది అని. అంతేగా! అందుచేత ఆ మందు ఎందుకు వస్తోంది? జపం వల్ల. కాని జపం చేసి ప్రయోగాలు లేకపోతే వస్తుందా? అలాగే జపం చేసిన తరవాత ఆచరణ కూడా కావాలి మీకు. ఇది జపం చేస్తాం శుకుడులాగ. జపం చేసిన తరవాత ఏం చెయ్యాలి?

కలిసి ఉండటానికి ఆచరణ చేస్తాం. ఆచరణ చేస్తే ఎప్పుడో అప్పుడు మీరు ఏమౌతారు? శుకదేవులు అవుతారు. అర్థమైంది కదా! అందుచేత శుకుడు నుంచి శుకదేవ స్థితికి వెళ్ళటానికి కావలసినటువంటి మంత్రము ఇక్కడిస్తున్నాడు.

యం ప్రవ్రజంతమనుపేతమపేతకృత్యం
ద్వైపాయనో విరహకాతర ఆజుహావ ।
పుత్రేతి తన్మయతయా తరవోఽభినేదు
స్తం సర్వభూతహృదయం మునిమానతోస్మి ॥

ఎప్పుడైతే శుకదేవుడు యజ్ఞోపవీత సంస్కారము కూడా అవకుండా మరియు లౌకిక, వైదిక కర్మానుష్ఠానాలు చేసే అవసరము రాకుండా ఒంటరిగా సన్యాసం తీసుకోవడానికి ఇంటి నుండి వెడలుట చూసి, ఆయన తండ్రి వ్యాసభగవానుడు విరహముతో పుత్రా, పుత్రా! నీవెక్కడికి వెడుతున్నావని బాధతో పలికారు. అప్పుడు వృక్షములు తన్మయము చెందినటువంటివై శ్రీశుకభగవానుల వైపు నుండి అవి జవాబిచ్చాయి. అలాంటి సర్వభూత హృదయ స్వరూపుడైన శ్రీశుకదేవమునికి నేను నమస్కరిస్తున్నాను. అంటే ఇక్కడ దృశ్యం ఏమిటి అంటే,

శుకమహర్షికి యజ్ఞోపవీత సంస్కారం అవలేదు. సన్యాసం పుచ్చుకోవాలంటే యజ్ఞోపవీత సంస్కారం అయితీరాలి. ఎందుకు అయి తీరాలి? సన్యాసం పుచ్చుకునేటప్పుడు యజ్ఞోపవీతం తీసి ప్రక్కన పెట్టాలి కనుక. అదీ వేదవ్యాసుడి సమస్య. శుకదేవుడు ఏం చేస్తున్నాడు?

తిన్నగానే సన్యాసిగా వెళ్ళిపోవాలి అనుకుంటే, నాయనా నువ్వు సన్యాసివి ఎలా అవుతావ్? ముందు యజ్ఞోపవీత సంస్కారం అవ్వాలి. యజ్ఞోపవీత సంస్కారం అయిన తర్వాత సన్యాస దీక్ష ఇవ్వబడుతుంది. సన్యాస దీక్ష ఇవ్వబడినప్పుడు ఏం చెయ్యాలి నువ్వు? ఈ తీసుకున్నది ప్రక్కన పడెయ్యాలి. ఎందుకు వేసుకోవాలి అంటే, తీసెయ్యటానికి. అందుచేత అరుస్తున్నాడట. ఏమని అరుస్తున్నాడట?

పుత్రేతి తన్మయతయా తరవోఽభినేదు

చెట్లు అంటే దేనికి ప్రతీక అని ఇందాకే నేను మీకు చెప్పాను? అందుచేత ఈయన ఓ! నా పుత్రా, ఓ! నా పుత్రా నువ్వు వెళ్ళిపోతున్నావా అని అరుస్తున్నాట్ట. ప్రతిస్పందన ఎవరిచ్చారు? చెట్లు ఇచ్చాయి. **చెట్లు దేనికి ప్రతీక? కోరికలకి.**

చెట్లు ఏమిటి, కోరికకి ప్రతీక అని ఇప్పుడు అర్థమైందా. వ్యాసభగవానుడు యొక్క కోరికకి చెట్లు ప్రతిస్పందన ఇస్తాయికాని, శుకుడు ప్రతిస్పందన ఇవ్వలేదు. చెట్లు ఎందుకిచ్చాయి అని ఎవడికీ అనుమానం రాదు. ఎందుచేతంటే, అందరూ పేరట్ లైక్ రిపీటీషనే. భాగవతం చదివిన వాళ్ళందరూ కూడా ఇక్కడున్నది చెప్పారు. నేను వేరే చెప్తున్నాను అని కాదు. ఈ సైన్స్ అర్థమైతే మీరూ ఇది చెప్పగలుగుతారు.

6. అశ్వర్థవృక్ష ప్రదక్షిణల్లో గల అంతరార్థమేంటి? పిల్లలు లేకపోతే అశ్వర్థవృక్ష ప్రదక్షిణలు ఎందుకో ఇప్పుడు తెలిసిందా? అందుచేత ఇప్పుడు మీ కామ మయ జగత్తుని దాటటానికి కావలసిన ఫార్ములా తెలుసుకొంటున్నారు. మీరు తిరిగి చేయడం వల్ల కోరికలు వస్తాయి. ఒకసారి అనగానే మానేసుకుంటే మీకు కోరికలు రావు.

కోరిక తీరటానికి "జపం" మార్గం? సిగరెట్ తాగుతే బావుద్ను. మీలో సిగరెట్ తాగే అలవాటు ఎవరికైనా ఉంటే వాళ్ళకి పాపం సమస్య వస్తుంది ఇప్పుడు. ఛా! సిగరెట్ తాగను అనుకుని వదిలేస్తే సమస్య లేదు. సిగరెట్ తాగుతే బావుద్ను, మళ్ళీ ఇంకోసారి. కొంచెం అలా ప్రక్కకెళితే బావుద్ను. మళ్ళీ ఇంకోసారి. కొంచెం అలా ప్రక్కకి వెళదాం. ఎవడూ చూడటం లేదుకదా! కాల్చేస్తాడు. ఎందుకు కాల్చాడు? రిపిటిషన్. రిపిటిషన్ ఆఫ్ ద డిజైర్. **అందువల్ల కోరిక తీరటానికి "జపం" ఒక్కటే**



**మార్గం. అదే మంత్ర విజ్ఞానం.** రిపిటిషన్ వల్ల సమస్య వస్తుంది. అందుచేత ఈ కిటుకు మీకు అర్థమవుతే, మీరు కోరికలకి బానిసలవటం వల్ల మీకు బాధలు వస్తున్నాయి తప్ప, కోరిక తీరలేదు అనే బాధలేదన్నది అర్థం చేసుకోండి జాగ్రత్తగా.

అది చాలా సూక్ష్మంగా తెలిస్తేనే మీకు అర్థమవుతుంది: ఎందుచేతంటే, కోరిక తీరిపోయాక-మీకు ఇంకో కోరిక వస్తుంది, అది పోతుంది. మీరు ఎప్పుడైనా చూశారా? అదే మీకు ముఖ్యమైయుంటే, కోరిక తీరిపోగానే ఇంక మీరు ఆనందంగానే ఉండాలి కదా! ఎవరైనా ఉన్నారా అలా ఆనందంగా. ఉన్నామని చెప్పగలరా ఎవరైనా ధైర్యంగా. ఇంకో చెట్టు వస్తుంది, ఇంకో విత్తనం వస్తుంది, ఇంకో కలుపుమొక్క వస్తుంది. **అందుచేత అసలు రహస్యం ఏంటీ అంటే, కోరిక ఉద్భవించటమే.**

ఆ కోరిక ఉద్భవించింది పాపం వ్యాసుడికి కూడా. ఉద్భవిస్తే, అరిచాడు. అరవగానే చెట్లు ప్రతిస్పందనిచ్చేశాయి, ఆయనకి అర్థమైపోయింది ఇది తప్పని. మహాముని కనుక, సంస్కారాలు గురించి తెలుసు కనుక, ఆయనకి అర్థమైంది, ఓహో నేనిలా అరవకూడదు అనుకున్నాడు. అనుకుని ఏమనుకున్నాడు, ఓహో రిపీట్ చేసుకుంటున్నానా అని రిపీట్ చేశాడు. బాధ్యత ఉందికదా, మరి అరిచే బాధ్యత ఉంది కదా తండ్రిగా. మళ్ళా బాధ్యతల్ని ఆయనా వదలలేదు. వ్యాసుడే వదలకపోతే మీరు ఎలా వదులుతారు? వదలకండి. అందుచేత ఈ శ్లోకాన్ని చూడండి.

యం ప్రవ్రజంతమనుపేతమపేతకృత్యం ।
ద్వైపాయనో విరహకాతర ఆజుహావ ॥
పుత్రేతి తన్మయతయా తరవోఽభినేదు ।
స్తం సర్వభూతహృదయం మునిమానతోస్మి ॥

ఎప్పుడైతే శుకదేవుడు యజ్ఞోపవీత సంస్కారముకూడా అవకుండా మరియు లౌకిక, వైదిక కర్మానుష్ఠానాలు చేసే అవసరము రాకుండా ఒంటరిగా సన్యాసం తీసుకోవడానికి ఇంటి నుండి వెడలుట చూసి, ఆయన తండ్రి వ్యాసభగవానుడు విరహముతో పుత్రా, పుత్రా! నీవెక్కడికి వెడుతున్నావని బాధతో పలికారు. అప్పుడు వృక్షములు

తన్మయము చెందినటువంటివై శ్రీశుకభగవానుల వైపు నుండి అవి జవాబిచ్చాయి. అలాంటి సర్వభూత హృదయ స్వరూపుడైన శ్రీశుకదేవమునికి నేను నమస్కరిస్తున్నాను.

సర్వభూత హృదయం. అన్ని భూతాలలో కూడా, అన్ని భూతాలు అంటే అన్ని పదార్థాలలోకూడా ఆయనే ఉన్నాడు శుకదేవుడు. అందుచేత శుకదేవుడు యొక్క స్థితి, మనోమయస్థితిని దాటిన స్థితి.

వ్యాసుడు ఏ స్థితిలో పలుకుతున్నాడు? కామమయ జగత్తులోంచి పలుకు తున్నాడు. అందుచేత కామమయ జగత్తుకి ప్రతిబింబం ఏది? వృక్షాల యొక్క చేతనత్వంలో శుకుడు కూడా ఉన్నాడు. సర్వభూత హృదయం. అందుచేత శుకుడికి బదులు చెట్లు పలికాయి. శుకుడు పలకక్కర్లేదు. అందుచేత మీరు ఈ ఆర్తితో పిలిస్తే, ఏ గురువు అయినా పలుకుతాడు. సర్వభూత హృదయంలో ఉన్నటువంటి గురువు, ఆ రూపంలోనే పలకాలి అని లేదు. ఏ రూపంలో అయినా పలకొచ్చు, మీరు అది గుర్తుంచుకోండి. ఇవంతా కూడా ధ్యానశ్లోకాలు. తర్వాత

నైమిషే సూతమాసీనమభివాద్య మహామతిం ।
కథామృతరసాస్వాదకుశలః శౌనకో ఽబ్రవీత్ ॥ 3

ఒకసారి భగవత్ కథామృత రసాస్వాదన చేయుటలోకుశలురైన శౌనకముని నైమిశారణ్య క్షేత్రములో మహామతి సూతునకు నమస్కరించి అడిగారు. కథామృత రసాస్వాదకుశలః - అంటే ఏంటి అర్థం?

కథామృత రసాస్వాదకుశలః - కథామృత రసాన్ని ఆస్వాదించటంలోకుశలుడు. అంటే మీరు. లేకపోతే ఇక్కడ కూర్చోరుగా! విసుగు అనిపిస్తే వెళ్ళి పోతారుగా! అందుచేత, కథా మృతరసాస్వాదకుశలః శౌనకః అబ్రవీత్. శౌనకుడు అంటే వినేవాడు. శ్రోతలు, వినేవాళ్ళు అడిగారు.

ఇక్కడ రామాయణంలో, భాగవతంలో ప్రతీచోటా మీరు ఒకటి గుర్తుంచు కోండి. అనేక అర్థాలు ఉంటాయి. ఒకటి థియరీ చెప్పేది. రెండోది ప్రాక్టికల్. అందుచేత



ఇది ప్రాక్టికల్స్. మహాభాగవతం కూడా అనుకోవచ్చు మీరు.

అందుచేత శౌనకులు, వినేవాళ్ళు ఎలాంటి వాళ్ళు అవ్వాలి? కథామృత రసాస్వాద కుశలః మీకు ఈ కథలో ఆసక్తి లేకపోతే విసుగొస్తుంది. అందుచేత ఆ విసుగొచ్చిన వాళ్ళు వినాలికదా! కథ వింటే కదా, విసుగొస్తుందో లేదో తెలిసేది. అందుచేత ఎవర్ని అడగాలి? కథ చెప్పగలిగేవాడ్ని అడగాలి. **కథ చెప్పగలిగేవాడు ఎప్పుడు కూడా సూతుడే.** పురాణాలలో ఈ కథ చెప్పేవాడి పేరు ఎప్పుడూ కూడా సూతుడు అని చెప్తాం. అందుచేత, నైమిషే సూతమాసీన.

ఆ సూతుడు ఎక్కడ కూర్చున్నాడు?

నైమిషంలో కూర్చున్నాడు. నిమిష రహితస్థితిలో - కాలాతీతస్థితిలో కూర్చుని ఉంటాడు.

**8. కాలాతీత స్థితిని అనుభవించలేని వ్యక్తి, భాగవతం యొక్క కథని మీకు అర్థమయ్యేటట్టు చెప్పలేడు.** కనీసం ఆ క్షణంలో వాడికి ఆ స్థితి వస్తుంది. ఎవరు చెప్పినా అది గుర్తుంచుకోండి, స్థలమహాత్మ్యం అని ఉంటుంది.

అందుకే దీన్ని (భాగవతం గ్రంథాన్ని) పల్లకీలో తీసుకురమ్మనటం, ఆ కథ చెప్పేవాడ్ని పూజించమనటం ఎందుకంటే, ఆ క్షణంలో వాడికి ఆ శక్తి వస్తుంది.

జడ్జి ఉన్నాడు, మామూలు వ్యక్తే. కాని జడ్జికుర్చీలో కూర్చున్నప్పుడు హంతకుడికి ఉరిశిక్ష వేస్తాడు. మీలాంటి మనిషే ఆయన. కాని ఆయనకి ఆ స్థితి ఎందుకు వచ్చింది? కుర్చీలో కూర్చున్నాడు. కదా!

అలాగే నైమిషిక స్థితిలో, అంటే నిమిష రహిత స్థితిలో, అంటే కాలాతీత స్థితిలో కూర్చున్న సూతుడ్ని అభివాద్య - ఆదరించి, నమస్కరించి, మహామతిం చాలా తెలివైనవాడిగా వాడ్ని గుర్తించి ఈ కథని అడుగుతున్నాము. తెలివైనవాడు ఎవడు?

ఇది వ్రాసినవాడు. చదువుతున్నవాడు కాదు. ఇది వ్రాశాడు కనుక, ఎవడు చదివినా అదే చెప్తాడు. అందుచేత ఈ మూడు శ్లోకాలూ చాలా జాగ్రత్తగా రిపీట్ చేద్దాం. దీనితో మొదటి సప్తాహ కార్యక్రమం పూర్తవుతుంది. కాని మొదటి సప్తాహంలో మీకు చాలా సాధనా విధానాలు ఇచ్చాను. ఒక గమ్యం ఇచ్చాను.

**కలిసి జీవించండి, కలిసి జీవించండి, ఒకళ్ళింటికి ఒకళ్ళు వెళ్ళండి.**

ఒకళ్ళింట్లో ఒకళ్ళు కొంత కాలం, వాళ్ళ కాలం వృధా చేయకుండా గడపండి దయచేసి. "గురువుగారు చెప్పారండి, మీ ఇంటికొచ్చి కూర్చోమన్నార"ని చెప్పి వాళ్ళ కాలం వృధా చేశారనుకోండి, ఇంక మీరు కధ ఆపేయండి అంటారు. అర్థమయింది కదా, వివేకాన్ని ఉపయోగించండి.

**శౌనక ఉవాచ :**

అందుచేత తర్వాత వారంలో శౌనకుడు చెప్తాడు. **శౌనకుడు అంటే ఎవరు? కథామృత రసాస్వాదనం చేసేవాడు, మీరు.** అందుచేత మీరు సూతుడ్ని ఏం అడగబోతున్నారో తర్వాత వారంలో చూద్దాం, సస్పెన్స్ అన్నమాట.

## నారద మార్గదర్శనం

ప్రపంచ చరిత్రలోనే మనమందరమూ కలిసి ఒక అద్భుతమైనటువంటి మార్పు తీసుకురావటానికి ప్రయత్నం చేస్తున్నాం. ఆ ప్రయత్నమేంటంటే, ఇంతవరకు మనం చదువుకున్న విద్యలన్నీకూడా జాగ్రదావస్థలో ఉపయోగపడేవి మాత్రమే, భుక్తికి ఉపయోగపడేవి మాత్రమే. కాని ఈనాడు ఇక్కడ మనం నేర్చుకుంటున్న విద్య చేతనత్వ విజ్ఞానము. రాబోయే రోజులలో ప్రపంచంలో, ఇళ్ళలో తల్లి-తండ్రుల చేతగాని, పాఠశాలలలో ఉపాధ్యాయుల చేతగాని నేర్పబడేది ఈ విద్యే.



సరిగా మనం ఆలోచన గనక చేస్తే, ఈ ఆధునిక విద్యకి రివోల్ట్ చేసినటువంటి మొదటి వ్యక్తి ప్రహ్లాదుడు. ఈ చదువు నేను చదవను, ఈ చదువు నాకు ఎందుకూ పనికిరాదు, ఈ చదువు చదవటం వల్ల జంతుస్థితిలో ఉన్నటువంటి మనము జంతు స్థితిలోనే ఉంటాము, మానవులుగా మనం మారలేము అని గుర్తించినటువంటి వ్యక్తి ప్రహ్లాదుడు. ప్రహ్లాదుడు అన్ని కోట్ల సంవత్సరాల కింద్టే గుర్తించి, ఈ విద్య ద్వారా విశ్వాధిపతి అయినా, ఇంతవరకూ కూడా ఈ ఆధ్యాత్మిక విద్య లేక చేతనత్వ విజ్ఞానాన్ని ఒక క్రమబద్ధములో నేర్చుకొనుటకు ప్రయత్నాలు జరగలేదు. ఆశ్రమాలలో, ఋషుల యొక్క ఆశ్రమాలలో లేక మహానుభావుల యొక్క జీవితాలలో ఎవరికి వారే అభివృద్ధి చేసుకున్నారు తప్ప, సామూహికంగా ఈ చేతనత్వాన్ని అభివృద్ధి చేసుకోవటానికి కావలసిన ప్రయత్నము జరగలేదు.

మహానుభావులు చాలామంది వచ్చారు. కాని వారు ఎలా గొప్పవాళ్ళు అయ్యారన్నది మనకు తెలీదు. సాయి ఉన్నాడు, 12 ఏళ్ళపాటు నా గురువునే నేను చూస్తూ ఉన్నానన్నాడు. గొప్పవాడయ్యాడు. రామకృష్ణపరమహంస? ఆయన సాధన విజ్ఞానం అంతా కూడా మనముందే ఉంది. గొప్పవాడయ్యాడు. కాని ఆయన చేసిన సాధనా విధానాన్ని తు.చ. తప్పకుండా మనం ఆచరిస్తే, మనమూ అంతవాళ్ళం అవుతామా? అయ్యేటట్టు కనిపించటంలేదు. ఎందుచేతంటే, రామకృష్ణమిషన్‌లో సహజంగానే రామకృష్ణ పరమహంస చెప్పినటువంటివి, రామకృష్ణ పరమహంస జీవితవిధానము అనుకరించటానికి ప్రయత్నం చేస్తూ ఉండి ఉంటారు కదా! కాని ఇంకొక రామకృష్ణ పరమహంస అక్కణ్ణుంచి రాలేదు.

అరవిందో సొసైటీలో అరవిందో యొక్క సాధనా విజ్ఞానం అంతా కూడా ఆయనే చాలా స్పష్టంగా సావిత్రిలో పొందుపరిచాడు. కాని మళ్ళీ ఇంకో అరవిందో మనకి కనిపించటం లేదు. ఆ టవరింగ్ పర్సనాలిటీ కనిపించటం లేదు మనకి. రమణమహర్షి యొక్క సాధనా విధానం మనకు కనిపిస్తోనే ఉందికదా. "హూ యామ్ ఐ?" నేనెవర్ని అని నిన్ను నువ్వు ప్రశ్నించుకో అన్నాడాయన. ప్రశ్నించుకుంటూనే

ఉన్నారు ఆయన ఆశ్రమాలలో, ఆయన పుస్తకాలు చదివినవాళ్ళు, ఆయన గురించి చదివిన వాళ్ళు. కాని నేను రమణ మహర్షి జీవితాన్ని ఆధారముగా చేసుకుని మళ్ళీ నేను రమణమహర్షి అంతటి వాడినయ్యాను అని ఎవరూ చెప్పటంలేదు. మీరు ఇది గమనించుకోండి.

కాని ఫిజిక్స్ చదివినవాడు ఫిజిసిస్ట్ అయిపోతున్నాడు, కెమిస్ట్రీ చదివినవాడు కెమిస్ట్ అయిపోతున్నాడు, ఇంజనీరింగ్ చదివినవాడు ఇంజనీర్ అయిపోతున్నాడు. అలాంటివిద్య! ఏ విధంగా అవుతే ఎవరైనా ఇంజనీరింగ్ చదవటానికి కావలసిన మానసిక ప్రయత్నము చేస్తే ఇంజనీర్ అయినట్లుగా **మహానుభావులుగా అయ్యే విద్యగా ఆధ్యాత్మికత రూపొందాలి.**

ఆషామాషీగా ఇంజనీరింగ్ రాదుగా! ఇంటర్మీడియట్ చదువుకోవాలి, ఎంసెట్ పరీక్ష రాయాలి, అందులో ర్యాంక్ రావాలి. ర్యాంక్ వచ్చినా నువ్వు చదవదల్చుకున్న సబ్జక్ట్‌లో ఇంజనీర్ అవుతావో, కావో చెప్పలేం కదా! ఆ తేడాలున్నాయి అక్కడ.

కాని ఇంజనీరింగ్ చదవాలి అనుకుంటే స్పష్టంగా ఈ దారమ్మట వెళ్తే ఇవాళ కాకపోతే రేపు, రేపు కాకపోతే ఇంకోనాటికి, షార్ట్ టర్మ్ కాకపోతే లాంగ్ టర్మ్, లాంగ్ టర్మ్ కాకపోతే మల్టిపుల్ లాంగ్‌టర్మ్ కోర్సులు ఎంసెట్‌లో తీసుకుని ఇంజనీర్ అవ్వచ్చని ఏవిధంగా నిర్ధారణగా మనం చెప్పుకోగలుగుతున్నామో, అదే విధంగా జగద్గురు స్థాయికి ఎదగటానికి కావలసిన ఒక విధానం నేను అందజేయలేకపోయానే అని బాధపడుతూ కూర్చున్నాడు వ్యాసుడు, సరస్వతీ నది ఒడ్డున.

వేదాలు వ్రాశాను, ఉపనిషత్‌లు వ్రాశాను, పురాణాలు వ్రాశాను, స్మృతులు వ్రాశాను, మహాభారతం వ్రాశాను, వేదాలలో ఉన్నదాన్నంతా గూడా మామూలు వ్యక్తికి కూడా అర్థమవటానికి తగిన స్థాయిలో మహాభారతం వ్రాశాను నేను. అయినా ఏమిటో అసంతృప్తి! ఏమిటా అసంతృప్తి అంటే, చేతనత్వ విజ్ఞాన్నాన్ని నేను చెప్పలేకపోయాను అని. అది ఎలా చెప్పాలో అర్థం కాలేదు వ్యాసుడికి. **ఆ చేతనత్వ విజ్ఞానాన్ని**



**చెప్పటానికి ఇవ్వవలసిన మార్గదర్శనం నారదుడు చేశాడు.**

నారదుడు ఎవరెవరి దగ్గరకు వెళ్ళాడో, వాళ్ళందరి యొక్క చేతనత్వంలో మార్పు వచ్చింది. ఇక్కడ మనము ఆ విధమైనటువంటి మార్పు తెచ్చుకోవటానికి కూర్చున్నాం, ప్రయత్నం చేస్తున్నాం మనం. ఆ తేడా చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. మనము, మన చేతనత్వంలో మార్పు రావటానికి కూర్చున్నాం.

ఏ విధమైనటువంటి మార్పు రావాలి?

**సర్వజ్ఞత్వము, సర్వవ్యాపకత్వము, సర్వసమర్థుడు అయినటువంటి వ్యక్తులుగా మనం మారిపోవాలి.** అంటే మనమందరం ఎలాంటి వాళ్ళం అవ్వాలీ అంటే ఆ జగద్గురువు - శ్రీకృష్ణుడులాంటి వాళ్ళం అవ్వాలి. అందుకే భక్తులందరూ కూడా పార్షదులు అవుతారు అని చెప్తారు పుస్తకాలలో. అంటే ఏమవుతార్నమాట? భగవత్ స్వరూపులే అయిపోతారు. వైకుంఠంలోకి వెళ్తే అందరూ విష్ణురూపాలుగా కనిపిస్తారు మీకు. సత్యలోకంలోకి వెళ్తే అంతా బ్రహ్మలే కనిపిస్తారు మీకు. కైలాసంలోకి వెళ్తే అందరూ శివుళ్ళే కనిపిస్తారు. ఒకే రకం.

ఇంజనీరింగ్ కాలేజ్‌కి వెళ్తే అందరూ ఇంజనీర్సే కనిపిస్తారంటే మనకు కన్‌ఫ్యూజన్ రాదు. మెడికల్ కాలేజ్‌కి వెళ్తే అందరూ డాక్టర్లే కనిపిస్తారు అంటే మనకు కన్‌ఫ్యూజను రాదు. కాని వైకుంఠంలో అందరూ విష్ణువులే కనిపిస్తారు అనేసరికల్లా మీకు కన్‌ఫ్యూజను వచ్చేస్తుంది. అవగాహనా లోపం ఎంత ఉందో అర్థం చేసుకోండి. ఆ అవగాహనా లోపాన్ని సవరించుకోవటానికి మనము ప్రయత్నం చేస్తున్నాము అన్నది అర్థం చేసుకోండి.

గ్రహాలన్నీ కూడా విశ్వవిద్యాలయాలే. గురుగ్రహము ఒక విశ్వవిద్యాలయము. పృథ్వీగ్రహము ఒక విశ్వవిద్యాలయము. సూర్యమండలము ఒక విశ్వవిద్యాలయము. మనకు కనిపిస్తున్న నక్షత్రాలన్నీకూడా ఒకానొక విశ్వవిద్యా లయము యొక్క లక్షణాలు కలిగి ఉన్నాయి. మెడికల్ విశ్వవిద్యాలయము ఉందనుకోండి

అక్కడ ఏం చెప్తారు? మెడిసిన్ చెప్తారు. అగ్రికల్చరల్ విశ్వ విద్యాలయము అయితే వ్యవసాయం గురించి చెప్తారు. డెంటల్ కళాశాలలో పళ్ళు ఎలా పీకాలో చెప్తారు. కదా! అలాగే మీరు గుర్తుంచుకోవలసింది ఏంటీ అంటే, మనకు కనిపిస్తోన్నటువంటి,

అఖండమండలాకారం వ్యాప్తంయేన చరాచరమ్ ।
యత్పదం దర్శితం యేన తస్మై శ్రీగురవేనమః ॥

**ఈ సమస్త చరాచర విశ్వము యొక్క ఒకే ఒక ఉద్దేశ్యమేమిటి?** ఈ సమస్త చరాచర విశ్వము యొక్క ఒకే ఒక ఉద్దేశ్యం ఏంటీ అంటే మీ చేతనత్వాన్ని అభివృద్ధి చేయుట. మీరు చాలా జాగ్రత్తగా దీన్ని మళ్ళీ మళ్ళీ అర్థం చేసుకోండి. మొత్తము సృష్టి యొక్క రహస్యము, మీరు జీవించి ఉండటానికి కారణము ఏమిటంటే మీ చేతనత్వము అభివృద్ధి చెందాలి. మీ చేతనత్వము అభివృద్ధి చెందాలనేది మీ లక్ష్యము అనేది ఇప్పుడు అర్థం అవటంలేదు. ఎలాగో అలాగ చదివేసుకుని ఒక ఉద్యోగంలో చేరిపోతే, ఉన్న చేతనత్వం ఏమౌతోందో అర్థం చేసుకోండి మీ జీవితంలో.

జీవితంలో స్థిరపడ్డాడు అంటారు. స్థిరపడ్డాడు అంటే అర్థం ఏంటి? ఉన్న చేతనత్వంకూడా పోయింది. ఏం కోరుకుంటున్నారు మీరు? స్థిరత్వము. **ఈ జగత్తేగతి కలిగినది.** అంటే స్థిరత్వము లేనిది. అందుచేత మీ ప్రయత్నాలన్నీ వృథా అవుతాయి. స్థిరత్వము ఎప్పుడూ మీకు రాదు కూడా. కాని స్థిరత్వం ఎప్పుడు వస్తుంది? ప్రకృతి యొక్క వేగముతో కనుక మీరు జీవించగలిగితే స్థిరంగా ఉన్నట్టు అనిపిస్తుంది మీకు.

రెండు రైళ్ళు ప్రక్కప్రక్కనుంచి వెళుతున్నాయి అనుకోండి, చాలా ప్రక్కప్రక్క నుంచి. ఒకదాని వేగం, రెండోదాని వేగం ఒకేలాగ లేకపోతే ఒక రైలు ముందుకి వెళ్ళిపోతుంది, ఇంకో రైలు వెనక్కి పడిపోతుంది. కాని రెండు రైళ్ళూ ఒకే వేగంలో వెళుతూంటే వేరు, వేరు రైళ్ళలో ప్రక్క కిటికీలో కూర్చున్నవాళ్ళు మాట్లాడుకోవచ్చు. వాళ్ళు ప్రక్కప్రక్కనే ఉంటారు కనుక. కాని వాళ్ళు స్థిరంగా లేరు. ఏ వేగంతో వెళుతున్నారు వాళ్ళు? రైలు వేగంతో వెళుతున్నారు. అదేవిధంగా మీరు ప్రకృతి యొక్క వేగంతో కనుక వెళ్తే మీకు స్థిరత్వం లభిస్తుంది. అంత కంటే ముందు మీకు స్థిరత్వం లభించదు.



ప్రదక్షిణాయాం పదేపదే అనే ఆ ప్రదక్షిణ నమస్కారం యొక్క ఉద్దేశ్యం అది.

కాని పురోహితుడు ముక్కు పట్టుకోమన్నట్టే చేస్తున్నారు మీరు. మీ పూజలు అన్నీకూడా ఎలా ఉంటాయి అంటే, అవి మీ చేతనత్వంలో వరకూ వెళ్ళటం లేదసలు. మీ బాహ్యపరిధినికూడా అవి ముట్టుకోవటంలేదు. ఈ షోడశోపచార పూజ మాత్రమే చేసుకుంటూ రామకృష్ణ పరమహంస అంత గొప్పవాడయ్యాడు. నామదేవుడు-అంత గొప్పవాడయ్యాడు. వీళ్ళందరూ కూడా ఆ 16 రకాలైన చేతనత్వస్థాయిల్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేసుకుంటూ వెళ్ళారు.

సాయిబాబా ఆరతిలో అంతరార్థం? :-

మనం పూజలు ఎలా చేస్తాం? సాయిబాబాకు ఆరతి ఇస్తాం. ఆరతి ఇస్తోన్నంత వరకూ బాగానే ఉంటారు. తెర వేస్తారు. మన ఆశ్రమంలోని సంగతే చెప్తున్నాను నేను. తెర వెయ్యగానే మాట్లాడేసుకోవటం మొదలెట్టేస్తారు. అసలు తెర వేసింది ఎందుకు అక్కడ? అఃతర్ముఖం అవ్వండని. అంటే అసలు కీలకమైనటువంటి కాలమది. తిరుపతిలో కూడా, అక్కడికి వెళ్ళాక మీరు కళ్ళు మూసుకుని నమస్కారం చేస్తారు. **ఆ కళ్ళు మూసుకోవటంలో ఉద్దేశ్యం ఏంటీ అంటే, మీరు అఃతర్ముఖంలో ఆ స్వామిని మీ హృదయంతో పాటు ఇంటికి తెచ్చుకో గలగాలి.** అది ఎవరూ తీసుకురారు. తిరుపతికి ఎలా వెళదామా, అక్కడికి వెళ్ళి ఎవరి సిఫారసు చేయించు కోవాలి? సరే, సిఫారసు చేయించుకోండి, కాదనటం లేదు. అది మన అదృష్టవశాత్తూ జరిగేదికదా, మనం చేయించుకోదల్చుకున్నంత మాత్రాన జరగదుగా అది. వెళ్ళాక చేతనత్వంలో ఏం మార్పు వచ్చింది? ఏమీ రాలేదు. **ఆ చేతనత్వంలోని మార్పు రావటానికి కావలసిన ధ్యానశ్లోకాన్ని నాతోపాటు చెప్పండి.**

కృష్ణం నారాయణం వందే, కృష్ణం వందే వ్రజప్రియం ।
కృష్ణం ద్వైపాయనం వందే, కృష్ణం వందే పృథాసుతం ॥

నారాయణ స్వరూపుడైన శ్రీకృష్ణునికి నమస్కారము. వ్రజప్రియుడైన

శ్రీకృష్ణునికి నమస్కారము. ద్వైపాయన స్వరూపుడైన శ్రీకృష్ణభగవానునికి నమస్కారము. పృథ్వీపుత్రుడుగా జగద్గురు చేతనత్వ ప్రతీకయైన శ్రీకృష్ణునికి నమస్కారము.

ఈ నాలుగు చేతనత్వంలోని మార్పులలో, మొట్టమొదటి చేతనత్వంలోని మార్పు, కృష్ణం వందే పృథాసుతం. పృథాసుతం అంటే పృథ్వీపుత్రుడు. ఎవడు పృథ్వీపుత్రుడు? మనమందరమూ పృథ్వీ పుత్రులమే. మనమే కాదు, చెట్లు కూడా పృథ్వీపుత్రులే. ఈ చరాచర జగత్తంతా కూడా పృథ్వీమండలం మీద ఏది అవుతే వ్యాపించివున్నదో, ఇవంతా కూడా పృథ్వీపుత్రులే. ఈ పృథ్వీపుత్ర స్థితి మనకు అందజేయటానికి శిరిడీసాయి యొక్క అవతారం యొక్క ఒక ముఖ్యమైన లక్ష్యం. అఖండ చేతనత్వం -కుక్కలో, దోమలో, బల్లిలో అయినా - ఆ అఖండ చేతనత్వం యొక్క అనుభూతి ఆ షిర్డీసాయి స్వరూపంలో మీకు కనిపిస్తుంది.

పృథాసుతం, దాన్ని అర్జునస్థితి అని కూడా అంటాం మనం. అర్జునస్థితి అంటే ఏంటి? ఇరుసేనల మధ్య నా రథాన్ని పెట్టు అంటాడు అర్జునుడు. మీ జీవితాలలో కూడా ఈ ద్వంద్వము ఈ రోజు నుంచీ అనుక్షణమూ ఉంటూ ఉండాలి. అది మొదలైతే తప్ప భాగవతం యొక్క మొదటి మెట్టు ఎక్కం మనం. ఏంటక్కడ మొదలవ్వాల్సింది? ఎదురుగుండా భీష్ముడు, ద్రోణుడు, జయద్రథుడు, అనేకమంది బంధువులు, మేనమామలు, బావలు, అర్జునుడి యొక్క బంధువులు అందరూ గూడా ఎదురుగుండానే ఉన్నారు. కొంతమంది అర్జునుడు వేపు యుద్ధం చేస్తున్నారు, కొంతమంది అర్జునుడికి విరుద్ధంగా నుంచుని యుద్ధం చేస్తున్నారు. మీకలా అనిపిస్తోందా అని? జీవితంలో మీరొక యుద్ధం చేస్తున్నారు. యుద్ధం చెయ్యాలని అంటే అసలు ఇక్కడికి రారేమో రేపట్నుంచి! అలాంటి పరిస్థితి మాకెందుకు, మాకేదో శాంతంగా ముక్తి కావాలని అనకోకండి. కాని అలాంటిదేం లేదసలు, అలాంటి అపోహల్లో ఉండకండి. సాధనా సమరం. దానికి సిద్ధం కండి.

అందుచేత ఆ యుద్ధరంగం ఏంటో అర్థం చేసుకోండి మీరు చాలా జాగ్రత్తగా. రెండు రకాలైన ఆకర్షణలు మిమ్మల్ని బయటకు లాగుతూ ఉంటాయి. ఒకటి



భౌతికమైన సుఖాలు, ఇంకోటి అంతర్గతమైన సుఖాలు. ఈ రెండు రకాలైన కోరికలు మిమ్మల్ని లాగుతూ ఉంటాయి. ఒకటి, బాహ్యంవేపు తీసుకెళ్ళేవి. ఇంకొకటి, లోపలివేపు తీసుకెళ్ళేవి.

అంతర్ముఖులు అవ్వకపోతే ఏం.అవుతుందో తెలుసా మీకు?

బాహ్యం వేపు తీసుకెళ్ళేటటువంటి సుఖాలు ఎన్ని ఉన్నా, అంతర్గతం వేపు నువ్వు వెళ్ళలేకపోతే పిచ్చెక్కుతుంది అని నేను చెప్పాననుకోండి ఒప్పుకుంటారా? మళ్ళీ చెప్తున్నాను జాగ్రత్తగా వినండి. బాహ్యజగత్తు వేపుకి వెళ్ళగలిగేటటువంటి సుఖాలు మీకు అన్నీ లభించాయనుకోండి, మీకు ఏది కావాలంటే అది లభించింది. మీకేది కావాలంటే అది ఊ అంటే వచ్చేస్తుంది అన్న స్థితి ఉంది మీకు. నియమం ఏంటీ అంటే, ఏది లభిస్తుంది మీకు? బాహ్యజగత్తు వేపుకి తీసుకెళ్ళేటటువంటివి.

మీరు ప్రెసిడెంట్ అయిపోవాలంటే, అయిపోతారు. ఇంకా ఏం కావాలను కుంటున్నారు? టాటా, బిర్లా అయిపోవాలంటే, అయిపోతారు. హృతిక్ రోషన్ అయిపోవాలంటే, అయిపోతారు. ఇంకా అలాగే, రకరకాలుగా మీరు ఏం కావాలను కుంటున్నారో అదంతా అయిపోతూవుంటారు అనే వరం మీకు వచ్చేసిందనుకోండి. కాని ఆ వరంతో పాటు ఒక నియమం ఉంది. "మీరు అంతర్ముఖులవ్వదల్చుకుంటే, చచ్చినా అవ్వలేరు." ఈ నియమం ఒప్పేసు కుంటాంగా మనం, దానికేముంది! ఒప్పుకోరా? తప్పకుండా ఒప్పుకుంటాం.

కాని మీరు అంతర్ముఖులు అవ్వకపోతే ఏం అవుతుందో తెలుసా మీకు?

ఒకరోజు రాత్రి మీకు నిద్రపట్టలేదనుకోండి, రెండోరోజు ఏమౌతారు మీరు? మీరు హృతిక్ రోషనే, ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాయే, కోటీశ్వరులే, ఒక్కరోజు నిద్రపో కుండా కూర్చోండి చూద్దాం! అతికష్టం మీద మీరు నిద్రపోకుండా కూర్చున్నారు, రెండోరోజు కూడా మిమ్మల్ని నిద్రపోనివ్వలేదు! ఏమౌతారు మీరు? పిచ్చెక్కుతుంది. ప్రయత్నం చేసి చూడండి, మీరు అసలు కూర్చోగలరేమో!

అందుచేత, ఏం జరుగుతోంది? బాహ్యజగత్తువేపు వెళ్ళటం ఎంత అవసరమో, అంతర్‌జగత్తువేపుకూడా వెళ్ళటం అంతే అవసరము. అంతేకాక మీకు ఏం అర్థమైంది? అంతర్‌జగత్తులోకి వెళ్ళలేకపోతే, బాహ్యజగత్తు మీకు పిచ్చెక్కిస్తుంది. అంత వరకూ అర్థమైందికదా! కాని మన ఆకర్షణ, జ్ఞానము, విజ్ఞానము, మన తెలివితేటలు అంతా దేనికి ఉపయోగించుకొంటున్నాము అంటే బాహ్యజగత్తువేపు వెళ్ళటానికి ఉపయోగించుకొంటున్నాం. మరి మనల్ని మూర్ఖులు అనుకోవాలా, తెలివైనవాళ్ళు అనుకోవాలా? ఆ ప్రశ్నకు జవాబు మీరు ఖచ్చితంగా, ద్వంద్వం లేకుండా ఇవ్వగలగాలి. ఆ ప్రశ్నకి మీరు ఇచ్చిన జవాబు బట్టి ఈ ప్రతి ఆదివారం జరిగే తరగతుల్లో మీరు ఎంత ఎదుగుతారో అనేది ఆధారపడివుంటుంది.

ఎందుచేతంటే, మనిషికి విషయం అయితే చెప్పగలంకాని, దాన్ని ఆచరించ వలసింది స్వయంగా ఎవరికి వారే. ఆ ఆచరించటం అనేది తనకి అర్థమైతే తప్ప ఆచరించలేడు. ఓ ఇరవై, ముప్పై ఏళ్ళ క్రిందటి వరకూ కూడా చదువు మీద ఇంత ఆసక్తి లేదు ఎవరికీ. అకస్మాత్తుగా ఇప్పుడేమయింది అందరికీ, చదువుకోక పోతే ఏమైపోతాడో మా వాడు అనేటటువంటి బెంగ పట్టుకుంది.

ప్రహ్లాదుడి తండ్రి ఏం చేశాడు? ఎలాగైనా సరే వాడ్ని ఇంజనీర్ చెయ్యాలి, ఎలాగైనా సరే వాడ్ని డాక్టర్ చెయ్యాలి అనుకున్నాడు. ప్రహ్లాదుడు ఎదురుతిరిగాడు. నేను చదవను అన్నాడు. తండ్రి ఏం చేశాడు? ఆయనకి ఎన్ని శస్త్రలున్నాయో, అన్నీ ఉపయోగించాడు. చివరికి ఆయన చచ్చిపోయాడు తప్ప, ప్రహ్లాదుడుకి ఏమీ అవలేదు. చదివి ఉంటే ప్రహ్లాదుడు? ఏ యుగం వాడు ప్రహ్లాదుడు? సత్యయుగం నాటి వాడు. చదివుంటే ఆ చిన్న కుర్రాడు, ఐదేళ్ళవాడు? ఏ ఇంజనీర్ అయిపోయే వాడో, ఏ డాక్టర్ అయ్యేవాడో, కాని వాడ్ని గురించి ఇక్కడ, ఈ యుగంలో చెప్పుకోం. తేడా అర్థమౌతోందా నేను ఇచ్చిన ఉదాహరణలో?

ఆధ్యాత్మిక విద్య యొక్క ఉద్దేశ్యం ఏమిటీ



ఏది ముఖ్యము మీకు అన్నది మీరు నిర్ణయించుకోండి. ప్రాముఖ్యత మీరు దేనికి ఇస్తున్నారో, దాన్ని మీరు జాగ్రత్తగా అర్థం చేసుకోలేకపోతే, ఈ మొత్తము భాగవతమేకాదు, అసలు ఈ ఆధ్యాత్మిక విజ్ఞానం మీకు అవసరం. ఈ మొత్తము ఆధ్యాత్మిక విద్య యొక్క ఉద్దేశ్యం ఏమిటీ అంటే, ఏది శాశ్వతమైనదో, ఏది అవ్యయమైనదో, ఏది మీకు ప్రకృతి మీద పరిపూర్ణమైన శక్తినిస్తుందో ఆ విద్య.

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్ ।
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥ (భ.గీ. 4-6)

**నేను పుట్టుకలేనివాడను, నాశరహితస్వరూపము కలవాడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను అయినప్పటికి స్వకీయమగు ప్రకృతిని వశపఱచుకొని నా మాయాశక్తిచేత పుట్టుచున్నాను (అవతరించుచున్నాను).**

**ఆత్మదర్శన జ్ఞానం కావాలి అనుకున్నప్పుడు భాగవతం మీకు ఉపయోగ పడుతుంది.** ఏం తెలియాలి మొట్టమొదట మీకు? నేను పుట్టక లేనివాడిని అని. మేషరాశి యొక్క వాహనము, ద్వాదశరాశి చక్రములో మేక. ఈ మొత్తము సృష్టి యొక్క దానికి కావల్సిన కథని, ఆ దక్షయజ్ఞంలో మనం తెలుసుకుంటాం. భాగవతంలో ద్వాదశ స్కంధాలున్నాయి, ఈ ద్వాదశ స్కంధాలు కూడా మొత్తము ఆధ్యాత్మిక జ్యోతిషవిద్యయే. మేక **అంటే అజ. అజ అంటే పుట్టుక లేనివాడు అని**. ఆగ్నేయ దిశలో మనం మేకను అగ్ని యొక్క వాహనంగా పూజిస్తాం. ఆగ్నేయ దిశ యొక్క అధిపతి ఎవడు? అగ్ని. అంటే అగ్నికి, మేకకి ఉన్న సంబంధము తెలియాలి.

**అంటే పుట్టుక లేకుండా ఉండటానికి, అగ్నికి ఉన్న సంబంధము కనుక మనకి అర్థమైతే భాగవతంలోకి ప్రవేశిస్తాం.** చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. ఈ తరగతుల్లో మీరు మీ చేతనత్వాన్ని మార్చేసుకుని వెళ్ళాలి. అంటే మీ దృష్టికోణం పూర్తిగా మారిపోవాలి. ఏవిధంగా మారాలి?

అజోపిసన్ - పుట్టుక లేనివాడనైనప్పటికి,

అవ్యయాత్మ - నాశరహితమైనటువంటి ఆత్మ కలిగి ఉన్నవాడినైనప్పటికి,

భూతానాం ఈశ్వరోపిసన్ - ఐదుతత్వాలమీద అధిపత్యం కలిగిఉన్నప్పటికి,

ప్రకృతిం స్వామధిష్ఠాయ - ప్రకృతి నా యొక్క అధిష్ఠానంలో ఉంది, నా యొక్క నియంత్రణలో ఉన్నా ఏమైంది?

సంభవామి ఆత్మమాయయా - నా యొక్క మాయాశక్తి చేతే నేను మళ్ళీ మళ్ళీ పుడుతున్నాను.

ఆ విద్య మర్చిపోయాం మనం. ఇప్పుడు ఆ విద్య నేర్చుకోబోతున్నాం. అందుచేత ఇది మనం రెగ్యులర్‌గా వారం వారం అవగాహన చేసుకుంటూ, మెల్లిమెల్లిగానే వెళ్దాం. ఒక్కరోజులో అభివృద్ధి చెందలేం. కాని ఈ మానసికస్థితి ఎక్కడికి మిమ్మల్ని తీసుకెళుతోందో అర్థం చేసుకోండి. ఇది బాగా మీకు కంఠతా రావాలి.

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్ ।
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥ (భ.గీ. 4-6)

**నేను పుట్టుకలేనివాడను, నాశరహితస్వరూపము కలవాడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను అయినప్పటికి స్వకీయమగు ప్రకృతిని వశపఱచుకొని నా మాయాశక్తిచేత పుట్టుచున్నాను (అవతరించుచున్నాను).**

గురుచేతనత్వాలన్నీ దేన్ని నిరూపిస్తాయి?

గురుచేతనత్వాలన్నీకూడా దీన్నే నిరూపిస్తాయి. మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి యొక్క జీవితం, రాఘవేంద్రస్వామి యొక్క సమాధి ఏం చెప్తోంది మనకి? ఆయన శరీరం వదిలేశాడు. కాని ఇప్పటికీ కూడా అక్కడ ఆయన ఎలా వెలుగుతున్నాడు? కల్పవృక్షంలాగ వెలుగుతున్నాడు. కదా! శిరిడీసాయి. ఎదురుగుండా మన మధ్యనే జీవించివున్నటువంటి సత్యసాయి. వీళ్ళందరూ కూడా ప్రకృతి మీద వాళ్ళ అధిపత్యాన్ని చూపిస్తున్నారుకదా!

వాళ్ళేనా? ఇతర దేశాలలో కూడా మనం అనుకునే ఇతర మతాలలో కూడా



ఇది కనిపిస్తుంది. నేను చెప్పిన మాటల్ని చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. మనం అనుకుంటున్నాం అవి ఇతర మతాలు అని. కాని ఆ క్రైస్ట్ కూడా చేసింది అదే. నీళ్ళ మీద నడిచాడు. తుపాన్ వచ్చింది, గాలి కొట్టేస్తోంది పడవని ఆగు అన్నాడు. గాలి ఆగిపోయింది. అంటే ఏంటి ఇక్కడంతా మనం తెలుసు కుంటోంది? వాళ్ళకి ఆ పాంచభౌతికమైనటువంటి తత్వాలు మీద అధిపత్యం ఉన్నదనేగా అర్థం. యోగి ఎవరు ఉన్నాకూడా, వాడు సూఫీ మతస్థుడు కావచ్చు, ముస్లిమ్ కావచ్చు, బుద్ధిస్ట్ కావచ్చు, జైనముని కావచ్చు, వాడెవడైనా కావచ్చు. కాని వాళ్ళ యొక్క ఆ గొప్పతనానికి నిదర్శనం మనం ఎలా చూస్తాం? ప్రకృతి మీద వాళ్ళకున్న అధిపత్యం వల్ల.

**రాబోయే యుగంలో ఈ విద్యే నేర్పబడుతుంది**

**అందుచేత రాబోయే యుగంలో, రాబోయేటటువంటి రోజులలో, ఈ విద్యే నేర్పబడుతుంది స్కూల్స్‌లో, కాలేజీల్లో, అన్నిచోట్లా.** నేర్పబడటానికి కారణం ఎలా అవుతుంది? మీరు చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. కంప్యూటర్ సైన్స్ స్కూల్స్‌లో మొదలెట్టేముందు, కాలేజీల్లో మొదలెట్టేముందు, ఇంజనీరింగ్ కాలేజీల్లో మొదలెట్టకముందే మనుష్యులు దగ్గరికి వచ్చేసింది. మీరు అది గమనించారా ఎప్పుడైనా? కంప్యూటర్స్ ఇంజనీరింగ్ కాలేజీల్లో చెప్పటానికి ముందే బయట ప్రపంచంలోకి వచ్చేశాయి. బాహ్యజగత్తులో మేం కంప్యూటర్ చదువు కుంటాము అనే వ్యక్తులు ఎక్కువయ్యాక విశ్వవిద్యాలయాల్లోకి వచ్చింది.

మీరు అది అర్థం చేసుకోండి, ఏదైనా విద్య విశ్వవిద్యాలయాల్లోక్కి కాని, పాఠశాలల్లో కాని రావాలి అంటే, మొట్టమొదట ఆ విద్య నేర్చుకోవాలి అనుకునే వ్యక్తుల సమూహము బయట ఏర్పడాలి. అదీ మన ప్రయత్నము. అందుచేత ఖచ్చితంగా ఈ ప్రయత్నం మనం కొనసాగిస్తూవుంటే, రేపు రాబోయేటటువంటి రోజుల్లో ఈ కంప్యూటర్స్ ఉండవ్, ఈ ఇంజనీరింగ్స్ ఉండవ్, ఈ మెడికల్ కాలేజీలు ఉండవ్. ఎందుకు ఉండవు? మెడిసిన్ నయం చేయనటువంటి రోగాలన్నిటినీ గూడా ఈ

గురువులు నయం చేశారు.

మూకం కరోతి వాచాలమ్ పంగుమ్ లంఘయితే గిరిమ్ ।
యత్కృపా తమహం వందే పరమానంద మాధవమ్ ॥

మూకం కరోతి వాచాలమ్ - మాటలేని వాడికి మాట ఇవ్వగలరు వాళ్ళు.

"పంగుమ్ లంఘయితే గిరిమ్ - కాళ్ళు లేనివాళ్ళ చేత పర్వతాలు దాటించగలరు". "యత్కృపాతమహం వందే పరమానంద మాధవమ్ - ఆ పరమానంద రూపి మాధవుని కృప కోరతాను".

ఆ మానసికస్థితి గురించి చెప్తున్నాను. కృష్ణుడు అలా చేశాడు, సత్యసాయి అలా చేస్తున్నాడు, శిరిడీ సాయి, క్రైస్ట్, బుద్ధుడు అలా చేశారు, మీరిది కాదు గుర్తించాల్సింది. మీరు కూడా అలా చేయగలరు, కనుకే భాగవతాలు, భగవద్గీతలు చదువుకోవటం. అలా చేయలేక పోతే, ఇదంతా ఎందుకు చదువుకోవటం?

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్ ।
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥ (భ.గీ. 4-6)

**నేను పుట్టుకలేనివాడను, నాశరహితస్వరూపము కలవాడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను అయినప్పటికి స్వకీయమగు ప్రకృతిని వశపఱచుకొని నా మాయాశక్తిచేత పుట్టుచున్నాను (అవతరించుచున్నాను).**

కాని ఒక ఇంజనీరింగ్ కాలేజీలో సీటు సంపాదించుకొని మీరు చదవాలి అంటే, కొన్ని లక్షలు ఖర్చుపెడతారు. దాని తరవాత వాడు రోజుకి ఎన్ని గంటలు చదువుకుంటాడు? నాకు తెలుసు చాలా మంది తల్లిదండ్రులు ఇంటర్మీడియెట్ చదువుతూ వుంటే వాడ్ని వేపుకు తినేస్తారు. కాస్త వాడు టీ.వీ. పెట్టుకుంటే, ట్యూషన్కెళ్ళు అంటారు. రాత్రి పదిగంటలకి ఏదైనా టీ.వీ. పెట్టుకుంటే, పుస్తకం తీసుకొని చదువుకోకూడదా? ఉదయమైతే మూడున్నర అయింది ఇంకా పడుకునే ఉన్నావు లేచి



చదువుకోకూడదా అంటారు.

తత్త్వాల మీద ఆధిపత్యం కావాలంటే ఎన్ని సాధనలు చెయ్యాలి?

**ఈ బోడి ఇంజనీరింగ్కే నువ్వు ఇంత కష్టపడితే, పంచభౌతికాల మీద, ఈ తత్త్వాల మీద ఆధిపత్యం కావాలి అనుకొనే నువ్వు ఎన్ని సాధనలు చెయ్యాలి?** హాయిగా కూర్చుని, రెండు కబుర్లు చెప్పేసి, రెండు మంత్రాలు చదివేసి, నాకు ఏదీ రాలేదే అంటే ఏం వస్తుంది? ఏమీ రాదు. మీరు చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. ఈ ఆధ్యాత్మిక సాధన, ఈ పంచతత్త్వాల మీద ఆధిపత్యం అనేది 24 గంటల విద్య. 24 గంటలూ మీరు సాధనలు చేయగా, చేయగా, చేయగా, చేయగా, చేయగా ఎప్పుడో, ఏ జన్మలోనో వస్తుంది.

అర్జునుడు అడుగుతాడు అందుకే, నువ్వు చాలా గొప్పగా చెప్పేవ్, ఇంత పెద్ద పెద్ద సాధనలు అన్నీ చేసేయమంటున్నావ్. నేను మధ్యలో చచ్చాననుకో, రెండూ పోయేకదా అన్నాడు. ఏం పోయింది? ఒకటేమో ఈ భౌతికమైనటువంటి ఆనందాలు పోయాయ్. ఇటూ సుఖపడలేదు. ఎలాగూ అందరూ నన్ను వెర్రివాడు అంటున్నారు, పిచ్చివాడు అంటారు, అదంటారు. మనం చాలా గొప్ప ఎందుచేతంటే, ఈ మార్గంలో వెళ్ళిన వాళ్ళందరికీ మనం మొదట ఇచ్చేటటువంటి బిరుదు ఏంటంటే, వాడు పిచ్చివాడని. తరవాత మీరు పిచ్చివాళ్ళయి వాడి దగ్గరికి వెళతారు. మీ కళ్ళ ముందు ఉన్నదే కదా, అందరి గురువుల చరిత్రల్లోను.

అందుచేత ఆ పాయింట్ అర్థం చేసుకోండి, ఏం చెప్తున్నానో. ఆషామాషీగా రెండు పువ్వులు పెట్టేసి, రెండు ఆసనాలు వేసేసి, కళ్ళు మూసుకుని ధ్యానం చేస్తున్నాను అని మీరు భ్రమపడుతూ, ఇంకోళ్ళని భ్రమలో పడేస్తున్నారు. ఎందుచేతంటే, మీరు ధ్యానం చేయటం లేదని నేను చాలాసార్లు చెప్పాను. మీరు ప్రత్యాహారం నేర్చుకుంటున్నారు. అది కూడా చేయటంలేదు మీరు. ప్రత్యాహారం నేర్చుకుంటున్నారు. దానికి మనం పేరేం పెట్టుకున్నామంటే ధ్యానం చేసేస్తున్నాం అని. ఈ విధమైన సవ్యమైనటువంటి జ్ఞానం ముందు తెచ్చుకోండి.

**మీరు కష్టపడటానికి సిద్ధమవ్వండి, అప్పుడు ఖచ్చితంగా ఈ పది, పన్నెండు ఏళ్ళల్లో ప్రకృతి మీద ఆధిపత్యం సంపాదించగలుగుతారు.** మీరు అంటే నువ్వా, నువ్వా, నువ్వా, నువ్వా ఎవరో మరి, నాకు తెలీదు. మానవజాతిలో ఐదుగురిలో ముగ్గురికి ఈ శక్తి వస్తుంది అన్నది భవిష్యవాణి. ఐదు మంది కనుక ఉంటే, ముగ్గురు ఈ స్థితిలో ఉంటారు అని, రాబోయే వంద ఏళ్ళల్లో, 2100 ఎ.డి. నాటికి. అంటే ఐదుగురం కూర్చుని ఉన్నాం కదా ఇక్కడ. ఇందులో ముగ్గురికి ఏ శక్తి వస్తుంది అంటే, ఈ శక్తి వస్తుంది.

కాని ఎప్పుడొస్తుంది? దీన్ని అభ్యాసం చేసేవాళ్ళ సంఖ్య పెరుగుతే. కాని **దీన్ని అభ్యాసం చెయ్యాలని మీకు అన్పించకపోవటం ఉందే, అది చాలా ఆశ్చర్యం!** భగవద్గీతలో అందుకే ఒక శ్లోకం చెప్తాడు, ఈ ఆధ్యాత్మిక జగత్తులో ఇంత గొప్పతనం ఉన్నది, నువ్వు కూడా రామకృష్ణ పరమహంస అంతటి వాడివి అవ్వచ్చు, నువ్వు కూడా సత్యసాయి అంతటి వాడివి అవ్వచ్చు, నువ్వు కూడా శిరిడీ సాయి అంతటివాడివి అవ్వచ్చు, నువ్వుకూడా నారదుడువి అవ్వచ్చు, నువ్వుకూడా వశిష్ఠుడివి అవ్వచ్చు, నువ్వు కూడా విశ్వామిత్రుడివి అవ్వచ్చు అని చెప్పినా ఎవ్వడూ అలా అవ్వాలని కోరుకోలేకపోతున్నాడే అన్నది పెద్ద ఆశ్చర్యం.

*ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేన మాశ్చర్యవద్వదతి తథైవ చాన్యః ।*
*ఆశ్చర్యవచ్చైనమన్యశ్శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥ (భ.గీ. 2 - 29)*

**ఈ ఆత్మను ఒకానొకడు ఆశ్చర్యమైన దానినివలె చూచుచున్నాడు. మఱియొకడు ఆశ్చర్యమైన దానినివలె (దీనిని గూర్చి) చెప్పుచున్నాడు. అట్లే వేఱొకడు ఆశ్చర్యమైన దానినివలె దీనినిగూర్చి వినుచున్నాడు. అట్లు వినియు, చూచియు, చెప్పియుగూడ ఒకడును దానిని సరిగా తెలిసికొనుటలేదు (సాక్షాత్తుగ అనుభవించుటలేదు).**

అవునా కాదా మీరు ఆలోచించుకోండి. అర్థమవుతోందా అసలు మీకు! దీనివల్ల మీరు ఆ కృష్ణుడంతటి వాడు అవుతారు. ప్రతీ ఒక్కళ్ళు కూడా.

వ్రజభూమిలో ఉన్న ప్రతీ ఒక్కడు గూడా కృష్ణుడే. ప్రతి ఒక్కళ్ళకీ కూడా ఆ



శక్తి ఉంది. చూపించలేదు! క్రిందటి వారం చెప్పింది అర్థం చేసుకోండి, పాత్రలో నటన చెయ్యటం అనేది. వాళ్ళు వాళ్ళ పాత్రల్లో నటించారు, కృష్ణుడు పాత్రలో అతను నటించాడు. కాలేజీలో అందరూ లెక్చరర్స్, కాని ఒకడు ప్రిన్సిపాల్ అవుతాడు. మేమందరం ప్రిన్సిపాల్స్‌మే అన్నారనుకోండి, అప్పుడు ఏమవుతుంది కాలేజీ? కాని ఒక లెక్చరర్, ప్రిన్సిపాల్ అవుతాడు. అదేవిధంగా అనేకమంది కృష్ణులలో ఒక్కడు కృష్ణుడి వేషం వేశాడు. మిగతావాళ్ళందరూ మిగతా వేషాలు వేశారు. అందుకే వ్రజభూమి లోకి వెళ్ళేసరికి, మధుర, బృందావనంలోకి వెళ్ళేసరికి రామకృష్ణ పరమహంస స్మృతి కోల్పోయేవాడు. అక్కడున్న ప్రతి ఆకు కూడా కృష్ణచేతనత్వమే అని, ఆ చేతనత్వ విజ్ఞానం తెలుసున్న వాళ్ళకు తెలిసింది. చేతనత్వ విజ్ఞానం తెలీని వాళ్ళకి?

ఆయుర్వేదం

ఆయుర్వేదంలో ఒక గ్యారంటీ ఉంది. ఏదైనా ఒక విషపురుగు కనుక నిన్ను కాటేస్తే, అది ఎక్కడ కాటేసిందో, ఏపరిధిలో మిమ్మల్నికుట్టిందో, అక్కడే ఆ పరిధిలోనే దానికి మందు ఉంటుందని. చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి ఇది. రెండూ ప్రక్కప్రక్కనే ఉంటాయి బొమ్మ, బొరుసూ లాగా. ఓ పాము మిమ్మల్ని కాటేసిందనుకోండి, ఆ పాము విరుగుడు పాము ఎక్కడైతే కాటేసిందో, ఆ ప్రక్కనే ఉంటుంది, ఆ చుట్టుప్రక్కల ఏదో ఒక ఆకులో. కాని మరి ఎందుకు మనకి తెలీటంలేదు! ఆ చేతనత్వం లేదు. ఆ జ్ఞానము లేదు. ఆయుర్వేదము లేదు.

**ఆయుస్సును పెంచే జ్ఞానము ఆయుర్వేదము. వేదము అంటే జ్ఞానము, ఆయువు అంటే ఆయుస్సు. అంచేత ఆయుర్వేదము కనుక తెలుస్తే, ఆయుస్సు అలా పెరుగుతూ పోతూవుంటుంది.** అందుకని ఈ భాగవతంలోనే మెల్లిగా మనం ఇంకాస్త ముందుకు వెళ్ళే, ఏడుగురు చిరంజీవులు యొక్క ప్రసక్తి వస్తుంది. (అశ్వద్ధామ, బలి, వ్యాసుడు, హనుమంతుడు, విభీషణుడు, కృపుడు, పరశురాముడు) వాళ్ళు ఇప్పటికీ సశరీరముగా మన మధ్యనే ఉన్నారు అని. అది తర్వాతర్వాత తెలుసుకుందాం. ఈ పుస్తకము, మీ జీవితాలలో ఎంత మార్పు తెస్తుందో చెప్పటానికి ఇవంతా చెప్తున్నాను.

ఆయుర్వేదములో పాము మిమ్మల్ని ఎక్కడ కాటేసిందో, ఏ ప్రాంతంలో కాటేసిందో, ఆ చుట్టప్రక్కలే ఉంటుంది ఆకు. కాని మనకి తెలియదు. పరీక్షిత్తు - శుకమహర్షి కలయిక దీనికి ఉదాహరణ. తక్షకుడు కాటువేయక ముందే, మందు సిద్ధం!!

అలాగే, వ్రజభూమిలో ఉన్నటువంటి ప్రతీ ఆకూ కూడా కృష్ణ చేతనత్వమే. మధురలో ఉన్న ప్రతీ కణమూ కూడా కృష్ణ చేతనత్వమే. మనకి తెలియదు. తెలియక పోయినంత మాత్రాన వాళ్ళు చెప్పింది తప్పు అవదుకదా! కాని ఆ ఏరియాలోనే, వ్రజభూమిలోనే, మధురా, **బృందావనంలోనే ఆ కృష్ణ చేతనత్వం యొక్క గొప్పతనం ఉన్నది. మనకి ఆ కృష్ణ చేతనత్వం మీద ఆసక్తి లేదు కనుక, మీరు అక్కడికి వెళ్ళినా మీకేం కనిపించదు.** నేను చెప్తూవుంటాను కదా! మా స్నేహితుడు ఒకతను బదరీనాథ్‌కి వెళ్ళాడు. ఏం చూసొచ్చావు నాయనా అక్కడ అన్నాను. "అక్కడ ఇడ్లీ, సాంబార్ దొరుకుతుంది, నువ్వేమీ కంగారుపడకు రామకృష్ణా!" అన్నాడు.

ఎందుచేతంటే, ఇక్కడ చాలామంది చెప్తారు, ఇక్కడ మీకు చాలా ఆరోగ్యం బాగుపడుతుంది, నా డయాబెటిస్, బీ.పీ. అంతా గూడా ఈ ఆహారనియమాల వల్ల తగ్గింది అంటే, ఇక్కడే చాలామంది ప్రశ్నించారు, అయితే ఇంక ఆ బ్రతుకు ఎందుకన్నారు. నా బ్రతుకు ఎందుకు అని అడిగారన్నమాట ఇన్‌డైరెక్ట్‌గా. ఎందుకు నీవు జీవించడం అని? నూనె, చింతపండు తినటంలేదు, కాఫీ, టీలు త్రాగటం లేదు, అవి త్రాగని బ్రతుకు కూడా ఒక బ్రతుకేనా అనే మానసికస్థితిలో ఉన్నవాళ్ళకి ఈ ఆరోగ్యం, భాగవతం ఎక్కడ అర్థమవుతాయి? మాకు అర్థమయ్యింది మాస్టారూ! అయితే చేసి చూపించండి. మీకు అర్థమైతే ఏం లాభం? చదువుకోవాలని నాకు అర్థమైంది, కాని చదువుకోకపోతే మార్కులు రావుగా!

భారతదేశంలో పుట్టినందుకు మీరు ఎందుకు గర్వించాలి?

ఆ చేతనత్వములోని పరిణతి గురించి నేను చెప్తున్నాను. **భారతదేశంలో పుట్టినందుకు మీరు ఎందుకు గర్వించాలి అంటే అలాంటి సిద్ధ క్షేత్రాలు, మీ చేతనత్వాన్ని కేవలము అక్కడికి వెళ్ళిన మాత్రం చేత మారిపోయే అనేక స్థలాలు**



**ఉన్నాయి ఈ దేశంలో.** కాని వెళ్తాము మారము, వెళ్తాము మారము. ఎందుకు? ఏం మారాలో, అక్కడ మనం ఏం కోరుకోవాలో తెలియని స్థితి మనది. వెళ్తాం అక్కడికి, చెప్పేవాళ్ళు ఎవరూ లేరక్కడ. చెప్పేవాళ్ళు లేరుకదా, నువ్వు అడుగుతే కదా ఎవడైనా చెప్తాడు. ఏం అడగాలి? చదువుకుంటే కదా ఏమైనా అడుగుతావు!

ఇదంతా గుర్తుంచుకోండి, దేనిగురించి చెప్తున్నానో నేను. **అర్జునస్థితి మనలోకి వస్తే తప్ప, ఈ పంచభూతాల మీద ఆధిపత్యం రాదు.** పంచభూతాల మీద ఆధిపత్యం తరవాత ఏం రావాలి? మాయాశక్తిని ఉపయోగించుకోవటం రావాలి. అదే ఇక్కడ, సప్తఋషి ఆశ్రమంలో ఉన్నటువంటి ఈ రెండు విగ్రహాల (జగజ్జనని శ్రీమహాయోగేశ్వరీ దేవి, శ్రీకృష్ణుడు) యొక్క ప్రాముఖ్యత.

మురళి యొక్క ప్రాముఖ్యత - ఆసనాలు :-

ఇక్కడున్నటువంటి కృష్ణవిగ్రహంలో ఉన్న ప్రాముఖ్యత మీరు చూసి ఉంటారు. 6 చేతులు. నాలుగు కనిపిస్తున్నాయి, ఇంకో రెండు చేతులు మాయా స్థితిలో ఉన్నాయి. ఏమేమి ఉన్నాయి అతని చేతిలో? ముందు రెండు చేతులతో మురళి ఉంది. కనిపిస్తోంది కదా! ఆ మురళి యొక్క ప్రాముఖ్యత ఏంటి అంటే ప్రాణాయామం బాగా తెలిసి ఉండాలి అని. డాక్టర్ మెడలో స్టెతస్కోప్ ఎలా ఉంటుందో, **ప్రాణాయామ విద్య తెలిసున్న వాళ్ళ చేతిలో మురళి ఉంటుంది.** అంతే తప్ప అతనేం ఫ్లూట్ వాయించి పాటలూ అవీ ఏం పాడటం కాదు.

ఆ ప్రాణాయామానికి కావలసిన సిద్ధాంతాలు కొన్ని ఇక్కడ నేర్చుకున్నారు మీరు, అభ్యాసం చేస్తున్నారో లేదో నాకు తెలీదు ఇంకా. కాని రెగ్యులర్‌గా చేసుకోండది. ఇదంతా చెప్పిన తరువాత ఎన్ని ఉపన్యాసాలు విన్నా, వాటి యొక్క ఉద్దేశ్యం ఏంటి అంటే, మీకు దానివేపు మోహం కలిగించటం, ఆసక్తి కలిగించటం, ప్రేమ కలిగించటం. కలిగిన తరవాత మీరు మారాలి.

అందుచేత ఆ మురళి ప్రాణాయామం యొక్క సంకేతం. ప్రాణాయామంలో ఎంత నిపుణులు కావాలి అంటే మీ శ్వాస మీ యొక్క మేరుదండం మీద ఏ

**రాగము పలికించాలో ఆ రాగాన్ని పలికించాలి.** 3, 4 ఏళ్ళల్లో మీరు అది నేర్చుకోవచ్చు ఆ విద్య. 3, 4 ఏళ్ళల్లో రోజుకి రెండు మూడు గంటలు అవస్థపడితే ప్రాణాయామం మీద ఆధిపత్యం వస్తుంది.

కాని ఆ ప్రాణాయాయం మీద ఆధిపత్యానికి తగిన ఆసనం ఏంటి? క్రింద కాళ్ళు ఎలా పెట్టాడో చూడండి శ్రీకృష్ణుడు. అది ఏ ఆసనం? గరుడాసనం. ఆ ఆసనం మీద కూర్చుని ఉంటాడు కనుక, విష్ణువు యొక్క వాహనం గరుడుడు. అయన గరుడుడు మీద ఎక్కితే, అది పాపం ఆయనను మోస్తూ గాలిలో ఎలా ఎగురుతుంది. గరుడాసనం, ప్రాణాయామము మీకు తెలుస్తే, మీరుకూడా గాలిలోకి ఎగిరిపోతారు. మీరు అభ్యాసం చేసుకొని చూసుకోవచ్చది.

కాని అది ఇక్కడ చేయలేరు మీరు. ఈ వాతావరణంలో కుదరదది. దానికి వాతావరణం మారాలి. వాతావరణం మారాలి అంటే, ఏ తిరుపతిలాంటి క్షేత్రాల్లోనో, వైష్ణవ క్షేత్రాలు ఉన్నాయి చూశారుకదా! ఆ వైష్ణవ క్షేత్రాలు అన్నిటింలోనూ ఈ గరుడాసనం పనిచేస్తుంది.

అక్కడే ఎందుకు పనిచేస్తుంది? మళ్ళీ చాలా తెలివైన ప్రశ్న వేశామనుకుంటారు. ఇనుము కావాలి. ఇనుము ఎక్కడికెళ్ళి తెచ్చుకుంటాం? మన ఇష్టం వచ్చిన చోట ఉంటుందా, లేకపోతే అదంతా ఒకేచోట గుమిగూడి ఉంటుందా? గనులు అంటాం. ఇనపగనిలో రాగి దొరకదు మీకు. రాగి దొరికితే రాగి గని అంటాం.

అలాగ ప్రకృతిలో, పృథ్వీగ్రహంలో ఒక్కొక్కచోట, ఒక్కొక్క చేతనత్వస్థాయిని పెంచే తీర్థాలున్నాయి. వైష్ణవతీర్థాలు అనొచ్చు వాటిని, శైవ తీర్థాలు అనొచ్చు. శక్తి తీర్థాలు అనొచ్చు. కాని ఒకదాంట్లో ఒకటి మళ్ళా గందరగోళం పడకండి మీరు. చేతనత్వ విజ్ఞానములో ఒక్కొక్క తీర్థానికీ కావలసిన ఒక్కొక్క ప్రాముఖ్యత ఉంది.

సింహాసనం, లాఫింగ్ క్లబ్‌లో మనం సింహంలాగ మొహం పెట్టమంటున్నాం. ఆ మొహం కనుక శక్తిపీఠాలు దగ్గరకి వెళ్ళి పెడితే, మీకు తెలుస్తుంది మీలోకి ఆ శక్తి



ఎలా వస్తుందో. మేం వెళ్ళి పెట్టేస్తాం మాస్టారు, కొంపలంటుకుంటాయి, రెండు విధాలా. ఒకటి, మీరు అలా ఆ... అని పెడతారు. ఏమీ అవదు. మీరు చెప్పింది తప్పు అంటారు, గొడవ వదిలిపోయింది. ఒకవేళ మీరు అక్కడ అలా పెట్టారు, మీ అదృష్టం బావుండి కనెక్షన్ వచ్చింది. కాలిపోతారు! మాడిపోతారు మీరు. ఎందుచేత? మీ శరీరము ఆ శక్తిని తట్టుకోగలిగే స్థితిలో ఉండాలి, ఆ జ్ఞానాన్ని భరించగలగాలి.

మీరు అనుకుంటారు, ఎవరైనా ఏదైనా చదువు చదివేసుకోవచ్చని. మేథమెటికల్ బ్రెయిన్ లేని వాడిని ఇంజనీరింగ్ కాలేజిలో చేర్పించండి, ఏమౌతుందో చూడండి. ఏమౌతుందో తెలుసా? వాడికైనా పిచ్చెక్కుతుంది, లేకపోతే వాడు మీకైనా పిచ్చెక్కించేస్తాడు. లేదా లెక్చరర్స్‌కి పిచ్చెక్కించేస్తాడు. అదే జరుగుతోంది ఆ తీర్థక్షేత్రాల్లో కూడా. అందుచేత, ఆ తీర్థక్షేత్రాల్లోకి వెళ్ళే ముందు, మీకు ఆసన, ప్రాణాయమాలు మీద పరిపూర్ణమైన ఆధిపత్యం వచ్చి తీరాల్సిందే, ఇంకో దారిలేదు.

ఆ దేవతా విగ్రహాల యొక్క ఫలితాలు మనకి రాకపోవటానికి, ఆ దేవతల్ని పూజిస్తే, ఆ దేవతల యొక్క శక్తి మనలోకి రాకపోవటానికి కారణం ఏమిటీ అంటే, మీకు ఆసనం మీద సరియైన ఆధిపత్యం లేదు. అవి ఆసనాలనికూడా తెలియటం లేదు. సుబ్రహ్మణ్యస్వామి దేనిమీద ఎక్కుతాడు? నెమలి మీద ఎక్కుతాడు. నెమలి ఆసనం ఉంది ఒకటి. దాని పేరు ఏంటి? మయూరాసనం. అందుచేత సుబ్రహ్మణ్య స్వామి ఉపాసన చేయదల్చుకుంటే, మయూరాసనంలో ముందు కుశలుడివికా అని వాళ్ళు చెప్తూవుంటే, అసలు ఆసనాలు ఎందుకండీ అని అడిగే స్థితిలో ఉన్నాం మనం. కారణం ఏమిటీ? ఆ విద్య లేదు. అడగటంలో తప్పులేదు. అడిగితేనే కదా చెప్తారు. అందుచేత మీరు అడగడం తప్పని నేను చెప్పటంలేదు.

మన చేతనత్వ విజ్ఞానకేంద్రాలు దేవాలయాలు. పాఠశాలలకి ఎలాగ ప్రొద్దుట వెళ్ళి, సాయంత్రానికి చదువుకొని వస్తున్నారో, దేవాలయాలలో ఆ విద్య ఉండేది ఒకప్పుడు. ఆ విద్య ఎప్పుడు మళ్ళా బయటకొస్తుంది? ఈ ఆసన, ప్రాణాయామాలలో మీరు నిష్ణాతులవుతేనే. అయితే ఆ ఆసనం మాత్రమే వేస్తామండి, రెండో ఆసనం

వెయ్యం! కరెక్టే కదా, చాలా లాజికల్‌గా అడిగారుకదా. ఇన్ని ఆసనాలు ఎందుకండీ మాకు! ఇంగ్లీషులో షేక్స్పియర్ బుక్ చదవాలి. నేను ఆల్ఫాబెట్స్ నేర్చుకోను, గ్రామర్ నేర్చుకోను అంటారు కానీ తిన్నగా ఆ పుస్తకం చదివేస్తాను అంటారు. చదవగలరా?

అందుచేత ముందు ఈ ఆసన ప్రాణాయామాలు యొక్క ఏబీసీడీలు బాగా నేర్చుకోవాలి మీరు. ఇవి బాగా నేర్చుకున్న తరవాత, **మీరు ఏ దేవత యొక్క ఆసనాన్ని అభ్యాసం చేయదల్చుకున్నారో**, దాన్ని అభ్యాసం చేసుకోండి. **అప్పుడు ఆ దేవత మీ మీదకి ఆవహిస్తుంది.** దిగుతుందది, అవతరణ అవుతుంది.

### పృథ్వీగ్రహము మీద మీరు దేనికి పుట్టారు?

ఈ చేతనత్వ జ్ఞానం, ఇదంతా దేనిగురించి చెప్తున్నానో గుర్తుందా మీకు? కృష్ణం వందే పృథాసుతం. **ఈ పృథ్వీగ్రహము మీద మీరు చేతనత్వ విజ్ఞానాన్ని నేర్చుకోవటానికి మాత్రమే పుట్టారు.** ఈ పృథ్వీగ్రహము తప్ప, ఇంక ఎక్కడా గూడా సృష్టిలో చేతనత్వ విజ్ఞానము లేదు, మానవప్రాణి లేదు. వెతుక్కుంటున్నారు సైంటిస్ట్‌లు అందరూ కూడా, ఇంకా ఎక్కడైనా మానవుడులాంటి చేతనత్వము ఉన్నదా అని. దొరకలేదు కదా ఇంతవరకూ. భవిష్యత్తులో దొరుకుతుందేమో. మానవజాతి పృథ్వీ మీదే ఉంటుంది. ఒకవేళ ఇంకా ఎక్కడైనా ఉంటే, ఏ గ్రహం అయ్యుంటుంది? పృథ్వీగ్రహం లాంటిదే అయ్యుంటుంది. అంత అద్భుతమైన అవకాశం ఉంది మీకు.

### ఏంటి మానవజాతి యొక్క గొప్పతనం?

చేతనత్వ విజ్ఞానంలో కణము నుంచి విభువు వరకు వెళ్ళిపోవచ్చు వాడు. అణోరణీయాన్ మహతో మహీయాన్. స్కానింగ్ చేయగలడువాడు. శిరడీసాయి, సత్యసాయి లాంటి వారికి ఖనిజాల యొక్క భవిష్యత్తుకూడా తెలుసు. బల్లి యొక్క భవిష్యత్తు, జంతువులు యొక్క భవిష్యత్తుకూడా తెలుసు. అంతేకాక ఎవరి భవిష్యత్తు తెలుసు? **దేవతల యొక్క భవిష్యత్తు కూడా తెలును.**



మీరు చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి, దేవతలందరూ కూడా ఈ గురు **చేతనత్వం క్రింద పనిచేసేవాళ్ళే తప్ప, గురుచేతనత్వం పైన లేరు వాళ్ళు.** దేవతలూ, మనుష్యులూ కలిసి పనిచెయ్యాలి. ఆ రోజులు రాబోతున్నాయి. కలిసి పనిచేయటం అంటే ఏమిటి? కొన్ని విషయాల్లో వాళ్ళు గొప్ప, కొన్ని విషయాల్లో మనం గొప్ప. డాక్టరున్నాడు, వాడికి మెడిసిన్ గుర్రించి చాలా తెలుసు. కాని వాడికి కోర్టులో కేస్ ఉంది, నేను చాలా గొప్ప డాక్టర్‌ని అన్నా వాడు ఎక్కడికెళ్ళాలి? లాయర్ దగ్గరికి.ఈ దేవతలూ, మనుష్యులూ ఇలాగే సయోధ్యతో కలసి జీవించాలి.

కాని దేవతలతో కలిసి జీవిస్తాం అనుకోవటంలేదు, దేవతల్ని అడుక్కుంటున్నారు మీరు. అడుక్కునే వాడు కలిసి ఎలా జీవిస్తాడు? అడుక్కునే వాడ్ని ఇంట్లోకి రానిస్తారా మీరు? శిరిడీ సాయిబాబానే రానివ్వలేదు. రానివ్వలేదు అన్నదానికి పెద్ద ఉదాహరణ ఏంటీ అంటే, ఆయన మసీదులోనే ఉన్నాడు. ఆయన్ని ఇంట్లోకి రండని మీరు అంటే, ఆయన వచ్చుండేవాడు. కాదా ఏంటి? కాని ఆయన్ని ఎందుకు రానివ్వ లేదు? చింకి బట్టలు వేసుకున్నాడు. అప్పుడు ఆయనకి కాస్త జ్ఞానోదయమై, ఈ జన్మలో ఏం చేశాడంటే, మంచి బట్టలు వేసుకోవటం మొదలెట్టాడు. సత్యసాయిబాబా వస్తే ఇంట్లోకి ఎవరికీ అభ్యంతరంలేదు. అర్థమైందా ఏం చెప్పానో నేను. దేవతల్ని అడుక్కోకండి. అడుక్కుంటే ఇచ్చేది కాదు ఏ శక్తీకూడా. వాళ్ళ దగ్గర్నుంచి లాక్కోండది.

నేను చాలాసార్లు ఉదాహరణ ఇస్తాను. ఒక విద్యార్థి లెక్కల పరీక్ష వ్రాశాడు, వాడికి ఎనభై మార్కులు వచ్చాయి ఇంకో విద్యార్థికి వంద మార్కులు వచ్చాయి. వీడు లెక్చరర్ దగ్గరికి వెళ్ళి, నేను అన్ని క్వశ్చన్‌లు ఆన్సర్ చేశాను, నాకు వందకి వంద ఇయ్యి అని బ్రతిమాలుకుంటాడా, అడుగుతాడా? ఇవ్వకపోతే వాడు. డిమాండ్ చేస్తాడు. అప్పటికీ ఇవ్వకపోతే ప్రిన్స్‌పాల్ దగ్గరికి వెళ్తాడు, వైస్ ఛాన్స్‌లర్ దగ్గరికి వెళ్తాడు. వాడి మెడవంచి మరీ మార్కులు వేయించుకుంటాడు. ఎందుచేత? వ్రాశాడు కనుక.

అడుక్కోకండి దేవతల్ని. దేవతల్ని డిమాండ్ చెయ్యండి. అలాంటి విద్య ఇక్కడ నేర్చుకోండి అని చెప్తే, ఇక్కడా మళ్ళా అడుక్కుంటే ఎట్లా? కాని డిమాండ్ చెయ్యాలి

అంటే, కండిషన్స్ ఫుల్‌ఫిల్ చెయ్యాలి. మేథమెటిక్స్ లెక్చరర్ దగ్గరకెళ్ళి నాకు నువ్వు మార్కులు వేసితీరాలి అని నువ్వు అడగాలి అంటే, ముందు నీకు సబ్జెక్ట్ రావాలి. ప్లస్ ఆయన ఇచ్చిన క్వశ్చన్స్ నువ్వు ఆన్సర్ చెయ్యగలగాలి. ఆ స్థితికి ఎదగండి ఇక్కడ. మీకు ఉన్న శారీరక, కోరికల, మానసిక బాధలన్నీ ప్రశ్నలే. వాటిని మీరు, ఏ రోజు ఎంత సబ్జెక్ట్ నేర్చుకొన్నారో తెలిసినంత వరకు ఆన్సర్ చేయండి. ప్రాత పద్ధతిలోనే ఉంటే ఎట్లా? అప్పుడు మీరు కృష్ణం వందే పృథాసుతం అనే స్థాయికి వస్తారు. ఇంకా అర్జునస్థితే అది. ఇంకా ద్వంద్వాలుంటాయి. యుద్ధం చెయ్యాలా, చెయ్యక్కర్లేదా?

చాలాసార్లు మీకు ఏమనిపిస్తుందంటే, ఎందుకీ జన్మ, అది నన్ను తినేస్తే పోలె! ఎందుకీ మాట అంటున్నానేను? మా కాలేజీలో, మా లెక్చరర్ ఒకతను, ఇంతకీ రామకృష్ణా నువ్వు బెంగుళూరు, జిందాల్‌కి వెళ్ళావు కదా, ఏం నేర్చుకొచ్చావు అన్నాడు. సరే! ఆసనాలు, ప్రాణాయామాలు నేర్చుకొని వచ్చాను అన్నాను. ఇంకా ఏం నేర్చుకొచ్చావు అన్నాడు. అసలైన విషయం నీకు చెప్పటం మర్చిపోయాన్నేను, ఆహార నియమాలు నేర్చుకొచ్చానన్నాను. సరే, ఆహార నియమాలు ఏంటో చెప్పు అన్నాడు. అంటే, నూనె వాడకూడదు, ఎండు మిరపకాయ వాడకూడదు, చింతపండు వాడకూడదు అన్నాను. అయితే ఇంక బ్రతుకెందుకు అన్నాడు.

అంటే అక్కడేంటి? అర్జునుడు చెప్పిందే. ఈ భీష్ముడు, ద్రోణుడు వాళ్ళు నన్ను చంపేస్తే, చంపేయనియ్. నాకు ఎందుకీ రాజ్యం, ఎందుకీ భోగాలు, నాకు వద్దు అన్నాడు. ఇన్‌డైరెక్ట్‌గా మీరుకూడా అదే అంటున్నారు. నాకీ రాజ్యాలు అక్కర్లేదు, ఈ మూడులోకాలు అక్కర్లేదు, **ఈ గురుస్థితి అక్కర్లేదు, నేను ఇంత ఉప్పు, చింతపండు తింటే చాలు అని.** మీ మానసికస్థితిని మీరు అర్థం చేసుకోండి. ఆ నీరసం పోతేకాని ఈ విద్య రాదు.

క్లైబ్యం మాస్మగమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే ।
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరన్తప ॥ (భ.గీ. 2 - 3)

**ఓ అర్జునా! అధైర్యమును పొందకుము. ఇది నీకు తగదు. నీచమగు ఈ మనో దుర్బలత్వమును వీడి యుద్ధముచేయుటకు లెమ్ము.**



**ఇది చెయ్యాలి అని అర్థమయ్యాక - దానికి కావల్సిన నియమాలు పెట్టుకోకపోతే చేసిందంతా వృథా అవుతుంది.** ఈ బలహీనత మీకు ఉండకూడదు. ఇది అర్థమయిందికదా, ఇది మంచిది అని, ఇది చెయ్యాలి అని అర్థమయ్యాక, దానికి కావలసిన నియమాలు మీరు పెట్టుకోలేకపోతే, ఈ మొత్తం ఉపన్యాసాలు వృథా. అందుకే ఇవంతా వృథా అవుతున్నాయి, వృథాకాకుండా ఉండే క్లాసులు ఏవైనా నేను చెప్పగలనా అనే ప్రయత్నం ఇది. ఇది విన్నవాళ్ళల్లో, ఇది అవగాహన చేసుకుంటున్న వాళ్ళల్లో ఈ క్లైబ్యం - నీరసం ఉండకూడదు.

మీరు లేచి, ఏం చేయగలగాలి? మొట్టమొదట మీ జీవితాలలో ఈ మూడు మార్పులూ తెచ్చుకోవాలి. ఆహారాన్ని మార్చుకోగలగాలి. ఆసనాలు వెయ్యటం నేర్చుకోవాలి, ప్రాణాయామం చెయ్యటం నేర్చుకోవాలి. ఇది లేకుండా ఈ విద్య ఎందుకూ రాదు. వాళ్ళకి చెయ్యకుండా వచ్చేసిందని కొందరికి అనిపిస్తుంది. చెయ్యకుండా ఎవరికీ రాలేదు. ఎప్పుడో అప్పుడు, ఏదో ఒక జన్మలో చేసుంటారు. అందుచేత ఇది వరకు చేసివుంటేనే మీరు ఇది వింటానికి వచ్చారేమో.

**4 స్థితులు మన సిలబస్...?**

ఒకవేళ ఇదే మొదటిసారి వింటూవుంటే, బెటర్ లేట్ దేన్ నెవ్వర్. అర్థమైంది కదా! అందుచేత ఇక్కడ వయస్సుకాదు ముఖ్యం. జీవితం యొక్క కంటిన్యూటీ ఉంటుందని మనకి అర్థమయింది కనుక, తక్షణమే, మళ్ళా ఎప్పుడో కాదు. మంచి ముహూర్తం చూసుకుని వస్తాను మా జ్యోతిష్కుడ్ని అడిగి అని కాదు. మీకు అర్థమైపోతే తక్షణం కనుక మీరు చేయటం మొదలెడితే, ఆ మిగతా మూడు స్థితులూ మీకొస్తాయి. ఏంటా మిగతా మూడు స్థితులూ?

కృష్ణం ద్వైపాయనం వందే,
కృష్ణం వందే వ్రజప్రియం,
కృష్ణం వందే నారాయణం,

ఈ నాలుగు స్థితులూ మన సిలబస్. అందుకు దీని మీద ఇంత ఒత్తిడి చేసేది. మొత్తం భాగవతం - కృష్ణం వందే పృథా సుతం అనుకోండి, మానవజాతి యొక్క లక్ష్యం. మానవ శరీరధారి అయినవాడు ఎవడైనా ఉంటే, ఈ జన్మలో కాని, పై జన్మలో కాని, యుగయుగాలు మారిపోయినా కాని, చివరికి వాడు వెళ్ళాల్సింది ఈ శ్లోకం దగ్గరికే. చదవండి ఆ శ్లోకాన్ని.

కృష్ణం నారాయణం వందే, కృష్ణం వందే వ్రజప్రియం ।
కృష్ణం ద్వైపాయనం వందే, కృష్ణం వందే పృథాసుతం ॥

నారాయణ స్వరూపుడైన శ్రీకృష్ణునికి నమస్కారము. వ్రజప్రియుడైన శ్రీకృష్ణునికి నమస్కారము. ద్వైపాయన స్వరూపుడైన శ్రీకృష్ణభగవానునికి నమస్కారము. పృథ్వీపుత్రుడుగా జగద్గురు చేతనత్వ ప్రతీకయైన శ్రీకృష్ణునికి నమస్కారము.

ఈ స్థితి రావటానికి డైలాగ్ ఉండాలి. విద్య ఎప్పుడూ కూడా డైలాగే. టీచర్ పాఠం చెప్తూంటాడు, స్టూడెంట్ వింటూవుంటాడు. అంతేకదా! ఏ యూనివర్శిటీ అయినా కావచ్చు, ఏ సబ్జెక్ట్ అయినా కావచ్చు, తెలుగు కావచ్చు, హిస్టరీ కావచ్చు, ఎకానమిక్స్ కావచ్చు, ఫిలాసఫీ కావచ్చు, ఆఖరికి భాగవతం కావచ్చు. కాని ఈ విద్య ఎప్పుడు కూడా నేర్పబడేది డైలాగ్స్ ద్వారానే. ఒకడు చెప్పేవాడు ఉంటాడు, వినేవాడు (వాళ్ళు) ఉంటాడు.

ఆధ్యాత్మిక విద్యలో వినేవాణ్ని శౌనకుడు అంటాం, చెప్పేవాణ్ని సూతుడు అంటాం. కర్ణుడు సూతపుత్రుడు అనేదాంట్లో అంతరార్థం మీకు మెల్లిమెల్లిగా బోధపడుతుందేమో చూద్దాం. అందుచేత రెండు మీరు గుర్తుంచుకోండి, సూతుడు, శౌనకుడు. వినేవాడు, చెప్పేవాడు. కాని వినేవాడికి ఒక లక్షణం ఉండాలి. ఆ సబ్జెక్ట్ మీద వాడికి ఆసక్తి ఉండాలి. ఆసక్తి లేకపోతే ఎంత గొప్ప లెక్చరర్ చెప్పినా అది బుర్రకెక్కదు. అందుచేత వినేవాడికి కావలసిన లక్షణం ఇక్కడ చెప్పబడింది.



**కథామృతరసాస్వాద కుశల :**

కథ అంటే చెప్పబడేది. చెప్పబడేదాంట్లో ఉన్న రసాన్ని కనుక వాడు పట్టుకోలేకపోతే, వినాలనే కోరిక వాడిలో లేకపోతే, ఎంత గొప్పవాడు చెప్పినా వృథాయే. వినాలనే కోరిక ఉంటే, ఎవ్వడు చెప్పినా వాడికి అర్థమైపోతుంది. మీరది గుర్తుంచుకోండి. **చెప్పేవాడు అక్కడ ముఖ్యం కాదు, ఎప్పుడూ కూడా వినేవాడే ముఖ్యం.**

ఆ ద్రోణుడే అందరికీ విలువిద్య నేర్పాడు. కాని వినడంలో, కథామృత రసాస్వాదకుశలః ఎవడు అంటే అర్జునుడు. కాని అర్జునుడు కంటే ఒక ఆకు ఎక్కువ తిన్నాడు ఏకలవ్యుడు. అసలు చెప్పాల్సిన పనిలేకపోయింది గురువుకి. గురువు యొక్క విగ్రహం, గురువుకంటే బాగా ఏకలవ్యుడికి నేర్పింది. అర్జునుడికి స్వయంగా గురువు అక్కడ ఉండి చెప్పిన దానికంటే, గురువు యొక్క విగ్రహము ఏకలవ్యుడికి అర్జునుడికంటే బాగా నేర్పింది. ఎందుచేత? **ఏక-లవ్యుడు కనుక, ఒకేదాని మీద దృష్టి ఉంది కనుక.** అందుచేత మన దృష్టి దేనిమీద ఉంటుంది?

కృష్ణం నారాయణం వందే,
కృష్ణం వందే వ్రజప్రియం,
కృష్ణం ద్వైపాయనం వందే,
కృష్ణం వందే పృథాసుతం.

నారాయణ స్వరూపుడైన శ్రీకృష్ణునికి నమస్కారము. వ్రజప్రియుడైన శ్రీకృష్ణునికి నమస్కారము. ద్వైపాయన స్వరూపుడైన శ్రీకృష్ణభగవానునికి నమస్కారము. పృథ్వీపుత్రుడుగా జగద్గురు చేతనత్వ ప్రతీకయైన శ్రీకృష్ణునికి నమస్కారము.

**మన గురువు నారదుడు ఏకైక అఖండ గురుసత్తా స్థితి**

అందుచేత, ఈ డైలాగ్స్‌లో **నారదుడు** అనే వ్యక్తి చాలా ముఖ్యపాత్ర వహిస్తాడు. అదే **ఏకైక అఖండ గురుసత్తా స్థితి** అంటే కూడా. అందుకే దేవర్షి స్థితిలో ఉన్న, నాకు తెలిసిన ఒకే ఒక వ్యక్తి నారదుడు. మిగతా వాళ్ళందరూ ఋషులు, మహర్షులు, రాజర్షులు, బ్రహ్మర్షులు. కాని దేవర్షి అనేమాట నారదుడికి మాత్రమే

మనం ఉపయోగిస్తాం. ఎందుచేత? దేవతాస్థితిని కూడా దాటి ఉన్నటువంటి ఋషి మిగతా ఋషులందరూ ఎవరు? మానవస్థితి నుంచి ఋషులైన వాళ్ళు.

ఈ నారదుడు యొక్క గొప్పతనం ఏంటీ అంటే మహతీ అనే వీణ మీద నిరంతరమూ నారాయణ, నారాయణ అని పలికిస్తూ వుంటాడు. దీన్ని గుర్తుంచుకోండి, ఆ ఫోటో ఉందిక్కడ. ఇది మీకు ఈ రోజు నుంచి గురుతుల్యం. నారదుడే మనందరికీ గురువు. నారదుడ్ని నేను గురువుగా ఎన్నుకుంటాను అని నిర్ణయించుకోవాలి మీరు. ద్రోణాచార్యుడ్ని గురువుగా ఏకలవ్యుడు ఎన్నుకున్నాడు. తరవాత ఏకలవ్యుడు ఎక్కడున్నాడో ద్రోణాచార్యుడికి తెలియదు.

కాని ఏకలవ్యుడు? విద్యలు నేర్చేసుకున్నాడు కదా! అలాగ నారదుడికి మీరు ఉన్నారో లేదో తెలియకపోయినా, ఆ నారదస్థితికి మీరు సమర్పణ చేసుకుని, దాన్నే ఆదర్శంగా పెట్టుకుని, మీ సాధనా జగత్తులో అడుగుపెడితే.. మరి జరిగిన వారం అంతా మీరు అలాగ చేశారో లేదో నాకు తెలియదు. నేను మిమ్మల్ని ఏం చేయమన్నాను? కళ్ళు మూసుకోండి, గాయత్రీ మంత్రం ప్రతీసారి ఎదురుగుండా నారదుడు ఉన్నటువంటి భావనతో జపించండి. యద్భావం తద్భవతి. మీరు ఏది భావిస్తారో, అదే అవుతారు. మీ భావన యొక్క తీవ్రతబట్టి తప్ప, ఫలితాలు రాక పోవటానికి కారణం అదే. ఆ నారదుడు నుంచి ఆ గాయత్రీ మంత్రాన్ని ఎలాగ స్వీకరించాలో జాగ్రత్తగా గుర్తుంచుకోండి, ముందు వినండి.

| | |
|---|---|
| ఓం | - మూలాధారము |
| భూర్ | - స్వాధిష్ఠానము, |
| భువః | - మణిపూరకము, |
| స్వః | - అనాహతము, |
| తత్సవితుర్వరేణ్యం | - అన్నప్పుడు హృదయంలో ఆ సూర్య కిరణాల రక్త ప్రవాహముతో కలిసి, |



భర్గోదేవస్య ధీమహి - హృదయంలోంచి వస్తున్న ఆ రక్తము + సూర్య కిరణాల తెల్లని కిరణాలు మొత్తము శరీరమంతా వ్యాపిస్తున్నాయి. శుద్ధి చేస్తున్నాయి,

ధియోయోనః ప్రచోదయాత్ -ఆ సూర్యకిరణాలు మమ్మల్ని మంచి మార్గం వేపు ప్రవేశపెట్టుగాక అని అనుకుంటూ, హృదయం నుంచి ఒక నీలిరంగు మెరుపు ఆజ్ఞాచక్రంలోకి వెళ్తోన్న భావన చేసుకోండి. దీన్ని అభ్యాసం చేసుకోండి ప్రతీరోజూ. ఇక్కడ చేసే జపము "నారద గాయత్రీ" మంత్రజపము అలా చేసుకోవాలి.

ఓం భూర్ భువః స్వః తత్ సవితుర్ వరేణ్యం
భర్గో దేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ ॥
ఓం భూర్ భువః స్వః తత్ సవితుర్ వరేణ్యం
భర్గో దేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ ॥
ఓం భూర్ భువః స్వః తత్ సవితుర్ వరేణ్యం
భర్గో దేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ ॥

గాయత్రీ మంత్రజపం ఈ భావనతో ఆ ఫోటో దగ్గర పెట్టుకుని చేయాలి. నారదుడు చెయ్యి పట్టుకుని మిమ్మల్ని ఆ మెట్ల మీద నుంచి తీసుకెళుతోన్నటువంటి భావన, నిరంతరం ఉండాలి. దీని తరవాత భక్తి అనేటటువంటి దానికి ఈ వివరణ ఇచ్చాను నేను. చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

**భక్తి అంటే ఘనీభవించిన ఆలోచనలు :**

భక్తి అంటే క్రిస్టలైజ్డ్ థాట్స్. చాలా జాగ్రత్తగా అవగాహన చేసుకోండి. క్రిస్టలైజ్డ్ థాట్స్ అంటే ఏంటి? ప్రీ కన్సీవ్డ్ నోషన్స్. ముందే మీరు ఒక ఉద్దేశ్యానికి వచ్చేశారు. ఇంక మీరు ఏది చేసినా ఆ ఉద్దేశ్యానికే ప్రోదిపరుస్తారు తప్ప, సవ్యమైన అవగాహన రాదు. భక్తి అంటే అది.

దేని మీద మనకి భక్తి ఉంది? గాయత్రీ చేశారు, మీకు ఏం లాభం వచ్చిందని అడుగుతారు. అంటే ఏం చెప్పాలి వీడు? 10 లక్షలు వచ్చింది నాకు అంటే గాయత్రీ

శక్తివంతమైనది, ఉన్న పది రూపాయలూ పోయాయి గాయత్రీ శక్తివంతమైనది కాదు అని. ఇంజనీరింగ్ కాలేజ్‌లో సీట్ వచ్చింది. చాలా అదృష్టవంతుడివి. "ఏం అదృష్టం రా, రెండు లక్షలు ఖర్చు పెట్టాను." ఖర్చుపెడితే ఖర్చుపెట్టావు ఇంజనీరింగ్‌లో సీట్ వచ్చింది కదా, అంటామా అనమా? ఇంతకీ మీకు దేనిమీద భక్తి ఉన్నట్టు? 10 రూపాయలు మీదా 2 లక్షలు మీదా, ఇంజనీరింగ్ మీదా?

**మీకు దేని మీద భక్తి ఉన్నదో అది లభిస్తే - అక్కడ ఇంక ఏం పోయినా మీకు బాధ వెయ్యదన్నది అర్థం చేసుకోండి.** మీకు దేని మీద భక్తి ఉంటే అది లభిస్తే తరువాత మిగతా వన్నీపోయినా ఫర్వాలేదు. అదే కావాలి. మిగతా వేమీ వద్దు. అదీ భక్తి అంటే.

అందుచేత మీకు భక్తి దేని మీదుందో ఒక చిట్టా తయారు చేసుకోండి. నేను చెప్పినవి విని మీరు తర్వాత నెలలో నిజాయితీగా మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. ఇక్కడికి మిమ్మల్ని మీరు అభివృద్ధి చేసుకోవడానికి వస్తున్నారు తప్ప ప్రక్కవాడు ఏమను కుంటాడని కాదు. మీకు దేనిమీద భక్తి ఉంది? ప్రశ్న ఏం వేసుకోవాలి? అన్నీపోయినా అది లభిస్తే చాలు అని మీకు దేనిమీద మనస్సు ఉంటుందో అది భక్తి. 99%వాళ్ళకి దేనిమీదా భక్తి లేదు. ఎందుచేత? ఏదీ పోకూడదు. ఏదీ పోకుండా అది రావాలి. భక్తి లేదు. అది అర్థం చేసుకోండి. ఆ నిర్వచనం మీకు అర్థం అవ్వాలి. అసలు భక్తే లేదు.

నారదుడు రావాలంటే భక్తి యువతిగా ఉండాలి. నారదుడు నాకు గురువుగా అయిపోవాలి మాస్టారు. కాని మీకు భక్తి అక్కర్లేదు. అది కుదరదు. అందుచేత ఈ భక్తిని అర్థం చేసుకోండి. మీకు దేనిమీద భక్తి ఉన్నా ఫర్వాలేదు. అది అర్థం చేసుకోండి. భక్తి అంటూ ఉంటే దాన్ని దేనిమీదకైనా తిప్పుకోవచ్చు. రావణాసురుడు. హిరణ్య కశ్యపుడు వాళ్ళకి వారి తరహా సంపూర్ణ భక్తి ఉంది. నారదుడు వచ్చాడు. డబ్బు అంటూ ఉంటే దేన్నికైనా ఉపయోగించుకోవచ్చు. అలాగే భక్తిని కూడా.

**ఆహారాన్ని మార్చుకోకపోతే - మీ చేతనత్వం మారదు**

మీకు భక్తి ఉన్నదా లేదా అన్న దానికి నిదర్శనం ఏంటంటే అది రాకపోతో



"ఇంక ఈ జీవితం ఎందుకు వృథా" అని అనిపించాలి. ఒకటి మాత్రం నాకు అర్థమైంది. ఉప్పు, చింతపండు, మిరపకాయలు లేకపోతే ఎందుకు ఈ జీవితం అని నన్ను చాలామంది అడిగారు. వాళ్ళకి ఖచ్చితంగా దానిమీద భక్తి ఉంది. ఏంఫర్వాలేదు. ఆ మాత్రం భక్తి ఒక దానిమీదుంటే దాన్ని ఇంకో దాని మీదకి మార్చవచ్చు. అర్థమైందా?ఇది ఎందుకిన్ని స్లార్లు చెపుతున్నాన్నంటే ఈ ఆహారాన్ని మీరు మార్చుకోలేకపోతే చేతనత్వం మారదు. అసంభవం. కాదండీ మారుతుంది! మీరు నటించుకుంటే నేనేం చేయను దానికి? మారదని ఋషులు చెబుతున్నారు.. మీరు ఎలాంటి అన్నము తింటే, అలాంటి మనస్సే ఏర్పడుతుంది అనికదా శాస్త్రము. అందుచేత మీరు ఆహారాన్ని మార్చుకోవల్సిందే. **అప్పుడు నారదుడు, భక్తి ఎదురెదురవుతారు.**

**ఒకటి - ఆహారాన్ని మార్చుకోమన్నాను. రెండు - ఆసనాలు, ప్రాణాయామాలు అభ్యాసం చెయ్యండి.** ఆషామాషీగా కేవలం ఆరోగ్యం కొరకే కాదు. మీ శరీరం ముద్ద ముద్ద అయిపోవాలి. ఇష్టం వచ్చినట్టు మీరు తిప్పగలగాలి శరీరాన్ని. అప్పుడు కదా ఆ చేతనత్వం ఆ శరీరం నుండి పలుకుతుంది.

విన్నది ఆచరించకపోతే, అది మనకు అర్థం కాలేదు! అర్థం అయితే ఆచరిస్తాం. అర్థం అవ్వకపోవటానికి కారణం ఏంటి అంటే, ఆహారం సరిగా లేకపోవటం, శరీరంలో ఉన్న నాడులు సరిగా లేకపోవటం, శరీరంలో ఉన్న నాడులలో ప్రాణశక్తి సరిగా ప్రవ హించకపోవటం. ఈ 3 నియమాలు సవ్యంగా ఉంటే, ఒక మాటచాలు మారి పోవటానికి. ధృవుడు తండ్రి ఒడిలో కూర్చోవాలి అనేటటువంటి ఒక చిన్న కోరిక కోరాడు. అంతేగా! నారదుడు వచ్చాడు, "ఓం నమో భగవతే వాసుదేవాయ" అన్నాడు, ధృవనక్షత్రంగా ఇప్పటికీ కనిపిస్తున్నాడు ఆ ధృవుడే. మీకు ఆ చేతనత్వం తెలియాలి. ధృవనక్షత్రం! ఆ ధృవనక్షత్రం యొక్క ప్రాముఖ్యత ఎంత అంటే, దిశ తెలుసుకోవాలి అంటే ధృవనక్షత్రం వైపు చూసి తెలుసుకుంటాం మనం.

అందుచేత ఈ మూడూ, ఆహారాన్ని సవరించుకుని, శరీరాన్ని సవరించుకో వటానికి ఆసనాలు వేసుకుంటూ, ప్రాణశక్తిని కావలసిన దిశలో పంపించటానికి

ప్రాణాయామం. ఆసనాలు ఏం చేస్తాయంటే, ప్రాణశక్తిని కావలసిన దిశలోకి పంపిస్తాయి. ఇప్పుడు నీళ్ళు అలా గొట్టంలో వెలుతున్నాయి. నీళ్ళు ఇటు రావాలంటే ఏం చేస్తాం మనం? రబ్బరు గొట్టాన్ని వంచుతాం. ఎలా ఒంచితే ప్రాణశక్తి ఎటు వెళ్తుందన్నది, ఆసనాల్లో తెలియాలి మనకి.

**ఆచరణలేని విద్య మీకు అవగాహనకు రాదు.** మామూలుగా ఆసనాలు వేస్తే గ్యారంటీగా అవి మీ ఆరోగ్యాన్ని బాగుచేస్తాయి. అంతవరకూ చేసుకోండి మీరు, నేనేం కాదనటంలేదు దాన్ని. అనుమానం లేదు అందులో. ఇదంతా తెలుసుకొని నేను వెళ్ళలేదు, నేచర్‌క్యూర్‌కి. అక్కడ నేను ఆసనాలు వేస్తున్నప్పుడు ఇవంతా నాకు తెలియవు. కాని ఆహారము, ఆసనాలు, ప్రాణాయామాలు చేయగా, చేయగా ఈ జ్ఞానం వచ్చింది. సిన్సియర్‌గా చేస్తే మీకూ వస్తుంది.

ఎలాగూ ఆసనాలు వేస్తున్నారు, సీరియస్‌గా వెయ్యండి. చూడండి శరీరంలో మార్పులు ఎలాగ వస్తున్నాయో. మీకు తెలుస్తాయి మార్పులు. తెలియకుండా ఎలాగ ఉంటుంది? మీకు ముక్కు మూసేస్తే, హాయిగా ఉంటుందా, బాధగా ఉంటుందా? ఒకసారి మూసుకొని చూడండి తెలుస్తుంది. ప్రాణశక్తి ప్రవాహం మీ నాడులలో వెళ్ళకపోతే మీకు అంత బాధా కలుగుతుంది. సో సింపుల్ యాజ్ దట్. కాని నాకు తెలియటం లేదే? అసలు ప్రాణశక్తి వెళ్ళటమే లేదు మీకు. మనము జీరో లెవెల్లో జీవిస్తున్నాము.

**మన శరీరములో ఉన్నటువంటి 72 వేల నాడులలో కనుక మనం పీల్చుకునే గాలి వెళ్తే, మనమందరం కూడా వ్యాన మహర్షులం అయిపోతాం.** మనమందరం ఆ స్థాయి వాళ్ళమే. కాని ఏం జరుగుతోంది? ప్రాణశక్తికుంటుపడింది. ఆ ప్రాణశక్తిని సరిచెయ్యటానికి ఆసనాలు వేస్తున్నాం. ప్రాణశక్తిని పెంచుకోవటానికి ప్రాణాయామం చేస్తున్నాం. ఆ ప్రాణాయామ,ఆసనాల యొక్క ప్రాణశక్తి నాణ్యత పెరగటానికి ఆహారనియమాలు. ఈ మూడూ ఉంటే,

అజ్ఞానధ్వాంతవిధ్వంసం కోటిసూర్యసమప్రభం ।
సూతాఖ్యాహి కథాసారం మమ కర్ణరసాయనం ॥ 4



మీ యొక్క జ్ఞానము, అజ్ఞానాంధకారమును నష్టము చేయుటకు కోటి సూర్యులలాంటిది. మీరు మా చెవులకు అమృతోపమయమైన, సారగర్భితమైన కథను విన్పించండి.

అప్పుడు ఆటోమాటిక్‌గా మీరు ఏది వింటే అది, నారాయణ కీర్తనే అవుతుంది, కర్ణ రసాయనమే అవుతుంది. ఏది వింటే అది. ఈ భాగవతమే వినక్కర్లేదు. మీ **చెవుల్లోకి ఏ శబ్దం పడినా, అది కర్ణ రసాయనంగానే మారుతుంది.** చాలా జాగ్రత్తగా ఈ సాధనా విజ్ఞానాన్ని, మీరు అవగాహన చేసుకోండి. దీని ప్రాముఖ్యతను ప్లేకార్డ్‌గా వ్రాసుకోండి.

**ఆచరణ లేని విద్య మీకు అవగాహన కాదు**

ఇంత ముఖ్యం అని నేను చెప్పినా మీరు చెయ్యలేకపోయారు అంటే అర్థం ఏంటంటే, ఇది అవగాహన కాలేదు మీకు. అవగాహన అయితే చెయ్యకుండా ఎందుకుంటారు? అవగాహన ఎలా వస్తుంది? చెయ్యగా చెయ్యగా వస్తుంది. తమాషా ఏంటంటే, పిచ్చి కుదిరితే కాని పెళ్ళికాదు, పెళ్ళయితేకాని పిచ్చి కుదరదు. మరి ఎట్లా? అందుచేత ఎక్కడో అక్కడ మీరు మొదలెట్టేయండి దాన్ని.

అజ్ఞానధ్వాంతవిధ్వంసం కోటిసూర్యసమప్రభం ।
సూతాఖ్యాహి కథాసారం మమ కర్ణరసాయనం ॥ 4

**హే సూతమహాశయా! మీ యొక్క జ్ఞానము, అజ్ఞానాంధకారమును నష్టము చేయుటకు కోటి సూర్యులలాంటిది. మీరు మా చెవులకు అమృతోపమ యమైన, సారగర్భితమైన కథను విన్పించండి.**

భక్తిజ్ఞానవిరాగాప్తో వివేకో వర్ధతే మహాన్ ।
మాయామోహనిరాసశ్చ వైష్ణవైః క్రియతే కథమ్ ॥ 5

**భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు పొందినప్పుడు వచ్చే మహావివేకం యొక్క వృద్ధెలా జరుగుతుంది? మరియు వైష్ణవులు మాయామోహం నుంచి ఎలా బయట పడతారు?**

ఆధ్యాత్మిక జగత్తులో ఎప్పుడూ మూడు, మూడు, మూడు వస్తూ వుంటాయి.

సత్ చిత్ ఆనంద్. ఇంకా మూడు మూడు చెప్పండి.

భక్తి జ్ఞాన వైరాగ్యాలు. ఇంకా? మూడు మూడు. .... ఇంకా?

మీకు ఈ త్రిపుటీ చాలా జాగ్రత్తగా గుర్తుండాలి. సత్వ రజ స్తమో గుణాలు. అర్థమయింది కదా! కాని ఇక్కడ మూడు చెప్తున్నాడు.

## భక్తి - జ్ఞానము - వైరాగ్యము

ఈ త్రిపుటీ యొక్క తమాషా ఏంటంటే, మన పిల్లవాడ్ని ఇంజనీరింగ్ చదివించాలి. దేని మీద భక్తి ఉంది మీకు? ఎట్టిపరిస్థితుల్లో అయినా వాడ్ని చదివించి తీరాల్సిందే అంటాడు. అందుచేత భక్తి దేని మీదొచ్చింది? పిల్లవాడి ఇంజనీరింగ్ సీటు మీదకి వచ్చేసింది. ఇంక దానిక్కావలసిన జ్ఞానం మీకు తప్పక వస్తుంది.

ప్రక్కదారులు ఏం వున్నాయి, ఎన్ని కోటాలున్నాయి, బి సర్టిఫికెట్ ఉంటే వస్తుందా, ఎ సర్టిఫికెట్ ఉంటే ఉంటుందా, క్రికెట్ ప్లేయర్ అయితే వస్తుందా, ఏది వస్తుంది? ఎలాగూ మనవాడికి చదువు బాగా రాదు కనుక, వీడి చేత ఎన్.సి.సి. కూడా చేయిస్తే, సి సర్టిఫికెట్ కూడా ఉంటే, ఆ కోటాలో సీటొస్తుంది. లేదూ, వీడు వెయిట్‌లిఫ్టరు, బాగా బరువులు ఎత్తుతూ వుంటాడు. అంచేత వీడ్ని ఏం చేయించాలి? పటియాలాకో, ఎక్కడికో పంపించి, జాతీయస్థాయిలో వీడు కనుక వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ అయిపోతే ఇంజనీరింగ్ సీటు వస్తుంది. ఇదంతా ఏంటి? జ్ఞానము.

మీకు దేని కొరకు లక్ష్యం ఉందో, దాని మీద సరిగా భక్తి ఏర్పడితే, ఆటోమాటిక్‌గా దానికి కావలసిన జ్ఞానం మీరు సంపాదించుకుంటారు. జ్ఞానం ముందు రాదు, ముందు భక్తి వస్తుంది. చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. మనం తల్లక్రిందులుగా వెళ్తాం. తల్లక్రిందులుగా వెళ్తాం కాబట్టే, ఆసనాలు, ప్రాణాయామాలు దగ్గర ఆగిపోతాం. మళ్ళా మర్చిపోతూవుంటాం, మళ్ళా వస్తూవుంటాం, మళ్ళా మర్చిపోతూ వుంటాం, మళ్ళా వస్తూవుంటాం. కాని భక్తి అంటూ ఏర్పడితే, దానికి కావలసిన జ్ఞానం ఆటోమాటిక్‌గా వస్తుంది, వైరాగ్యం ఆటోమాటిక్‌గా వస్తుంది.



ఏంటి వైరాగ్యం? వాడికి ఇంజనీరింగ్‌లో సీటు ఇప్పించాలి. చదివించాలి వాడి చేత. నీకు టీ.వీ. చూడాలనుంది. టీ.వీ. చూస్తావా, చూడవా? టీ.వీ. నువ్వు చూస్తూ వాడ్ని చదువుకోమన్నావనుకో, సీటు ఇప్పించాలని నీకు లేదు అని నువ్వు అర్థం చేసుకో. తల్లితండ్రులకి నేను చాలా జాగ్రత్తగా వివరిస్తున్నా, మిమ్మల్ని మీరు ముందు విశ్లేషణ చేసుకోండి, తరవాత పిల్లల్ని విశ్లేషణ చేద్దాం. వాడ్ని చదువుకో అంటున్నావ్. కాని నువ్వు టీ.వీ. మూసేయలేవు. ఇంకా నువ్వు ఏం చేయగలవ్, నిజంగా వాడికి చదువు రావాలంటే, టీ.వీ. ఇంట్లోంచి బయట పారేస్తావ్. నీ వైరాగ్యం స్థాయి ఎంత వరకు? వాడికి సీటు వచ్చేంత వరకు. భక్తి, జ్ఞాన, వైరాగ్యం - అది అర్థం చేసుకోండి. వైరాగ్యం అంటే భక్తి + జ్ఞానం. భక్తి జ్ఞాన వైరాగ్యాలు పొందినప్పుడు వచ్చే మహా వివేకం యొక్క వృద్ధి ఎలా జరుగుతుంది? మరియు వైష్ణవులు మాయామోహం నుంచి ఎలా బయటపడతారు? జ్ఞాన, వైరాగ్యాలతో పాటు ఆటోమాటిక్‌గా వివేకం వస్తుంది మీకు. వివేకం తర్వాత -

భక్తిజ్ఞానవిరాగాప్తో వివేకో వర్ధతే మహాన్ ।
మాయామోహనిరాసశ్చ వైష్ణవైః క్రియతే కథమ్ ॥ 5

## వివేకమంటే ఏంటి?

**భక్తి జ్ఞాన వైరాగ్యాలు పొందినప్పుడు వచ్చే మహావివేకం యొక్క వృద్ధి ఎలా జరుగుతుంది? మరియు వైష్ణవులు మాయామోహం నుంచి ఎలా బయట పడతారు?**

భక్తి జ్ఞాన వైరాగ్యాలని దేనికి ఉపయోగించుకోమంటున్నాను? ఈ చిన్నచిన్న వాటికెందుకు? గురుచేతనత్వంలోకి వెళ్ళిపోవచ్చు. ఈ పనులు చేసేదేదో, వాళ్ళకోసం పడే తాపత్రయం ఇవంతా చేస్తే అసలు మీరు ఆ చేతనత్వ స్థాయిలోకే వెళ్ళిపోతారు. కోటిసూర్య సమప్రభ.

**వివేకం అంటే అర్థమేంటి?** నువ్వు కావల్సిన లక్ష్యానికి ఏది వదిలేసుకోవాలో

అది వదిలేసుకోగలగటం. నీకు సిగిరెట్ త్రాగటం చాలా అలవాటుంది. నువ్వు పై అధికారి దగ్గరికి వెళ్ళాలి. అతనికి సిగిరెట్ త్రాగేవారంటే పడదు. ఏం చేస్తావు? సిగిరెట్ నీ దగ్గిర లేకుండా, సిగిరెట్ వాసన రాకుండా చూసుకోవాలి. నువ్వు గొప్ప పనేం చేయటం లేదే. నీలో వివేకం వచ్చిందంతే. అందుచేత భక్తి కలిగేటటు వంటి స్థితికి వచ్చాం. ఇది వరకు మనం చేతనత్వం గురించి మాట్లాడలేక పోయే వాళ్ళం. అర్థమయ్యేది కాదు. వైష్ణవులు మాయామోహం నుంచి ఎలా బయటపడతారు?

ఈ మాయామోహము, ఇవి భౌతిక జగత్తులో చేసుకునేటటువంటి అర్థాలు వేరు, చేతనత్వ జాగరణ ప్రక్రియలో, మనం నేర్చుకుంటున్నటువంటి విషయాల్లో ఈ మాయామోహాల యొక్క అర్థాలు చాలా భిన్నంగా ఉంటాయి. అది మెల్లిమెల్లిగా మనం అర్థం చేసుకుందాం. మీరు అనుకునేటటువంటి మాయ, మాయ కాదు. మీరు అనుకునే మోహం, మోహం కాదు. మీకు చేతకాకపోతే, ఛా! వెధవది ఇదంతా మాయ, మోహం అంటారు. ఇది చేతకాని, నిర్వీర్యులైన వాళ్ళు వాడే మాటలు.

కాని అర్జునుడు నిర్వీర్యుడు కాడు. శివుణ్ని ఎదిరించిన వాడు. ఇంద్రుడితో పాటు సమానంగా అర్ధసింహాసనం మీద కూర్చున్న వ్యక్తి. అతని యొక్క శౌర్యాన్ని మీరు తక్కువ అంచనా వేయలేరు. ఎందుచేతంటే, ఈ భీష్ముణ్ని, కర్ణుణ్ని వీళ్ళందర్నీ కూడా ఒకసారి ఓడించాడు సమ్మోహనాస్త్రంతో. ఎక్కడ? గోగ్రహణం అప్పుడు ఓడించాడు. అందుచేత అతనేం అంత వణికిపోవటం లేదు, అంత చేతకాని దద్దమ్మ కాదు. ఒకసారి ఓడించేశాడు ఇప్పటికే. కాని అతనికొచ్చిన మాయ, మోహము- మనకొచ్చే నిర్వీర్యమైన మోహం కాదు. అసలు ఇదంతా అనవసరం అని మనం చెప్పుకుంటున్నప్పుడు, ఈ భౌతిక జగత్తు కోసం ఇంత వెంపర్లాట ఎందుకు అనుకున్నాడు. **వివేకముతో కూడిన వైరాగ్యం అర్జునుడిది.**

మాయా మోహాలు అంటే అర్థమయ్యాయా? దీని కొరకు కాదు గాయత్రిని ఉపయోగించేది. దీనికేం ఉపయోగించక్కర్లా. కాస్త ఓ గంట ముందు వెళితే టికెట్ దొరుకుతుంది మీకు సినిమకు. దానికి గాయత్రీ చదువుకొని వెళ్ళక్కర్లేదు. కాస్త ప్లాన్‌డ్‌గా



జీవిస్తే, భౌతికంగా ఉండేటటువంటి అనేక సమస్యలు మనకి రావు. అందుచేత భౌతిక జగత్తులో మనం వాడే మాయామోహాలు అనేటటువంటి పదము, పృథా సుతుడు, (అర్జునుడు స్థితిలో) ఉండేటటువంటి మాయామోహాల స్థితి క్రమక్రమంగా మనం తెలుసుకుందాం. మూడవ శ్లోకానికి రండి.

నైమిషే సూతమాసీనమభివాద్య మహామతిం ।
కథామృతరసాస్వాదకుశలః శౌనకో ఽబ్రవీత్ ॥ 3

**ఒకసారి భగవత్ కథామృత రసాస్వాదన చేయుటలో కుశలురైన శౌనకముని నైమిశారణ్య క్షేత్రములో మహామతి సూతునకు నమస్కరించి అడిగారు.**

**శౌనక ఉవాచ:**

అజ్ఞానధ్వాంతవిధ్వంసం కోటిసూర్యసమప్రభ ।
సూతాఖ్యాహి కథాసారం మమ కర్ణరసాయనం ॥ 4

**హే సూత మహాశయా! మీ యొక్క జ్ఞానము, అజ్ఞానాంధకారమును నష్టముచేయుటకు కోటి సూర్యులలాంటిది. మీరు మా చెవులకు అమృతోపమ యమైన, సార గర్భితమైన కథను విన్పించండి.**

భక్తిజ్ఞానవిరాగాప్తో వివేకో వర్ధతే మహాన్ ।
మాయామోహనిరాసశ్చ వైష్ణవైః క్రియతే కథమ్ ॥ 5

**భక్తి జ్ఞాన వైరాగ్యాలు పొందినప్పుడు వచ్చే మహా వివేకం యొక్క వృద్ధెలా జరుగుతుంది? మరియు వైష్ణవులు మాయామోహం నుంచి ఎలా బయట పడతారు?**

ఇహ ఘోరే కలౌ ప్రాయో జీవశ్చాసురతాం గతః ।
క్లేశాక్రాంతస్య తస్యైవ శోధనే కిం పరాయణమ్ ॥ 6

**ఈ ఘోర కలియుగంలో జీవులు ఆసురీ స్వభావం కలవారు. వివిధ క్లేశాలతో ఆక్రాంతులైన ఆ జీవులు పరిశుద్ధులవడానికి సర్వశ్రేష్ఠ ఉపాయంబెట్టిది?**

శ్రేయసాం యద్భవేచ్ఛ్రేయః పావనానాం చ పావనమ్ ।

కృష్ణప్రాప్తికరం శశ్వత్సాధనం తద్వదాధునా ॥ 7

అన్నిటికంటే కళ్యాణకరమైనది, పవిత్రమైనది, శ్రీకృష్ణప్రాప్తి ఇచ్చేట్టి శాశ్వత సాధనమీనాడు చెప్పండి.

*చింతామణిర్లోకసుఖం సురద్రుః స్వర్గసంపదామ్ ।*

*ప్రయచ్ఛతి గురుః ప్రీతో వైకుంఠం యోగిదుర్లభమ్ ॥ 8*

చింతామణి లౌకిక సుఖాన్నిస్తుంది. కల్పవృక్షము స్వర్గీయ సంపత్తుల నిస్తుంది. కాని గురుదేవులు ప్రసన్నులవుతే యోగులకు కూడా దుర్లభమైన నిత్యమైన వైకుంఠధామం ఇస్తారు.





అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్ ।

ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥ (భ.గీ. 4-6)

నేను పుట్టుకలేనివాడను, నాశరహితస్వరూపము కలవాడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను అయినప్పటికి స్వకీయమగు ప్రకృతిని వశపఱచుకొని నా మాయాశక్తిచేత పుట్టుచున్నాను

**భాగవత విద్య తప్ప ఇంక ప్రపంచంలో ఇంకొక విద్య ఉండ కూడదు**

ఇది చదువుకుంటున్న మీరందరూ నిరంతరం ఒక విషయం గుర్తించుకోవాలి. ఇంతవరకూ భాగవతం చదువుకుంటోన్న వ్యక్తులు ఒకే ఉద్దేశ్యంతో కూర్చుని చదవటం లేదు. ఇది వరకు చదువుకునే వాళ్ళు, వాళ్ళ వ్యక్తిగతమైన ముక్తి కోసము, వ్యక్తిగత మైన సుఖాల కోసము, లేకపోతే వాళ్ళ వ్యక్తిగతమైన బాధలు పోగొట్టుకోవటానికి చదివారు దీన్ని.

శ్రేయసాం యద్భవేచ్ఛ్రేయః పావనానాం చ పావనమ్

కృష్ణప్రాప్తికరం శశ్వత్సాధనం తద్వదాధునా 7

అన్నిటికంటే కళ్యాణకరమైనది, పవిత్రమైనది, శ్రీకృష్ణప్రాప్తి ఇచ్చేట్టి శాశ్వత సాధనమీనాడు చెప్పండి.

శ్రేయసాం యద్భవేచ్ఛ్రేయః - శ్రేయస్సులన్నిట్లోకీ కూడా ఏది శ్రేయోదాయకమో,

పావనానాం చ పావనమ్ - పవిత్రము చేసే వాటన్నిట్లోకీ కూడా ఏది పరమ పవిత్రముగా మనల్ని మార్చగలదో,

కృష్ణప్రాప్తికరం శశ్వత్ - కృష్ణ చేతనత్వాన్ని ఏది తక్షణం ఇచ్చేయగలదో, కృష్ణుడ్ని కాదు, కృష్ణ చేతనత్వాన్ని ఏది తక్షణం ఇచ్చేయగలదో.

తత్ సాధనం వద్ అధునా - ఆ సాధనాన్ని ఇవాళ చెప్పని అడుగుతున్నాడు అక్కడ. కాని ఇవాళ ఆ సాధనం అడగటం లేదు మనం. ఈ భాగవత పారాయణ ఉద్దేశ్యాన్ని మీరు చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. ఇది పారాయణ చేస్తోంది ఎందుకంటే,

**రేపు ఈ విద్య తప్ప ప్రపంచంలో ఇంకో విద్య ఉండకూడదు అనే దృఢ**

**సంకల్పముతో మనము ఈ సాధన మొదలెట్టాము. భాగవత విద్య తప్ప, ఆధ్యాత్మిక విద్య తప్ప, ఇంక ప్రపంచంలో ఇంకొక విద్య ఉండకూడదు.**

చూసి, చూసి దానికి ఇప్పుడే ఎందుకు మనం ముహూర్తం పెట్టుకున్నాం? ఇదే విద్య ప్రపంచానికి అందజేయాలి అని ఋషులు కూడా కోరుకుని ఉండవచ్చుకదా! మరి వాళ్ళు ఎందుకు కోరుకోలేదు, మనం ఇప్పుడు ఎందుకు కోరుకుంటున్నాం? ఒకటి మీరు గుర్తుంచుకోవాల్సింది ఏంటంటే, మనం కోరుకునేదికూడా వాళ్ళ కోరికలే. తేడా ఏంటంటే, గురువు యొక్క కోరికకి అనుగుణ్యంగా కనుక నువ్వు మారిపోతే, అది నీ కోరిక అవదు. గురు చేతనత్వం యొక్క కోరికౌతుంది. గురుచేతనత్వం అన్నా, కృష్ణ చేతనత్వం అన్నా ఒకటే.

రహస్యమైన విద్య మీకర్థమైందా?

ఏంటి ఆ చేతనత్వం యొక్క ఉద్దేశ్యము? ప్రస్తుతానికి మనకి తెలియదు. జైలులోనే పుట్టి, జైలులోనే పెరిగి, జైలే మొత్తము అనుకున్న వ్యక్తికి, జైలు బయటి జీవితము ఎలా ఉంటుందనేది అర్థము కాదు. కృష్ణుడు యొక్క తల్లితండ్రులు అలాంటి వాళ్ళు. వాళ్ళు జైలులోనే ఉన్నారు, జైలులోనే కృష్ణుడు పుట్టాడు. జైలులోనే కృష్ణుడు పుట్టి, కంసుడ్ని చంపనంత వరకూ ఆ తల్లితండ్రులు జైలులోనే ఉన్నారు.

అందుచేత మనకి జైలు బయట జీవితం ఎలా ఉంటుందో అర్థమౌతుంది అనే అపోహ ముందు పోవాలి. చాలా పెద్ద రోగం ఉందసలు పండితుల దగ్గర్నుంచి పామరుల వరకూ. రోగం ఏంటీ అంటే, మీకు అర్థమయిపోయింది గురువు ఏం చెప్తున్నాడు అనేది. మీకు అది అర్థం కాదు.

అందుకే చాలా రహస్యమైనది నేను చెప్తున్నానంటాడు కృష్ణుడు, రాజవిద్యా, రాజగుహ్యము అని భగవద్గీత 9వ అధ్యాయంలో. వాఖ్యలు మీరు చెప్తుంటారు. కాని ఏ రహస్యం అర్థమైంది మీకు? అర్థమైపోయిందంటాం మీరు. అర్థం కాలేదంటే, ఆత్మ గురించి అర్థమైపోయిందంటాం. ఆత్మ గురించి అర్థం కాలేదు అంటే, వైకుంఠం గురించి అర్థమైపోయిందంటాం, సత్యలోకం అర్థమైపోయిందంటాం, ఇక్కడొక పాము కన్పిస్తే, మనమే ముందు పరిగెడతాం. ఆ ఉపన్యాసం ఇచ్చేవాడే ముందు పరిగెడతాడు. భావం



అర్థం చేసుకోండి ఏం చెప్తున్నానో. భయం పోలేదు. అభయం రాలేదు.

ఇక్కడ మనం చేరినది, **ఈ ఆధ్యాత్మిక విద్య విశ్వవిద్యాలయాల్లో ఏకైక విద్యగా చెలామణీ కావాలనే కోరికతో**. ఇంత కంటే గొప్ప లక్ష్యం మీకు మీ జీవితాల్లో దొరకదని మీరు అర్థం చేసుకోగలుగుతే, మీ జీవితాలు మారిపోతాయి. మీ జీవితాలు మారినా, మారకపోయినా, జరిగే సంఘటన ఖచ్చితంగా జరుగుతుంది. మిగతా వాళ్ళ వెనకాల వెళతారా, ఇప్పుడే వెళతారా అన్నది మీ మీద ఆధారపడుంటుంది.

నాకు మా కాలేజీలో నేను క్రొత్తగా చేరినప్పుడు జరిగిన సంఘటన గురించి ఒకతను నాతో ఎప్పుడూ చెప్తుంటాడు. నేనూ, క్రేన్ సుబ్బారావుగారు ఒకేసారి వక్కపొడి వ్యాపారం మొదలెట్టాం అని. తేడా అర్థమైందా? ఒకేసారి మొదలెట్టారు నిజంగానే. ఒకేలాగా, ఒకే స్థితిలో మొదలెట్టారు. కాని తేడా ఎక్కడొచ్చింది? ఈయన వక్కపొడి వ్యాపారంతో పాటు ఇంకో 20 వ్యాపారాలు పెట్టుకున్నాడు, ఇది కాదని అది, అది కాదని ఇది, ఇది కాదని అది. చివరికి మా కాలేజ్‌లో ఎక్కడో ఒక చోట పని చేస్తున్నాడు. అతనితోపాటే అదే వ్యాపారం కలిసి మొదలెట్టినటువంటి ఒక వ్యక్తి ఎంత ఎత్తుకు ఎదిగాడు అంటే, ఒక కోటి రూపాయలు పన్ను ఇవ్వాలంటే ఎడంచేత్తో ఇచ్చేస్తాడు.

అందుచేత నిర్ణయాలు మీవి, చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండది. నా **నిర్ణయమేదో నేను చేసేసుకునే ఉన్నాను. మీరు కూడా కలిసి నాతో ప్రయాణించగలరా?** కలిసి ప్రయాణించటంలో కొన్ని చిక్కులున్నాయి. చాలామంది పిరికివాళ్ళు ఈ దారికి వద్దామని ప్రయత్నం చేస్తూ ఉంటారు. జీవితంలో పనికి రానివాళ్ళు, జీవితంలో ఏ విధమైన స్థాయిని పొందలేని వాళ్ళు, జీవితాన్ని జీవించటం చేతకాని వాళ్ళు, పదిమందితో కలిసి జీవించలేని వాళ్ళు, ఈ దారికి వద్దామని ప్రయత్నం చేస్తూవుంటారు. కాని వాళ్ళది వృధాశ్రమ. ఇక్కడ ఉద్దేశ్యమేంటి

అఖండమండలాకారం వ్యాప్తంయేన చరాచరమ్
యత్పదం దర్శితం యేన తస్మై శ్రీగురవేనమః

మానవ జీవితంతోనే కాదు, దోమతో,కుక్కలతో, వాటితోకూడా తాద్యాత్మ్యం

చెందగలిగే చేతనత్వం ఆ కృష్ణ చేతనత్వం. వాటిని విశ్వపరిణామక్రమానికి ఉపయోగించుకునే చేతనత్వం. దానిని ఈ కాలంలోనే, మనముందే పొందిన వ్యక్తిత్వాలు ఉన్నాయి. సాయి, సత్యసాయి, లాహిరీమహాశయ, అరవిందో, సి.వి.వి. - వీళ్ళందరూ కూడా ఆ చేతనత్వం వాళ్ళే. అందుచేత కలిసి జీవించటం చేతకాని వాళ్ళు అఖండ మండలాకారం స్థితి ఏం అర్థం చేసుకోగలరు? మీకు అర్థం అయిపోయింది అని పిస్తోంది, అది తప్పు, అది మీరు అర్థం చేసుకోండి. అర్థమైపోయింది అని అనిపించటమే కకుండా మనకి, ఆ సంకుచితమైన ఆలోచనలని ఇతరుల మీద రుద్దుతాం. అది చెయ్యకండి. మనకి తెలీదు. నాకూ తెలీదు, మీకూ తెలీదు. కాని లక్ష్యము ఒకటుంది. సర్వభూతాంరాత్మ స్థితి.

ఎలాంటి లక్ష్యము అంటే, కేన్సర్ రీసెర్చ్‌లాగ. అనేక ఇన్‌స్టిట్యూట్స్‌లో కేన్సర్ కోసం మందు కనిపెట్టటానికి ప్రయత్నం చేస్తున్నారు. ఎవడికి తెలుసు, కేన్సర్‌కి మందు ఏంటో? ఎవడికీ తెలీదు. రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఉన్నవాళ్ళకీ తెలీదు, మనకీ తెలీదు. అంతవరకూ అనుమానం లేదుకదా. కాని కేన్సర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో పని చేస్తున్న వాళ్ళకి ఇవాళ కాకపోయినా, రేపైనా మందు తెలుస్తుంది. మనకి తెలీదు. ఎందుచేతంటే, దాని గురించి నిరంతర ఆలోచన లేదు.

అందుచేత ఇక్కడ నేర్పబడుతోన్న ఆధ్యాత్మిక విద్యని చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. **ఇది తప్ప నాకు ఇంకేమీ అక్కర్లేదనే మానసిక స్థితి రావాలి.**

అనన్యాశ్చింతయన్తో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం (భ.గీ. 9-22)

**ఎవరు ఇతర భావములు లేనివారై నన్నుగూర్చి చింతించుచు ఎడతెగక ధ్యానించుచున్నారో, ఎల్లప్పుడు నాయందే నిష్ఠగల్గియుండు అట్టివారియొక్క యోగక్షేమములను నేను వహించుచున్నాను.**

**గురువుల జీవితం చూడండి, వాళ్ళు ఏం చేశారో**

అనేసరికల్లా, మా ఇంటి పనులు చూసుకోవాలా, అక్కర్లేదా? అబ్బాయి



విద్య గురించి పట్టించుకోవాలా వద్దా, పిల్లల పెళ్ళిళ్ళు చెయ్యాలా, అక్కర్లేదా? అనే అనుమానం వస్తుంది.. **గురువుల జీవితం చూడండి, వాళ్ళు ఏం చేశారో.**

శ్రీరామశర్మ ఆచార్య మధుర నుంచి హరిద్వార్‌కి వెళ్ళే ముందు వాళ్ళ ఇద్దరి కూతుర్ల పెళ్ళిళ్ళు చేసి వెళ్ళారు. గురువుల జీవిత చరిత్ర చూడండి. వాళ్ళ భోజనానికి కావలసిన ఏర్పాట్లు చేసుకున్నారు వాళ్ళు. **గురువుగారు, మాతాజీ ఆశ్రమం పెట్టినప్పుడు, వాళ్ళ డబ్బుతో ఆశ్రమం పెట్టుకున్నారు. ఆవిడ నగలు అమ్మేసి, జమీందారీ బాండ్స్ మీద వచ్చిన డబ్బుని గురువుగారు ఆశ్రమంగా మార్చుకున్నారు. వాళ్ళు తింటానికి ఉంది. ఎవరు వచ్చినా, రాకపోయినా వాళ్ళలాగే జీవించి ఉండేవాళ్ళు.** అదర్థం చేసుకోండి మీరు. గాయత్రీ పరివార్ రాకపోతే గురువుగారు మార్గం ఏమీ దారి తప్పేది కాదు. కాని బాధ్యతలు ఏది వదిలేశారు ఆయన, మీరు అదర్థం చేసుకోండి. వాళ్ళమ్మాయి పెళ్ళి చేయటానికి ఎంతమందిని అడిగారో, అబ్బాయిని వెతకటానికి గురువుగారు. చివరికి, 1971 లో నేను ఆయన దగ్గరికి వెళ్ళినప్పుడు వాళ్ళమ్మాయి పెళ్ళికూడా అప్పుడే చేశారు. గురువుల జీవితాన్ని అర్థం చేసుకోండి మీరు, మీరు ఎలా జీవించాలి అన్నది తెలుస్తుంది.

బాధ్యతారహితమైనటువంటి జీవితం, ఇతరులకి మీరు బరువుగా ఉండే జీవితం, ఇతరుల మీద ఆధారపడేటటువంటి జీవితము, ఇతరులకి బాధ కలిగించే జీవితము జీవిస్తున్న వ్యక్తులు భాగవతానికి తగరు.

ఈ విద్య నేర్చుకోలేరు. మీరు అది పరీక్ష చేసుకోండి ఎప్పుడూకూడా. అప్పుడు ఈ చేతనత్వం చాలా సులభంగా వస్తుంది. మీ జీవితం ఏ స్థాయిలో ఉండాలి? సర్వజ్ఞత్వము, సర్వవ్యాపకత్వము, సర్వసమర్థత స్థాయిలో ఉండాలి.

శ్రీరామశర్మ చేతనత్వం అయినా, ఈ అనంతమైనటువంటి చేతనత్వంలో చిన్న కణమేగా! ఊహించండి, ఎంత చిన్న కణమో అది. మనకి ఆయన చాలా పెద్ద గురువు. కాని ఆయన గురువుగారి ముందు? వీడు కోతే కాని, హనుమంతుడు అన్నారు దాదా గురుదేవులు. గురువుల యొక్క జీవితచరిత్ర చదువుకోండి. పక్షే అన్నారు.

ఎవరిని అన్నాడు పక్షి అని ఆయన గురువు? శ్రీరామశర్మ ఆచార్యని అన్నాడు. వీడు పక్షే కాని జటాయువు. ఇంకా ఏమన్నాడు? మూడోది ఎలుగుబంటే కాని జాంబవంతుడు అన్నారు. అందుచేత ఎప్పుడూ మూడు, మూడు, మూడు వస్తాయి.

అలాగే నా శిష్యుడే, కాని, ఓ ఋషులారా! మీ అందరి శిష్యుడు కూడా ... నా పనే కాదు, మీ పని కూడా చేయగలడు అనేటటువంటి చేతనత్వం అది. ఎవరిది? శ్రీరామశర్మఆచార్య గురువుగారిది (దాదా గురుదేవులుగా పిలువబడే స్వామి సర్వేశ్వరానందజీ). ఇంక ఆ గురువు చేతనత్వం, ఆయన ఫొటో మేం పెట్టేసుకుంటాం అంటే సరిపోదు. మీ చేతనత్వం మారాలి. కాని ఫొటో పెట్టుకున్నారు అంటేనే మీరు అదృష్టవంతులు కదా! ఏ హృతిక్ రోషన్‌దో, అమితాబ్ బచ్చన్‌దో, వాళ్ళదో పెట్టుకోకుండా వీళ్ళది పెట్టుకుంటున్నారు. తప్పేమీ లేదు, అవి పెట్టుకోవటంలో కూడా తప్పు లేదు. ఎందుచేతంటే, హీరో గురించి, హీరోయిన్ గురించి అందరికీ తెలుసు. మన గురించి ఎవడికీ తెలీదు. ప్రాబబ్లీ, శ్రీరామశర్మ ఆచార్య గురించి చాలామందికి తెలియకపోవచ్చు కాని, మాధురీ దీక్షిత్ గురించి అందరికీ తెలుసు.

చేతనత్వ విజ్ఞానం మనకే ఉంది

అందుచేత, సినిమా నటులు చేతనత్వం యొక్క వికాసాన్ని అర్థం చేసుకోండి. వాళ్ళు చిన్న వ్యక్తులేం కాదు. ప్రపంచం అంతటికీ ఈ సినిమా నటులు గురించి తెలుసుకదా అంటే, వాళ్ళ చేతనత్వం ఏ స్థాయిదో మీరు ఊహించుకోండి. కేవలం వాళ్ళు సినిమా నటులు కాబట్టి, వాళ్ళు చిన్నవాళ్ళు అనేం అనుకోకండి. వాళ్ళ ఫొటోలు ఉత్తినే ఉంటున్నాయా ఏంటి మీ ఇళ్ళల్లో. మేం పెట్టుకోలేదు మాస్టారూ! ఏదో ఒక క్యాలెండర్‌లోఖచ్చితంగా ఉంటుంది, మీరు పెట్టుకున్నా, పెట్టుకోకపోయినా. సర్వ వ్యాపకత్వం! ఆ భావం అర్థం చేసుకోండి ఏం చెప్తున్నానో నేను. వారు ఒక స్థాయిలో సర్వవ్యాపకులు.

అందుచేత, ఈ **చేతనత్వంలోని మార్పు అర్థం చేసుకునేటటువంటి**



**సమయం ఆసన్నమైంది ఇప్పుడు ప్రపంచంలో మొట్టమొదటిసారి.** మనం చేతనత్వం గురించి మాట్లాడగలిగేటటువంటి స్థితికి వచ్చాం. ఇది వరకు చేతనత్వం గురించి మనం మాట్లాడలేకపోయేవాళ్ళం. అర్థమయ్యేది కాదు. అందుచేత చేతనత్వ విజ్ఞానం అనే ఒక చేతనత్వ టెక్నాలజీ ప్రపంచంలో రాబోతోంది. కాని వెతుక్కుంటున్నారు విదేశాలలో, చేతనత్వ టెక్నాలజీ గురించి. సైంటిస్టులందరూకూడా, సైకాలజిస్ట్లు అందరూ కూడా ఈ చేతనత్వ విజ్ఞానం గురించి వెతుక్కోవటానికి చాలా ప్రయత్నం చేస్తున్నారు. కాని మన భారతదేశంలో అది ఇప్పటికే ఉంది.

**భాగవతం అనే పేరుతో, రామయణం అనే పేరుతో, మహాభారతం అనే పేరుతో చేతనత్వ విజ్ఞానం తయారుచేయబడి ఉంది.** తయారుచేయబడి ఉండటమే కాకుండా ఆ చేతనత్వ విజ్ఞానం యొక్క అవధి ఎంత విస్తృతంగా ఉంది అంటే, రామాయణ, మహాభారత, భాగవత కథలు తెలీనటువంటి భారతీయుడు ఎవడూ ఉండడు. ఎవ్వడూ లేడు.

ఎలా తెలుసు మీకు ఈ కథలన్నీ? టెక్స్ట్ బుక్స్ చదివారా మీరు, ఎవరైనా టీచరొచ్చి మీకు చెప్పాడా, ఒక స్కూల్లో ఏమైనా నేర్చుకున్నారా మీరు?

ఇంకా స్కూల్లో ఇప్పుడు నేర్చుకుంటే ప్రమాదం కూడా మీకు. సెక్యులం అవుతారు మీరు. చాలా ప్రమాదం ఈ మాటలు అంటే. అంత దుస్థితిలో ఉన్నాం. అది తప్పు అని మాట్లాడలేకుండా ఉన్నాం డెమోక్రసీలో. మళ్ళా డెమోక్రసీ అంటాం మనం. అంటే అర్థమేంటి, అది మీకు ఒప్పు అనే అన్పిస్తోంది, లేకపోతే అది ఎప్పుడో ఎగిరిపోయి ఉండేది. దేని గురించి చెప్తున్నానో అర్థమైందా నేను?

సెక్యులరిజమ్ గురించి చెప్తున్నాను. ఎంత మూర్ఖత్వం అయినటువంటి పరిస్థితో, ఎంత పరమ నీచమైనటువంటి జీవితాలు జీవిస్తున్నామో, ఇటు తల్లితండ్రులకీ అర్థం కావటంలేదు, విద్యార్థులకీ అర్థం కావటంలేదు. చదువురానటువంటి వాళ్ళు, చదువు చెప్పేవాళ్ళ మీద ఆధిపత్యం! అది ఎంత ఫూలిష్‌నెస్సొ అర్థమౌతోంది కదా మీకు. మరి ఎవడూ నోరెత్తడేం! డెమోక్రసీ అంటున్నాం కదా! అలాంటి స్థితిలో

కాన్షియస్‌నెస్ టెక్నాలజీ ఏం చెప్తారు మీరు?

మామూలు విద్య చెప్పటానికే, పదో క్లాసు చదువుతున్నటువంటి పిల్లవాడు ఉంటే, చదువురానటువంటి ఆ పిల్లవాడి తండ్రి, చదువు చెప్తున్నటువంటి గురువుని ప్రశ్నించవచ్చు, ఎందుకు నువ్వు చెప్పటం లేదని. అంతకంటే మహానుభావులు ఉన్నారు విద్యా వ్యవస్థలో. పెర్సెంటేజ్ ఆఫ్ పాస్‌లు కావాలట వాళ్ళకి. పాసింగ్ పెర్సెంటేజ్ ఎక్కువవ్వాలిట! ఎంత దద్దమ్మలో ఊహించుకోండి వాళ్ళు! పాస్ పెర్సెంటేజ్ మీరు నిర్ణయించగలరా? ఈజ్ ఇట్ పాజిబుల్? ఎవడూ మాట్లాడడు. వాళ్ళు మంత్రులు, చాలా గొప్పవాళ్ళు. దద్దమ్మలు! వాళ్ళు ఏమైతే ఏంటిట?

ఈ విషయం వాళ్ళకి రాదుకదా, వాళ్ళు దద్దమ్మలే. తెలియని విషయంలో నిర్ణయం తీసుకొనే హక్కు వాళ్ళకి ఎవరిచ్చారు? మీరే ఇచ్చారు. మరి తప్పెవరిది? మీదే. అది, ఆ చేతనత్వంలో మార్పు మీలో రావటానికి చెప్పేటటువంటి క్లాసులు ఇవి. సన్యాసులు అయ్యేటటువంటి క్లాసులు కాదు. బాధ్యతలు తప్పించుకునే క్లాసులు కావివి. మీరు ఎదిరించి పోరాడగలగాలి. అర్జునుడికి చెప్పిన క్లాసులివి.

కృష్ణం వందే వ్యథాసుతం.

అర్జునుడికి చెప్పే విషయాలు, బాధ్యతల నుంచి పారిపోయే విషయాలెలా అవుతాయి? ఆ స్థితికి ఎదగటానికి కావలసినటువంటి చేతనత్వ విజ్ఞానాన్ని ఈనాడు భూమి మీద దింపాలి అనేటటువంటి ప్రయత్నం మనం చేస్తున్నాం. ఎందుచేత?

మా కాలేజీలో ఒకప్పుడు సంస్కృతం లేదు, సంస్కృతం టీచర్ లేడు. అకస్మాత్తుగా సంస్కృతం చదివిన ప్రతీ కుర్రాడికి 90 మార్కులు వచ్చేస్తున్నాయి. కాని వాడికి సంస్కృతం అంటే ఏంటో తెలియదు, అది వేరే విషయం. ఇప్పుడే మయింది? ప్రతీ స్కూల్లోనూ సంస్కృత టీచర్ ఉన్నాడు. ప్రతీ కాలేజీలోనూ. మార్కులు ఎక్కువ వస్తున్నాయి, లేకపోతే చదవాలి అనే కోరుకునేవాళ్ళు ఎక్కువున్నారు కనుక. అంతేగా! మార్కులు ఎక్కువొస్తాయని చదువుతారో, దేనికోసమో. అది వేరే విషయం.



అలాగే ఈ విద్యని కనుక చదువుకోవాలి అనుకునేటటువంటి వాళ్ళని కనుక మనం ఏర్పర్చగలిగితే, ఖచ్చితంగా ఈ విద్య మాత్రమే మిగులుతుంది, అప్పుడు మిగతా విద్యలు అనవసరం.

**ఎందుకు మిగతా విద్యలు అనవసరం?**

డాక్టరు రోగం నయం చేయలేడు, ఎక్కడికి వెళ్తాం? సాయి దగ్గరికి వెళ్తాం. ఉద్యోగం దొరకటం లేదు, సిఫారుసు చేయించుకొన్నాం, మంత్రి పదవి పోయింది. వాడెక్కడికి పోతాడు? కర్మాగారం పెట్టాలి, అనువైన జాగా ఎక్కడుంది? ఎవర్ని అడుగుతాడు? గురువునే అడుగుతాడు. **కాని ఇంత అద్భుతమైన చేతనత్వం ఉన్నా, ఈ చేతనత్వం మాకు అక్కర్లేదు అనే మానసికస్థితి వల్లే ఇలా ఉన్నాము.** ఇందాక ఉదాహరణ చెప్పాను కదా! చదువు రానివాడు చదువుకున్న వాడి మీద ఆధిపత్యం చెలాయిస్తున్న రోజుల్లో మనం జీవిస్తున్నాం కనుక, మన ఆలోచనలూ అలాగే ఉంటాయి, భ్రష్టు పట్టిన ఆలోచనలు. మరి అవి మారాలిగా!

రావణాసురుడు ఋషుల్ని పట్టుకొని చావగొడుతూవుంటే ఋషులు నోరు మూసుకొని ఊరుకున్నారా? నోరు మూసుకొనేం ఊరుకోలేదే! జైల్లో పెట్టి చావ గొడుతూన్నా కూడా, అతన్నేం పూజించలేదు. కాని ఎదురు తిరగలేదు వాళ్ళు. ఎందుచేతంటే, అది వాళ్ళ పనికాదు, ఋషుల పనికాదు అది. **ఋషుల పని ఎదురు తిరగటం కాదు.**

**కాని మరి ఋషుల పని ఏంటి? ఏది సత్యమో అలా జీవిస్తూ, బయటి ప్రపంచం అలా జీవించినా, జీవించకపోయినా వాళ్ళు అలాగే జీవించటం.**

విశ్వామిత్రుడు యజ్ఞం చేస్తున్నాడు, రాక్షసులు వచ్చి, యజ్ఞాన్ని ధ్వంసం చేస్తున్నారు. యజ్ఞం మానేడా? ఎప్పుడూ మానలేదు యజ్ఞం. మరి అడ్డు తగులుతూనే ఉన్నారు కదా. మీరు ప్రొద్దున్న నిద్ర లేవలేదు కనుక యజ్ఞం మానేస్తారంటారు. కుంభకర్ణుడు ఆవహిస్తాడన్న మాట, ఓ రాక్షసుడు ఆవహిస్తాడు.

అప్పుడు ఏం చేశాడు విశ్వామిత్రుడు మరి? చూశాడు, చూశాడు, చివరికి కాలము ఆసన్నమయిన తరవాత, మీరు చాలా జాగ్రత్తగా దీన్ని గుర్తుంచుకోవాలి. కాలము ఆసన్నమయిన తరవాత దశరథుడు దగ్గరికి వెళ్ళాడు. వెళ్ళి ఏమన్నాడు? నీ కొడుకు కావాలన్నాడు, నువ్వు వద్దన్నాడు.

అంటే, మన పిల్లల్ని మంచి మార్గము వైపు తొయ్యగలిగే దమ్ము ఉందా, లేకపోతే అందరూ ఏమనుకుంటున్నారో అదే చేస్తావా నువ్వు? అదేగా జరిగింది అక్కడ. నేను పంపించలేను నా కొడుకుని, రాక్షసులతో యుద్ధం చేయటానికి, ఇంజనీర్‌ని చేస్తాను, లేకపోతే ఇంకోటేదో చేస్తాను అన్నాడు దశరథుడు.

మీరు చేస్తే వాడు ఇంజనీయిర్ అయిపోతాడనే అహంకారం మళ్ళా మీకు. మీరు నిజంగా మీ అబ్బాయిని ఇంజనీర్ చేయగలరా? ఏమో నాకు అనుమానమే, వాడి అదృష్టం బావుండి అవ్వాలి తప్ప. వాడి అదృష్టం బావుండి అవటమే తప్ప, ఈ చదువుల వల్ల అవడు వాడు. అదికూడా అర్థం చేసుకోండి. వాడి అదృష్టం బావుంది, అవుతాడు అంతే.

అలాగే దశరథుడుని అడిగాడు వచ్చి విశ్వామిత్రుడు, ఇలాగ కాలాన్ని మార్చాలి. ఆసురీ ప్రవృత్తులు ఎక్కువైపోయాయి, నీ వల్ల ఏం అవదు నువ్వు ఎంత గొప్పవాడివైనా. నువ్వు రాక్షసులతో యుద్ధం చేశావు ఒకప్పుడు దేవదానవ యుద్ధంలో అయినా దశరథుడిని కోరుకోలేదు. నీ కొడుకు కావాలన్నాడు.

ఏంటి కొడుకు అంటే? మీ యొక్క మానసికస్థితి. మీ యొక్క మానసికస్థితే మీ యొక్కకుమారుడు. మీ యొక్కకుమారుడ్ని ఎటు తోస్తున్నారు, మానసికస్థితిని?

ఇప్పటికి కూడా మీకు ఈ విద్య నేర్చుకుంటామనే దమ్ము లేదు. మాకు జీవించటానికి, రెండుపూట్లా తిండి తినగలగటానికి చాలింక! మేమింక ఏమీ ఆలోచించము, ఈ భాగవత విద్యనే మేం నేర్చుకుంటామనే దమ్ము ఎవడికీ లేదు. తింటానికి ఉన్నవాడూ "నాకు ఇంకేం అక్కర్లేదు, ఈ మార్గంలోనే ఉంటాను" అనలేడు.



అప్పుడు వశిష్ఠుడు ఉన్నాడు ప్రక్కన అదృష్టవశాత్తూ. ఏం చెప్పాడు, నువ్వు మూర్ఖుడివి, నీ వల్ల ఏం అవదు, ఏదైనా అయితే అది రాముడి వల్లే అవుతుంది అంటే పంపించాడు. భావం అర్థమవుతోంది కదా, ఆ సాహసం కావాలి. నిర్వీర్యులైన వ్యక్తులు భాగవతాన్ని చదివి ఏం చేయగలరు? కొన్ని అలవాట్లు మార్చుకోలేని వాడు జీవితాన్ని మార్చేసుకుంటాను అంటాడు. సంభవమేనా?

నా దగ్గరికి వచ్చి ఒకడు భోరుమని ఏడ్చేశాడు. "మాస్టారూ ఇంక నాకు భగవద్దర్శనం కాదా" అని. వాణ్ణి చూసి నేను ఏడ్చేశాను. ఎందుకో తెలుసా? అంత ఏడుపు నాకు రాలేదే అని.

నాకు ఏడుపు ఇప్పటికీ లేదు. భగవద్దర్శనం అయ్యేటటువంటి బాధ ఇప్పటికీ నాకు జీవితంలో లేదు, నాకు దేవుడు అక్కర్లేదు కూడా. మీకు కావాలంటే మీరు తీసుకోండి దేవుణ్ణి. ఒక పోటీదారుడు తగ్గుతాడు మీకు. ఏడ్చేశాడు అతను. అంతా చెప్పాడు, ఏంటో మాస్టారూ, అంతా బాగానే ఉంది కాని సిగరెట్ తాగటం మానలేకుండా ఉన్నాను అని అన్నాడు.

దేవుడి దర్శనం కావాలట వాడికి. ఏడ్చేస్తున్నాడు వాడు. కాని సిగరెట్ మానుకోలేడు! నమ్ముమంటారా? ఆ నీచత్వం అర్థమవుతోందా అసలు? మీరు మాట్లాడుతున్న మాటలకి, మీ చేతలకి ఎంత తేడా ఉందో అర్థమవుతోందా? దైవదర్శనం కాలేదని ఏడుపు నిజమా, సిగరెట్ తాగలేకపోయాననే బాధ నిజమా? సిగరెట్ కాకపోతే టీ, కాకపోతే కాఫీ. మీరు కారణం ఏదైనా చెప్పుకోండి. **ఇది మంచిది కాదు అని తెలిసి, దాన్ని వదలలేనటువంటి మానసికస్థితి ఆసురీ ప్రవృత్తి** అది అర్థం చేసుకోండి. ఇది మంచిది కాదూ అని అర్థమైపోయింది మనకి, అయినా మానలేకుండా ఉన్నాను మాస్టారు! మరి అలాంటి వాళ్ళకి మార్గం ఏదైనా ఉందా అంటే, ఇదే మార్గం చెపుతున్నాడు ఇక్కడ.

**వదలలేనటువంటి మానసికస్థితి ఆసురీ ప్రవృత్తి**

*ఇహ ఘోరే కలౌ ప్రాయో జీవశ్చాసురతాం గతః ।*
*క్లేశాక్రాంతస్య తస్యైవ శోధనే కిం పరాయణమ్ ॥ 6*

**ఈ ఘోర కలియుగంలో జీవులు ఆసురీ స్వభావం కలవారు. వివిధ క్లేశాలతో ఆక్రాంతులైన ఆ జీవులు పరిశుద్ధులవడానికి సర్వశ్రేష్ఠ ఉపాయంబెట్టిది?**

ఓ ధృవుడు, ఓ ప్రహ్లాదుడు, చాలా గొప్పవాళ్ళు అయ్యారు. ఓ వాల్మీకి?

"వాళ్ళు గొప్పవాళ్ళు అయితే, మేం అవలేమని చెప్తానే ఉన్నాంగా!"

ఒకసారి ఒక చర్చ వచ్చింది ఒక ట్రైన్ కంపార్ట్‌మెంట్‌లో. నేను ఎక్కిన కంపార్ట్‌మెంట్‌లోనే టికెట్ కలెక్టర్ ఒకడ్ని పట్టుకున్నాడు. ఎవడ్ని పట్టుకున్నాడు? టికెట్ లేనివాడిని. ఏమయ్యా నీ దగ్గిర టికెట్ ఉందా? అని అడిగాడు వాడిని. లేదన్నాడు. టికెట్ ఎందుకు కొనలేదు అన్నాడు. కొనలేదు అన్నాడు. మళ్ళీ అడిగాడు. ఓసారి చెప్తే నీకు అర్థం అవదయ్యా! నేను కొనలేదు, ఏంటిట అయితే? అన్నాడు.

మనవీ ఇలాగే ఉంటాయి. అవును. నేను సిగరెట్ తాగటం మానను. ఏంటట! ఇంతకీ నన్ను ప్రయాణం చేయినిస్తావా, చేయినివ్వవా అని పై ఉదాహరణలో అన్నట్టు చెయ్యాలా, చెయ్యక్కర్లేదా? మీ నిర్ణయం. కాని కలియుగంలో అయితే టికెట్ లేకుండా మీరు రైలులో వెళ్ళిపోవచ్చు కాని, ఆధ్యాత్మిక జగత్తులో టికెట్ లేకుండా నువ్వు వెళ్ళలేవు. నువ్వు వెళ్ళలేవు. ఏ గురువూ నిన్ను తీసుకెళ్ళలేడు. టికెట్ ఏంటీ అంటే, నీ అలవాట్లు మానటం. నేను అలవాట్లు మార్చుకోను, కాని మారాలి! అసంభవం అనిపిస్తుంది. అదే కలియుగం అంటే.

*ఇహ ఘోరే కలౌ ప్రాయో జీవశ్చాసురతాం గతః ।*
*క్లేశాక్రాంతస్య తస్యైవ శోధనే కిం పరాయణమ్ ॥ 6*

**ఈ ఘోర కలియుగంలో జీవులు ఆసురీ స్వభావం కలవారు. వివిధ క్లేశాలతో ఆక్రాంతులైన ఆ జీవులు పరిశుద్ధులవడానికి సర్వశ్రేష్ఠ ఉపాయంబెట్టిది?**

అలవాట్లకి బానిసలు అయిపోయారు కదా, మరి అయితే వాళ్ళకి నిష్కృతి



మార్గం లేదా, ఇంక వాళ్ళు బయటపడలేరని అర్థమైపోతోంది కదా, నేను టికెట కొనలేదు అని చెప్పాను కదా మళ్ళా అడుగుతావేం? అలాగే,

నేను ఈ అలవాట్లు మార్చుకోలేను, మరి నన్ను ఏం చేయమంటావ్?

దానికి భాగవతం ఉంది. అలాంటి వాళ్ళకికూడా ఇది ఉపయోగ పడుతుంది. కాని ఉపయోగపడటానికి మీ వేపునుంచి ప్రయత్నం ఉండాలి. ఆ ప్రయత్నం మీ ఆచరణలో కనిపిస్తూవుండాలి, ఆ ఆచరణలో ప్రయత్నానికి ఒక శ్లోకం మీరు కంఠతా పట్టుకోండి.

*చింతామణిర్లోకసుఖం సురద్రుః స్వర్గసంపదామ్*
*ప్రయచ్ఛతి గురుః ప్రీతో వైకుంఠం యోగిదుర్లభమ్ 8*

**చింతామణి లౌకిక సుఖాన్నిస్తుంది. కల్పవృక్షము స్వర్గీయ సంపత్తుల నిస్తుంది. కాని గురుదేవులు ప్రసన్నులవుతే యోగులకు కూడా దుర్లభమైన నిత్యమైన వైకుంఠధామం ఇస్తారు.**

**ప్రకృతి నిద్రతో లేపుతూనే ఉంది**

ఈ గురు చేతనత్వ విజ్ఞానమే మనం చదువుతున్నది. **భాగవతం అంతా కూడా జగద్గురు చేతనత్వం యొక్క విధివిధానాలు. జగద్గురు చేతనత్వం అంటే అందరి గురువుల యొక్క చేతనత్వము.** గురువుల యొక్క చేతనత్వము అంటే అర్థం ఏంటి? అంధకారాన్ని పోగొట్టేటటువంటి చేతనత్వము.

ఎదురుగుండా తాడు లేదు, పాము ఉంది అని కనిపిస్తూవుంటే మనం అటువెళ్ళం కదా! కాని అది పాము కాదు, తాడు అని నాకు తెలుసు. కాని నా స్నేహితుడిని భయపెట్టటానికి నేను ఏం చెప్తాను అక్కడ పాముంది పాముంది అంటాను. అప్పుడు స్నేహితుడు భయపడతాడు, నేను భయపడను. అర్థమయ్యింది కదా. ఇదంతా మాయ మాయ- అని అది మాయ అనిపించటం లేదు, అది నిజం అనిపిస్తోంది మనకి. అర్థమయ్యిందా ఉదాహరణ!

మీరు ఉత్తినే కబుర్లు చెప్పటానికి ఈ మాయ, మోహము, భ్రమ అంటున్నారు తప్ప మీకు ఆ మాయ, మోహాలే చాలా ఎక్కువ ప్రీతి. ఇతరులకి సలహా ఇచ్చేటప్పుడు కాని ఏం చెప్తున్నాం మనం, "ఎందుకయ్యా అంత బాధపడతావ్? అంతా మాయే కదా!" అని. కాని మనదగ్గర కొచ్చేసరికల్లా మనం భయపడుతు చెపుతున్నాం తప్ప అక్కడ ఉన్నది తాడు అనే దర్శనం మనకి రాదు.

బాబూ, నీకు మాయ లేదు అని అనిపించటం లేదు, కాని అంతామాయ అంటున్నావు. మనమందరం అంతేనా, కాదా? చాలా జాగ్రత్తగా ఈ ఉదాహరణలు అర్థం చేసుకోండి. తరవాత తరవాత ఈ ఉదాహరణల మీదే మొత్తం భాగవతం ఆధారపడి ఉంటుంది.

కరెంట్ పోయిన రోజున ఒకళ్ళు నాతో చెప్తున్నారు, రాత్రల్లా మెలకువగా ఉన్నామ్మేము అని. బానే ఉంది. మరి గురువుగారు కూడా అదే చెప్తా ఉంటారు కదా, ఎప్పుడూ నిరంతరం మెలకువగా ఉండాలి అని. అదంతా మనం ఎక్కడ చేస్తాం, ఇస్తే ఆయనివ్వాలి కాని మనకి, ఆ మెలకువ. ఏ మెలకువ? ఈ ప్రపంచం లోంచి మెలకువ. ఈ ప్రపంచము మాయ అనేటటువంటిది నాకెట్లా వస్తుంది, ఆయన వచ్చి లేపాలి కాని అని అన్నాడు.

మీకు చాలాసారు చెప్పాను, పరీక్ష రోజుల్లో పిల్లలతో మీరు అనుభవించి ఉంటారు. రాత్రి 9 గంటలకు పడుకుంటారు, అమ్మా ప్రొద్దున్న మూడున్నరకి లేపెయ్యి అని. ఎందుచేతంటే నేను చదివే రోజుల్లో అలా పడుకున్న వాళ్ళల్లో ఒకణ్ణి. నేను ఎనిమిది న్నరకే పడుకునేవాణ్ణి. వీళ్ళు 9 గంటలకి పడుకున్నారు. అమ్మ మూడున్నరకి లేపి కూర్చోబెడుతుంది. ఇంకొక్క అరగంటని నిద్రపోతాడు. మామూలుగా ప్రొద్దున్న 8 గంటలకి లేచాక, అమ్మ మీద ఎగురుతాడు లేపలేదేమని..

అలాగే భగవంతుడు మీద ఎగురుతాం, మాకు చెప్పలేదే అని. నన్ను నిద్ర లేపలేదే, నన్ను ఈ మోహంలో పడేశావు నువ్వు. నన్ను లేపి ఉంటే కనుక, నేను



లేచేసి, అసలు ఈ వశిష్ఠుడు, వాల్మీకి ఎంత అసలు. దంచి పారేద్దును వాళ్ళని. నన్ను లేపలేదు నువ్వు అంటారు.

కాని ప్రతీరోజూ రాత్రి భగవంతుడు మీకు నిద్ర ఇచ్చి, చేస్తోందేంటి? మీరు నిద్రలో ఏ స్థితికి వెళుతున్నారు? ఇదంతా లేని స్థితికేగా! మీరు నిద్రపోయారు అంటే అర్థం ఏంటి? ఇదంతా లేని స్థితికి వెళుతున్నారా, లేదా? ఆ నిద్ర లేని స్థితికి మీరు వెళ్ళలేక పోయారనుకోండి ఒక రెండు రోజులు. మొన్న కరెంటు పోయిన రోజు ఆ పాయింట్ మీదే చర్చ వచ్చింది. అప్పుడు చెప్పాను, భగవంతుడు లేపకపోవట మేంటి, రోజూ లేపుతున్నాడు కదా! ఒక గంట, రెండు గంటల వరకూ నిద్రలేకపోయాక, రెండవరోజు ప్రొద్దున్న ఎలా ఉంది మనకి? చాలా బావుంది కదా! ఖర్మ చాలక రెండవ రోజు కూడా నిద్రలేదనుకోండి మీకు, అప్పుడు మీ పరిస్థితి ఏమవుతుంది? పిచ్చెక్కుతుంది. మూడు రోజులు నిద్రలేకపోతే మనిషికి పిచ్చెక్కుతుంది అని శాస్త్రవేత్తలు చెప్పేది. నిజంగా నిద్రపోకూడదు వాడు. ఒక మనిషికి కనుక మీరు పిచ్చెక్కించేయ దల్చుకుంటే, మీరు పెద్ద కష్టాలేం పడి పోవక్కర్లేదు. వాణ్ని పడుకోనివ్వకుండా చేయండి చాలు. పిచ్చెక్కిపోతుంది వాడికి.

అందుచేత ఈ బాహ్యజగత్తు అంతాకూడా నీకు పిచ్చెక్కించేదే అని చెప్తున్నాడా, లేదా? నాకు నిద్ర పట్టటం లేదు అని నువ్వు బాధ పడితే అర్థం ఏంటి? ఈ బాహ్య జగత్తుని మర్చిపోలేకపోతున్నాను అనే కదా. నిద్ర పట్టటంలేదంటే అర్థం ఏంటని? నేను ఈ బాహ్య జగత్తుని మర్చిపోలేకపోతున్నాను అనే కదా అర్థం. బాహ్య జగత్తుని మర్చిపోలేకపోతే ఏమవుతుంది నీకు? కష్టాలు వస్తున్నాయి, పిచ్చెక్కుతోంది. అంతేకదా.

అంటే, ఏ జగత్తు ఎక్కువ ముఖ్యం అని అర్థమయ్యింది మీకు, బాహ్య జగత్తా, అంతర్ జగత్తా? అని ప్రతీరోజూ రాత్రి పాపం ఆయన పనికట్టుకుని నిద్ర ఇస్తున్నాడు. మీరు నిద్ర అడగలేదు ఆయనని. అడిగాడా ఎవడైనా? నాకు తెలిసి నిజంగా పని చేయదల్చుకున్నవాడు ఎవడూ నిద్ర అడగడు. పని చేయదల్చుకోని వాడికి మెలకువగా ఉన్నా, నిద్రపోకపోయినా ఒకటే కనుక గొడవ లేదు. అందుచేత

ప్రతీరోజూ రాత్రి, ప్రకృతి మనకి చెప్తోంది, నువ్వు నిద్రపోతున్నావు లే అని.

*యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ*

*యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః(భ.గీ. 2-69)*

సమస్త ప్రాణులకును (సామాన్యజనులకు) ఏది (పరమార్థతత్త్వము) రాత్రియై (దృష్టికి గోచరముకాక) యున్నదో, దానియందు ఇంద్రియనిగ్రహపరుడగు యోగి మేలు కొనియుండును (ఆత్మావలోకనము జేయుచుండును). దేనియందు (ఏ శబ్దాది విషయము లందు) ప్రాణులు మేలుకొనియున్నారో (ఆసక్తితో ప్రవర్తించు చున్నారో) అది (విషయ జాలము) పరమార్థతత్త్వమును దర్శించు మునీంద్రునకు రాత్రిగానుండును (దృష్టి గోచరముకాకయుండును).

అందుచేత మన రాత్రి యోగులకి మెలకువని అర్థమౌతోందా? బాహ్య జగత్తులో నువ్వెంత సంపాదించుకున్నా, అది మర్చిపోవలసినదే. అది మర్చిపోక పోతే నీకు సుఖము లేదు. అవునా, కాదా? దీనికి ఇంకో అర్థమేమైనా చెప్పగలరా?

లేపాడు, లేపాడు, లేపాడు, లేపాడు, లేవలేదు. ఆ ఓపికకి మెచ్చుకోండి. అందుకే అనంతుడు అని పేరేమో ఆయనకి. ఒకరోజు లేపాడు, రెండవరోజు లేపాడు, 365 రోజులు లేపాడు, అలాగ 70 సంవత్సరాలు లేపాడు. లేవలేదు. ఒళ్ళుమండి కుదిపాడు, హార్ట్ ఎటాక్ వచ్చింది. చచ్చిపోతావు. అప్పుడు ఊరుకుంటామా ఏంటి మనం, మళ్ళీ ఇంకో శరీరంలో దూరతాం. మళ్ళీ లేవం.

అంటే, ఇంతకీ భగవంతుడు నిద్ర లేపుతున్నాడా, లేదా అనేటటువంటి ప్రశ్న చాలామంది వేస్తూ ఉంటారు. చాలా గొప్పగా మేం అడిగాం, లేపితే మేం లేచిపోదుము అని. ఆయన లేపుతూనే ఉన్నాడు, కాని పిల్లవాడు ఎలాగైతే పరీక్ష రోజుల్లో కూడా తల్లి లేపినా లేపలేదు, లేవలేదు, లేపలేదు అంటామో అలాగే మనంకూడా భగవంతుడి మీద అలాగే పడతాం. అమ్మేం చేస్తుంది లేవలేకపోతే?

**పృథ్వి యొక్క అవతరణ జరిగిన తరువాత వచ్చిన పరిస్థితులు**



కాని ఈ చేతనత్వ విజ్ఞానంలో ఒక ప్లస్‌పాయింట్ ఉంది. దీని గురించి మీరు నిరంతరం ఆలోచిస్తూ ఉంటే, ఎప్పుడో అప్పుడు లేస్తారు మీరు. ఇవాళ కాపోతే రేపు, రేపు కాపోతే ఎల్లుండి... కాకపోతే మరుజన్మలో. ఏదో ఒక జన్మలో దీని యొక్క కొనసాగింపు ఉంటుంది. అందువల్ల అక్కడేం చెపుతున్నాడో చూడండి.

*చింతామణిర్లోకసుఖం సురద్రుః స్వర్గసంపదామ్ ।*

*ప్రయచ్ఛతి గురుః ప్రీతో వైకుంఠం యోగిదుర్లభమ్ ॥ 8*

చింతామణి లౌకిక సుఖాన్నిస్తుంది. కల్పవృక్షము స్వర్గీయ సంపత్తులనిస్తుంది. కాని గురుదేవులు ప్రసన్నులవుతే యోగులకు కూడా దుర్లభమైన నిత్యమైన వైకుంఠధామం ఇస్తారు.

చింతామణిర్లోకసుఖం - చింతామణి ప్రపంచంలో ఉన్న సుఖాలు ఇస్తుంది.

సురద్రుః స్వర్గసంపదామ్ - కల్పవృక్షము స్వర్గంలో ఉన్న సుఖాలు ఇస్తుంది.

ప్రయచ్ఛతి గురుః ప్రీతో వైకుంఠం యోగిదుర్లభమ్ - యోగులకు కూడా దుర్లభమైన వైకుంఠస్థితిని గురువు ఇస్తాడు. గురువు అంటే అజ్ఞానాన్ని పోగొట్టే జ్ఞానము. అది మీలోపలే ఉంటుంది, బయట ఉండదు. చాలా జాగ్రత్తగా గుర్తుంచు కోండది. బయట ఉన్న ప్రతీ గురువూ కూడా లోపల ఉన్న ఆ గురువు యొక్క ప్రతీకలే.

ఆ విద్యను నేర్చుకోవటానికి కావలసిన స్థితి పృథ్వి అవతరణ జరిగిన తర్వాత 2000వ సంవత్సరం నాడు మొట్టమొదట వచ్చింది. ఇది గుర్తుంచుకోండి మీరు.

ఇంతవరకూ ఈ పరిస్థితి ఎప్పుడూ రాలేదు భూమి మీద. సత్య యుగంలో రాలేదు, త్రేతాయుగంలో, ద్వాపరయుగంలో రాలేదు, ఇప్పుడు వచ్చింది. వచ్చింది కనుక మనం ఉపయోగించుకోగలుగుతే, ఈ రోజు కూర్చున్నటువంటి మనము ఆ ఋషి సమూహాలందరి కంటే కూడా చాలా అదృష్టవంతులం. ఎందుచేత?

మీరు కనక దీన్ని మార్చి, ఇంకోకళ్ళకి చెప్పగలిగేటటువంటి స్థితిలో వెళ్తే, ఆ

ధృవుడు, ఆ ప్రహ్లాదుడు, వాళ్ళలాగే మీ పేర్లు కూడా అజరామరం అయిపోతాయి.

అక్కడ ఒకొక్కడు మారాడు. ఒక ప్రహ్లాదుడు, ఒక వాల్మీకి, ఒక ధృవుడు, ఒకొక్కళ్ళే. కాని ఇక్కడ సామూహికంగా మీరు మారాలి.

ఆ తేడా అర్థం చేసుకోండి. ఆ చేతనత్వం ఉంది కనుకే రెసిడెన్షియల్ కాలేజెస్ వచ్చాయి. రెసిడెన్షియల్ కాలేజెస్ ఏంటి? మేము చెప్పే పాఠాలే వాళ్ళు చెప్తారు అక్కడ. కాని మేము ఉత్తినే చెప్తే, వాళ్ళు అక్కడ 40 వేలు తీసుకుని చెప్తారు. మేము ఫాన్లు అవీ వేసి పెడితే, కాని వాళ్ళు 40 వేలు తీసుకుని పెడ్లో కూర్చోపెట్టి చెప్తారు. కాని తేడా ఏంటంటే, పొద్దున్న లేచిన దగ్గర్నుంచి రాత్రి పడుకునేంత వరకూ వాయింపా. వాయింపు. ఆ వాయింపుడు మీరు ఈ చేతనత్వ ప్రాప్తికి చేసుకోవాలి. రెసిడెన్షియల్ కాలేజెస్ అందుకొచ్చాయి.

ఈ చేతనత్వం అభివృద్ధి చెందుతోంది కనుక, అలాంటి ఆచరణయోగ్యమైన కాలేజెస్, భాగవత విశ్వవిద్యాలయాలు ఏర్పడతాయి కనుక, దానికి సంకేతంగా ఇవి ఏర్పడుతున్నాయి. రెసిడెన్షియల్ కాలేజెస్‌లో ఉన్నటువంటి ఆకర్షణ అది. కాని మనకి ఇంకో రంగు పులుముతారు. ప్రకృతి ఎవరు ? యోగమాయ.

ఆ మాయాతత్వాన్ని ఛేదించుకొని జీవించగలిగేటటువంటి చేతనత్వము మనం ప్రపంచానికి నేర్పాలి, అందుకు ఈ క్లాసులు.

మరి నేర్పే దమ్ము ఉందా, మళ్ళా లేపాలా నిద్ర? అంటే మళ్ళా ఏ కరెంటో తీసెయ్యాలి. తీసేస్తే మళ్ళా దోమలు తోలుకుంటూకూర్చుంటారు కాని నిద్రలేవరుగా! పోనీ, భాగవతం చెప్పుకుందాం అనుకోరు అప్పుడు, కరెంటువాడ్ని తిడతారు. మెలకువగా ఉంటారు సరే, కరెంటు వాడ్ని తిడతారు. అందుచేత ఇది బ్యాక్‌గ్రౌండ్‌లో ఉంచుకుని తరవాత దానికి వెళదాం.

**సూత ఉవాచ:**



పీత్రిశౌనకచిత్తేతే హ్యాతోవాద్మివిచారచ
సర్వసిద్ధాంత నిష్పన్నం సంసారభయనాశనమ్ 9

**హే శౌనకా! నీ హృదయంలో భగవత్ ప్రేమ ఉన్నది. అందువల్ల నేను బాగుగా ఆలోచించి, సంసార భయనాశకరము, సర్వసిద్ధాంత నిష్పన్నము, నిష్కర్షము లేక సమస్త సిద్ధాంతసారము అయిన దానిని నీకు చెప్పుచున్నాను.**

## మనస్సు యొక్క బలహీనత

జస్ట్ 7 రోజుల క్రిందట ఇంకో 7, 8 శ్లోకాలు చెప్తాను, మీరు వ్రాసుకోండి అని చెప్పాన్నేను. 27 రోజుల క్రిందటే కదా చెప్పాను, పై వారము అయినా చేస్తారేమో చూద్దాం.మీకు అర్థమౌతోందా మనయొక్క బలహీనత, ఎంత నీచస్థితిలో ఉన్నాయో మన మనస్సులు.

మీరు ఇది వ్రాసుకోండి అని చెప్పి, 7 రోజులు అయ్యింది. చెప్పిన శ్లోకాలు వ్రాసుకోనటువంటి వాళ్ళు... మన చేతనత్వం ఎలా ఉందో చూసుకోండి. మీ కోరిక ఏంటంటే, మీ పిల్లలు మీ మాట వినాలని. ఎందుకు వినరు, ఎందుకు జరగదు అంటే, ఇందుకే జరగదు. ఏంటి? మీకు ఇంత ఆసక్తి ఉండి, ఆసక్తి ఉంది అంటానికి కారణం ఏంటంటే, ఎక్కడెక్క డినుంచో వచ్చి వింటున్నారు కదా! కాని ఆచరణలో పెట్టాలంటే మాత్రం??

అందుచేత, సూతుడు అంటే ఎవరు, మహామతి. చాలా తెలివైనటువంటి వాడు. వాడు ఎవడికి చెప్తున్నాడు? శౌనకుడికి. కథామృతరసాస్వాద కుశలః వాడు అడిగాడు ఈ ప్రశ్న, దానికి జవాబు చెప్తున్నాడు.

ఈ కలియుగంలో ఇలాంటి గొప్ప గొప్ప వాళ్ళున్నప్పుడు, చదువుకోండి అంటే మేం చదువుకోము, (ఆహారనియమాల ప్రకారం) తినండి అంటే మేం తినం, నిద్రపోండి అంటే, అసలు మేం మెలకువగా ఉంటేనే కదా నిద్రపోయేది అని మీరు అడగొచ్చు, మీకు అర్థమవటంలేదు ఆ విషయం. అసలు మీరు మెలకువగా ఉంటేకదా, నిద్ర

పొమ్మని చెప్పటానికి. మనం మెలకువగా ఉన్నామా? మెలకువగా లేమని చెప్పటానికి పెద్ద ఉదాహరణ ఇదే. మూడవ వారం అయింది ఇది చెబుతూ. అయినా తరవాత చెప్పబోయే తరగతిలో ఉన్నటువంటి శ్లోకాలు మనం చదువుకోం. కాని పిల్లలకి ఏం చెప్తాం అంటే, పాఠాలు చదువుకురమ్మని చెప్తారు లెక్చరర్స్, అలా చెప్పే లెక్చరర్స్‌లో నేనూ ఒకడ్ని. చదువుకురాడు వాడు. అందుచేత మీరు ఇలాగే ఉండండి, నేనూ ఇలాగే ఉంటాను.

వారం వారం మనం ఇలాగే కాలాన్ని వృథా చేసుకుంటూవుందాం.

ప్రీతిశౌనకచిత్తేతే హ్యాతోపా ద్మివిచారచ
సర్వసిద్ధాంత నిష్పన్నం సంసారభయనాశనమ్ 9

శిష్యుని ప్రశ్నలోని తప్పు

నీ మాటలు వింటూవుంటే నాకు ఒకటి అర్థమయ్యింది అన్నాడు సూతుడు. ఏంటి అర్థమయ్యింది, నీకు భగవంతుడిమీద భక్తి ఉంది అని. ఈ పదాలని చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి మీరు.

చేతనత్వ విజ్ఞానంలో ఒక శిష్యుడు ఏదైనా ఒక ప్రశ్న, గురువుని నాకు ఇది తెలియటం లేదని అడుగుతే, వాడు అడిగింది తప్పుఅని అర్థం చేసుకోండి.

చాలా జాగ్రత్తగా ఇప్పుడు నేను చెప్పిన మాట వినండి. మీరు గురువుని ఏ ప్రశ్న వేసినా, మీకు అర్థమై ప్రశ్న వేయరు మీరు. అర్థం కాకుండానే ప్రశ్న వేస్తారు. ఎందుచేత? గురు చేతనత్వము సర్వజ్ఞ స్థితి, సర్వవ్యాపక స్థితి, సర్వసమర్థ స్థితి. ఈ సర్వవ్యాపక, సర్వజ్ఞ, సర్వసమర్థ స్థితిని వీడు ప్రశ్నిస్తున్నాడు. ఎవడు? శిష్యుడు ప్రశ్నిస్తున్నాడు, శౌనకుడు ప్రశ్నిస్తున్నాడు. ఏమని? ఆ కృష్ణుడు యొక్క కథలు నాకు చెప్పండి, ఆయన చాలా గొప్ప గురువట కదా! జగద్గురువట కదా! స: పూర్వేషామపి గురు: కాలేనానవచ్ఛేదాత్ - గురువులందరికీ గురువట కదా! సూర్యుడికే నేను ముందు చెప్పానన్నాట్ట కదా! కృష్ణుడు అదే కదా చెప్పింది.



శ్రీభగవానువాచ

ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్ ।
వివస్వాన్ మనవే ప్రాహ మనురిక్ష్వాకవే బ్రవీత్ ॥ (భ ॥గీ॥4-1)

శ్రీభగవానుడు పలికెను

నాశరహితమగు ఈ నిష్కామ కర్మయోగమును పూర్వము నేను సూర్యునికి చెప్పితిని. సూర్యుడు వైవస్వత మనువుకు ఉపదేశించెను. మనువు ఇక్ష్వాకునకు ఉపదేశించెను.

ఏవం పరమ్పరాప్రాప్తమిమం రాజర్షయో విదుః ।
స కాలేనేహ మహతా యోగో నష్టః పరన్తప ॥ (భ.గీ. 4-2)

ఓ అర్జునా! ఈ ప్రకారముగ పరంపరగా వచ్చిన ఈ నిష్కామకర్మ యోగమును రాజర్షులు తెలుసుకొనిరి. చాలకాలము గడచినందున ఆ యోగ మిపుడీలోకమున అదృశ్యమైనది (ప్రచారములో లేకున్నది).

అర్జునుడు అడిగాడు, (పృథాసుతుడు.) "నువ్వు సూర్యుడికి చెప్పావని నేను ఎలా నమ్మేది?" అని. 84 ఏళ్ళ అర్జునుడు, 120 ఏళ్ళ కృష్ణుడ్ని అడిగాడు.

అర్జున ఉవాచ

అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః ।
కథమేతద్విజానీయాం త్వమాదౌ ప్రోక్తవానితి॥ (భ.గీ.4-4)

(ఓ కృష్ణా!) నీ జన్మము ఇటీవలది. సూర్యుని జన్మము బహుపురాతన మైనది. అట్టిచో నీవు సూర్యునకుపదేశించితివను విషయమును నేనెట్లు గ్రహించ గలను?

నువ్వు సూర్యుడికి చెప్పానంటున్నావ్ ఈ విద్యను, నేను ఎలా నమ్మేది? నా ముందే కదా నువ్వు పుట్టావు! అదీ అబద్ధమే. అర్జునుడు ముందెక్కడ పుట్టాడు? ముందు అంటే అర్థం తెలుసా? రెండు అర్థాలున్నాయి. అర్జునుడు పుట్టాక పుట్టటం, అర్జునుడు పుట్టక ముందు పుట్టటం. ఎప్పుడు పుట్టాడు కృష్ణుడు? అందుచేత కృష్ణుడు పుట్టుక అర్జునుడికి తెలియదు. కాని అక్కడ ఏమన్నాడు? నా ముందే పుట్టావుకదా

అన్నాడు. అవునా? గురువుని మీరు ఇలాగే అడుగుతారు, అది అర్థం చేసుకోండి. దానికీ ఇది చెప్పేది. నా ముందే కదయ్యా నువ్వు ఇదంతా నేర్చుకున్నావ్. నాకు పెద్ద చెప్పొచ్చావ్, మొన్నమొన్నటి వరకు నువ్వు ఏం చేశావో నాకు తెలియదా? నువ్వు సిగరెట్ కాల్చటం నేను చూడలేదా పేకెట్లు మీద పేకెట్లు, అయ్! ఇప్పుడేమో ఇంత ఫోజు కొడతావ్ నువ్వు! ఆసనాలు వెయ్యమంటావు, ప్రాణాయామాలు చెయ్యమంటావు. క్రొత్తవి చెప్పమంటే చెప్పవు.

ఆ అర్జునుడి యొక్క ప్రశ్నలో ఉన్నటువంటి నిస్సహాయత అర్థం చేసుకోండి. గురువు ఎప్పుడు కావల్సి వస్తాడు అంటే, నువ్వు నిస్సహాయుడివి అయితే. మీ అంతట మీరు చేసుకోగలుగుతే, గురువు అక్కర్లేదసలు. గురువు యొక్క అవసరం ఎప్పుడు అంటే, మీరు చేసుకోలేనప్పుడు, కింకర్తవ్య విమూఢులైనప్పుడు, ఏది ధర్మమో, ఏది అధర్మమో మీరు నిర్ణయించుకోలేనప్పుడు, అప్పుడు,

**గురువు జవాబు - శిష్యుని శాంతి: -**

**కార్పణ్యదోషోపహత: స్వభావ:**

పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతా: ।
యచ్ఛ్రేయస్స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥ (భ.గీ. 2 - 7)

**కృపణత్వము అను దోషముచే కొట్టబడినవాడనగుటచే ధర్మవిషయమున సందేహముగలిగి నిన్నడుగుచున్నాను. ఏది నిశ్చయముగ శ్రేయస్కరమో దానిని చెప్పుము - నేను నీకు శిష్యుడును, శరణుబొందిన నన్ను (ఈ ప్రకారముగ నడువుము అని) శాసింపుము.**

ఏది ధర్మమో, ఏది అధర్మమో నేను నిన్ను అడుగుతున్నాను కాని, నాకు తెలియదు. ఇది చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. మనకి తెలిసి అడగటం లేదు. ఏ శిష్యుడు ఏది అడిగినా తెలిసి అడగడు. వాడికి ఏది ధర్మమో, ఏది అధర్మమో తెలియదు. గాయత్రీ చెయ్యొచ్చా, చేయకూడదా? తెలీదు. చెయ్యొచ్చా, చేయకూడదా? నాకు



తెలియక నిన్ను అడుగుతున్నాను.

అందుచేత ఈ ప్రశ్న ఎప్పుడైతే శౌనకుడు అడిగాడో, సూతుడికి అర్థమైంది - ఈ ప్రశ్న అడుగుతున్న వాడు, అడగదల్చుకున్నది ఒకటి, అడుగుతున్నది ఒకటి అని. ఆ తేడా నేను మీకు వివరించగలిగానా? అర్థమైందా? మీరు గురువుని ఎప్పుడు ఏ ప్రశ్న వేసినా, మీ ప్రశ్న యొక్క ఉద్దేశ్యము వేరు, మీ ప్రశ్న వేరు. మీ ప్రశ్న వెనకాతల ఇంకోటేదో ఉంది.మీ యొక్క హృదయం నాకు అర్థమయింది, ఇలాగ మాట్లాడేవు నువ్వు, కాని నువ్వు ఏం అడగదల్చుకున్నావో నాకు అర్థమయింది అంటున్నాడు. అదీ మహామతి అంటే. గురువు ఆ స్థితిలో ఉండాలి.

**వాడు అడిగినదానికి వివరించేసేసి, నీకు చెప్పింది అర్థమైందా అంటే, వాడు అర్థమైంది అన్నాడనుకో, ఇద్దరూ దద్దమ్మలే. ఎందుకు ఇద్దరూ దద్దమ్మలే? వాడు ఏం అడగదల్చుకున్నాడో ఊహించుకొని, అది వాడికి అర్థమయ్యేటట్టు చెప్పాలి. వీడు అడిగిన ప్రశ్నకి వీడికి అర్థమయ్యేటట్టు చెప్పాడనుకోండి, ఏం చెప్పావ్ నువ్వు? ఏమీ చెప్పలేదు అంటాడు. ఆ తేడా, ఈ భాగవతం మీకు చాలా స్పష్టంగా చెప్తుంది. నువ్వు అడగదల్చుకుంటున్నది, ఖచ్చితంగా నువ్వు అడుగుతున్న దానికంటే చాలా వేరైనది.**

ఏంటి వేరైనది? మా అమ్మాయికి పెళ్ళికావాలి, మా అబ్బాయికి ఉద్యోగం కావాలి, నాకు ఈ రోగం పోవాలి, లేకపోతే అత్త నా మాటే వినాలి అని కోడలు, ఇలా రకరకాల సమస్యలు. కాని దీని వెనకాతల ఉన్న అసలు ప్రశ్నేంటో అర్థమైందా మీకు? ఈ అన్ని ప్రశ్నలునూ, వెనకాతల ఉన్న హృదయము, ఈ ప్రశ్నల వెనకాల ఉన్న అంతరార్థం ఏమయ్యుంటుంది? అందరూ ఏమడుగుతు న్నారు? రకరకాల కోరికలు. ఇంకా ఏం కావాలనుకుంటున్నారు? **శాంతి కావాలనుకుంటున్నారు. అది జరిగిపోతే శాంతి వస్తుందేమో. అని అతని ఊహ.**

అమ్మాయి పెళ్ళి అయిపోతే శాంతి వస్తుందేమో అని ఊహ. పెళ్ళి అయి

పోగానే, ఒక సంవత్సరం తరవాత మళ్ళా గురువు దగ్గరకి తయార్. "పిల్లల్లేర్ సార్!" పిల్లవాడు పుట్టాడు. "విరోచనాలు అవుతున్నాయ్ సార్!" ఎవడికి? మనవడికి. సరే! తరవాత సీటు. సీటు తర్వాత? ఆ ప్రశ్నలేగా! ప్రశ్న పరంపర ఎవరికైనా, ఎక్కడైనా మారుతుందా? ఇదే కొనసాగుతుంది. మీ పాత్ర మారుతూవుండొచ్చు. మీరు అత్త బదులు కోడలైపోవచ్చు, కోడలు బదులు అమ్మమ్మయి పోవచ్చు.

కాని ఈ అన్ని సంబంధాలలో, మీరు మీకు తెలియకుండా వెతుకు తున్నదేంటీ అంటే, శాంతి. కాని ఇంతమందిని ఇన్ని రకాలుగా మీరు ఒకొక్క గురువు దగ్గరకి వెళ్ళి అడక్కుండా, మనుష్యుల్ని చూస్తేనే మీకు అర్థమయిపోతుంది, ఇవన్నీ అడగటం వల్ల మీకు శాంతిరాదు అని.

మార్కులు రాలేదు అని మొత్తుకుంటారు. అలా మొత్తుకున్న తరవాత, ర్యాంకు రాలేదు అని మొత్తుకుంటారు. ర్యాంకు రాలేదు అని మొత్తుకున్న తరవాత, ఉద్యోగం రాలేదు అని మొత్తుకుంటారు. **ఇంతకీ మీకు ఏం కావాలో నాకు అర్థం కాలేదు, గురువుకి అర్థమయింది.**

ఇంతకీ మీకు ఇంజనీరింగ్‌లో సీటు కావాలా? ఇంజనీరింగ్‌లో సీటు వచ్చాక, మార్కులు కావాలా? మీ పక్కింటివాళ్ళకుర్రాడికంటే ఒక మార్కు ఎక్కువ రావాలా? చాలా ముఖ్యం, పక్కింటి వాడికంటే ఒక మార్కు ఎక్కువొస్తే చాలు. ఒక మార్కు తక్కువొస్తే చాలా ప్రమాదం. మళ్ళా మాట్లాడు కోలేం ఎదురెదురుగా! తరవాత ఉద్యోగం. ఉద్యోగం ఎక్కడ కావాలి? అమెరికాలో కావాలి.

కాని ఈ ప్రశ్నలన్నిటికీ వెనకాతల ఉన్నటువంటి హృదయాన్ని మనం అర్థం చేసుకోలేం, గురువు అది పట్టుకుంటాడు. **నువ్వు ఏ ప్రశ్న వేయటానికి వచ్చినా, నీ వెనకాతల ఉన్న ఆర్తి వల్ల వచ్చావు గురువు దగ్గరికి, శాంతి కొరకు వచ్చావు. అది నేను పట్టుకున్నాను అంటాడు సూతుడు.**

**సూత ఉవాచ -**



ప్రీతిః శౌనక చిత్తే తే హ్యతో వాచ్మి విచార్య చ ।
సర్వసిద్ధాంతనిష్పన్నం సంసారభయనాశనమ్ ॥ 9

**హే శౌనకా! నీ హృదయంలో భగవత్ ప్రేమ ఉన్నది. అందువల్ల నేను బాగుగా ఆలోచించి, సంసార భయనాశకరము, సర్వసిద్ధాంత నిష్పన్నము, నిష్కర్షము లేక సమస్త సిద్ధాంతసారము అయిన దానిని నీకు చెప్పుచున్నాను.**

ప్రీతిః శౌనక చిత్తే తే హ్యతో వాచ్మి విచార్య చ - అందుచేత నీ హృదయంలో ఉన్న ఆ ప్రశ్నని అర్థం చేసుకుని, నేను చాలా ఆలోచించాను. ఆలోచించి ఏం చెప్పాట్ట?

సర్వసిద్ధాంతనిష్పన్నం సంసారభయనాశనమ్ - సంసారంలో ఉంటే ఎన్ని భయాలున్నాయి మనకి? ఉద్యోగం, పిల్లలు, ఆఫీసరు, పొలిటీషియను, ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసరు, బిజినెస్‌మేన్, గుండాలు, లేకపోతే గుంటూరు రోడ్లు .....

సంసారభయనాశనమ్ - అంటే ప్రపంచంలో మీకు ఏ విధమైనటువంటి భయం ఉన్నా, ఆ భయం పోవటానికి ఉండేటటువంటి మార్గం నేను చెప్తాను. మీది ఏ భయమైనా కావచ్చు. క్రొత్త బండి కావాలన్నా, అత్త నీ మాటలు వినాలన్నా, భర్త నీ మాటలు వినాలన్నా, భార్య నీ మాటలు వినాలన్నా ... కాని ఇక్కడ ఏం చెప్తున్నాడు, అది చెయ్యగలము, సంసారభయనాశనమ్.

సర్వసిద్ధాంతనిష్పన్నం-అనేక సిద్ధాంతాలు ఉంటాయికదా. రకరకాలైన సిద్ధాంతాలు ఉంటాయి. ఎన్ని సిద్ధాంతాలు తెలిసినా మీరు గందరగోళ పడరు, అలాంటి విద్య నేర్పుతున్నాను. అంటే రెండు ఉన్నాయి, సంసారంలో మీరు ఏ భయంతో ఇక్కడికి వచ్చినా ఫరవాలేదు, ఏ సిద్ధాంతాన్ని విని మీరు వచ్చినా, ఒకవేళ ఆ సిద్ధాంతాలు ఒకదాతనితో ఒకటి విరుద్ధమౌతోన్నా కూడా మీరేం కంగారుపడకండి, వాటన్నిటినీ ఇస్త్రీ చేసేసి, మీకు అర్థం అయ్యేటట్టు చెప్తానన్నాడు సూతుడు.

మీలో రావల్సిన మార్పులు భక్తి - మృత్యుభయం

భక్త్యోఘవర్ధనం యచ్చ కృష్ణసంతోషహేతుకమ్ ।

తదహం తేఽభిధాస్యామి సావధానతయా శృణు ॥ 10

భక్తి ప్రవాహమును పెంచేది, భగవాన్ శ్రీకృష్ణునికి సంతోషము నిచ్చేది అయిన సాధనాన్ని నేను నీకు వినిపిస్తున్నాను. సావధానంగా వినుము.

సావధానచిత్తుడవై భక్తిని పెంపొందించేది, కృష్ణచేతనత్వానికి ఆనందం కలగచేసేది, అది నేను నీకు చెప్తున్నాను అన్నాడు. ముందు విశేషణం చెప్పాడు సావధానచిత్తుడవైవిను అని. అందుచేత సావధానచిత్తుడవై అంటే ఏంటన్న మాట? చెప్పింది చెప్పగానే చేసేయటం.

అటెన్షన్ అంటాడు మిలట్రీలో, సావధాన్! అని ఎందుకంటాడు ఆ మాట? తరవాత చెప్పబోయే ఆజ్ఞను ఏం చెయ్యాలి మీరు? తక్షణం అమలు చేయాలి. **అందుచేత సావధాన్ మన్ అంటే అర్థం ఏంటీ అంటే, విన్నది వినగానే అమలు చేసేటటువంటి చేతనత్వంతో వినండి అని.** మాస్టారు మీకు అన్నీ తొందరే కాస్త ఆగండి అనకూడదు. చెప్పింది చెప్పగానే చేసేయటం అలవాటుచేసుకొండి. అప్పుడు రెండు మార్పులు రావాలి మీలో. అవి చెపుతున్నాడిక్కడ.

భక్త్యోఘవర్ధనం - భక్తి పెంపొందాలి.

కృష్ణసంతోషహేతుకమ్ - కృష్ణ చేతనత్వం మీలో పెంపొందాలి. వెంటనే, **భాగవతం వినటం మొదలెట్టగానే, ఆ చేతనత్వం మీలోకి రావటం మొదలు పెడుతుంది.** ఏ,బి,సి,డిలు నేర్చుకోవటం మొదలెట్టిన రోజునుంచే, మీకు ఇంగ్లీష్ రావటం మొదలవుతుంది. మెల్లిగా మీరు ఇంగ్లీష్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందవచ్చు. కాని ఎ,బి,సి,డి అని ఎప్పుడవుతే మీరు ఆ అక్షరాలు నేర్చుకోవటం మొదలెట్టారో, అప్పట్నుంచే ఏమవుతోంది మీలోకి? ఇంగ్లీష్ చేతనత్వం ఎలా వెళుతోందో, ఇంగ్లీష్ భాష నేర్చుకునేటటువంటి విద్య ఎలాగవుతే మీలోకి వెళుతోందో, సావధానంగా కనుక మీరు వింటూ ఉంటే, అంటే ఏంటి? **ఇక్కడ చెప్పున్న చేతనత్వంలోని మార్పులు అప్పటి కప్పుడు, అక్కడక్కడ చేసుకుంటూ మీరు వెళ్ళిపోతూ ఉంటే, ముందు**



**మీ యొక్క భక్తి పెంపొందుతుంది.**

**రెండవది ఏంటి? కృష్ణ చేతనత్వము మీలో ఉన్నది, సంతోషిస్తుంది.** నేరుగా ఎక్కడో కృష్ణ చేతనత్వము లేదు అన్నది మీరు గుర్తుంచుకోండి. మీరే కృష్ణులు. ఇప్పుడు మీరేంటి, ఒకటవ కృష్ణుడు, రెండవ కృష్ణుడు, మూడవ కృష్ణుడు అని వేషాలు వేస్తున్నారు. మీరేం చేస్తారు తరవాత, ఈ వేషాలన్నీ మానేసి, మీలో ఉన్నటువంటి కృష్ణ చేతనత్వానికి వెళ్తారు కనుక, ఆ చేతనత్వం మీలో వృద్ధి చెందుతూ ఉంటుంది. అందుచేత ఈ రెండు శ్లోకాలు మళ్ళీ చదువుతాను, సావధానంగా నేను చెప్పిన అర్థాన్ని దానిమీద ఆపాదించుకుంటూ వినండి.

ప్రీతిః శౌనక చిత్తే తే హ్యతో వాచ్మి విచార్య చ ।
సర్వసిద్ధాంతనిష్పన్నం సంసారభయనాశనమ్ ॥ 9

**హే శౌనకా! నీ హృదయంలో భగవత్ ప్రేమ ఉన్నది. అందువల్ల నేను బాగుగా ఆలోచించి, సంసార భయనాశకరము, సర్వసిద్ధాంత నిష్పన్నము, నిష్కర్షము లేక సమస్త సిద్ధాంతసారము అయిన దానిని నీకు చెప్పుచున్నాను.**

ప్రీతిః శౌనక చిత్తే తే హ్యతో వాచ్మి విచార్య చ - అంటే నీ హృదయంలో భగవంతుడి మీద ప్రేమ ఉన్నది. శౌనకుడా! వినేవాడా! నీ హృదయంలో భగవంతుడి మీద ప్రీతి ఉంది. ఇది మళ్ళీ మళ్ళీ ఎందుకు నొక్కి చెప్తున్నానో అర్థం చేసుకోండి.

లాస్ట్ క్లాస్‌లో చెప్పాను భక్తి మీకు దేనిమీద ఉంది? **దేని మీద ఉందో, అది దొరక్కపోతే మీకు నిద్ర పట్టదు.** ఆలోచించరు, తిండి రుచించదు, ఏడ్చేస్తారు మీరు భక్తి ఉందంటే. దేని మీద భక్తి ఉందో మీరు నిర్ణయించుకోండి. దేనిమీద భక్తి ఉన్నా ఫరవాలేదు. మీకు అసలు భక్తి అన్నది దేనిమీదైనా ఉన్నదా అన్నది ఆలోచించు కోండి. భక్తి యొక్క నిర్వచనం ఏంటంటే, ఇంక అది దొరకనంత వరకూ మీరు నిద్రపోలేరు.

రామకృష్ణ పరమహంసకి కాళికాదేవిమీద భక్తి ఉంది. కాళికాదేవి రానంత

వరకూ నిద్రపోలేకపోయాడు. వ్యాపారవేత్తలకి దేనిమీద భక్తి ఉంది? డబ్బు రానంత వరకూ నిద్రపోరు వాళ్ళు. అసలు నిద్ర పట్టదు పాపం. మీకు డబ్బుమీద భక్తి ఉందో లేదో దీన్ని బట్టి మీరు నిర్ణయించుకోండి. మీరు డబ్బు కావాలి అని అంటారు, కాని డబ్బు మీద మీకు ఖచ్చితంగా భక్తి లేదు. భక్తి ఉంటే, నిద్రపట్టదు మీకు.

చదువుకోవాలని ఉంది మాస్టారు, కాని నిద్రపట్టేసింది. చాలా పెద్ద సమస్యతో వస్తూ వుంటారు విద్యార్థులు నా దగ్గరికి. చదువుకొంటున్నప్పుడు పుస్తకం తీస్తే నాకూ నిద్ర వస్తుంది. కాని అసలు ఎందుకు నిద్ర వచ్చింది నీకు? అదే సినిమా చూస్తూ వుంటే?ఖచ్చితంగా నిద్రరాదు మీకు. దేనిమీద భక్తి ఉంది? సినిమా చూట్టం మీద భక్తి ఉంది. చదువుకోవాలని లేదు. అందుచేత దేని మీద నీకు భక్తి ఉన్నదో, దేని మీద భక్తి ఉండాలని ఇందాక అనుకుంటున్నాడు? **భగవంతుడి మీద భక్తి ఉండాలనుకుంటున్నాడు.** అది లేదు మనకి. అందుచేత తర్వాత శ్లోకంలో ఏం చెప్తున్నాడు అంటే,

భక్త్యోఘవర్ధనం యచ్చ కృష్ణసంతోషహేతుకమ్ ।
తదహం తేఽభిధాస్యామి సావధానతయా శృణు ॥ 10

**భక్తి ప్రవాహమును పెంచేది, భగవాన్ శ్రీకృష్ణునికి సంతోషము నిచ్చేది అయిన సాధనాన్ని నేను నీకు విన్పిస్తున్నాను. సావధానంగా వినుము.**

భక్త్యోఘవర్ధనం యచ్చ - **ఆ భక్తిని పెంపొందించే బాధ్యత కూడా నాదే.** నీకు భక్తి ఉంటే, అసలు నీకు ఇంకేం అక్కర్లేదు. నువ్వు వెంట పడతావ్. అది దొరికేంత వరకూ నువ్వు నిద్రపోవు. కాని నువ్వు నిద్రపోగలుగుతున్నావ్ కదా. అందుచేత నేను ఏం చేస్తాను నిన్ను? నిన్ను నిద్రపోనివ్వకుండా చేస్తాను. ఏ విధంగా? భగవంతుడి మీద భక్తి కలగజేస్తూ.

కృష్ణసంతోషహేతుకమ్ - దాని వల్ల ఏమౌతుంది? **కృష్ణ చేతనత్వం మీలో పెంపొందుతుంది.**



భక్త్యోఘవర్ధనం యచ్చ కృష్ణసంతోషహేతుకమ్ ।
తదహం తేఽభిధాస్యామి సావధానతయా శృణు ॥ 10

**భక్తి ప్రవాహమును పెంచేది, భగవాన్ శ్రీకృష్ణునికి సంతోషము నిచ్చేది అయిన సాధనాన్ని నేను నీకు విన్పిస్తున్నాను. సావధానంగా వినుము.**

కాలవ్యాలముఖగ్రాసత్రాసనిర్ణాశహేతవే ।
శ్రీమద్భాగవతం శాస్త్రం కలౌ కీరేణ భాషితమ్ ॥ 11

**కాలసర్పముఖగ్రాసుడై కష్టాల నాశనం కొరకు శ్రీమత్‌భాగవత శాస్త్రమును శ్రీశుకుడు తెల్పినాడు.**

## శ్రీమత్‌భాగవతం - శాస్త్రము

ఇంతకీ ఏంటా ఫార్ములా? దేనికి ఫార్ములా? సంసార భయనాశనమ్, సర్వ సిద్ధాంత నిష్పన్నమ్. అంటే నువ్వు ఏ ఋషి దగ్గరికి వెళ్ళిపోయినా, ఏ మహాత్ముడు దగ్గరికి వెళ్ళిపోయనా, మహమ్మద్ దగ్గరికి వెళ్ళినా, మహావీరుడు దగ్గరికి వెళ్ళినా, బుద్ధుడు దగ్గరికి వెళ్ళినా, మిలట్రీ లీడర్స్ దగ్గరికి వెళ్ళినా, పొలిటికల్ లీడర్స్ దగ్గరికి వెళ్ళినా, డిక్టేటర్స్ దగ్గరికి వెళ్ళినా, గొప్ప గొప్పవాళ్ళు ఎవరైనా, వాళ్ళ వాళ్ళ స్థాయిలో నిష్ణాతులు అయిన వాళ్ళ దగ్గరికి మీరు ఎవరి దగ్గరికి వెళ్ళినా, వాళ్ళు వాళ్ళు, వాళ్ళ జీవితంలోని ఆనందానికి కారణం ఏంటో చెప్తూవుంటారు.

అన్ని సిద్ధాంతాలూ గూడా చివరికి ఇక్కడికే తీసుకువస్తాయి. అన్నది గుర్తు చేసుకోండి. భాగవతం గురించి వాడు ఖచ్చితంగా ఏం చెప్తున్నాడు అంటే, మీరు మీ పిచ్చిలో ఎప్పుడు నమ్మిన సిద్ధాంతాన్ని, అప్పుడు నమ్ముతుంటూ జీవించుకోండి, నాకభ్యంతరం లేదు. కాని చివరికి మీరు తిరిగి, తిరిగి, తిరిగి ఇక్కడికే రావాలి, భాగవతం దగ్గరికే రావాలి. ఎవడు రావాలి భాగవతం దగ్గరికి? నియమాలు చెప్తున్నాడు.

కాలవ్యాలముఖగ్రాస - మృత్యువు ఉన్నటువంటి వాడు. **చచ్చిపోయేటటు వంటి వ్యక్తి ఎవడైనా, ఆనందం కావాలి అనుకుంటే, భాగవతం దగ్గరికే రావాలి.**

అంటే, ఎక్కడికి రావాలి అందరూ? భాగవతం దగ్గరికే. ఎందుచేత? అందరూ "[illegible] తాస్రనిర్ణ్యాశహేతవే - పోనీ పుట్టాడు, చచ్చిపోలేదు. మధ్యలో ఏమన్నాడు, ఎన్నిసార్లు అంటాడో, చచ్చిపోతున్నాను, చచ్చిపోతున్నాను, చచ్చి పోతున్నాను అని. అంటామా, అనమా మనం? ఎన్నిసార్లు అంటామో! ముఖ్యంగా మన పిల్లలు ముందు ఉన్నప్పుడు అంటాం, కదా, చంపేస్తున్నావే, చావగొట్టేస్తున్నావే. వాళ్ళు చావగొడుతున్నారో, మీరు పిల్లల్ని చావ గొడుతున్నారో, అది మళ్ళా చర్చ చెయ్యాలి, అదొక సిద్ధాంతం.

కాని ఈ రెండు నియమాలు ఉన్నాయి మనకి - జీవితంలో బ్రతికి ఉంటే, **సుఖంగా లేము. లేకపోతే ఏమౌతాం మనం? చచ్చిపోతాం. ఈ రెండు లక్షణాలు ఎవరికి ఉన్నాయో, వాడు పరమశాంతి పొందాలి అంటే, సవ్యమైన జీవిత విధానాన్ని పొందాలి అంటే, ఖచ్చితంగా భాగవతం దగ్గరికి రావాలి** అని. అంటే, ఎవరు రావాలి భాగవతం దగ్గరికి? హిందువా, ముస్లిమా, క్రిస్టియనా? మానవ శరీరధారి, వాడు ఎవడైనా సరే, లాస్ట్ రిసార్ట్, చేతనత్వ విజ్ఞానంలో జీవించటం యొక్క కళలో నిష్ణాతుడు అవ్వాలి అంటే, వాడు ఖచ్చితంగా చివరికి భాగవతం దగ్గరికే రావాలి. ఎందుచేత?

శ్రీమద్భాగవతం శాస్త్రం - శాస్త్రం అంటే సైన్స్. సైన్స్ అంటే ఒకటి అర్థం చేసుకోండి. ఆర్ట్‌కి, సైన్స్‌కి ఆధారభూతంగా ఒక తేడా ఏముంది అంటే, ఆర్టిస్ట్ ఒకడు గీసినట్టు ఇంకోడు గీయలేడు. ఒకడు బొమ్మ గీస్తాడు. అదేంటి? రవివర్మ వేసిన బొమ్మ అనేస్తాం మనం. ఇంకోడు ఇంకో బొమ్మ గీస్తాడు, పికాసో వేసిన ఒక బొమ్మ అంటాం. వాళ్ళను మీరు కాపీ కొట్టగలరు కాని, వాళ్ళలాగ మీరు ఎప్పుడూ చేయలేరు. కాని సైన్స్‌లో ప్రతీవాడు, ఒకలాగే చేస్తాడు. వీడు హైడ్రోజనూ, ఆక్సిజనూ కలిపితే నీరు వస్తుంది అంటే, ప్రపంచంలో ఎవడు హైడ్రోజను, ఆక్సిజను కలిపినా నీరే వస్తుంది. భాగవతం అలాంటిది.

ఒక శుకుడికే కాదు, ఒక వ్యాసుడికే కాదు, ఒక పరీక్షిత్తుకే కాదు, ఒక ఋషికే కాదు, మీకు కూడా అదే ఫలితం ఇస్తుందది, సైన్స్ అది. అందులో చెప్పింది చేస్తే.



చెప్పింది చేశాము అని మీరు హృదయం మీద చెయ్యిపెట్టుకుని మాట ఇస్తే, ఖచ్చితంగా ఆ ఫలితం వస్తుంది. దాన్ని శాస్త్రము అంటాం. రసాయన శాస్త్రము, భౌతిక శాస్త్రము, యాంత్రిక శాస్త్రము అని ఎందుకు అంటామంటే, ఆ విద్య నేర్చుకున్నవాళ్లు, ఆ విద్య ఇది వరకు నేర్చుకున్నవాళ్ళు అది చేసి ఏమి పొందారో, మీరు కూడా ఖచ్చితంగా దాన్ని పొందగలుగుతారు.

*అగ్నిః పూర్వేభి ర్ఋషిభిరీడ్యో*
*నూతనైఋత సదేవాగ్ం ఏహవక్షతి ( అగ్ని సూక్తం 2వ శ్లోకం )*

అందుచేత ఏం చెప్తున్నాడు ఇక్కడ? భాగవతం చెప్పటం లేదు. భాగవత **శాస్త్రం చెప్తున్నాడు. అంటే, వాళ్ళు అంత గొప్పవాళ్ళు ఎలా అయ్యారో, మీరు కూడా అంత గొప్పవాళ్ళు అవుతారు**. ఆ గొప్పవాళ్ళు అయినటువంటి వాళ్ళలో ఒక జంట చెప్పేవాడు వినినవాడు గురించి చెప్తున్నాడు.

కలౌ కీరేణ భాషితమ్ - కీరము అంటే చిలుక. ముందు చిలక పలుకులులాగ నేర్చుకోండి. చిలకపలుకులు అంటే ఏంటి? చెప్పింది చెప్పటమే తప్ప, అదేంటో కూడా అర్థంకాదు చిలకకి. ఫర్వాలేదు మీరు అదైనా చేయండి అన్నాడు. ఈ భాగవతంలో, మీరు దానితో మొదలుపెట్టండి, అది అందరికి చెప్పండి అనటం. అందుకు పదిమందికి చెప్పండి అంటున్నాను. **మీరు చిలకపలుకుల్లాగ దాన్ని వల్లె వేస్తూవుంటే, శుకమహర్షి అయిపోతారు.** అలా వల్లెవేయగా, వల్లె వేయగా, మీరూ మహర్షులు అయిపోతారు. కాని వల్లె వేస్తూవుంటే. నిబంధనది.

ఏతస్మాదపరం కించిన్మనః శుద్ధ్యైన విద్యతే ।
జన్మాంతరే భవేత్పుణ్యం తదా భాగవతం లభేత్ ॥ 12

**కృష్ణ చేతనత్వం - నాలుగు స్థితులు మీరే**

మనశ్శుద్ధి కొరకు ఇంతకంటే గొప్ప సాధన లేదు. అనేక జన్మ పరంపరల పుణ్యము వల్లనే ఇది లభిస్తుంది. మొత్తము చేతనత్వ విజ్ఞానం ఏం చెప్తుంది అంటే, కృష్ణ చేతనత్వం ఎప్పుడూ నీలో ఉన్నది. నీకూ కృష్ణుడికీ తేడా లేదు. ఎలాంటి కృష్ణుడికి?

కృష్ణం నారాయణం వందే, కృష్ణం వందే వ్రజప్రియం, ।
కృష్ణం ద్వైపాయనం వందే, కృష్ణం వందే పృథాసుతం. ॥

నారాయణ స్వరూపుడైన శ్రీకృష్ణునికి నమస్కారము. వ్రజప్రియుడైన శ్రీకృష్ణునికి నమస్కారము. ద్వైపాయన స్వరూపుడైన శ్రీకృష్ణభగవానునికి నమస్కారము. పృథ్వీపుత్రుడుగా జగద్గురు చేతనత్వ ప్రతీకయైన శ్రీకృష్ణునికి నమస్కారము.

ఈ కృష్ణ చేతనత్వము నాలుగు స్థితులలో మనలో ప్రకటీకరిస్తుంది.

అతి స్వల్పస్థితిలో అది ఉంటే, అర్జునుడిలా ఉంటుంది.

అంతకంటే కొంచెం పైకి ఎదుగుతే, ద్వైపాయన స్థితికి వస్తుంది.

ఇంకాస్త పైకి వెళ్తే, వ్రజకిశోర స్థితి. ఇంకా పైకి వెళ్తే, నారాయణస్థితి.

ఈ కృష్ణ చేతనత్వము నీలోఇప్పటికే ఉన్నది. కాని ఈ కృష్ణ చేతనత్వం మీద ఏం పడివుంది? అశుద్ధి పడివుంది. మలము ఏర్పడివుంది. అందుచేత, ఈ మొత్తము ఈ భాగవత శాస్త్రముకాని, మన ఆసనాలుకాని, యమ -నియమాలు కాని, ప్రాణాయామాలుకాని, ఇవంతా ఏం చేస్తాయి?

కృష్ణ చేతనత్వాన్ని మీలో ప్రోది చేయవు. కృష్ణ చేతనత్వాన్ని కప్పివేసేదాన్ని తీసేస్తాయి. మీరు చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి, మీరు సాధనలతో ఏం చేస్తున్నారో. మీరు క్రొత్తదేదీ నేర్చుకోవటం లేదు. పైన పడిన చెత్త పోగొట్టేసు కొంటున్నారు. మీరు అది గుర్తుచేసుకోండి. మీరు ఆల్రెడీ దేవతలే. మీ చేతనత్వంలో దేవతాశక్తి ఏ విధంగానూ తక్కువ లేదు. కాని కప్పేసుకున్నారు. ఎంత గొప్పగా కప్పుకున్నారంటే, దీనికి మా గురువుగారు ఒక ఉదాహరణ ఇచ్చేవారు.

ఒకడు ఏడు తలుపులు బిగించుకున్నాట్ట. తాళాలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు. ఒక గది లోపల ఒక గది, ఒక గది లోపల ఒక గది, ఎన్నున్నాయి? ఏడు గదులు. తాళాలు వేసేసుకున్నాడు. బయట ఎవడో నుంచొని ఉన్నాడు. వాడు ఏం చేశాడు? "తాళం వేసుకుంటే గొప్ప ఏంటోయ్, తాళం నాకు ఇస్తే గొప్ప" అన్నాడు.



అ వెళ్ళాడు ఏం చేశాడు, తాళం విసిరేశాడు బయటకి. ఇప్పుడు వాడు బయటకి రావాలి. రాలేడుగా. మీరు తాళాలు పోగొట్టుకున్నారు. అప్పుడు వాడు ఎలా తలుపు తెరుచుకోగలడు? మళ్ళా తాళం నేను విసరాలి. అందుచేత ఆ తాళం ఏమవ్వాలి? నేను విసరాలి. ఎక్కడ్నుంచి? **బయట నుంచి లోపలికి. అర్థమయిందా మీకు. అందుచేత ఇదీ జరిగేది.**

మీరు ఏదో సాధన చేసి, భగవంతుడిలో ఐక్యం అయిపోతాం అనుకోకండి. మీ పిచ్చి, భ్రమ. మీరు అదే. ఐక్యం ఏం అవరు. ముక్తి ఏం కోరకండి. మీకు తెలీదు మీరు ఏం అడుగుతున్నారో. అందుకే సకల శాస్త్ర నిష్పన్నం - ముక్తిని గురించి చెప్పే పుస్తకాలు, మోక్షం గురించి చెప్పేటటువంటి పుస్తకాలు అన్నీ రేపు కాల్చివేయ బడతాయి. మీకు దమ్ముంటే మీరు రేపే కాల్చేయండి, లేకపోతే రేపు ఇంకోడు ఎవడో కాలుస్తాడు. ఎందుచేతంటే, ముక్తి అనేది అర్థరహితమైన స్థితి. ముక్తి అనేది ఏం లేదు.

ఏం ఉంది? మట్టికొట్టుకుపోయినటువంటి, నిన్ను శుభ్రం చేసుకొనేటటువంటి విధానం ఉంది. ఆ తేడా భాగవతం చెప్తుంది. అంటే, నువ్వు ఆల్రెడీ భగవత్స్వరూపుడివే. బంగారపు ఉంగరం బురదలో పడిపోయింది. ఏం చేస్తాం? బురదలో పడిపోయింది అని వదిలేసే దమ్ము ఉన్నవాళ్ళూ ఉన్నారు. అంటే వాళ్ళు బంగారానికి బంగారం అన్నమాట. అలాంటి వాళ్ళు ఎవరైనా ఉన్నారా? ఉండవచ్చుగా! వాళ్ళ గురించి నేను మాట్లాడటం లేదు, మన గురించి మాట్లాడు తున్నాన్నేను. అందుచేత, ఆ చేతనత్వాన్ని అర్థం చేసుకోండి. మీరు బంగారమే.

అది ఆషామాషీగా, ఏదో మిమ్మల్ని పొగడటానికి, మీకు ధైర్యం చెప్పటానికి గురువులు చెప్పటము లేదు. మీరు అదే. కాని మీరు అలా ప్రవర్తించలేక పోతున్నారు. మీరు అదే అవ్వాలి అంటే ఏం చెయ్యాలి? మీరు అలా ప్రవర్తించండి. చాలా సూటిగా సావధానంగా మీకు అర్థమైపోతే, ఈ క్షణమే మీరు భగవత్ స్వరూపులు అయిపోతారు. ఇదే ప్రతీవారం మీకు చెప్తువుంటాన్నేను.

కారు డ్రైవింగ్ నేర్చుకోవాలి, కారు డ్రైవర్ ప్రక్కన కూర్చుని, వాడు డ్రైవ్ చేస్తూవుంటే మీకు డ్రైవింగ్ వస్తుందా, లేకపోతే డ్రైవర్‌ని ప్రక్కకి రమ్మని, మీరు డ్రైవర్ సీట్లో కూర్చోవాలా? కూర్చున్నారు. కూర్చున్నాక ఏం చెయ్యాలి మీరు? డ్రైవర్ ఏం చేస్తాడో, ఆ పనులన్నీ చెయ్యాలి. స్విచ్ ఆన్ చెయ్యాలి, గేర్ మార్చాలి, యాక్సిలేటర్ మీద కాలుపెట్టాలి. కాలు పెడుతున్నప్పుడు భయం భయంగా పెడతాం. కారు ఒక్కొక్కసారి ఎగురుతుంది. అయినా తప్పదు. ఏం చేయాలి? మీరే డ్రైవ్ చేయాలి. ఎలా డ్రైవ్ చేయాలి? డ్రైవర్ ఉండి ఉంటే ఎలా డ్రైవ్ చేస్తాడో, అలా డ్రైవ్ చేయటానికి ప్రయత్నం చేస్తాం. అంతేగా! అందుచేత మీరు ఎలా జీవించాలి?

కృష్ణుడే కనుక మీ శరీరంలో ఉంటే, ఎలా జీవించేవాడో అలా జీవించండి.

మొదట అంత గొప్పగా జీవించలేకపోవచ్చు. మొదట నాట్యం నేర్చుకుంటున్న వాడికి, నటనలో కౌశలం ఉన్న వాడికి తేడా ఏమీ లేదు. మొదట నాట్యం నేర్చు కుంటున్న వాడికి అభ్యాసం లేదు. తరవాత నాట్యం నేర్చుకుంటున్న వాడికి అభ్యాసం ఉంది. అందుచేత మీరు ఇవాళ నుంచి ఏం అభ్యాసం చెయ్యాలి? కృష్ణ చేతనత్వంలో జీవించటం అభ్యాసం చెయ్యాలి. అంటే కృష్ణుడే కనుక ఈ దేశకాల పరిస్థితుల్లో ఉండుంటే ఎలా ప్రవర్తిస్తాడు? అనేది కృష్ణ చేతనత్వం ఉన్న వ్యక్తుల్ని చూడండి.

వీళ్ళందరూ కూడా ఆ చేతనత్వం ఉన్నటువంటి వ్యక్తులే. సి.వి.వి. కాని, బ్లావెట్స్కీకాని, లాహిరీ మహాశయ, యోగానంద, శ్రీరామశర్మ ఆచార్య, భగవతీదేవి, అరవిందో, మాతా మిర్రా, రామకృష్ణ పరమహంస, శారదామాత, శిరిడీసాయి, సత్యసాయి ఎలా జీవిస్తే మీరు అలా జీవించండి. మళ్ళా మురళి పెట్టుకుని, ఇలా వంకర కాళ్ళు వేసుకొని నుంచున్నారనుకోండి, కృష్ణ చేతనత్వం అవదు, బొమ్మ అవుతుంది. తేడా అర్థమయిందా? కృష్ణుడిలాగ జీవించమన్నానని చెప్పి, మీరు ఆ వేషం వేసుకొని ఇప్పుడు కాలేజీకి వెళ్తే, చాలా ప్రమాదాలు వస్తాయి. అది చేయకండి.

ఆ చేతనత్వంలో ఉన్నటువంటి వాడు, ఈ దేశకాల పరిస్థితుల్లో ఇలా జీవించాలి అని చెప్తున్నారు వాళ్ళు. అలా జీవించండి మీరు. అలా జీవిస్తున్నామా



మనం? ప్రయత్నించండి. అందుకు అది చెప్పేది,

చింతామణిర్లోకసుఖం సురద్రుః స్వర్గసంపదామ్ ।
ప్రయచ్ఛతి గురుః ప్రీతో వైకుంఠం యోగిదుర్లభమ్ ॥ 8

**చింతామణి లౌకిక సుఖాన్నిస్తుంది. కల్పవృక్షము స్వర్గీయ సంపత్తుల నిస్తుంది. కాని గురుదేవులు ప్రసన్నులవుతే యోగులకు కూడా దుర్లభమైన నిత్యమైన వైకుంఠధామం ఇస్తారు.**

అందుచేత ఏం చేయమంటున్నాను మిమ్మల్ని? నటించమంటున్నాను. ఎలాగ? (ఆశ్రమంలో ఉన్న శ్రీకృష్ణుడి మూర్తిని చూపిస్తూ) ఇలా కాదు. ఈ వేషం పాతది, ద్వాపరయుగం వేషం. (గురుసత్తా ఫోటోలో ఉన్న సి.వి.వి., బ్లావెట్స్కీ మొదలైన వాళ్ళని చూపిస్తూ) **ఇక్కడ వున్న ఈ గురుసత్తాలో మీకు నచ్చిన ఒకరిని పట్టుకోండి,** దుస్తులలో కాదు సుమా. **వాళ్ళు ఎలా జీవించారో చూడండి. అందుకే సాయి చరిత్ర మీ చేత పారాయణ చేయించేది. ఆయన మాటలు, ఆయన చేతలు, ఆయన ఎలా జీవించాడో, అలా జీవించండి మీరు.**

మీరు అలా జీవించటానికి ప్రయత్నిస్తే, చాలా ఆనందిస్తాడాయన. ఆయన లాగా జీవించలేం మనం. ఆయన అనుకుంటాడా ఏంటి, ఆయనలాగా జీవించగల మని. జీవించగలుగుతే మనం ఆయన దగ్గరికి ఎందుకు వెళ్తాం? **కాని ఎప్పుడైతే మీరు మానసికంగా మనస్సు మార్చుకొని, సావధాన మనస్సుతో అలా జీవించటానికి ప్రయత్నం చేస్తారో, ఆనందిస్తాడు. ఫలితాలు వస్తాయి.**

ప్రయచ్ఛతి గురుః ప్రీతో వైకుంఠం యోగిదుర్లభమ్.

అందుచేత ఇదీ భాగవత శాస్త్రము. సైన్స్ అంటే ఏంటో అర్థమయిందికదా, **ఏం చేయాలన్నమాట? గురువులు చేసినట్టు చేయాలి, దేశకాల పరిస్థితుల్ని బట్టి.** అందుచేత, చాలా బావుంది మాస్టారు మీరు చెప్పింది. అందుచేత ఒక భిక్షాపాత్ర, ఒక కఫ్నీ వేసుకొని వెళ్ళిపోయి, అడుక్కుంటాను ఐదు ఇళ్ళల్లో! ఇప్పుడు సాయి ఆ

పని చేయటంలేదు. ఇప్పుడు ఆయన రాజాధిరాజ, యోగిరాజు. అవునా? మరి ఇప్పుడు అడుక్కోడు ఆయన. మరి ఆయన శిష్యులు ఏం చేయాలి? రాజాధిరాజు, యోగిరాజుల్లా జీవించండి మీరు. అది మీకు అర్థమవటం లేదు. అలా జీవిస్తే, మీరు యోగిరాజులే !

## మీరు గురువులే కానీ వదలటం నేర్చుకుంటేనే

విశ్వవిద్యాలయాలు, వాటిల్లో రొటేషన్ సిస్టమ్ మీద హెడ్‌షిప్ వస్తుంది. తెలుసు కదా. ప్రతీ రెండేళ్ళకో, మూడేళ్ళకో ఒకసారి అందరూ హెడ్‌లవుతూ ఉంటారు. అంటే, ప్రొఫెసరే కాదు, లెక్చరర్ కూడా హెడ్‌లయిపోతారు. రొటేషన్‌లో ఒకసారి లెక్చరర్‌కి హెడ్‌షిప్ వచ్చింది, రెండేళ్ళకి. ప్రొఫెసరు, ప్రొఫెసరు తర్వాత రీడరు, రీడరు తర్వాత లెక్చరరు. ఇప్పుడు ఆ లెక్చరర్ ఎక్కడకూర్చోవాలి? హెడ్ రూమ్‌లో కూర్చోవాలి. ప్రొఫెసరు ఎక్కడకూర్చుంటాడు? ఇప్పుడు టైమ్‌టేబుల్ వెయ్యాలి. ఎవడు చెప్పినమాట వింటారు? హెడ్ అయిన లెక్చరర్ మాటే, ఈ విశ్వ విద్యాలయం వాళ్ళు వింటారు, వైస్ ఛాన్సలరూ వింటాడు, అందరూ వింటారు. కాని ఈ లెక్చరర్‌కి ఆ రోగం పోలేదే, నేను లెక్చరర్‌ని అనుకుంటాడు. అందుచేత సార్, సార్, సార్ అని హెడ్ దగ్గరకి వెళ్ళుతాడు. రాకండి అలాగ. ఎందుకు వెళ్ళటం? ఆ పని చేయకండి మీరు మళ్ళా.

**మీరు గురువులే. ఆ ధైర్యం తెచ్చుకోగలుగుతే మీరు...** అందుకే మొత్తము ఆధ్యాత్మిక విద్య యొక్క మొదటి లక్షణం భగవద్గీతలో ఏం చెప్తారు అంటే, అభయం!!

ఎందుకు భయం మీకు?

సింహం కథ చెప్పాను నేను మీకు మొదటిక్లాసునే గుర్తుంది కదా ! అది సింహం అని తెలిసిన తరువాత సింహంగా మారటానికి ఎన్ని సాధనలు చెయ్యాలి? మీరు అది అర్థం చేసుకోండి. అందుచేత, సాయి మొత్తుకున్నాడు- నన్ను సాధనలు అడుగుతారు, మంత్రాలు అడుగుతారు మొర్రో, నేను ఎక్కడ్నుంచి చెప్పేదని.

ఆ సింహం పిల్ల, సింహంగా మారటానికి ఎన్ని క్షణాలు కావాలి? తక్షణమే,



కాని ఆ బలం పుంజుకోవటానికి సమయం పట్టొచ్చు. ఈ గడ్డి అంతా తిందికదా గొర్రెగా. ఇప్పుడు మాంసం తినాలికదా! మరి మాంసం తిని మళ్ళా కాస్త బలం రావాలి, దానికి సమయం పట్టొచ్చు. అంత కాలం పడుతుంది తప్ప, అది సింహమే. ఆ మానసికస్థితి చెప్తున్నాడు.

*కాలవ్యాలముఖగ్రాసత్రాసనిర్ణాశహేతవే ।*
*శ్రీమద్భాగవతం శాస్త్రం కలౌ కీరేణ భాషితమ్ ॥* 11

కాలసర్పముఖగ్రాసుడై కష్టాల నాశనం కొరకు శ్రీభాగవత శాస్త్రమును శుకుడు తెల్పినాడు.

*ఏతస్మాదపరం కించిన్మనః శుద్ధ్యైన విద్యతే ।*
*జన్మాంతరే భవేత్పుణ్యం తదా భాగవతం లభేత్ ॥* 12

మనశ్శుద్ధి కొరకు ఇంతకంటే గొప్ప సాధన లేదు. అనేక జన్మ పరంపరల పుణ్యము వల్లనే ఇది లభిస్తుంది. అనేక జన్మాంతరాల పుణ్యము వల్ల ఈ భాగవతాన్ని మీరు వినగలుగుతున్నారు.

**అంటే ఈ భాగవతాన్ని ఎవరు వినగలుగుతారు?** సింహం పిల్లలు. మీకు అర్థమయిపోయింది, కాని ఇంకా లోపల? ఏమో! ఏమో వదిలేయండి. అంతే. లేకపోతే ఇది వింటానికి రారు మీరు. మీరు చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోండి, ఆధ్యాత్మిక జగత్తులో ప్రతీదీ కూడా ఖచ్చితంగా నిర్ణయింపబడి ఉంటుంది.

మరి యోగవాసిష్ఠం వాటిల్లో మనిషికి స్వాతంత్ర్యం ఉంది అని ఉంది కదా! అదెలాంటిదంటే మీ ఇంట్లో మీరు స్వతంత్రులే మీ ఇష్టం వచ్చినట్లు చేసుకో వచ్చు. కాని ప్రక్కింట్లో? మీకు ఉన్న స్వాతంత్ర్యం ఎంత వరకూ అంటే, సీమితమే. ఇది చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి మీరు. మహాభాగవతం దగ్గర్నుంచి, భీష్ముడు మృత్యువు దగ్గర్నుంచి, మన పిల్లవాడు పరీక్షలో పాసవుతాడా, పాసవడా దగ్గర్నుంచి, అంతా కూడా నిర్ణయింపబడి ఉంటుంది. వీసమెత్తు కూడా తేడాలేదు. మీ బాధలు కూడా అందుకే వస్తాయి, **బాధలు తగ్గే సమయానికి గురువు దగ్గరికి వెళ్ళటం కూడా నిర్ణయింపబడి ఉంటుంది.** అంత వరకూ మీకు గురువు దగ్గరికి

వెళ్ళాలన్పించదు. ఏదో కారణం వల్ల వెళ్ళరు మీరు. బాధ తగ్గే కాలం వచ్చినప్పుడు, మీ వల్ల అయినా వెళతారు, లేకపోతే ఎవరి ద్వారా అయినా వెళతారు, లేకపోతే కాకతాళీయంగా అయినా వెళతారు.

కాకతాళీయంగా వెళ్ళి, మహానుభావుడు అయినవాడు ఒకాయన ఉన్నాడు-వేమన. అసలు గురువు ఇంకొకరికి ఎవరికో దీక్ష ఇస్తానన్నాడు. కాని నిద్ర అలవాటుకదా, దీక్ష తీసుకుంటానన్నవాడు మర్చిపోయాడు. వేమన కాకతాళీయంగా వెళ్ళాడక్కడికి. వేమన అయిపోయాడు. **అందుచేత మనకి ఏమనిపిస్తుంది? స్వాతంత్ర్యం ఉందేమో అని!** వాడు వెళ్ళాలనుకొని వెళ్లలేక పోయాడు. వీడు వెళ్ళాలనుకోకుండా వెళ్ళాడు. కాని ఇవి రెండూ కూడా నిర్ణయింప బడి ఉన్నాయి. మొదటి నుంచి. అది అర్థం చేసుకోండి జాగ్రత్తగా.

ఎందుకిది చెప్తున్నాను? కష్టాలు మీరు ఎంతకాలం అనుభవించాలి అనేది కూడా మీరు నిర్ణయించుకొనేదే. నేను కష్టాలు అనుభవించను! గురువు దగ్గరికి వెళ్ళిపోండి. లేదూ, నేను కష్టాలు అనుభవిస్తాను, మీ ఇష్టం.

చాలా మంది గురువుని మహా అనుగ్రహిస్తూంటారు. నా కష్టం కూడా మీ మీద పెడితే గురువుగారూ, మీరు ఎలా భరిస్తారు? అసలు ఎంత గొప్ప తెలివితేటలో అర్థం చేసుకోండి అది. వాడి హృదయవైశాల్యం మీరు అర్థం చేసుకోండి. అసలు గురువు హృదయం ఏముంది? శిష్యుడి యొక్క హృదయ విశాలత. గురువు మీద కరుణ. కరుణాసాగరుడి మీద కరుణ.

దానికి రమణ మహర్షి ఒక చిన్న కథ చెప్పేవాడు. ఒకడు రైలు ఎక్కాడు విజయవాడలో. పెద్ద చదువేం లేదు, మొదటిసారి రైలు ఎక్కాడు, పెద్ద పెట్టె బరువైనది తలమీద పెట్టుకుని ఎక్కాడు. ఎక్కేక, రైలులో ఉన్నవాళ్ళు అన్నారు, పెట్టెని క్రింద పెట్టేయరా నాయనా అని. "మీ బస్తీ వాళ్ళకి మర్యాదలు తెలియవు, రైలు నన్ను మోస్తోంది కదా, నా పెట్టె బరువు కూడా అది ఎందుకు మొయ్యాలి?" అన్నాడు. మీ



బరువులన్నీ మోసేది గురువే. ఆ బరువును అయనపై నువ్వు పెట్టినా, పెట్టక పోయినా మోస్తున్నది ఆ గురువే. కాని వీడు అనుగ్రహిస్తాడన్నమాట గురువుని. ఆ పిచ్చిపని చెయ్యకండి. **గురువు మీద బాధ్యత పడేయటం నేర్చుకోండి.** ఎలా పడేయ్యాలన్నది అభ్యాసం వల్ల వస్తుంది. మనకి పట్టుకోవటం బాగా అలవాటై పోయింది. **వదలటం నిజంగా అలవాటు అవ్వలేదు.** అందుకే, పట్టుకోవటానికి ఏదో ఒకటి నేర్పుతుంటారు. ఈ మంత్రాన్ని పట్టుకో అంటారు. ఈ మంత్రాన్ని పట్టుకుంటే అయినా, అవన్నీ వదిలేస్తావని. కాని ఈ మంత్రంతో పాటు అవన్నీ పట్టుకునే ఉంటారు మీరు.

ఏతస్మాదపరం కించిన్మనః శుద్ధ్యైన విద్యతే ।
జన్మాంతరే భవేత్పుణ్యం తదా భాగవతం లభేత్ ॥ 12

మనశ్శుద్ధి కొరకు ఇంతకంటే గొప్ప సాధన లేదు. అనేక జన్మ పరంపరల పుణ్యము వల్లనే ఇది లభిస్తుంది. అందుచేత, చాలా ఆ ఆనందాన్ని అనుభవించండి. ఈ వాక్కులు సూతుడు శౌనకుడికి చెప్పినవి. సనకాదులు నారదుడికి, గోకర్ణుడు దుంధుకారికి చెప్పినవి. శుకమహర్షి పరీక్షిత్తుకు చెప్పిన ఈ భాగవతము, చాలా చాలా పుణ్యం ఉంటే తప్ప మనం వినలేము. కాని ఇంత ఆనందంగా ఇంతసేపు మనం వినగలుగుతున్నామంటే, ఖచ్చితంగా ఆ గురువు యొక్క అనుగ్రహం ఉంది. కాని **ఆ అనుగ్రహాన్ని మీరు పెంపొందించుకోండి. మళ్ళా దారి తప్పకండి. బరువంతా ఆయన మీద పడేయండి. ఏం చెప్పాను నేను?**

అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం (భ.గీ. 9-22)

ఎవరు ఇతర భావములు లేనివారై నన్నుగూర్చి చింతించుచు ఎడతెగక ధ్యానించుచున్నారో, ఎల్లప్పుడు నాయందే నిష్ఠగల్గియుండు అట్టివారియొక్క యోగక్షేమములను నేను వహించుచున్నాను.

ఆ మొత్తం గురువు మీద పడేయండి ఈ క్షణం నుంచి. పడేశాక, చేయాల్సింది

చేయండి. ఇప్పుడు రైలు ఎక్కాడు వాడు. రైలు ఎక్కాక, మంచినీళ్ళు తాగడా, భోజనం చేయడా? భోజనం చేస్తూవుంటాడు, మంచినీళ్ళు తాగుతూ వుంటాడు, రైలు తన పని తాను చేసుకుపోతూవుంటుంది. వీడు భోజనం మానేస్తే? వెళ్ళాల్సిన చోటుకు వెళ్ళాక, వీడిని ఎవడో మోసుకెళ్ళాలి. అందుచేత, మీ నిత్య నైమిత్తిక కృత్యాలు, దేశకాల పరిస్థితుల్ని బట్టి మీ సామాజిక నియమాలు, మీ మీ పాత్రలు ఎలా ఉన్నాయో, వాటిని నటించండి. కాని బరువు గురుదేవుల మీద ఉంచండి.

*సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।*
*అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః ॥* (భ.గీ. 18-66)

**సమస్త ధర్మములను విడిచిపెట్టి నన్నొక్కని మాత్రము శరణుబొందుము. నేను సమస్త పాపముల నుండియు నిన్ను విముక్తునిగ జేసెదను.**

*పరీక్షితే కథాం వక్తుం సభాయాం సంస్థితే శుకే ।*
*సుధాకుంభం గృహీత్వైవ దేవాస్తత్ర సమాగమన్ ॥* 13

**శ్రీ శుకుడు, రాజు పరీక్షిత్తునకు ఈ కథ తెల్పటానికి సభలో ఆసీనులై ఉన్నపుడు, దేవతా గణములు అమృత భాండాన్ని తీసుకొని అక్కడకు వచ్చారు.**

శుక మహర్షి పరీక్షిత్తుడికి ఈ కథ చెప్తూవున్నప్పుడు, దేవతలు అమృతం తీసుకొని వచ్చారు దేవతలు. ఎవరికి ఇద్దామని? శుక మహర్షికి ఇద్దామని. శుక మహర్షి అప్పుడు ఏం చేయబోతున్నాడు? పరీక్షిత్తుకి భాగవతం చెప్పబోతున్నాడు.

ఎక్కడ భాగవతం? ఎక్కడ అమృతం? బేరం కుదరదు, ఫో, ఫో అన్నాట్ట. అంటే, ఎంత అద్భుతమో అర్థమయిందా మీకు? **దేవతలకు దేవత్వం ఎందువల్ల ఉన్నది? అమృతం వల్ల ఉన్నది.** ఆ దేవత్వాన్ని వదిలేసుకోవటానికి సిద్ధమయ్యారు వాళ్ళు, భాగవతాన్ని తెలుసుకోవటానికి. కథ అంతరార్థం అది. కథ అంతరార్థం ఏంటీ అంటే, దేవతలు మాకు దేవత్వం వద్దు! దేవతలు దేని వల్ల దేవతలు అయ్యారు? అమృతం వల్ల దేవతలు అయ్యారు వాళ్ళు. **మాకు ఈ అమృతం వద్దు, ఆ భాగవతం**



**కథ** చెప్తే చాలు. అంటే, ఏమన్నాడు శుకుడు? దేవతలకి భాగవతం వినే హక్కు లేదు అన్నాడు. **దేవతలకి భాగవతం వినేటటువంటి అధికారం లేదు. మీకు ఉంది. మానవులు అందరికీ ఉంది అధికారం.** అంటే మీరు ఎంత గొప్పవాళ్ళో ఆలోచించుకోండి, ఇవాళ్టికి అక్కడ ఆపుదాం. మళ్ళీ మొదట్నుంచి చదివేద్దాం. ఇదెంతో గొప్పది. దేవతలకి కూడా దొరకనిది మీకు హాయిగా ఇచ్చేస్తూవుంటే, కాస్త ఆ ప్రేమ తెచ్చుకోండి భాగవతం మీద.

## ప్రపంచంపై విజయము

**మన రామాయణము, మహాభారతము, భాగవతము - ఇవే రేపు రాబోయే రోజులలో, ఇప్పుడు కూడా లైఫ్ సైన్సెస్ అనే పేరుతో హై టెక్నిక్ కోర్సులులాగా చెప్పబడుతున్నాయి.** సూర్యుడు యొక్క కాంతి, నీరు కలిసి ప్రాణముగా ఎలా ఆవిర్భవిస్తున్నదో చెప్తున్నారు బయోకెమిస్ట్రీలో. సూర్యవిజ్ఞానము, జల విజ్ఞానమునకు బయోసైన్సెస్ అని పేరు పెట్టారు వాళ్ళు. మనం భాగవతం, మహాభారతం, రామాయణం అని పేరు పెట్టాం. ఈ పేర్లే చివరికి మిగుల్తాయి. ఎందుచేత? ఇది భూత, భవిష్య, వర్తమానాల గురించి కూలంకషంగా తెలుసున్న వ్యక్తులు పెట్టిన పేర్లు.

ప్రపంచాన్ని ఇవాళ సాధించగలరా? దానికి మనం ప్రయత్నం చేస్తున్నాం. దానికి 1. మౌనం 2. అజ్ఞాచక్రంలో జీవించటం అభ్యసించాలి.

### దేవతలు పలకాలంటే ?

ఆ ప్రయత్నం చేయటంలో కొన్ని నియమాలు మీరు తప్పనిసరిగా పాటించాల్సి వస్తుంది ఇంక. ఆ నియమాలు మీకు మళ్ళీ గుర్తుచేస్తున్నాను, ఆశ్రమంలోకి ఎవరు వచ్చినా ఇంక మాట్లాడరు. ఎవరైనా సరే, బయటి వాళ్ళయినా, వాళ్ళకి చెప్పే బాధ్యత

మీది. ఇక్కడున్నటువంటి సాయి కాని, వెంకటేశ్వరస్వామి కాని, దేవతా విగ్రహాలు గాని చాలా చైతన్యవంతమైనటువంటి దేవతా విగ్రహాలు - వాటిని ఉపయోగించు కోవటంతెలిస్తే.

మా స్నేహితుడు ఒకతనకి కంప్యూటర్ గురించి చాలా బాగా తెలుసు. అతనింట్లో కంప్యూటర్ ఉంది. కొన్ని కారణాల వల్ల అతను అమెరికా వెళ్ళిపోయాడు. కంప్యూటర్ అక్కడే ఉంది. ఎలా ఉపయోగించుకోవాలో ఇంట్లో వాళ్ళకి చేతకాదు. అలాంటి పరిస్థితి మీకు అందరికీ అనుభవంలోకి వచ్చుంటుంది. ఇంతకీ ఆ కంప్యూటర్ చాలా చైతన్యవంతమైనది! ఎప్పుడు చైతన్యవంతమైనది? ఉపయోగించుకునేవాడుంటే. **అలాగే ఉపయోగించుకోవటం రాకపోతే ఇవీ రాతి విగ్రహాలులాగే ఉంటాయి ఇక్కడ కూడా.**

అందుచేత ఇవి రాతి విగ్రహాలే మాస్టారూ! అంటే నేనేం చేయలేను. కాని, **ఇవి చైతన్యవంతమైనవి అన్నదానికి పెద్ద నిరూపణ ఏమిటీ అంటే, ఇవన్నీ కూడా మూడు, నాలుగు రోజుల్లో నడిచి వచ్చినటువంటి విగ్రహాలు**. మీకు అదంతా తెలుసు. మీకు గుర్తుందో లేదో క్రిందటి సంవత్సరం దేవీ నవరాత్రులు మొదలెడుతున్న రోజు పంచముఖీ గాయత్రి అమ్మవారి విగ్రహం వచ్చింది ఇక్కడకి. గుర్తుందా, మీలో చాలామంది చూసుంటారు. అది ఒక సంవత్సరం ముందర వాళ్ళు జైపూర్‌లో ఆర్డరిచ్చుకున్నారు. నాలుగు రోజులు మాత్రమే మీ ఆశ్రమంలో ఉంచుతాం అని చెప్పి ఆశ్రమంలో ఉంచారు. అది ఆశ్రమంలో ఎన్నాళ్ళుందో మీకు తెలుసు కదా? తరవాత తీసుకెళ్ళారు వాళ్ళు. అక్కడ స్థాపించుకున్నారు, అది వేరే విషయం.

**అంటే మామూలుగా ఒక వ్యక్తి దేవాలయంలో విగ్రహం స్థాపించాలి అంటే వాడికి కనీసం ఒక సంవత్సరం పడుతుంది. ఇక్కడ మూడవరోజే.** ఆ మూడు రోజులు కూడా ఎందుకు పడుతోంది అంటే, మనకి సత్వరం రాగలిగే ప్రయాణ సాధనాలు లేవు కనుక. జైపూర్ నుంచి ఇక్కడకు తీసుకురావటానికి మూడు రోజులు పడుతుంది కనుక మూడు రోజులు పట్టింది. మీరు ఇంకా వేగంగా తీసుకు



రాగలుగుతే, ఆ రోజే వచ్చేసేది. **అంటే ఎంత శక్తి ఇక్కడ ఉందో మీకు తెలియాలి**. కాని కంప్యూటర్ ఉన్నంత మాత్రాన, ఆ ఇంట్లోవాళ్ళు దాన్ని ఉపయోగించు కోలేకపోతున్నారు. ఎందుచేత? ఉపయోగించుకునేవాడు అక్కడ లేడు. లేకపోతే కంప్యూటర్ మూల పడేయటమేనా, ఉపయోగించుకుంటారా, మీకు చేతొచ్చినట్లుగా ముందు మీరు ఉపయోగించుకుంటూ ఉంటే, తరువాత మీరు కూడా దాన్ని నేను ఉపయోగించుకున్నట్టు ఉపయోగించుకోవచ్చు.

అందుకు ఈ సిద్ధాంతాన్ని మీరు చాలా స్ట్రిక్ట్‌గా గమనించండి. ఆశ్రమంలోకి ఎవరు వచ్చినా ఇంక మాట్లాడకండి. ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్ళి నేను మాట్లాడతాను అంటే ఎట్లా? అందుచేత ఇక్కడ పూర్తి మౌనం. మాట్లాడుకోవాలంటే బయటికి వెళ్ళి మాట్లాడుకుని వచ్చేయండి. కనీసం ఆ మాత్రం తీవ్రత మీరు పాటించండి. ఎందు చేతంటే, **మీరు మౌనంగా ఉంటే దేవతలు చెప్పేదేదో మీతో చెప్తారు**. మీరు భౌతికంగా మౌనంగా ఉండాలి, దానితోపాటు మానసిక మౌనం కూడా ఉంటే తప్ప వాళ్ళ చెప్పేది అర్థం కాదు. తరగతిలో చాలా మౌనంగా కూర్చుని ఉన్నాడు విద్యార్థి, కాని వాడు దేని గురించి ఆలోచిస్తున్నాడు, ఈ తరగతి అయిపోయిన తరవాత తర్వాతది ఎలా ఎగ్గొట్టాలి అని. ఎగ్గొట్టి ఎక్కడికెళ్ళాలంటే అప్పుడే విడుదలైన సినిమా చూడాలి. అదీ ప్రణాళిక వేస్తున్నాడు వాడు. పైకి ఎంత శాంతంగా ఉన్నాడో వాడు. తరగతిలోనే. కాని ఆ మాత్రం శాంతంగా ఉన్నా, తరగతి కొనసాగుతుంది. మిగతావాళ్ళు డిస్టర్బ్ కారు భౌతికమైనటువంటి శాంతి ఉంటే. నాకు మానసిక శాంతి వచ్చాక మౌనంగా ఉంటాను, మానసికశాంతి వచ్చాక మీరు మౌనంగా ఉండక్కర్లేదు, మౌనం అయి పోతారు మీరు. అందుచేత తల్లక్రిందులు చేయకండి మీరు. భౌతికమైన మౌనం పాటించటం నేర్చుకోండి. మీ అంతట మీరు చేస్తారేమోనని మీకు 3 వారాలు కాలాన్నిచ్చాను. ఇంక ఉండరు కనుక కర్ర పట్టుకుంటా.

మౌనం అంటే ఇంక మౌనమే ఆశ్రమం లోపల. కాని ఇక్కడ మాట్లాడొద్దు,

అఖండమైనటువంటి ఆ చేతనత్వంలోకి వెళ్ళాలని ప్రయత్నం చేస్తున్నాం. **దానికి మీరు మౌనంగా ఉండాల్సిందే ఇక్కడ, అది మొదటి నియమం.**

**ఆజ్ఞాచక్రంలో ఎలా జీవించాలి?**

రెండవది ఏం చెప్పాను, ఆజ్ఞాచక్రంలో ఉండాలి. **మౌనంగా ఉన్నంత మాత్రాన సరిపోదు మీకు. ఆజ్ఞాచక్రంలో జీవించటం నేర్చుకోండి.** సాధ్యమైనంత వరకూ, ఏదో ఒక స్థలాన్ని ఇది నాది అని పెట్టేసుకోండి. అక్కడైనా అహంకా రాలు పని చేస్తాయేమో చూద్దాం. కృష్ణుడు ముందో, జగజ్జనని ముందో, అక్కడే కూర్చోండి. కూర్చుని, ఆజ్ఞాచక్రంలోకి వెళ్ళిపోండి. ఎక్కువసేపు అలా గడపటానికి ట్రైచేయండి. ఏ సమయమప్పుడు వచ్చినా నాకు అభ్యంతరం లేదు. రాత్రీ పగలూ ఇక్కడే ఉండి సాధన చేసుకొండి.

*యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ।*
*యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః॥ (భ.గీ. 2-69)*

**సమస్త ప్రాణులకును (సామాన్యజనులకు) ఏది (పరమార్థతత్త్వము) రాత్రియై (దృష్టికి గోచరముకాక) యున్నదో, దానియందు ఇంద్రియనిగ్రహపరుడగు యోగి మేలుకొని యుండును (ఆత్మావలోకనము జేయుచుండును). దేనియందు (ఏ శబ్దాది విషయము లందు) ప్రాణులు మేలుకొనియున్నారో (ఆసక్తితో ప్రవర్తించుచున్నారో) అది (విషయ జాలము) పరమార్థతత్త్వమును దర్శించు మునీంద్రునకు రాత్రిగానుండును (దృష్టి గోచరముకాకయుండును).**

అంటే మీరు ఏం అంటారో తెలుసా, మా ఇంట్లో ఉంటామండి! అని. ఇంట్లో ఎక్కడుండగలరు? ఇక్కడుండలేనివాళ్ళు ఇంట్లో ఉంటారనే అపోహ మీకు ఎందుకుంది అసలు? **కలిసికట్టుగా చేయవలసినటువంటి పనిని ఒంటరిగా చేస్తాను అనే రాక్షసులతో కల్సి జీవించటం వలన వచ్చిన అలవాటు.** మన లక్షణం అది. ద్వాపరయుగంలో మనం అందరంకూడా దుర్యోధనుడి తరఫున యుద్ధం చేసినటువంటి దద్దమ్మలం. మహాభారతం తీసిచూడండి. ఆంధ్రులు ఎవరివైపు యుద్ధం



చేసారో తెలుసా మీకు? దుర్యోధనుడి వైపున చేశాం, అందుచేత ఆ లక్షణాలే ఉన్నాయి మనకి, ఆ అహంకారాలు అవీ ఉన్నాయి.

ఆరోగ్యం బాగుండటం లేదు, కాని ఇక్కడకొస్తే ఆరోగ్యం బాగుపడుతుంది అన్న సంగతి అర్థం కావటంలేదు. ఇక్కడికొచ్చినంత మాత్రాన బాగుపడదు. **గంగలో స్నానం చేస్తే మాలిన్యాలన్నీ పోతాయి, పాపాలన్నీ పోతాయి అని చెప్తుంటారు. కదా! శ్రీశైల మహాత్మ్యంలో కూడా** చెప్తుంటారు ఈ కథని. కాని ఆ కథ అంతరార్థం తెలుసుకోండి మీరు. గంగలో స్నానం చేశారు శివరాత్రి నాడు. అసలు గంగ పేరు వింటేనే పాపాలు పోతాయని.

అలాంటిది మహాశివరాత్రినాడు గంగలో స్నానం చేస్తున్నారు అందరూకూడా. పార్వతీదేవి నా పిల్లలందరూ కూడా పాపరహితులు అయిపోయారే అని ఆనందించేస్తోంది. శివుడు నీ మొహం ఎవ్వరూ బాగుపడలేదనేసరికి ఈవిడకి కోపం వచ్చింది. నా పిల్లల్ని అలాగ అంటారా, చూడండి ఎంతమంది స్నానం చేస్తున్నారో కాశీలో, ఎన్ని లక్షలు ఖర్చు పెట్టుకున్నారో, ఎక్కడెక్కడి నుండో వస్తున్నారు గంగా స్నానం చేయటానికి అంటే సరే, పద మనమూ వెళదాం అన్నాడు.

కుష్ఠురోగిగా వేషం వేసుకున్నాడు శివుడు. ఈవిడగారేమో అక్కడ కూర్చుని రక్షించండో, రక్షించండో అంటే, ఎందరో వచ్చి ఏంటమ్మా, ఏం సహాయం చేయాలి అంటారు. పాపరహితుడు ఎవరైనా ఉంటే, వాడు కనుక నా భర్తను ముట్టుకుంటే, నా భర్త ఆరోగ్యవంతుడైపోతాడు అనిచెప్పింది. ఒక్కడు ముట్టుకోలేదు. సహాయం చేయటానికి వచ్చినవాడుకూడా వెనక్కి వెళ్ళిపోయాడు. పోలీసుల నుంచి తప్పించుకున్న ఒక గజదొంగ అక్కడే ఉన్నాడు, వింటున్నాడు ఇదంతా కూడా. ఆవిడ అంటోంది గంగలో స్నానం చేస్తే పాపాలన్నీ పోతాయి మీకు తెలుసుకదా, మీరు స్నానం చేసి వస్తున్నారు కదా, నా భర్తను ఒక్కసారి ముట్టుకోండి అని. ఎవడూ ముట్టుకోవటంలేదు. **ఆ మాటల్ని విన్న గజదొంగ వెళ్ళి గంగా స్నానం చేసి వచ్చి ముట్టేసుకున్నాడు. వాడు ఒక్కడూ శివలోకానికి వెళ్ళాడు.** మీరు కూడా ఆ జాతి వాళ్ళు అవునో, కాదో

కాస్త ఆలోచించుకోండి. రామ అంటే పాపాలు పోతాయి అంటే నమ్మకం లేదు. పోవు. పోతే పాపరహితులుగా జీవించాలి మీరు. జీవించంగా మళ్ళా నాకు బాధ్యతలు ఉన్నాయి అని బాధ్యతలు గుర్తుకు వస్తాయి. భార్య, పిల్లలు గుర్తువస్తారు, వాళ్ళు వీళ్ళు గుర్తు వస్తారు. తప్పు ఎక్కడ జరుగుతోందో అర్థం అవుతోందా, అది చేయగలుగుతే ఈ క్షణంలోనే మీకు ఈ భాగవతం అర్థమైపోతుంది, మీరుకూడా ఆ పరమ గురువులే. కాని తరవాత ఆ నీచమైనటువంటి మనస్థితి, స్వార్థపూరితమైనటువంటి మనస్థితి ఉండకూడదు. ఇంక నేను అనేది ఉండదు. నేను అనేది ఉండకపోతే మీకు కోర్కెలు ఎలా వస్తాయి? కోర్కెలు వచ్చాయి అంటే నువ్వు ఉన్నట్లేగా.

ఆజ్ఞాచక్రంలో మిమ్మల్ని కూర్చోమనేది ఆ స్థితి పొందటానికి. మౌనంగా కూర్చోండి ఇక్కడ. **ఇక్కడ మీరు నిజంగా కూర్చోగలుగుతే నేను మిమ్మల్ని ఖచ్చితంగా పైకెత్తగలను. నేను అనేది అహంకారంతోనే వాడుతున్నాను.** కాని మీరు ఆ స్థితికి రాకుండా నేనేమీ సహాయం చేయలేను. మీరు ఇలా వస్తూవుంటారు, పోతూ వుంటారు, మీ ఇష్టమది. ఇక్కడ నిర్ణయాత్మకమైనటువంటి ప్రవృత్తి, మీ బుద్ధిది - ధియోయోనః ప్రచోదయాత్. గురువు ఏమీ చేయలేడు, నిస్సహాయుడు. సర్వ శక్తివంతమైన గురువు ఈ పాయింట్‌లో నిస్సహాయుడు. ఎవ్వరికీ కూడా ఏమీ చేయలేడు.

అర్జునుడు కూడా నీరసించి పడిపోతే, నువ్వు లే అన్నాడు. నువ్వు బాణం పట్టుకో అన్నాడు. లేచి బాణం పట్టుకుంటే ఏదైనా చేయగలడుకాని, నేను నీర్సంగా ఉంటాను, నేను పడిపోతాను అంటే పడిపో! యథేచ్ఛసి తథాకురు అంటాడు గురువు. అక్కడ గురువు మీద అభాండం వేసేటటువంటి నీచమనస్తత్వం పోగొట్టుకోవాలి సాధకులు. గురువు ఆ స్థితిలో ఏమీ చేయలేడు, నిస్సహాయుడు. మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః. రావటంలేదు మాస్టారు! అని బాధపడండి. అది చాలా మంచిది. ఆ బాధ ఉంటేనే ఇక్కడకొస్తారు మీరు. కాని చాలామంది నాతో - నేను ఎప్పుడో పదవీ విరమణ అయిపోయాకో, తర్వాత జన్మలోనో వస్తానులే



అంటారు. సరే చాలా మంచిది. అది వాళ్ళ ఇష్టం.

మీ కుటుంబ సభ్యులను బాగుచేయటానికి మీరు ప్రయత్నించకండి. **ముందు మీరు బాగుపడండి, మీరు ఎక్కడున్నారో అక్కడే సాధన చెయ్యండి.** ఎదుటి వాళ్ళకి చెప్పకండి. మీరు అవగాహన చేసుకోండి ఏం చెప్తున్నానో. ఇతరుల్ని బాగుచేయద్దు మీరు. భార్యని బాగుచేయద్దు, భర్తని బాగుచేయద్దు, పిల్లల్ని బాగు చేయద్దు, మీరు బాగుపడండి. ఆజ్ఞాచక్రస్థితి అంటే అది. **ఆజ్ఞాచక్రంలో మీరు మాత్రమే ఉండగలరు,** ప్రక్కవాళ్ళని మీరు తీసుకెళ్ళలేరు.

ప్రపంచంలో మీ గురువుకూడా మీ ఆజ్ఞాచక్రంలోకి మీ అనుమతి లేకుండా రాలేడు. అందుచేత మౌనంగా ఉండటం, ఆజ్ఞాచక్రంలో ఉండటం ఇవి రెండూ కూడా ఎంత ఎక్కువ అవుతే అంత ఎక్కువ ఇక్కడ సాధన చేసుకోండి. **నాకు అంతా మౌనంగా ఆజ్ఞాచక్రంలో కూర్చున్నటువంటి సాధకులు కావాలి ఇక్కడ.** మరి ఈ ఊళ్ళో లేనివాళ్ళు ఏం చేస్తారు? లేనివాళ్ళు ఏం చేయాలో చెప్పగలరా మీరు. వీళ్ళందరూ ఆ ఊళ్ళో ఏదో ఒక స్థలాన్ని ఎన్నుకుని సామూహికంగా చేస్తే చాలా మంచిది. మరి ఎన్నుకోలేకపోతే మీ ఇళ్ళల్లో మీరు కూర్చోండి. మళ్ళా రాక్షస ప్రవృత్తి తప్పదు కదా. నా ఇంట్లో నేను కూర్చుంటాను. మరి అది పోగొట్టుకోగలగాలి మీరు. అర్థమవుతోందా నేను చెప్పింది. అలాగ ఇంత దూరం రాలేనటువంటి వాళ్ళు రోజూ మీ మీ ఊర్లలోఒక కేంద్రం ఏర్పాటు చేసుకుని అక్కడ మౌనంగా ఉండాలి మీరు, ఆజ్ఞాచక్రంలో కూర్చోవాలి. మౌనము, ఆజ్ఞాచక్రము - మౌనము, ఆజ్ఞాచక్రము - మౌనము, ఆజ్ఞాచక్రము అది గుర్తుంచుకోండి. ఇది లేకుండా మీరు మౌనంగా కూర్చోవటం వృథా అవుతుంది. కాని కనీసం మౌనంగా కూర్చున్నా ఇంట్లోవాళ్ళు చాలా ఆనందిస్తారు, ఆ విషయం గుర్తుంచుకోండి.

రోజు మీరు మౌనంగా ఉంటే, ఇంట్లోవాళ్ళు ఇవాళ ఇంకా మౌనంలో కూర్చోలేదేం అని అడుగుతారు. కావాలంటే చూడండి. నాలుగైదు రోజులు మీరు మౌనంగా ఉండండి, వాళ్ళు ఎంత ఆనందిస్తారో, హమ్మయ్య ఇంకో 5 నిముషాల్లో

నాన్న మౌనంలో కూర్చుంటాడు అని. పోనీ ఆ ఆనందాన్నైనా వాళ్ళకు కలగచేయండి. పిల్లలకోసం ఎంతెంతో చేస్తాం కదా, ఇదికూడా చేసి చూడండి. మౌనము - ఆజ్ఞాచక్రము, మౌనము- ఆజ్ఞాచక్రము. **ఆశ్రమంలో మాత్రము దయచేసి అడుగు లోపలకు పెట్టగానే మీరు మౌనంలోకి వెళ్ళిపోవాలి, ఆజ్ఞాచక్రంలో ఉంటూ మీరు నిర్ణయించుకున్న స్థలంలోకి వెళ్ళి పొండి.** పూజాకార్యక్రమం అదీ ఉన్నప్పుడు కార్యక్రమాలు జరుగుతూ ఉంటాయి, అది మౌనంగా చేస్తాం అనద్దు. అది సాముహికంగా పైకే చేస్తారు. మాటలు మాట్లాడుకోవద్దు మీరు.

నాటు- కోసుకో

రెండో పాయింటు నాటు- కోసుకో. **ఈ నాటు-కోసుకో అనేటటు వంటి దాన్ని మీజీవితంలో మీరు అపాదించేసి మీకు కావలసిన ఫలితాలు మీరు పొందగలగాలి. మీరు ఏది అనుకుంటే అది జరగాలి.** మీ అబ్బాయికి ఇంజనీరింగులో సీటు రావాలి అంటే రావాలి. మా అమ్మాయికి పెళ్ళి అవ్వాలి అంటే అవ్వాలి. అనుకున్న రోజున అవ్వాలి, అనుకున్న ముహుర్తానికి అవ్వాలి. నాటు -కోసుకో అనేది మీరు నేర్చుకుంటే జరుగుతుంది అది. ఆ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోండి. ఏం చెప్పాను నేను **అవిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోటానికి? నాకు తెలిసి తెలుగు భాషలో ఉన్నటువంటి ఒకే ఒక బుక్ శ్రీరామశర్మ ఆచార్య ఆత్మకథ.** ఇంగ్లీషులో చాలా పుస్తకాలు ఉన్నాయి. థియసాఫికల్ సొసైటీ లిటరేచర్ అంతా దీని గురించే చెప్తుంది.

అందుచేత నాటు - కోసుకో హోమ్‌వర్క్ లాగ పెట్టుకుని ఇక్కడ ఆశ్రమంలోకి వచ్చి మౌనంగాకూర్చొనేటటువంటి వాళ్ళు ఎప్పడో ఒక సమయం ఏర్పాటు చేసుకుని ఈ నాటు - కోసుకో తరగతులు ఏర్పాటు చేసుకోండి. నన్ను ఏమీ అడగక్కర్లేదు మీరు. నేను గమనిస్తూనే ఉంటాను. మీ అవస్థలు మీరు పడండి. ఎప్పుడైన నేను కలగచేసుకోవాలి అనుకుంటే కలగచేసుకుంటా. అందుచేత ముందు మీరు మీ సమస్యల్ని కాని, మీ చుట్టుప్రక్కల ఉన్నటువంటి వాళ్ళ సమస్యల్ని తీర్చటానికి తొందర



త్వొందరగా ఎదగాలి. గురుదేవులు 1985లో ఆ పుస్తకం వ్రాయటానికి కారణం అదే. **85 నుంచి ఇప్పటికి 15 సంవత్సరాలు గడిచి పోయాయి, ఆ ఆత్మకథను ఎవరూ ఉపయోగించుకోవటంలేదు.** కాని ఆ గురువుల్నే సాక్షిగా చేసుకుని అనేక వెధవ పనులు చేస్తారు.

స్వార్థపూరితమైన పన్లు చేసి, ఆ గురువుమీద మా నమ్మకాన్ని ప్రకటిస్తున్నాం అని, చెప్పిన పనిని సక్రమంగా నిర్వర్తించరు. అదికూడా మిమ్మల్ని మీరు సమీక్షించుకోండి. గురువు యొక్క సమక్షంలో, **గురువు విగ్రహం యొక్క సమక్షంలో చేసిన ప్రతీ పనికి కూడా మీరే బాధ్యులు. ఆ బాధ్యత మీరు నిర్వర్తించవలసినదే.** అప్పుడు అన్నాం కదా, మేం తరవాత మారిపోయా మండీ అంటే ఇంక ఈ జీవితంలో నువ్వేం చేయలేవ్. అది అలాగ నీ వెనకాతల ఉంటోనే ఉంటుంది. ఒకసారి దొంగతనం చేశాక వాడు ఎంత మంచివాడైనా, వాల్మీకిని దొంగనే చెప్తాం. పాపం త్రేతాయుగంలోనే వాల్మీకి మహర్షి అయ్యాడు. అయినా ఇప్పటికీ ఏం చెప్తాం? ఆయన హంతకుడు అని చెప్తూ మంచివాడంటాం. ముద్ర పోదు. పోగొట్టుకోటానికి ప్రయత్నమేం చెయ్యక్కర్లేదు. మంచిగా మారండి. అర్థమవుతోందా, చెప్తోంది? అందుచేత ఇదివరకు చేశాం ఈ పన్లన్నీ కూడా. ఇప్పుడేం చేయాలి? బందిపోటే వాల్మీకిగా మారగలిగినప్పుడు మీరెందుకు మారలేరు. దాన్ని అవగాహన చేసుకోండి. నాటు-కోసుకో. ఏం నాటితే ధృవుడు, ధృవుడుగా మారాడు, ఏం నాటితే ప్రహ్లాదుడు ప్రహ్లాదుడుగా మారాడు, ఏం నాటితే రత్నాకరుడు వాల్మీకిగా మారాడు, **ఏది నాటితే శ్రీరామశర్మఆచార్య అంత గొప్పవాడయ్యాడు? ఏం చేశాడు ఆయన జీవితంలో?** లాహిరీ మహాశయ ఎలా జీవించాడు? అరవిందో ఎలా జీవించాడు? తృటిలో తప్పింది ఆయనకి ఉరికంబం. జైల్లో మగ్గుతున్నాడు, వివేకానంద యొక్క గొంతుక వినిపించింది ఒకసారి. ఒక్కసారి విన్నాడంతే ఆ గొంతుక. మారిపోయాడు. గురు పరంపరని మళ్ళా అర్థం చేసుకోండి మీరు. సాయిని వేరుగా, రామకృష్ణ పరమహంసని వేరుగా చూడకండి. లోపలున్న దాన్ని నీ అంతట నువ్వు వెతుక్కోగలగాలి. ఎప్పుడు వెతుక్కోగలుగుతావు అంటే అరజ్ఞు:

స్థితిలో ఉన్నప్పుడు ఏ విధమైనటువంటి బంధాలూ ఉండకూడదు. ఏ విధమైనటువంటి బంధాలు అన్నదానిని చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. చేతనత్వ విజ్ఞానానికి ఇది నాంది. అక్కడినుండి ఎక్కడికెళ్ళాలి మీరు?

**కృష్ణ ద్వైపాయనం వందే.** ఈ ద్వంద్వ స్థితిలో ఏది ఉచితమో, ఏది అనుచితమో ఎప్పుడూ భారతంలో మనకు కనిపిస్తూనే ఉంటుంది. అలా ద్వంద్వాలు వచ్చిన సందర్భాలలో వ్యాసుడే వస్తూ ఉంటాడు సాల్వ్ చేయటానికి. వ్యాసుడు వస్తే అథారిటీ. ద్వంద్వం వచ్చినప్పుడు ఏమి చేయాలి, ఏది చేయ కూడదు అన్నది మన కామన్‌సెన్స్‌కి విరుద్ధంగా వున్నటువంటి చాలా వస్తాయి భారతంలో. అన్నీ కామన్‌సెన్స్‌కి విరుద్ధమే. మనం నమ్మినటువంటి సిద్ధాంతాలకు విరుద్ధమే. కానీ అది విరుద్ధంగా ఉన్నది ప్రకృతి యొక్క నియమంలోనే. భగవంతుడి యొక్క నియమంలో కాదు. మనకు ఆ అవగాహన లేదు. దీనిని మీరు చాలా జాగ్రత్తగా కరెక్ట్ చేసుకోండి.

## గురువులు అంతర్‌సంబంధీకులే, కానీ సంస్థలు?

వీళ్ళు అందరు అంతర్‌సంబంధీకులే. ఒకళ్ళ పని ఒకళ్ళు చేసుకుంటూనే ఉన్నారు. శిరిడీసాయి మూడు రోజులు పాటు శరీరం వదిలేసి ఇంక రాను అనుకుని వెళ్ళిపోయాడు. ఎంత విసిగిపోయి ఉంటాడో మీకు తెలీదు శిరిడీసాయి. శరీరాన్ని వదిలేస్తూ మహల్సాపతినికూర్చోపెట్టి నేను రాను, కాని మూడురోజులు ఎదురుచూడు బాబు అన్నాడు. ఎందుచేతంటే **గురువులకు పైన ఇంకో గురువు ఉన్నాడు. నః పూర్వేషా మపిగురుః వాడు చెప్పినట్టు ఈ గురువులు వినాలి.** మనం చెప్పినట్టు, నాకు నచ్చలేదు మాస్టారు అందుచేత చేయలేదు అంటానికి వీల్లేదు పాపం వీళ్ళు. ఏ విధమైనటువంటి స్వాతంత్ర్యము లేదు గురువులకి. మీకు ఎంత స్వాతంత్ర్యము ఉందో. గురువు చెప్పిన ఏపని చేయక్కర్లేదు మీరు. ఒక్కపనైనా చేస్తున్నామా మనం, కానీ ఆ శిరిడీ సాయిలాంటి వాడికి మాత్రం చెయ్యక తప్పదు.

## శిరిడీసాయి శరీరం వదిలేశాక బిగ్‌బాస్ ఏమన్నాట్ట?

అంత శక్తివంతుడు కూడా చచ్చిపోదాం అనుకున్నాడు. ఆయన నేను వెళ్ళి



పోతున్నాను అని చెప్పాడే కాని ఆయనకి తెలుసు బిగ్‌బాస్ ఉన్నాడు పైన, ఆయన ఏమంటాడో అని, మళ్ళా వస్తానేమో బాబు ఆయన వెళ్ళమ్మంటే అన్నాడు. శిరిడీసాయి శరీరం వదిలి వెళ్ళాక బిగ్‌బాస్ ఏమన్నాట్ట - గదాధరుడు అని ఒక బ్రాహ్మణుడు కేన్సర్‌తో బాధపడుతున్నాడు, చావుబ్రతుకుల మధ్య ఉన్నాడు, అతని శరీరం ఇంక తట్టుకోలేదు. అతని పనికూడా నువ్వు చెయ్యి అంటే, సరే అని కిందకి దిగి వచ్చేశాడు. ఇంతకీ రామకృష్ణపరమహంస శిష్యులే - సాయి శిష్యులయ్యుంటారా కాదా. అరవిందో వివేకానంద చెప్పినట్టు చేసి ఎదిగాడు. మరి అరవిందో ఎవరి శిష్యుడు? మరి రామకృష్ణ పరమహంస శిష్యులు, సాయిశిష్యులు, అరవిందో శిష్యులు ఒక్కటే అయ్యుంటారా కాదా. కాని మనం ఎంత దుస్థితిలో జీవిస్తున్నామంటే, ఒకళ్ళ శిష్యులకీ, ఒకళ్ళ శిష్యులకీ మధ్య అవగాహనలేదు.

ఇల్లు కట్టాలీ అంటే ఎలక్ట్రికల్ ఇంజనీరు కావాలి, ప్లంబర్ కావాలి, మేస్త్రీ కావాలి. వీళ్ళలో ఎవరు లేకపోయినా పని ఆగిపోతుంది. అందరూ కలసి పనిచేస్తే ఏమవుతుంది ఇల్లు, తొందరగా లేస్తుంది. **ఈ గురుసత్తా అనేటటువంటి భావన అందుకు పెట్టింది. ఎవరిపని వాళ్ళు చెయ్యండి కానీ కలసి చెయ్యాలి.** నేను ఏదో ఇల్లు కట్టుకుంటూ పోతాను అని ఇల్లు కట్టుకుంటూ పోయాడనుకోండి మేస్త్రీ. క్రింద పునాది లేదు ఏమవుతాడు? వాడూ పడతాడు, వాడితోపాటు అంతెత్తుకి ఎదుగుదామనుకునే దద్దమ్మలు కూడా దానిక్రింద పడతారు. ఈ సంస్థల్లో జరిగే మూర్ఖత్వం అది. కాని గురువులు పరమ దయాళులు. అసలు దాన్ని ఎదగనిస్తే కదా వాళ్ళు! ఎదుగుతే కదా అది విరిగిపడాలి, విరిగిపడితే కదా వీళ్ళు చచ్చేది, **అందుచేత సంస్థలు ఎదగవు. ఎదుగుదల లేదు అంటే, ఎక్కడా సయోధ్య లేదు, అవగాహన లేదు.**

ఆశ్రమంలోని 6 కేంద్రాలకి బీజారోపణని ఉపయోగించుకోండి

చాలా జాగ్రత్తగా సరిచేసుకోండి. **సృష్టిలో ఉన్నటువంటి 6 కేంద్రాలకి బీజారోపణ ఈ ఆశ్రమంలో జరిగి ఉన్నది.** ఇక్కడ మీరు స్విచ్ తిప్పితే ప్రపంచంలో

ఎక్కడి ఛానల్ అయినా పలుకుతుంది. అంటే ఇక్కడేనా అలా ఉంది మాస్టారు అనే ప్రశ్న వేయకండి. ఇలాంటి కేంద్రాలు ఎన్నైనా పెట్టుకోవచ్చు సైన్సు తెలుసున్నవాడు. టీ.వీ. ఉంటే, గుంటూరులోనేనా ఈ.టీ.వీ. వచ్చేది, ఎక్కడైనా పెట్టుకోవచ్చు. టి.వి. ఉండాలి మీకు. **ఈ ఆశ్రమం టీ.వీ.లాంటిది. ఈ విగ్రహాలు అన్నీ గూడా ఛానల్స్ లాంటివి. ప్రతీ ఛానల్‌కీ మీరు ట్యూనవ్వచ్చు**, అవసరమవుతే ఛానల్ టూ ఛానల్ మీరు మార్చుకోవచ్చు. ఆ విద్య నేర్చుకోండి. ఆ విద్యే ఆదివారంనాడు తరగతుల్లో నేను చెప్తున్నాను, దాన్ని మీరు మిగతా 6 రోజులు అభ్యసం చేసుకోవాలి. ఏఒక్క వారం మీరు మిస్సైనా ఆ సాధన పోతుంది. అది మళ్ళీ చెప్పే సమయం నాకు లేదు. చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోండి. ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ విద్య నేర్చుకోదల్చుకున్న వాళ్ళు ఆదివారం తరగతులు మిస్ కావద్దు.

ఒకవేళ మిస్సవుతే ఏంచేయాలి. క్యాసెట్ తెప్పించుకోండి. మిమ్మల్ని మీరు విశ్లేషించుకోండి. మీ బలహీనతలను స్వచ్ఛంగా సుస్పష్టంగా మీరు విశ్లేషణ చేసుకోండి. మీరు దేనికి ఓటు వేస్తున్నారో మీకే తెలుస్తుంది నేను చెప్పక్కర్లేదు. **మీరు ఖచ్చితంగా భౌతికసుఖాలకే ఓటు వేస్తున్నారు.** భౌతిక సుఖాలకి ఓటు వేసిన తర్వాత గురువు యొక్క అనుగ్రహము, ఆధ్యాత్మిక విజ్ఞానము మాకు రావటం లేదు అనే బాధ దొంగబాధే. మిమ్మల్ని మీరు మోసగించుకుంటున్నారు.

నేను చెప్పాను కదా! ఒకవ్యక్తి వచ్చి నాదగ్గర ఏడ్చేశాడని. మాస్టారూ భగవత్ దర్శనం కావటంలేదని నిజంగా ఏడ్చేసాడు. అప్పుడు రామకృష్ణ పరమహంస గురించి విన్నాను, ఇవాళ కళ్ళారా ఒక వ్యక్తిని చూస్తున్నాను అని ఈర్ష్యపడ్డాను నేను. ఎందుచే తంటే నాకు ఆ ఏడుపు ఎప్పుడూరాలేదు. ఆ తరవాత అన్నాడు మాస్టారూ సిగరెట్ స్మోకింగ్ వదలలేకపోతున్నాను అని. ఇంతకీ దేనిమీద అతనికి ప్రీతిఉన్నట్టూ. ఎందుకు అబద్ధాలు చెప్పి మిమ్మల్ని మీరు మోసగించుకుంటారు. మీకు ఖచ్చితంగా భగవంతుడి కంటే సిగరెట్ తాగడం ముఖ్యం అని అర్థమై పోయింది కదా. అలాంటప్పుడు ఈ నటన వద్దు.



మిమ్మల్ని మీరు విశ్లేషణ చేసుకోండి అందుకు ఇది చెప్పేది నేను. మిమ్మల్ని మీరు తప్పుదోవలో పెట్టుకోకండి. ఒకవేళ దీనిమీద అంత ఆర్తి లేకపోతే తరగతులకి రండి వెళ్ళిపోండి. కానీ నిజంగా నేను చెప్పిన స్థాయికి మీరు నాతోపాటు ఎదుగుతాను అంటే మిగతా 6 రోజులు నేను చెప్పింది చెయ్యాలి. ఇంట్లోకూడా మౌనమూ - ఆజ్ఞా చక్రము, మౌనము - ఆజ్ఞాచక్రము ఇంట్లోవాళ్ళు ఏమనుకుంటారు, పక్కవాళ్ళు ఏమను కుంటారు అని ఆలోచించకండి.

భార్యని లేపాడు విష్ణుమూర్తి విమానం పంపిస్తున్నాడు, సశరీరంగా నేను వెళుతున్నాను నీవూ రా అని, అంటే మీకు ఎప్పుడు ఇదేగోల పడుకోండి అంది. ఎవరి గురించి చెప్తున్నాను నేను? తుకారాం గురించి. ఏమయ్యింది తరవాత? ఆవిడ పరుగెట్టు కొని వచ్చింది. కానీ అవకాశం పోగొట్టుకుందిగా ఆవిడ. పక్కవాళ్ళు ఏమనుకుంటారో అనుకుంది ఆవిడ. పక్కవాళ్ళ గురించి జీవించేటటువంటి వాళ్ళు ఏవిద్యకీ తగరు. మీకు అర్థమయ్యింది కదా ఇదిచాలా ముఖ్యమని. ఇటువంటి తరగతులు నాకు తెలిసీ ప్రపంచంలో మీకు ఎక్కడా దొరకవు. దొరికినా మీరు దాన్ని ఉపయోగించుకో లేకపోతే దాన్ని ఉపయోగించుకునే వాళ్ళకి అడ్డుతగులుతే ఎట్లా? మనం చెయ్య లేకపోతే చెయ్యలేకపోయాం. పోనివ్వండి. చెయ్యగలిగే వాళ్ళకి అవకాశం ఇవ్వచ్చుకదా! అది అర్థం చేసుకోండి.

నేను నెక్స్ట్ ఆల్టర్‌నేట్ చెప్తున్నాను. నాటు - కోసుకోలో మీరు రాలేరు, మీరు చెయ్యలేరు, మీమనస్సు లొంగటంలేదు పోని ఇక్కడకి రాను వీలులేనటువంటి వాళ్ళకి వాళ్ళ పనులు మీరు చేసిపెట్టి వాళ్ళని ఇక్కడకి రానివ్వచ్చును కదా. ఇది మీరు సరిచేసుకుంటే తప్పకుదరదు. రాబోయే తరగతులు చాలా తీవ్రంగా ఉంటాయి. భాగవతం మాహత్యం గురించి చెప్తున్నాను నేను. ప్రధమస్కంధం 7 వారాలలో అయి పోతుంది. కానీ దానికి తగిన మానసికస్థితి మీకు లేకపోతే ఎన్నిసార్లు విన్నా ఒకటే.

ఆ మానసికస్థితిలో ఉండి మౌనము - ఆజ్ఞాచక్రములో ఉండగలిగినా చాలు మీరు, వెళ్ళిపోతారు. రెండోది - నాటు - కోసుకోలో ఈ రకాల్లో అన్నీ చెప్పాను.

మీరైనారండి లేకపోతే ఇక్కడ జరుగుతున్న దాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యండి. **నాటు- కోసుకోలో రేపు మీ బాధ్యతలు ఎవడో తీసుకొని మిమ్మల్ని పంపిస్తాడు.** అక్కడకూడా స్వార్థమే. మీరు ఏదో పెద్ద ఉచితంగా చేస్తున్నారని అహం భావాలతో మీసాలు తిప్పకండి. అది కూడా మీకే లాభం. నాటు- కోసుకో తరవాత ఏం చెప్పాను?

**సామూహిక జీవితం- క్రమశిక్షణ:-**

ఏది చేసినా సామూహికంగా చేయటం అలవాటు చేసుకోండి. మిలట్రీ అంటే అర్థం అదే. మిలట్రీ డిసిప్లిన్. నుంచుంటే ఒకేసారి నుంచుంటారు.కూర్చుంటే ఒకేసారి కూర్చుంటారు. అడుగులేస్తే లెఫ్ట్ రైట్, లెఫ్ట్ రైట్ - ఇడా పింగళా, ఇడా పింగళా. పొజెషన్ వన్, పొజెషన్ టూ. **సూర్యనమస్కారాలు సామూహికంగా చేయటం నేర్చుకోండి.** ముఖ్యంగా ఆరతి జరుగుతున్నప్పుడు సరిగా ఉండటంలేదు. ఈ శాస్త్రం నేర్చుకుంటున్న టువంటి వాళ్ళ బాధ్యత అది.

**త్రిభుజాకారంలో నుంచోబెడితే ఒక విధమైనటువంటి శక్తి దిగుతుంది. చతుష్కోణంలో నుంచోబెడితే ఒక విధమైనటువంటి శక్తి దిగుతుంది. షట్కోణంలో నుంచోబెడితే ఇంకో రకమైనటువంటి శక్తి దిగుతుంది. ఇదే శ్రీ సూక్త విద్య.** కానీ ఇప్పుడు ఆ సూక్తాలు అన్నీ కూడా మీరు నేర్చుకోండి. క్లాసులు టైంటేబులు వేసుకుని వాళ్ళు సామూహికంగా నేర్చుకొని దాన్ని ఇతరులకి చెప్పాలి. నేను నేర్చేసుకుంటాను కాని ఇంకోళ్ళకి చెప్పను అంటే ఆ విద్య మీకు ఫలించదు. మీరు చాలా జాగ్రత్తగా ఒక ఉదాహరణ అర్థం చేసుకోండి. న్యూటన్, డాల్టన్, ఐన్‌స్టీన్ కాలంలో ఉన్న సైంటిఫిక్ అభివృద్ధి ఈనాడు లేదు. ఎందుకు లేదు? న్యూటన్ కనిపెట్టినప్పుడు ఇది నాది అనలేదు. డాల్టన్ కనిపెట్టినప్పుడు ఇది నాది అనలేదు. ఇది నాది అని పేటెంట్ చేసుకోలేదు వాళ్ళు.

ప్రపంచానికి ఇచ్చేశారు వాళ్ళు. అది అందరికీ ఉపయోగపడింది. దాని వల్ల వాళ్ళ పేర్లు శాశ్వతంగా ఉండిపోయాయి. ఇది నాది అని ఎప్పుడవుతే పేటెంట్ చేసుకోవటం మొదలెట్టారో, ఒక్క సైంటిఫిక్ డిస్కవరీ కూడా సరిగా రావటము లేదు.



అర్థం చేసుకోండి ఆ సామూహికతని. నాది కాదు- మనది. ధియోయోనః ప్రచోదయాత్. మళ్ళీ మళ్ళీ అర్థం చేసుకోండి. ఆ గురువు సమయాలు మీకు చాతకాకపోతే ఎదగరు మీరు. ఒకటి గుర్తుంచుకోండి.

సైన్సు అభివృద్ధి అవుతోంది. పృథ్వి చేతనత్వం అభివృద్ధి అవుతోంది. వ్యక్తిగత జీవితము భ్రష్టుపట్టిపోతోంది. మీకు అర్థమయ్యిందా లేదా. మన తాత ముత్తాతల జీవితాలతో పోల్చిచూసుకోండి మీరు. మనిషి వంటరి వాడు అయిపోతున్నాడు. ముసలి వాళ్ళు వంటరివాళ్ళు అయిపోతున్నారు, పడుచు వాళ్ళు వంటరివాళ్ళు అయిపోతున్నారు, కాదా. వృద్ధాశ్రమాలు ఎందుకొస్తున్నాయి. కారణం ఎప్పుడైనా ఆలోచించారా? మీ పిల్లలు చేసేటటువంటి పనులు మీకు చివరన తెలుస్తాయి. అవునా, కాదా. మీ పిల్లలు వాళ్ళకి వచ్చినటువంటి సమస్యలు వాళ్ళ స్నేహితులతో కానీ, వాళ్ళ అయుల్స్‌తో కానీ చెప్పుకుంటారు తప్ప, మీతో చెప్పుకోరు. అవునా, కాదా! ఎందుకు అలాంటి పరిస్థితి వస్తోంది? ఎందుకు అలాంటి పెంపకం. ఎందుచేత? **మీరు అనలు వాళ్ళకి వాళ్ళ బాధలు చెప్పుకునే స్వేచ్ఛ ఇవ్వటంలేదు. లేకపోతే మీతోనే చెప్పుకుందురు వాళ్ళు.** అర్థం చేసుకోండి అది. మేము ఏదో చాలా గట్టిగా పెంచేశాం. నా ఎదట నా పిల్లవాడు నోరు ఎత్తడు అనుకుంటారు. కాని, కొన్ని సంవత్సరాల తర్వాత మీ తల దింపుకునేటట్టు చేస్తాడు.

యదేచ్ఛసి తథాకురు - అని శ్రీకృష్ణుడులాంటివాడు అర్జునుడితో అంటే, మీరెందుకు మీ పిల్లల్ని అలా అనలేకపోతున్నారు? 'బాబూ ఇది మంచిది, నా అనుభవంతో చెప్తున్నాను, చేస్తేచెయ్ లేకపోతే ఈ కష్టాలు వస్తాయని'.రెండు మూడు సార్లు చెప్పి చూడండి వాడికి. ఆ కష్టాలు వచ్చాక ఖచ్చితంగా మీరు చెప్పినట్టే చేస్తాడు. నా దగ్గరికి వచ్చే అనేకమంది పిల్లలకి, పెద్దలకీ నేను అదే చెప్తా. వాళ్ళందరూ నాకు నిజాయితీగా వాళ్ళకున్న బాధలు చెప్తారు. వాళ్ళు నాకు చెప్పిన విషయాలు, నా అంతట నేను ఇంకొకళ్ళకి ఇంతవరకూ చెప్పలేదు. చెప్పను కూడా. కాని వాళ్ళకి సలహా ఇస్తాను, వాళ్ళ వాళ్ళ పరిస్థితులబట్టి వాళ్ళేం చేయాలో. అది వాళ్ళు చేసుకుంటారో చేసుకోరో వాళ్ళ ఇష్టం.

మీరు అలా సామూహిక జీవితం జీవించగలగాలి. అందుకు ఈ ఉదాహరణ ఇచ్చింది. వ్యక్తులు మీ దగ్గరకు వచ్చి, వాళ్ళ కష్టాలను ఎందుకు చెప్పుకోగలగాలీ అంటే, మీకు చెప్పినందువల్ల వాళ్ళకు మేలే జరుగుతుంది తప్ప, అపహాస్యం పాలుకారు అనేటటువంటి భావనామయస్థితి మీలో ఉండాలి. ఆ స్థితినే అహింస అంటాం, **అహింసా స్థితి లేనటువంటి వాడు భాగవతానికి పనికిరాడు.** అహింస అంటే- మాట ద్వారా కాని, చేతలద్వారా కాని, ఆలోచనల ద్వారా కాని ఎవరినీ బాధ పెట్టకూడదు. ఎవరి అదృష్టాలు వాళ్ళవి, మీరెందుకు తిట్టటం వాళ్ళని. చూశావా నేను చెప్పాను, నువ్వు వినలేదు అని. **మనం విన్నామా మన గురువులు చెప్తొంటే?** మొదటిది నాటు-కోసుకో, రెండోది సామూహికత, మూడోది అహింస. సామూహిక జీవితం జీవించటం నేర్చుకోండి.

మీ అంతట మీరు నేర్చుకోకపోయినా ప్రకృతి ఫ్లాట్ సిస్టమ్ తీసుకొచ్చి నేర్పుతోంది. చావగొట్టి చెవులు మూసి ఫ్లాట్స్‌లో పెడుతోంది. ఇదివరకు ఫ్లాట్ సిస్టమ్ లేదు కదా. మరి ఫ్లాట్ సిస్టమ్ ఎందుకొచ్చింది అనుకుంటున్నారు మీరు. కలసి ఉంటారేమో అని. ఎదుటివాడు తలుపు తెరవగానే వీడు కపామని తలుపు వేసేస్తాడు వాడి మొహం మీద, మళ్ళా వాడికి అర్థం కాదేమోనని. **హోటల్స్ ఎందుకొచ్చాయని మీ ఉద్దేశ్యం? కలసి తినమని.** ఆ సమయానికి వెళ్ళకపోతే మీకు ఆహారం ఉంటుందా?

ఓస్సారి నేను 12.50 కి క్లాస్‌కి వెళ్ళి, క్లాస్ తీసుకోబోతూవుంటే 10 మంది లేచి, మాస్టారు మాకుఆహారం వుండదు వెళ్ళిపోవాలన్నారు. అయితే 'ఇక్కడ నా క్లాస్‌లోనే మీకు ఆహారం ఉండదా' అన్నా. అలా సమయానికి ఇంట్లో మీరెందుకు ఈ పని చేయలేకపోతున్నారు, కలసి ఎందుకు **తినలేక పోతున్నారు, కనీసం ఇంట్లో అయినా.**

ఇలాంటి భావన ఉన్నటువంటి వాళ్ళు ప్రక్కప్రక్కన ఉండి కలసి తినండి. కలసి మంచినీళ్ళు తాగలేరు. ఆ మానసిక దుస్థితి మీకు అర్థమవు తోన్నదా ఎందుకు



బాధపడుతున్నారో. మీరు ఎప్పుడైనా చూశారా, ఎప్పుడైనా గురువు దగ్గరే బాధలు ఎక్కువవుతాయి. ఎందుకు ఎక్కువవుతాయి అంటే, మీరు నియమాన్ని పాటించటం లేదు కనుక. మీరు నియమాన్ని పాటించకుండా ఎవర్ని నిందిస్తారు?మీ మూర్ఖత్వానికి గురువేం చేస్తాడు, నవ్వుకుంటాడు. పైకి నవ్వడు. పైకి నవ్వితే మీరు బాధపడతారు కదా! **నాటు-కోసుకోలో ఏం నాటుకున్నారని మీకు ఫలం రావటానికి.** ఏదైనా నాటితే కదా ఫలం వచ్చేది మీకు? ఖర్చు గురించి నేను మాట్లాడటంలేదు, అంటే డబ్బు గురించి మాట్లాడటంలేదు. ఏదో ఒకటి నాటుకోండి. మీ శ్రమ నాటుకోవచ్చు, మీ భావాలు నాటు కోవచ్చు, మీ ఆచరణలు నాటుకోవచ్చు. డబ్బు గురించి నేను మాట్లాడటంలేదు. కాని డబ్బుకూడా నాటుకునే ఒక విధానం కనుక, ఆ భాషే మనకి అర్థమౌతుంది కనుక చెప్తున్నాను. **లక్షలు లక్షలు మీరు షేర్ మార్కెట్‌లో నాటుకో గలరు కాని, గురువుగారి ఆశ్రమంలో నాటలేరు.** గురువుగారి ఆశ్రమంలో వంద రూపాయలు నాటితే నాకు పదివేల రూపాయలు వచ్చిందా లేదా? వెంకటేశ్వరస్వామితో లింక్. ఎంత ఆయనతో వాటా?10% అవునా, తప్పేంలేదది. అది నాటుకోమనే నేనూ చెప్తున్నాను. కాని నిజాయితీగా 10% ఇవ్వకపోతే వాళ్ళతో పెద్ద గొడవ.

ఎందుచేతంటే వాళ్ళకి నియమాలు తప్ప, మనలాగా సర్దుకోవటాలు తెలియవు. నువ్వు 10% అన్నావు కదా, ఏది 10% అంటాడు. ఉత్తినే నవ్వులాటకి అన్నాను లేవోయ్ అంటే వదలడు. పాపం వాళ్ళకి మనలాంటి హ్యూమర్ లేదు. మనం నవ్వు లాటకి చాలా పన్లు చేసేస్తూంటాం. **జీవితాన్ని చాలా సీరియస్‌గా తీసుకోండి.**చాలా జాగ్రత్తగా, స్పష్టంగా ఈ మాటలు చెప్తున్నాను. లేకపోతే ఈ ఆశ్రమంలో నేను జీవిస్తానని అనకండి. అంటే ఇరుక్కుంటారు. ఆ మాట అనకండి మీరు. అన్నాక వాళ్ళు వదలరు. వచ్చిన పెద్దగొడవ అది. ఏంటంటే అది ఇలా అంటారు పిల్లలు, ఒట్టు తీసి గట్టు. అనేదో అంటారు... అలా అనేసుకుని వెళ్ళిపోండి. చాలా సీరియస్‌గా ఉండండి.

### గురువులు ఇచ్చిన అవకాశం- పరిణామక్రమంలో ఎదుగుదల

**ఇంత అద్భుతమైన అవకాశం మరి రాదు, ఖచ్చితంగా రాదు. ఎందుకు**

రాదంటే గురువులు చాలా కొద్ది మందికి మాత్రము అవకాశం ఇచ్చారు.

ఈ జ్ఞానమును మానవజాతికి చెప్పేందుకు గురువుల మండలి సమావేశం అయినది. అన్ని విషయాలను లోతుగా చర్చించిన తర్వాత వారిలో కొంతమంది ఈ బాధ్యతని అయిష్టముగానే ఒప్పుకున్నారు. థియోసాఫికల్ సొసైటీ మొదలైనప్పుడు, పరమగురువుల యొక్క సమావేశంలో కేవలం ఇద్దరు మాత్రమే థియోసాఫికల్ సొసైటీ పెడతామని, ఒప్పుకున్నారు. మిగతా గురువులు అందరూ దానికీ ఓటు వెయ్యలేదు. పెట్టవద్దు అన్నారు. అది లాభం లేదు, వృధా అన్నారు.

మీలో థియసాఫికల్ సొసైటీ ఎంతమందికి తెలుసు. అదీ పరిస్థితి. అది మిగతా గురువులకి తెలుసు. ఆ ఇద్దరు గురువులూ కాదండీ, మేం చెప్తాం మనుష్యులకి, మాకు మనుష్యుల మీద చాలా నమ్మకం ఉంది అన్నారు. కానీ, థియోసాఫికల్ సొసైటీ పెట్టటం వల్ల, కనీసం పృథ్వి గ్రహం యొక్క చేతనత్వంలో, ఐదారు కోట్ల సంవత్సరాలు పరిణామక్రమంలో ముందుకి వెళ్ళింది. కాని మానవజాతి ఏమయ్యిందో నాకు తెలీదు. మానవజాతి గురించి అసలు గురువులు పట్టించుకోరని నా అనుమానం. కానీ, మిగతా జాతులు ఉన్నాయి. ఖనిజజాతి, వృక్షజాతి, జంతుజాతి, దేవతలజాతి. దేవతల్లో- కింపురుషులు, కిన్నెరులు, నాగులు, యక్షులు, గంధర్వులు, సిద్ధులు, చారణలు. ఈ ఏడు వర్గాలు ఉన్నాయి. ఇవన్నీకూడా ఐదారు కోట్ల సంవత్సరములు ముందుకి వెళ్ళిపోయాయి.

వెళ్ళిపోయాయి అన్నదానికి పెద్ద నిదర్శనం ఏంటంటే, అనంతమైనటువంటి శక్తి కదా గురుచేతన్యం అంటే. ఆ అనంతమైనటు వంటి శక్తి ఖనిజ జగత్తులో, రేడియో యాక్టివిటీగా వచ్చేసింది. ఖనిజ జగత్తులో, ఆ అనంతమైనటువంటి శక్తి ఆవిర్భవించేసింది. అవి వెళ్ళిపోయాయి ఆ స్థితికి. వృక్షజగత్తులో ఐదు చెట్లు ఆ స్థితికి వచ్చాయి. దాన్ని మీరు ఉపయోగించుకోగలిగుతే? ఇప్పుడు యాటమిక్ ఎనర్జీ ఉందీ. ఎంతమంది ఉపయోగించుకుంటున్నారు. కానీ, అది ఆ స్థితికి వెళ్ళిపోయింది. **వృక్షజాతి గురుచేతనత్వానికి వెళ్ళిపోయింది.** ఇప్పుడు ఈ చెట్లన్నీ నేను పెట్టమనేది



అందుకే. **మీరు ఉపయోగించుకోగలుగుతే, తులసిని మించినటువంటిది అమరత్వప్రాప్తికి మార్గము** లేదు. తులసి -జాలంధరుడు కధ తెలుసా మీకు! అక్షరాలా సత్యం అది. మరి ఉపయోగించుకోండి. **యాటమిక్ ఎనర్జీ- ఎంత ఉపయోగించగలమో మనం - తులసిని మనం అంతే ఉపయోగించుకోగలం.** తెలుస్తేగా అది. జంతువుల్లో ఏనుగుని సత్యసాయి ఉపయోగించుకున్నాడు. గుర్రమును సాయి ఉపయోగించాడు. ఆవుని కృష్ణుడు ఉపయోగించుకున్నాడు. కుక్కలని ఆ గురు దత్తావతారుడు ఉపయోగించుకున్నాడు. ఇవి ఆ చేతనత్వంలో ఉన్నాయి. కాని ఆవులని ఇక్కడ పెట్టి ఆవుల దగ్గిర మీరు జీవించండి అంటే మీరు ఎంత మంది జీవించగలిగారు. కించపర్చటానికి చెప్పటంలేదు నేను. మీరు ఎలాంటి అవకాశాలని కోల్పోతున్నారో అది చెపుతున్నాను. మీరు నా వయస్సు వల్ల, అనారోగ్యం వల్ల, పిల్లల వల్ల నేను చెయలేకపోయాను అంటే, చేయలేకపోతే నన్ను ఏం చేయమంటావు? ఇదయ్యా మార్గం మీరు ఉపయోగించుకోండి.

ఇక్కడి మూడు - అశ్వపూర్వాం, రథమధ్యాం, హస్తినాదప్రబోధినీం. శ్రీ సూక్తం లో వస్తుంది. వాటిని మీరు జంతువుల్లాగా చూస్తున్నారే తప్ప పరమ గురు చేతనత్వం పరిపూర్ణ వికాశమొందినటువంటి స్థాయిలో ఉన్నవని మీకు అర్ధమవ్వడం లేదు.

## మాస్టారు మనుషులకి ఇచ్చే స్ఫూర్తి, ప్రయత్నాలు

అప్పటికీ నా ప్రయత్నలు నేను చేస్తూనే ఉన్నాను. **కాకువాయిలో 1000 ఆవులు కలిసి ఉండేటట్లు** ప్రయత్నం చేయమని నేను మనుషులకి స్ఫూర్తి ఇస్తూనే వున్నాను. ఎక్కడ జరుగుతే అక్కడ జరుగుతుంది. ఇక్కడ జరగాలి అని లేదు. సమస్త పృథ్వీ మనదే. భాగవతం చదువుతున్న వ్యక్తులుగా, మీ అందరు అది గుర్తుంచుకోండి. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకులు అవుతారు మీరు. అందుచేత ఎక్కడ ఎక్కడ ఈలాంటి సంఘం ఏర్పడితే దాన్ని ప్రోదిచేసుకోండి మీరు.

ఆవు దగ్గిర గడపండి. మరి ఆవుని ఎక్కడనించి తెస్తారు మాస్టారు. మీకు నిజంగా మనస్సు ఉంటే మీ దగ్గిరకు ఆవు వస్తుంది. మొన్న కారుమంచిలో గాయత్రీ

మంత్ర దీక్ష ఇచ్చేసిన తరువాత వాళ్ళు పూజ చేసుకుంటుంటే సరిగ్గా మూడు రోజుల బట్టి ఆవు వస్తోంది. ఏం చేయాలి మాస్టారు ఆవు ఎవరిదో తేలియటం లేదు మాకు అన్నారు. పల్లెటూరులో ఆ ఆవు ఎవరిదో తెలియటంలేదంటే అది ఆశ్చర్యంగా ఉందో లేదో మీకు. ఆ పల్లెటూరులో ఒక చూలు కట్టిన ఆవు వస్తుంది.

మీ చేతనత్వం మారాలి. మీ మనస్సులు మారాలి. ఈ చేతనత్వ స్థితిని మీరు అర్థం చేసుకోండి. అంత భావనాత్మకమైనటువంటి విశ్లేషణతో మిమ్మల్ని మీరు ఆ వస్తువులతో చుట్టుముట్టుకోండి. ఇప్పటికి భారత రాష్ట్రపతి మొదటిసారి పార్లమెంట్కి వెళ్ళితే గుఱ్ఱపు బండిలోనే వెళ్ళతాడు. విమానంలో వెళ్ళడు. చూశారా ఎప్పడైనా అది. ఇప్పటికీ అవి అవే. ఇప్పటికికూడ ఆ చేతనత్వం యొక్క సంకేతాలు ఎలా మారతాయి ప్రకృతిలో. ప్రకృతిలో చేతనత్వం సంకేతాలు మారవు.

అందుచేత ఆ సంకేతాలు "ప్రకృతిలో చేతనత్వ విజ్ఞానము" అని జ్వాలమాల్ ఒక పుస్తకం వ్రాసాడు. ఆ పుస్తకం పేరు 'గ్లామర్ ది వరల్డ్ ప్రాబ్లమ్'. అది చదువుకోండి. మరి మీరు ఎన్ని పుస్తకాలు చదువు కోవాలో చూసుకోండి. మీరు భాగవతులు అవ్వాలి అంటే నాలుగు ఉపన్యాసాలు ఇస్తే సరిపోతుందా? మాస్టారు అనచ్చు మీరు. అది ఏం సరిపోదు. కాలేజిలో లెక్చరర్ ఇచ్చే ఉపన్యాసాలు వింటే సరిపోతుందా ఎంత చదువుకోవాలి. రెసిడెన్షియల్ కాలేజి విద్యార్థిని అడిగితే తెలుస్తుంది ఎంత చదువుకోవాలి అని. చదువుకున్న వాళ్ళకే సీటు రావటంలేదు. అందుచేత ఏవేం పుస్తకాలు చెప్పానో ఈ నెల నుంచి మొదలు పెట్టండి.1. గ్లామర్ ది వరల్డ్ప్రాబ్లెం. 2. నాటు- కోసుకో అని శ్రీరామశర్మ ఆచార్య యొక్క ఆత్మకథలోని ఒక అధ్యాయమును మీరు ఒక టైం టేబులు వేసుకొని ఈ వారం రోజులలో చదువుకోండి. మీరు చదివిన దాన్ని చిన్న చిన్న నోట్సులు వ్రాసి బయట ఊర్ల వాళ్ళకి పంపించండి.

ఇక్కడ మూడు కంప్యూటర్స్ వున్నాయి. ఉపయోగించుకున్న వాళ్ళే లేరు. ఏడు సంవత్సరాల బట్టి దాన్ని నెట్వర్క్గా పెడదాం అనుకొన్నాం. కాని నేర్చుకునే వాళ్ళు లేరు. మీరు ఎంత అద్భుతంగా ఎదుగుతున్నారో చూడండి. ఉన్న వనరులను



ఎందుకు ఉపయోగించుకోలేరు? మేము చాలా బాధపడుతున్నాం అంటారు. బాధ పడకండి ఉపయోగించండి. దాన్ని ఏం చెయ్యాలి? కంప్యూటర్ మీద డి.టి.పి చేసి క్లాసువర్కు అని నోట్సు తయారు చేయండి. ఆత్మకథకి నోట్సు తయారుచెయ్యండి. దాని తరువాత గ్లామర్ పుస్తకానికి నోట్సు వ్రాయాలి.

ఈ భాగవతం తర్వాత వారం నుంచి చాలా తీవ్రంగా అయిపోతుంది. అప్పుడిది నేను తిరిగి చెప్పలేను. కాని ఇవి మీకు ఆచరణలో లేకపోతే ఒక్క ముక్క అర్థం కాదు. అందరూ భాగవతం చెపుతుంటారు. వెళ్ళిపోతు ఉంటారు. కాని నా కోరిక ఏంటంటే ఈ ఉన్నవాళ్ళలో కనీసం ఇద్దరు అయినా మారిపోతే చాలు. ఒక వివేకానంద ప్రపంచాన్ని మారిస్తే ఇద్దరుంటే ఎంతలాభం? **నాకు ఇద్దరు దొరికితే చాలు.** మీరు అందరూ మారిపోతే అంతకంటే అదృష్టం ఏముంది. దీనికి ఆరోగ్యం సరి చేసుకోవాలి మీరు. కాలాన్ని చాలా జాగ్రత్తగా సెట్చేసుకోవాలి. డే టుడే టైమింగ్స్ కూడా మీకు చెప్పాను నేను. యమ, నియమ, ఆసన, ప్రాణాయామాలు మీ జీవితాలలో లేకపోతే, మీరు భౌతిక జీవితానికే పనికిరారు. ఇంక ఆధ్యాత్మిక జీవితానికి ఏం పనికి వస్తారు? మీరు పనికిరారు. ఆధ్యాత్మిక జీవితానికి ఇది ఉండవలసినదే. యమ, నియమ, ఆసన, ప్రాణాయామాలు.

ఆసన, ప్రాణాయామ, యమ, నియామాల కొరకు ఖచ్చితంగా రెండు గంటలు మీరు సమయాన్ని వెచ్చించాలి, అనంటే మీకు ఉన్న సమస్యలను బట్టి, ఏ ఆసనం మంచిదో, ఏ ప్రాణాయామం మంచిదో, నన్ను అడగచ్చు. ఆదివారాలప్పుడు మాత్రము. ఆదివారం తప్ప, ఇంక మిగతా అప్పుడు నన్ను మీరు గుర్తించకండి. మీరు నన్ను చూడద్దు. ఆదివారం మాత్రమే చూడండి. మిగతా రోజుల్లో మాటలు లేవు. మరి ఆదివారం నేను మీతో మాట్లాడాలీ అంటే ఇందులో ఏదైనా అనుమానం వస్తేనే కదా, నేను మీతో మాట్లాడేది. లేకపోతే నేనేం మాట్లాడేది మీతో. ఇంకోటి **మౌనంగా ఉండటం వల్లా, అజ్ఞాచక్రంలోనే మీరు ఉండటం వల్లా నేను మీకు ఒకటి గ్యారంటీ ఇస్తున్నాను. ఇది నావ్యక్తిగత గ్యారంటీ. మీకుంటుంబ**

**జీవితంలో ఏ విధమైనటువంటి ఉపద్రవాలూరావు.** అది నా గ్యారంటీ . కాని మీరు మౌనంగా ఉండి అజ్ఞాచక్రం మీద అభ్యాసం చేస్తూ ఉంటే, అసలు గ్యారంటీ ఇవ్వనక్కర్లేదు. మీరే ఆ స్థితికి వెళ్ళిపోతారు.

**మీరు మౌనంగా ఉండి అజ్ఞాచక్రంలో ఉండి జీవించ గలుగుతే, మీ కుటుంబ జీవితంలో వ్యక్తిగతంగా సమస్యలు ఉండవు.** మళ్ళా మా స్నేహితులకి అనకండి. దానికి నేను బాధ్యుణ్ణి కాదు. మీ యొక్క వ్యక్తిగత జీవితంలో, మీ ఇమ్మీడియట్ సర్కిల్‌లో అంటే ఎప్పుడూ మీదీ ప్లస్ ఐదర్ భర్తా, ఆర్ భార్యా. అంతవరకే. దాని తర్వాత పొడిగింపబడకూడదు. దాని తర్వాత మీరు పొడిగించు కోవాలి. అందుచేత మీరు సరిగా ఉంటే, ఆటోమేటిక్‌గా అది మీ పిల్లలకి వెళ్తుంది కదా. కానీ, ఇది ఎన్ని గంటలు మీరు చేస్తే? మీరు ఒక గంట చేస్తే, మీ జీవితంలో ఐదు గంటల బాధ్యత నేను వహిస్తాను. **మీరు జీవితంలో ఐదు గంటలు ఇలా ఉంటే, మీ ఇరవైనాలుగు గంటలకీ నేను బాధ్యుడ్ని అవుతాను.** ఈక్వేషన్ అర్థం అయ్యింది కదా. అందుచేత దీనికి మీరు ఐదు గంటలు ఖచ్చితంగా మీ కాలాన్ని ఇస్తే, మిగతా గంటలు మీరు మీ ఇంటి పన్లూ, అవీ చేసుకున్నా, సమస్యేం లేదు. అర్థమయ్యింది కదా ఇది. ఆ ఐదు గంటలు ఎలా చేస్తారు అన్నది మీరు ఆలోచించుకోండి.

## దేవతలు పరీక్షిత్తుకి బేరం పెట్టారు

ఇంతకీ ఇదంతా ఎక్కడ జరిగిందీ అంటే, పరీక్షిత్తు మహారాజు భాగవత కధ వింటానికి సిద్ధమయ్యాడు. అప్పుడు అక్కడికి శుకమహర్షి వచ్చాడు. శుకమహర్షిని భాగవతం చెప్పమని పరీక్షిత్తు అడగలేదు. ఆయనంతట ఆయనే వచ్చాడు. అది మీరు అర్థం చేసుకోవాలి. అందుచేత ఇక్కడ మీరూ ఆ మానసిక స్థితిలో కూర్చుంటే, శుకమహర్షి వచ్చి చెప్తాడు. ఆయన సశరీరంగానే రావక్కర్లేదు. మీలో ఎవరి మనసులైనా ఉపయోగించుకొని, ఆయన చెప్పదల్చుకున్నది చెప్పేస్తాడు. అదీ అక్కడ,

*శుకం నత్వావదన్ సర్వే స్వకార్యకుశలాసురాః।*
*కధాసుధాం ప్రయచ్ఛస్వగృహీత్వైవసుధామిమాః ॥ (శ్లో 14 )*



శుకమహర్షి భాగవతం చెప్పటానికి సిద్ధమైమ కూర్చుంటే, ...... మనగురించి చెప్తున్నాడు. ఈ స్వకార్య కుశలాః - వారి పనులు చేయించుకోవటంలో చాలా కుశలురట వాళ్ళు. దేవతలు అంటే స్వార్థపరులు అని అర్థమా? వాళ్ళు వచ్చారు. స్వార్థపరులు అయిన దేవతలు. అంటే దేవతలని స్వార్థపరులు అని అంటంలేదు. నీటి పని నీరు మాత్రమే చేయగలదు. గాలి చెయ్యలేదు. అంతేనా? అందుచేత స్వకార్య కుశలాః నీరు, నీరు పనే బాగా చెయ్యగలదు. గాలి, గాలి పనే చాలాబాగా చెయ్యగలదు. అగ్ని, అగ్నిపనే చేయగలదు అని అర్థం. స్వార్థపరులని కాదు అర్థం.

అందుచేతా - స్వకార్యకుశలాః సురాః-దేవతలు -అగ్నిదేవుడు, వాయుదేవుడు, వరుణదేవుడు, పృధ్వి పంచతత్వాలు ఉన్నాయి కదా, ఈ పంచతత్వాలకీ అధిష్ఠితులైన ఆ దేవతా శక్తులు శుకమహర్షి దగ్గరకి వచ్చాయి. వచ్చి ఏమన్నాయి? ఈ భాగవత కధని మాకు ఇవ్వండి. కథామృతాన్ని మాకు ఇవ్వండి, దాని బదులు మీరు ఇది తీసు కోండి అన్నాయి. ఏది తీసుకోండి? నీటి మీద ఆధిపత్యమా, వాయుతత్వం మీద ఆధి పత్యమా, అగ్ని మీద ఆధిపత్యమా? మేము ఇచ్చేస్తాం అన్నారు. కాని వాళ్ళకి ఏం కావాలట? దేవతలకి భాగవత కథామృతం కావాలిట.

అంటే దేవతలకి కూడా దీని మీద చాలా కుతూహలం ఉంటుంది. కుతూహలం మాత్రమే. శుకుడు ఏం చెప్పాడో చూడండి. **పరీక్షిత్తుకి బేరం పెట్టాయి.** ఏమని బేరం పెట్టాయి? మేమేమో భాగవత కథామృతాన్ని వింటాం. నువ్వు ఈ అమృతాన్ని తాగెయ్యి అన్నారు. ఎవరికి ఆ బేరం పెట్టాయి. పరీక్షిత్తుకి. కూర్చున్నాడు కదా పరీక్షిత్తు భాగవత కథను వింటానికి. ఆ కథను మేం వింటాం. నువ్వు వినకు అన్నాయి. చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి ఇక్కడ ఏం జరుగుతోందో. మీరందరూ ఇక్కడ కూర్చొనే ఉన్నారు. మీరు వింటున్నారా? మీ చేతనత్వం వింటే? వింటోందా? మీలో ఉన్న ఆ పంచతత్వాలు వింటున్నాయా? అదీ ఇక్కడ ప్రశ్న. మళ్ళీ చాలా జాగ్రత్తగా అవగాహన చేసుకోండి, వినండి.

## బయాలజిస్ట్ ప్రయోగం

ఒక ప్రయోగం జరిగింది, ఐదారేళ్ళ క్రిందట ... ఒక బయాలజిస్ట్ ఉన్నాడు. నోబెల్ బహుమతికూడా వచ్చింది అనుకుంటా అతనికి, అతనొక ప్రయోగం చేశాడు. ఒక విషయం కనుక ఒక వ్యక్తికి తెలిస్తే, ప్రపంచంలో ఖచ్చితంగా కొంతమంది వ్యక్తులకి అది. తెలియకుండా తెలిసిపోతుందీ అని. నేను చెప్పింది. అర్థమయ్యిందా మీకు. ఇప్పుడు మీకొక విషయం చెప్తున్నాను. నేను మీకు ఈ విషయం చెప్పటం వల్ల ప్రపంచంలో ఇదే విషయాన్ని రేపు ఇంకోడు, ఇంకోడి నోట్లోంచి విన్నా వాడికీ అర్థమవు తుంది. ఇదీ అతను నిరూపించింది. ఎలా నిరూపించాడూ? ఒక ప్రయోగం చేసాడు

ఆఫ్రికాలో ఒక ఊరుని తీసుకున్నాడు. పజల్స్ ఉంటాయి తెలుసు గదా! మనిషి ఇక్కడ నుంచి బయలుదేరి ఇక్కడకి వెళ్ళాలి అని. ఈ చందమామ వాటిలో వేస్తూ ఉంటాడు దారి తెలపండీ అని. ఇంకో పజల్ ఏం తీసుకున్నాడు? ఒక బొమ్మ ఉంటుంది, అందులో ఒక మనిషి ఆకృతి దాగి ఉంటుంది. ఆ మనిషిని నువ్వు గుర్తు పట్టగలవా? ఆఫ్రికాలో, చదువూ అదీ బాగా రానటువంటి ఒకఊరికి వెళ్ళారు వాళ్ళు. ఆ బొమ్మని చూపించారు. మనిషి ఆకృతి ఇందులో ఉంది, నువ్వు గుర్తు పట్టగలవా అన్నారు. మామూలుగానే మనం గుర్తుపట్టలేం. ఇంక వాళ్ళేం గుర్తుపడ తారు? ఒక వెయ్యిమందికి చూపిస్తే, ఒక పదిమంది కాబోలు గుర్తుపట్టగలిగారు. తరవాత ఏం చేసాడు? లండన్‌లో ఒక సమయం పెట్టుకున్నాడు, టీ.వీ.లో అదే బొమ్మని ప్రొజక్ట్ చేసాడు. చేసి అందులో దాగి ఉన్న బొమ్మ ఉంటుంది కదా దాన్ని హైలెట్ చేసాడు కలర్స్‌లో. అంటే టీ.వీ. చూస్తున్న వాళ్ళందరికీ రెండు బొమ్మలు వచ్చాయి. ఒకటి ఏంటీ. అసలైనటువంటి బొమ్మ, లుప్తంగా ఉన్నటువంటి బొమ్మా. రెండోది- బొమ్మ స్పష్టంగా కనిపిస్తోన్నటువంటి బొమ్మ. అది ఎందుకు టీ.వీ.లో చూపిం చారో కూడా చాలా మందికి తెలీదు. అలా ప్రణాళిక చేసాడు అది. అంటే ఒక రోజు ఒక రెండు నిమిషాలపాటు, కొన్ని లక్షల మంది ఆ బొమ్మ చూసారు. దాని తరవాత రోజు మళ్ళా అదే ఆఫ్రికన్ ఊరికి వెళ్ళాడు. వెళ్ళి ఇప్పుడు బొమ్మని చూపించాడు.



వందలో అరవై ఐదుమంది చెప్పగలిగారు. ఆ బొమ్మ ఎక్కడుందో. అంటే అర్థం ఏంటి? మీరు వినకపోయినా, మీలో ఉన్నటువంటి పంచ దేవతల చేతనత్వం ఈ విషయాన్ని గ్రహిస్తుంది. ఉదాహరణ అందరికీ అర్థమయ్యిందా, లేదా?

మళ్ళా చెప్తున్నాను, జాగ్రత్తగా వినండి. మీ కళ్ళు చూస్తున్నాయి, మీ చెవులు వింటున్నాయి. కళ్ళు ఎందువల్ల చూస్తున్నాయి. అగ్ని దేవుడు వలన. చెవి ఎందువలన వింటోంది. ఆకాశతత్వం వల్ల. స్పర్శ - వాయుతత్వం వల్ల, రుచి- జలతత్వం వల్లా, వాసన- పృధ్వీ తత్వం వల్లా, ఈ దేవతలు అందరూకూడా ఇది వినాలనుకుంటాయి. ఇవి వింటున్నాయి. కాని మీరు వింటంలేదు. అదీ జరిగిందక్కడ. టీ.వీ.లో అసలు ఆ బొమ్మ ఎందుకు చూపిస్తున్నాడో, ఆ బొమ్మ యొక్క అంతరార్థం ఏమిటో చూస్తున్న వాళ్ళకి తేలీదుగా. కాని ఏవి పట్టుకున్నాయి? వాళ్ళ కళ్ళు పట్టుకున్నాయి, వాళ్ళ చేతులు పట్టుకున్నాయి, వాళ్ళ ముక్కులు పట్టుకున్నాయి, వాళ్ళ జలతత్వం పట్టుకుందీ. ఇది సర్వజనీనమైంది కనుక, ఆఫ్రికన్ అడవులలో ఉన్నటువంటి వాళ్ళ శరీరాలు కూడా, ఈ రహస్యాన్ని పట్టుకోగలిగాయి.

అందుకు సామూహికంగా వినండి అనేది. మీరు ఒంటరిగా పట్టుకోకపోయినా పదిమంది కలిసి వింటూవుంటే మీకు తెలిసినా, తెలియకపోయినా ఇన్ని రకాలైన టువంటి చేతనత్వం మీలో దూరుతుంది. అది. ఆ రహస్యాన్ని చెపుతున్నాడు అక్కడ. వైజ్ఞానికమైనటువంటి సైకలాజికల్ ట్రూత్ అది. చెప్పకనే భాగవతంలో ఇది చాలా స్పష్టంగా చెప్పబడి వుంది. (చూడండి ఇక్కడ భాగవతంలో) - నువ్వు వినకపోయినా పరీక్షిత్ మహారాజా మేము వింటాము. పంచతత్వాలు వినేస్తాయి. విన్న తర్వాత ఇంకోడు ఎవడో దానికి తగిన మానసిక స్థితిలో వుంటాడు. వాడు అక్కడ నుంచి లాగేసు కుంటాడు. ఆ విధంగా అయినా మీరు మంచి పని చెస్తున్నట్లే. కాని ఇంత అవస్థపడి ఇంకోడు ఎవడికో ఉపయోగపడటం వంటి విశాలత్వ భావం మీరు పెట్టుకోకండి. ఇక్కడ మీరు పరమ స్వార్థపరులు అయిపోండి. మీరే నేర్చుకోండి.

## మీరు ఈ సంపూర్ణ సృష్టికి మూలం అవుతారు

అందుచేత శుకమహర్షి ఏం అన్నాడో వినండి......భాగవతం కథ ఎక్కడ? అమృతత్వం ఎక్కడ? మణి ఎక్కడ? గాజు ముక్క ఎక్కడ? అన్నాడు. దేవతల దగ్గిర ఉండే అమృతమును గాజు ముక్కతో పోల్చేడు. భాగవతాన్ని మణితో పోల్చాడు. అంత అద్భుతమైన జీవితాన్ని మార్చేసే కథలు మీరు వింటున్నారు. జీవితాన్ని మార్చు కోవాలని నిర్ణయం తీసుకోండి దయచేసి. ఎందుకంటే ఈ మణి గనుక మీరు పట్టు కోగల్గితే **భాగవతం అనే మణిని గనుక మీరు తీసేసుకోగలిగితే మీరు ఈ సంపూర్ణ సృష్టికి మూలం అవుతారు.** హాస్యంగా ఏం చెప్పటంలేదు నేను, జరగబోయేది చెప్పుతున్నా. మీరు డాక్టరైతే రోగనివారణ ఎల్లా చేయగలుగుతారో, భాగవతాన్ని మీరు అర్థం చేసుకుంటే, సంపూర్ణ సృష్టికి శ్రీకృష్ణుడు ఇప్పుడు ఎలా మూలకారణం అనుకుంటున్నామో, రేపు మీరు మూలకారణం అని ప్రపంచం అంతా గుర్తిస్తుంది.

ఇలా ఆలోచించి శుక మహర్షి దేవతలతో మీకు చెప్పను అన్నాడు. అంటే దేవతలకి కూడ లభ్యం కానటువంటి కథ మీకు దొరికినా, నాకు ప్రతి ఆదివారము సమయం దొరకటం లేదంటే, మీరు ఎంత గొప్పవాళ్ళో అర్థం చేసుకోండి. దేవతలకి కనీసం శుకమహర్షిని అడుగుదాము అన్నా సమయం దొరికింది. మరి మీకు దొరుకు తుందో, లేదో......ఈ భాగవతం కథ దేవతలకి కూడ చాలా కష్టసాధ్యం....ఆ రాజు ముక్తి పొందటం చూసి ఏంటి ముక్తిపొందటం. భాగవతం కథను విని ముక్తిపొందటం అంటే చచ్చిపోవటం అని అర్థం చేసుకోకండి. బాధ్యతల నుంచి కర్మబంధాల నుంచి స్వతంత్రం పొందటం. జగద్గురువులాగ జీవించగలగటం. శిరిడిసాయి లాగ జీవించ గలిగే స్థితి. ముక్తిపొందటం అంటే చచ్చిపోవటం కాదు. చచ్చిపోయిన వాడు ఎవడికీ పనికి రాడు. ప్రపంచానికి ఉపయోగపడే స్థితిలో జీవించగలిగే స్థితి, పరిక్షిత్తుకి వచ్చుట చూసాడట. ఎవడు చూసాడు?

బ్రహ్మ దేవుడి ఆశ్చర్యం:-

ధాతా అంటే బ్రహ్మ - అస్మితా అంటే ఆశ్చర్యపోయాడు. బ్రహ్మకూడా ఆశ్చర్య



పోయాడు. చాలా జాగ్రత్తగా, ఆ మాటల్ని, మీరు అర్థం చేసుకోండి. బ్రహ్మ ఎవరు? సృష్టికర్త. వాడు ఆశ్చర్యపోయాడు. సృష్టికర్త ఎప్పుడు ఆశ్చర్యపోతాడు- సృష్టిలోని భాగము అది కాకపోతే. అవునా కాదా. మీరు అది గుర్తుచేసుకోండి. అర్థం చేసుకోండి. ఈ భాగవతము, సృష్టిలోని భాగము కాదు. దాని గురించీ, మీరు చర్చ చేసుకోవాలి. ఆ ప్రశ్న వేరుగా వేసుకోండి. **భాగవతము సృష్టిలోని భాగము కాదు.** ఎందువల్ల? వివరించండి. ఇరవై ఐదు మార్కుల ప్రశ్నను. నోట్ చేసుకోండి. పాయింటు అందులోనే చెప్తున్నాడు. **బ్రహ్మ దేవుడికి ద్వావర యుగాంతంలో, పరీక్షిత్తు ఈ కథవిని, శుక మహర్షి ద్వారా ముక్తి చెంది పోయాడే అనలు ఈ నియమాన్ని నేను పెట్టలేదే. నా యొక్క ప్రపంచ నియమావళిలో, నా రాజ్యాంగంలో ఇది లేదే. వీడు ఎలా ముక్తి చెందిపోయాడు ఈ కథ వినగానే. నేను తపస్సులు చెయ్యాలన్నాను, అగ్నిహోత్రాలు చెయ్యాలన్నాను, జపాలు చెయ్యాలన్నాను, దానాలు చెయ్యా లన్నాను, యజ్ఞ దాన తపః కర్మా..... అని స్తోత్రం చెప్పించాను, జగద్గురువు చేత. వీడేంటీ కథవినే ముక్తి చెందిపోయాడని ఆశ్చర్య పోయాడట.** అప్పుడు ఏం చేశాడట?

సత్యయుగంలో, సత్యలోకంలో, 'సత్యలోకే తులాంబద్వా'- తులా అంటే బేలన్స్. బద్వా అంటే కట్టాడు. సత్యలోకంలో త్రాసు తెప్పించి కట్టాడట. పోనీలేండి. నేనే అనవసరంగా విసుక్కుంటాననుకుంటా. సత్యలోకంలోనే వస్తువులు దొరకలేదు, తెప్పించారట. సరే, ఇక్కడ మీరు గాబరాపడక్కర్లేదు. అమ్మయ్యా, చూశారా భాగవతం చదివితే ఎంత లాభమో. ముందు టెన్‌షన్స్ పోతాయి. ఇక్కడ దొరకలేదు, ఇక్కడలేదు, లేదో, లేదంటమే తప్పా. మీరు ఏం చెపుతారు ఈసారి ఏదైనా నేను అంటే, సత్యలోకే తులాంబద్వా. సత్యలోకంలో బ్రహ్మగారూ బేలెన్స్ తెప్పించి కట్టారుట. మిగతా అన్ని సాధనాలూ, ముక్తిపొందటానికి కావలసిన సాధనాలు అన్నీకూడా ఒకవైపు పెట్టారుట ......గౌరవేణా అంటే బరువు. భాగవతం యొక్క బరువు వల్ల, ఇవన్నీ తేలికైపోయాయి ఇలాగ. అందుచేత మీలో ఉన్నటువంటి జపము, మీలో ఉన్న తపమూ, ఇవన్నీ ఏమైపోవాలీ, ఆకాశంలోకి వెళ్ళిపోవాలి. భాగవతం మీ బుర్ర మీద పడాలి.

ఈ భాగవత జీవిత విధానం కనుక మీరు జీవిస్తే ...అందుకే, శిరిడీ సాయి చాలా సార్లు చెప్పాడు. నన్ను మంత్రాలు అడక్కండీ, నన్ను జపవిధానాలు అడక్కండీ, ఉపవాసాలు చెయ్యద్దు మీరు అనేవాడు. ఆయనలా చెప్పాడు అంటారు తప్ప అలా భాగవత జీవితం జీవించరు. ఆయనా- ఆయనలాగ మీరు జీవిస్తే ఇది వద్దు అన్నాడు. ఇక్కడే, చెప్తున్నాడుగా. శ్లోకంలోనే ఉంది. ఇక్కడా శిరిడీసాయి మంత్రం ఉపదేశించలేదు. ఒకావిడ ఒత్తిడి చేసింది సాయి మంత్రోపదేశం చేస్తే తప్ప, భోజనం చెయ్యనని. తల్లీ నువ్వు తినెయ్యి, నా గురువే నాకు మంత్రం చెప్పలేదు అన్నాడు. పాపం ఆయన మాత్రం ఏం చేస్తాడు. ఆయన గురువు ఆయనకి మంత్రం చెప్పి ఉంటే, ఆయన ఇంకోడికి మంత్రం చెప్పి ఉండేవాడు. కాని కారణం ఏంటి అసలు.

ఆయన జీవిత విధానము, అ గురువుల జీవిత విధానము. ఆయనదే కాదు. గురుసత్తా, **గురువరంవరలో ఉన్నటువంటి ప్రతీ వారి జీవితవిధానమూ గూడా, ఈ జప, తప, న్యాస, కరన్యాస, అంగన్యాసాలు మీరు ఏవో చేస్తారే ఇవన్నీ అనవసరం. దానికీ భాగవతీ జీవిత విధానం జీవిస్తే, మిగతావన్నీ గూడా, అం** ఫట్........బ్రహ్మ తెలివైనవాడు కనుక ముందు ఆశ్చర్యపోయాడు. ఋషులకు కొంచెం తక్కువ తెలివితేటలు.

ఇప్పుడు ఋషులు ఆశ్చర్యపోయారు.........మేము ఇన్ని తపస్సులు చేశామూ, ఇన్ని ధ్యానాలు చేశాం. ఒంటి కాలు మీద నుంచున్నాం. ఎందుకూ, భాగవతం ఒకటీ చేస్తే సరిపోదా, అని వాళ్ళు అర్థం చేసుకొన్నారట. ......చివరకు ఋషులు, దేవతలు, బ్రహ్మ అందరూ కలసి ఒక నిర్ణయానికి వచ్చారు.

## అతీతశక్తి తెరవబడితే తప్ప ఈ దివ్యచేతనత్వం విప్పారదు

పఠనాత్ చదివినా, శ్రవణాత్ విన్నా, చదివినా, విన్నా, వైకుంఠ ఫలదాయకం. ఈ వైకుంఠం అంటే ఏమిటో మనం తరవాత చర్చిద్దాం. మన శిరస్సులో ఒక ప్రత్యేక మేటరు ఉంది. దాన్నే వైకుంఠం అంటాం మనం. **మన బ్రెయిన్‌లో ఉన్న అతీతశక్తి తెరవబడితే తప్ప, మనకీ, ఈ దివ్యచేతనత్వం విప్పారదు.** దివ్యం దాదామితే



చక్షుః - అంటారు కదా. దివ్యచక్షువులు రావటానికీ, ఈ వైకుంఠం అనేటటువంటిది తెరుచుకోబడాలి మనకి. **అది తెరవబడటానికీ, భాగవతం విన్నా, చదివినా, చాలు.** ఒక వారంలో పూర్తి అయిపోవాలి. నియమమది.

ఒక వారంలో, ఈ మొత్తం పుస్తకం పూర్తి అయిపోవాలి. ఈ మొత్తం పుస్తకం వారంలో ఎలా అవుతుంది మాస్టారూ. పిల్లలని అడగండీ. ఇంటర్మీడియట్ అదీ వాళ్ళు చదువుతున్నప్పుడు, ఫిజిక్స్ వాటిల్లో వాళ్ళ పుస్తకాల సైజు ఒకసారి. పరీక్షకి రెండు రోజులు సెలవు ఇస్తారు. మూడు గంటల్లో జవాబియ్యాలి. మీకు వారం రోజులు సమయం ఇస్తున్నాను. అసలు గురువుల యొక్క అ దయార్ద్ర హృదయం మీకు అర్థం కాదు. మీకు వారం రోజులు కాలాన్ని ఇస్తున్నారు. ఒక పుస్తకానికి. పిల్లలకి ఒక్క ఫిజిక్సే కాదు, కెమిస్ట్రీ ఇంకా చాలా సబ్జెక్ట్సు ఉంటాయి. అందుచేత చదవాలనే కోరిక ఉంటే, వారం రోజుల్లో ఏంటీ, మూడు గంటల్లో చదివేయవచ్చు. కానీ వారం రోజులు కాలాన్ని ఇచ్చాడు. ఎందుకో మనం అర్థం చేసుకుందాం.

మన శరీరంలో ఉన్న ఏడు చక్రాలకీ, సరిగా మస్తిష్కంలో 7 వ చక్రం ఉంటుంది. ప్రాణాయామాలు ఆ ఏడు చక్రాలు మీదా ప్రసరిస్తాయి. ఆసనాలు ఆ ఏడు చక్రాల మీదా ప్రసరిస్తాయి. మీరు ఆసనాలు చేస్తూన్నప్పుడు, మీకు తెలిసినా తెలియకపోయినా, మస్తిష్కంలోకి వెడుతుంది. **మెల్లిమెల్లిగా, ఏ రోజుకి తగిన గ్రంథి ఆ రోజుకి తెరవబడుతూ ఉంటుంది. ఏడు రోజులు చక్రంలాగ కొన సాగుతూ ఉంటే, ఏదో ఒక ఏడు రోజుల్లో, మస్తిష్కం తెరవబడుతుంది.** అందుకే, ఏడో రోజే చదువుతున్నానూ, మిగతా అరు రోజులూ, మిమ్మల్ని అభ్యాసం చెయ్యమనేది ఎందుకంటే, ఈ తరంగాలను వింటున్నారు మీరు. మీరు పట్టుకున్నా, పట్టుకోక పోయినా, మీ యొక్క చెవులూ, కళ్ళూ, ముక్కూ, చర్మమూ పట్టు కుంటున్నాయి. అవి లాగేస్తాయి. మీరు ఆసనాలు వేస్తున్నప్పుడు, ప్రాణాయామం చేస్తున్నప్పుడూ వాటి పని అవి చేసేసుకుంటాయి. వారం రోజుల పాటు ఆ ప్రభావం వస్తూంటుంది. మీరు ఆ ఆసన, ప్రాణాయామాలు చేస్తే.

చెయ్యకుండా వెళ్ళిపోతుందా మాస్టారూ? ఏమో, క్షణంలో వెళ్ళిన వాళ్ళు ఉన్నారు. మీరు అంత గొప్ప వాళ్ళు అవుతే, అసలు గొడవే లేదూ. మీ దగ్గరకి మేమే వస్తాం. అందుచేత రోజూ అభ్యాసం చేసుకోండి ఆసనాలు. ఖచ్చితంగా అరగంట మినిమమ్ ఉండాలి. ఖచ్చితంగా అరగంట ప్రాణాయామం ఉండాలి. మీకు స్ఫూర్తి ఇవ్వటానికి నేనొక మాట చెప్తున్నాను.

## ఐదు గంటల కాలాన్ని ఇవ్వండి

జిందాల్ వెళ్ళిన దగ్గర్నుంచీ ఈనాటి వరకూ ప్రాణాయామం ఎలా చేసుకోవాలో నాకు అర్థం కావటంలేదు. అందుచేత మీరు గాభరాపడిపోకండీ. అభ్యాసం చెయ్యండి. సరిగా వచ్చిందని మాకెలా తెలుస్తుంది మాస్టారూ? మా తాతగారు ఒక కథ చెప్పేవారు. మొదటిసారి కాన్పుకికూతురు పుట్టింటికి వచ్చింది. పడుకునే ముందు తల్లితో చెప్పింది అమ్మా నొప్పులు వస్తే లేపమని. అంటే వాళ్ళ అమ్మ ఏమందీ. నీకు నెప్పులు వస్తే నేను లేపక్కరలేదూ, నువ్వే నన్ను లేపుతావు. నేను నిన్ను తీసుకెళ్తానని అంది. అందుచేత మీకు ప్రాణాయామం సరిగా కుదిరిందని ఎలా తెలుస్తుందంటే, మీరు చెప్పక్కర్లేదు. మీకే తెలిసిపోతుంది అదికుదిరిందో లేదో. తెలియలేదు అంటే అర్థం ఏంటీ? రాలేదు. అభ్యాసం చేసుకోండి. నాకు రాలేదు ఇప్పటికీ, అందుచేత మీరు నిరాశ చెందక్కర్లేదు.

అందుచేత మీకు రాదు అనేం కాదు. మీకు ఇవాళే వచ్చేయ-వచ్చేమో, ఎవరికి తెలుసు ఎవరు ఏ స్థితిలో ఉన్నారో. ఎట్టి పరిస్థితుల్లోనూ మీరు నిష్ఠ, సబూరి గుర్తుంచుకోండి. నిష్ఠ, సబూరి. నిష్ఠ, సబూరి. నిష్ఠ ఏంటీ అంటే, **భాగవతంలో, లేకపోతే మహర్షులు చెప్పింది నరైనది. వాళ్ళు చెప్పింది చేస్తే ఫలితాలు వస్తాయి అనేటటువంటి నమ్మకం. సబూరీ ఏంటీ, చేసుకొంటూపోవటమే.**

ఓపిక, ఓపిక......అది చేసుకుంటూ పోతూ ఉంటే, ఎప్పుడో అప్పుడు అది ఖచ్చితంగా వస్తుంది. శిరిడీసాయికి ఎన్ని సంవత్సరాలు పట్టింది? మరి మనకి పన్నెండు జన్మలు పట్టనివ్వండి. దానికేముంది. కానీ, ఆ ఓపిక ఉంచుకోండి. నేను చెప్పిందీ గుర్తుంచుకోండి ఎప్పుడూ గూడా. అన్ బేలన్స్‌డుగా మీ జీవితాలని, గంగపాలు



చేసుకోకండి. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోండి. మీ ఇంటి పనులకి కాలాన్నివ్వండి, **దీనికి ఐదు గంటలు కాలాన్నిస్తే, మీ బాధ్యత నాదీ అన్నాను. ఐదు గంటలు కంటే ఒక్క నిమిషం తక్కువ ఇచ్చినా మీ బాధ్యత నాది కాదు. ప్రతీ రోజూ అంటున్నాను నేను.** మీ బాధ్యత అంతా నేను తీసుకోవాలి కాని మీరు ఐదు గంటలు ఇవ్వలేనంటే, మరి ఈ వ్యాపారం ఏం బాగోలేదు. మరి వ్యాపారం అంటే కొంచెం నాకూ లాభసాటిగా ఉండాలిగా, అవీ చూసుకోవాలి. గురువు గారి ఆత్మకథ, ఆ ఈక్వేషనే చెప్తుంది. రోజుకి నూట ఇరవై ఐదు గంటలు. ఆ ఈక్వేషను గురించే చెప్తున్నాను నేను. నేనేంటి చూసుకొనేది పాపం ఆయన అక్కడ నుంచొనే ఉన్నాడు. ఆయన కూర్చోవటంకూడాలేదు. నేనైతేకూర్చొని ఐనా ఉన్నా. ఆయన్ని నిలబెట్టేసాం. నిలబడే ఉన్నాడుగా, పాపం. నెక్స్ట్......

ప్రెసిడింట్ అనే రోగం, భాగవతం రాసిన వాళ్ళకి కూడా ఉంది. ప్రెసిడింట్ అంటే ఏంటో తెలుసా, ఇది వరకు అలాగ ఏదైనా జరిగిందా అని. కాటన్ దొర కట్టించిన రాజమండ్రిలోని ధవళేశ్వరం ఆనకట్ట తెగింది. నా స్నేహితులు కొంత మంది జూనియర్ ఇంజనీర్స్‌గా ఉన్నారు. మీకు తెలుసా మాస్టారూ మీరు చెప్పినట్టే చేశాం అన్నారు వాళ్ళు. ఏం చేశారుట వాళ్ళు?ఆనకట్ట పగిలిపోగానే, లైబ్రరీకి వెళ్ళారు. ఎందుకు లైబ్రరీకి వెళ్ళారు. ఆనకట్ట తెగిపోతే, ఇది వరకు ఎప్పుడైనా, ఎవరైనా చేశారా, ప్రెసిడింట్ ఉందా, దాన్ని బట్టి చేసేద్దామని. దానికి ఎక్కడ దొరికింది పాయింటు వాళ్ళకి, అంటే ఇక్కడ దొరికింది. దీన్ని బట్టి వాళ్ళు ఆచరణ చేశారు. భాగవతం చదివి ఉంటారు వాళ్ళు. అప్పుడు నేను చదవలేదు. నేనూ ఏం చేసానంటే, ........

## లాభం పొందిన వాళ్ళు సృష్టి కంటే ముందరే ఉన్నారు

ఈ సనక సనందాదులు ప్రేమతో, దయాపూరిత అంతరంగముతో నారదుడికి ఇది చెప్పారు. అప్పుడూ వాళ్ళు అలాగే లాభం పొందారు. నారదుడూ, ఇప్పుడు పరిక్షిత్తు కూడా అలాగే లాభం పొందుతున్నారు. అందుచేత ఈ లాభాలు మొదటసారి మీరే పొందటంలేదు. మీరు వెంటనే ప్రశ్న వేస్తారు కదా, గాయత్రి చేస్తే నీకేం లాభం

అయ్యిందని. అడుగుతారా, అడగరా ఎవ్వరైనా గాయత్రి చెయ్యటం మొదలెడితే నాకు దానివల్ల తల నొప్పి వచ్చిందని చెప్తాడు వీడు. నేనువద్దని చెప్పానా? వినలేదు అందుచేత మీకు తలనొప్పి వచ్చింది. అందుచేత ప్రపంచంలో తల నొప్పివచ్చిన వాళ్ళు అందరూ గాయత్రి ఉపాసకులే. మన మూర్ఖత్వం అది.

కానీ ఇక్కడా **భాగవత శ్రవణం వల్ల, లాభం పొందిన వాళ్ళు** ఎవ్వరైనా ఉన్నారా అంటే, **సృష్టి కంటే ముందరే ఉన్నారు.** మీరు చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. సనక సనందాదులూ, సృష్టికంటే ముందు ఉన్నారు. నారదుడూ, సృష్టికంటే ముందు ఉంటాడూ. సృష్టి లయమైపోయిన తర్వాత బ్రహ్మ యొక్క నిశ్వాసతో పాటు నారదుడు గూడా లోపలికి వెళ్ళిపోతాడు. అక్కడ అలా ఉంటాడు. ప్రళయంలో, లయమైపోయి ఉంటాడు. మళ్ళా శ్వాస బయటికి వచ్చినప్పుడు నారదుడు గూడా యధాతథంగా బయటకి వచ్చేస్తాడు. కరిమింగిన వెలగ పండులా అన్నమాట. అంటే నారదుడూ వెలగపండూ ఒకటే ఈ విషయంలో. అర్థమైందా ఏంచెప్పానో.

**ఈ ప్రెసిడింట్ ఏంటి అంటే - భాగవతం విన్న వాళ్ళు, ఇప్పుడు ఏ రూపంలో ఉన్నారో, అదే రూపంలో, ఎప్పుడూ ఉంటారు. వాళ్ళ రూపంలో మార్పుండదు.** ఇది చాలా మంచి మాట చెప్పారు మాస్టారూ, అందుచేత ఈ జన్మలో నేను చదవనూ, ఈ ముసలి రూపం ఇదీ నాకు నచ్చలేదు. మరుజన్మలో చాలా అందమైన రూపం తెచ్చుకుని, ఆ రూపంతో నేను భాగవతం వింటాను. అప్పుడు అలాగే ఉండిపోతాను. భయపడిపోకండీ, **భాగవతం వింటమే మీకు వస్తే, రూపాన్ని మీరు మార్చేసుకోవచ్చు. మీరు ఏ రూపంలో ఉండదల్చుకుంటే, ఆ రూపంలో ఉండచ్చు.**

సాయి నిరూపణ చేసాడు కదా. దోమరూపంలో ఉండచ్చు, పిల్లి రూపంలో ఉండచ్చు, దేవతల రూపంలో కూడా ఆయన అనేకమందికి, అనేక రూపాలలో దర్శనం ఇచ్చాడు కదా. దత్తుడు రూపంలో ఇచ్చాడు. రాముడు, కృష్ణుడు రూపంలో ఇచ్చాడు. అర్థమయ్యింది కదా, అందుచేత ఈ భాగవతం యొక్క ప్రభావం అర్థం



చేసుకోండి. మీరు ఏ రూపంలో కావాలంటే, ఆ రూపంలో చిరంజీవులుగా అలా ఉండిపోతారు మీరు. ప్రెసిడెంట్ ఉందా, కావలసినన్ని ప్రెసిడెంట్స్ ఉన్నాయి. అందుచేత ఇది ఏదో అంటెస్టెడ్ మందు కాదు మీ మీద ప్రయోగం చేయటానికి. యుగ యుగాలుగా, చాలా మంది దీన్ని, అనుభవంలోకి తెచ్చుకుని, ఆ చిరంజీవత్వం పొందిన వాళ్ళు చెప్పినటువంటి ఉదాహరణ.

చాలా ముఖ్యమైతే మళ్ళీమళ్ళీ వినాలి కదా. నారదుడు మళ్ళీ మళ్ళీ విన్నాడు. బ్రహ్మ ముఖంతో మొదట విన్నా, మళ్ళీ సనకాదుల ద్వారా విన్నాడు. అలా చాలా సార్లు విన్నాడు. ఇది ఎంత మంచిదీ అంటే, నారదుడు లాంటి వాడే మళ్ళీమళ్ళీ వింటున్నాడు. నారదుడు స్థితి ఏమిటో మీకు తెలుసుకదా. ఎవడు నారదుడు? మీ గురువు. కాదా, మరి మీ గురువునే మీరు మర్చిపోతే? అందుచేత నారదుడు ఎవరు? నా గురువు. తరవాత మనందరి గురువు అది వేరే విషయం.

**ఈ నారద స్థితి ఏమిటి అంటే, యుగయుగాలుగా ఈ భాగవతాన్ని వింటూనే ఉంది. యుగయుగాలుగా ఈ భాగవతాన్ని మాత్రమే చెప్తోంది.** నారదుడు ఎప్పుడు చెప్పినా భాగవతమే చెప్తాడు.అది గుర్తుంచుకోండి. ఓం నమో భగవతే వాసుదేవాయా అన్నా, నారాయణ, నారాయణ, నారాయణ అన్నా ఆ భాగవతం మాత్రమే చెప్తాడు నారదుడు. ఆ భాగవతాన్ని వింటాము అనేటటువంటి వాళ్ళకి, వాళ్ళు ఇష్టపడినా, ఇష్టపడకపోయినా నారదుడే గురువు. వింటున్న వాళ్ళకీ, విన దల్చుకున్న వాళ్ళకీ, రేపు వినబోయే వాళ్ళకీ, భూత, భవిష్య, వర్తమాన కాలంలో ఎవరు ఎప్పుడు భాగవతం విన్నా, వాళ్ళకీ ఆ గురు చేతనత్వం యొక్క సంబంధం నారదుడు ద్వారానే దొరుకుతుంది. అందుచేత ఒక్కసారి కళ్ళు మూసుకుని నారదుణ్ణి ఊహించుకోండి. నిరంతరం ఈ బొమ్మలు మీతోపాటూ తీసుకుంటూ ఉండండి. కళ్ళు మూసుకోండి. గాయత్రి మంత్రం మూడుసార్లు చేసుకుందాం నారద దీక్షతో -

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వ రేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్- ఓం భూర్భువః స్వః తత్సవితుర్వ రేణ్యం భర్గోదేవస్య ధీమహి

ధియోయోనః ప్రచోదయాత్ - ఓం భూర్భువః స్వః తత్సవితుర్వ రేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్

ఆశ్రమంలో పూర్తిగా మౌనంగా ఉండండి. సౌజ్ఞలు కూడా వద్దు. ఏదైనా విషయం మాట్లాడుకోవాలంటే అలా బయటకి వెళ్ళి మాట్లాడుకొని వచ్చేయండి.



## ఆసురీ సంపత్తి అంటే?

ఈ కలికాలములో జీవులు అసురుల తత్వాన్ని పొంది ఉన్నారు. జీవములు అంటే ప్రాణం ఉన్నటువంటి ప్రతీవ్యక్తి అని. అంటే, మనమందరం అని గుర్తుంచు కోండి. చెప్పేవాడు, వినేవాడు, గురువులు శిష్యులూకూడా వీళ్ళందరూకూడా ఆసురీ సంపత్తిలోనే ఉన్నారు అని గుర్తుంచుకోండి. మనం భక్తులం ఏం కాదు, మనమేమీ మహాత్ములం కాదు. మనము అంటే అందరం. గురువులతో సహా. అది ఈ యుగ లక్షణం. ఆ యుగ లక్షణాన్ని మీరు మర్చిపోవద్దు. మిమ్మల్ని మీరు గొప్పవాళ్ళనుకునే ప్రమాదంతో వస్తోందంతా. భాగవతం వింటున్నాం, అది వింటున్నాం. మీరు చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోండి, జీవశ్చాసురతాం గతః -ఆసురీ సంపత్తి మనలో చాలా ఎక్కువ ఉన్నది. (మనోజ్ఞ)

రెండు రకాలైన ఆసురీ సంపత్తులు ఉన్నాయి. ఒకటి రావణాసురుడిది, ఒకటి కుంభకర్ణుడిది. కుంభకర్ణుడు నిద్రపోతూవుంటాడు. రావణాసురుడు ఓవర్ యాక్టివ్. **వీళ్ళ ఇద్దరికీ మధ్యున్నటువంటి బేలెన్స్ విభీషణుడు.** అందుచేత మీరు రావణాసురులయినా అయ్యుండాలి, కుంభకర్ణులయినా అయ్యుండాలి. భాగవతం చెప్తున్న ఆ పాయింటు మీరు అర్థం చేసుకోండి. విభీషణ స్థితి వచ్చినా మీరు అసురులే. అది కూడా గుర్తుంచుకోండి. మళ్ళీ రాముడు, రావణాసురుడిని చంపటానికి వచ్చినప్పుడు, విభీషణుడికి, రాముడికి సయోధ్య కుదురుతుంది. అంత వరకు విభీషణుడుకూడా అసురుడే. అందుచేత మనతత్త్వం ఎక్కడుంది అన్నది చూసుకోండి.

నాకు తెలిసి మానవజాతికి, ముఖ్యంగా భారతదేశంలో ఉన్నటు వంటి వాళ్ళందరూ కుంభకర్ణులే. కుంభకర్ణుడు అంటే ఏంటి అంటే నిద్రపోతున్న వాడు. **నిద్రపోవటం అంటే ఏంటి, ఇది మంచిది కాదు అని తెలిసినా అది నువ్వు చేస్తున్నావు అంటే, నిద్ర పోతున్నావు అని అర్థం.** మీరు చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి అది. అక్కడ ఆ భాగవతంలో ఈ శ్లోకము పూర్తిగా మనకి సంబంధించిన శ్లోకం. కాని అక్కడే ఆశ్రమంలో చెపుతున్నాడు, ధైర్యంకూడా చెపుతున్నాడు. అందుచేత

ముందు ఈ మూడు లక్షణాలు గుర్తుంచుకోండి.కుంభకర్ణుడు అయినా అయివుంటాం మనం, ఎవరు? ఐదుగురు తప్ప మిగతా వాళ్ళు అందరు కుంభకర్ణులే. ఐదుగురు మాత్రమే కుంభకర్ణులు కారు.

విజయవంతమైన వ్యాపారవేత్త రావణాసురుడు. ఓవర్ యాక్టివ్. విజయ వంతమైన వ్యాపారవేత్త. ప్రతిరోజూ దుకాణం తెరిచి కూర్చునేవాడు కుంభకర్ణుడే. ఆవేదన ఇంకా ఇంకా నేను ఎదగాలి, అనే ఆవేదన లేని ప్రతి ఒక్కడూ కుంభకర్ణుడే. రాజనీతిజ్ఞుడు, పొలిటికల్ పార్టీలో చేరిపోయి నాలుగు నినాదాలు ఇచ్చేసి కూర్చునే వాడు, రాజనీతిజ్ఞుల్లో కుంభకర్ణుడు. నేను ఖచ్చితంగా ఆ స్థితికి ఎదగాలి. ఆ స్థితిని కాపాడుకోవాలి. అని చెప్పుకునేవాడు రావణాసురుడు. ఆసురీ సంపత్తి అది. .మన అందరం కూడా ఆ ఆసురీ సంపత్తి ఉన్నవాళ్ళమే. దైవీ సంపత్తి లేదు. ముందు దీన్ని చాలా చాలా చాలా జాగ్రత్తగా అర్థం చేసుకొంటే తప్ప. అనేక భాగవత సప్తాహాలు జరుగుతాయి ఈ ప్రపంచంలో, ఎవడు ఎక్కడ ఉన్నవాడు అక్కడే ఉన్నాడు. కాని ఒకడు త్రేతాయుగం నుండి తక్షణం దాటిపోయాడు గోకర్ణుడు. ప్రపంచనికి ఏది అందివ్వాలో తెలీనటువంటి వాడికి ఏది అందివ్వాలో తెలిసింది- నారదుడికి. చావు యొక్క భయముతో, ఇంక నేను చచ్చిపోతాను అనేటటువంటి వాడికి మృత్యువు నుంచి భయం తొలిగిపోయింది.

పరీక్ష వుంది. మూడు రకాలైనటువంటి పరిస్థితిలు ఏర్పడతాయి, భాగవతంలో విన్నవాడికి చేప్పినవాడికి కూడా ఎప్పుడూ. ఆసురీ సంపత్తి నుంచి బయట పడితే మూడు రావాలి. త్రేతాయుగం నుంచి మీరు బయట పడాలి. త్రేతాయుగం నుంచి ఎవడు బయట పడ్డాడు? గాలి అనేటటువంటి వాడు ఎలా బయట పడ్డాడు? ఏడు రోజులు ఒక వెదురు బొంగులో దూరి కూర్చున్నాడట. మీరందరు కూడా వెదురు బొంగులోనే దూరికూర్చున్నారు. మేరుదండము ఎక్కడ దెబ్బతిన్నా మీరు .... ఒక్కచోట దెబ్బతింటే కాళ్ళు, చేతులు కదలవు. ఇంకోచోట దెబ్బతింటే, ఆ ఐదు చక్రాలు ఉన్నాయి కదా మూలాధారము అవీ. మూలాధారము దెబ్బతింటే ఏం పోతుంది? మనలో



వాసనలు పోతాయి. మూలాధారము కర్మేంద్రియము చెప్పాలి. జ్ఞానేంద్రియము చెప్పాలి. ముక్కు, యానిస్ట్ ఇవి రెండపోతాయి. ఇవి రెండూ సవ్యంగా లేవు మనలో చాలా మందిలో.

ప్రాణశక్తి, తిన్నది హరాయించుకొని, ఎంత బయటకి వెళ్ళాలో అంతే బయటకి మలం ద్వారా వెళ్ళాలి. ఇవి రెండు సవ్యంగా పని చెయ్యవు మనలో చాలా మందికి. ఉన్నాయి కానీ మిగతా వాళ్ళలాగే మనం జీవిస్తున్నాం అది మీ యొక్క గొప్పతనం ఏం కాదు. అందరి దద్దమ్మలో నేను ఒక దద్దమ్మని తప్ప అందులో గొప్పతనం ఏం లేదు అది. నీచమైనటువంటి శరీరధారి...ఆ దివ్య దివ్య ఉందే అది అంతా ఉంటే వాడు మానవుడు అంతే. మనం అందరంకూడా బిలోలెవెల్లోనే ఉన్నాం. కాని అందరూ బిలోలెవెల్లోనే ఉన్నారు, కనుక నేను బిలోలెవెల్లోనే ఉన్నాను అనేటటువంటి మానసిక స్థితి ఆసురీ సంపత్తి. ఆసురీస్థితి అంటే అది.

## ప్రత్యాహారం అంటే ఏంటి?

అందరూ అలాగే ఉన్నారు కదా! నాకేంటి ఈ మేరుదండంలో దూరికూర్చుని ఉన్నాను. మూలాధారం సరిగా లేదు అది అర్థం అవుతోందా మీకు. దాన్ని సవ్యమైనటువంటి దారిలో ముందు పెట్టుకోకపోతే అంతా వృధా అవుతుంది. అది అయ్యాక తర్వాతర్వాత సాధనలు మొదలు పెట్టవచ్చు. ధ్యానం చేసేస్తాం మాస్టారు అంటారు. ఎలా చేస్తావు ధ్యానం నువ్వు అసలు? అది నువ్వెలా చేయగలవు? ప్రత్యాహారం రకుండా ధ్యానం నువ్వెలా చేయగలవు?ప్రత్యాహారం - అంటే యమ, నియమ, ఆసన, ప్రాణాయమ, ప్రత్యాహారం. **ప్రత్యాహారం అంటే ఏంటి? ఇంద్రియాలను కావలసి వచ్చినప్పుడు వెనక్కి తీసేసుకోగలగాలి.** ఇంద్రియాన్ని, ఏ ఇంద్రియాన్ని పడితే ఆ ఇంద్రియాన్ని.

శస్త్రచికిత్సలు అవి చేస్తున్నప్పుడు, రమణమహర్షికి వాళ్ళకి మత్తుమందు ఇవ్వలేకపోయాం అన్నారు వాళ్ళు. మాట్లాడుతోనే ఉన్నాడు, వాళ్ళచేత కోయిం చేసుకున్నాడు. ఏం చేసారు అక్కడ? ఆ నెప్పివైపు వెళ్ళే మనస్సుని ప్రత్యాహారం చేసారు.

అది ధ్యాన స్థితి కాదు. అసలు ధ్యాన స్థితి అనేది మామూలు వ్యక్తుక్కూడా విశేషమైన పరిస్థితిలో వచ్చేస్థితి. ఫుట్‌బాల్ ఆడుతున్నప్పుడు మీరు చూసి ఉంటారు, కాళ్ళకి దెబ్బలు తగులుతూ ఉంటాయి. నెత్తురు కారుతూ ఉంటుంది. ఆడేస్తూ ఉంటాడు, వాడు ఆట ఆపాక వాడికి నెప్పి తెలుస్తుంది. అదీ ధ్యానస్థితి. ప్రత్యాహార స్థితి కాదు అది. ధ్యానస్థితే కాని తప్పుడు దోవలో ధ్యానస్థితి అది. అర్థం అవుతోంది కదా!

దోమలు కుడుతూ ఉంటే పడుకోలేము. నల్లులు కుడుతూ ఉంటే పడుకోలేము. సినిమా హల్లో మూడు గంటలు కూర్చుంటాము దోమలు కుడుతూ ఉన్నా. దోమలు కుడుతున్నట్టు కూడా తెలియదు. తెలిసింది అంటే మీరు సినిమా చూడటం లేదు అని అర్థం. అందుచేత అదీ ధ్యాన స్థితి. అందుచేత ధ్యాన స్థితి గురించి తరువాత ఆలోచిద్దాం. ముందు మీరు చూసుకోవలసింది ఏంటి అంటే ఈ చక్రాలు సరిగా ఉన్నాయా లేదా అన్నది చూసుకోవాలి. ఇవి **అంతా ఆసురీ సంపత్తి పొంది ఉన్నాయి.** మూలాధార చక్రము ఆసురీ సంపత్తిలో ఉన్నది. స్వాధిష్ఠాన చక్రము పరమ ఆసురీ స్థితిలో ఉంది. ఎందుచేత అంటే దేని మీద రుచి ఉండాలో దాని మీద రుచి లేకుండా మిగతా వాటి మీదకి రుచి వెళుతుంది. దాన్నే ప్రహ్లాదుడు భాగవతంలో చెపుతాడు ...ఏంటి అది చెప్పు (ఎవరో జవాబు చెప్పారు మైక్ ద్వారా) ....కదా

## మీ చేతలు ఎలా ఉన్నాయి! అవి ఎలా ఉండాలి?

మనకే తెలుస్తున్నాయి కదా! అందుచేత మనము భక్తులము అనే బిరుదు మనం పెట్టుకోకుండా ఉండాలి. ముందు, సాధకులు అనే బిరుదు కూడా మనం పెట్టుకోకుండా ఉండాలి అన్నది అర్థం చేసుకోండి. మనకోసం ఇది. ఇది ఎందుకు చెప్పుకుంటున్నాం అంటే, మనం ఏదో చాలా మంచి మార్గంలో ఉన్నాం, మిగతా వాళ్ళు అందరూ చాలా తప్పుడు మార్గంలో ఉన్నారనే భ్రమతో, ఇంట్లో వాళ్ళని, బయటి వాళ్ళని గూడా మనం ఏడిపించేస్తూ ఉంటాం. **అదొక పెద్ద రాక్షస ప్రవృత్తి. దాన్నుంచి బయట పడకపోతే, ఈ భాగవతం పనికిరాదు.**



**నాకోరిక ఏంటి ఇది వింటోన్నటువంటి వాళ్ళు, విని వెళ్ళిపోవద్దు. విన్నది అర్థం చేసుకోండి ఏం చెప్తున్నానో.** ఆసురీ స్థితి మిమ్మల్ని ఎలా ఆవరించి ఉందో, మీకు అర్థం అవ్వటం లేదు. మనం రాక్షసులమే అని చెప్తే, మీరే రాక్షసులని కాదు. అసలు చెప్పేవాడు రాక్షసుడే, ఎవడిలో ఇవి పనిచెయ్యటంలేదో, వాళ్ళందరూ రాక్షసులే. అందుచేతా, గురుపరంపర కూడా రాక్షసీ వృత్తిలో ఉన్నది. అది గమనించుకోండి మీరు. ఆ కాలధర్మం పోదు ఎక్కడా. కాలధర్మం ఎలా పోతుంది? కాలధర్మం పోయిందీ అంటే, వాడు అకాలంలో పుట్టాడు. మీకు అర్థం అవుతోందా చెప్పిన ఉదాహరణ. కాని ఎంత తేడా వస్తుందీ అంటే, డిగ్రీ డిఫరెన్స్ ఉంటుంది. మాలిన్యాలలో, తగ్గుదల, పెరుగుదలలో ఒకడు 100% రాక్షసుడు అవ్వవచ్చు. ఒకడు 5% అవ్వవచ్చు, ఒకడు 10% అవ్వవచ్చు, ఒకడు 50% అవ్వచ్చు. ఆ మూడు ఉదాహరణలు గుర్తించుకోండి. రామాయణంలో ఇచ్చినటువంటి ఉదాహరణలు. **ఈనాడు ప్రపంచంలో సక్రియంగా ఉన్నటువంటి రాక్షసులు ఐదుగురు.** రావణాసురుడు, వాడు బిజినెస్ మేన్ కావచ్చూ, పొలిటీషియన్ కావచ్చూ, సైంటిస్ట్ కావచ్చూ. సైంటిస్ట్ యొక్క రాక్షసీయ ప్రవృత్తి అర్థం కావటం లేదూ.

## మీలోని హింసని గమనించుకోండి

ఒకసారి సైంటిస్ట్‌లు, వాళ్ళు చేస్తున్నటువంటి ప్రయోగశాలలోకి వెళ్ళి చూడండి. ఎంతమంది జంతువులని చంపుతారో. ముఖ్యంగా ఇంటర్మీడియట్ నుంచీ బయాలజీ ప్రాక్టికల్స్ మొదలెడతారు. మీరు చూడండి. ఎంత మంది కప్పలని .......చంపేస్తారో. అదీ మనం ఎంత నిశ్చింతగా, ఎంత గొప్పగా, అసలు దానికి మనం బాధగూడా పడం అలా జరుగుతోంది హింస అని. మనయొక్క ఆసురీ తత్త్వం అర్థం అవుతోందా!

మనం తినేటటువంటి మందులు, మీ దగ్గరకి మందు రూపంలో వచ్చే ముందు, కనీసము కొన్ని లక్షల జీవాలు చనిపోయాక వస్తాయి. ఎంత హింసిస్తారో, వాటి బ్రెయిన్‌ని పీకీ, అది పీకి, ఇంజక్షన్స్ ఇచ్చి, ఖండ ఖండాలుగా కోసేసి కోతులని, కుందేళ్ళనీ. ఇవంతా చేశాక మీరు వేసుకునే మందులు వస్తాయి. వీడేమో నేను పెద్ద

శాకాహారినని ఫోజులు కొడతాడు. అలా అంటూ, ప్రొద్దుట మాత్ర వేసుకుంటాడు. ఆ మాత్రలో, ఎన్ని జీవాల హింస ఉందో గమనిస్తున్నాడా. అసలు ఊహించుకోండి - ఎన్ని జీవాల హింస ఉండి ఉంటుందో! ఎన్ని హాస్పటల్స్‌లో ఎన్ని రకాలుగా, ......అదీ చాలా సహజం అనేస్తారు మీరు. అవి ఆసురీ లక్షణాలు. **అందుచేత మనం అందరం గూడా ఆసురీ సంపత్తిలో ఎలా జీవిస్తున్నామో అర్థం చేసుకోండి.** భౌతిక జగత్తులో, వాడికి ఎంత ఎక్కువ విలువుందో, వాడు అంత ఆసురీ విద్యతో అంత విలువైనవాడు.

ముఖ్యంగా ఈ డాక్టర్లు, ఇంజనీర్స్. వీళ్ళు ఇద్దరుకూడా అనేక రకాలైనటువంటి ఆసురీ సంపత్తితో బయటకి వచ్చినవాళ్ళు. పైకి వస్తున్నటువంటి వాళ్ళు. అది లేకపోతే, ఈ డాక్టరు ఎందుకూ పనికిరాడు. మందులే లేవు అనుకోండి ఏదో కారణాల వల్ల, ఇంక ఈ డాక్టరు ఏంచేస్తాడు? అర్థమౌతోందా ఆసురీ స్థితి. అందుచేత .....అసురీ స్థితిలో ఉన్న మనమూ, మంచి పనులు చెయ్యగలుగుతున్నామనుకునేది చాలా పెద్ద భ్రమ. మీరు చెయ్యలేరు. ముందు ఆ నిర్ణయానికి రండి మీరు. **మనము మంచి పనులు చెయ్యలేం.** మంచి పనులు చెయ్యగలిగితే, మీరు మంచివాళ్ళే అయిపోతారు. **మంచి పనులు చెయ్యనివ్వకుండా ఉండే ప్రభావమే కలిప్రభావం.** అందుచేత మంచి పనికి, ఇంకో ఆర్భాటం ఏదో పడుతుంది. ఇంకో పేరు పడుతుంది. కీర్తికాంక్షో, పదిమంది మీద ఆధిపత్యం తెచ్చుకోవటమో, రకరకాలుగా.

## రాముడి దగ్గరకి న్యాయం కోసం వచ్చిన కుక్క

రామాయణ కాలములోనే ఈ పరిస్థితి ఉంది. రాముడి దగ్గరకి ఒక కుక్క వస్తుంది. ఆ కాలంలో సకల జంతువులూ రాజు దగ్గరకి రాగలిగేవి ధర్మం కోసం. సరే ఫలానా బ్రహ్మణుడు చాలా బాధపెట్టాడు నన్ను అంది ఈ కుక్క. సరే ఐతే దానికి ఇంక శిక్ష ఎలా వెయ్యాలో నాకు అర్థం అవ్వటం లేదన్నాడు రాముడు. ఎందుచేతంటే మనిషికి ఇంకో మనిషి అపకారం చేస్తే ఏ శిక్ష వెయ్యాలో మనం రాసుకున్నా కూడా దీంట్లోంచి బయటపడాలని లేదూ. ఇదీ కలియుగ ధర్మం.



## గురువు వస్తే ఎంతమందిమి వెళ్ళగలం?

**ఇవ్వాడు గురువు వచ్చి, శ్రీరామశర్మ ఆచార్యాయే వచ్చేశారు అనుకోండి. అన్నీవదులుకొని నావెంట వచ్చేయండి అంటే ఎంతమందిమి వెళ్ళగలం?** వెళ్తాం అన్నాక వెళ్ళగలగాలి. ఇప్పుడా! అంటే లాభంలేదు. అన్నాక వెళ్ళగలరో లేదో! ఆయన ఇక్కడే ఉండి, పన్లు చెయ్యండి అంటే చెయ్యలేని వాళ్ళు ఆయన వెంట వెళ్ళి ఏం చేస్తాం? అనేటటువంటి ప్రశ్నరాదు మీకు. అదీ ఆసురీ సంపత్తి అంటే. గురువులు అందరూ గూడా, **అసలు మొట్టమొదట వాళ్ళు చెప్తోంది ఏంటీ అంటే మీరు ఎవరూ మావెంట రావద్దూ. మీరు ఎక్కడున్నారో అక్కడే ఉండి పనులు చెయ్యండి అని.** మీరు అక్కడ అసలు ఏం చేయలేరు.

నేను చాలాసార్లు చెప్పాను మా గురువుతో మోసపోయానని. మోసపోతాం, ఎంత మంచి గురువైనా మోసపోతాం. కాని తరవాత ఇంకొక గురువు కనిపించాడు. వచ్చేస్తావా రామకృష్ణా నాతో పాటు అన్నాడు. సరే పదండన్నాను. 'ఏం చేస్తావు అక్కడ నువ్వు' అన్నాడు. 'తపస్సు చేద్దాం' అన్నా. సరే తపస్సు చేద్దాం, మరి హిమాలయాలలోకి వెళ్ళాక మనం తపస్సు చేసుకుంటాం కదా, మరి నాలుగైదురోజులు ఇక్కడ తపస్సు చేసి, హిమాలయాలలో మనం చేయబోయే తపస్సు ఎలా ఉంటుందో నాకు కాస్త చూపించు అన్నారు. సరే చేద్దాం అన్నా.

అలాగే పదండి తపస్సుకు... మీరు చేయండి, ఎలా చేస్తారు? హిమాలయాలకి వెళ్ళాం, అలసిపోయాం గనుక నిద్రపోయాం. మర్నాడు ఉదయం చెప్పండి ఏం చేస్తారో, మీరు తపస్సు చేద్దామనుకున్నవాళ్ళు. గబగబా చెప్పాలి మీరు, కాలాన్ని వృథా చేయకండి నాకు. మేం ఉన్నత హిమాలయాలకెళ్ళి తపస్సు చేయాలి, హిమాలయాలకి తీసుకెళ్ళిపోయాడు మీ గురువు మిమ్మల్ని, ఓ.కె. సూర్యోదయమైంది, స్నానం అదీ చేసుకున్నారు. మరి అక్కడ టిఫిన్ ఏం దొరుకుతుందో నాకు తెలీదు. కాని బదరీనాథ్‌లో కూడా ఇడ్లీ, సాంబారు దొరుకుతుందని మా స్నేహితుడు చెప్పాడు కనుక, అక్కడది దొరుకుతుంది, తినేశాం. ఇంక తపస్సు మొదలెట్టండి ఏం చేస్తారు? గబగబ చెప్పండి మీకు తెలిస్తే, లేకపోతే తెలీదని చెప్పండి.

## ఆసురీ సంపత్తి అంటే భ్రమలో జీవించటం

ఆసురీ సంపత్తి అంటే అర్థమైంది కదా! **మీరు చేయలేని దానిని చేస్తాం అనుకునే భ్రమలో జీవించటం.** ఆ భ్రమలు పోవాలి ముందు మీకసలు. మీరేం తపస్సు చేస్తారు? మీరు చేస్తున్న పూజలన్నీ తపస్సులోకి వస్తాయనా మీ ఉద్దేశ్యం! పోనీ అదైనా చెప్పలేరు మీరు, అక్కడికెళ్ళి పూజ చేస్తామని. అర్థమౌతోందా ఉదాహరణ. అందుచేత ఏది చెయ్యాలో తెలియని వ్యక్తులకి వాళ్ళు చేయటం లేదు అని కోప్పడటం, కోప్పడే వాడి మూర్ఖత్వం అవుతుందా, అవదా! తెలీదసలు వాడికి ఏం చేయాలో.

ప్రపంచంలోకి మొట్టమొదటిసారి కొత్తగా యంత్రం వచ్చింది. యంత్రాన్ని దింపుకుని ఇక్కడ పెట్టుకున్నాం, దాన్ని ఎలా ఉపయోగించు కుంటారు? ఉపయోగించలేరు కదా, ఉపయోగించలేరు అని మిమ్మల్ని తిడుతూకూర్చున్నాడు అనుకోండి గురువు, ఎన్నాళ్ళు తిడితే వస్తుంది! కాని గురువు ఏం చేయగలడో కాస్త జాగ్రత్తగా అర్థం చేసుకోండి, అది ఎందుకు చేయలేకపోతున్నారో కూడా మీరర్థం చేసుకోవాలి. ఈ లోకంలో సుఖం ఏంటంటే, ఈ ప్రపంచంలో నువ్వు ఏది అనుకుంటే అది జరిగిపోతే నువ్వు ఆనందిస్తావు, అవునా, కాదా? కాని మీకు తెలీదు, నిజంగా అది జరిగితే కాని మీరనుకున్నది జరగాలంటే ముందున్నది ఉపయోగించుకోవటం నేర్చుకోండి.



# మన సిలబస్

## ఉదరం భరిణో జీవా:

రాబోయే రోజులలో చేతనత్వ విజ్ఞానమే మానవజాతి చదువుకుంటుంది. ఇప్పుడు మనం చదువుకుంటున్న ఈ టెక్నాలజీస్ అన్నీ కూడా కేవలము ఉదరం భరిణో జీవా: అంటే అర్థమవుతోంది కదా? పొట్టకోసమే. పొట్టకోసం మనం ఇంత కాలాన్ని వృధా చేసుకోవక్ఖర్లేదు. పొట్టకు తిండి సంపాదించుకోవటం కోసం 25 సంవత్సరాలు వాళ్ళని చదివించి, తర్వాత జీవితాంతం కడుపు నింపుకోవటం అనే ప్రక్రియకు ఇంక ఆపేస్తారు. ఎందుచేతంటే టెక్నాలజీ ఎంత అభివృద్ధి అయిపోయిందంటే, కడుపు నింపుకోవటానికి మీరు ఇంత కాలాన్ని వృధా చేయక్ఖర్లేదు.

మరప్పుడు వాళ్ళు ఏం చేయాలి? వాళ్ళు తింటూకూర్చోవటమేనా అన్నదానికి భాగవతమే జవాబు అవుతుంది. అందుచేత మొదటి శ్లోకం

కృష్ణం నారాయణం వందే కృష్ణం వందే వ్రజప్రియమ్ ।
కృష్ణం ద్వైపాయనం వందే కృష్ణం వందే పృథాసుతమ్ ॥

## అర్జున స్థితి సమత్వ స్థితి

ఇదీ మన పాఠ్యాశం. మనం ముందు పృథాసుతులుగా మారాలి. అర్జున స్థితికి రావాలి. అర్జున స్థితికి రావటం అంటే ఏంటి? నా రథాన్ని ఏ పార్టీలోనూ పెట్టను నేను. ఇటు ఆధ్యాత్మిక వాసుల పార్టీలోనూ పెట్టను. ఇటు భౌతిక సుఖాల కోసం వాడే వాళ్ళలోనూ పెట్టను. రెండూ వద్దంటున్నాడు. చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. ఆశ్రమాలకు వెళ్ళిపోయి కళ్ళు మూసుకుని భగవత్ సాధనలు చేస్తాను అనే వాళ్ళకి నిష్కృతి లేదు. అలాంటి సాధనలను ఆపుదాం. అలా అని చెప్పి భౌతిక జగత్తులోనే జీవిస్తాను నేను అంటేకుదర్దు. రెండిటికీ మధ్య ఉండాలి మీరు. **సమత్వ స్థితి వచ్చినప్పుడు అర్జున స్థితి అవుతుంది. అర్జున స్థితి అంటే అ రజ్జు:. రజ్జు: అంటే తాడు.** తాడు ఎవరికి అవసరం అవుతుంది? పశువులకే అవసరం అవుతుంది. పశువులు అంటే పాశములు. జంతువులకి తాడు కావాలి నియంత్రించుకోవటానికి.

తాడు లేకుండా ఎవరుండాలి? జంతు స్థితిలో లేని వాడు. అదీ అర్జున స్థితి అంటే. మనకి బాహ్యమైన నియంత్రణలు ఏమీ ఉండక్కర్లేదు. **నాయొక్క మొత్తము ప్రయత్నము అది.**

లోపలున్న దాన్ని నీ అంతట నువ్వు వెతుక్కోగలగాలి. ఎప్పుడు వెతుక్కోగలుగుతావు అంటే, ఆ రజ్జుః స్థితిలో ఉన్నప్పుడు. ఏవిధమైనటువంటి బంధాలూ ఉండకూడదు. ఏ విధమైనటువంటి బంధాలూ అన్నదానిని చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. చేతనత్వ విజ్ఞానానికి ఇది నాంది. అక్కడినుంచి ఎక్కడికెళ్ళాలి మీరు?

## వ్యాసుడు ద్వంద్వాతీత భగవంతుని ఆజ్ఞని పాలించే స్థితి

కృష్ణం ద్వైపాయనం వందే. ఈ ద్వంద్వ స్థితిలో ఏది ఉచితమో, ఏది అనుచితమో ఎప్పుడూ భారతంలో మనకు కనిపిస్తూనే ఉంటుంది. అప్పుడు వ్యాసుడే వస్తూ ఉంటాడు నివారణోపాయం చెప్పటానికి. వ్యాసుడు వస్తే అథారిటీ. ద్వంద్వం వచ్చినప్పుడు ఏది చెయ్యాలీ, ఏది చెయ్యకూడదు అన్నది, మన ఇంగితానికి విరుద్ధంగా ఉన్నటువంటివి చాలా వస్తాయి భారతంలో. అన్నీ వివేకానికి విరుద్ధమే. మనం నమ్మినటువంటి సిద్ధాంతాలకి విరుద్ధమే. కాని **అది విరుద్ధంగా ఉన్నది ప్రకృతి యొక్క, భగవంతుడి యొక్క నిర్దేశానికి అనుకూలంగా ఉందని చెప్పగలిగే స్థితిలో వున్నటువంటి వాడు వ్యాసుడు.**

ఆ స్థితి అర్జునస్థితి నుంచి ద్వంద్వాతీత స్థితి. ఏది ఉచితమో, ఏది అనుచితమో తెలుసుకుని, చేస్తూ ఉంటాడు, ఇతరులు చేస్తే వాళ్ళ అదృష్టం, చెయ్యకపోతే వాళ్ళ అదృష్టం. తండ్రి సుఖం కోసమని నేను పెళ్ళి చేసుకోను భీష్ముడు ప్రతిజ్ఞ చేశాడు. తండ్రి చనిపోయాడు. వంశం నాశనం అయిపోయే స్థితికొచ్చింది. భీష్ముణ్ణి అడిగితే-నేను భీష్మ ప్రతిజ్ఞ చేశానన్నాడు. అలా చేసే ప్రతిజ్ఞలన్నీ భీష్మ ప్రతిజ్ఞలని గుర్తుంచుకోండి. దానికే ఇంకొక మాట కూడా ఉంది, భీష్మించుకుని కూర్చోవటమని. భీష్ముణ్ణి సరి చేయటానికి ప్రయత్నం చేసింది తల్లి. కానీ వినలేదు. ఎలాంటి చావు చచ్చాడు, ఒళ్ళంతా బాణాలు గుచ్చుకుంటే, ఎంత బాధపడతారో అంత బాధతో చనిపోతాడు.



**చాలా స్పష్టంగా భాగవతము మీరు ఏది సరైనదని అనుకుంటున్నారో అది సరికాదు అని చెవుతోంది.** అప్పుడు భీష్మణ్ణి సరిచేయటానికి ప్రయత్నం చేశాడు వ్యాసుడు కూడా. వ్యాసుడుకూడాఆ భీష్ముడు యొక్క తల్లి యొక్క పుత్రుడే. కాని తల్లి ఎప్పుడు పిలిస్తే అప్పుడు వచ్చాడు. నేను సన్యాసిని అని అనలేదు. భీష్ముడో? తల్లి దగ్గర ఉంటూనే, భీష్మించుకుని కూర్చున్నాడు. ఆయన? తల్లి దగ్గర లేడు, తండ్రిని కూడా చూసి ఉండడు అతను. తల్లి దగ్గరా పెరగలేదు. కాని ఆ తల్లి పిలిస్తే వచ్చాడు. ఎప్పుడు? కొంపలంటుకుంటున్నప్పుడు. ఇంక అన్యథా శరణం నాస్తి, నాకు గతి లేదు నాయనా అంటే ప్రత్యక్షమయ్యేవాడు. తక్షణం ప్రత్యక్షమయ్యేవాడు. తక్షణం ప్రత్యక్షమయ్యే శక్తి దత్తావతారాలకు మాత్రమే ఉంటుంది. స్మర్తుగామి అనేది, దత్తుడు యొక్క వ్యక్తిత్వం. ఉప్పు ఉప్పగా ఉన్నట్టు, పంచదార తియ్యగా ఉన్నట్టు, పిలవగానే ఖచ్చితంగా ప్రత్యక్షమయ్యేది ఒక్క దత్తావతారానికి మాత్రమే ఉంది.

మరి మనం పిలుస్తేకూడా వస్తాడా? వస్తాడు. సత్యవతి పిలిచింది, వచ్చాడు, భీష్ముడూ అక్కడే ఉన్నాడు. వ్యాసుడు వచ్చినప్పుడు భీష్ముడు అక్కడ ఉండి ఉండడా? చెప్పింది, నాయనా ఇలా ఉంది పరిస్థితి అని. **పిల్లలు కావాలి,** పెళ్ళి చేసుకోడు వీడు అని. మరి అప్పుడు ఏం చేస్తాడు? **ఆయనే పూనుకున్నాడు దానికి. మళ్ళా ఇంకోళ్ళ మీద బాధ్యత పడేయలేదు.** మీరు చాలా జాగ్రత్తగా భాగవతాన్ని అర్థం చేసుకోండి. చదివేస్తూపోతూవుంటాం తప్ప, మన జీవితానికి మన ఇష్టం వచ్చింది అన్వయించేసుకుంటాం.

ఎందుచేతంటే పశువులం కనుక. పశువులు అంటే తాడు. ఏ తాడు, మీకు ఏది నచ్చుతే ఆ తాడుతో మీరు కట్టేసుకుంటున్నారు మిమ్మల్ని. అక్కడ బుర్ర ఉపయోగించి, లాజికల్‌గా ఆలోచించి, మనం అవగాహన చేసుకుంటే అర్జున స్థితి నుంచి, వ్యాస స్థితికి ఎలా వెళ్తామో అర్థమవుతోంది కదా మీకు,

## ఏది చెయ్యవలసివుందో అది చెయ్యాలి:-

అర్జున స్థితి అంటే ఏంటి? ఈ రెండు పార్టీలలోనూ లేను నేను. నాకు ఇటు

రాజ్యమూ అక్కర్లేదు, ఇటు స్వర్గమూ అక్కర్లేదు. నాకు రెండూ అక్కర్లేదు. భగవంతుడూ అక్కర్లేదు, రాజ్యమూ అక్కర్లేదు. మరి ఏం చెయ్యాలి? ఏది **చెయ్యవలసివుందో అది చెయ్యాలి. ఏది చెయ్యదలిచామో అది చెయ్య వద్దు.** ఏంటి చెయ్యదలుస్తాం మనం? మనకి ఏది ఇష్టమైతే అది కదా. చెయ్య దలచింది అసలు మీరు చెయ్య కూడదు. చెయ్యవలసినది చెయ్యాలి. ప్రస్తుతం మనకున్న పరిణామక్రమంలో, మన కున్న సంబంధబాంధవ్యాలు బట్టి, సమాజంలో మనకున్నటువంటి సంబంధాల్ని బట్టి సరిగా చేసుకుంటూ వెళ్ళిపోతాం. తండ్రి తండ్రిగా జీవిస్తాడు, తల్లి తల్లిగా జీవిస్తుంది, కొడుకు, కోడలు, రకరకాల బంధాలున్నాయి కదా. శత్రుత్వముకూడా ఒక బంధమే. అది అర్థం చేసుకోండి.

ప్రోపబ్లీ చాలా: అద్భుతమైనటువంటి బంధమది. మిత్రులు గుర్తుండరు కాని, శత్రువులు ఖచ్చితంగా గుర్తుంటారు. గబుక్కున ముందు గుర్తొచ్చేది శత్రువే. కాస్త జాగ్రత్తగా అర్థం చేసుకోండి. కుటుంబాలలో మీకు ఇంకా చాలా బాగా అర్థం అవు తుంది. మీకు ఎవరు నచ్చరో ముందు వాడు మనస్సులో మెదులుతాడు. ఇది వాడికి నచ్చదు అని. అదే ఎక్కువ వాడ్ని ఉడికించటానికి చెయ్యొచ్చు, అది వేరే పని. అందుచేత ఈ సంబంధ బాంధవ్యాలు ఎలా ఉంటాయో దాని ప్రకారం జీవిస్తూ ఉండండి. శత్రుత్వాన్ని శత్రుత్వంగానే జీవించండి, మిత్రత్వాన్ని మిత్రత్వం గానే జీవిం చండి. తల్లిలాగా, తండ్రిలాగా, బంధువుల్లాగా జీవించండి. జీవిస్తూ ఉన్నాక భీష్మించు కునికూర్చోకండి. **పరిస్థితులు** మారతాయి. ఏరోజైనా మారి పోవచ్చు. **మారిపోయిన ప్పుడు ఏం చెయ్యాలో** అన్నది, **వ్యాస స్థితి** తెలువు తుంది. అర్జున స్థితి నుంచి వ్యాస స్థితి. ఈ రెండిటికీ తేడా అర్థమవుతోందా, ఇది చేతనత్వంలోని మార్పే. భీష్ముడే వ్యాసుడుగా మారతాడు.

భీష్మించుకుని కూర్చోకపోతే వాడు వ్యాసుడు. తల్లి చెప్పిన దానికి, వీడే భీష్మించు కోకుండా, వ్యాసుడు చేసిన పనే తను చేసేసి ఉంటే, ఈనాడు వ్యాసుడు గురించి మనం చెప్పుండేవాళ్ళం కాదు. భీష్ముడు ఇలా చేశాడు చూశారా , అలా



చెయ్యాలని చెప్పుకునే వాళ్ళం మనం. అందుచేత ఇవంతాకూడా, చేతనత్వ స్థితులు. అది మనం నేర్చుకుంటున్నాం ఇక్కడ. నిత్య జీవితంలో మనం చేతనత్వం యొక్క మార్పులే చేసుకుంటూ ఉంటాం.

మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోవటానికి చెప్తున్నాను ఇది. మీరు నా ప్రకృతి ఇది, నాకు అలవాటు లేదండీ, నేను విననండీ అంటారు. నిప్పు అంటుకుపోయింది. పక్షవాతం వచ్చిన ఒక వ్యక్తి ఉన్నాడు, వాడ్ని వదిలేసి అందరూ పరిగెట్టారు. వీడు లేచి పరిగెట్టుకొచ్చాడు వీళ్ళందరికంటే ముందు.

పత్రికలో చదివారా ఆ సంఘటన, చదవలేదా. కాని అలా జరుగుతుందని తెలుసు కదా, 5 ఏళ్ళబట్టీ వాడి కాళ్ళు, చేతులు పడిపోయి ఉన్నాయి. ప్రకృతి ఏమయ్యింది, పక్షవాతం ఏమయ్యింది, అందుచేత దయచేసి మనస్సుని వేషాలు వెయ్యనివ్వకండి. నేనిది చెయలేను మాస్టారు అనవద్దు. ఇష్టం లేదు అనండి. ఈ భాగవతం చదువుకునేటప్పుడు నేను నిరంతరం మీకు ఇచ్చేటటువంటి సలహా ఇది. **బయట పరిస్థితుల వల్ల, ఇతరుల వల్ల ఇది నేను చెయ్యలేకపోయాను అని ఎప్పుడూ మీరు అనొద్దు. మీరు ఎందుకు చేయలేకపోయారు అంటే, మీకు ఇష్టం లేదు కనుక.** నాకు ఇష్టం ఉంది మాస్టారు కాని చేయలేను. నమ్మను. మీరూ నమ్మకండి, మిమ్మల్ని మీరు మోసగించుకుంటున్నారు.

ధ్యానానికి 5 నిముషాలు నేను కుదురుగా కూర్చోలేను మాస్టారు అన్నవాడే, సినిమాహాల్లో 3 గంటలు కూర్చుంటాడు. ఎందుకు కూర్చున్నాడు 3 గంటలు, ఇష్టం ఉంది కనుక. అందుచేత మిమ్మల్ని మీరు మోసగించుకోకండి. నేను ధ్యానం చెయలేక పోతున్నాను, మనస్సు నిగ్రహించుకోలేక పోతున్నానని. అన్నీ వేషాలే. **మీకు చెయ్యాలని లేదు కనుక, చేయలేక పోతున్నారు.** ఇది ఎప్పుడైతే అర్థం అవుతుందో అప్పుడు **మీరు అర్జున స్థితికి వచ్చినట్టు. ఇది ఆచరణలో పెడితే ద్వైపాయన స్థితికి వస్తారు.** తేడా అర్థమయ్యిందా.

## పరిణామక్రమంలో నటించే మనిషి

నేను సాధన చెయలేను అని బాణం వదిలేస్తాడు అర్జునుడు. తెలుసు వాడికి ఇది ఉచితం కాదని. కాని నేను చెయలేనండీ అంతే, ఈ జన్మకి ఇంక అంతే అని నాతో చాలామంది అంటూంటారు, ఇంకో జన్మలో చూసుకుంటాంలే బాబూ, ఇప్పుడు అనవసరంగా మమ్మల్ని ఇరికించకు - ఓ.కె. నేనేం విసిగించను, ప్రశ్న ఏంటంటే **మరుజన్మలో అయినా మీరు ఇక్కడికే వచ్చి ఆగుతారు.** ఆ మరు జన్మలో కూడా ఇక్కడికే వచ్చి ఆగుతారు. అక్కడికే వచ్చి ఆగేటటువంటి జంతువే మానవ జంతువుగా పుడుతుంది. చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి ఇది.

జంతువు పరిణామక్రమంలో ఎప్పుడూ ముందుకు వెళుతూ ఉంటుంది, చెట్లు పరిణామక్రమంలో ఎప్పుడూ ముందుకు వెళుతూ ఉంటాయి. ఎందుచేత? వాటిపై నియంత్రణ లేదు వాటికి, ప్రకృతి వాటికి సహకరిస్తూ ఉంటుంది. దేవతలు, దేవతల పైనున్నటువంటి లోకాలు, అవి కూడా పరిణామక్రమంలో వాటంతట అవే వెళుతూ ఉంటాయి. పరిణామక్రమం నుంచి బయటకు వచ్చేసి, ఒడ్డున కూర్చుని, మేం చాలా కష్టపడిపోతున్నాం, అలసిపోతున్నామని నటించేటటువంటి చేతనత్వం ఒక్క మనిషిదే. అందుచేత అది అర్థం చేసుకోండి. ఎందుకు ఇది ఇంత స్పష్టంగా వాళ్ళు చెప్తారూ అంటే, ఇదంతా మీ నటనే. ఏమీ చేయటంలేదు నువ్వు, అలసిపోతున్నానంటున్నావు, ఆ బంధాలున్నాయంటావు, ఈ బంధాలున్నా యంటావు అంతా నటనే. ఏ బంధమూ లేదు.

ఏ బంధమూ లేదు అన్నదానికి పెద్ద గ్యారంటీ ఏంటంటే, ఈ క్షణంలో నువ్వు టప్ అని పడిపోతే అంటే, చచ్చిపోతే, ఈ బంధాలు ఏమౌతాయి? ఈ బాధ్యతలు ఏమౌతాయి? నువ్వు ఇంత ఫోజులు కొడుతున్నావు కదా, నేను లేకపోతే కొంపలు అంటుకుపోతాయని, అంటించు కొంపలు. చచ్చిపోయాక ఏం చేయలేవుగా. వివేక హీనత అనేటటువంటి పరమ మూర్ఖత్వానికి ఉదాహరణ మానవుడు. అసలు వివేకమే ఉండదు, చాలా వివేకవంతుణ్ణై మాట్లాడు తున్నాను అని మాట్లాడతాడు. ఎందు



చేతంటే, ఒకకథ ఎప్పుడూ చెపుతూ వుంటాను. ఈ కథలు మీకు గుర్తొస్తే, ముల్లు గుచ్చుకుంటుంది. ముల్లు గుచ్చుకుంటే, కనీసం ఒకసారి ఇలా అంటారు. మారతారో మారరో నాకు తెలీదు కాని, స్థిమితంగా మాత్రం కూర్చోరు ఆ క్షణం.

## రాజుగారు, మంత్రిగారు పిచ్చివాళ్ళా?

రెండు ఇరుగుపొరుగు రాజ్యాలు, ఇరుగుపొరుగు రాజ్యాలంటే ఖచ్చింతగా శత్రువులే. అంతేగా, లేకపోతే ఇరుగు పొరుగు అవ్వవు, ఒకే రాజ్యం అయిపోతాయి. ఎవడో ఆలోచన ఇచ్చాడు బయోకెమికల్ వార్ ఒకటుంటుందని, బయో టెక్నాలజీ వాళ్ళు. ఇప్పుడు అక్కడికే వెళుతోంది ఈ సైన్స్ అంతా. బయోటెక్నాలజీ వేపు.

ఏం చేయక్కర్లేదు, వాళ్ళు తాగే నీటిలో, పిచ్చెక్కించే మందు కలిపేద్దాం, ఆ రాజ్యం గొడవ పోతుంది అన్నాడు. రాత్రికి రాత్రి వచ్చి కలిపేశారు. ఆ రోజుల్లో బావులుండేవి. నీటి సరఫరా కేంద్రాలు లేవు. కాని దురదృష్టవశాత్తు మంత్రిగారి బావి, రాజుగారి బావి నీళ్ళలో మందు కలపలేకపోయారు. మిగతా వాళ్ళందరి బావులలోనూ మందు కలిపేశారు. మర్నాడు అందరూ నీళ్ళు తాగారు. రాజుగారికి, మంత్రిగారికి తప్ప అందరికి పిచ్చెక్కిపోయింది. ఈ పిచ్చెక్కిన మిగతావాళ్ళందరికీ రాజుగారు, మంత్రిగారు పిచ్చివాళ్ళలాగా కనిపిస్తున్నారు. ఇప్పుడు ఇంక రాజుగారు అక్కడ రాజ్యం చెయ్యలేడు, మంత్రి అక్కడ రాజ్యం చెయ్యలేడు. మరి రాజుగారు ఎప్పుడూ మంత్రినే కదా అడుగుతాడు, ఏం చేద్దాం అన్నాడు. రెండే సొల్యూషన్స్ ఉన్నాయన్నాడు. మనమైనా వాళ్ళ బావిలో నీళ్ళు తాగేద్దాం, లేదా రాజ్యాన్ని వదలి పోదాం అని. అర్థమైందా? మనం అందరం ఆ పిచ్చిపనే చేస్తున్నాం. అందరిలాగా జీవించాలని కోరుకుంటున్నాం తప్ప, అది తప్పు అని తెలిసినా, మిగతా వాళ్ళలాగే జీవిస్తున్నాం అంటారు. ఆ నిర్ణయం తీసుకున్నారు మీరు. మంత్రిగారు చెప్పిన ఉపాయం. మానవజాతి ఏం నివారణోపాయం తీసుకుంది అంటే, మనం కూడా ఆ పిచ్చే ఎక్కించేసుకుందాం అని.

ఏ పిచ్చి ఎక్కించేసుకుందాం? మీకు అర్థమయిపోయేవుంటుంది. లేకపోతే ఏం చేయాలి, పిచ్చివాళ్ళు అనిపించుకుంటూ ఉండండి వాళ్ళచేత. అందుకని రామకృష్ణ

పరమహంసని ఏమన్నారు? పగలాఠకూర్ అన్నారు. వెంకయ్యస్వామిని ఏమన్నారు? మనమేదో వేరుగా ఉన్నాం అని అనుకోకండి. ఇప్పుడు మీరు కూడా అదే చేస్తున్నారు. ఇప్పుడు బైటకెళ్ళి ఎవడైనా మాస్టారి దగ్గర నేనుండిపోతాను అంటే, నీకు పిచ్చెక్కిందిరా అంటారు. ద్వైపాయనం వందే నేను సిద్ధమే. అందుకే రామకృష్ణ పరమహంస విపరీతంగా సిగ్గుపడిపోయేవాడు, **ఆయనను త్యాగి అని ఎవరైనా అంటే. 'నేను త్యాగినేంటి నాకు అర్థం కాదు' అని.** అక్కడికెళ్తే 100 రూ॥లు వస్తాయని చెప్తే, ఇక్కడుంటే నీకు ఏమీ రావని చెప్తే, ఎక్కడి కెళతాం మనం? కదా. నేను వెళ్ళాను అక్కడకి. మీరు అసలు నిజమైన త్యాగ ధనులు. అక్కడ మీరు, మిమ్మల్ని మీరు మీ వీపు తట్టుకోవచ్చు. మీరు నిజంగా త్యాగధనులు. అంత అద్భుతమైనటువంటి ఈ గురు పరంపర ఒక వారం రోజులలో అంతటినీ దాటి అందులో కలిసి పోవచ్చు అని చెప్తొంటే, నాకు ఇప్పుడు వద్దులే, తరవాత సమయముంది అంటారు.

కానీ పిల్లవాడు పరీక్షకి చదువకపోతే వాడ్ని ఏడిపించేసి చావగొట్టి చెవులు మూస్తారు. ఎందుకూ పనికిరాని దద్దమ్మ చదువులకి. నిజమైన చదువు చదువు కోవటానికి మనలో ఏమీ ఆర్తి రావటంలేదు. **ఆ ఆర్తి వుడితే అర్జునుడు, ఆ ఆర్తిని ఆచరణలో పెడితే ద్వైపాయనుడు.** అది తేడా. అర్జునుడికి ఆర్తి ఉంది, ఆచరణ పెట్టే సాహసం రాలేదు. వ్యాసుడికి ఆచరణలో పెట్టగలిగే సాహసం ఉంది. ఆ కాలం లోనే నియమాలకి విరుద్ధంగా చెప్పాడు. అన్ని నియమాలను దాటేశాడు.

అర్జునుడు కుంతి దగ్గరికి వచ్చి ఇవాళ చాలా గొప్ప భిక్ష దొరికిందమ్మా అన్నాడు. అంటే ఆవిడ ఏమంది? అందరూ పంచుకోండి అంది. ఇప్పుడు సమస్య వచ్చి పడింది. ఎలా తేల్చాలి? ఎవడు తేల్చాడు- వ్యాసుడు తేల్చాడు. ఆ తేల్చిన నిర్ణయము ఇప్పటికీ చాలామందికి నచ్చదు. ఈ రోజుకీ చాలామందికి నచ్చదు. ఎందుచేత, బావిలో నీళ్ళు తాగినవాళ్ళం కనుక. పిచ్చెత్తిన వాళ్ళం, మతిలేని వాళ్ళం.

అప్పుడు కృష్ణుడు అక్కడే ఉన్నాడు. వ్యాసుడు చెప్పిన దానిని హర్షించాడు. వ్యాసుడు, కృష్ణుడు ఒప్పుకున్నారు కనుక మనం ఒప్పుకుంటున్నాం తప్ప, మనస్ఫూర్తిగా



మీలో ఎవరూ ఒప్పుకోవటంలేదు. ఎందుచేతంటే మన మతి భ్రమించింది కనుక. దానిని మీరు విశ్లేషణ చేసుకోండి. ఆ సరిచేసుకోవటం ఎప్పుడైతే వస్తుందో, మీరు వ్యాస స్థితికి వెళతారు. కృష్ణం ద్వైపాయనం వందే.

## ఇది చెప్పకపోతే మానవ జాతికి నిష్కృతి లేదు

చేతనత్వ విజ్ఞానం చెపుతున్నాను నేను. **రాబోయే యుగాలలో విశ్వ విద్యాలయాలలో ఇదే పాఠాలుగా చెప్తారు. చెప్పకపోతే మానవ జాతికి నిష్కృతి లేదు.** మేము వినము. సమస్యేం లేదు. కాని అర్జున స్థితిలో ఉన్నవాళ్ళు ఇప్పుడు చాలామంది ఉన్నారు కనుక, వ్యాస స్థితికి వెళ్ళవలసిన అవసరం ఉంది కనుక, ఇది సర్వజనీనం అవుతోంది. తేడా అర్థమవుతోందా మీకు, దీన్ని చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోండి. నాకు బాగా గుర్తు, అనంతపూర్‌లో ఉన్నప్పుడు మా స్నేహితులు కొంతమంది అడుగుతుంటే, నేను ఒకటే చెప్పేవాడిని. ఎక్కువమంది ఎవరికి ఒత్తాసు పలుకుతారో వాళ్ళకి నువ్వు ఒత్తాసు పలకకు అని. ఇదే నా సిద్ధాంతం ఎప్పుడూకూడా. ఎందుచేత? ఎక్కువమంది ఒత్తాసు పలికారంటే ఖచ్చితంగా తప్పే అది.

## సమూహంగా ఉంటేనే మహాభారతాన్ని నిర్మించగలరు:-

గణపతి అంటే గణము అంటే, సమూహం. సమూహంగా మీరు మారపోక పోవచ్చు, ఎన్నికల కాలంలో మారుతూ ఉంటారు చూశారా, పార్టీ ఫిరాయించటానికి. అంటే, మన ఋషులు చాలా నిపుణులు. పార్టీ ఎలా ఫిరాయించాలోకూడా చెప్పారు వాళ్ళు. ఎక్కడ నుంచి పార్టీ ఫిరాయిస్తున్నాం మనం? అర్జునస్థితి నుంచి ద్వైపాయనస్థితికి పార్టీ ఫిరాయించాలి. అంటే ఏంటి, ఏమి చెయ్యాలో తెలీని అగమ్యగోచర స్థితినుంచి ఖచ్చితంగా ఇదే చేసి తీరాలి అనే నిర్ణయాత్మక మైన బుద్ధి. **అర్జున స్థితి మనస్సు, వ్యాస స్థితి బుద్ధి.**

ఈ వ్యాస స్థితి ఒంటరిగా రాదు, దయచేసి ఇది అర్థం చేసుకోండి. ఒంటరిగా ఎందుకు రాదు అని చెప్తున్నాను? వ్యాసుడు భాగవతం రాయటానికి, మహాభారతం రాయటానికి ఎవరి సహాయం అడిగాడు? గణపతి అంటే ఎవరని చెప్పాను నేను,

సమూహం ఉంటేనే మహాభారతం వ్రాయగలరు. సమూహం లేకపోతే మహా భారతము సృష్టించలేరు.

మహాభారతం అంటే మహాభారతం యుద్ధం కాదు, ద గ్రేట్ ఇండియా. వసుధైక కుటుంబం అనేటటువంటి మహాభారతాన్ని మనం రాయాలీ అను కుంటున్నాం. రాయాలీ అనుకోటం అంటే, మార్చాలీ అని కోరుకుంటున్నాం. ఇవంతా మనం ఎందుకు రాసుకుంటాం, ఆచరించ టానికి. **మహాభారతం రాయాలీ అని మనం కోరుకుంటున్నాం కనుక, గణపతిని ఎలా ఉపయోగించుకోవాలో మీకు తెలియాలీ** అంటే, సంవత్సరంలో ఆ వినాయక చవితి ఒక్కరోజే మీరు మొదలెట్టగలరు. మిగతా రోజులలో మేం రాస్తాము- ఆ పిచ్చిపని మాత్రం చేయకండి. మిగతా రోజులలో మీరు చేయలేరు.

పరీక్ష మిస్సయ్యారు మీరు. ఇయర్ ఎండ్ ఎగ్జామినేషన్స్ పెట్టేయండి మాస్టారూ నేను రాసేస్తాను అని వైస్‌ఛాన్సలర్ దగ్గర కెళితే ఏమంటాడు? ఆగవయ్యా అంటాడు, మళ్ళీ గణపతులు రావాలి, మళ్ళీ ఓ సమూహమేర్పడాలి. ఇంతమంది కలసి పరీక్ష వ్రాస్తామంటేనే పరీక్ష కండక్ట్ చేయబడుతుంది కాని, మీ ఒక్కడి కోసము ఎప్పుడూ, ఎక్కడా, పరీక్షలు కండక్ట్ చేయబడవు. ప్రకృతిలో ఉన్న నియమమే అది. నీ ఒక్కడి కోసము ఏం జరగదు.

మహాభారతాన్ని మీరు తిరిగి నిర్మించాలనే దమ్మున్న వాళ్ళు ఎవరైనా ఉంటే, 22వ తారీఖు రండి ఇక్కడికి, ఎలా రాయాలో నేర్చుకుందాం. దానికి పునాది ఏంటి? అర్జునస్థితినుంచి ద్వైపాయన స్థితికి రావాలి. అంటే ఏంటి? మీరు నిర్ణయించేసుకో గలగాలి. భౌతిక జగత్తులో, నా శాయశక్తులా, జీవించటానికి ప్రయత్నం చేస్తాను. ఎంత ఉంటే అంతే ఇంక. దాని గురించి నేను ఎక్కువ కాలాన్ని వృధా చేసుకోను. మిగతా కాలమంతా దేనికి ఉపయోగిస్తాను నేను? ద్వైపాయన స్థితికి ఉపయోగిస్తాను- అనే నిర్ణయానికి ముందు రావాలి.



ఆ నిర్ణయానికి, మళ్ళా మీరు బావిలో నీళ్ళు తాగి ఉంటే, పక్కవాళ్ళ సలహా అడుగుతారు. పక్కవాడు వెర్రాడే. ఏం చెప్తాడు? నీకు మతిపోయిందా అని అడుగుతాడు. ఖచ్చితంగా అదే అడుగుతాడు. మేము ఈపని చేయబోతున్నాం అంటే, మొదటి ప్రశ్న ఏంటంటే నీకు బుద్ధుందా అని అడుగుతాడు. ఎందుచేతంటే వాడికి బుద్ధి లేదు కనుక.

## నిర్ణయాన్ని అమలులో పెడితే ' కృష్ణం వందే వ్రజప్రియం'

బుద్ధి ఉందా అనే పశ్న బుద్ధిలేనివాడే వేస్తాడు. చాలా జాగ్రత్తగా దాంట్లోవున్న అండర్‌లైయింగ్ పొటెన్సీని అర్థం చేసుకోండి. మీకు బుద్ధి ఉన్నదా? అని ఎవడు అడుగుతాడు అంటే బుద్ధిలేనివాడే అడుగుతాడు. బుద్ధి ఉన్నవాడికి ప్రతీచోటా జ్ఞానం కనిపిస్తుంది. సర్వత్రా జ్ఞానం కనిపిస్తుంది. పిచ్చివాడిలోకూడా వాడికి జ్ఞానం కనిపిస్తుంది. ఎలాగన్నది మీరు ఆలోచించండి. కాని ఈ చేతనత్వస్థితి అర్థం చేసుకోండి. భారతదేశము మాత్రమే కాదు, మొత్తము మానవజాతి మారాలి అంటే, ఈ ఒక్క శ్లోకము మీకు కంఠతా ఉంటే చాలు. 'కృష్ణం ద్వైపాయనం వందే' ఏది చెయ్యాలో అది నిర్ణయించు కున్న తర్వాత, ఆ నిర్ణయాన్ని అమలులో పెట్టాలి. అప్పుడు వాడేం అవుతాడు? 'కృష్ణం వందే వ్రజప్రియం'. ఆ స్థితికి వెళతాడు. **వ్యాసుడు కాస్తా వ్రజప్రియుడుగా మారతాడు.** వ్రజమంటే, ఆవులు మేసే చోటు అని అర్థం సంస్కృతంలో. వ్రజదేశము, వ్రజ భూమి, గోశాల అన్నమాట.

అలాగే వ్రజకిశోరం. అంటే, ఆవుల మందలు పెరిగే చోట ఉన్నవాడుగా మారతాడు. ఆ చేతనత్వ స్థితులు అర్థం చేసుకోండి. అది మీలో ఉన్నటువంటి మనస్సు గురించి చెప్పాను కదా. మనస్సు అంటే ఏంటి, **అర్జున స్థితి. అనిశ్చయాత్మక స్థితి.** నిర్ణయించుకోలేని స్థితి. కాని తెలుసు. ఇది చేస్తే ఈ లాభాలున్నాయి, అది చేస్తే ఈ లాభాలున్నాయి అని. ఏది ఎక్కువ లాభమో నిర్ణయించుకోలేని స్థితి. నిద్రపోయే స్థితి మాత్రం కాదు. **వ్యాస స్థితి** ఏమైంది, **నిర్ణయించుకోగలిగే స్థితి.** ఏది ఎక్కువ మంచిదో నిర్ణయించుకుని, దాని ప్రకారం వెళ్ళే స్థితి బుద్ధి. నిర్ణయించుకున్న తరవాత

దాన్ని ఆచరణలో పెట్టాలి కదా, **ఆచరణలో పెట్టగలిగే స్థితి ప్రజప్రియం**, కృష్ణుని యొక్క స్థితి. గోపాలుని యొక్క స్థితి. అంటే ఏంటి? అన్ని ఇంద్రియాలూ కూడా నీ అధీనంలో ఉన్నాయి. వ్యాసుడికి?

వ్యాసుడు ఓ చిన్న తప్పుచేశాడని నేను చెప్పినప్పుడు, వ్యాసుడు యొక్క స్థితిని కించపర్చటంలేదు. మీరుకూడా, ఈ తప్పుని ఎత్తి-చూపించుకోకండి. కొడుకు పెళ్ళి చేసుకోకుండా వెళ్ళిపోతుంటే, ఆపుతాడు. క్రిందటి శ్లోకంలోనే ఉంది. చాలా జాగ్రత్తగా వ్రాస్తారు, చేతనత్వ విజ్ఞానం కదా. ఏ విషమమూ వదల్లేదు. ఎందుచేత? ఆ ఒక్క క్షణంలో అతని ఇంద్రియాలలో కూడా కొంచెం ప్రకంపనలు వచ్చాయి.

కృష్ణుడికి అది రాదు. కృష్ణచేతనత్వంలో ఏది ఉచితమో, ఏది అనుచితమో నిర్ణయించుకున్న తరవాత వాడు ఎవడైనాసరే, ఆఖరికి చాలా ప్రేమ పాత్రమైన అర్జునుడి కొడుకైనా సరే, చంపేయ్ అంటాడు. చంపేశాక ఏం చెప్పాడు, చంపకపోతే నేను చస్తాను అన్నాడు. భారత, మహాభాగవతాలు చదవాలి. ఈ శ్లోకాన్ని మీరు కంఠతా పట్టేస్తే, భాగవతం యొక్క పట్టు మీ చేతిలో ఉంటుంది.

## ఆ విషాన్ని మీరు బయటికి కక్కాలి

కంసుణ్ణి చంపాడు. **కర్మ కర్మే ఎవరికైనా. కృష్ణుడికైనా కర్మ కర్మే.** కంసుణ్ణి చంపిన కర్మవల్ల ఏమవ్వాలి కృష్ణుడు? ఏవిధంగా అయితే కంసుడు చచ్చి పోయాడో అదే విధంగా కృష్ణుడు చావాలి. అభిమన్యుణ్ణి కనుక బ్రతకనిచ్చి ఉంటే కృష్ణుడుకి ఆ చావు పట్టివుండేది. **ఆ సైన్స్ ఆఫ్ నాటు-కోనుకో. నాటు-కోనుకో - ఇదంతా మీరు రీసెర్చ్ చేయాలి భాగవతంలో.** ఇదంతా చేయటానికి మాకు సమయం ఎక్కడుంది, ముందు అడుక్కుతినే విద్య నేర్చుకోనివ్వండి, నేను నేర్చుకోవాలి, నా పిల్లలకి నేర్పాలి.

ఏంటి అడుక్కుతినే విద్య కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ సైన్స్, ఇవంతా అడుక్కుతినే విద్యలు అని నేనెందుకు ఖచ్చితంగా బల్లగుద్ది చెప్పగలను అంటే - తరవాత ఉద్యోగం దొరకటంలేదు మాస్టారు అని అడుక్కుంటూ, నాదగ్గరికే వచ్చారు



చాలామంది. అవంతా చదివి మళ్ళా వాళ్ళను ఏమంటారంటే .. నాకు ఉద్యోగం ఇప్పించండి మాస్టారు అని. నాయనా నువ్వు ఈ టెక్నాలజీ అదీ నేర్చుకున్నావు కదా, నువ్వే కంపెనీ ఒకటి పెట్టుకోవచ్చు కదా అని అంటా నేను. వాడు పెట్టుకోడు. ఎవరో కంప్యూటర్ పెట్టుకుంటే వాడి దగ్గర వీడు జేరతానంటాడు. మీరు అర్థం చేసుకోండి, ఇటు తల్లితండ్రులకీ బుద్ధిలేదు, ఇటు పిల్లలకీ బుద్ధిలేదు. ఇద్దరూ దద్దమ్మలే, ఇద్దరూ ఒకే బావి నీళ్ళు తాగి పిచ్చెక్కినవాళ్ళు. అది చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోండి. అది అర్థమైతే మీ పిచ్చితనం మీకే కనిపించి నవ్వుకుంటూ ఉంటారు మీరు. అది ఖండించేయగలగాలి, మనమే ఖండించలేకపోతే ఇంకెవడు ఖండన చేస్తాడు, మీరు చేసి చూపించాలి. కాని చేసి చూపించే దాంట్లో ఋషులు మనకి ఆదర్శం.

ఎక్కడకో వెళ్ళిపోయి చేసేస్తాం అని కాదు, మీరు ఎక్కడ ఉన్నారో అక్కడనుంచి మొదలవ్వండి. ఇవాళ కొత్త అఖండ జ్యోతిలో గురువుగారు ఒకతనికి ఉత్తరం వ్రాశారు. ఒకడు 1949 లో గురువుగారికి ఉత్తరం వ్రాశాడు. కాంగ్రెస్‌లో ఉన్నానండీ నేను, (అది అప్పటి ఉత్తరం సంగతి చెప్తున్నాను.) ఇలా అయిపోయింది కాంగ్రెస్, భ్రష్టు పట్టిపోయింది అని వ్రాశాడు. 1949 కే వాడు భ్రష్టుపట్టింది అని వ్రాశాడు. మనం ఇప్పటికీ ఇంకా భ్రష్టుపట్టింది అనుకోవటంలేదు. ఎందుచేత? ఒకే బావిలో నీళ్ళు తాగాం కనుక. అది ఎప్పుడూ గుర్తుంచుకోండి, అందుకు ఈ కథ చెప్పేది నేను. మీకు అసలు వాళ్ళకి పిచ్చెక్కిపోయింది అనే పిచ్చి మీకెందుకు ఎక్కటంలేదంటే, మీకూ బుద్ధి భ్రష్టుపట్టింది కనుక. అందుచేత ఏంచేయాలి? ముందు ఆవిషాన్ని మీరు బయటికి కక్కాలి, కడిగేసుకోవాలి.

## గురుదేవులు మంచినీళ్ళు కూడా ముట్టుకోలేదు

**గురుదేవులు తనకిచ్చిన జవాబు ఆయనవి ఋషి వాక్కులు కదా, అనుసరణీయం.** నాలుగు రాళ్ళు నువ్వు వెనకేసుకో, కాని, నేను చెప్పిన మార్గాన్ని మరవకు. ఎప్పుడైనా అవకాశం వచ్చి మీరు గణపతులు అవ్వగలుగుతే, కలిసి పని చేయగలుగుతే చేసుకోండని ఆయన '49లో ఆ ఉత్తరం వ్రాశాడు, **1985లో నాలుగు**

రోజులు ఆయన మంచినీళ్ళు కూడా ముట్టుకోలేదు. ఎందు చేతంటే కలిసి మనుష్యులు లేరని. అప్పటికీ ఇప్పటికీ ఎన్ని సంవత్సరాలు తేడా వచ్చింది, 49-85 అంటే 36 ఏళ్ళు. నాలుగురోజులు ఆయన ఆహారాన్ని మానేశారు. దేనికి అంటే నేను చేసింది ఇదా అని. అంటే- అప్పుడు మాతాజీ చెప్పిందట. నువ్వు నేర్పిందేంటి, వాళ్ళు చేస్తేనేం, చెయ్యకపోతేనేం మీరు చేస్కుంటూ పొండి అంటే, అప్పుడు పంచ వీరభద్రసాధన చేసుకుని, మనుష్యుల్ని ఇక్కడ ఎలా సమీకరించాడో, దేవతా శక్తుల్ని అలా సమీకరించి పెట్టాడు అక్కడ. మనుష్యులే కలవలేకపోతే, 'దేవతలు' అంటే ఏంటంటారో తెలుసా నాతో మనుష్యులు, అయితే అది చెప్పేయండి మాస్టారు, మేం పంచవీరభద్ర సాధన చేసేస్తాం అని.

ఒకే బావి నీళ్ళు కదా, మనం చేయగలమో, చేయలేమో చూసుకోం, గురువు గారు పంచవీరభద్ర సాధన చేశారు కనుక, మేమూ చేసేస్తాం. నువ్వు ఎలా చేస్తావ్, ఇక్కడే కలవలేకుండా ఉన్నవాడివి దేవతలతో ఎలా కలుస్తావు? కృష్ణం వందే వ్రజప్రియం గురించి చెప్తున్నాను. కృష్ణుడు మొత్తము వ్రజలోకంలో చేసినదంతాకూడా కలిసి ఉండటమే.

## ఇంద్రుణ్ణి ఎదిరించండి

కలిసివుంటే, వేలిముద్ర గాళ్లైన, 10, 15 ఏళ్ళ వయసు, ఇంకా చిన్నకుర్రాళ్ళు అయినటువంటి వాళ్ళుకూడా ఇంద్రుణ్ణి ఎదిరించవచ్చు. ఇంద్రుడు ఎవడు? దేవతల యొక్క రాజు. దేవతల యొక్క రాజుని ఎవరు ఎదిరించారు, ఈ పిల్లలు ఎదిరించారు. మనం, దేవతల యొక్క రాజుని ఎదిరించటమా! ముందు దేవతలని అడుక్కోకుండా ఉంటే చాలు. పదేపదే నేను చెప్తొన్నది అదే. దయచేసి దేవతల్ని మీరు అడుక్కోకండి. దేవతల్ని ఏం చేయాలి మీరు, శాసించాలి. అడుక్కునే వాళ్ళకి శాసించే బుద్ధి ఎలా వస్తుంది. మీరు చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. ఎందువల్ల రాదు, ఒకే బావిలో నీళ్ళు తాగాం కనుక.మీరది బాగా గుర్తుంచుకోండి. ఆ కథ ఎందుకు చెప్తానో నేను. చెప్తే, మీకు ప్రతీక్షణం గుర్తొస్తూవుంటుంది. మీరు ఎక్కడ ఎక్కడ తప్పు చేసినా, మీకు గుర్తొచ్చేస్తుంది. దీనికి కారణం ఏంటి, అప్పుడు మళ్ళా మీరు హాయిగా ఉండచ్చు, మీ తప్పు కాదుకదా అది. ఎవరి తప్పు అది, మీ ఇష్టం మీరు ఎలా అయినా దాటేయచ్చు దాన్ని. దాటదల్చుకున్నవాళ్ళు. కృష్ణుడు అంటే అర్థం ఏంటంటే- ఇంద్రియాలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిన్ను బాధించకూడదు.

నాకు ఘాట్‌లో దుర్గా మంత్రం ఇచ్చినటువంటి ఆయన, ఎలాంటి ఆయన అంటే ఎక్కడ, ఘాట్‌లో కూర్చుని సాధన చేస్కునేవాడు, నది అలా ప్రక్కన ప్రవహిస్తూ ఉండేది. వంగుతే నీళ్ళు అందుతాయి. వరదలొస్తే మునిగిపోయేవాడు ఆయన అందులో. నీటిమట్టం పైకి వెళ్ళిపోయేది ఎక్కడికో. వరదలంతా పోయాకా ఆయన మట్టిలో కూరుకు పోయి ఉండేవాడు. అప్పుడు అందరూ వచ్చి ఆయనని తీస్తే, ఆయన అక్కడే ఉండేవాడు మళ్ళా.

ఆయన దగ్గరికి మంత్రోపదేశం తీసుకున్నటువంటి ఒక వ్యక్తి వచ్చాడు. చాలా బావుంది స్వామీ, మూడు మూడు గంటలు, నాలుగు నాలుగు గంటలు కూర్చుని, సాధనలు చేయగలుగుతున్నాను అన్నాడు. అయితే తక్షణం మానెయ్ అన్నాడు. తరవాత తరవాత నాకు అర్థమైంది. పిహెచ్.డి. అదీ చేస్తొన్నప్పుడు. ఎందుకు మానేయమన్నాడు అంటే, నీకు రుచి కలగ చేసింది- బంధమే. నువ్వు వశువ్వే. నువ్వా రుచికి కట్టుబడ్డావు. వీడు తాగుడికి ఎలా బానిసయ్యాడో, నువ్వు జపం చేయకపోతే .. మీరు చూసుకోండి చాలామంది జపం చేయలేక పోతే నాకు చాలా బాధగా ఉంది మాస్టారు అంటారు. నువ్వు ఆ బావిలో నీళ్ళు తాగావు. ఆ పిచ్చి వదిలేసుకోండి. అందుచేత అవుతే జపం చేసుకోవటం వది లేయాలా సార్? అదా నేను చెప్పింది? మీరు ఆ బావిలో నీళ్ళు తాగితే ఇలాంటి ప్రతిస్పందనే వస్తుంది. అందుకనే ప్రతీచోటా ఆ కథ గుర్తుంచుకోమని చెప్పేది.

## ధర్మాధర్మాలు ఎవరు నిర్ణయించాలి?

మంత్రజపం మానెయ్యమన్నాడు. ఎందుచేత? నువ్వు దేనికీ బంధితుడివి కకూడదు. మంత్రజపానికి బంధితుడివి అయిపోతే, అక్కడా బంధమే నీకు. వివేకానంద

దానినే ఏమనేవాడు? గొలుసు ఇనపదవుతేనే, బంగారందవుతేనే, ఇనప సంకెళ్ళు వేసారయ్యా, నాకు బంగారపు సంకెళ్ళు వేసారు. జైల్లో ఉన్నవాడికి వాడికి బయట వాడెవడో ఇనప సంకెళ్ళు వేశాడు, నువ్వేంచేసుకుంటున్నావ్, నువ్వే బంగారపు సంకెళ్ళు వేసుకుని ఫోజుకొడు తున్నావ్, నేను ఎంత గొప్పవాణ్ణో తెలుసా అని అన్నాడు.

ఎవరు మహామూర్ఖులో ఆలోచించుకోండి. ఎందువల్ల అలాంటి ఆలోచనలు వస్తున్నాయి? ఎన్నిరకాల బావుల్లో నీళ్ళు తాగిస్తున్నానో మీరు చూసుకోండది. పిల్లవాడి కోసమనో, వాడికోసమనో చిన్న చిన్న అలవాట్లు దగ్గిరనుంచి పెద్ద పెద్ద అలవాట్లు అన్నీ నీకు బంధాలే. ఏదైనా సరే అది. అది కృష్ణుడు చెప్పింది.

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహంత్వాం సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥ (భ॥గీ॥ 18 - 66)

ఏది ధర్మమో, ఏది అధర్మమో నువ్వు నిర్ణయించుకోలేవు. నేను నిర్ణయించు కుంటాను అని మీరు చర్చ చేస్తారు తమాషా అది. ... ధర్మాధర్మాలు నిర్ణయించే శక్తి మనకి లేదు. **ధర్మాధర్మాలు ఎవరు నిర్ణయించాలి? ఆ దేశకాల పరిస్థితుల్లో పుట్టిన గురువులు.** మళ్ళా 5000 సంవత్సరాల క్రిందట పుట్టిన గురువు మీకు చెప్పలేదు. సాయిచరిత్ర, గురుచరిత్ర చదువుతోన్నప్పుడు, ఈ గందరగోళం వస్తుంది చాలామందికి. ముఖ్యంగా స్త్రీలకు వస్తుందిది.

ఎక్కడ గందరగోళం వస్తుంది? కొన్ని రోజులు వాళ్ళను భాగవతం చదవద్దనో, ఇది చదవద్దనో, దేవాలయాలకి రావద్దనో గురువే చెప్పాడక్కడ. ఈ కాలపు గురువులు ఏం చెప్తున్నారు? రావచ్చు అని చెప్తున్నారు. ఇంతకీ ఏది ధర్మం? నువ్వు ఎవరివి నిర్ణయించుకోవటానికి? మీకు నచ్చితే చెయ్యండి, నచ్చకపోతే మానెయ్యండి అది వేరే విషయం.

కాని నిర్ణయించే హక్కు గురువులకుంది. గాయత్రీ అందరూ చెయ్యచ్చు, గాయత్రి చెయ్యకూడదు - గురువులే చెప్పారు. ఆ కాలపు గురువులేమో అందరూ చెయ్యకూడదన్నారు. ఈ కాలపు గురువులేం చేస్తున్నారు. నువ్వు అసలు పుట్టిందే



గాయత్రీ చెయ్యటానికి అంటున్నారు. మానవ శరీరంలో ఉన్న .. అంటే ఎవర్ని నమ్మాలి, మనస్సు పెట్టి, ఆ ప్రశ్న వెయ్యద్దు అది నేర్చుకోండి. అది కృష్ణుడు చెప్పింది.

## గురువులు తాగిన బావిలో నీళ్ళు తాగుదాం మనం

నేను ఏం చెప్పాను? నేను అంటే, శరీరం ఉన్న వాడు కాదు. ఆ గురుసత్తా ఏదైతే అనేక రూపాలలో దిగి వచ్చిందో, వారే ఆ దేశకాల పరిస్థితులకి అనుగుణ్యంగా మీరు ఎలా జీవించాలో చెప్పారు. నువ్వు జీవించావా ఓ.కె. జీవించలేదు, ఎందుకు జీవించలేకపోతున్నావ్? బావిలో నీళ్ళు తాగావు కనుక. గురువులు చెప్పినట్టు ఎందుకు జీవించలేకపోతున్నావ్? చెప్పండి ఎందుకు జీవించలేక పోతున్నారో.... అంతే. అర్థమైందా. అందుచేత ఏం చెయ్యాలి, **ఆ గురువులు తాగినటువంటి బావిలో నీళ్ళు తాగుదాం మనం. అప్పుడు వాళ్ళలాగా ప్రవర్తిస్తాం. అప్పుడు అది, కృష్ణం వందే ప్రజప్రియం అవుతుంది.** అప్పుడు ఏమవుతారు మీరు? **కృష్ణం నారాయణం వందే ఏ చేతనత్వం అవుతే అంతటా.ఉందో అన్నింటికి కారణమో ఆ అఖండ చేతనత్వంలో మీరు లీనమైపోతారు. ఇది భాగవతానికి పునాది.**

నిరంతరము మీరీ శ్లోకాన్ని గుర్తుంచుకుంటూ ఉండండి. అందుకని దీన్ని మళ్ళీ మళ్ళీ రిపీట్ చేస్తాను నేను. రిపీట్ ఎందుకు చేస్తున్నాను అంటే, మీరు మారాలి అని. కాదండీ ఈ బావిలో నీళ్ళే మాకు నచ్చాయి అంటే, మీరు మారలేరు. కనీసము ఆ వ్యధ మీలో పుట్టుకొస్తే... ఏంటి మీకు పుట్టుకురావాల్సింది. ఇక్కడ ఎంత ఉచ్ఛస్థితిలో మీరు ఎదిగినా, అసంపూర్ణమైన , ఖండితమైనటువంటి వ్యక్తిత్వాలో, అఖండమైన టువంటి చేతనత్వ స్థితి నాకు రాదు. ఈ జగత్తులో ఎక్కువమందేది నమ్ముతున్నారో అది తప్పు. మరి ఉచితమేది, అనుచితమేది... మళ్ళా మీరు నిర్ణయించు కోవద్దు దయచేసి. **నువ్వు తీసుకున్న నిర్ణయము ఆ గురువరంపరలో ఎవరో ఒకళ్ళు చెప్పిందానికి ట్యూన్ అయి ఉండాలి.** సి.వి.వి. కయినా ట్యూన్ అయి ఉండాలి, బ్లావెట్స్కీకి అయినా ట్యూన్ అయి ఉండాలి, లాహిరీమహాశయకు అయినా ట్యూన్ అయి ఉండాలి, యోగానంద కయినా ట్యూన్ అయి ఉండాలి. శ్రీరామశర్మ ఆచార్య,

భగవతీ దేవిశర్మ, రామకృష్ణ పరమహంస, శారదామాత, షిర్డీసాయి, సత్యసాయి, అరవిందో - ఇది అంతా కలుపుతే వచ్చేటటువంటి ఈ అఖండమైన చేతనత్వాన్ని కృష్ణ చేతనత్వం అంటారు. మళ్ళా కృష్ణుడు అనే ఒక వ్యక్తిని ద్వాపర యుగంలో పుట్టాడని అనుకోవద్దు, ఇది మనసులో గుర్తుంచుకుని నాతోపాటు ఈ శ్లోకాన్ని 3 సార్లు చదవండి.

## నిద్రా జగత్తు అనే అద్భుతమైన క్షేత్రం తెరవబడుతోంది

*చింతామణిర్లోకసుఖం సురద్రు: స్వర్గసంపదామ్ ।*
*ప్రయచ్ఛతి గురు:ప్రీతో వైకుంఠం యోగి దుర్లభమ్ ॥*

చిన్నపిల్లలకి చాక్లెట్ ఇచ్చినట్టు, మరి ఈ బావిలో నీళ్ళు తాగి ఉన్నాం కదా. అందుచేత ఈ బావిలో నీళ్ళకి ఏవగింపు కలిగి, ఆ మంచిదికూడా ఈ బావిలో నీళ్ళలాంటి రుచే రావటానికి ఇంకో శ్లోకం కంఠతా పట్టండి మీరు.

ఎందుకు ఇదంతా చెయ్యమంటున్నామూ అంటే, భౌతిక జగత్తులో కావల్సినవి కూడా మీకు లభిస్తాయి. స్వర్గ జగత్తులో ఉన్నవికూడా మీకు లభిస్తాయి, ఇదంతా కాకుండా వైకుంఠంలో ఉన్నటువంటిదికూడా మీకు లభిస్తుంది. ఇవి 3 చేతనత్వాలు మీరు గుర్తుంచుకోండి.

జాగ్రదావస్థలో లభించేది చింతామణి, పరశువేది. మనం అందరం ఇప్పుడు మాట్లాడుకుంటున్నది జాగ్రదావస్థ అంటాం. ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియానో, అమెరికా ప్రెసిడెంటో, సైంటిస్టో, బిజినెస్‌మేనో, పొలిటీషియనో, ఎవడైనా కానివ్వండి వాడు, వాడు ఏ స్థితిలో ఉంటాడు? జాగ్రదా స్థితిలో ఉంటాడు. ఇదంతా కాకుండా కొంత మంది ప్రజల భవిష్యత్ మార్చటానికి కలలుకంటూ ఉంటారు. ఈ లీడర్స్, అందరూ. సైంటిస్ట్‌లు, బిజినెస్ పీపుల్, లీడర్‌షిప్ లెవెల్‌లో ఉన్నటువంటివాళ్ళు. వాళ్ళు ఆలోచిస్తారు, వాళ్ళు ఆలోచించింది మనం ఫలితం పొందుతుంటాం.

కంప్యూటర్స్ అవీ మనం కనిపెట్టలేదు, ఎలక్ట్రిసిటీ మనం కనిపెట్ట లేదు. ఎవడో కనిపెట్టాడు, ఆ కనిపెట్టింది ఏం చేస్తున్నాం మనం, ఉపయోగించుకుంటున్నాం.



ఇది కలల జగత్తు. వాళ్ళు కలలుగని, దానికి కావలసిన ప్రయత్నాలు చేసి, దాన్ని భౌతిక జగత్తులోకి దింపుతారు. అక్కడకూడా మీరు ఏం కలలు కంటారో అది జరిగి పోతుంది అన్నాడు. జాగృదావస్థ, స్వప్నావస్థ. ఇది అంతా కాకుండా **రాబోయే 5, 6 సంవత్సరాలలో ఇంకొక అద్భుతమైన క్షేత్రం తెరవబడుతోంది. నిద్రా జగత్తు. నిద్ర స్థితి ఇప్పుడు వృధా అనుకుంటున్నాం** మనం. నిద్రపోయే కాలమంతకూడా వృధా అనుకుంటున్నాం, కాని ఒక్క విషయం మీరు గుర్తుంచుకోండి. నిద్ర రావటం లేదని చెప్పి అనేకమంది కోటీశ్వరులు డాక్టర్ల వెంటపడుతున్నారు. వాళ్ళు కోట్లు కోట్లు రూపాయలు ఇచ్చేయగలరు, మీరు మీ నిద్ర వాడికి ఇచ్చేయగలుగుతే. మీరు ఎంత కోటీశ్వరులో మీకు అర్థం అవుతోందా.

మీ నిద్ర కొంచెం అలా కట్‌చేసి, కట్‌పేస్ట్‌లాగా, ఓ కోటీశ్వరుడికి మీరు మీ నిద్ర ఇవ్వగలుగుతే, వాడు మీకు కోట్లు కోట్లు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాడూ అంటే నమ్ముతారా, నమ్మరా? తెలుసా డాక్టర్లుచుట్టూ చాలామంది కోటీశ్వరులు తిరుగు తున్నారు ఎందుకు? నిద్రలో ఉన్నటువంటి ఆకర్షణ అది. మీకెప్పుడైనా ఆ ప్రశ్న వచ్చిందా అసలు. అది రాబోయే 5 6 ఏళ్ళల్లో .. ఇప్పుడు ఏవిధంగా అవుతే జాగృత అవస్థలో మనం ఇష్టం వచ్చినట్టు మార్పులు చేసుకోగలుగుతున్నామో, **స్వప్నావస్థలో ఇష్టం వచ్చినటువంటి మార్పులు 5 రకాలైనటువంటి వ్యక్తులు ఇప్పుడు చేసుకో గలుగుతున్నారో, వాళ్ళకి తెలియకపోయినా. అందుకే అలాంటి వాళ్ళ కలలు నిజం అవుతాయి.**

పొలిటీషియన్స్, అంటే కండిషన్ ఏంటి, నిజమైన పొలిటీషియన్స్. తరవాత సైంటిస్ట్‌లు. మళ్ళా అక్కడ కండిషన్ ఏంటి, నిజమైన సైంటిస్ట్. అందరూ సైంటిస్ట్‌లు అనుకోకండి, సైన్స్ చదివిన వాళ్ళందరూ సైంటిస్ట్‌లు కారు. మూడవది, బిజినెస్ మేన్. బిజినెస్‌చేసేవాళ్ళందరూ కూడా, బిజినెస్ మేన్ కాదు. బిజినెస్‌మేన్ ఎలాంటి వాడంటే,వాడు మట్టిని ముట్టుకుంటే బంగారం అవుతుంది. బంగారాన్ని ముట్టుకుని, ఇప్పుడు షేర్ మార్కెట్‌లో ఏమవుతోంది, మట్టి అవుతోంది. అది బిజినెస్ ఎలా

అవుతుంది.బిజినెస్ అంటే ఏదవుతుందంటే భారతదేశం విభజన అయినప్పుడు కోటీశ్వరులు కట్టుబట్టలతో వేరైపోయారు. మళ్ళీ వాళ్ళు ఏ ప్రాంతానికి వెళ్ళారో, వాళ్ళు అక్కడ కోటీశ్వరులు అయ్యారు. ఎందుచేతంటే వాళ్ళు బిజినెస్‌మేన్. వాళ్ళు మట్టి ముట్టుకుంటే బంగారమవుతుంది. అలాంటి స్థితి. అది స్వప్న స్థితి. .. అందరూ బిజినెస్‌మేన్‌లు కారు, అందరూ పొలిటీషియన్స్ కారు, అందరూ సైంటిస్ట్‌లు కాదు. ఇంకా నాలుగోది, అభినేతలు. ఇదంతా కాకుండా 5వ వాడు సాహితీవేత్త. అభినేతలకు వాక్ ఇచ్చేది సాహితీవేత్తేగా. ఈ 5గురు కలల జగత్తుని భౌతిక జగత్తులోకి తెచ్చే అద్భుతమైనటువంటి సాధకులు.

నిద్రాస్థితిని మనుష్యులవరకూ అందచేసేవాళ్ళు ఋషులు

**ఈ ఐదుగురిని దాటి వున్న ఒక స్థితి ఉందని చెప్తున్నాను నేను.** నిద్రాస్థితి. **నిద్రాస్థితిని మనుష్యులవరకూ అందచేసేవాళ్ళు ఋషులు.** ఈ తేడాని అర్థం చేసుకోండి. భౌతిక జగత్తులో ఎలాగైతే ఈ 5 సమూహాలు ఉన్నాయో, భౌతిక జగత్తులో ఈ 5 సమూహాలూ ఏం చేస్తున్నాయి, స్వప్నాలను .. **అలాగే నిద్రాస్థితిని భౌతిక జగత్తులో చేర్చే ఋషులు కూడా 5 సమూహాలుగా ఉన్నారు. ఋషులు, మహర్షులు, రాజర్షులు, బ్రహ్మర్షులు, దేవర్షులు.** పైన చెప్పిన ఐదుగురికి ధీటుగా. అందుచేత ఈ పొలిటీషియన్స్ కానీ వీళ్ళందరూకూడా ఋషులే. కాని ఏమని చెప్పచ్చు మనం, అజ్ఞానంలో ఉన్న ఋషులనవచ్చు. పరిణామక్రమంలో చివరికి వాళ్ళు అక్కడికే వెళతారు.

బిజినెస్‌లో ఉన్న వాళ్ళందరూ కాదు. మట్టి ముట్టుకుంటే బంగారం చెయ్య గలిగే వ్యక్తులు ఇప్పుడూ బిజినెస్‌లో ఉన్నారు. నేను మీకు చాలాసార్లు ఉదాహరణ చెప్పాను కదా, నాకళ్ళముందే, గుంటూరులోనే ఇద్దరు పక్కపాడి వ్యాపారం మొదలు పెట్టారు. కాని ఒకరు సంవత్సరానికి 2 కోట్లు పన్ను కడుతోంటే, రెండోవాడు అక్షరాలా అడుక్కుతింటున్నాడు. ఇద్దరూ తెలుసు నాకు. పక్కపాడి వ్యాపారమే ఇంతా చేస్తే. ఏంటి తేడా, చేతనత్వంలో తేడా ఉంది, చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి, అందుకు మీకు నేను చాలా చాలా చెప్తున్నాను.



చేతనత్వాన్ని మార్చేసుకుంటే మీ జీవితాలు మారిపోతాయి

**మీరు అనుకున్న దాన్ని సాధించలేకపోవటానికి కారణము, మీ చేతనత్వం మార్చలేకపోవటమే.** ఇక్కడకూడా నేను చాలామందికి చెప్తూవుంటా. దేవాలయంలో చాలామంది నన్నొక ప్రశ్న వేస్తూవుంటారు. అదంతా వస్తే ఎక్కడ పెట్టుకొంటాం మాస్టారు అని. సీమితమైపోయావు నువ్వు. పదిమందివస్తే ఎలాగ అంటారు. సీమితమైపోయావు. దేవాలయంలో ఉన్న వాళ్ళు సీమితమైపోయారు.

నర్మదానది ఒడ్డున, ధునీవాలాబాబా అని ఒకతను ఉండేవాడు మొన్న మొన్నటి వరకూ. ఆ ప్రక్కనే ఒక ఆశ్రమం ఉండేది. ఈయన నది ఒడ్డున ఉండేవాడు. ఓసారి ఆశ్రమంనుంచి ఒక వ్యక్తి పరిగెట్టుకు వచ్చాడు ఈయన దగ్గరికి. 600 మంది వస్తున్నారు, అకస్మాత్తుగా రాత్రికి రాత్రి, ఆశ్రమంలో భోజనవసతి లేదు అన్నాడు అతను. ఇంత ఇసక తీసిచ్చాడు. 600 మందికి సరిపోయే భోజనం అయిపోయిందది. ఏంటి తేడా? ఇసకేగా ఇచ్చింది ఆయన. మీరు ఇలాంటివి చాలా చదివుంటారు, మీ కళ్ళముందే చాలా జరిగి ఉంటాయి.

**కేవలము మీ చేతనత్వాన్ని మార్చేసుకుంటే మీ జీవితాలు మారి పోతాయి** అదీ భాగవతము చెప్పేది మొత్తముగూడా. క్షణంలో మారిపోతారు మీరు. ఒక్క క్షణమే. ఆ చేతనత్వాన్ని మీరు ఎందుకు మార్చుకోలేకపోతున్నారు, బావిలో నీళ్ళు. బావిలో నీళ్ళు తాగినా, చేతనత్వాన్ని మార్చుకోగలను అనుకుంటే మారిపోతుంది. ఎందుచేతంటే **చేతనత్వానికి, ఆహారానికి సంబంధం లేదు. ఆ సంబంధం మనం పెట్టుకున్నాం.** మనం పెట్టుకున్నాం కనుక ఏం చేస్తున్నాం? మనకు ఈ సంబంధమే తెలుసు. ఆహారం ద్వారా చేతనత్వాన్ని మార్చుకోవటం.

అదే చెయ్యండి. మేము అక్కడ్నుంచే వస్తాము, తినే విధానంలో ఆహారం ప్రసాదము అవుతుంది అది. మీరాబాయి విషం తాగింది. ఏమీ అవలేదు. మనం అమృతం తాగుతున్నాం. అమృతాహారం అంటే అదే కదా. వాంతులైపోతాయి, పట్టంలేదు, తలనొప్పిగా ఉంది, మాస్టారూ కాఫీ తాగొచ్చా అని అడుగుతారు నన్ను. ఎందుకంటే అమృతాహారం తిన్నానండీ తలనొప్పి వచ్చిందండంటారు. అది తప్పా ఒప్పా అని నేనం

అనటంలేదు. ఎందుకది వస్తోంది మనకి, బావిలో నీళ్ళు తాగాం. అర్థమౌతోందా,అందుచేత

చింతామణిర్లోకసుఖం సురద్రు: స్వర్గసంపదామ్ ।
ప్రయచ్ఛతి గురు:ప్రీతో వైకుంఠం యోగి దుర్లభమ్ ॥

చేతనత్వాన్ని మార్చుకోండి మీరు. పై వాడు ఆఫీసరు. వాడు ఎంత తిట్టినా నువ్వు నియంత్రణలో ఉంటావు, ఎంత కోటీశ్వరుడైనా కానివ్వండి. అదే ఇంటికి వస్తారు, ఉతికి ఆరేస్తాడు. ఇక్కడ నియంత్రణలో ఉండలేకపోతున్నాను మాస్టారు, ఎంత నటన అది. నువ్వుండలేవా నియంత్రణలో, ఆఫీసరు దగ్గరెలా ఉన్నావు నియంత్రణలో. చేతనత్వం మారింది అంతే. అక్కడ నీలో నౌఖరు అనే చేతనత్వం ఉంది కనుక నువ్వు నియంత్రణలో ఉన్నావు. ఇక్కడ .. ఇంతా చేస్తే ఏమీ చెయలేడు. ఓ చిన్న అలవాటు వీడు మానుకోలేడు, వాడు మిగతావాళ్ళ అలవాట్లు మానుకో మంటాడు. నేను బాస్ని అంటాడు. ఎందుచేత, బావిలో నీళ్ళు తాగావు కనుక. చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. మన బలహీనతల్ని మనం చాలా గొప్పగా చెప్పుకుంటాం. అది చేయకండి. ఇక్కడ ఈ తేడా నేను చెప్పింది చేతనత్వ విజ్ఞానంలో. మీరు చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. **జాగృదావస్థ నుంచి స్వప్నస్థితిలో జీవించగలిగే వాళ్ళు, ఈనాడు ప్రపంచాన్ని శాసిస్తున్నారు.**

స్వప్నాలు అమ్ముతున్నారు

రాజకీయవేత్తలు అందరూ అంతేకదా, నేను ఇది చేసేస్తాను, మీకు అది చేసేస్తాను, ఇది చేసేస్తాను, అంటే ఏం అమ్ముతున్నాడు వాడు? స్వప్నాలనేగా అమ్ముతున్నాడు. శాస్త్రవేత్త ఏం చెప్తున్నాడు, నేను కేన్సర్కి మందు కనిపెడతాను అనిచెప్పి ప్రభుత్వం దగ్గిర కోట్లు కోట్లు లాగుతున్నాడు. కనిపెడతాడులెండని అంటాడు. మిమ్మల్ని మోసగిస్తున్నాడని నేనటం లేదు. కాని వాడు స్వప్నాలనేగా అమ్ముతున్నాడు, రచయిత అసలు సిసలైన స్వప్నాలు అమ్ముతున్నాడు. ఖచ్చితంగా. పాపం నటుడు నాట్యంకూడా చేసి అమ్ముతున్నాడు స్వప్నాలని. ఈ తేడా అర్థం చేసుకోండి.

చేతనత్వంలో మీరు ఎవర్ని గొప్ప అనుకుంటున్నారో, వాళ్ళందరూ గూడా స్వాప్నిక జగత్తులో జీవించేవాళ్ళే. అవునా కాదా, అదేవిధంగా ఈ **ఋషులు** అంతకంటే



పై స్థాయివాళ్ళు. వాళ్ళు స్వాప్నిక జగత్తులో జీవించటం లేదు, **నిద్రాస్థితిలో జీవిస్తున్నారు.** అది మనకి అనుభూతిలేని చేతనత్వం. అంటే నిద్ర అంటేనే, అర్థం ఏంటంటే యు ఆర్ నాట్ ఎవేర్.

నువ్వు ఇప్పుడు నిద్రపోయావ్, నిద్ర లేస్తావ్, లేచాక తెలుస్తుంది నిద్రపోయావని. నిద్రలో నీకు తెలీదు, నిద్రపోతున్నావని. తెలిసిందంటే నిద్రలో నిద్రపోయానని కలగంటున్నావన్నమాట. అంతేకదా! కల అవుతుంది అది. అందుచేత ఈ అన్ అవేర్నెస్ ఉందే, అజ్ఞానం ఉందే, **ఈ అజ్ఞాన స్థితిని జ్ఞానముగా మార్చే 5 స్థితులున్నాయి.** దాన్ని చాలా జాగ్రత్తగా మీరు నోట్చేసుకోండి. ఋషి, మహర్షి, రాజర్షి, బ్రహ్మర్షి, దేవర్షి - 5 చేతనత్వా లున్నాయి. ఏవిధంగా అయితే రచయితలు ఈ జాగ్రదావస్థలో పరిస్థితులను సృష్టి చేస్తారో, ఆ విధంగా దేవర్షులు ఆ జగత్తులో పరిస్థితులను సృష్టి చేస్తారు. దానికి ఉదాహరణ నారదుడు. విష్ణువు వాళ్ళూ కూడా నారదుడు వ్రాసిన నాటకంలోనే నటిస్తారు. మీరు కాస్త జాగ్రత్తగా ఆలోచించుకోండి చెప్పినటువంటి మాటల్ని. అసలు స్క్రిప్ట్ అంతా నారదుడు వ్రాస్తాడు. అవునా, కొంచెం మీకు ఆ జ్ఞానం ఉంటే ఇంకా సులభం అవుతుంది.

అందుచేత నారదుడ్ని ఏమని పిలుస్తాం దేవర్షి అని పిలుస్తాం. వశిష్ఠుడ్ని బ్రహ్మర్షి అని పిలుస్తాం. అందుచేత వశిష్ఠుడు ఎవడన్నమాట, ఒక విశిష్టమైనటువంటి కార్యక్రమాల్ని చేతిలో పెట్టుకుని, రాముడు వాళ్ళకు కూడా ... యోగవాశిష్ఠం చెప్తాడు. రాముడికీ వాళ్ళకీ కూడా ఎలా జీవించాలో చెప్తాడు - బ్రహ్మర్షి. రాజర్షి - వాళ్ళని కాపీ కొడతాడు. అంతేకదా, మీరు వశిష్ఠులైనటువంటి వాళ్ళని నమ్మాలి. కాని వాడు ఎప్పుడవుతాడు, విశ్వామిత్ర స్థితిలో ఉంటే, విశ్వామిత్ర స్థితి అంటే ప్రపంచం అంతా మిత్రంగా ఉండాలి. ఒకళ్ళూ ఇద్దరూ కాదు. మిగతావాళ్ళందరూ మహర్షులే. రాజర్షులుకూడా కాదు. మహర్షుల కంటే తక్కువ, ఋషులు. ఈ స్థాయి పురాణాలు అవీ చదువుతోన్నప్పుడు మీరు గుర్తుంచుకోండి. ఒకళ్ళు కాదు. ఋషి, మహర్షి, రాజర్షి, బ్రహ్మర్షి, దేవర్షి. ఈ ఐదింటికీ ధీటుగా భౌతిక జగత్తులో నిజమైన 5 గురు స్వప్నజగత్తును ఉపయోగించుకున్నారు.

భారతదేశానికి స్వాధీనం వస్తే తప్ప భాగవతాన్ని చెప్పలేం

దానికంటే తక్కువ ఎవరున్నారు? అబద్ధమైనటువంటి ఐదుగురు. అబద్ధమైన ఐదుగురు అంటే ఏంటి, ఓ నెహ్రూయో, ఓ .. ఓ హిట్లరో వీళ్ళు నిజమైన రాజకీయవేత్త ఇప్పుడున్న రాజకీయవేత్తలు అందరూ నకిలీ రాజకీయ వేత్తలు. ఆ స్థాయి అర్థం చేసుకోండి. ఓ బజాజ్, ఓ బిర్లా, ఓ టాటా వీళ్ళు వ్యాపారవేత్తలు. మిగతా వాళ్ళందరూ నకిలీ వ్యాపారవేత్తలు. కాని వాళ్ళు బెటర్ అది గుర్తుంచుకోండి. అందరికంటే వాళ్ళు బెటర్. ఉద్యోగస్తులకంటే వాళ్ళు బెటర్. ఎందుచేతంటే ఉద్యోగస్తులు అడుక్కుతినే వాళ్ళు, అడుక్కుతినేవాళ్ళకి, నిర్ణయించే హక్కు లేదు. చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోండి. ఉద్యోగం చేసేవాడు ఏమీ నిర్ణయించుకోలేడు. ఉద్యోగస్తులమవ్వాలీ అనే కోరికనుంచి మీరు బయట పడగలుగుతే కాని, దాన్నే స్వావలంబన అంటాం.

**అందుకే భారతదేశానికి స్వాధీనం వస్తే తప్ప, భాగవతాన్ని చెప్పలేం అని గురువులు చాలా ప్రయత్నం చేసి, సమయానికి ముందే స్వాతంత్ర్యాన్ని లాక్కొచ్చారు.** దానికి ఆధారం చేసుకున్న పనిముట్టే గణపతి నవరాత్రులు.

దాని గురించి ఇదంతా చెప్పుకొచ్చేది. ఈ ఐదుగురు కలవండి. 22వ తారీఖు ఈ గణపతి నవరాత్రులలో ఆ సామూహికత కావాలీ అంటే, మా ఇంట్లో పూజ చేసుకుని వస్తామని నాతో చెప్పినవాళ్ళు చాలామంది ఉన్నారు. నేను బ్రహ్మానందపడి పోయాను. నేను ఆ బావిలో నీళ్ళు తాగలేదు అని. నాకు ఆనందం వేసింది. వాడేం చేశాడో నాకు అనవసరం. బాబూ సామూహికంగా ఇక్కడ చేసుకోండి మొర్రో అని నేను అంటే, ఒక్క నిముషం మాస్టారు, మీరు చెప్పారు బానేవుంది, గంటన్నరసేపు నేను మా ఇంట్లో చేసేసుకుని వస్తామంటారు. ఇంకా చాలామంది రకరకాలు అడుగుతారు. రామకృష్ణ పరమహంస వాళ్ళూకూడా దేవుడికి పెట్టలేకపోయారు. వీళ్ళు పెడుతున్నారు. కొంచెం ఆ బావిలోని నీళ్ళు వదిలేసుకోండి, అందుకు నేను చెప్పేది.

## నారదుడు చెప్పినతపస్సు, దయ, దానం, శౌచం,సత్యం :-

అందుచేత నారదుడు చెప్తున్నాడట. భాగవతంలో నారదుడు సనకాది మునులకి చెప్తున్నాడు. నేను భారతదేశం వెళ్ళాను, ఇదంతా కూడా తిరిగాను ఇన్ని



తీర్థాలలో కూడా, ఇన్ని తీర్థాలలోనూ నాకెక్కడా గొప్పతనం కనిపించలేదు. అక్కడ నాకు ఏం కనిపించిందీ ... తపస్సు లేదు, సత్యము లేదు, శౌచము లేదు, దయ లేదు, దానము లేదు. మళ్ళా 5 వచ్చాయి. ఈ 5 ఇందాక నేను చెప్పిన ఐదింటికీ దీటుగా ఉంటాయి. చాలా జాగ్రత్తగా మీరు చూసుకోండి. శౌచము, శుభ్రంగా ఉండాలని కోరుకునే వాళ్ళు, ఇందాక నేను చెప్పిన స్వాప్నిక జగత్తు నాయకులలో ఐదుగురిలో ఎవరు, 100% స్వచ్ఛంగా ఉండక పోతే వాళ్ళకి ఫలితాలు రావు. (సైన్స్ చదివిన వాళ్ళు) ఉప్పు కిలో ఎంత ఇప్పుడు? 4 రూ॥లు. ఎ.ఆర్. క్వాలిటీ ఉప్పు, మా లేబరేటరీలో ఉపయోగిస్తాం. 980 రూ॥లు కిలో. ఉప్పు. ఎందువల్ల? శౌచము. శౌచము ఇది చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి, ఇది ఎక్కడో చెప్పబడటం లేదు, ఇక్కడ మీ జీవితాలలోనే జరుగుతున్నాయి ఇవి.

అంటే వాళ్ళు దేనికి ప్రాముఖ్యం ఇస్తున్నారు, స్వచ్ఛతకి. దానానికి ఎవరు ప్రాముఖ్యం ఇస్తారు, వ్యాపారవేత్త. వాడు ఎంత దానం చేస్తే అంత వాడికి ఆదాయపు పన్ను మిగులుతుంది, మిగతా సంగతి తరవాత చూద్దాం. అసలు అక్కడే వాడికి లాభం కనిపిస్తోందికదా, మిగతావాళ్ళు దానం చెయ్యాల్సిన పనిలేదు. అవునా. సాహితీ వేత్తలు. రచయితలు ఉన్నదున్నట్టు రాయాలి కదా. అడుక్కుతినేవాడు ఓ కోటి రూపాయలు దానం చేశాడని, వ్రాశాడనుకో వాడు, అనుకుందాం ఒకడు అలా రాశాడని, కథ రాయటమేగా, ఆ పుస్తకం ఎవడూ చదవడు. లేకపోతే వాడు బావిలో నీళ్ళు తాగాడని మీరు మీ భాషలో చెప్తారు. అంతేగా, అందుచేత సత్యవాది ఎవరు అంటే -ఉన్నది ఎలా ఉండాలో అలా చెప్తారు వాళ్ళు. లేకపోతే నవల్లో హీరో హీరోలాగా ఉండాలి, విలను విలన్‌లాగా ఉండాలి. **సత్యము-రచయితలు. శౌచము-శాస్త్రవేత్త. దానము- వ్యాపార వేత్త. దయ- రాజకీయవేత్త. రాజుకి దయ ఉండాలి.** దయ ఉన్న రాజునే మనం పొగుడుతాం.

ఇప్పుడు లేదు అది. ఖచ్చితంగా ఉండదు, ఉండి ఉంటే పర్ఫెక్ట్ .. ఇక్కడ పర్ఫెక్షన్ గురించి చెప్పాడు. నటులు తపస్సు చెయ్యాల్సిందేగా. ఎందుకు తపస్సు?

మనం ఒక్క నిముషం స్థిరంగాకూర్చోలేం. వాడు విశ్వామిత్రుడు పాత్రో ఏదో వేస్తాడు, మఠం వెయ్యాల్సిందే, వాడిలా కూర్చుంటాడు, గెడ్డం పెట్టుకుంటాడు, లైట్ ఫోకస్ చేస్తాడు, మీరు వెళ్ళి చూడండి వాళ్ళ అవస్థలు. మీకు కోటిరూపాయలు ఇచ్చినా నటన చెయ్యరు. పెద్ద తపస్సు అది. అర్థమైందా ఇప్పుడు.

## చేతనత్వ మార్పులో ఆసనాలయొక్క ప్రాముఖ్యత

అందుచేత ఈ వరుస గుర్తుంచుకోండి, .. చేసుకోండి మీరు. .. ఇవంతాకూడా చేతనత్వ విజ్ఞానమే. ఈ చేతనత్వాన్ని మీరు మార్చేసుకుంటే అది మారిపోతుంది. అంతవరకూ ఉద్యోగం లేదు వాడికి. ఆ క్షణం ఉద్యోగం వచ్చింది వాడికి. ఏమయ్యాడు వాడు? నిరుద్యోగి కాస్తా ఉద్యోగస్తుడు అయ్యాడు. ఏమైంది అక్కడ, ఏమీ అవలేదుగా చేతనత్వం మారింది. చేతనత్వం ఎందువల్ల మారింది? ఆసనం మారింది. నిరుద్యోగి అనే ఆసనం నుంచి... అందుచేత మీరు **ఆసనాలు కనుక సరిగ్గా అభ్యాసం చేసుకోగలుగుతే, మీ చేతనత్యం మారిపోతుంది. అది ఆసనాలయొక్క ప్రాముఖ్యత.**

పర్వతాసనం యొక్క చేతనత్వ స్థితులు అవి. సర్ప ఆసనం, భుజంగ ఆసనం, ఆ వరుసలో మీరు చూసుకోండది, ఆసనాలలోకూడా మళ్ళా ఈ 5 సమూహాలు వస్తాయి మీకు. ఈ 5 సమూహాలు చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోండి. నారదుడు పాపము భూమిమీదకు వచ్చాక, ఈ ఐదూ ఎక్కడా కనిపించలేదుట.

## చదువు ఏది ఇష్టం అయితే అది చదవాలి

సత్యం-అంటే ఏంటి, సరిగా వ్రాసేవాడూ లేడు, తపస్సు-సరిగా నటన చేసే వాడూ లేడు, శౌచము- సరైన శాస్త్రవేత్త లేడు, దయ -సరైన రాజకీయవేత్త లేడు, దానం-సరైన వ్యాపారవేత్త గూడా లేడు. ఎందువల్ల లేడూ అంటే, వీళ్ళందరూ గూడా పొట్టకోసమే ఈ వేషాలు వేస్తున్నారు తప్ప.... సైంటిస్ట్ సైన్స్ ఎందుకు చదివాడు అంటే ఉద్యోగం కోసం. నన్ను చాలామంది వచ్చి అడుగుతారు. తల్లిదండ్రులు అడుగుతారు, పిల్లలూ అడుగుతారు.మాస్టారూ బి.యస్‌సి అయిపోయింది. మా వాడిని బయోకెమిస్ట్రీ చదవమంటారా, బయోటెక్నాలజీ చదవమంటారా అంటే, వాడికి ఏది ఇష్టమయితే అది చదవమంటాను నేను. చదువు ఏది ఇష్టం అయితే అది చదవాలి.



వెంటనే ఏం అడుగుతారో తెలుసా! డబ్బు ఎందులో ఎక్కువ వస్తుందో చెప్పండి మాస్టారూ అందులో జేర్పిస్తాం. సత్యం లేదుకదా. అర్థమౌతోందా. అదీ నారదుడు పడినటువంటి బాధ. చదువుకునేది చదువుకో నువ్వు. కడుపునింపుకోవటానికి ఏ వృత్తయినా చేసుకోవచ్చు. .. అంటే మనం ఎప్పుడూ మాట్లాడుకునేవాళ్ళం. **లోపల ఉన్నదొకటి, బయట ఉన్నదొకటి.** .. ఇక్కడ ఆ విశేషణాలని చాలా జాగ్రత్తగా చూసుకోండి. ఇది పోగొట్టుకోవటమే భాగవతం. .. ఫ్లో. ఫ్లో అంటే, ఓ టెలిఫోన్ నంబర్ అడిగామనుకోండి, ఇంటిదగ్గరుంది అంటారు.

పెద్ద సమస్య అది. ఎలా? దానికి ఇప్పుడు ఒక ఏం వెయ్యాలి, ఇప్పుడు అన్నిటికీ ఏం వేస్తూవుంటారు, కమీషను వెయ్యాలి ఇప్పుడు ఎలా అని. ఫ్లో. ఏదైనా ఒక పని అడ్డుకోవాలీ అంటే ఏం చెయ్యాలి, కమిటీ వేసేస్తే పని ఆగిపోతుంది. భలే తెలివైన వాళ్ళు అందుకే ఓ కమిటీ వెయ్యండి అంటారు. కమిటీ వెయ్యండి అంటే అర్థమేంటసలు, కాస్త ఆలశ్యమయ్యే టట్టు చూడండి అనొచ్చుకదా ... మూర్ఖత్వం యొక్క పరాకాష్ఠ మనకి పత్రిక చూస్తే కనిపిస్తూ ఉంటుంది.

స్లో లో పరమ స్లో మన హైకోర్ట్. నువ్వు వెళ్ళావనుకో అక్కడికి ఫినిష్. ఇంక ఏమీ అవదు. అందుచేత పని అవకూడదు అనుకుంటే కోర్టుకి వెళ్ళండి మీరు. కాని ఎవరికో ఒకళ్ళకి లాభం అవుతుంది. వాళ్ళకి మందమే. అదృష్టహీనులు... ఇలాంటి వాళ్ళు ఏపని చేసినా కొంపమునుగుతుంది. ఉపద్రవం. ఏది చేసినా తప్పే చేస్తాం. బాగా ఆలోచించి వేస్తారు అడుగు. ఆలోచించకుండా వేసుంటే బానేవుంటుంది. ఇప్పటికీ నేను చాలాసార్లు చెప్తూవుంటాను, బాగా చెయ్యాలి మాస్టారూ వంట అంటారు. నేను ఆరోజు భయపడతాను. మీరొచ్చారు మాస్టారు .. వాడు మామూలుగా వంట చేసేస్తే చాలా బాగా వస్తుంది. బాగా చేద్దాం అనుకుంటే? ఎందుచేతంటే .. ఉపద్రవం వచ్చేస్తుంది. ..

## పాఖండం - లేనిది ఉన్నట్టు నటించటం

**పాఖండకండిని అని ఆర్యసమాజం స్థాపించినతను దయానంద సరస్వతి. జెండా పేరే పాఖండం. అంటే, లేనిది ఉన్నట్టు నటించటం.** అది ఈనాడు అందరిలో

ఉందో,లేదో చూసుకోండి. వాడికి అది ఉండదు, అది ఉన్నట్టు నటిస్తాడు. పాఖండం అంటే అది. లేనిది ఉందీ అనుకునేటట్టు ఇతరులు అనుకుంటే చాలు వాడికి. వాడిదగ్గర ఉన్నా లేకపోయినా విత్తులు. ఈ ఆశ్రమవాసులైన వాళ్ళందరూ కూడా ఎలా ఉండాలి అసలు వాళ్ళు, అపరిగ్రహః అపరిగ్రహం అంటే ఎవరి దగ్గర్నుంచీ ఏమీ తీసుకోకూడదు.

వాళ్ళు ఏమైపోయారట, సపరిగ్రహ తీసుకోవటంలో కుశలురు. ఇది చాలా జాగ్రత్తగా ఈ చేతనత్వంలో మార్పులు ఎలా తీసుకురావాలో చెప్తున్నారు. ఏవేం మార్పులు రావాలి, మందాహ - తక్షణం చేయటం నేర్చుకోండి. నేర్చుకునేది తక్షణం నేర్చుకోండి. .. అదృష్టహీనులం ఎందుకయ్యాం, చెయ్యం కనుక. ఇది మంచిది అని తెలిసి. రోజుకి 1000 సార్లు గాయత్రీ ఎవరైనా చేసుకుంటే, వాడికి ఏవిధమైనటువంటి కష్టాలొచ్చినా పోతాయి. ఇవాళే, తమాషా ఉత్తరాలుగూడా చదివాను గురువుగారివి.

ఒకమ్మాయి గురువుగారికి ఉత్తరం వ్రాసింది. గురువుగారు చేతివ్రాతలో ఉంది ఆ ఉత్తరం.' పిల్లలు పుట్టటంలేదు' గురువుగారు. .. ఎన్నిరకాలుగా తరచి చూసినా నీ తలరాతలో కొన్ని జన్మల వరకూ నీకు పిల్లలు పుట్టే యోగము లేదు అని గురువుగారు వ్రాసారు. దాని క్రింద ఏదో వ్రాసారాయన. కాని నువ్వు రోజూ గాయత్రీ చాలీసా చదవటం మొదలెట్టేసే ఉంటావు. ఇంకొన్నాళ్ళు పొడిగించు ఇంటి దగ్గర గాయత్రీ సాధన. గాయత్రీ సాధన పొడిగించిన తర్వాత, ఇంకో నియమం పెట్టారు. అప్పుడు 1965 అనుకుంటాను నాకు గుర్తు లేదు. ఒక ప్రత్యేక జ్ఞానయజ్ఞం జరుగుతోంది. ఇప్పుడు ఇక్కడ మనం సాధనలు ఎలా అవుతే చేస్తున్నామో నవరాత్రి సాధనలు, అలా కలిసిమెలసి చేసే సాధన ఒకటుంది, ఆ సాధనలో పాలుపంచుకో అన్నారు.

కలిసిమెలిసి చేసే సాధనలలో విలువ అర్థం అవటంలేదు. ఒకొక్కళ్ళు ఇంటిదగ్గర ఒకొక్క కొవ్వొత్తి వెలిగించుకున్నారు మీరు, వెలుతురు వస్తుంది కదా మీకు, ఒక కొవ్వొత్తి వెలుతురు వస్తుంది. మీరందరూ మీ కొవ్వొత్తులు తెచ్చి ఇక్కడ వెలిగించారు, ఒకొక్కడూ ఒకొక్క కొవ్వొత్తీ పెట్టాడు. ఎంత వెలుతురు వస్తుంది ఒకొక్కడికీ. అందరికీ వస్తుంది కదా. మరి ఎందుకు ఆ లాభం మీరు పొందటానికి ఇష్టపడటంలేదు అంటే, .. అదృష్టహీనులం కనుక. మనకి ఇష్టం లేదు అది. సామూహికంగా సాధనలు చెయ్యమని



చెప్తారక్కడ. భవిష్యత్తు ఏంచెప్పారాయన! కొన్ని జన్మల వరకూ నీకు పిల్లలు పుట్టరు. అన్నటువంటి ఆవిడకి 11 ఏళ్ళలోనో ఎప్పుడో మళ్ళా పిల్లలు పుట్టారు. తలరాత మారింది. ఎందువల్ల అంటే, సామూహిక జీవితం ఉంది కనుక. భారతదేశం యొక్క దౌర్భాగ్యం ఏంటీ అంటే, మా ఇంట్లో చేసు కుంటాము అనే దౌర్భాగ్యము ఇప్పటికీ పోవటంలేదు. **నేను వ్యక్తిగతంగా సాధన చేసుకుంటాను అనే రామకృష్ణపరమహంస ఎత్తిపారేశారు.**

ప్రస్తుతం మనకి ఆ విజ్ఞానం లేదు. పురుషసూక్తంలో ఇవి చెప్పబడి ఉన్నాయి ఈవిధంగా. ఏంటా ముఖ్యమైనటువంటివి? విద్యని నేర్పేవాడు, అన్నాన్ని వృద్ధి చేసేటటువంటి వాడు, ఈ విద్యని, అన్నాన్ని ఉపయోగించి రాజ్యం ఏలేటటువంటి వాడు, వీళ్ళు ముగ్గురూ కూడా తప్పుదారిలో పడిపోయారు.

నారదుడు సనకాదులతో ఇదంతా చేసుకుంటూ చూసుకుంటూ అయ్యో ఇలా అయిపోయిందే పృథ్వి అంతా- అని నేను యమునానది ఒడ్డుకు వెళ్ళాను, అక్కడ కృష్ణుడు ఆడుకున్న యమునా నది ఒడ్డున ఒక యువతిని చూశాను, చాలా విషాదంతో ఆవిడ కూర్చుని ఉన్నది.

అక్కడ ఇద్దరు వృద్ధులు శోషగిల్లి పడియున్నారు, ఆ యువతి వాళ్ళకి సేవచేస్తోంది, ఏడుస్తోంది, బాధపడుతోంది, అన్నీ చేసుకుంటూ వుంది. యమునా నది ఒడ్డున ఆ యువతి పది దిశలూ చూసుకుంటూ, ఆ వృద్ధులకి విసనకర్ర పెట్టి విసురుతూ తనని రక్షించేవారు ఎవరైనా ఉంటారా అని ఎదురుచూస్తూ ఉందిట.

దూరంనుంచి ఇదంతా చూస్తూ, ఈ యువతి ఏంటి, ఇలా ఏడుస్తోందేంటి, అన్నివైపులా చూస్తూ వారికి సేవ చేస్తోందేంటి అనిచెప్పి కుతూహలవశాత్తూ నేను ఆ యువతి దగ్గరకి వెళ్తే ఆ యువతి లేచి నుంచున్నది.

# అమరత్వాన్ని ప్రసాదించే విద్య

## కాలుడికి బలైపోతూనే ఉంటారు

*కాలవ్యాల ముఖగ్రాసత్రాసనిర్ణాశ హేతవే ।*
*శ్రీమద్భాగవతం శాస్త్రం కలౌ కీరేణ భాషితం ॥ ( 11వ ॥ శ్లోకం)*

**ఎంత అద్భుతమైనటువంటి సాధనా స్థితిలో ఉన్నా శ్రీరామశర్మ ఆచార్య గురుదేవులు కావచ్చు, శ్రీకృష్ణుడు కావచ్చు, ఎవరైనా కావచ్చు. వీళ్ళందరు 'కాలవ్యాల ముఖగ్రాస'-కాలుడికి బలైపోతూనే ఉంటారు.** వాళ్ళ శరీరాలు మన దగ్గిర లేవు కదా. అందుచేత ఈ కాలవ్యాల - కాలం అనే పాము. ఒక పాములాగ మనకక్కడ ఎదురుగుండా కనిపిస్తూంటుంది. మేరు దండమంతా మన యొక్క కాల సర్పం.కాలసర్పం యొక్క ఈ రెండు రెక్కలు గరుడుడి రెక్కలు. అవి తర్వాత భాగవతం లో వస్తాయి. అందుచేత ఆ మృత్యువు యొక్క ముఖం నుంచి దాటి వెళ్ళి పోవటానికి - ఎవరు మృత్యువు యొక్క ముఖం నుంచి దాటి వెళ్ళిపోతారు? మరి మేం చదువుకుంటున్నాం. మరి మేమూ వెళ్ళిపోతామా? ఖచ్చితంగా మీరూ వెళ్ళి పోతారు.

కానీ ఆ పరిస్థితి ఎలా ఉంటుందంట-ఇంటర్మీడియట్‌లో ఓ ప్రశ్న ఉంటుంది సబ్బుల తయారీ గురించి. గత 20 ఏళ్ళుగా చెపుతున్నాను నేను మా పిల్లలకి. ఎన్ని బ్యాచెస్ చెప్పాను. కానీ ఒక్కడూ సబ్బు తయారు చెయ్యలేదు. తమాషా ఏంటంటే ఇప్పుడు నన్ను సబ్బు తయారు చెయ్యమంటే నేనూ చెయ్యలేను. అది తయారు చెయ్యటానికి అసలేం తెచ్చుకోవాలో నాకు తెలీదు. కానీ చాలా ముఖ్యమైన ప్రశ్న అని వాళ్ళ చేత బట్టీ కొట్టించేస్తాను. అలాగే ఈ విద్య కూడా.

**భాగవతం మృత్యుముఖం నుంచి దాటించే విద్య.** కానీ ఇది చదివినా -గత 20 ఏళ్ళుగా చెపుతున్నా సబ్బు తయారు చెయ్యటం చేతకాని నేను మృత్యు ముఖాన్నెలా దాటుతాను? అంటే ఇక్కడ ఆ మానసిక స్థితి అర్థమౌతోందా. మీకు నిజంగా మృత్యుముఖాన్నుంచి దాటాలని లేదు. దాటాలనుకున్న వాడే స్థితిలో ఉంటాడో భాగవతం చెపుతోంది. వాడింక చావడు. అమరుడైపోతాడు. అది భాగవతం



ఖచ్చితంగా చెపుతుంది. 7 రోజులు కనుక ఈ భాగవతాన్ని ఖచ్చితంగా చదివితే - 7రోజులు కనుక మీరా మానసికస్థితిని ఉంచుకోగలిగితే, తర్వాత భాగవతమే మిమ్మల్ని మానసిక స్థితిలో ఉంచేస్తుందంటాడు.

ఎంత కష్టమో మీకర్థమైంది కదా! ఆరోగ్యం బాగుపడుతుందని తెల్సు. కళ్ళారా వాళ్ళ ఎదుటే నా ఆరోగ్యం బాగుచేసుకుని వస్తే, డయాబిటిస్‌తో బాధపడుతున్న వ్యక్తి ఏమన్నాడో చెప్పాను కదా. ఇంతకీ నేనేమన్నా అతన్ని? తిండి మానెయ్య మనలేదు, రుచులు మానెయ్య మనలేదు. నూనె వేసుకోవద్దు, చింతపండు తినొద్దు......అలా తింటే డయాబిటిస్ తగ్గిపోతుందన్నాను. తగ్గిపోయిందన్న దానికి నేనే ఉదాహరణ. దీన్ని ఎవరైనా పాటించవచ్చు.

**'కాలవ్యాల ముఖగ్రాస' - గ్రాసం అంటే ఆహారం. ఆహారం మారితే అమరులైపోతాం. మీరే స్థితిలో ఉన్నా ఫర్వాలేదు. ఆఖరికి శరీరం వదిలేసే స్థితిలో తులసి మిశ్రమంలో కనుక సరైన గంగనీరు కలిపిస్తే వాడు చావడు.** కానీ వాళ్ళు తెలియాలిగా. షోడశోపచార పూజలో 'మధ్యే మధ్యే పానీయం సమర్ప యామి' అని ఒక చుక్క నీళ్ళు కింద పోస్తారు. ఎవరికి మీరు పానీయం సమర్పిస్తున్నారు? జగద్గురువుకి. 'ముఖం ప్రక్షాళయామి' ఒకచుక్క నీరు. ఒక చుక్కనీటితో జగద్గురువు ముఖం కడుక్కుంటాడు. మూర్ఖత్వం అది. అవెందుకంటే మన జీవితంలో అలవడా లని. అవన్నీకూడా నిత్యజీవిత విధానాలు. ఎవరికి నిత్యజీవిత విధానాలు? కాలవ్యాల ముఖగ్రాసత్రాసనిర్ణా.. మనకున్న పెద్ద సమస్యే ఏంటంటే మృత్యువు. అత్యంత వేదాంతులు కూడా ఈ చావు వచ్చేసరికల్లా ఫినిష్. దానికి జవాబిక్కడ ఇచ్చారు.

*కాలవ్యాల ముఖగ్రాసత్రాసనిర్ణాశ హేతవే ।*
*శ్రీమద్భాగవతం శాస్త్రం కలౌ కీరేణ భాషితం ॥*

ఈ యుగములో. ఒక్కొక్క యుగంలో అమరత్వ ప్రాప్తికి ఒక్కొక్క సాధనా విధానాలుంటాయి. పూర్వకాలంలో చదువుకోవాలంటే .....

## లీలావతి సేవ

లీలావతి అనొక పుస్తకం వ్రాశాడొకడు. లెక్కల పుస్తకం అది. లీలావతికి

లెక్కల పుస్తకానికి సంబంధం ఏమిటి? ఆయన భార్య పేరది. ఆయన లెక్కల పుస్తకం వ్రాస్తుంటే వాళ్ళ అన్నా వదినా కలిసి బలవంతంగా పెళ్ళి చేశారు. ఆయనొక ఋషి. పెళ్ళిపీటల మీదకూడా ఈక్వేషన్స్ వ్రాసుకున్నాడు. పుస్తకం వ్రాస్తూనే ఉన్నాడు. 60 ఏళ్ళు గడిచిపోయాయి. ముసలితనం వచ్చేసింది. ఇంకా వ్రాస్తూనే ఉన్నాడు. అలా వ్రాస్తుంటే ఒకనాడు దీపం ఆరిపోబోతే భార్యవచ్చి చీరచెంగు అడ్డు పెట్టింది. ఆ అడ్డు పెట్టటంలో నీడ పడుతుంది. తలెత్తి చూశాడు. ఒక ముసలావిడ కనిపించింది. నువ్వెవరు అన్నాడు? 60 ఏళ్ళు అతనికి తెలీకుండా సేవ చేసింది. గుళ్ళో అక్కడ మనమేదైనా సేవ చేయిస్తే నేలమీద వ్రాయిస్తాం. తలెత్తి చూశామ నుకో గోడలనిండా పేర్లు కనిపిస్తాయి. ఆవిడ చేసిన సేవకి నేనేమివ్వగలను అనుకున్నాడు. అటువంటి అద్భుతమైన పుస్తకం వ్రాస్తుంటే సేవ చేసిన ఆవిడకి నేనేం చేయగలను అనుకున్నాడు. ఆవిడతో నీపేరు అమరమై పోతుందన్నాడు. అదే పేరు పెట్టేశాడు పుస్తకానికి. ఇప్పుడు చెప్పుకుంటున్నాం కదా. ఆవిడెవరో మనకి తెలీదు. కానీ ఆవిడ చేసిన సేవ?

## వృద్ధాశ్రమాలు మీ భావితరానికి బీజాలు

అది ఇంకో యుగానిది. ఈ యుగానిదా? ఈ సంఘటన ఏ యుగానిది? ఈ యుగానిదే. అందుకే వివేకానంద వాళ్ళు మానవ సేవే మాధవ సేవ అన్నారు. **ఎవరికి సేవ చెయ్యాలి?** ఇలాంటి వ్యక్తులకి సేవ చేస్తే. తాగుబోతుగాళ్ళకి సేవ చేస్తే ఏం లాభం? వృద్ధాశ్రమాలు పెట్టి, వాళ్ళకి సేవ చేస్తే ఏం లాభం? మీరేది నాటుకుంటారో అదే కోసుకుంటారు. మీ తర్వాత జన్మలో అక్కడ చేరతారు. అప్పుడు వాళ్ళు మీకు సేవ చేస్తారు. సరిపోతుంది. దొందుకి దొందే. అసలేం జరుగుతోందో తెలీదు మీకు. తెలియకపోతే ఇలాంటి పరిస్థితులే వస్తాయి. సమాజం అది సరైనదనుకుంటుంది కనుక అది సరైంది అని అనవచ్చు. కాకపోవచ్చు. తప్పుని నేనటం లేదు. మీకు తెలియాలి మీరేం నాటుతున్నారో. ఏం చేస్తున్నారో.

మరింతకీ వృద్ధాశ్రమాలు పెట్టవచ్చా, పెట్టకూడదా? అన్న అనుమానం వస్తుందిగా మీకు. ఖచ్చితంగా పెట్టవచ్చు. ఎందుకంటే ఏమీ లేని, ఏ దారీ తెన్నూలేని



వ్యక్తులకి మీరవి పెట్టవచ్చు. కానీ అవి పెట్టి వాళ్ళని మాత్రం వృద్ధులుగా చూడకండి. వృద్ధాశ్రమంలో వృద్ధులు చేరటం లేదు. ఎవరు చేరుతున్నారు? **భావితరాలకి బీజాలు వేసుకుంటున్నారు వాళ్ళు.** తర్వాత జన్మలో పిల్లలు వాళ్ళే. మనోయజ్ఞం అది చూపిస్తోంది. సీరియల్స్‌లో అభినేతలకి అందుకే అంత ప్రాముఖ్యత. నేనిచ్చేది కాదు. మీరే ఇస్తున్నారా ప్రాముఖ్యత. గురువొచ్చాడు. చిరంజీవొచ్చాడు. ఎవరి దగ్గరికి వెళ్తారు? ఖచ్చితంగా చిరంజీవి దగ్గరికే వెడతారు. అందుకే అభినేతలు చాలా గొప్పవాళ్ళు. వాళ్ళని వాళ్ళు కించపరచుకోనక్కర్లేదు. వాళ్ళ గొప్పతనం వాళ్ళకర్థమవ్వటం లేదు. ఎందుకర్థమవ్వటం లేదు? అంటే ఆ గొప్పతనాన్ని ఎత్తి చూపించే వ్యక్తులు లేరు. కానీ ఆ గొప్పతనం ప్రజలందరు గుర్తిస్తున్నారు. పెద్ద అభినేతే రావక్కర్లేదు. చిన్న వాడైనా మనం చూస్తాం కదా!

అందుచేత 'కలౌ కీరేణ భాషితం ' **ఈ వృద్ధాశ్రమంలో** ఏం చెప్పాలి? **వాళ్ళ ఆహార నియమాలు పూర్తిగా మార్చెయ్యాలి. ఈ సంస్కారాలే తర్వాత జన్మలోకి తీసుకెడతాయి. ఇప్పుడు కనుక వాళ్ళు ఈ విధమైన ఆహారం తీసుకో గలిగితే ఇంక చావరు వాళ్ళు.** ఈయన కుర్చీ ఖాళీ చేస్తేకదండీ ఇంకోడొచ్చేది. ఆయనిచ్చే విరాళం పుచ్చుకోవాలని వాళ్ళ గొడవలు వాళ్ళకుంటాయి. మనమేం చెయ్యలేం. ఎవరి బాధలు వాళ్ళవి కదా. సీత బాధ సీతది, పీత బాధ పీతది. వీడేదో వృద్ధుడు. వీడు ఢాం అంటే మళ్ళా ఓ 20 వేలు వస్తుంది. కానీ వీడు చావడు. నిజంగానే చావరు, నేను నిజంగానే చెపుతున్నాను. ఆహారం యొక్క గొప్పతనమది. చాలాసార్లు అవగాహన చేస్కుని చెపుతున్నాను.

## అమరత్వం- ఆహారం- భాగవతం

**అమరత్వం - దానికి మీరేం చెయ్యాలప్పుడు? ఆహారం మార్చిన తర్వాత ఈ భాగవత విధానాన్ని వినిపించాలి.** వారం రోజుల్లో చావుకి దగ్గరగా ఉన్నటువంటి వాళ్ళకెలాంటి ఆహారం పెట్టాలి? భాగవతం వినిపించాలి. తర్వాత ఇది చెయ్యాలి. ఇది వృద్ధాశ్రమాల్లో పెట్టాలి. భాగవతం అంటే మళ్ళీ భారతీయ ధర్మం అనుకుంటే

చెయ్యగలిగిందేం లేదు. భాగవతంలో ఇంత వరకు ఎక్కడా మన దేవతల పేర్లు రాలేదు. రావు ఎక్కడా కూడా. ఎక్కడ మొదలైంది?

## నిజమైన విద్యార్థికి దేనిమీద భక్తి ఉంటుంది?

భక్తిని నారదుడు కల్పుకొనుట అనే దానితో మొదలైంది. అది మీరు గుర్తుంచుకొండి. **భక్తి ఎవరి మీదుంటే దానినే సాధిస్తారు.** వ్యాపారవేత్తకి దేని మీద భక్తి ఉంటుంది? డబ్బు మీద. ఆ భక్తిని కల్పుకున్నాడు. విద్యార్థికి - అంటే నిజమైన విద్యార్థి అని నా ఉద్దేశ్యం. ఇప్పుడున్న విద్యార్థులు కారు. నిజమైన విద్యార్థికి దేనిమీద భక్తి ఉంటుంది? జ్ఞానం మీదుంటుంది. వివేకానంద నిజమైన విద్యార్థి. మనందరం విద్యార్థులం కాదు. మనందరికి దేనిమీద భక్తి ఉంది? ఏది చదివితే డబ్బులు బాగా వస్తాయో అవి చెప్పండి మాస్టారు. అంటే మీరు విద్యార్థులెక్కడయ్యారు? ధనార్థులయ్యారు. అర్థమౌతోంది కదా!

అందుచేత ఈ భాగవత ప్రవచనాల యొక్క తీవ్రత, వేగం మీకు అర్థమైతే ప్రపంచానికి దీన్ని అందించండి. ప్రకృతిని చూస్తే మీరెలాగ ఈ కార్యక్రమాలను నిర్వర్తించుకోవాలో తెలుస్తుంది. భాగవతాన్ని బాగా చెప్పగలిగేటటువంటి వాళ్ళ ఇంట్లో పుట్టాడొక వ్యక్తి. ఎవరు?

పండిత శ్రీరామశర్మ ఆచార్య తండ్రి ఇదే చేసేవారు. మహారాజుల ఇండ్లకెళ్ళి భాగవతం చెపుతుండేవాడు. తనతో పాటు పిల్లవాణ్ణి కూడా తీసికెళ్ళి భాగవతం వినిపించేవాడు. మీకీ భాగవతం యొక్క ప్రాముఖ్యత అర్థమవ్వక ఈ వారం రోజుల్లో నేను చెప్పిందే మళ్ళీ తిరిగి తిరిగి చెపుతున్నాను. ఈవారంలో చెప్పింది తర్వాత వారానికి మాస్టరీ చేసుకొండి. ఈ వారంలో చెప్పిన దాని ప్రింటవుట్స్ తీసి సిద్ధంగా దగ్గర పెట్టుకొండి. రేపీ భాగవతం చెపుతున్నప్పుడు మిమ్మల్ని మించి ఎవడూ చెప్పలేడు ఈ ప్రపంచంలో. అసంభవమౌతుంది. ఎప్పుడు? ఏ వారానికా వారం మీరు మాస్టర్ చేస్తే.

## కలికాలంలో ఉన్న అద్భుతం

దానికోసం ఎవరైనా క్యాసెట్ అడిగితే సమయానికి మీరు దాన్ని అందించక



పోవటంకూడా మిమ్మల్ని కర్మబంధంలో ఇరికిస్తుంది. ఇది చాలా అద్భుతమైన ప్రదేశం. రెండు జరుగుతాయక్కడ. మంచీ పెరుగుతుంది, చెడూ పెరుగుతుంది. చాలా జాగ్రత్తగా చూస్కొండి. మనసులో ఎవేవో పెట్టేసుకుని ..... మనసులో ఏం పెట్టుకున్నా ఆచరణ సరిగా ఉంటే ఫలించదది. మీరా విషయంలో చాలా జాగ్రత్తగా ఉండండి.

కలిని ఎందుకు చంపలేదనే కథ వస్తుంది తర్వాత. కలిని చంపగలిగే స్థితిలో ఉన్నాడు. ఎవరు? పరీక్షిత్తు. కానీ ఎందుకు చంపలేదు? ఎందుచేతంటే కలి కాలంలో ఉన్న అద్భుతమైన విషయం ఏంటంటే - నువ్వు చెడుని ఎంతనుకున్నా ఫర్వాలేదు. జరగదది. మంచి నువ్వనుకుంటే చేసినా చెయ్యక పోయినా ఫలితమిస్తుంది. అది కలికాలంలో మాత్రమే జరుగుతుంది. కలి కాలంలోనే దీని వివరణ - ఈ వృద్ధాశ్రమాల అభివృద్ధి ఎలా అవుతుంది? ఈ వృద్ధాశ్రమాలకి ధీటుగా ఇంకొన్ని ఆశ్రమాలు తయారవుతున్నాయి. జంతు సంరక్షణ ఆశ్రమం. రెండూ ఉండవల్సిన విధానంలో ఉండటంలేదు. కానీ దేనికీ మొత్తం వివరణిస్తున్నానో గుర్తుంచుకోండి. ఇది మీరు ఉపన్యాసం ఇచ్చేటప్పుడు ఒత్తిడి ఇవ్వాలి.

## శిష్యుడే గొప్పవాడెప్పుడూ

కృష్ణం నారాయణం వందే కృష్ణం వందే వ్రజప్రియమ్ ।
కృష్ణం ద్వైపాయనం వందే కృష్ణం వందే పృథాసుతం ॥
చింతామణిర్లోక సుఖం సురద్రుః స్వర్గసంపదాం ।
ప్రయచ్ఛతి గురుః ప్రీతో వైకుంఠం యోగిదుర్లభం ॥

ఇక్కడ మళ్ళీ గురువు యొక్క గొప్పతనం శిష్యుడి గొప్పతనం వల్ల అవుతుంది తప్ప గురువు యొక్క గొప్పతనం కాదని నేను చాలా సార్లు చెప్పాను. చింతామణి ప్రసాదించే గురువు, సురద్రుక్ ప్రసాదించేటటువంటి గురువు, వైకుంఠం ప్రసాదించే గురువు మీకెక్కడా లభించడు. మీరు దానికి తగిన శిష్యుడైతే గురువు తనంతట తను వెతుక్కుంటూ వస్తాడు.

**దయచేసి గురువు యొక్క గొప్పతనాన్ని అంచనా వేసే ప్రయత్నం చెయ్యకండి.** ద్రోణాచార్యుడు ఏకలవ్యుడికి ఏమీ నేర్పలేదు. కానీ ఏకలవ్యుడు ఏమన్నాడు? ద్రోణాచార్యుడు నా గురువన్నాడు. ఆ ద్రోణాచార్యుడే అర్జునుడికీ నేర్పాడు. మిగతావాళ్ళందరికీ నేర్పాడు. అర్జునుడు బాగా నేర్చుకోగల్గాడు. అయితే గురువు గొప్పవాడనా మీ ఉద్దేశ్యం? గురువు గొప్పవాడేం కాదు. శిష్యుడే గొప్పవాడెప్పుడూ. మీరు కాస్త ఆ భావాన్నర్థం చేసుకొండి. అదే లెక్చెరర్ కాలేజీలో పాఠం చెపుతారు. ఒకడికి 90% మార్కులొస్తాయి. ఒకడు తప్పుతాడు. అందుచేత ఏ గురువు గొప్ప? గురువు గొప్పవాడు కాదు. శిష్యుడు గొప్పవాడై ఉండాలి. శిష్యుడు ఈ మానసిక స్థితిలో ఉండాలి. ఇది అండర్ లైన్ చేసుకొండి.

*చింతామణిర్లోక సుఖం సురద్రుః స్వర్గసంపదాం ।*
*ప్రయచ్ఛతి గురుః ప్రీతో వైకుంఠం యోగిదుర్లభం ॥ (శ్లో ॥ 8 )*

మారుమూల అడవిలో శివలింగం ఒకటుందని, దానికి పూజెలా చేయాలో కూడా తెలీనివాడు కన్నప్ప. వాడి గురించి పండితోత్తములుకూడా చెప్పుకోవల్సి వస్తోంది. వాళ్ళ పాండిత్యం అలా ఏడిచింది. కన్నప్ప గురించి చెపితే మీరలా అయిపోవాలను కోరు. **కన్నప్పనేమంటాం? అర్జునుడి యొక్క పునర్జన్మంటాం.** ఇవన్నీ చెపుతాం కానీ మనకి ఎన్ని అనుమాలొస్తాయో. ఎడం చేత్తో ఆరతిస్తున్నారా! కుడిచేత్తో ఆరతిస్తున్నారా! ముక్కు మూస్కుని ఆరతిస్తున్నామా! కళ్ళు తెరచుకొని ఆరతిస్తున్నారా! మీరిక్కడ శిష్యుడి యొక్క మానసిక స్థితిని అవగాహన చేస్కొండి. ఎందుచేతంటే గురువు సర్వాంతర్యామి, సర్వవ్యాపకుడు, సర్వసమర్థుడు.ఇది గురువు లక్షణం కదా.

మా కాలేజీలో నేను కెమిస్ట్రీ చెపుతాను. ఒక విద్యార్థి ఆర్గానిక్ కెమిస్ట్రీ సమస్యను అడుగుతాడు. ఏం చేస్తాన్నేను? మా కాలేజీలో ఆర్గానిక్ కెమిస్ట్రీ చెప్పే లెక్చెరర్స్ ఉన్నారు. వాళ్ళనడిగి చెపుతాను. అక్కడ కూడా చెప్పలేకపోయారు. గ్రంథాలయానికి వెడతాను. అక్కడ ఈ విషయంలో నిపుణులున్నట్టే కదా. వాళ్ళ పుస్తకాలు అక్కడుంటే వాళ్ళక్కడ ఉన్నట్టే కదా. వాళ్ళని రిఫర్ చేస్తాను. అంటే ఎవరిని అడిగాను నేను? అక్కడ గురుపరంపరని అడుగుతున్నాను.



మీరు ఆధ్యాత్మికత ఏదో వేరనుకోకండి. నిత్యజీవితంలో మీకు జరిగేదే. కానీ తేడా ఎక్కడొచ్చిందంటే ఇక్కడ నువ్వు ఏ గురువు నడిగినా సర్వవ్యాపి అయిన గురువు ప్రతీచోటా ఉన్నాడు కనుక ఏ రిఫరెన్స్ అఖ్ఖర్లేదు. చేతకాని దద్దమ్మ - గురువుని ప్రశ్న అడిగినా సర్వవ్యాపి అయిన గురువు అక్కడుంటాడు. ఆయనెలాగో వాడికి జవాబిస్తాడు. ప్రశ్నేంటి. ప్రశ్న నీకు రావాలి. **గురువుని నువ్వు ప్రశ్నించాలి. అర్జునుడే ప్రశ్నించకపోతే 'గీత' లేదు.** పరీక్షిత్తు, దుంధుకారి, నారదుడు లేకపోతే భాగవతం లేదు. ప్రశ్నించే వాడు కావాలి - నేనీ సమస్యలో ఉన్నాను. వాటిని నేనెలా దాటాలని ప్రశ్నించాలి. అదే ప్రశ్న. నీకే జవాబు తెలిస్తే ఇంక నీకు గురువెందుకు? సమస్య మీకు స్పష్టంగా అర్థమౌతోంది కదా.

## సమస్య మీరు నివారించదల్చుకున్నారా? లేదా?

ఆ మానసికస్థితిని మీరు ప్రపంచంలో సవరించాలి. సమస్య ఉందని బాధ పడుతున్న వ్యక్తి, ఆ సమస్యకి నివారణోపాయం చెపితే చెయ్యటం లేదు. అంటే వాడికి సమస్య నివారించుకోవాలని ఉందా, లేదా? అందువల్ల ఫలితాలు రావటం లేదు. **గురువు యొక్క అనుగ్రహంలో ఏవిధమైనటువంటి లోటూ లేదు.** ఇందాకే ఉదాహరణ చెప్పాను కదా.

రోగనివారణ చేసుకోవాలనుంటుంది. కానీ రోగనివారణకి మొదట ఎలాంటి మందులేసుకుంటాడు? రోగనివారణ చెయ్యలేమని చెప్పిన మందులేసుకుంటాడు. క్యాన్సర్ తగ్గిన కొన్ని కేసులు వ్యక్తిగతంగా తెలుసు నాకు. మిగతా వాళ్ళని వదిలెయ్యండి. అనేక మంది క్యాన్సర్ రోగులున్నారు. రకరకాల ఫోన్లు వస్తూంటాయి - మేం రేడియోథెరపీ చేయించుకున్నాం మాస్టారు అని. అది చేయించుకున్న దగ్గర్నుంచి జుట్టు ఊడిపోతుంది. పళ్ళూడి పోతాయి. ఎందుకు పాడైపోయిందంటే మేమిచ్చిన రేడియేషన్ వల్ల అని వైద్యులు చెపుతున్నారు.

క్యాన్సర్ రోగులకి మా దగ్గర మందులేదని వాళ్ళు స్పష్టంగా చెపుతున్నారు. ఏ వైద్యుడైనా మందుందని చెప్పాడా? మరి పిచ్చివాళ్ళ లాగా వాళ్ళ దగ్గరికెళ్ళి ఎందుకు

మందు తీసుకుంటారు? అంటే మీకు క్యాన్సర్ రోగం తగ్గాలనుందా, లేదా? ఆలోచించుకోండి. ఇతరుల్ని మీరేం ప్రశ్నించ వద్దు, మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. ఇంతమంది క్యాన్సర్ రోగులున్నారు. ఆహారం మార్చుకుంటే అది తగ్గిపోతుందని నేను చెపుతున్నాను. ఎంతమంది మారతారు? మారతామంటే ఎంతమంది మారనిస్తారు?

గుంటూరులోనే ఒక క్యాన్సర్ రోగికి నేను మందిస్తూ ఉంటే 3 నెలల్లో చనిపోవలసిన వాడు, 4 సంవత్సరాలు బ్రతికాడు. కొడుకు అమెరికాలో చదివొచ్చాడు. రాగానే ఈ మందు మానిపించి అల్లోపతి ఇప్పించాడు. వెంటనే ఆయన చనిపోయాడు. ఇది నా గొప్పతనం వల్ల బ్రతికాడా? అని కాదు. కాని కొడుకు తండ్రి బ్రతకాలనేగా మందు ఇప్పించాడు. మీరది అర్థం చేసుకోండి. కొడుకు తప్పు కాదక్కడ. కాని వాడి బుఱ్ఱకెక్కించిన విషమది. ఏంటా విషం?

**కాలగ్రాన - వండులోనో ఎందులోనో ఉంటాడని తక్షకుడిని వెతక్కండి. తక్షకుడే బుద్ధి.** ఇది మంచిది బాబు అని నేను చెప్తుంటే, ఇది మంచిదని కళ్ళారా కనిపిస్తుంటే మీరు నమ్మకపోతే నేనేం చేసేది? ఆ క్యాన్సర్ రోగి చాలాసార్లు ఇక్కడికి వచ్చాడు కూడా. అంటే అతని ఆరోగ్యం ఎంత అభివృద్ధి చెందిందో మీరు ఆలోచించండి. మీరది నమ్మితే దేశానికి సేవ చేసిన వాళ్ళవుతారు. దాని కోసం ఒక మంచి సమూహం హైదారాబాద్‌లో తయారవుతుంది. రాబోయే కాలంలో ప్రతీదీ భాగవతం మీదే ఆధారపడి ఉంటుందని గుర్తుంచుకోండి. ఇది మీరందరికీ చెప్పాలి. ఏది చెప్పాలి? శిష్యుడు తన సమస్యలను గమనించుకో గలిగిన స్థితి వస్తే ఆశిష్యునికి కావల్సిన గురువు వస్తాడు. సమస్య గమనించడం అంటే ఏంటో అర్థమైందా?

ఆ సమస్యలు తీరకపోతే నాకు సుఖం లేదు అనే మానసిక స్థితి ఉన్న వ్యక్తి కావాలి. మీరు ఆ స్థితిలో లేరు. మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి మీకా సమస్య పోవాలంటే. చాలామంది పిల్లలు చదువుకోవాలని ఉంది మాస్టారు కాని ఏకాగ్రత కుదరటం లేదు అంటారు. కానీ వాళ్ళు సినిమా చూస్తారు. మనం గమనించం కానీ, వాళ్ళు గమనిస్తారు. ఎంత బాగా చూస్తారంటే ఆ సినిమాలో, తర్వాత దృశ్యంలో ఆ



హీరో ఏ మేజోడు వేసుకున్నాడో చెప్పగలరు వాళ్ళు. మరి ఏకాగ్రత లేదనే పిల్లలు దానిని ఎంత శ్రద్ధతో గమనించారో చూడండి. మరి చదువులో మాత్రం ఏకాగ్రత కుదరటం లేదంటే అర్థమేమిటి? అది ఒప్పేసుకోండి మీరు.

## భాగవతం తక్షణమే నివారణని సూచిస్తుంది

మొట్టమొదట మీరు మీ జీవితాలలో మనుష్యులకి అది చెప్పవల్సి ఉంది. మీరు నేనిది చెయ్యలేపోతున్నాను మాస్టారు అంటే మీకు వాటి మీద శ్రద్ధ లేదని అర్థం. అది మీకింక రాదు. శ్రద్ధ ఉంది. తల్లక్రిందులుగా తపస్సు చేస్తారు. కానీ సమస్య పరిష్కారం కావటం లేదు. ఉదా:- సైంటిస్ట్‌కి క్యాన్సర్‌కి మందేంటో తెలీదు. కానీ ఏం చేస్తున్నారు? ప్రపంచంలో ఎవరు ఏమనుకున్నా కూడా నేను క్యాన్సర్‌కి మందు కనిపెట్టి తీరతానంటున్నాడు. ఉదయం నిద్ర లేచిన దగ్గరనుంచి రాత్రి పడుకునే వరకు వాడికిదే పని. వెబ్‌సైట్స్‌ల్లో కాన్ఫరెన్స్‌లు పెట్టుకుంటారు. మాట్లాడుకుంటారు. అయినా మందేమీ రాలేదు కదా ! కానీ దానికి మీరు చేసే ప్రయత్నాల వల్ల ఏమి వస్తుంది. ఖచ్చితంగా మందు వస్తుంది. అర్థమైందా మీరేం చెయ్యాలో.

సమస్యలు మీకుంటే ఈ సమస్యలని ఎలా నివారించుకోవాలో తెలియకపోతే నివారించడానికి మీరు ప్రయత్నిస్తూ , ప్రయత్నిస్తూ ఉంటే సమస్య తీరుతుంది. మరి భాగవతం లాంటి పుస్తకాలు ఆ సమస్యలు తక్షణమే తీర్చేయడానికి కావల్సిన మానసిక స్థితినిస్తాయి. అదే తేడా ఇక్కడ సైంటిస్ట్‌లకీనూ. ఎన్ని ఏళ్ళు పడుతుందో తెలీదు కాని, వీళ్ళే కనుక భాగవతం చదివితే వాళ్ళకి తక్షణం క్యాన్సర్‌కి మందు వస్తుంది. నేచర్ క్యూర్‌లో జరుగుతున్నది అదే. ప్రకృతిలో అదే జరుగుతుందని భాగవతం చెపుతోంది.

## గురువుల దృష్టిలో మానవజాతి సమస్యేంత?

*అమయో యశ్చ భూతానాంజాయతే ఏన సువ్రత ।*
*తదేవ హ్యామయం ద్రవ్యం నపునాతి చికిత్సితమ్॥ ( భా॥ 1-5-33 )*

భావం: ప్రాణులందరికి ఏ పదార్థం తింటే రోగం వచ్చిందో అదే పదార్థమును చికిత్సా విధానములననుసరించి ప్రయోగిస్తే రోగ నివారణ అవుతుంది కదా.

గురువు దానికి కావల్సిన జ్ఞానాన్నిస్తాడు. సమస్యని నివారిస్తాడు. అంతేకాక నీకు స్వర్గసంపదలనివ్వటమేకాక అమరత్వాన్నిచ్చే విద్యను ప్రసాదిస్తాడు. ఈ శ్లోకం అర్థమదే. చింతామణి శ్లోక సుఖం....

గురువు అంటే - అజ్ఞానాన్ని పోగొట్టే జ్ఞానం. అదెప్పుడొస్తుందో, అదే ఓ పెద్ద సమస్యనుకుంటారు. గురువుల దృష్టిలో మానవ జాతెంత? అలాగే అనంతమైన ఈ విశ్వం ఒక పాదం మాత్రమే. పరమాణువు కేంద్రకంలో 138 కణాలున్నాయని పట్టుకున్నారు. కేంద్రకం ఎంతుంటుందో మీకేమైనా తెల్సా?

పురాణాల్లో ఒక కథ ఉంది. శివలింగానికి బ్రహ్మ ఒక వైపు, విష్ణువు ఒక వైపు వెళ్ళారు. ఒకరు అనంతం పైకి, ఒకరు క్రిందికి అలా వెళుతూనే ఉన్నారు. చివరికి స్థితికొచ్చారు. ఇటు వెళ్ళినా, అటు వెళ్ళినా అంతు తెలీలేదు వాళ్ళకే. ఆధ్యాత్మికతలో అనంతం యొక్క అంతు దొరకదు. కానీ ఫలితాలు మటుకు అనంతంగా ఉంటాయి. దీనినే భాగవతం వైకుంఠం అంది. ( కాలవ్యాల ముఖ.....) మృత్యు సంబంధమైన ఏ సమస్యనైనా భాగవతం తీరుస్తుంది. మొదలు **ఉండి అంతం ఉంటే అది మృత్యువు.** పుట్టినది ఏదైనా చనిపోతుంది.

బ్రహ్మ సృష్టి ఆదిలో ఉన్నాడు. కానీ మనబ్రహ్మ సృష్టి ఆదిలో ఉన్నాడు. మన దృష్టిలో ఆయనకు చాలా వయస్సుంది. కానీ ఆయనకూడా మృత్యుముఖంలోకి వెళ్ళి తీరాల్సిందే. ఏదైనా ఈ మృత్యుముఖంలోకి వెళ్ళేదే. అలాగే మీ సమస్యలు కూడా మృత్యుముఖంలోకి వెళ్ళేవే. ఎందుచేతంటే మొదట్లో ఆ సమస్య లేదు. ఎప్పుడో అప్పుడు ఆ సమస్య మొదలౌతుంది. ఎప్పుడో అప్పుడు ఆ సమస్య అంతానికి వస్తుంది. కానీ ఏ సమస్య పోగొట్టుకోవాలన్నాకూడా భాగవతం చదవాలి. అందుకే ఆ క్రమంలో వరుసగా చెపుతున్నాను.



పరీక్షిన్ మహారాజు శుకమహర్షి చెప్పే భాగవత కథను వినడానికి కూర్చోగానే దేవతలు సుధా పాత్రను పట్టుకుని వచ్చారు. పరీక్షిన్ మహారాజుకి మృత్యుభయం ఉంది కదా. మేమీ అమృతం తాగిస్తే ఆయన చావడు కదా. కాబట్టి ఇది ఆయనకిచ్చి, మాకు భాగవత కథామృతం వినిపించండి అని శుకమహర్షితో అన్నారు. పరీక్షిన్ మహారాజుకి చెప్పకండి మాకు చెప్పండి అనేగా. (శుకం నత్వా వదన్.......).

వాళ్ళకి ఒక విశేషం ఇచ్చాడక్కడ. -స్వకార్య కుశలా సురాః -వాళ్ళ పని వాళ్ళు చేసుకోవంలో చాలా కుశలురని. కాని నువ్వే ఏ స్థితిలో ఉండాలి?

## నారద దర్శనమెప్పుడౌతుంది?

కళ్ళుమూసుకుని పర్వతాసంలోకి రండి. చేతులు పైకెత్తి నమస్కార ముద్రలో శరీరాన్ని పైకి లాగండి. వచ్చిన వాళ్ళు స్థలప్రదక్షిణ చేస్కుని రండి. శ్వాసని గమనించండి. ప్రాణాయామంలో కళ్ళుమూస్కుని ఉండటం, ఆసనంలో కళ్ళు తెరచి ఉండటం మంచిది. ఈ పర్వతాసనంలో ఎంత సేపుంటే అంత మంచిది. శ్లోకాలు వ్రాసుకున్న వాళ్ళు నాతో కల్సి చదవండి.

ఓం నమో భగవతే వాసుదేవాయ

చేతులు సాగదియ్యండి. అప్పుడు కాని మీకా ఫలితం రాదు. పర్వతాసనంలో ఉండండి. ఎప్పుడూకూడా ఆసనంలో "స్థిరం, సుఖమితి ఆసనం" అన్నాడు పతంజలి. నీకు స్థిరంగా, సుఖంగా ఉండాలి ఆసనంలో. అది నిరంతరం చేస్కుంటూ ఉండండి. పర్వతాసనంలో ఋషులు తపస్సు చేశారంటారు. అదెంత సరైనదో నాకు తెలీదు కాని పర్వతాసనం వెయ్యకుండా ఎవరూ ఋషి కాలేరని నాకు తెల్సు. పర్వతాసనం అర్థమది. పర్వతాసనం మీద కూర్చుని ఉండటం పర్వతాసనం. సింహాసనం మీద కూర్చుంటే సింహాసనం. అందుచేత ఋషులు పర్వతాల్లో, గుహల్లో ఉండేవారంటే అదీ ఆసనం. అందుచేత ఈ శ్లోకాల పారాయణ జరుగుతున్నంత సేపు సాధ్యమైనంత వరకు ఈ ఆసనం వేస్కుంటూ ఉండండి. అలసిపోతే తీసెయ్యండి.

కృష్ణం నారాయణం వందే కృష్ణం వందే వ్రజప్రియం ।
కృష్ణం ద్వైపాయనం వందే కృష్ణం వందే పృథాసుతం ॥

### కృష్ణుడు గుర్తుకురాకూడదు

కృష్ణుడి యొక్క కథ అనేసరికల్లా " కృష్ణం ద్వైపాయనం వందే" కంటే ముందే. ముందు 'కృష్ణం వందే పృథాసుతం", దానికంటే ముందు "కృష్ణం వందే వ్రజప్రియమ్" అని ఆయన గుర్తుకొస్తాడు. ఆయన గుర్తురాకూడదు. కృష్ణుడి తరగతి జరుగుతున్నప్పుడు 'యశోదా నందుడు' అనే కృష్ణుడు గుర్తుకురాకూడదు. రుక్మిణీ



కృష్ణుడు గుర్తుకురాకూడదు. సత్యభామా కృష్ణుడు గుర్తుకురాకూడదు. అర్జునుడి స్నేహితుడైన కృష్ణుడు గుర్తుకురాకూడదు. మీరది ముందు నియంత్రించుకోవాలి.

దాన్ని నియంత్రించుకోవటానికేం చెప్పాడు? 'కృష్ణం నారాయణం వందే' మేం ఏ కృష్ణుడి గురించి చెపుతున్నామంటే **నారాయణ తత్త్వమైన కృష్ణుడి గురించి మాట్లాడుతున్నాం తప్ప 'వ్రజ భూమిలో' పుట్టిన కృష్ణుడి గురించి మేం మాట్లాడటం లేదు.** 'వ్రజభూమిలో' పుట్టిన కృష్ణుడు, ద్వైపాయనుడైన కృష్ణుడు, పృథాసుతుడైన కృష్ణుడు ఇవి చేతనత్వం యొక్క మూడు స్థితులు.ఇక్కడ చేరిన వాళ్ళందరూ పృథాసుతులే. పృథాసుతులంటే ఏంటి? - నిర్ణయించుకోలేని స్థితిలో ఉన్నవాళ్ళు. 'సేనయోర్యుభయోర్మధ్యే రథం స్థాపయమేచ్యుత' అని గీతలో అంటాడు.

### భాగవతంలోని స్థలప్రదక్షిణ

హే అచ్యుత! ఆ మాటెంత జాగ్రత్తగా వాడాడో అర్థం చేసుకోండి. కృష్ణ అనలేదు. యదునందన అనలేదు. ఏమీ అనలేదు. అన్నదేంటి? **'అచ్యుత' అచ్యుత** అంటే చ్యుతుడు కాని స్థితిలో ఉన్నవాడు. మనం చ్యుతి చెందిన స్థితిలో ఉన్నవాళ్ళం. ఆశాంత స్థితి, ఆ పరమానంద స్థితి, ఆ గురుస్థితి, ఆ మౌనస్థితి నుంచి చ్యుతులమై పోయాం. **ఆశ్రమంలో ప్రవేశించగానే మౌనంగా ఉండమనే దెందుకు? ఆ అచ్యుత స్థితిలోకి వెడతారని.** అందుచేతింక ఆశ్రమంలోకి ఎవరొచ్చినా మౌనంగా ఉండండి. ఇంకోటేం చెప్పాను. ఎన్నిసార్లు మీరు ఆశ్రమంలోకి వచ్చినా అన్నిసార్లు స్థలప్రదక్షిణ చెయ్యండి. ఎందుకు స్థలప్రదక్షిణ చెయ్యాలన్నదానికి 41వ శ్లోకంలో భావం ఉంది చూడండి.

*దిశాదిక్షు నిరీక్షంతి రక్షితారం నిజం వపుః*
*వీజ్యమాన శ్శతః స్త్రీభిర్ బోధ్యమాన ముహుర్ముహుః ॥ (శ్లో-41)*

**తన శరీరాన్ని రక్షించే తన ప్రభువైన వాని కోసం దశదిశల్లోనూ చూస్తోంది. ఆమె నలువైపులా వందలాది మంది స్త్రీలు విసనకర్రతో విసుర్తూ ఆమెను సముదాయిస్తున్నారు.**

అన్ని వేపులా చూస్తోందిట. **దశదిశలంటే అర్థమేంటి?ఆ స్థలప్రదక్షిణ.** ఆ స్థల ప్రదక్షిణ అంత ముఖ్యమనిచెప్పినా మీకు అర్థమ్వకపోతే బలవంతంగానైనా చెయ్యండి. అదొక నియమంలాగ పెట్టుకొండి మీరు. ఎప్పుడు ఎవరొచ్చినా సరే, క్రొత్త వాళ్ళొచ్చినా సరే మాకు తెలీదనకుండా ఆ మంత్రాలన్నీ అన్నివైపులా వ్రాసే ఉన్నాయిగా చూసి చెయ్యడి. **భాగవతం వింటే లాభం లేదు. ఆచరిస్తే లాభం.** అందుచేత ఆచరణలో మొదలుపెడుతున్నాం మనం.

భాగవతం చదివాను కనుకే ఈ నియమం పెట్టాను నేను. అది చదివేంత వరకు నాకూ ఆలోచన లేదు భాగవతంలో ఏముంటాయో. ఈ శ్లోకాన్ని మనం ఉపయోగించుకుంటున్నాం. 'తన శరీరాన్ని రక్షించే తన ప్రభువైన వాని కోసం దశ దిశల్లోనూ చూస్తోంది.' మనం అదే చెయ్యాలింక. మన శరీరానికికూడా రక్షణ కావాలనే కదా మనం కోరుకుంటున్నాం. తిన్నగా ఆశ్రమంలోకి వచ్చేస్తే మీకు రక్షణ ఎలా ఉంటుంది. మీరు దశదిశలూ చూడండి. పది దిశలు అంటే 8 దిక్కులు + పైన ఒకటి + క్రింద ఒకటి కలిపి మొత్తం పది. అందుచేత ఆ స్థల ప్రదక్షిణన్నది భాగవత సాధనన్నది అర్థం చేసుకొండి.

## 'రథం స్థాపయమేచ్యుత'

అచ్యుత స్థితిలో ఉంటే మీ రథాన్ని సరైన స్థితిలో పెడతాడు. 'రథం' అంటే ఏంటి? మీ శరీరం. మనకున్న రథం మన శరీరమే. 'ఆత్మానం రథితం విద్ధి' అని ఉపనిషత్తుల్లో చెపుతాడు. ఈ శరీరమనే రథాన్ని **నడిపించేవాడు ఆత్మ. ఆ రథాన్ని నడిపించే వాడు ఆత్మ కనుక కృష్ణుడు అర్జునుడికి సారథయ్యాడు.** తన రథాన్ని నడిపించు వాడు ఆత్మ అయితే. ఇప్పుడు మన రథాన్ని ఎవరు నడిపిస్తున్నారు? ఆత్మ కనిపించటం లేదు కాని కోరికలు కనిపిస్తున్నాయి. ఆ కోరికలు కూడా ఎంత బలహీనమైనవంటే అది తీరాలనే పట్టుకూడా మన కుండదు.మనమున్న స్థితిని చూడండి. ఆ స్థితేమిటంటే కోరికలు మాత్రం తరుణీ స్థితిలో అంటే యవ్వన స్థితిలో ఉన్నాయి. అయితే ఆ కోరికలు తీరడానికి కావల్సిన జ్ఞాన, వైరాగ్యాలు వృద్ధులైపోయి నేలమీద పడున్నాయి.



## జ్ఞానవైరాగ్యాలు రెండూ అచేతనమైపోయాయి

వృద్ధౌ ద్వౌః పతితే పార్శ్వే నిశ్వ సంతావ చేతనో ।
శుశ్రూషంతి ప్రబోధంతి వృధదీచ పయోః పురం ॥ ( శ్లో 39 )

**భా॥ అక్కడ దగ్గరలో ఇద్దరు వృద్ధ పురుషులు అచేతనావస్థలో దీర్ఘశ్వాస తీసుకుంటూ పడిఉన్నారు. ఆ తరుణి వారికి సేవ చేస్తోంది. వారిలో చేతనత్వం రావడానికి ప్రయత్నిస్తోంది.**

జ్ఞానవైరాగ్యాలు రెండూ అచేతనమైపోయాయి. ఈ రెండూలేని వాళ్ళు జీవితంలో దేనినీ ఉపయోగించుకోలేరు. చదువుకోవాలంటే టి.వి.ల మీద స్నేహితుల మీద సినిమాల మీద వైరాగ్యం ఉండాలి. ఉద్యోగంలో బాగా పేరు తెచ్చుకోవాలంటే ముఠా రాజకీయాల్లో దూరంగా ఉండాలి. అదీ వైరాగ్యం. సిగిరెట్ మానెయ్యండి బాబు అని చెపితే ఎప్పటినుంచి మానేస్తారు? వచ్చే జన్మనుంచి మానేస్తా మంటారు. ఎందుచేత? జ్ఞాన వైరాగ్యాలు వృద్ధాప్యంలోఉన్నాయి కాబట్టి.అవికూడా అచేతనంగా ఉంటాయన్నారుఈ భాగవతం వ్రాసినప్పటికే. **ఈనాడు కలిలో ఉన్న వ్యక్తుల యొక్క మానసికస్థితి ఎంతలాగా ఔపాసన పట్టేసారో ఆ మహాదయాళులు.** దయ అనెందుకన్నానంటే మూర్ఛపడిపోయున్నారు, లేవ లేనన్న స్థితిలో ఉన్నాడు. వాడికి నేనెలా సహాయం చెయ్యగలను అనే అద్భుత మైన వ్యక్తి నారదుడు.

అందుచేత ఈ రెండూ మీరు చాలా జాగ్రత్తగా పాటించండి. అచ్యుత స్థితిలో ఉండి మీ రథసారథి కావాలంటే మీరు మౌనంగా ఉండాల్సిందే. మౌనం లేని చోట శ్రీకృష్ణుడు రాలేడు. రెండవదేంటి? స్థలప్రదక్షిణ. **మౌనం, స్థలప్రదక్షిణ ఈ రెండు ఆశ్రమ ప్రవేశానికి అర్హతలు.** మీరెన్నిసార్లు బయటికెళ్ళి లోపలికొస్తారో అన్ని సార్లు స్థలప్రదక్షిణ చేస్తే అంత మంచిది. అదితప్ప అన్నీ చేస్తామంటారు మీరు.

## మీ భక్తి దేని మీదుంది?

అలాంటి పరిస్థితుల్లో ఉన్న భక్తిని - **భక్తి** అంటే ఏం చెప్పాను? భక్తి అంటే భగవంతుడి మీద ఉండేదే భక్తి కాదు. ధనం మీదుండేది కూడా భక్తే. మనకిప్పుడు భక్తి దేని మీదుంది? 'ధనం' మీదుంది. నిజంగా ధనం మీద భక్తుందా? ఉంటే ఏం

చెయ్యాలి మీరు....? కష్టపడకుండా డబ్బు వస్తే మాత్రం మీకు ఓ.కె. కాని కష్టపడాలంటే మాత్రం నాట్ ఓ.కె. అంటే మీకు దేని మీద భక్తుంది? కష్టపడరు కాని డబ్బు కావాలి....

భక్తంటే మీరింకొకటి గుర్తుంచుకోండి.'ఏది లేకపోతే మీరు జీవించలేరో మీకు ఊపిరి సలపదో అది భక్తి.' అలాంటి భక్తి మీకుదేని మీదైనా ఉందా? అది లేకపోతే నేనింక బ్రతకలేను మాస్టారు. ఛీ ఈ వెధవ బ్రతుకెందుకు అనే వాళ్ళని నేనింత వరకు చూడలేదు. అయితే ఒక విషయంలో మాత్రం మా కాలేజీలో నా సహోద్యోగులు మాట్లాడుకునే మాటలువింటే మాత్రం ఒకటి అనిపించింది. ఛీ వెధవది చింతపండు, ఎండుమిర్చి, నూనె లేకపోతే బ్రతకలేం రామకృష్ణా అంటే అదే సరైనదేమోనని అప్పుడు నాకనిపించింది. అనకపోయినా మీరూ అదే అనుకుంటు న్నారేమో నోటితో చెప్పకుండా. అందుచేత మీ భక్తి దేని మీదుంది? అది 31వ శ్లోకంలో చెప్పబడుంది.

*సత్యంనాస్తి తపశ్శౌచం దయాదానం నవిద్యతే ।*
*ఉదరం భరిణో జీవా వరాకాః కూటభాషిణః॥*

**భావం: సత్యం లేదు, తపస్సు లేదు, దయా లేదు, దానం లేదు. జీవులందరు కూడా కడుపునింపుకోవటానికే జీవిస్తున్నారు. ఉదరం భరిణో జీవాత్ అంటే పొట్టనింపుకోవటమే తప్ప మీకింకేమీ అఖ్ఖర్లేదు.**

మీకు కంప్యూటర్ అఖ్ఖర్లేదు. ఏమీ అఖ్ఖర్లేదు. కానీ, మీరు కంప్యూటర్ ఎందుకు నేర్చుకుంటున్నారు? పొట్టనింపుకోవటానికి. ఉదరం భరిణో జీవా వరాకాఃకూటభాషిణః కాని పైకెలా చెపుతారు? **దేని మీదా ప్రేమున్నట్టే** చెప్పరు. అందరూ వేదాంతం చెప్పేవారే, ఉపన్యాసాలిచ్చేవారే. ఎవరి జీవితాలు వాళ్ళు చూసుకొండి. ప్రక్కవాళ్ళని చూడకండి. ఇది మీకు చెప్తూ నన్ను నేనూ ప్రశ్నించుకుంటూ నా జీవితంకూడా అంతేనేమోనని. చూడండి ఎంతద్భుతంగా ఈ భాగవతం అందరికి పనికొచ్చేలాగా ఫలానా మతం వాళ్ళకి, ఫలానా జాతి వాళ్ళకే కకుండా **సమస్త మానవజాతిని ఉద్దేశించి వ్రాయబడింది.** ఈ లక్షణాలులేని మనుష్యులెక్కడైనా ఉన్నారా? భక్తి హీనులైన మనుష్యులు. భక్తనేసరికల్లా మళ్ళా మనకొక జాడ్యముంది. భగవంతుడి మీదుండేదే



భక్తని. రాజనీతుజ్ఞులకి దేని మీద భక్తుంటుంది? ఆ కుర్చీ మీద. ఆ పోస్టులో ఉండి ఎన్ని వేషాలైనా వేస్తారు. ఎన్ని ప్రమాదాలనైనా ఎదుర్కొంటాం. మీరు అంచనా వేస్కోండి మీకెలాంటి కోరికలు ఉన్నాయో. మీకు బాధ్యతలఖ్ఖర్లేదు. మీఅంతట మీరేపనీ చెయ్యరు. చేసే వాళ్ళని కించపరుస్తారు. పని చేస్తున్న వాళ్ళు మీదృష్టిలో పరమ మూర్ఖులు. కాని మీకేం కావాలి?

మీ మాట అందరూ వినాలి. మీరనగానే అన్నీ జరిగి పోతూండాలి. ఇంట్లో కాని ఆఫీస్‌లో కాని. మీరేం కోరుకుంటే అది జరిగిపోవాలి. అదీ ఆ శ్లోకంలో చెప్పింది. సత్యం నాస్తి తపశ్శౌచం....

ఎక్కడైనా ఏదైనా ఇవ్వాల్సి వస్తే ఇవ్వరు. కాని వీళ్ళకి మాత్రం అందరూ ఇవ్వాలి. ఈ సైకలాజికల్ మేకప్‌ని భక్తి అంటున్నాం.

భక్తి అనేది నువ్వేది పొందాలో దాన్ని సాధించేంత వరకు నిద్రపోని మనస్థత్వం ఉంటే అది భక్తి. చాలా మంది నన్ను అడుగుతుంటారు. ఈ గురువుల దగ్గరికి స్మగ్లర్స్, రాజనీతిజ్ఞులు, ఈ డబ్బున్నవాళ్ళందరూ చేరతారని మాలాంటి మంచి వాళ్ళం వెడితే మమ్మల్ని చూడటం లేదని. వాళ్ళలో మిమ్మల్ని మీరు పోల్చుకొండి. ఒక స్మగ్లరు ఉన్నాడు. నోట్ అవీ ఏం వ్రాయకుండా డబ్బులు తీసుకెళ్ళి ఫలానా సమయానికి అందచేస్తానంటే అందచేస్తాడా? అందచేయడా? (చేస్తాడు).

కాని మీ గురువుకి మీరేం చేస్తున్నారు? గురువుకి నాలుగు గంటలు కాలాన్ని ఇస్తానన్నారు. ఖచ్చితంగా ఇస్తాను మాస్టారని 20ఏళ్ళబట్టి కాలాన్ని ఇస్తూనే ఉన్నారు. అదెక్కడికి పోయిందో నేను వెతుక్కోవాలి. లెక్కవెయ్యండి రోజుకి నాలుగు గంటలు **చొప్పున 20 సంవత్సరాల్లో ఎన్నిగంటలు గురుసేవకి సమర్పణ చెయ్యాల్సి ఉన్నదో?** ఆ లెక్కన మిమ్మల్ని మీరు నిజాయితీగా ప్రశ్నించుకొండి స్మగ్లర్ గొప్పవాడా మీరు గొప్పవారా అని?

గురువు దృష్టిలో - చెప్పిన సమయానికి ఎంత ప్రమాదమైనా సరే కావాలంటే వాళ్ళు ప్రాణమిచ్చైనా సరే ఆ పని చేస్తారు స్మగ్లర్స్. ఇంకోటేంటి. ఒకవేళ వాడు పట్టుబడితే

వాళ్ళ తాలూకు వాళ్ళు అచూకి చెప్పరు. కాని మనం పట్టుబడక ముందే అన్నీ చెప్పేస్తాం. అది ఆ 'సత్యాన్నాస్తి...' అనే క్యారెక్టర్ వాళ్ళకున్నది. సత్యం అంటే ఒక మాట మీద కట్టుబడి ఉండటమే కదా. అలాంటిది మనకున్నదా అసలు.

అందుచేత ఇలాంటి శ్లోకాలన్నీ మీరు కంఠతా పట్టాలి. నా కోరికేంటి రేపీ **భాగవతాన్ని మీరు ప్రజలలోకి తీసుకెళ్ళాలి.** వివరంగా తీసుకెళ్ళకపోయినా శ్లోకాల మీద స్ట్రెస్ చేసి చెప్పగలగాలి మన జీవితాలు అలాగ ఉంటే ఉండచ్చు కాని దాన్ని వదిలేద్దాం. కనీసం ఒక మంచి చెప్పుకుంటూ పోతే మన జీవితాలైనా ఎప్పుడో అప్పుడు మారతాయి. అందుచేతి శ్లోకం మళ్ళీ చెప్పండి.

సత్యంనాస్తి తపశ్శౌచం దయాదానం నవిద్యతే ।
ఉదరం భరిణో జీవా వారకాః కూటభాషిణః ॥ (శ్లో 31 )

సత్యం, తపస్సు, శౌచం, దయ, దానం ఉన్నవాళ్ళు ఈనాడీ ప్రపంచంలో వాళ్ళ వాళ్ళ స్థాయిల్లో గొప్పవాళ్ళుగా చెలామణి అవుతున్నారు. దయ ఉన్నవాళ్ళు అంటే దయ ఎవరికుండాలి, బలవంతులకుండాలా, బలహీనులకా? బలహీనులకి దయ తప్ప ఇంకేం ఉండదు. వాడికి చేతనైందే దయ. అందుచేత **దయ ఎవరికుండాలి.** బలవంతులకి. వాడి గుంపు మీద ఎట్టి పరిస్థితులలోను ఈగైనా వాలనీయడు. అది సెంట్రలైజ్డ్ దయ కావచ్చు. కాని మనకంటే చాలా బెటర్. మీరెన్ని కబుర్లు చెప్పకున్నా వాడలా వెడుతూంటే మీరు నోర్మూస్కునికూర్చోవాల్సిందే. ఎవడేం మాట్లాడినా ఎదురుగా మాట్లాడే దమ్ము లేదు.

ఉదరం భరిణో జీవాః - నా కడుపు నిండిపోతే చాలు అనుకునే వాళ్ళు కాదు వాళ్ళు. నేను, నా తాలూకు వాళ్లందరూ పైకి రావాలనుకుంటారు. అది భగవంతుని దృష్టిలో తప్పు కాదు. నీకు తప్పుగా అనిపించవచ్చు. ఎందుచేతంటే మన శరీరంలో లివర్ ఉంది. అది తనకు సంబంధించిన పదార్థాలను మాత్రమే లోపల ఉండనిస్తుంది. ఇంకో పదార్థం వస్తే బయటికి ఎప్పుడైతే తొయ్యలేకపోతుందో అప్పుడది క్యాన్సర్ అవుతుంది. అందుచేత క్యాన్సర్ పోవాలంటే మన ఆలోచనా విధానం మారాలి. ఆ



శ్లోకాలు తిరిగి, తిరిగి వినండి. క్యాన్సర్ నివారణకు ఇది మందు. భాగవతంలో ఉన్న మంత్రాలన్నీ కూడా మందులుగా పని చేస్తాయి. మంత్రం అంటే ఏంటో తెలుసా? మననం చేసుకుని, దానిని అర్థం చేసుకుంటే అది మంత్రమవుతుంది. మననాత్ **త్రాయతే ఇతి మంత్రః** మననమంటే తిరిగి, తిరిగి ఆలోచించడం. అలాగే సత్యం అంటే ఉన్నదున్నట్లు చెప్పడం.

కూట భాషణః - బాగా డబ్బున్న వాడు ఎవరికైనా దానం చేశాడనుకోండి, ఆదాయం పన్ను ఎగ్గొట్టడానికి చేశాడండి అంటారు. మన మానసిక స్థితి ఎలా వుందో అర్థమైందా. ఆదాయం పన్ను ఎగ్గొట్టడానికి చేశాట్ట. అంతేకాని, దానం చేయడానికి కాదు. పోనీ నువ్వు దేనికైనా చేశావా? నా దగ్గర వుంటేగా అంటావు. అంటే దానినే కూట భాషణ అంటారు. ఈ సైకలాజికల్ మేకప్‌ను అర్థం చేసుకోండి. అందుచేత మన కోరికలు తీరకపోవడానికి గల అనేక కారణాల్లో ఇవి కొన్ని. దీన్ని బాగా మననం చేసుకోండి. పోయిన సారి చెప్పిన టేప్ విని, ఆ బిట్ మళ్ళీ చర్చించుకోండి. మీరు మామూలుగా ఆ సమయదానం ఇచ్చినట్లే ఇది కూడా కూటభాషణః. మరేం చేస్తారో చూసుకోండి. పైన చెప్పిన 31వ శ్లోకం ఇక్కడ సాధనాత్మక జీవితంలో కూడా అచరిస్తే మంచి ఫలితాలుంటాయి.

మీరు మంత్రం చేసుకోమన్నారు మాస్టారు. కానీ, ఇంట్లో వాళ్లు చేసుకోనివ్వడం లేదు. ఏం చేయమంటారు. సరే, ఇంట్లో వాళ్ళు సినిమాకు వద్దంటే వెళతావా? వెళ్ళవా? అదే ఇంట్లో వాళ్ళు స్నేహితులతో మాట్లాడొద్దురా అంటే ఊరుకుంటావా? మరి ఇంట్లో వాళ్ళు గాయత్రీ చేయద్దంటే ఎందుకు మానేశావు?

కూట భాషణః- అన్నీ వేషాలు. చేయ్యాలని వుంటే ఇంట్లో వాళ్ళు వద్దన్నా చేస్తారు మీరు. ఈ మానసిక స్థితి గుర్తుంచుకోండి. ఇదెందుకు చెప్తున్నానంటే ఇక్కడ ఇష్టాన్ని - భక్తి అంటున్నాడు. భక్తి అనే మాటకు ఇక్కడ ఇష్టం అని అర్థం. మీకు ఏదిష్టమో దానిని ప్రపంచంలో ఎవరు కాదన్నా మీరు చేసి, తీరతారు. అందుకే ఈ ఆశ్రమంలోనే కాదు, హరిద్వార్‌లో కూడా గురువుగారిని కొన్ని ప్రశ్నలు అడగరు. ఇది

చెయ్యొచ్చా గురువుగారని! ఎందుకు అడగరంటే ఆయన ఖచ్చితంగా వద్దంటారని తెలుసు. వీళ్ళ కేమో చేయాలని వుంటుంది. అందుచేత చెప్పకుండా చేసేస్తారు. భక్తి అంటే అర్థమవుతోందా! కానీ, భక్తి తన ఇద్దరు వృద్ధకుమారుల మీద ఆధారపడుంది అన్నదానికి చెపుతున్నాను నేనీ వివరణ. ఏంజరిగిందిటక్కడ?

యమునా నది ఒడ్డున శ్రీకృష్ణుడు తన లీలలు చూపించినటువంటి ప్రదేశంలోకి వెళ్ళాడుట నారదుడు. ఏం చూసుకుంటూ? ఈ పృథ్వి మీద జరుగుతున్నటువంటి అద్భుతమైన ఫలితాలన్నీ కూడా ఈ తీర్థాలలో ఎలా ఉన్నాయో చూశాడు. ఆశ్రమాలెలా ఉన్నాయో చూశాడు. రాజులెలా ఉన్నారో చూశాడు. దంపతులెలా ఉన్నారో చూశాడు. పిల్లలెలా ఉన్నారో చూశాడు. అవంతా పై నుంచి చూశాడు. అవన్నీ పైన చెప్పుకున్నాం మనం. శ్రీకృష్ణుడు స్వయంగా అవతరించినటువంటి స్థలములో ఎలా ఉందో చూద్దామని యమునా నది ఒడ్డుకు వెళ్ళాడుట. ఇక్కడ భక్తి కనిపించింది ఆయనకి. కాని భక్తి యొక్క ఇద్దరు పుత్రులు ఏస్థితిలో ఉన్నారు? వృద్ధస్థితిలో, అచేతనస్థితిలో ఉన్నారు. ఊపిరి మాత్రం ఆడుతోంది. మన భాషలో డీప్‌కోమాలో ఉన్నారు. జ్ఞానం వైరాగ్యం పరమ కోమాలో ఉన్నాయి. మనకెప్పుడు జ్ఞానం, వైరాగ్యం వస్తాయి? మనం కోరింది అందని ద్రాక్ష పండు అయితే (జ్ఞానం, వైరాగ్యం) అకస్మాత్తుగా జ్ఞానోదయమౌతుంది. (అందకపోయాక) అందని ద్రాక్ష పండు.....నిరంతరం కూడా అచ్యుత స్థితి. జరిగితే జరుగుతుంది, జరగకపోతే సమస్యే లేదు అన్న నిరంతర మానసికస్థితే భాగవత విద్య. ఈ మొత్తం భాగవతంలో చెప్పదల్చుకున్నది, మీచేత ఆచరణ చేయించ దల్చుకున్నది ఇదొక్కటే విషయం. ఏంటా ఒక్క విషయం?

ఏమి జరిగినా ఫలితం ఎలా ఉన్నా కూడా నీ బాధ్యతలన్నీ నువ్వు పూర్తిగా నిర్వర్తించాలి. 100% నిర్వర్తించాలి. జరిగితే జరుగుతుంది, జరగకపోతే జరగదనే భావన చెప్పానుకదా. అదొస్తే మన - కూటభాషిణః - ఏంచేస్తాం మనం? 100% ప్రభావం ఉందక్కడ. ఏం ఉంటుంది. వేదేం ఉండదక్కడ. అందుచేత ఆ యువతి దగ్గరికి



వెళ్ళిట నారదుడు అడుగుతాడు తల్లీ! ఏమిటిలా బాధ పడుతున్నావని. అన్ని వేపులా స్థలప్రదక్షిణ చేస్తూ ...

దిశాదిక్షో నిరీక్షంతి రక్షితారం నిజం వపుః ।

'శతస్త్రీభిర్' - ఆ యువతికి వందమంది స్త్రీలు వీస్తున్నారు. భక్తికి వందమంది స్త్రీలు వింజామరలు వీస్తున్నారుట. భక్తేం చేస్తోంది? పదిదిశలు స్థలప్రదక్షిణ చేసుకుంటోంది. ఎవరీ వంద మంది స్త్రీలు? వందమంది స్త్రీలు నారదుడికి కనిపించారు. మనకి కనిపిస్తారా ఎక్కడైనా?

స్త్రీలు - మన కోరికలే. కోరికలెన్నున్నాయి మనకి? మాష్టారు అడగకూడదనుకుంటున్నాను కాని.... అని మొదలెడతాడు వాడు. మీరు చెప్పారండి ఏం అడగఖ్ఖర్లేదు అన్నీ అవే జరిగిపోతాయని. కాని అని మొదలెడతాడు. ఎన్ని కోరికలు కోరతాడు వాడు? అతి తక్కువ. వందతో హెచ్చించి.

అందుచేత ఈ భక్తంటే కోరికని చెప్పాను కదా. ఈ భక్తిని వందలాది కోరికలతో వీస్తుంటాం కనుక కోరికలు అలానే ఉంటాయి. అది యువతి. యువతి అంటే ఏంటి? పట్టులోనే ఉంటాయి. దెబ్బతిన్నదేంటి? కుడిచెయ్యి, ఎడంచెయ్యి.

బాల ఉవాచః- భోభోసాధు క్షణం తిష్ఠ.....పరం.

**ఓ మహాత్మా! ఒక్క నిముషం ఆగు. నా సమస్యని కూడా నివారించు. నీ యొక్క దర్శనం సంసారం యొక్క అన్ని పాపాలను సర్వదా నష్టం చేసేస్తుంది.**

భగవంతుని యొక్క, భక్తుల యొక్క దర్శనం అన్ని పాపాలను భస్మం చేసేస్తుంది. వాళ్ళ చిత్రపటాలైనా అలానే పని చేస్తాయి. అందుకని ఈ చిత్రపటాలు పుట్టుకోవడం. సాయికి, సాయి చిత్రానికి బేధం లేదని మనకి తెల్సా? మనలో ఎంతమందికి తెల్సు. చాలామందికి తెలీదు. తెలిశాక సాయివచ్చి ఆసనంలో ఉన్నాడంటే నీ మనస్సెక్కడుండాలి? మరి ఉండలేదంటే మీకు తెల్సినట్టా, తెలీనట్టా. - కూటభాషిణః - మన మాటలకి, మన చేతలకి ఎంత తేడాఉంటుందో అర్థం చేసుకోండి. అందుకనే మనకి ఫలితాలు రావు. నువ్వు నోటితో చెప్పవద్దు. నీ ఆచరణ చెప్పాలి.

మృత్యువు దగ్గర పడింది.

చంద్రశేఖర మాశ్రయేత్ మమ కింకరిష్యతి వైయమ...'( మార్కండేయుడు) అని శివలింగాన్ని పట్టుక్కూర్చున్నాడు. మనకి పంచలింగ ధుని ఉంది. ఎంతమంది మృత్యువు దాటతారని మీ ఉద్దేశ్యం?....

ఎందుచేత? ఆ కూటభాషిణః -

ఉదరం భరిణో జీవా....

దాన్ని తిరిగి తిరిగి మన మీద మనం ఆపాదించుకోవాలి. ఇప్పుడు ఇంతా చెప్పి నేను ఉద్యోగం మానకుండా కాలేజీకి వెడుతున్నానంటే నేను కూటభాషిణే. నేను మీకంటే గొప్ప వాడిననేం కాదు. కాని మనని మనం విశ్లేషణ చేసుకుందాం. మనం అంటూన్న మాటకి, సాయి విగ్రహానికి, భగవంతుని యొక్క భక్తులకి, భగవంతుడికంటే శక్తి ఎక్కువ. భగవంతుడు 'కర్మఫల ప్రదాత' మాత్రమే. మనమెలాంటి పనులు చేస్తే అలాంటి ఫలితాలే ఇస్తాడు. (కాని భక్తులేం చెయ్యగలరు? గురువులేం చెయ్యగలరు?)



# జీవితంలో ఎవరు పైకి వస్తారు

భోభోః స్వాధో క్షణం తిష్ఠ మచ్చింతా మపినాశయ।
దర్శనం తవ లోకస్య సర్వదాఘ హరం పరం ॥ (శ్లో ॥ 42 )

**భావం: మహాత్మా! తమరు ఒక్క క్షణం ఇక్కడ నిలవండి. మీయొక్క దర్శన భాగ్యం సంసారంలో గల అన్ని పాపాలను ఎల్ల వేళలా నశింప చేయగలదు.**

భక్తి నారదమహర్షిని కాసేపాగమని ప్రార్థిస్తుంది. అలాగే మీరుకూడా మీకు దగ్గరలో కానీ, మీవూరిలోకి కానీ మహాపురుపుడెవరైనా వచ్చారంటే వెంటనే దర్శనానికి వెళ్ళిపోండి. మీకు నచ్చినా నచ్చక పోయినా దర్శనం చేసుకు వచ్చేయండి. దయచేసి మహాత్ములను నీ కొలబద్దపెట్టి కొలవకండి.

ఒకసారి గణపతి సచ్చిదానంద స్వామిని రిపోర్టర్సు కలవటం జరిగింది. వెళ్ళగానే ఇంటర్వ్యూ ఇవ్వలేదు, తరువాత ఇచ్చారు. స్వామివారు చెప్పిన విషయాలు వీళ్ళవరికీ అర్థంకాలేదు. వారు స్వామివారిని మహిమలేమైనా చూపించమన్నారు. దానికాయన మౌనం వహించారు. అయితే తిరిగి వచ్చేటపుడు వాళ్ళందరికి తలా ఒక మెరిసేరాయి ఇచ్చి 'దీనిని ఉంగరంగా చేయించి పెట్టుకోండి' అని చెప్పారు. వీళ్ళు అలాగే చేసారు. అది పెట్టుకున్న క్షణంనుంచి వారికి ఏదో ఒక రకమైన చిన్న చిన్న ప్రమాదాలు జరిగాయి. అందరు కలిసి విశ్లేషణ చేసుకుని ఈ ప్రమాదాలన్నీ స్వామీజీ యిచ్చిన రాళ్ళవల్లే అని నిర్ణయానికి వచ్చారు.

ఈ న్యూస్ రిపోర్టర్సే తరువాత నన్ను కలిసినపుడు 'గణపతిసచ్చిదానంద స్వామిజీలో మహత్తు ఏమీలేదు'అని అన్నారు. ఇది కూటభాషిణః' అంటే. ఇంతకూ స్వామివారికి పవరు వున్నట్లా లేనట్లా ? మనం ఎలాంటి నీచమైన మానసిక స్థితిలో జీవిస్తామో. వారివద్ధకి వెళ్ళినప్పటికీ మనకుగల అవగాహనతోనే వారి పనులను, ఆలోచనలను అర్థంచేసుకునే ప్రయత్నము చేస్తాము తప్ప వాళ్ళేమి చెపుతున్నారో తెలుసుకుందామనే ఒపెన్ మైండ్ ఉంచుకోము. ఇటువంటి మానసిక స్థితి కలిగినవారికి విద్యకు పరాకాష్ట అయిన వేద విషయాలు ఎలా అర్థమవుతాయి?

మీకు నిజంగా దృష్టి వుంటే, దానికి తగిన శ్రద్ధకలిగి వుంటే నేర్చుకోకుండా మిమ్మలను ఈ భూమండలములో ఎవరు ఆపలేరు. కానీ ప్రస్తుతం భక్తిపేరుతో భగవంతునిపై నమ్మకమున్నట్లు చాలామంది ప్రవర్తిస్తున్నారు. ఇది నిజంగాదు, నటన. ఎందుకో భాగవతమే జవాబిస్తున్నది. 'ఉదరం భరిణోజీవాః'. ప్రస్తుతకాలంలో పొట్టనింపుకోవటానికే అన్ని పనులు చేస్తున్నారు. కాబట్టి ముంది మీకు దేనిపై భక్తి వున్నదో గమనించుకోండి.

భక్తి ఉన్నవాళ్ళు జీవితంలో పైకివస్తున్నారు. వ్యాపారస్తులు పైకి వస్తున్నారు-వాళ్ళకి డబ్బుమీద భక్తివున్నది. రాజకీయవేత్తలు పైకి వస్తున్నారు-వాళ్ళకు అధికారముమీద భక్తి వున్నది. సాహితీ వేత్తలు-ప్రజలకి ఏ విధమైన సాహిత్యము అందివ్వాలో దానిమీద భక్తి వున్నది. ఇంకా కారల్ మార్క్స్, రూసో, గాంధీలాంటి వాళ్ళు మానవుని యొక్క ఆలోచనా విధానాన్ని మార్చటంమీద భక్తి కలిగి ఉన్నారు.

కారల్‌మార్క్స్ ఎలా జీవించాడో తెలుసామీకు ? లండన్‌లోని బ్రిటీష్ లైబ్రరీలో రోజుకి 18 నుండి 20 గం॥లు పుస్తకాలు రిఫర్‌చేస్తూ గడిపేవాడు. ప్రజలయొక్క ఆలోచనలని ఎలా మార్చాలి అన్నదే ఆయన ధ్యేయం. కట్టుకోవటానికి బట్ట, తినటానికి తిండి లేని పరిస్థితి. అతని భార్య ఓర్పుగా అన్ని అమర్చేది. పిల్లలకు బట్టలు కొనలేక రొడ్డుమీద పారేసిన బట్ట ముక్కలు ఏరుకుని వాటిని అందంగా అతుకులు వేసి కుట్టేది. వాటినే కొంచెంతేడాతో మనం 'జీన్స్' అంటున్నాము.

మనకు భక్తివున్నదా? ఉంటే ఓ.కె. లేకపోతే మహాత్ములను కలిసినపుడు మీ మానసిక స్థితిని గమనించుకోండి. మన లాజిక్‌తో ఓ నిర్ణయానికి వచ్చేసి మన బుద్ధిని ఉపయోగిస్తాము తప్ప, మన బుద్ధిని ఉపయోగించకూడదు అని గ్రహించము. ఎప్పుడు కూడా శాస్త్రం ప్రమాణం అంటామందుకే. శాస్త్రములో అలా ఉందాలేదా అని చూడాలి తప్ప మన బుద్ధి మీద ఆధారపడకూడదు. మహాత్ములను మనం ఏమడుగుతాం? ఒక్క క్షణం ఉండండి అంటాం. ఎక్కువ సేపు ఉంటే వాళ్ళు తిడతారు, ప్రమాదం. నరకం దగ్గర ధర్మరాజుని ఒక్క నిముషం ఉండమన్నారట. ఎక్కువసేపు ఉంటే ధర్మరాజుతో చాలా ప్రమాదం.



మహాత్ములు మనకష్టం తీరేంతవరకు ఉంటేచాలు అనే నీచ మానసిక స్థితిని అర్థంచేసుకోండి. భోభో సాధు క్షణం తిష్ట. మహాత్ముల దర్శనం అన్ని పాపాలను నాశనం చేస్తుంది అని నిరంతరం గుర్తుంచుకోండి. శిరిడీసాయి నిరంతరం గురువుని చూస్తూ 12 సం॥లు ఉన్నాడు. తిండి తినకుండా చూస్తూ వుంటాడా? తినే వుంటాడు. అన్నిచోట్లకి తిరిగేఉంటాడు. అలాగే మనం కూడా పనులన్నీ చేసుకుంటూనే గురువు మీద దృష్టి ఉంచుతాం.

మీరు ఎక్కడుంటే అక్కడ ఏమీ మార్చుకోక్కరలేదు. నిరంతరం ఆ మౌనంలోకి మీరు వెళ్ళగలిగితే చాలా పనులు చేసుకోవచ్చు. మౌనంగా ఉండి చాలా పనులు ఎలా చేస్తాం? మన బాస్ మనకి నచ్చని పని ఒకటి చెపుతాడు. ఎలా చేస్తాం? మౌనంగా ఉండి పనిచేయటానికి అసలు అర్థం అది. లేకపోతే మీకు మీ తల్లిదండ్రులు ఇష్టంలేని పనులు చెప్పినపుడు అది చేస్తారు గదా. ఎలా చేస్తారు? నోరు మూసుకుని పూర్తిచేస్తారు. కానీ మనసు దాని మీద ఉందా? ఇష్టం ఉందా? లోపల ఏ మానసికస్థితిలో ఉన్నారు. మానసికస్థితి మార్చు. నాకు మౌనంగా వుండటం రాదు మాష్టారు అంటారు. అది ఇలాగే చేయండి. అంటే స్థలప్రదక్షిణగూడా అలాగే ఇష్టం లేకుండా చేయాలన్నమాట. ఆ మౌన స్థితిలో నా మాటలు వింటూ ఉండటం అలవాటు చేసుకోండి. ఇంట్లో నిత్యజీవితంలో నీళ్ళు త్రాగుతున్నారు. 'హసలీలా నిద్రాదులు చేయుచున్ ' అంటే మీరు గాఢనిద్రలో ఉన్నాకూడా మౌనంగా ఉండాలి. మీరు ఆ గురువుని దర్శించగలిగే స్థితి మీకు రావడానికే మిమ్మల్ని గురుచరిత్ర పారాయణ చేయమన్నది. అదే సాయి టెక్నిక్. అందుచేతే సాయి నన్ను మంత్రాలు అడగవద్దన్నది. నా గురువు నాకు ఏ మంత్రమూ చెప్పలేదు అన్నాడు సాయి. కానీ మంత్రం చెప్పాడు, ఏంటా మంత్రం? లోపలున్న ఆ గురువుని నిరంతరం దర్శించుకుంటూ ఉండటం. రకరకాల ప్రక్రియలు చెపుతాం మనం.

బహుధా తవ వాక్యేన దు:ఖ శాంతిర్ భవిష్యతి ।
యధాభాగ్యం భవేద్ భూరి భవతో దర్శనం తదా ॥

మీ మాటల వల్ల నా యొక్క దు:ఖం కొంచం శాంతించింది. మనుష్యునికి భాగ్యోదయం అయినప్పుడే మీ యొక్క దర్శనం జరుగుతుంది. భాగవతం వ్రాసిన ఆ గురువు గురించే చెప్తుకుంటున్నాం కదా. అందుచేత భాగవత శ్రవణ సప్తాహం చాలా గొప్పది.

నారద ఉవాచ

కాసిత్వం కావిమౌ చేమా నార్యః కాః పద్మలోచనాః ।
వదదేవి సవిస్తారం స్వస్య దు:ఖాస్య కారణం ॥ (.44 )

నారదుడు ఇలా పలికాడు:- " నేను ఆ స్త్రీని అడిగాను. దేవీ నీవెవరు? ఆ ఇద్దరు పురుషులు నీకేమౌతారు? నీ చుట్టూరా ఆ అందమైన కళ్ళుకల స్త్రీలెవరు? నీ దు:ఖానికి కారణం తెలుపు " అని.

ఆ దేవతా స్త్రీలు మన కోరికలే. కోరికలన్నీ సరైనవే, కానీ వాటిని తీర్చుకునే శ్రమ, పట్టుదల లేవు. అందరికి ఫస్టుక్లాసే రావాలి -చదవకుండా. పని చేయకుండా ఉద్యోగాలు కావాలి, జీతాలు కావాలి. తపస్సు చేయకుండా భగవంతుని దర్శనం కావాలి. గురువు అనుగ్రహం కావాలి సేవ చేయకుండా. రాదుగదా అది. ఈ కోరికలన్నీ ఆ భక్తి చుట్టూరా ఉంటాయి. వీటిని చూసి నారదుడు వీళ్ళెవరూ అని అయోమయంలో పడ్డాడు. పడిపోయిన ఈ వృద్ధ పురుషులెవరు? అసలు నీ కష్టానికి కారణం ఏమిటో వివరంగా చెప్పు అన్నాడు.

బాలోవాచ:

అహం భక్తిరితిఖ్యాతా ఇమౌమే తనయౌ మతౌ ।
జ్ఞాన వైరాగ్య నామానౌ కాల యోగేన జర్జరౌ॥ ( శ్లో ॥ 45 )

భాగవతం మొత్తం మన యొక్క విశ్లేషణ. రక్త పరీక్షలో శరీరగత దోషాలు ఎలా తెలుస్తాయో అలాగే ఈ విశ్లేషణలో మనలోని దోషాలు తెలుస్తాయి. దోషాలు తెలియగానే ఏ మందు వేయాలో తెలుస్తుంది. రక్త పరీక్ష చేయకుండా డాక్టరు కూడా ఏమీ చెప్పలేడు.



అలాగే నారదుడు అంతటి వాడు కూడా భక్తిని విశ్లేషణ అడిగాడు. కోరికలను భక్తి అనేవారు. ఎందుచేతనంటే అపుడు అలా ఉండేది వాళ్ళకి. వారికి దేని మీదయినా భక్తి ఉంటే అది సాధిస్తేగానీ నిద్రపట్టేదికాదు. కానీ ఈ కాలంలో భక్తికి మనం ఇవ్వవలసిన నిర్వచనం ఏంటి ? కోరిక. మీయొక్క కోరికలే. నా పేరు భక్తి అంటే ఇపుడు మనం కోరిక అని చదువుకోవాలి. జ్ఞానము, వైరాగ్యము అనే వారే నా పుత్రులు. కోరిక యొక్క పుత్రులు జ్ఞానము, వైరాగ్యము. దీనిని జాగ్రత్తగా అర్థంచేసుకోండి. సినిమా చూడాలనేటటువంటి కోరిక మీకు వచ్చింది. మరి జ్ఞానము, వైరాగ్యము ఎక్కడ ఉండాలి ? ఏ సినిమాకి వెళ్ళాలి, ఏ యాక్టరు బాగాచేస్తాడు? డైరెక్టరు ఎవరు? అనే విషయాలు తెలుసుకునే సినిమాకి వెళుతున్నారుకదా! ఇది దానికి సంబంధించిన జ్ఞానము. టిక్కెట్టుకు 30 రూ॥లు ఖర్చు పెట్టాలి. లేకపోతే సినిమాకి వెళ్ళలేరు. మీకు కోరిక చాలా బలంగా ఉంటే 30 రూపాయలు యిచ్చేస్తారు. ఇదే వైరాగ్యము.

నా అనుమానం ఏంటంటే జనం సినిమాలు, టీ.వీ. మీద భక్తి పెరిగి చూడటం లేదు అన్నది నిజంగాదు. 30 రూపాయలు మీద భక్తి పెరిగి, 30 రూపాయలు ఖర్చుపెట్టటం ఎందుకులే అని మానేస్తారు. ఏం జరిగిందక్కడ? వైరాగ్యం పడి పోయింది. కాబట్టి మీ కోరిక తీరాలంటే జ్ఞానము, వైరాగ్యము ఉండాలి. ఇవి రెండు భక్తి ప్రక్కన వృద్ధస్థితిలో పడిఉన్నాయి.

ఓ సంఘటనను గమనించండి మా నాన్నగారు ఢిల్లీలో పని చేస్తూ ఉండేవారు. మేం బెనారస్‌లో ఉండేవాళ్ళం. నేను రీసెర్చ్ చేస్తున్నపుడు జరిగిన సంఘటన ఇది. ఎవరో ఒకవ్యక్తి వచ్చి తలుపు కొట్టారు. తలుపు తీసిన తరువాత లోపలకి వచ్చి - మేము ఒక క్రొత్త వాషింగ్‌పౌడరు తయారుచేశామండి, అని దాని గురించి వివరాలు చెప్పి కొనమన్నాడు. మానాన్నగారు జాలిపడి తీసుకున్నారు. ఈనాడు అతను ఎక్కడున్నాడో నాకు తెలుసు. అతని వాషింగ్‌పౌడరు నిర్మా వాషింగ్‌పౌడరు. ఎందుకు చెప్పాను నేను ఇది అంటే ఏ సైన్స్ లెక్చరర్‌కైనా వాషింగ్‌పౌడరు చేసే విధానం తెలుసు, దానిపై పేజీలు-పేజీలు వ్రాసేస్తాడు. కానీ నిర్మా సబ్బుకు పోటీగా ఇంకో సబ్బును

తేలేకపోయారు. నిర్మా కంపెనీ అతను పెద్ద-పెద్ద కంపెనీ వాళ్ళని ఢీ కొట్టాడు. అతనికి, ఈ పాఠం చెప్పేవాళ్ళకి తేడా "ఉదరం భరిణో జీవాః". డబ్బు కావాలీ అంటాము ఇతర సుఖాలు కావాలీ అంటాము. లాభాలు వస్తే 2% దేముడికిస్తామని అంటాము. 98% మనం తీసుకుని, 2% ఆయనకివ్వటం ఏమిటో నాకు ఇప్పటికి అర్థం అవటం లేదు. చెప్పిన దానిని ఆచరణలో పెట్టంలేదు. ప్రతి చోట నా ఈ మాటలు మీకు ముల్లులాగా గ్రుచ్చుకోవాలి. మీ భక్తి దేనిమీద ఉంది? మాస్టారూ ప్రొద్దున్నే నిద్ర లేవలేకపోతున్నాము అంటారు. వారే క్రికెట్ కొరకు అలారం పెట్టుకుని లేచి నన్ను కూడా లేపిన వాళ్ళున్నారు. కాబట్టి మీ కోరిక ఎంత తీవ్రంగా ఉంటే జ్ఞానము, వైరాగ్యము అంత అప్రయత్నంగా వస్తాయి. భక్తి నారదునితో జ్ఞానము, వైరాగ్యము నీరసించి పోయాయి అంటుంది.

ఇదానీం శృణు మద్వార్తాం సచిత్తస్త్వం తపోధనా ।
వార్తామే వితతాప్యస్తి తాం శ్రుత్వా సుఖమావహ ॥ (శ్లో ॥ 46 )

**భావం: ఓ తపోధనా! సావధాన చిత్తులై తమరు నా వృత్తాంతమును వినుడు. నా కథ చాలా ప్రసిద్ధి చెందినదైనప్పటికీ, దానిని మీరు విని నా బాధలను పోగొట్టి శాంతిని ప్రసాదించండి.**

అందమైన, పద్మలోచనములు కలిగిన ఈ స్త్రీలను కోరికకు సేవ చేస్తున్న వారిని నీవు చూస్తున్నావుకదా?వీరందరు గంగా, యమున, సరస్వతి మొ॥ పుణ్య నదీమ తల్లులు. ఈ నదులను తల్లి అని పిలుస్తాము కానీ, వారిపట్ల మన ప్రవర్తన మరల కూటభాషిణః నానా చెత్త నదులలోకి చేరుస్తూ నదిని దేవత అంటాము. ప్రతిచోటా మన బుద్ధి యొక్క భ్రష్టుత్వం కనిపిస్తుంది. భాగవతములో దీనిని ఎలా సవరించు కోవాలో తిట్టి మరీ చెప్తాడు. లోపం ఎక్కడ వచ్చింది, అసలు నీకు రోగం ఎందుకు వచ్చిందో తెలిస్తే తప్ప దానికి మందు పడదు. అదేవిధంగా కోరిక స్పష్టంగా అర్థం అవ్వాలి, దానికి కావలసిన జ్ఞానవైరాగ్యాలు మన దగ్గర ఉండాలి. ఉదాహరణకు మంచి ఆహారము తినాలనిపించగానే తక్షణము మంచి హోటలుకి బయలు



దేరాలసిందే. వెళ్ళాలా అనుకుంటే వైరాగ్యం వచ్చేసింది. వున్న గడ్డి ఏదోతిను లేదా జిందాల్ జిందాబాద్ అంటూ రెండు గ్లాసుల చన్నీళ్ళు తాగేయ్. నీళ్ళు ఎందుకు త్రాగావంటే ఫుడ్ తినాలన్న కోరిక తీర్చుకునే జ్ఞాన వైరాగ్యాలు లేవు. భక్తి యొక్క ఇద్దరు పుత్రులు కుడిచేయి, ఎడమచేయి అనుకోండి. లేక కుడి కాలు ఎడమ కాలు అనుకోండి. ఇదే జ్ఞానము వైరాగ్యము.

సాయి చరిత్రలో పల్లకీ కథ ఒకటి వస్తుంది, బాబాకి ఒకరు పల్లకీ పంపారు. మూడు నెలలైనా దానిని బాబా పార్శిల్ కూడా విప్పలేదు. ఒక భక్తుడు పల్లకీ కోసం ఒక గది కట్టడానికి ఉదయం నుండి రాత్రి వరకు కష్టం చేస్తున్నాడు. ఆ పనిని చూస్తూ బాబా అతనిని తిడతాడు. పని చేయద్దని ఎంతో విసుక్కుంటాడు, కొట్టబోతాడు కూడా. గురువు దగ్గర మీ కోరిక ఎంత ఉన్నదో అన్నదానికి పరీక్ష. కాబట్టి అలాగే జరుగుతుంది. గురువు వద్దు అన్నాడంటే మీ కోరిక యొక్క తీవ్రతను బట్టి ఏది మంచిదో ఏది చెడ్డదో మీరే నిర్ణయించుకోండి. తీవ్రత వుంటే గురువు రాళ్ళు విసిరినా అతడి వెంట పడతారు. అలాంటి వారికే గురువు అనుగ్రహము నిరంతరం వుంటుది. సాయి శిరిడీలో వున్న కాలములో సాధ్యమై నంతవరకు తిట్టి కొట్టి మనుష్యులను దూరం చేసుకుందామని ట్రై చేసాడు. ఆయన వద్దన్నా మొండి పట్టుపట్టిన శిష్యులే ఆయన వద్దకు చివరలో వచ్చారు. సాయిని వారే నిలబెట్టారు. మనకు అందుకే అందుతున్నాడు. జ్ఞానము, వైరాగ్యము లేని ఏ కోరిక తీరదు. భాగవతము మన చుట్టూరా వున్న నదులు మన కోరికలను తీరుస్తాయని లిఖ ఇచ్చింది. కోరికలు కూడా నదుల వలే ఒక ప్రవాహము. నది ఎక్కడయినా ఒకచోట స్థిరంగా వుండదు. అలాగే కోరికలు కూడా స్థిరంగాఉండవు. కోరికలు తీరడానికి నదీతీరాలు చాలా పనిచేస్తాయి. ఈ తీర్థాలన్నీ ఆ విజ్ఞానము మీద ఆధారపడి ఉన్నాయి. నదులన్నీ సాధారణంగా పాపాలను పోగొట్టి, ప్రాయశ్చిత్తానికి చాలా ఉపయోగపడతాయి. నదీ పుష్కరాల్లో ఒక రహస్యం దాగి వుంది. రాశి చక్రంలో 12 రాశులున్నాయి. ఈ 12 సంవత్సరాల్లో నదులు ఒక్కొక్క రాశిలో తిరుగుతూ అనంత శక్తితో ఉంటాయి. కాబట్టి ఆ రోజులలో నదీ స్నానము చాలా మంచిదని ఈ నదులే చెబుతున్నాయి.

ఇదానీం శృణు మద్వార్తాం సచిత్తస్త్వం తపోధనా ।
వార్తామే వితతాప్యస్తి తాం శృత్వా సుఖమావహా ॥ (శ్లో ॥ 46 )

**భావం: ఓ తపోధనా! సావధాన చిత్తులై తమరు నా వృత్తాంతమును వినుడు. నా కథ చాలా ప్రసిద్ధి చెందినదైనప్పటికి, దానిని మీరు విని నా బాధలను పోగొట్టి శాంతిని ప్రసాదించండి.**

ఈ నదులన్నీకూడా దేవతా రూపంలో కోరిక దగ్గరికి వచ్చి సేవ చేస్తున్నాయి. కోరికలు తీర్చటానికైనా కూడా వాళ్ళసేవలు నాకు ఉపయోగ పడటంలేదు. నదుల దగ్గరకు కూడా జ్ఞాన వైరాగ్యాలు లేకుండా వెడితే ఆ నదులు కూడా ఏమీ చేయలేవు. ఈ నదుల యొక్క పెరుగుదలలో స్థాయిని చాలా జాగ్రత్తగా చూడండి. ఎవరైనా ప్రయోగము చేయదలుచుకుంటే వారికి ఈ శ్లోకం (46) ఉపయోగ పడుతుంది.

నేను "ద్రవిడదేశంలో ఉత్పన్నమయ్యాను" అని కోరిక (భక్తి) చెప్తుంది. కోరిక ఎక్కడ పుట్టింది- ద్రవిడదేశంలో పుట్టిందట. కర్ణాటకలో పెరిగిందట. మహారాష్ట్రలో అక్కడక్కడ సన్మానాలు పొందింది. కానీ గుజరాత్‌లో దానికి ముసలితనం వచ్చేసింది. ఆ వివరాలు, పేర్లు జాగ్రత్తగా అర్థం చేసుకుని విశ్లేషణ చేసుకోండి. అలాగే రాబోయే కాలంలో ఉండేది భాగవతమే. ఈ పేరుతోనే ఉంటుంది. లేకపోతే బయోసైన్స్ లేక లైఫ్ సైన్స్ పేరుతోనో ఉంటుంది. దీనినే సైకో సోమాటిక్ మెడిసిన్ అంటారు. ఇది సవ్యమైన ఆలోచనా విధానం చెబుతుంది. భారతదేశంలో కోరికలు ఎలా అభివృద్ధి అవుతాయో జాగ్రత్తగా గమనించండి.

వ్యాసుడులాటి మహా భాగవతోత్తముడు భూత, భవిష్యత్, వర్తమానాలు తెలిసిన వ్యక్తి వ్రాసిన శ్రీమత్ భాగవతానికి మనం ఇలా సంకల్పం చెప్పుకోవాలి. "అద్య బ్రహ్మణః ద్వితీయ పరార్థే..... కృష్ణా కావేరీ మధ్య ప్రదేశే..... అంటారు. ఈ మధ్య ప్రదేశాన్ని సరిగా దింపుకుంటున్నామా? చాలా ముఖ్యమైన మీ కోరికలు తీర్చుకోటానికి కూడా! ఈ టెక్నిక్ చెప్పినా నేర్చుకోరు. ఈ విధానాన్ని జాగ్రత్తగా కంఠతా పట్టండి. శ్లోకాలలో వ్యాసుడు ఏం చెపుతున్నాడో చర్చించుకోండి.



ఉత్పన్నా ద్రవిడే సాహం వృద్ధిం కర్ణాటకే గతా ।
క్వచిత్ క్వచిన్ మహారాష్ట్రే గుర్జరే జీర్ణతాం గతా ॥ (శ్లో ॥ 47 )

**భావం: నేను ద్రవిడ దేశంలో పుట్టి, కర్ణాటకలో పెరిగి, మహారాష్ట్రలో అక్కడక్కడ సన్మానింపబడ్డాను. కాని గుజరాత్‌లో నాకు ముసలితనం ఆవరించింది.**

ద్రవిడ దేశంలో పుట్టటం, కర్ణాటకలో వృద్ధిచెందటం - వృద్ధిం కర్ణాటకే..... క్వచిత్ క్వచిత్ మహారాష్ట్రే - మహారాష్ట్రంలో నాకు సన్మానాలు జరిగాయి. గుర్జరే జీర్ణతాం గతా - గుజరాత్ రాష్ట్రంలో ముసలితనం వచ్చేసింది.

తత్ర ఘోరకలేర్యోగాత్ పాఖండైః ఖండితాంగకా ।
దుర్బలాహం చిరం యాతా పుత్రాభ్యాం సహమందతాం॥ (శ్లో ॥49)

**భావం: అక్కడ కలియుగ ప్రభావం వల్ల పాఖండులందరు నా అంగములను భంగం చేశారు. చాలాకాలంపాటు నేనిదే అవస్థలో ఉండటం వల్ల నేను కూడా నా పుత్రులతో పాటు దుర్బలనైతిని. నిస్తేజురాలనైతిని.**

అక్కడ అంటే గుజరాత్ దేశంలో ఘోరమైనటువంటి కలి ప్రభావం వలన ఖండైః ఖండితాంగతః - నా అంగాలన్నీకూడా ముక్కలు ముక్కలయ్యాయి. దుర్బలా హంచిరంయాతా - ఖండ యోగం నాకు వచ్చు కనుక వాటన్నింటిని తిరిగి అతికించు కుంటున్నాను. కానీ అతికినప్పుడల్లా గుజరాత్ దేశంలో ముక్కలు ముక్కలుగా అయి పోతుంటాను. గుజరాత్‌లో ఈ మధ్య రెండు భయంకరమైన భూకంపాలు వచ్చాయని మీకు తెలుసుకదా. అది ఒక్క కుదుపు కుదిపి పారేసింది. ఇప్పుడు జరుగుతున్న సంఘటనలకి, భాగవతం మరలా ఇప్పుడు ఎందుకు ప్రత్యేకంగా చెబుతున్నానో నేను మీకు చెప్పాను. ఎవరు వచ్చినా, రాకపోయినా సరే నేను చెప్పిన పని చేసినా చెయ్యక పోయినా నేను ఇది చెప్పుకుంటూ వెళతానని నేను మీకు చెప్పాను. ఊహించగలిగితే ఇది ఎందుకో అని మీకు తెలుస్తుంది. దుర్బలా హంచిరం యాతా - ముక్కలు ముక్కలైపోయి తిరిగి కలుసుకుంటాయి. అయినా ఎన్నిసార్లని అలా కలుపుతారు?

ఒకసారి ఎముక విరిగింది మరలా కలిపాం. అతుక్కుంటుందది. కానీ మొదట నున్న బలం ఉండదు . మళ్ళీ విరుగుతుంది మళ్ళీ అతికిస్తారు. కానీ అంత బలం రాదు. చివరికి ఏమౌతాం? దుర్బలులం అయిపోతాం. దుర్బలా హంచిరంయాతా . పోనీ నాకొడుకులైనా నాకు సహాయం చేస్తారా అంటే వాళ్ళు నాకన్నా మందమతులు. తల్లికి ఎవరు సహాయం చేయాలి? కోరికకి ఎవరు సహాయం చేయలి? జ్ఞాన వైరాగ్యాలు. అవి ఉంటే మరలా కోరిక బలం పుంజకుంటుంది. కానీ, ఈ పిల్లలు ఏమైపోయారు? మందమతాః - బలహీనం అయిపోయారు.

*వృదావనం పునః ప్రాప్య నవీనేవ సురూపిణి ।*
*జాతాహం యువతీ సమ్యక్ ప్రేష్టరూపా తు సాంప్రతమ్ ॥ (శ్లో ॥ 50 )*

భావం: ఇప్పుడు బృందావనమునకు వచ్చిన దగ్గర నుంచి నేను మళ్ళా పరమ సుందరిని, సరూపవతిని, నవయువతిని అయ్యాను.

కానీ నేనే బృందావనానికి వచ్చి ఈ అందమైనటువంటి, పరమ సుందరుడైన వానిని పొందగలిగాను. వ్యాసుడు ఇక్కడ మీ కోరికల గురించి చెబుతున్నాడు తప్ప ఏ భక్తి గురించి చెప్పటంలేదు. భక్తి ముసలిదైపోతే మాకేం లాభం అనకండి. ఈ సూత్రం మీకుకూడా వర్తిస్తుంది కనుక. కనుక మీయొక్క కోరిక ఎప్పుడు యువతి రూపం దాలుస్తుంది? "- బృందావనానికి " వెళితే పరమ సుందరమైన యువతి రూపం ధరిస్తుందది.

*ఇమౌతు శైతావత్ర సుతౌ మే క్లిష్యతః శ్రమాత్ ।*
*ఇదం స్థానం పరిత్యజ్య విదేశం గమ్యతే మయా ॥ (శ్లో ॥ 51 )*

భావం: నాముందే అలసిపోయిన నా ఇద్దరు పుత్రులు దు:ఖితు లౌతున్నారు. అందుచేత నేనీ స్థానమును విడిచి వేరొక చోటుకి వెళ్ళదలచాను.

పాపం భక్తికికూడా విదేశాలకి వెళ్ళాలనిఉంది. ఇక్కడ శవాకృతి రూపం పొందినటువంటి వారు నా పుత్రులే. పాపం అలసి పోయి పడిపోయారు. వాళ్ళే జ్ఞాన వైరాగ్యాలు. అవి ఏమైయ్యాయట? అలసి పడిపోయి, నిద్రపోతున్నాయి. భక్తి లేక



కోరిక ఇప్పుడు విదేశాలలోనే ఉంది. వాళ్ళకి ఏ కోరిక ఉన్నా ఆ కోరిక తీర్చుకుంటారు. మంచి చెడ్డా ఏమిలేదు వారికి. మనమే ఏ కోరికా తీర్చుకోలేని క్లైబ్యస్థితిలో వున్నాము. భౌతికమైన కోరికా తీర్చుకోలేము. ఆధ్యాత్మికమైన కోరిక తీర్చుకోలేము. కానీ భక్తికి విదేశాలు వెళ్ళాలని ఉంది. విదేశాలకి ఎందుకు వెళుతున్నారు? కోరికలు తీర్చుకోవడానికి వెళుతున్నారు. కోరికంటే భక్తనేకదా! అందుచేత వ్యాసుడు వ్రాసిన ప్రతివాక్యమూ కూడా భవిష్యవాణియే.

*జరఠత్వం సమాయాతౌ తేన దు:ఖేన దు:ఖితా ।*
*సాహం తు తరుణీ కస్మాత్ సుతౌ: వృద్ధావిమౌ కుతః ॥ (శ్లో ॥ 52 )*

భావం: వీరిరువురూ ముసలివారైపోయారు. నేను దీనికి ఎంతో దు:ఖిస్తున్నాను. నేను యువతిగా, తరుణిగా ఉండి ఉండగానే ఎందుచేత నా ఇరువురు పుత్రులు ముసలి వారయ్యారు?

భక్తికి ఇంకొక పెద్దబాధ ఉంది. అదేంటంటే - నేనేమో యువతిని. నాపిల్లలు ముసలి వాళ్ళై పడిపోయారు అని భక్తికి బాధగా ఉంది. తల్లికి ఇంక ఇంతకంటే పెద్ద బాధ ఏముంటుంది. నీ కోరికలు ఇంకా తీవ్రంగా ఉన్నాయి. ఒకడు నేనేమో ముసలి వాణ్ణై పోయాను అంటాడు. కానీ అతని కోరికలకి అంతేలేదు. అదీ ఆ స్థితి. ఇప్పటి ముసలి వాళ్ళని అడగండి. వాళ్ళ కోరికలకి హద్దులుండవు. కానీ దానికి కావలసిన జ్ఞానము, వైరాగ్యము రెండూ ఉండవు. అక్కడ సాధన ఉండదు. భక్తి ఆ విషయమే చెబుతుందక్కడ. ఇది మీయొక్క మా.నసిక స్థితిని సూచిస్తుంది. భక్తి, జ్ఞాన వైరాగ్యాలు నిరంతరం యవ్వనంగా ఉండాలంటే కలియుగంలో మానవులు ఏం చేయాలి? శరీరం, మనస్సు ఆరోగ్యంగా ఉంటేనే భక్తి, జ్ఞాన వైరాగ్యాలు సువ్యవస్థితంగా ఉంటాయి. దానికి ఆసన ప్రాణాయామాలు ఎంతో దోహదం చేస్తాయి.

## కోరికలు తీరాలంటే !

ఆసన, ప్రాణాయామాలు మనం అభ్యసించేదెందుకంటే నిత్యజీవితంలో భాగవతం చదువుకునేటప్పుడు వాటిని ఉపయోగించుకోవడానికి. ప్రకృతి యొక్క శక్తులకి అధిపతి ఇంద్రుడు. ఆ ఇంద్రుడిని ఎదిరించటానికి శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని ఎత్తాడు. అదే పర్వతాసనం. పర్వతాసనం వేసుకుంటూ భాగవతం వింటే మీలో ఉన్నటు వంటి గోవర్ధనగిరి కూడా పైకి లేస్తుంది. ఈనాడు చాలా ప్రచారంలో ఉన్న మూర్ఖత్వం ఏంటంటే ఆసనాలు, ప్రాణాయామాలు అభ్యాసం చేసుకుంటే, వేరుగా ప్రొద్దున్నే వేసుకుంటే గొప్పని. దాన్ని అభ్యాసం చేసుకొండి. అభ్యాసం చేయకుండా ఏం చేయలేం. కాని ఆ అభ్యాసం చేసుకున్నది నిత్య జీవితంలో ఉపయోగపడాలి. కార్ డ్రైవింగ్ అభ్యాసం చేసుకుని నేర్చుకుంటే ఏం లాభం? నిజంగా మీరు కార్ డ్రైవింగ్ చేసు కుంటూ వెళ్ళిపోగలగాలి. ఈ ఆసన, ప్రాణాయామాలు మీ శరీరాన్ని, గోవర్ధనాన్ని లేపాలి. గో - అంటే ఇంద్రియాలిని అర్ధముంది. వాక్కు అనే అర్ధం కూడా ఉంది. అందుచేత శరీరం వాక్కు ద్వారా కూడా నిర్మితమై ఉంది. ఏవిధమైన బాధ ఉన్నా కూడా శారీరకంగా కాని, భౌతికంగా కాని వాక్కుని మీరు అభివృద్ధి చేసుకుని ఉపయోగించుకునే విధానం తెలిస్తే ఆ బాధలు పోతాయి. గోవర్ధనగిరి, గిరి అంటే వాక్కు అని కూడా అర్ధము ఉంది. పర్వతమనే కాదు. గిరి అంటే మాటనే అర్ధం కూడా ఉంది. ఈ భాగవతాన్ని చదువుతున్నప్పుడు అదేంటో అర్ధమౌతుంది.

పర్వతం ఏ విధంగా అయితే కదలకుండా ఉంటుందో, పర్వతం ఏ విధంగా అయితే తన చుట్టు ప్రక్కలున్న ప్రదేశం కంటే ఎత్తుగా ఉంటుందో, చుట్టుప్రక్కల వాటిని శాసిస్తుందో అలాగే మీరు మీ జీవిత పరిస్థితులని కాని, మీరు శాసించగల్గుతారు. అందుకు ఇది వేసేది. మీ ఆరోగ్య పరిస్థితులను కాని, మీ కుటుంబ పరిస్థితులని కాని, మీరు శాసించగల్గుతారు. కారణం ఏంటంటే దీంతో పాటు మనం గోవర్ధనగిరిని ఎత్తుతున్నాం. భాగవతంలో వేదవ్యాసుడు వ్రాసిన మంత్రాలతో.



అందుచేత నేను పలుకుతూ ఉంటాను. నేను పలికిన తర్వాత మీరు కూడా పలుకుతూ ఉండండి ఆ శ్లోకాల్ని. కూర్చోలేకపోతే చేతులు క్రిందకి పెట్టేసి రిలాక్స్ అయి మళ్ళా కూర్చొండి. అంతే తప్ప ఒకసారి వేశామనకండి. అభ్యాసం, అభ్యాసం ....... ఎంత అభ్యాసం చేసుకుంటే అంత మంచిది ఈ పర్వతాసనాన్ని ఈ పారాయణంలో.

ఓం నమో భగవతే వాసుదేవాయ -

ఓం నమో భగవతే వాసుదేవాయ

**నారద ఉవాచ:**

చేతులు క్రింద పెట్టేయండి. పద్మాసనం వచ్చు కదా. వచ్చిన వాళ్ళు, వెయ్య గలిగిన వాళ్ళు వేస్తూ, లేస్తూ ఉండండి. ఉండగలిగే వాళ్ళు అలా ఉండండి.

ఇంక భాగవతం, భాగవత మహత్యం మనం చదువుకుంటున్నాం. ఆసనం మన్నది మీ ఇష్టం. వెయ్యగలిగితే వెయ్యండి. అభ్యాసం చేసుకుంటూ ఉండండి. కాని మీరు డిస్టర్బ్ అయ్యి, దయచేసి ప్రక్కవాళ్ళని డిస్టర్బ్ చెయ్యకండి. ఇంక భాగవతం వినండి మీరు. ఇంక ఆసనాల అభ్యాసం ఆపుతున్నాం. ఇంక భాగవతంలోకి వస్తున్నాం. కాని స్థిరంగా ఓ 3 గంటల పాటు కూర్చుని ఏ పనైనా చేసుకోగలిగే స్థితికి మీరు మెల్లిగా రావాలి- పద్మాసనంలో - ఆ స్థితికి మెల్లి మెల్లిగా వస్తారిక్కడ అభ్యాసం చేసుకుంటూ ఉంటే . ఇంక మళ్ళా మధ్యలో గుర్తొస్తుందనుకొండి. అదే పద్మాసనం వేసుకోలేదని, వేసుకొండి. చికాకుగా ఉంది, తిమ్మిరెక్కుతోంది, తీసెయ్యండి రిలాక్స్ అవ్వండి, మళ్ళా వేసుకుంటూ ఉండండి. కాని ఆసనం కంటే మీరు నేను చెపుతున్న దాన్ని ఎక్కువ శ్రద్ధతో వినండి. చాలా జాగ్రత్తగా ఏం చెపుతున్నానో. ఇక్కడ జరుగుతూన్నటువంటి ఈ భాగవత పారాయణా విధానాన్నే రాబోయేటటువంటి రోజులలో, మానవజాతి మొత్తం (ఈ విద్యే) నేర్చుకుంటుంది.

## ఏంటా విద్య అంటే

మన చేతనత్వం 3 స్థితులలో ఉంటుంది. జాగ్రత్త, స్వప్న, సుషుప్తావస్థ (లేక) నిద్రావస్థ. మనం ప్రస్తుతం జాగ్రదావస్థలో చేయగలిగినన్నీ చేసేయ్యగల్గుతున్నాం. బద్ధకస్తులెప్పుడూ బద్ధకస్తులే అనుకోండి. వాళ్ళని వదిలేసెయ్యండి. కాని నిజంగా చలాకీగా ఉన్న వాళ్ళు, మెళుకువగా ఉండి, వాళ్ళేం చేయదల్చుకున్నారో, ఎలా చేయ దల్చుకున్నారో దాన్ని వాళ్ళు అలా నిరంతరం చేసుకుంటూ వెళ్ళిపోతున్నారు. అలా చేసుకుంటూ వెళ్ళిపోతున్న వాళ్ళకి, అలా చేసుకుంటూ వెళ్ళిపోయినటువంటి వ్యక్తులకి ఒత్తిడి మరియు అలసట అనే రెండు దెయ్యాలు తగులుకుంటున్నాయి. దాని వల్లే అన్నీ రోగాలు వస్తున్నాయి అని వైద్యులు చెపుతున్నారు. ఒత్తిడి మరియు అలసటని ఈభాగవతం పోగొట్టే విధానం చెపుతుంది. దాని కోసం రకరకాలైన ప్రయోగాలు జరుగుతున్నాయి. కాని డైరెక్టుగా ఈ రెండింటివల్లేం జరుగు తుందంటే కోరిక అయితే ఉంటుంది.

కాని, కోరిక తీర్చుకునేటటువంటి జ్ఞానం - వైరాగ్యం ముసలివైపోయాయి. అంటే ఈ ఒత్తిడి మరియు అలసట అంటే అర్థమౌతుంది కదా మీకు. కోరిక ఉంది. శరీరం అలసిపోయింది. ఎంతలాగ అలసిపోయిందని చెపుతున్నాడు? "వృద్ధౌతౌ పతితౌ పార్శ్వౌ" పడిపోయున్నారుట రెండు ప్రక్కలా. కోమాలోకి వెళ్ళిపోయారు. ఆ పని చేసే వాళ్ళ గురించి చెపుతున్నాను. మన సంగతి చెప్పటం లేదు. మనం నిరంతరం కోమాలో ఉన్నటువంటి వాళ్ళం. నేను మన సంగతి చెప్పటం లేదు. నిజంగా కష్టపడి పని చేస్తున్నటువంటి వాళ్ళు, చాలా బిజీగా ఉన్నటువంటి వ్యాపారవేత్తలు, (బద్ధకంగా కూర్చునేటువంటి వ్యాపారస్థుల గురించి నేను మాట్లాడటం లేదు). ఓ టాటాయో, ఓ బిర్లాయో, ఏ మహాగ్రూప్ కంపెనీలో వాళ్ళ తాలూకు ప్రొప్రైటర్స్ ఏ స్థితిలో ఉంటారో మీకు తెల్సుకదా. ఊపిరి పీల్చుకునేందుకు సమయం ఉండదు వాళ్ళకి. తిండి తినడానికి సమయం ఉండదు అదీ విజయవంతమైన వ్యక్తిత్వం. వాళ్ళకి ఏదో చేసెయ్యాలనుకుంటుంది. ఈ రెండింటి వల్ల శరీరం పడిపోతుంది. వైరాగ్యం, జ్ఞానం పడిపోయాయని భాగవతంలో చెప్పబడింది. మన ఆధునిక భాషలో ఒత్తిడి మరియు అలసటకి తేడా ఏంటి? ఒత్తిడి మరియు అలసట అనేది శరీరానికి సంబంధించినది. ఒత్తిడి ఎంతలా ఇస్తాం అంటే శరీరమింక భరించలేనంతటి దౌర్బల్యానికి లోనౌతుంది. అనేది మానసికమైనటువంటి దౌర్బల్యం. అందుచేత ఎంత తెలివైన విద్యార్థి అయినా వరుసగా 3 గంటల పాటు చదువు కొనసాగిస్తే వాడికి అలసట వచ్చేస్తుంది. అర్థమౌతుందా ఉదాహరణ. చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి ఇక్కడ వాడు చెపుతున్నది. ఎక్కడో ద్వాపర యుగంలో జరిగినటువంటి సంఘటనల గురించి మాట్లడటం లేదు. అదే సంఘటనైతే మనమిక్కడకూర్చుని పిచ్చివాళ్ళలాగ ఈ శ్లోకాలు చదువుకోఖర్లేదు. ఇది మన పరిస్థితే కాని ఎప్పుడు? భౌతికంగా మీ సామర్థ్యానుసారం మీరు ఒత్తిడి, అలసటకి లోబడిన తర్వాత భాగవతం అవసరమౌతుంది. చాలా జాగ్రత్తగా అర్థం చేస్కోండి.

మనం నిత్య జీవితంలో ఈ తరగతులు జరుపుకుంటూన్నప్పుడు, ఈ తరగతి అయిపోయిన తర్వాత ఆదివారం నాడు, సోమవారం నుంచి మళ్ళీ శనివారం వరకు మీరు శనివారం సాయంత్రం వరకు ఈ రెండింటికి లోబడాలి. మీ జీవితం అలా అవ్వాలి. అలసిపోవాలి మీరు. చాలా సార్లు మేం చదువుకోలేక పోతున్నామండి, అలసటొస్తోందండీ, మేం చెయ్యలేకపోతున్నామండి అనే ఈ భయాలు ఎందు కొస్తున్నాయి అంటే మీరు పని చెయ్యటం మానేశారు కనుక. పరీక్షంటే భయం ఎవరి కొస్తుంది? చదవని వాడికి భయమొస్తుంది. చదివేసిన వాడు అసలెప్పుడు పరీక్ష పెడతారా అని అడుగుతాడు. నువ్వు పరీక్ష పెడితే కదా నా సత్తా చూపించేదంటాడు. ఉత్సాహం ఉరకలేస్తూంటుంది వాడికి. అందుచేత ఇవంతా కూడా అద్భుతమైన టువంటి నటనలు మీరు చేస్తున్నారు. ముందు మన శరీరం మనల్ని ఎక్కడ మోసం చేస్తుంది. మన ఆలోచనలు మనల్నిఎక్కడ మోసం చేస్తున్నాయో మీరది పట్టుకోండి. ఇది అందరూ ఒకే బావి నీళ్ళు త్రాగారు కనుక, ఆ భాష మనమిక్కడ వాడేది కూడా మీరు చాలా క్రమం తప్పకుండా వాటిని అవగాహన చేసుకోవాలి. రాలేకపోయినప్పుడు

ఆ క్యాసెట్ తెప్పించుకుని వినండి మీరు. ఎందుచేతంటే ఆ ఉదాహరణలంతలాగా నేనెందుకు బుర్ర కెక్కిస్తానంటే ఆ ఒక్కమాటతో చాలా భావాలొక్కసారి మీ తలల్లోకి వస్తాయి. ఏ బావిలో నీళ్ళు త్రాగాం?

## జ్ఞాన - వైరాగ్యాలంటే

బలహీనులు, నిర్వీర్యులు, పనిదొంగలు వీళ్ళే ఉన్నారు ప్రపంచంలో. మన చుట్టు ప్రక్కలంతాకూడా. వాళ్ళేం చెప్తారు? పని చెయ్యలేకపోవడానికి కారణమెవరంటే పరిస్థితులు అని. పరిస్థితులెప్పుడూ పని చెయ్యలేకపోవడానికి కారణం కాదు. కోతులు వారధిని నిర్మించగలిగినప్పుడు, ఏ విధమైనటువంటి వనరులూ లేనటువంటి రాముడు, రావణాసురుడితో యుద్ధం చేయగలిగినప్పుడు, వెంటనే మీ ప్రతి స్పందన ఏంటంటే దానికి - రాముడు కనుక చేశాడంటారు. కాదు. అలా చేశాడు కనుక రాముడయ్యాడు. భార్యని పోగొట్టుకుని, వియోగంతో ఏడుస్తున్నటువంటి ఒక పిరికి నరుడు చేతనత్వం పొంది, నేను సాధించి తీరంతానని ఎప్పుడైతే నుంచున్నాడో అప్పుడు "రాముడు" అయ్యాడు. రాముడు కనుక చెయ్యలేదది. అలాంటి వాళ్ళ చరిత్రే మనం చదువుకుంటాం.

చిన్న చిన్న కోరికలని అది మంచిది కాదు అని తెల్సినా మనం వదలలేన టువంటి దుస్థితిలో ఉన్నటువంటి వాళ్ళం. ఎందుకంటే జ్ఞానం, వైరాగ్యం రెండూ నిద్ర పోతున్నాయి. ఘోరమైనటువంటి కోమాలో ఉన్నాయంటున్నాడు. నారదుడు చెప్పినటువంటి ఉదాహరణది. భక్తి యువతిగా ఉంది. కోరికలన్నీ యవ్వనంలోనే ఉన్నాయి. ఎంతంత కోరికలో. కాని ఆ కోరికలని ఆచరణలో పెట్టటానికి కావల్సిన జ్ఞానం లేదు ఆచరణలో పెట్టటానికి కావల్సినటువంటి జ్ఞానం లేదు కాని, వైరాగ్యం లేదు. వైరాగ్యం అంటే ఏమిటి?

పరీక్షలు దగ్గర పడుతున్నాయి, చదువుకోవాలి. చదువుకోకపోతే మార్కులు రావు అన్న జ్ఞానమైతే ఉంది. కాని సినిమా చూడకూడదు, టి.వి. చూడకూడదు అన్నటువంటి వైరాగ్యం లేదు. వైరాగ్యం అంటే అది నేను చెప్పేది. వైరాగ్యమంటే



సన్యాసుల యొక్క వైరాగ్యం కాదు. అంతా వదిలేసి సమాజం మీద పడి అడుక్కుతినే, కాషాయ బట్టలు కట్టుకునే వాళ్ళ గురించి భాగవతం మాట్లాడదు. వాళ్ళందరూ సమాజానికి పరాన్నభుక్కులే. వాళ్ళసలెలా ఉండాలంటే " నారదుడు" లాంటి వాళ్ళైనా ఉండాలి, లేదా పడిపోతున్నటువంటి వాళ్ళని లేపేవాళ్ళైనా ఉండాలి. వాళ్ళని పడిపోకుండా మనం అపుతాం.

కానీ జరుగుతున్నదేంటంటే - అహోరూపమహోస్వర - అనే వాళ్ళే సమాజంలో ఎక్కువగా కనిపిస్తుంటారు. ఆవిడెంత భక్తురాలో తెల్సా? నాకు పాద సేవకి 1500 రూ॥లు ఇచ్చింది. ఆ ....... ఆవిడిచ్చిందా, నేను 3000 రూ॥లు ఇస్తానండి. మీ ఇద్దరి మీదా వాడు మంచి వ్యాపారం చేసుకుంటాడు. వాడు శంకరాచార్యులైనా కావచ్చు, ఏ సన్యాసైనా కావచ్చు. కాని సమాజానికి పనికి రాని దద్దమ్మల్ని బహిష్క రించండి. వాడెవడైనా కానివ్వండి, సమాజానికి ఉపయోగపడకపోతే వాడు కోటీశ్వరుడైనా వృధాయే మనకి. స్మగ్లర్స్ అయినా వృధాయే, సన్యాసైనా వృధాయే. మీరు అది అర్థం చేసుకోండి. ఇక్కడ నారదుడు ఏం చెప్పాడు? దేవర్షి నారదుడు దేవతల దగ్గరే కూర్చున్నాడా? రాక్షసుల దగ్గరకి వెళ్ళాడు. మనుష్యుల ద్గరకి వెళ్ళాడు. ఇద్దరికి మధ్య అవగాహన పెంచటానికి ప్రయత్నంచేసాడు. అవగాహన పెరగకపోతే చివరికి ఏం చేయటానికి ప్రయత్నం చేశాడు. **ఏది మంచిది కాదో దాన్ని తొలిగించడానికి ప్రయత్నం చేశాడు. వాళ్ళు సన్యాసులు.**

ఇప్పుడు భారతదేశంలో ఎంతమంది సన్యాసులు ఉన్నారు? వాళ్ళు ఏం చేస్తున్నారు. మీరది అవగాహన చేసుకోవాలి. మనంతట మనం మారితే తప్ప, మనకి మారిన పరిస్థితులు రావు. అప్పుడు ఎవరూ వచ్చి ఏం చెయ్యరు. మీరు మారాలి అనుకుంటే, దానికి కావల్సినటువంటి జ్ఞానం వస్తుంది. మీరు మారాలనుకుంటేనే కదా ఇక్కడి కొచ్చి వింటారు. మీరనుకోలేదనుకొండి, మీరసలు వినరు. కాని ఇక్కడ చెప్పింది మీరు జాగ్రత్తగా అర్థం చేసుకోండి. మీ వయస్సుతో సంబంధం లేదు. మీ చదువుతో సంబంధం లేదు. మీరేం చేస్తున్నారో దానితో సంబంధం లేదు. అప్పుడే

పుట్టిన పాప దగ్గరనుంచి, ఇంకోక సెకండ్‌లో చనిపోయే వ్యక్తి వరకు భాగవతం ఉపయోగించుకోగలడు. పరిపూర్ణంగా ఉపయోగించు కోగలడు. మీకా టెక్నిక్ తెలిస్తే, ఆ టెక్నిక్ ఏంటో చెపుతున్నాను మీకు నేను.

## రాబోయే రోజుల్లో పిల్లల భవిష్యత్

కోరికలు తీరక అవస్థ పడుతున్నాం మనం. ఎన్ని ఫోన్లు వస్తాయో నాకు. మాస్టారూ ఇంజనీరింగ్‌లో నాకు సీట్ వస్తుందా, రాదా? నేను అనుకున్న కాలేజీలో సీట్ వస్తుందా, రాదా? అని. రాదా అని నీవు ఇప్పుడు అడుగుతావేంటి? సంవత్సరం ప్రారంభంలోనే 'నేను ఎలా' చదవాలి అని ఎందుకు అడగవు? మాస్టారూ నేను రోజుకు 8 గంటలు చదువుతున్నాను. 12 గంటలు చదవాలని ఉంది నాకు, ఓపిక రావటం లేదు. నేనేం తినాలని ఎందుకు అడగవు? అడగవు, అడిగితే నేను చదవమంటాను.

చదువు మీద వైరాగ్యం ఉంది కాని డిగ్రీ ఇచ్చే లాభాల మీద కోరిక ఉంది. వ్యతిరేకమవ్వాలి ఇవి. దాని మీద లాభాల మీదా కాదు. చదువుకోవటం మీద ఆనందం ఉండాలి. అది మీరు పిల్లలకి అర్థమయ్యేలట్లు చెప్పండి. నాకు ఇంజనీరింగ్‌లోనో, మెడిసన్‌లోనో సీట్ రాకపోతే నేను చచ్చిపోతాను అంటూ ఏడ్చేస్తారు. వాడికి ఇంజనీరింగ్‌లో సీట్ రాకపోతే వాడి జీవితం వృధా అని. మీరు చంపుకుంటున్నారు మీ పిల్లలని. నాశనం చేసేస్తున్నారు వాళ్ళ యువతని, వాళ్ళ భవిష్యత్తుని, వాళ్ళ ఆలోచనా విధానాన్ని మొత్తం. ఆలోచించటం నేర్పరు మీరు. జీవించటం నేర్పరు.

ఇంజనీరింగ్‌లో సీట్ రాకపోతే చచ్చిపోతాడా! అసలు ముందు మీరు చచ్చి పోతున్నారు. నాకదీ ఆనందం. అసలది వద్దు. జీవించటం నేర్చుకొండి. ఎలా కోరికలని అదుపులో పెట్టుకోవాలో, ఏవి ఉచితమైనవి, ఏది అనుచితమైనవి. అది నేర్పేటటు వంటి విద్యను ఇప్పుడు నేర్చుకోవటం వల్లే ఒత్తిడి, అలసటకి గురవ్వడం అవ్వటం, దాని వల్ల రోగాలు రావటం. అన్నిటికంటే భయంకరమైన రోగం - 'క్యాన్సర్. ఈ రెండింటి వల్లే వస్తుంది. లేకపోతే క్యాన్సరే లేదు. అంటే ఏ కోరిక కోరకూడదో, ఏ కోరిక నియంత్రణలో ఉంచుకోవాలో అది నియంత్రణలో ఉండక పోయేసరికి, ఆ



కోరికకి సంబంధించిన కణాలుంటాయి శరీరంలో. ఆ కణాలు హెచ్చింపబడు తుంటాయి. ట్యూమర్‌గా ప్రోది చెందుతాయి. అవింకా హెచ్చింపబడితే మాలిగ్నెన్సీగా మారతాయి. మాలిగ్నెన్సీగా మారి వీడు అంత మవుతాడు. తల్లిదండ్రులు పిల్లలని క్యాన్సర్ వేపు తోస్తున్నారు. ముందు మీరది అవగాహన చేసుకోండి.

వాళ్ళకి ఓపిక లేదు సామర్థ్యం లేదు. వాళ్ళకి కావల్సినటువంటి మార్గదర్శనం ఇచ్చే దమ్ము మీకు లేదు. ఓ నాలుగు డబ్బులు పడేసి నీకు సీట్ రాలేదుగా ఏదో ఒకటి చదువు అని ఖచ్చితంగా వాడిలో మీరు క్యాన్సర్ బీజాలు నాటేశారు. అది ఏ వైద్యుడినైనా అడగండి మీకు చెపుతాడు. ఇప్పుడు రాకపోవచ్చు. వాడికి క్యాన్సర్ భవిష్యత్‌లో ఖచ్చితంగా వస్తుంది. రాకపోతే అదీ ఆశ్చర్యం. ఇంతమంది తల్లిదండ్రులు, ఇంతలాగ వాళ్ళని ఏడిపిస్తున్నా ఆ పిల్లలకి ఇంకా క్యాన్సర్ మొదలవ్వ లేదు. కాని ఇంకది భవిష్యత్‌లో మొదలౌతుంది.

నేను చెప్పింది మీరు వినకపోతే. అందుచేత నా తరగతులని ముసలివాళ్ళు, పదవీ విరమణ చేసిన వాళ్ళకోసం కాదు నేను చెప్పేది. ఇది రాబోయే భవిష్యత్తులో ఉన్నటువంటి పిల్లలున్న తల్లిదండ్రులకి నేను చెపుతున్నాను. వాళ్ళకీ జ్ఞానం మీరంద చేయగలరా! అదీ నేను వేసే ప్రశ్న. మీరేం చేసుకోలేరు. ఇంక అయిపోయింది మీకు. కాని మీరొక పని చేయగలరు. మీ పిల్లలకి మీరు ఒత్తిడి, అలసట ఇవ్వద్దు. మీరు టెన్షన్ తెచ్చుకోకు అని చెప్పండి.

జీవించడం నేర్చుకో, ఒక సంఘటన జరగకపోయినంత మాత్రాన జీవితం అయిపోదు. దాన్ని నేర్పుతున్నామా మనం? ముందు మనకి ర్తపోట్లు వచ్చేస్తాయి వాళ్ళకి సీట్ రాకపోతే. అసలింజనీరింగ్ కౌన్సిలింగ్ అవుతోందంటే ముందు నేను ఫినిష్ అయిపోతాను. మిగతా వాళ్ళ సంగతి నాకు తెలియదు కాని, నేనేం అవను. మీరేం కంగారు పడకండి. కాని మీరేం అవ్వకూడదని నా బాధ. దానికిప్పుడు ఇవాళ జవాబు చెప్పబోతున్నాడు. నారదుడు - నారదుణ్ణి భక్తి అడిగిందట, 'చాలా నిర్లిప్తంగా ఉందండి. ముసలితనం వచ్చేసిందండి మా పిల్లలకి' అని.

## రోగాలకి కారణం ఏమిటి?

ఈనాడు అది జరగడం లేదా? మీకేమీ అనిపించడం లేదా? అందులో నా కుటుంబంలో మాత్రం నన్ను చూసిన వాళ్ళకి చాలా బాగా తెలుసు. అందులో మా నాన్నగారు నాకంటే యువకుడిగా ఉంటారు. ఏమీ అనుమానం లేదు. నాకంటే ఆయన బాగా తిరగగలరు. సీటు రిజర్వేషన్ లేకుండా ఆయన ఎప్పుడు పడితే అప్పుడు రైల్లో వెళ్ళిపోగలరు. నాకు మీరు రిజర్వేషన్ చేయించినా 3 గంటలు ముందు వెళ్ళి స్టేషన్‌లో కూచుంటాను.

"నేను తరుణంగానే ఉన్నాను. నా పిల్లలు ముసలివాళ్ళై పోయారు. ఎందుకు?" అని భక్తి వేసిన ప్రశ్న అది. మన పిల్లలని అలా తయారు చెయ్యలేదా మనం? పిల్లల ఏ లక్షణం మన పిల్లలలో ఉండనిస్తున్నాం. ప్రొద్దున్న నిద్ర లేచిన దగ్గర్నుంచి చదువో, చదువో.... మీరు చదివారా అసలలాగ. అసలిప్పుడు మిమ్మల్ని చదవమంటే మీరు నిజాయితీగా చదువుతారా? ఏమీ చెయ్యటం లేదు మీరు. కానీ మీ పిల్లలు చదవాలిట. మనం అడిగే కోరిక సవ్యమైనదా, అపసవ్యమైనదా? అది సంభవమేనా అది వాళ్ళు చెయ్యగలరా! అని ఆలోచించుకోనక్ఖర్లేదా?

ముందదీ మనం నేర్వాలి. మనం నేర్చుకుని మిగతా వాళ్ళకిది నేర్పాలి. సంభవమా అసంభవమా అనేది మీరు చూస్కోండి. అదే నారదుడు ఇప్పుడు చెప్ప బోతున్నాడు. నేను ముందే చెప్పేస్తున్నాను నారదుడి తిట్లన్నీ కూడా. కానీ ఇది మీ జీవితానికెంత ముఖ్యమో మీరు ఆలోచించండి. మీరు మారకపోతే, మన పిల్లలని, మన కుటుంబాలని సర్వనాశనం చేస్తున్నటువంటి వ్యక్తులం మనమే అవుతాం. దానికిది ఈ ఆవేదనంతా కూడా. మీరు నేర్చుకోవడమేప కాదు, మిగతా వాళ్ళకీ కూడా చెప్పండి. పరిస్థితి ఇదీ, ఇలా జరగబోతున్నది.

ఈ రోగాలన్నింటికి కారణమిది. వాతావరణ కాలుష్యం కాదు. ఈ కాలుష్య మంతా కూడా మన మానసికస్థితి యొక్క ప్రతిబింబమేనని తెల్సుకోండి.



ప్రహ్లాదుడికి పాములు పెట్టి విషం ఎక్కించినా, ఎక్కలేదు. నువ్వీ కాలుష్యానికే గాభరా పడుతున్నావు. ఈ కాలుష్యమేం చేస్తుంది నిన్ను? ప్రహ్లాదుడినేం చేశాడు అతని తండ్రి? పాముల మధ్య, విషం మధ్య పడేశాడు. విషం త్రాగించాడు. ఎక్కిందా వాడికి. అతనికేమవ్వలేదు ఈ కాలుష్యమేం చేస్తుంది?

అసలా భారతీయుల యొక్క ఆ సాలిడారిటీ (స్థిరత్వం) పర్వతాసనం. అందుకు పర్వతాసనం వేయించేది . పర్వతాసనం వేయలేకుండా ఉన్నాం మాస్టారు. కాని మీ పిల్లలు మాత్రం మీరు చెప్పినట్టు వినాలి. నువ్వు చెప్పినట్టు వినాలి. కోరికకి కూడా ఓ సెన్స్ - ఉండాలి. సెన్స్ అఫ్ ప్రపోర్షన్ ఉండాలి. నువ్వు చిన్న చిన్న అలవాట్లని మానుకోలేవు. మీ పిల్లలని అన్ని అలవాట్లు మానేయ్యమంటావు. మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి.

రామకృష్ణ పరమహంస దగ్గరకి ఒక తల్లి వెళ్ళింది - మా వాడు మిఠాయిలు తినేస్తున్నాడు. ఎక్కడ దాచినా తినేస్తున్నాడు. మీరు వద్దని ఒక్క మాట చెప్పండి స్వామీ మానుకుంటాడు అని ప్రాధేయపడింది. 'రేపురా అమ్మ' అన్నాడు. మర్నాడొచ్చాక కుదరదమ్మా ఇప్పుడు ఒక వారం తర్వాత రా అన్నాడు. అని అలా మూడు వారాలు తిప్పించావిడని. తర్వాత చెప్పాడు "బాబు! మిఠాయిలు తినకు" అని. వాడు మానేశాడు.

ప్రక్కనే ఉంటారుగా శిష్యులు. గురువుకి కూడా హితబోధ చేసేటటువంటి శిష్యులున్న భారతదేశం. ఏది మార్చుకున్నా మార్చుకోలేకపోయినా ఆ నీచ మనస్తత్వాన్నైనా మార్చుకోండి.. ఎప్పుడూకూడా గురువుకి ప్రబోధించడానికి ప్రయత్నించ కండి. గురువుగారు మీకేం తెలీదండి...... పాపం గురువులు చాలా అమాయకులు. అవును మాకేం తెలీదు కాబోలు అనుకుంటారో, పోనిలే వీళ్ళతో వేగటం ఎందుకు అనుకుంటారో. అది మళ్ళా మనకి తెలీదు గురువుల మనసులో ఏముంటుందో. వాళ్ళ స్థాయిలో మనం లేదు కదా! అందుచేత మొదటి రోజే చెప్పేస్తే ఆ అమాయకు రాలుకి బావుండేది. పూర్వకాలంలో నడుచుకునే కదా రావాలి దక్షిణేశ్వరానికి. ఆ మాట చెప్పటానికి ఇన్ని సార్లు తిప్పించారు. మీకు దయ కూడా లేదు అన్నారు.

గురువుకి దయ లేదు! ఇన్ని సార్లు తిప్పించారాయన అని వీడు సలహ ఇచ్చాడు. దానికి ఆయన, నేను చెప్పినట్టు బయట ఎవరికీ చెప్పకు. నాకు అలాగా మిఠాయిలు తినే అలవాటుంది. నేను దానిని ఆపు కోలేను.ఇంకోళ్ళకు చెప్పే ముందర నేను అది చెయ్యగలగాలి గదా. నేను చేశాకే వాడికి చెప్పాను. అందుచేత ఫలితం వచ్చింది అన్నాడు రామకృష్ణ పరమహంస. మీ పిల్లలు మీ మాట వినాలంటే మీరు ఆ పని చేశాక చెప్పండి. మీకా దమ్ముందా? వాళ్ళు వినరు. చివరకు ఏమౌతుందంటే క్యాన్సర్‌లాంటివి వస్తాయి. పిల్లలకు క్యాన్సర్ వస్తుంది. చివరకు జరిగేదదే. క్యాన్సర్ అంటే ఏంటో తెలుసు కదా! కర్కాటక రాశి. అది పట్టుకుంటే ఇంక వదలదు. కోరికలు అలా పట్టుకుంటాయి. కానీ, ఏమీ జరగవు. జ్ఞాన వైరాగ్యంతో కూడని ఏ కోర్కైనా మీకు, మీ కుటుంబానికి రోగం రావడానికి కారణమవుతుంది తప్ప, ఫలితాలను ఇవ్వదు. ఒక్క సూత్రాన్ని భాగవతం సూటిగా, చాలా స్పష్టంగా చెపుతుంది. అది ఆ యుగానికే కాదు, ఏ యుగానికైనా సరే సూత్రమదే.

జ్ఞానం, వైరాగ్యమంటే నేను చెప్పాను కదా! తరగతిలో మొదటి శ్రేణి రావాలని కోరుకుంటుంది. ఏయే పుస్తకాలు చదివితే మొదటి శ్రేణి వస్తుందో తెలియాలి. తరగతి పుస్తకాలు ఒక్కటే చదివితే మీకు ర్యాంకులు రావు. వాటితో పాటు దానికి కావలసినటువంటి వనరులు, ఎక్కువ మెటీరియల్ ఎక్కడ దొరుకుతుందో తెలుసు కునే జ్ఞానం ఉండాలి. తర్వాత ఇంకేమి కావాలి? మిగతా పిల్లలు ఆడుకుంటుంటే నేను ఆడుకోకుండా ఎప్పుడూ చదువుకోవాలి అనే మానసిక స్థితి - అదీ వైరాగ్యం. జ్ఞాన, వైరాగ్యమంటే అర్థమది. ఏ కోరిక తీర్చుకోవాలన్నా ఆ రెండూ ఉండాలి.

## భగవద్దర్శనం ఎలా చేసుకోవాలి?

భగవద్దర్శనం కావాలి - ఎలా? మీరు భగవంతున్ని చూశారా? అని అడగడం మొదలుపెట్టాడొక మనిషి. కలకత్తాలో అందరి దగ్గరకు వెళ్ళి మీరు భగవంతున్ని చూశారా అని అడిగాడు. రామకృష్ణ పరమహంస ఒక్కడు మాత్రమే చూశానన్నాడు. మిగతా వాళ్ళెవరికీ చూశానని చెప్పే దమ్ములేదు. వాళ్ళు చూస్తే కదా! అందరూ యోగులే



మళ్ళా. ఒక్క రామకృష్ణ పరమహంస మాత్రం చెప్పాడు - అవును. నేను చూశానని. అయితే నాకు చూపిస్తావా! అని అడిగాడా వ్యక్తి. అదెంతసేపు అన్నాడు. పద! భగవంతుణ్ణి చూపిస్తాను అని అంటే, ఇంకేముందిలే చూపిస్తాడులే అని వెళ్ళాడు. గంగ దగ్గరకు తీసుకెళ్ళి అందులో ముంచేసాడు. నిజంగా గంగలో ముంచాడు. ముంచి, తల పైకెత్తనివ్వకుండా అందులో నొక్కి వుంచేశాడు. అప్పుడు ఎంతో ఆలోచించాడుట వివేకానంద. వెళ్ళి, వెళ్ళి ఈ పిచ్చివాడి చేతిలో పడ్డాను. చెబుతూనే ఉన్నారందరూ - వీడు పగలా ఠకూర్ అని. నన్నివాళ చంపేశాడు వీడు. అయిపోయిందని అనుకున్నాడు. ఇంతలో రామకృష్ణ పరమహంస చేయి తీసేశాడు. భగవంతుడు కనిపించాడా? అన్నాడు. భగవంతుడు కనిపించేందేంటి, చచ్చిపోతాననుకున్నాను అన్నాడు వివేకానంద. అప్పుడు నీకేం కావాలనిపించిందని పరమహంస అడిగాడు. శ్వాస, గాలి కావాలనిపించింది, లేకపోతే బతకలేనన్నాడు వివేకానంద.

అంత కోరిక నీకు భగవంతుని మీదుంటే కనిపిస్తాడయ్యా. లేకపోతే, మిమ్మల్ని మీరు ఎప్పుడూ మోసం చేసుకోకండి. మీరు భక్తులమనే నటన చేస్తున్నారు. ఆ విశ్లేషణ చేసుకున్నప్పుడే మీ కోరికలు తీరుతాయి. ఇది కాకపోతే ఇంకొకటి. నా పిల్లవాడికి ఇంజనీరింగ్‌లో సీటు కావాలని ఇవాళ ఫోను చేయడం కాదు. వాడు జూనియర్ ఇంటర్‌లో చేరినప్పుడు, ఫోను చేసి నన్నడిగితే మీరెంత కష్టపడితే, నేను చెప్పింది చేసినట్లు చేస్తే వాడికి ఖచ్చితంగా మొదటి శ్రేణి వస్తుంది. అక్కడ్నుంచి కష్టపడాలి మీరు. అంటే అప్పట్నుంచి ఆ జ్ఞానం ఉండాలి. వైరాగ్యం ఉండాలి. అంతే తప్ప, కౌన్సిలింగ్ రోజు గురువుగారి ఆశీర్వాదం వల్ల సీటు రావాలి..... రాదు. ఖచ్చితంగా మీరొకటి గుర్తుంచుకోండి, గురువులందరూ ఎప్పుడూ వస్తుందనే చెబుతారు. రాదని ఏ గురువూ చెప్పడు. ఇక్కడ రెండు లాభాలున్నాయి. ఏంటో తెలుసా?

బొంబాయిలో ఓ గురువుగారి దగ్గరకు చాలా మంది వెళ్తుండే వాళ్లు. ఏంటంటే ఆ గురువుగారు ఆశీర్వదిస్తే మగ పిల్లవాడు పుడతాడనే ప్రచారం ఉంది. అందులో అనుమానమే లేదసలు ఇంతవరకు. వెళితే ఖచ్చితంగా జరగడమే. కానీ, ఉంటారుగా

కొంతమంది అసలు అంత రహస్యమేమిటండీ అని అడిగారు. దానికి ఆయన 'అది చెబితే నీవూ నా అంత గురువువుతావు'. చెప్పనన్నాడు. కానీ, కొంతమంది ఉంటారుగా మడుపట్టు వాళ్ళు. ఎలాగోలాగ రహస్యం చెప్పమని అడిగారు. అప్పుడా గురువుగారు 'రహస్యమేమీ లేదయ్యా! వచ్చిన వాళ్ళందరికీ మగపిల్లవాడే పుడతాడని చెపుతాను నేను. పుట్టేదెవరో పుడతారు కదా! మగపిల్లాడో, ఆడపిల్లో. మగపిల్లవాడు పుడితే మాత్రం, గురువుగారు చెప్పారు, కనుక పుట్టారు అని వాళ్ళు ప్రచారం చేస్తుంటారు. పుట్టని వాళ్లు ప్రచారం చేయరు. అంతే అంతకంటే ఏమీ లేదు. నిజంగా గురువుల ఆశీర్వాదం వల్లే మీకలా జరిగిపోతే ఖచ్చితంగా గురువులు ఆశీర్వదించేస్తారు. వాళ్ళ ప్రేమ మీకు తెలియదు. నిజంగా వాళ్ళ ఆశీర్వచనంలో అంత శక్తే గనుక ఉంటే, మిమ్మల్ని కష్టపడనివ్వరు. ఈ కలియుగంలో తల్లిదండ్రులే వాళ్ళ పిల్లల ఆనందం కోసం ఎంతో చేయగలిగినప్పుడు, గురువులెందుకు చేయరు? చేస్తారు. కానీ, నిస్సహాయులు. వాళ్లేం చేయలేరు. ఈ కాలంలో ఏ తల్లిదండ్రులూ వాళ్ళ పిల్లల్ని కష్టపడనిస్తున్నారు కనుక.

ఇక్కడ మీరు ఇరుక్కుపోయారు. ఇంక వాళ్ళ గుప్పిట్లోంచి మీరు బయట పడరు. ఇంక నీవు బయట పడలేవురా బాబూ! అంచేత చెప్పింది ఏదో ఇప్పుడే వినేశావనుకో, ఇప్పుడే గొడవదిలి పోతుంది నీకు. వినలేదనుకో, మళ్ళీ పుడుతుందాం. మళ్ళీ నేను చెపుతుంటాను. ఈ విషయంలో అర్థం చేసుకునే వరకు చెబుతూనే ఉంటాను. ఈ బ్యాక్‌గ్రౌండ్ మీకర్థం అయిపోతే చాలా ఆనందాన్ని పంచగలం. అందుచేత భక్తి ఈ ప్రశ్న అడిగింది. జ్ఞానం, వైరాగ్యం ముసలివాళ్ళయిపోయి, పడున్నారు. నేను మాత్రం యవ్వనంలోనే ఉన్నాను. దీనికి పరిష్కారం ఏమిటని? అప్పుడు నారదుడు చెప్పాడు -

*జ్ఞానే నాత్మని పశ్యామి సర్వమేతత్త వానఘే ।*
*నవిషాద స్త్వయా కార్యో హరిః శాం తే కరిష్యతి ॥ (శ్లో ॥ 55 )*

భావం: సాధ్వీ నా హృదయంలో జ్ఞానదృష్టితో నీకు వచ్చిన దు:ఖములకు కారణం చూస్తున్నాను. నువ్వు బాధపడకు. శ్రీహరి నీకు శుభమే చేస్తాడు.



ఎవరి దుఃఖం, ఎవరి భక్తి? మీ యొక్క కోరికలే. మీరు మళ్ళా నారదుడు, భక్తి దగ్గరకు వెళ్ళకండి. ఇదంతా మన గురించే చదువుకుంటున్నాం. అందుచేత ఈ భాగవతం చదివితే ఖచ్చితంగా మీ కోరిక తీరుతుంది. ఏ కోరిక? మీకు దేనిమీద భక్తి ఉంటే ఆ కోరిక. మళ్ళా మీకు భగవంతుని మీదే భక్తుండాలి అని భాగవతం చెప్పడం లేదు. అది ఒక సూత్రాన్ని చెపుతోంది అంతే. నీకేకోరిక తీరాలన్నా నువ్విది చేయి. నీ కోరికలు తీరిపోతాయి. అది ఏ కోరికైనా కావచ్చు. కానీ, కొన్ని కోరికలు ఏం చేయవచ్చంటే - తర్వాత మీకవి కొన్ని కష్టాలు తీసుకురావచ్చు. దాన్ని మీరు ఆలోచించు కోండి. భాగవతం దేన్నీ వద్దని చెప్పదు.

**సూత ఉవాచ :**

*క్షణ మాత్రేణ తజ్జాత్వా వాక్యమూచే మునీశ్వర:*

ఒక్క క్షణంలో ఆ సమస్యకి నివారణ తెలుసని చెప్పాడు. అంటే ఈ భాగవతం ఏం చెపుతోంది. మీకు నిజంగా భాగవతం మొత్తం అర్థమయిపోవాలంటే ఒక్క క్షణం చాలు. రాబోయే ఐదు క్షణాల్లో మనందరి సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. మీ ఏ కోరికైనా తీరుతుంది. చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. మీకొక కోరిక ఉందనుకోండి, అయిదు తలలున్న సింహము, దానికి మానవ శరీరం ఉండాలి. అది మనిషిలాగా మాట్లాడాలనే కోరుకున్నా, అదీ తీరుతుంది. అసంభవం అనడం లేదది. దానికి కావలసిన భక్తి మీకుందా? జ్ఞానం ఉందా? వైరాగ్యం ఉందా? ఇంకది తీరేంత వరకూ దాన్ని వదలకుండా దాని వెంట మీరు పడగలరు. మీరు మిగతావంతా వదిలి ఆ కోరిక వెంటే పడాలి. ఆ ఒక్కటీ చూసుకోండి. అదెంత అసంభవమైనదైనా, వికృతమైన కోరికైనా కావచ్చు తీరిపోతుంది. ఎంత శక్తివంతమైన సూత్రం మీకు భాగవతం అందిస్తోందో చూసుకోండి. ఏ కోరికైనా సరే, ఏ పిచ్చి కోరికైనా సరే అది తీరిపోతుంది. ఆ అసమంజసమైన కోరికైనా తీరిన తర్వాత అది, సమంజసమవుతుంది.

జ్ఞానేశ్వర్ ఏం చేసాడు? గోడను నడిపించాడు కదా! అదే నేను చెప్తే, మరి మీరెందుకు అసంభవమనుకుంటున్నారు. మీకీ కథ తెలుసుకదా! చాంగదేవుడు అనే

తాంత్రికుడు ఉండేవాడు. జ్ఞానేశ్వర్ మహారాష్ట్రలో ఒక మహా భక్తుడు. పులిని వాహనంగా చేసుకుని చాంగదేవుడు శిష్యసమేతంగా జ్ఞానదేవుడి వద్దకు బయలుదేరాడు. విషయం తెలిసిన జ్ఞానదేవుడు తన సోదరి, సోదరులతో కూర్చుని ఉన్న ప్రాణంలేని గోడతో సహా, ఆకాశ మార్గంలో ప్రయాణించి, చాంగదేవుణ్ణి కలుసుకున్నాడు. దానితో ఆ తాంత్రికుడికి జ్ఞానదేవుని శక్తి ఎంత గొప్పదో అర్థమయింది. ఎందుకా ప్రశ్న అడిగానంటే ఈ 45 నుండి 54వ శ్లోకం వరకూ మీరందరూ కంఠతా పట్టేయండి. ఈ భాగవతాన్ని ప్రజల్లోకి మీరు తీసుకెళ్ళాలి. ఏ దృష్టితో తీసుకెళ్ళాలి - మీ ఏ కోరికైనా ఈ సూత్రంలో తీరుతుంది. అదేదైనా కావచ్చు. నేనలా నోరు తెరచి, మాయాబజార్‌లోలాగా ఆ హోటల్‌లో ఉన్న ఆహార పదార్థాలన్నీ నా నోట్లోకి వచ్చేయ్యాలి అంటే వచ్చేస్తాయి. అదేమీ అసంభవం కాదు. అయితే, దానికి కావలసినటువంటి భక్తి ఉండాలి. తర్వాత దానికి కావలసిన జ్ఞానం, వైరాగ్యం సంపాదించుకోవాలి.

క్లోనింగ్ ద్వారా మనిషిలాంటి మనిషిని ఎంత మందిని తయారు చేయవచ్చను కుంటున్నారు. జ్ఞానం అభివృద్ధి చెందింది అంటే అంతేగా. ఆ స్థితిలో ఉందిప్పుడు విజ్ఞానం. కానీ, అది వికృతమైన వేషాలు వేయకుండా, కాపాడగలిగిన సత్తా ఉన్నది ఒక్క భారతీయులకే. మిగతా వాళ్ళు దాన్ని నియంత్రించలేరు. అది ఎన్ని వెర్రితలలు వేస్తున్నా, ప్రకృతి ఎలాగో దాన్ని నియంత్రిస్తుంది. అది వేరే విషయం.

*యథా యథాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।*
*అభ్యుద్ధాన మధర్మస్య తదాత్మ్యానం సృజామ్యహం ॥*

అదెలాగూ జరుగుతుంది. కానీ, ప్రతి దానికీ ఆయనే రావాలా? ఇంగిత జ్ఞానం ఉపయోగించుకుని మనం చేయలేమా ఆ మాత్రం. ముఖ్యంగా ఈ కోరికలు వెర్రితలలు వేయకుండా ఉండటానికి సూత్రమేంటంటే

*ఉత్పన్నా ద్రవిడే సాహం వృద్ధిం కర్ణాటకే గతా ।*
*క్వచిత్ క్వచిన్ మహారాష్ట్రే గుర్జరే జీర్ణతాం గతా ॥ (శ్లో ॥ 47 )*

ద్రవిడ దేశంలో కోరికలు పుడతాయి. అందరి కోరికలు, మానవ శరీరధారులు



అయిన వాడెవడైనా సరే, వాడి కోరికలు ఎక్కడ పుడుతాయని చెబుతున్నాడు భాగవతంలో - ద్రవిడ దేశంలో పుడుతాయని చెబుతున్నాడు. వృద్ధిం కర్నాటకే గతాః ..... కర్నాటక దేశంలో ఆ కోరికలన్నీ యవ్వనాన్ని పొందుతాయి. క్వచిత్ క్వచిన్ మహారాష్ట్రే ....... అక్కడక్కడ ఆ కోరికలు సన్మానం పొందుతాయి. అంటే ఏంటి? ఆ కోరికలు ఉచితమైనవని మానవ జాతి ఒప్పుకుంటుంది. ఉచితమైన కోరికలన్నీ మానవజాతికి మహారాష్ట్ర నుండే వస్తాయి. ఈ దత్తావతారాలన్నీ కూడా మహారాష్ట్ర నుండే వచ్చాయి. అక్కడక్కడ సన్మానం పొందాయి.

## గుర్జరే జీర్ణతాం గతాః

గుజరాత్ వెళ్ళాయి - భూకంపం వచ్చేసింది. ఈ భక్తి, ఈ కోరికలన్నీ ఏమై పోయాయి? జీర్ణతాం గతాః అంటే ఇప్పుడు మన కోరికలు ఎలా వున్నాయో తెలుసా? ఎందులో సీటొస్తే అది చదువుతాం మాష్టారు. అదెంత సహజంగా చెబుతామో. అదెంత నీచమైనటువంటి మానసిక ప్రవృత్తో ఏ తల్లిదండ్రులకూ అర్థం కావడం లేదు. పిల్లలకు మనమేం శిక్షణ ఇస్తున్నామో ఆలోచించుకోండి? ఎందులో సీటు వస్తే అది చదువుతాం అంటే, ఆఖరుకి ఏం చదవాలో కూడా మీరు నిర్ణయించుకోలేని స్థితది. ఇది తప్ప, ఇంకేదీ నేను చదవను అని చెప్పే దమ్ము ఎవరికీ లేదు. అంటే ఏమిటి? జీర్ణతాం గతాః. కోరిక, బలమైన కోరికేదీ లేదు. పెళ్ళి చేయడంలోనూ బలమైన కోరికలు ఉండడం లేదు. ఈ లక్షణాలు ఉన్నటువంటి అమ్మాయినే నేను పెళ్ళి చేసుకుంటానని తండ్రితో అనలేడు. అమ్మాయి అనలేదు. కానీ, కోరికలేంటి? లతా మంగేష్కర్‌లాంటి గొంతుక ఉండాలి, హేమమాలిని లాంటి అందం ఉండాలి అని పాపం కలలు కంటుంటాడు. చివరకు ఏదో ఒక అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు. ఏదైతే ఏముందిలే అనుకుంటాడట. ఎందుకిది చెబుతున్నానంటే ..... జీర్ణతాం గతాః - ఖచ్చితమైన కోరిక లేదు. ఈ శ్లోకాన్ని క్రితం వారం నేను విశ్లేషణ చేయమని చెప్పాను. మీరు విశ్లేషణ చేసుండక పోతే ఇప్పుడు చేసుకోండి.

ద్రవిడ దేశం శరీరంలో ఎక్కడుంది? కర్నాటక దేశం మన శరీరంలో ఎక్కడుంది? ఇదంతా వెతుక్కోవాలి మన శరీరంలో. మీరు బయట వెతుక్కోకండి. ఏదైనా మన శరీరంలో ఉండాలి. చూసుకోండి మీ కోరికలు ఎక్కడ పుట్టాయి, ఎక్కడ జీర్ణమై పోయాయి, అసలేమైనా ఉన్నాయా? ఉంటే బాగానే ఉండేదే. ఏదైనా దానంతట రావాలి మీకు.

సాయి పారాయణ చేస్తే, ఏది కావాలనుకుంటే అది వస్తుందని చెప్పినా, ఆ సాయి పారాయణ కూడా చేయలేనటువంటి బలహీన మనస్తత్వం కలిగిన వ్యక్తుల మధ్యన కూర్చుని మనం మాట్లాడుకుంటున్నాం. అందరికీ తెలుసు, ఆ నమ్మకం ఉంది. తమాషా ఏమిటంటే నమ్మకం లేకపోతే అది వేరే విషయం. నమ్మకం ఉండీ, నిజంగా కూర్చుని చేస్తే, అది వస్తుందంటే కూర్చుని, స్థిరంగా చెయ్యగలిగేటటువంటి కోరిక లేదు. మీ తిండి కోసం కూడా చూసుకోనక్కర్లేదు. మీకు గ్యారంటీ ఏంటంటే నేను చేసి, చూశాక చెపుతున్నాను, చెయ్యనిదేది నేనింతవరకూ మీకు చెప్పలేదు. ఏదైనా నేను ఆచరించి, చేసి చెప్పిందే. నేను కాశీలో ఉన్నప్పుడు 40 రోజుల పాటు అడవికి పోయి కూర్చున్నాను. నాకు తిండి దొరుకుతుందా, దొరకదా అనేది కాదు. మనస్సు ఇరవైనాలుగు గంటలూ లక్ష్యం మీదే ఉన్నది. పడుకునే వాణ్ణి, నిద్రపోయే వాణ్ణి అంతా చేసేవాణ్ణి. కానీ, ఇరవై ఐదో రోజు నుండి నేనక్కడ ఒక మహాత్ముడిని అయిపోయాను. ఇంక గాభరా పడిపోయి, దానికంటే రిసెర్చ్ చేయడమే మేలని, మళ్ళీ విశ్వవిద్యాలయానికి వచ్చేశాను. మీరూ మహాత్ములయిపోతే ఎవడు వచ్చినా సరే, నీ కోరిక తీరి పోతుందనండి. తీరిపోయిన వాళ్ళు మీకు ప్రచారం చేస్తారు. తీరని వాడు ఎలాగూ మీ దగ్గరకు రాడు. ప్రతి ఊరు దగ్గరా జరుగుతున్నదంతే. గురువుల్లో ఏమీలేదు. కానీ, గురువు యొక్క అదృష్టం మీ అదృష్టం. ఆయన మీ డబ్బుతినే యోగం ఉందనుకో, మీరనుకునేవి జరిగిపోతాయి. గొప్పతనం మాత్రం మీరతనికి ఇస్తారు.

అర్హత లేకుండా, సాధన లేకుండా ఇవేమీ వచ్చినా కూడా అసలు దాన్ని ఒప్పుకోకండి. అయాచిత వ్రతమంటే అర్థం అది. యాచించము. స్వశక్తి మీద తెచ్చు



కుంటాము. ఈ 45 నుండి 54వ శ్లోక సంఖ్యలో ఒక తమాషా చూడండి. అవి వ్యతిరేకమయ్యాయి. 4,5 నుండి 5,4 కు మారింది. ఎందుకు మారింది? ప్రతిదీ కూడా భాగవతంలో చాలా విశేషమైన విషయాలున్నాయి. 32 అనే అంకె ప్రాధన్యత తెలుసా మీకు. కొంచెం కంప్యూటర్ జ్ఞానం ఉన్న వాళ్ళకి, 32 సంఖ్య ప్రాముఖ్యత చెప్పగలరు. ఎందుచేతంటే ఇక్కొడక చిన్న కిటుకుంది. తెలుసున్న వాళ్ళుంటే అది చెప్తే. షూశారా అంటాను. తెలీదనుకోండి ఇంక నేనే చెప్పేస్తాను. ఇలాంటి కొన్ని ట్రిక్కులు గురువుల దగ్గర నేర్చుకోండి. ఒక ట్రిక్కు చెప్పాను కదా! ఏంటి మీరు చేయాలి - అవుననండి. జరిగిపోయిన వాడు మీకు ప్రచారం చేస్తాడు. జరగని వాడు మీ దగ్గరకు రాడు. వాళ్ళతో గొడవే లేదు. గురువవడానికి అది ఒక ట్రిక్కు. ఇప్పుడు రెండో ట్రిక్కు చెబుతున్నాను. మీకేమీ తెలియదనుకోండి, ఉన్న ప్రేక్షకులలో ఆ సబ్జెక్టు తెలిసున్న వాళ్ళు ఉన్నారో, లేరో కనుక్కోండి. ఎవరూ చెప్పలేదనుకోండి, అప్పుడు ధైర్యంగా చెప్పేయండి. అయితే ఎవరికీ ఈ రహస్యం చెప్పకూడదు. మరి చెప్పేస్తే దాని విలువ పోతుంది కదా! కానీ, మరి మీకెందుకు నేను చెప్తున్నాను, మీరేదీ ఆచరించరు కాబట్టి. సో నో ప్రాబ్లెమ్.

ఆధునిక భాషలో కంప్యూటర్ అంతాకూడా అనుష్టుప్ ఛందస్సే. ఈ అనుష్టుప్ ఛందస్సు మొట్టమొదట కనిపెట్టిన వాడు ఎవడో మీకు తెలుసా - కంప్యూటర్ ఎవడు కనిపెట్టాడంటే చాలా వివాదాలున్నాయి. ఎంచేతంటే కాలిక్యులేటర్ కనిపెట్టిన వాడు కూడా నేను కంప్యూటర్ కనిపెట్టాడనవచ్చు. కానీ, అనుష్టుప్ ఛందస్సు ఎవరు కనిపెట్టారో తెలుసా - ఆదికవి వాల్మీకి కనిపెట్టాడు. ఆ శ్లోకం ఏంటో తెలుసా -

మానిషాద ప్రతిష్టాత్వం అగమః శాశ్వతీః సమాః ।
యత్క్రౌంచ మిధునాదేకం అవధీః కామమోహితం ॥

మీరు చాలా జాగ్రత్తగా పోల్చుకునే పోలికలు. దీనికి, కంప్యూటర్‌కి ఉన్న లియులు చూసుకుని, మీరేది కావాలనుకున్నా రెండు వరుసల్లో పెట్టేయవచ్చు. మొత్తం రామాయణం అంతా ఉందా శ్లోకంలో. ఆ శ్లోకాన్ని మీరు కంఠతా పట్టేయండి. వ్రాసి ఆశ్రమంలో పెట్టండి. అసలు మొత్తం మీ మస్తిష్కం యొక్క కంప్యూటరైజేషన్ దానిమీదే

ఆధారపడి ఉంది. వాల్మీకి అంత గొప్పవాడు. మనం మన ఋషులకి చాలా, చాలా..... పేరు సంపాదించి పెట్టాలి. మన వారసత్వం అది. కానీ, దానికి మీరు చాలా కష్టపడాలి. నేనొకటే కదా చెప్తున్నాను ఇక్కడ. నా రహస్యాన్ని మీకు చెప్పేసాను. అంచేత మీరేం కోరుకున్నా నేను అవును అనేస్తాను. నాకే సమస్యా లేదు. జరిగిపోతే మీరెలాగూ చెప్పేస్తారు. మీరు చాలా మంచివారు మాష్టారూ అని. జరక్కపోతే సమస్యే లేదు. మీరసలు రారు.

కానీ, ఈ విద్యను కనుక మీరు నేర్చారనుకోండి మీరే వేషాలైనా వెయవచ్చు. నారదుడంతటి వాళ్ళు కావచ్చు. మీరు చాలా కష్టపడండి. ఉదయం, సాయంత్రం క్లాసులు తీసుకుంటాను. వీలైన వాళ్ళు రండి. ఆసక్తి ఉన్నవాళ్ళు ఆ తరగతులకి హాజరవండి. వీలు పడలేదంటే నేను చాలాసార్లు చెప్పాను, ఎన్నెన్ని పరిస్థితులు దాటుకుని, మీరు ఉద్యోగం చేస్తున్నారో నాకు తెలుసు. ఎన్నెన్ని రోగాలున్నా, ఏ బాధలున్నా, కుటుంబ పరిస్థితులెలా ఉన్నా మీరు ఉద్యోగానికి వెళ్తారు.

కాబట్టి ఇది మీ భవిష్యత్‌నే కాక, ప్రపంచ భవిష్యత్‌నే నిర్ణయిస్తుందనే నమ్మకం మీకుంటే ఈ హరికథలు నాకు చెప్పకండి. రావాలని ఉందా లేదా? అంతే. కానీ, నేనిక్కడి వాళ్ళకు చెప్పేదేమిటంటే ఎక్కువ మందికి వీలయ్యే విధంగా సమయాన్ని సరిచేయండి. ఆ సమయానికి ఆశ్రమం కార్యక్రమాల్ని సవరించినా నాకభ్యంతరం లేదు. ఇంక మీ ఇష్టం అది. అర్ధరాత్రి రెండు గంటలకు క్లాసు పెట్టినా, నాకభ్యంతరం లేదు. కానీ, మీరు మాత్రం క్రమం తప్పకుండా రండి. ఉదయం, సాయంత్రం తరగతులకు హాజరై ఈ భాగవత విద్య నేర్చుకోండి. వీటి వివరణ క్లాసులు మళ్ళీ జరుగుతాయి. నాకు చాలామంది సహకారం కావాలి. నేను చెప్పేది ఉదయానిది సాయంత్రానికి, సాయంత్రం చెప్పింది ఉదయానికి ప్రింటయి వచ్చేయ్యాలి. తరగతులకు హాజరవటమే కాకుండా, ఆ అరగంట తరగతి అయిపోగానే టేప్ చేసిందాన్ని, డి.టి.పి. తీసేయండి. తర్వాత దాన్ని ముద్రించండి. అది ఎంతటి అద్భుతమైన ఫలితాలను ఇస్తుందో ఎలాంటి స్థితికి మిమ్మల్ని తీసుకెళ్తుందో మీకు తెలియదు. ఇక్కడ మాత్రం ఎలాంటి మోసాలు లేవు. ఆ జ్ఞానం ఎంత అద్భుతమైనదంటే



అది మీ జీవితాలను మార్చివేయడమే కాకుండా ప్రపంచం యొక్క జీవితాలనుకూడా మార్చి వేస్తుంది. అందుచేత కాస్త నిద్ర లేవండి. ఇది నిజమని మీకనిపిస్తే వంకలేం పెట్టకండి. ఇదయ్యాక వస్తాం, అదయ్యాక వస్తాం మాష్టారు........ అదయ్యే సరికి కాగల కార్యం గంధర్వులు తీరుస్తారు. అప్పుడు మీకేం మిగులుతుంది.

అందుచేత మీ వ్యక్తిగతమైన సమస్యలు మాట్లాడకండి. అవెప్పుడూ ఉంటూనే ఉంటాయి. అబ్బాయికి పెళ్ళవలేదు, అమ్మాయికి పెళ్ళవలేదు. పెళ్ళయ్యాక పిల్లవాడు పాలు తాగడం లేదు, పిల్లవాడికి రోగం వచ్చింది. అదయ్యాక పిల్లవాడికి మెడిసన్ లో సీటు రాలేదు. డాక్టర్ కోర్సు అయిపోయాక ఉద్యోగం రాలేదు. ఉద్యోగం వచ్చాక మళ్ళా వాడికి పెళ్ళి కాలేదు. ఇవేగా మీ సమస్యలు. ఇవి కాక ఇంకేమైనా కొత్త సమస్యలు మీరు సృష్టిద్దామనుకున్నా మీరు సృష్టించలేరు. నా దృష్టిలో భగవంతుడు కూడా సృష్టించలేడేమో. ఎందుచేతంటే మిగతావేవీ మీ దృష్టిలో సమస్యలు కావు. ఈ భాగవతం చదువుతున్నప్పుడు ప్రపంచం యొక్క ఈ ఆందోళనకరమైనటువంటి పరిస్థితి మీకు కనిపిస్తే...... ఎవరైనా కావచ్చు, మీరది గుర్తించుకోండి. నాకు విద్యలేదు మాష్టారు, నేనెలా నేర్చుకో గలను మాష్టారు అనరు. అందుచేత ఉదయం, సాయంత్రం జరిగే ఈ క్లాసుల్లో మీరు పాలు పంచుకోండి. లేదా పాలు పంచుకునే వాళ్ళను పంపించండి. అందరూ ఆహ్వానితులే. బాధ్యతలు ఏమైనా ఉంటే అవతలి వాళ్ళ బాధ్యతలను మీరు తీసుకుని, వాళ్ళను పంపించినా, మీరు చాలా మంచి పని చేసినట్టే. కాని రండి. వచ్చి ఏం చేయాలి? చాలా కష్టపడి ఇక్కడ చెప్పేవన్నీ నేర్చుకోవాలి. ఇంట్లో కూర్చుని అనేకమైన వ్యర్థ పనులు చేస్తుంటారు. వాటికి బదులు ఇక్కడకు వచ్చి ఆ చేసేదేదో ఈ పని చేయండి.

**నారద ఉవాచ :**

*శృణుష్వా వహితా బాలే యుగోయం దారుణః కలిః ।*
*తేనలుప్తః సదాచారో యోగమార్గ స్తపాంశిచ ॥*

హే దేవీ! ఇది దారుణమైనటువంటి కలియుగం. పాపం నారదుడికి కూడా కలియుగమంటే నచ్చలేదు. కలియుగాన్ని - దారుణమైన కలియుగం అన్నాడు. అందు

వల్ల ఈ కాలంలో సదాచారం, యోగ మార్గం, తపస్సు అన్నీ లుప్తమై పోయాయి. సదాచారం, యోగమార్గం, తపస్సు ఆ వరుసని జాగ్రత్తగా - ఆ త్రిపుటిని గుర్తించుకోండి.

మొదటిది సదాచారం-సదాచారమన్నా, యమనియమాలన్నా ఒక్కటే. అహింస, సత్యం, అస్తేయం,అపరిగ్రహం,బ్రహ్మచర్యం,శౌచం, సంతోషం, స్వాధ్యాయం, తపస్సు, ఈశ్వర ప్రణిదానం ఇవి సదాచారం. ఇంకో-సదాచారాలు లేవు.

యోగమార్గం - యోగమార్గమంటే అష్టాంగ యోగమార్గం. అష్టాంగ యోగ మార్గంలో సదాచారం ఎంతవరకు వచ్చింది? యమనియమాల వరకు వచ్చింది. మిగతా ఆరు అంటే ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధులు కూడా యోగమార్గాలు. ఈ రెండూ అప్పుడే మీరు మొదలు పెట్టేసారు.

శ్రీకృష్ణుడు 64 కళలను 64 రోజుల్లో నేర్చేసుకున్నాడు. అందులో ఆశ్చర్యం ఏముంది? ఒక ఆసనం, ఒక ప్రాణాయామం మీరు ఒక్కరోజులో మాస్టరీ చేయలేరా? అదే శ్రీకృష్ణుడు చేశాడు. అందులో ఆయన గొప్ప ఏమీ లేదు. ఇది చేయాలని తెలుసు. అందుచేతేకుల గురువైన గర్గ మహర్షి అతనిని సాందీపుని వద్దకు పంపాడు. దొంగతనం చేయటానికికూడా ఒక ఆసనం, ఒక ప్రాణా యామం ఉంది. దానెందుకు చెప్పానంటే శ్రీకృష్ణుడు దానిలో నిపుణుడు. ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క దాంట్లో నిపుణులు.

చిత్తచోరా యశోదాకే బాలా........

ఈ పాట పాడుతున్నప్పుడు మీకేమీ అనిపించదా? నువ్వు మహాదొంగవు అని పాడుతున్నారు. నవనీతం అంటే వెన్న దొంగలించడంలో కూడా. దొంగతనంలో గ్రెడేషన్స్ ఉన్నాయా వెన్నదొంగ, బంగారు దొంగ అని. దొంగ దొంగేగా. అందుచేత ఏ ఆసనంలో ఏ ప్రాణాయామం చేస్తూ మీరు దొంగతనం చేస్తే మిమ్మల్ని దొంగ అన కుండా దేవుడు అంటారో అనేది ఆ విద్య. ఆ విద్యను మీరు నేర్చుకోవచ్చు. కానీ, 65 రోజుల్లో ఒక్కొక్క ప్రాణాయామాన్ని ఒక్కొక్క ఆసనాన్ని వేశాడు. వీనిని నోట్ చేసుకుని, మీరు రిసెర్చ్ చేసుకుని, చర్చించుకోండి. విద్యలన్నీ బయటకు వస్తాయి. ఎందుచేతంటే బయటకు వచ్చే కాలం ఆసన్నమైంది కనుక. పర్వతాసనం నేర్పించింది ఎందుకో



మీకు చాలాసార్లు చెప్పాను. మీకు ఏ సమస్యలున్నా ఆ సమస్యలను అధిగ మిస్తారు. పర్వతం ఎప్పుడు కూడా భూ మట్టానికి ఉన్నత స్థానంలోనే ఉంటుంది. మీ జీవితాల్లో కూడా మీరు పర్వతం మీద ఉంటే మీకు భూత, భవిష్యత్, వర్తమానాలు తెలుస్తూనే ఉంటాయి. దానికే ప్రాణాయామంలో ఏం కలపాలో మెల్లిగా తర్వాత క్లాసుల్లో నేను చెపుతాను. అది చేస్తే ఖచ్చితంగా మీ జీవితాల్లో ఆ మార్పు వస్తుంది. అందుకే హిమాలయాలు భారతదేశానికి గురువయ్యాయి. అందుచేత భారతీయులు ఎప్పుడూ పర్వతం మీదే ఉంటారు. ఎప్పుడైతే కంప్యూటర్ యుగం వచ్చిందో విదేశాల్లో కూడా ఆంధ్రులే కంప్యూటర్ పరిశ్రమల్లో ఉన్నారు. అందులో 20 సీట్లు హైదరాబాద్ వాళ్ళవి.

కంప్యూటరైజేషన్ ఎప్పుడైతే వచ్చిందో ఆంధ్రులదే పై చేయి. కానీ, ఎప్పుడు ఉపయోగించుకుంటే. భాగవతంలో చెప్పినంత మాత్రాన రాదు. మీరు ఉపయో గించుకోలేకపోతే ఈ తరగతులు జరగవు. అందుచేత యోగమార్గం గురించి చెపుతూ ఆసన, ప్రాణాయామం, ప్రత్యాహార, ధారణ, ధ్యానం - ఇవి ఐదూ యోగమార్గాలు. ఇందాక పతంజలి యోగసూత్రాల్లో రెండు చెప్పుకున్నాము. యమనియమాలు ఎందులోకొస్తాయి? సదాచారంలోకి వస్తాయి. తపస్సు అనేది సమాధి. తపస్సు అనేది యమనియమాల్లో ఉంది కదా! డాల్టన్ థియరీ పదో తరగతిలోనూ చదువుతాం, ఎమ్మెస్సీలోనూ చదువుతాం. ఆ తేడాలు తర్వాత చెప్తున్నాననుకొని, మీరు ఇప్పుడు నేను చెప్పిన దీనిని జాగ్రత్తగా ఆలోచన చేసుకుని, ఈ మూడూ ఎక్కడైతే ఉంటాయో, అక్కడ ఏ విధమైన కష్టాలుండవు. ఆకుటుంబంలో సదాచారం, యోగమార్గం, తపస్సు ఉంటే కష్టాలుండవు. చెప్పటానికి కూడా భయపడతారు

ఎందుకో సరస్వతీ దేవి పేరు ఎత్తకూడదట. సరస్వతీ దేవి ఒక్క హిందువు లదేనా. ధ్యానం హిందువులకేనా. సరస్వతీ దేవి అంటే మీ ఉద్దేశ్యం ఏంటి హిందూ దేవతనా? ధ్యానం ఎక్కడైతే ఉందో, విద్య ఎక్కడైతే ఉందో, సామరస్యం ఎక్కడైతే ఉందో దానిని సరస్వతి అంటారు. సామరస్యం లేని చోట ఎక్కడైనా విద్య వస్తుందా? కొట్టుకునే చోట చదువు ఎట్లా వస్తుంది? అది ఎందుకు మాట్లాడలేకపోతున్నాం మనం. మాట్లాడలేదు అంటే మనకక్కర్లేదు అనేగా. కానీ, ఇప్పుడు కావాలి. అందుచేత మనం

ఏం కోరుకుంటున్నామో కాస్త నోరు విప్పి చెప్పడం నేర్చుకోండి. మనం చెప్పేది ఏ విధమైనా మతం కాదు. శరీరగతమైన సాధనలు. మానవ శరీరధారి ఎవరైనా ఉన్నత స్థితికి వెళ్లాలంటే సదాచారం, యోగమార్గం, తపస్సు అనే మార్గం మీదే వెళ్ళాలింక.

జనా అఘాసురా యన్తే శాఠ్య దుష్కర్మ కారిణః।
ఇహ సన్తో విషీదన్తి ప్రహృష్యన్తి హ్యా సాధవః
ధత్తే ధైర్యం తు యో ధీమాన్ సధీర: పండితోధవా॥ (శ్లో ॥ 58 )

**భావం: మూర్ఖులు దుష్కర్మలు చేస్తూ, మనుష్యులు అఘాసురు లౌతున్నారు. సత్పురుషులు దు:ఖిస్తున్నారు. దుష్టులు సుఖంగా ఉన్నారు. ఈ సమయంలో ధైర్యం కోల్పోని బుద్ధిమంతుడే జ్ఞాని లేక పండితుడు.**

ఈ కాలంలో అందరూ అఘాసురులే. అఘమంటే పాపం. పుణ్యకర్మలు కూడా పాపకర్మలుగానే ఆచరిస్తున్నారు. ఎందుచేత? పాపకర్మ యొక్క అసలైన సిసలైన లక్షణం ఏంటంటే అది చేయటానికి మీరు సిగ్గుపడతారు. వీడు ఈ వెధవ పని చేశాడని పదిమందికీ తెలిస్తే సిగ్గుపడతాం. తెలియక పోతే సిగ్గుపడం. అవునా? దేవునికి దణ్ణం పెట్టుకోవడానికి కూడా పదిమందిలో సిగ్గుపడతాం.

రామ, రామ అనుకోవడానికి సిగ్గుపడతామా, సిగ్గుపడమా? అఘాసురులం. పాపకర్మ చేయటానికి ఎలాంటి మానసిక స్థితి ఉందో, పుణ్యకర్మ చేయటానికి అలాంటి మానసిక స్థితిలో ఉన్న జాతిగా మారిపోయాం మనం. హరే రామ, హరే కృష్ణ అనే పాట భజన చేస్తూ రోడ్డు మీద వెళ్ళలేం. ఖుషీలో పాటైతే హాయిగా పాడుకుంటూ వెళ్లిపోతాం. ఏమీ సిగ్గుపడం. పాప కర్మకు సిగ్గుపడాలి. పుణ్యకర్మకు .......... రివర్స్ అవుతోంది. అదే చెప్తున్నాను ఇక్కడ.

జనా అఘాసురాయంతే ........ శాఠ్యం, దుష్కర్మం అన్నవి చిన్న డిగ్రీలు. వెధవ పనులు చేయటానికి మాత్రం ఎవరూ సిగ్గుపడడం లేదు. లంచం తీసుకోవడాన్ని ఏమంటాం? మామూలంటాం. ఇవ్వకపోతే పనెట్లా జరుగుతుందయ్యా? మరి అలాంటి పరిస్థితుల్లో మనం ఎలా జీవిస్తాం? ఎదురు తిరిగితే ఫినిష్. ఇదే సమస్య నేను ప్రాణ



ప్రత్యావర్తన శిబిరంలో గురువుగారి దగ్గరకు వెళ్ళినప్పుడు ఈ టాపిక్ వచ్చింది. మధ్య ప్రదేశ్‌లో నుండి వచ్చిన కాంట్రాక్టర్ అయిన ఒక భక్తుడు గురువు గారితో ఇలా అన్నారు - మీరేమో సత్యం, దానం, అహింస ఇవంతా చెప్పేస్తున్నారు. ప్రాక్టికల్‌గా ఎలా చేయాలో తెలియడం లేదు. లంచం ఇవ్వకుండా పనులు అవ్వడం లేదు. నేనీ శిబిరానికి వచ్చాను కనుక, ఇంక ఇప్పుడు ఆ ఉద్యోగం మానేస్తానన్నాడు. దానికి గురువుగారు నీకు బుద్ధుందా అని అడిగారు. లంచం తీసుకోవద్దని నేనెక్కడ చెప్పానన్నాడాయన. గురువులతో వచ్చిన పెద్ద గొడవిదే. చెప్పింది వాళ్ళే, మళ్ళా నేనెక్కడ చెప్పానంటారు. తర్వాత నేను చెప్పలేదంటారు.

ఏంటి మీరక్కడ నేర్చుకోవలసింది? వాళ్ళు నోటితో ఏం చెప్పారని కాదు. ఏం చేయమంటున్నారన్నది మీరర్థం చేసుకోవాలి. గురువుగారు ఏం చేయ మంటున్నారు? నా కార్యక్రమాలన్నీ పదిమందిలోకి తీసుకెళ్ళని కదా చెప్పారు. యుగ నిర్మాణ యోజనని కాని, గాయత్రీ పరివారం అని కాని చెప్పడంలో వాళ్ళ ఉద్దేశ్యం పదిమందికీ అంటే ఇంటింటికీ తీసుకెళ్ళాలనే కదా! సరే నువ్వు మానేస్తావు. నీ బదులు ఇంకొకడు లంచమిస్తాడు కదా! ఆ తీసుకున్నవాడు ఏం చేస్తాడు? ఏ త్రాగుడో త్రాగుతాడు. అదే నువ్వైతే ఏం చేస్తావు? ఏది ఉచితమో, ఏది అనుచితమో నువ్వే నిర్ణయించుకో అన్నారు. అందుచేత 'కామన్ సెన్స్ ఈజ్ వెరీ అన్‌కామన్' అంటుంది పాపం బ్లావెట్స్కీ. అందుచేత ఎప్పుడు కూడా కామన్‌సెన్స్ ఉంచుకోండి. దానికి పెద్ద ఉదాహరణ రామదాసు. మన ఆంధ్రావాడే. స్వీకరించిన డబ్బును సత్కార్యాలకు మాత్రమే ఉపయోగిస్తే దానిని కథలు, కథలుగా చెప్పారు. ఏం చేసాడాయన? తెలుసు కదా! పాపం గుడి కట్టించాడు. పాపం రాముడేమో ఈ యవనుడికి దర్శనం ఇవ్వవలసి వచ్చింది. ఎవరి కోసం? ఈ వెధవ పని చేసిన వాడికోసమని మన దృష్టిలో.

అది వెధవ పనేం కాదు. మంచి పనే చేశాడు. ఇప్పటికీ ఉందా గుడి. మంచి పని చేయడం నేర్చుకోండి. మంచీ, చెడు ఎప్పుడూ పక్కపక్కనే ఉంటాయి. ఆ ద్వంద్వాలను మనం వేరు చేయలేం. మంచిని పెంచుకుంటూ పోతే, ఆటోమ్యాటిక్‌గా చెడు చిన్నదైపోతుంది. మీరు అది నేర్చుకోవాలి. కానీ, మీరేం చేస్తారు. చెడు మానడానికి

ప్రయత్నిస్తారు. మంచి పనులు చేయరు. చెడును మానేయ్యాలనే ప్రయత్నం చేయక్కర్లేదు. అది నేను నా జీవితంలో చూసుకున్నాను. ఇతరుల జీవితంలో కూడా చూసాను. చెడును మానడానికి ప్రయత్నిస్తే అది ఎదురు తిరిగి విర్రవీగుతుంది. ఏ చెడు అలవాటున్నా దానిని మీరు పక్కన పెట్టుకుని మంచి అలవాట్లను పెంచుకుంటూ పొండి. అప్పుడు చెడు దానంతట అదే రాలిపోతుంది. అలా రాల లేదంటే అర్థం ఏంటి మీరు నటిస్తున్నారని. మంచి పనులు మీరు చేయటం లేదనే అర్థం.

## ఇహాసంతో విషీదంతి

ఇక్కడ భాగవతోత్తములు మంచి మార్గంలో నడుద్దామనుకునే వాళ్ళు బాధలు పడుతూంటారు. ప్రహృష్యంతి హ్యసాధవః - అసాధువులు ఆనందంగా ఉన్నట్లు కనిపిస్తారు. కానీ, వాళ్ళు ఆనందంగా మాత్రం ఉండరు. మీరు దానిని అర్థం చేసుకోండి. ఇప్పుడు ఇక్కడ ఒక దొంగ వచ్చికూర్చున్నాడనుకుందాం. ఓ పోలీసు వచ్చికూర్చున్నాడు. మనం మామూలుగానే మాట్లాడుకుంటూ పోతాం. కానీ, దొంగగారికి ఏమౌతుందో చెప్పండి. వాడేం సుఖంగా ఉంటాడనుకోకండి. కానీ, మీరు కూడా అలాంటి సుఖమే కోరుకుంటున్నారు కనుక, దెబ్బతింటున్నారు. ఉదాహరణ అర్థం అయిందికదా! మీకు కూడా అలాంటి సుఖమే కావాలి. లోపల బెంగగా ఉన్నా, బయటికి మాత్రం తామెంతో సుఖంగా ఉన్నట్లు నటిస్తుంటారు.

## తత్తే ధైర్యంతియోధీమాన్ స్థధీర పండితో ధవా

ఇప్పుడెవడూ జ్ఞాని, పండితుడు అవ్వక్కర్లేదు. కష్టకాలం వచ్చినప్పుడు ధైర్యంగా ఉంటే వాడే పెద్ద పండితుడు. దానికి ఏ జ్ఞానం, పాండిత్యం అఖ్ఖర్లేదు. ధైర్యంగా నుంచోగలిగితే వాడే పెద్ద పండితుడు. మీరు ధైర్యంగా నుంచుంటే ఆ కష్టం దాటి పోతుందా లేదా? అలాంటి కాలంలో మనం జీవిస్తున్నాం. అది సరైనదని చెప్పడం లేదు. కాల మహిమ గురించి చెపుతున్నాడు.

> అస్పృశ్యానవలోక్యేయం శేషభార కరీధరా ।
> వర్షేవర్షే క్రమాజ్జాతా మంగళమ్ నాపి దృశ్యతే ॥ (శ్లో ॥ 59 )



భావం: పృధ్వీ ప్రతి సంవత్సరం క్రమక్రమంగా ఆది శేషునికి భారమౌతున్నది.

దీనిని రామాయణ కాలంలో లక్ష్మణుడు జీవితాన్ని గమనిస్తూ మెల్లిమెల్లిగా మనం విశ్లేషణ చేసుకుందాం. ఇప్పుడిది గుర్తుంచుకోండి. ఇప్పుడు నారదుడు భక్తికి చెపుతున్నాడు - ఈ కాలం ఎలా అయిపోయిందంటే ప్రతి సంవత్సరంకూడా మంగళ కరమైన పనులు తగ్గిపోతున్నాయి. ఇంకా ఏం జరుగుతోంది? పృథ్వి శేషనాగుకి భారమై పోతోంది. అదొక ప్రశ్న మాత్రం వేసుకుని వదిలేద్దాం ఎందుచేతంటే దీనిలో లోతుగా చర్చకు వెళితే అసలు శేషనాగు మీద పృథ్వి ఎందుకుందంటారు. దీని వెనకాల రహస్యాలు మనం తర్వాత చదువుకుందాం.

> సత్వామపి సుతైః సాకం కోపి పశ్యతి సాంప్రతమ్ ।
> ఉపేక్షితాను రాగాస్తైజర్జరత్వేన సంస్థితా ॥ (శ్లో ॥ 60 )

**భావం: ఇవ్పుడు ప్రవంచానికి నీ వుత్రులతో పాటు దర్శనం కావటంలేదు. విషయానురాగంవల్ల అంధులైన జీవులద్వారా ఉపేక్షింపబడిన నీవు జర్జరమైపోయావు.**

భక్తి గురించి చెపుతున్నాడు. నీ పిల్లలతో పాటు నువ్వెరికీ కనిపించడం లేదు. అంటే కోరికైతే ఉంది కానీ, జ్ఞాన, వైరాగ్యాలు ఎవ్వరికీ లేవు. నువ్వు ఉపేక్షింప బడుతున్నావు. మెల్లిమెల్లిగా కోరికలు కూడా తగ్గిపోతున్నాయి. కోరికలు తీవ్రత కూడా తగ్గిపోతోంది. మిమ్మల్ని మీరు సింహావలోకనం చేసుకోండి. అసలు మీకు నిజంగా కోరికేదైనా ఉన్నదా? ఒక్కసారి ఆలోచించుకోండి. మీరెంత సిద్ధపురుషులో మీకు అర్థమవుతోందా! అసలు మీకేమైనా కోరికుందా? అంటే నాకీ కోరిక ఉందని గబుక్కున చెప్పలేని స్థితిలో ఉన్నాం. కోరికలు కూడా జర్జరమైపోతున్నాయి. నేను అబద్ధమేమీ చెప్పడం లేదు. అసలు మీకే కోరికలూ లేవు. ఆఖరుకు మీరు నిద్ర కూడా సరిగా పోలేకపోతున్నారు. సరిగ్గా నిద్ర పోదామనే కోరిక కూడా మీకు లేదు. కుంభకర్ణుడితో పోల్చుకుంటే మీ నిద్ర ఒక నిద్రా ఏమిటి? అక్కడ కూడా మీరు విజయవంతం కావడం లేదు. కోరికల రాహిత్యం దాన్నే కోరికలు జర్జరమైన స్థితి అని చెబుతున్నాడు.

*వృందావనస్య సంయోగాత్ పునస్త్వం తరుణేనవా ।*

*ధన్యం వృందావనం తేన భక్తి నృత్యతి యత్రచ ॥ (శ్లో ॥ 61)*

**భావం: బృందావనం యొక్క సంయోగంతో నీవు మళ్ళీ తరుణావస్థ పొందావు. ఈ బృందావన ధామం ధన్యము. ఇక్కడ భక్తి సర్వత్రా నృత్యము చేయుచున్నది.**

## బృందావనం అంటే -

గురువులందరి సమాధులను బృందావనం అంటాం. రాఘవేంద్రస్వామి బృందావనం, షిర్డీసాయి బృందావనం. బృందావనం అంటే అర్థమేమిటి సమూహం. సమూహంగా జీవించిన చోట మాత్రమే కోరికలు తీరుతాయని నీకిప్పటికైనా తెలిసింది కదా! ఏదైనా కోరిక తీరాలంటే బృందావనం ఉండాలి. బృందావనం అంటే సామూహిక ప్రయత్నం. అందుచేత మొదటి సూత్రం ఇస్తున్నాడు. కోరిక యవ్వనంలో ఉండాలంటే - కోరిక తీరాలంటే బృందావనంలో ఉండాలి. మీకు బృందావనం లేదు. చదువుకునే బృందావనం. అంతే కదా! చదువుకునే కోరిక ఉన్నవాళ్ళంతా ఒక బృందంగా ఏర్పడతారు. మిలటరీ దేశాన్ని రక్షించాలంటే అదొక బృందం. పోలీస్ అదొక బృందం. ఏదైనా ఒక కాలనీలో కొన్ని మార్పులను తీసుకు రావాలంటే అక్కడున్న ఆ మూడు వందలకుటుంబాలు ఈ మార్పు రావాలనుకుంటే అది జరిగిపోతుంది. బృందావనంగా కనుక మనం జీవించగలిగితే ఏ పనీ ప్రభుత్వం చేయనక్కర్లేదు. చాలా పనులు మీరే చేసుకోవచ్చు. కొన్ని పనులు కష్టం కానీ, అయినా చేసుకోవచ్చు.

ఇప్పుడు బృందావనం అంటే అర్థమైందా? కోరిక తీరాలంటే సామూహిక ప్రయత్నం ఉండాలి. సామూహిక ప్రయత్నం లేకపోతే భక్తి యువతిగా మారదు. అందుకనే ధన్యం బృందావనం అంటున్నాడు. ఎక్కడెక్కడ గ్రూపిజం ఉంటుందో వాళ్ళందరి కోరికలు తీరుతున్నాయి. దానికి మీరు ఏదో కారణం పెట్టండి. రాజకీయ ప్రాబల్యం అనండి, ఏదైనా అనండి. సమూహం అంటే ఖచ్చితంగా ఆ కోరిక తీరుతుంది. దానికి నేనేమంటానంటే మీరు సామూహికంగా ఆహారం తీసుకుంటే జరిగే అద్భుతాలను గమనించండి. ఆ కోరిక జర్జరం కకుండా చూసుకోండి. దయచేసి కనీసం ఈ కోరికనైనా జర్జరం కకుండా చూసుకోండి.



*అత్రేమౌ గ్రాహకా భావాన్నజరామపి ముంచతః ।*

*కించిదాత్మ సుఖేనేహ ప్రసుప్తిర్మన్యతే నయోః ॥ (శ్లో ॥ 62 )*

సామూహిక ప్రయత్నంతో పాటు జ్ఞానం, వైరాగ్యం కూడా లేకపోతే కావలసిన ఫలితాలు రావు. కానీ అవి చచ్చిపోలేదు. ఆ జ్ఞాన, వైరాగ్యాలు కోమాలోనే ఉన్నాయి. అంటే బ్రతికే ఉన్నాయి. ఎందుకు బ్రతికున్నాయంటే కించిదాత్మ సుఖేనేహ కొంచెం ఆత్మ యొక్క సుఖం ఆ జ్ఞాన, వైరాగ్యాలకు తగులుతున్నాయట. ఆ జ్ఞాన, వైరాగ్యాలకు ఆత్మికమైన సుఖం ఎలా తగులుతుందో చెబుతూ ఓ చిన్న పాయింట్ నేను మీకు చెబుతాను. మీరు చాలా జాగ్రత్తగా దాన్ని గుర్తుంచుకోండి. తర్వాత క్లాసులో వీలైతే భాగవతం మహత్యాన్ని పూర్తి చేసేద్దాం. నా కోరిక ఏంటంటే 'చేతనత్వ విజ్ఞానం ఒక పరిశీలన ' వివరణ త్వరలో పూర్తి కావాలి. చేతనత్వ విజ్ఞానం అంతా కూడా భాగవత మహత్యంలో ఉంది. ఏ టెక్స్ట్ బుక్ మీరు తీసినా ఈ స్కోప్ చెబుతుంటాడు కదా! సెప్టెంబర్ 23వ తేదీ ప్రకృతిలో ఒక అద్భుతమైన రోజు. చాలా విశిష్టత ఉంది. సి.వి.వి. కల్ట్ వారికి దాని ప్రాముఖ్యత బాగా తెలుసు. దానిని ఈక్వినాక్స్ డే అంటారు. దానిని ఇప్పుడు చర్చించే టైం లేదు. ప్రతి పండుగని మనం చాలా గ్రాండ్‌గా చేసుకుంటాం. అలాగే ఆ రోజు ఈ బుక్ రిలీజ్ చేద్దాం. 22వ తారీఖు రాత్రి 12 గంటలకు ముందు వస్తే 23వ తారీఖు ఆ సివివి గారి యొక్క ఆ అద్భుతమైన రోజున దీనిని రిలీజ్ చేద్దాం. ఆ బుక్ కవర్ డిజైన్ దగ్గర నుండి ప్రతి పేజీలో ఏముందో నేను కళ్ళారా చూడాలనే కోరిక నాకుంది.

అహంకారం, బుద్ధి, చిత్తం, మనస్సు - ప్రస్తుతం మనం మనస్సు యొక్క పరిధిలో జీవిస్తున్నాం. మనస్సు పరిధి దాటితే మిగతా మూడు పరిధుల్లోకి వెళ్ళే శారీరకమైన విశేషమైన దిశ మీకుంది. దానినే ఎండోక్రైన్ సిస్టమ్ అంటారు. దాని గురించి తర్వాత చెపుతాను. వీలైతే ఈ రెండు, మూడు రోజుల్లో చెబుతాను.

# పోల్‌షిఫ్ట్ - అశ్వమేధం

## పోల్‌షిఫ్ట్‌కి మన ఆశ్రమంలో చేసిన ప్రయోగం

సచ్చిదానంద రూపాయ విశ్వోపత్యాది హేతవే ।
తాపత్రయ వినాశాయ శ్రీకృష్ణాయ వయం నుమః ॥

ఇక్కడినుంచి వచ్చే శ్లోకాలు భక్తి యొక్క ఇతిహాసమని చెప్పాను నేను. దీని మీద మీరు మన శరీరంలో ఉండే స్థితులని రీసెర్చ్ చెయ్యమని చెప్పాను. అది మనస్సులో ఉంచుకొని జాగ్రత్తగా చదువుకోండి. ఈ పాఠం అయిపోయిన తర్వాత శాంతికుంజ్ ఆశ్రమంనుంచి గురుదేవుల యొక్క అంబాసిడర్స్ - శాంతిదూతలు వచ్చారు. వాళ్ళేం చెప్తారో విందాం.

శ్రవణం వల్ల భాగవతం మనం అర్థం చేసుకుని జీవించడం నేర్చుకోవాలి. అమెరికాలో వరల్డ్ ట్రేడ్ సెంటర్ మీద ఉత్తర భాగాన్నీ, దక్షిణ భాగాన్నీ విమానాలతో కొట్టేశారు. (11.9.01) పోల్‌షిఫ్ట్ గురించి మీకు చాలా సార్లు చెప్పాను. ఉత్తర ధృవం, దక్షిణ ధృవంగా మారుతుందని. దానికి మన ఆశ్రమంలో చేసిన ప్రయోగం ఏమిటి? హిమాలయాలను మనం దక్షిణ దిక్కున పెట్టాం. చాలా చాలా ఆధ్యాత్మికమైనటువంటి రహస్యాలు ఈ ఆశ్రమంలో ఉన్నాయి. కాని విలువ తెలియకపోతే .... ? అనేక ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రభుత్వం కోట్ల రూపాయలకు యంత్రాలు కొనిస్తే వాటిని తీసుకొచ్చి బయట ఎండలో పడేసి ఉంటాయి. వాటిని ఎవరూ ఉపయోగించరు. అటువంటి పరిస్థితి ఈ ఆశ్రమంలో రాకూడదు. దాని ప్రాముఖ్యత మీరు తెలుసుకోండి.

ప్రపంచంలో అమెరికా సూపర్ పవర్‌గా ఎందుకుంది? వ్యాపారం వల్లే కదా! మనుష్యులెంత మూర్ఖులో? అసలు చుట్టూ ఏం జరుగుతోందో కూడా వాళ్ళకి తెలీటంలేదు. ఒక పాత ఇంటిని పడగొట్టి క్రొత్త ఇంటిని కడదామనుకున్నప్పుడేం చేస్తాం? పాత ఇంటిని పడగొట్టేస్తారుగా. ఇదేమిటి ఇల్లు కడతామని పాతిల్లునికూల్చేస్తున్నాడని ఎవరైనా అంటే - అతన్ని మూర్ఖుడంటామా, మెచ్చుకుంటామా? పోల్‌షిఫ్ట్‌కి ప్రతీక. ఇలా ఎందుకు జరుగుతోందో దానికి మీరేం చేయగలరో ఆలోచించుకోండి.



కాలం దాటిపోయిన తర్వాత మీరేం చేసినా లాభం ఉండదు. పని ఆగదు. మీరు చాలా జాగ్రత్తగా వినండి. మిలటరీలో ఉన్నవాళ్ళు యుద్ధం చేస్తారు. అప్పుడు నేను చాలా చిన్నవాడినండి, పెద్దయ్యాక చేస్తానంటే ఏమైనా లాభం ఉంటుందా? ఇప్పుడు ఈ క్షణంలో మీరు చెయ్యవల్సిన కార్యక్రమాలని నేను చాలా వేగంగా చెపుతున్నాను. మీరు గనుక ఆ వేగాన్ని అందుకుంటే ఖచ్చితంగా ఒకే విశ్వం, ఒకే ధర్మం, ఒకే భాష ఏర్పడుతుంది. మీవ్యక్తిగతమైన బాధలు, ఇబ్బందులు గమనించుకోవద్దని చెప్పటం లేదు. నా జీవితమే మీకు ఉదాహరణ. ఆత్మబంధువులతో మాత్రమే ఈ విషయం మాట్లాడుతున్నాను. మీరందరూ నా ఆత్మబంధువులే.

పోల్‌షిఫ్ట్ జరిగింది. అది జరిగాక మీరేం చెయ్యాలి? చాలా పన్లు చాలా వేగంగా చెయ్యాలి. వ్రాయగలిగే వాళ్ళు, సహాయం చెయ్యగలిగే వాళ్ళు రండి. ఉద్యోగస్తులైతే 2,3 వారాలు సెలవులు పెట్టి ఇక్కడ ఉండిపొండి. నాకు చాలా ప్రణాళికలున్నాయి. ప్రణాళికలైతే ఇచ్చెయ్యగలను కాని, అవి ఆచరణలో పెట్టాల్సింది మీరు. అందుచేత తర్వాతేం జరుగుతుంది? అశ్వమేధ యజ్ఞం జరుగుతుంది. పోల్‌షిఫ్ట్‌కి ధీటుగా ఉత్తరం నుంచి వచ్చిన అశ్వం, దక్షిణ భారతదేశంలో గురుసత్తా యొక్క జెండాని ఎగురవేయడానికి ప్రయత్నిస్తున్నది. అది కూడా పోల్‌షిఫ్ట్‌యే!

## గురువుగారి అష్టోత్తర శతనామాలు - పోల్‌షిఫ్ట్‌కి

మనం అక్కడ బొమ్మలో ఏం వ్రాయించాం? ఎన్నాళ్ళ క్రిందట వేశాము? చూడండి గురుసత్తా ఎంతద్భుతంగా పని చేస్తున్నదో. కానీ మన ప్రమేయం లేకుండా జరుగుతున్నది. ఒక బొమ్మ ద్వారా జరిగిపోయింది. పోల్‌షిఫ్ట్ గురించి మీకు తెలీదు. మీరేం ప్రయత్నం చెయ్యలేదు. తిరుపతిలో అశ్వమేధ యజ్ఞం పెట్టాలంటే మనం పెట్టలేం. కానీ ఆ గురుచేతనత్వం ఎలా పని చేసిందో చూడండి. ఆ బొమ్మని మీరు గమనించుకోగల్గితే చాలా రహస్యాలున్నాయి. ఏదీ కూడా కళ్ళు మూస్కుని పెట్టబడలేదు. కళ్ళుమూస్కుని రంగు వేయబడలేదు. ప్రతీదాని వెనుక అంతరార్థముంది. మీరర్థం చేసుకోవల్సిందేంటంటే ఈ గురుసత్తా తన కార్యక్రమాలలో ఏ

విధమైన మార్పురానివ్వదు. కానీ తెలిసాక, ఇంత దగ్గరికి వచ్చాకకూడా మీరు సహకారం అందించకపోతే మీకే నష్టం. గురుసత్తాకి ఏమీ అవ్వదు. ప్రపంచానికి ఏమీ అవ్వదు. **మనకి హృదయమంటూ ఉంటే అది ఏడుస్తుంది అవకాశం వచ్చినా నన్ను ఉపయోగించుకోలేదని. దాన్ని ఉపయోగించు కోవటానికి నా ప్రణాళికలో, గురువుగారి అష్టోత్తర శతనామావళిలో కుండలిని జాగరణ గురించి చెప్పిన దాని మీద నా దృష్టంతా ఉంది.**

'భవిష్యత్ కాలంలో 200 ల సంవత్సరం వరకు ఎవరైనా కుండలినీ శక్తిని ఉపయోగించుకోదలిస్తే నేను సశరీరంతో వచ్చి సాధన నేర్పుతాను' అన్నారు గురుదేవులు (శ్రీరామశర్మ ఆచార్య). భౌతిక జగత్తులో ఆయన ఏదో ఒక రూపంలో వచ్చి తప్పక నేర్పుతారు. కానీ నేటి కాలంలోకుండలినీ జాగరణంటే - కళ్ళుమూసుకుని మూలాధారం, స్వాధిష్ఠానం అంటూ మీరు భ్రమకి లోనవ్వడమే గాక, మొత్తం ప్రపంచం భ్రమకిలోనయి కుండలినీ విద్య మరచిపోయే స్థితికొచ్చింది. కుండలినీ విద్య ఒకచోట కూర్చుని శారీరకంగా చేసేది కాదు. కుండలినీ అంటే నిర్ధారింపబడటం. వీళ్ళు ఆ పనికి నిర్ధారితులు. అంటే అర్థం అవుతుందా. ఈ సమూహం ఈ పని చేస్తుంది. ఈ సమూహం ఈ పని చేస్తుంది. మానవజాతిలో సామూహిక ప్రయత్నం ప్రవహించాలి. నేను ఒక్కడినే కూర్చుని చేస్తాను. నా భగవంతుడు ఎక్కడుంటాడు. సర్వవ్యాపి, సర్వ సమర్థుడైన భగవంతుడిని నువ్వు ఇంట్లో ఎలా బంధిస్తావు? దాన్నుంచి మీరు బయట పడండి. ప్రపంచంలో భగవంతుడు సక్రియంగా ఉంటాడు. ఆ భగవంతుడిని కనుక మీరు ఇంట్లో చూడగలిగితే, దేవాలయాలు అఖ్ఖర్లేదు. గురుద్వారాలు అఖ్ఖర్లేదు. అదీ మనం చెప్పటానికి ప్రయత్నం చేస్తున్నాం.

బయటున్న భగవంతుడు, మీలో ఉన్న భగవంతుడు ఇద్దరూ కూడా సర్వవ్యాపి అయిన ఏకైక అఖండ గురుసత్తాయే. మానవ జాతి తను ఏ లక్ష్యం సాధించాలన్నా కూడా భక్తి, జ్ఞాన, వైరాగ్యములనే త్రిపుటి ఉండాలి. భక్తి అంటే మళ్ళా భగవంతుడు గుర్తుకు వస్తాడు కనుక భాగవతం భక్తి గురించి మాట్లాడటం



లేదు. ఉపనిషత్తులు కూడా కోరికల గురించి మాట్లాడతాయి తప్ప భగవంతుని భక్తి గురించి మాట్లాడవు. కోరికల గురించి మాట్లాడతాయి.

## మీరేకోరిక కోరినా ఆ కోరిక తీర్చుకోవచ్చు

సకామయతః -భగవంతునికి కోరిక వచ్చింది. సృష్టి మొదలైయ్యింది. మీరు కూడా ఆ భగవంతుని యొక్క అమృతత్వం యొక్క పుత్రులు కనుక మీరు కూడా సృష్టికి ధీటైన ప్రతిసృష్టి చేయగలరు. ఎప్పుడు? మీరు విశ్వామిత్రుడైతే. అంటే ఏ పని చేస్తే మీరు ప్రపంచానికి మిత్రులౌతారో ఆ పని చేస్తేనే మీరు విశ్వా మిత్రులౌతారు. కానీ విశ్వామిత్రుడనే ఋషి ఉన్నాడో లేడో తెల్సినా తెలియక పోయినా ప్రపంచం మీద ఆర్తి ఉంటే, ప్రపంచానికి నేనొక మిత్రునిగా, మెలగాలనే ఆర్తి ఉంటే నిస్సందేహం గా మీరు ప్రపంచానికి మిత్రులైపోతారు. 'విశ్వామిత్ర' అనే మానసిక స్థితిలో కోరిక, జ్ఞానం, వైరాగ్యమనే త్రిపుటినెలా కలపాలో భాగవతంలో చెప్పబడుంది. మీరే కోరిక కోరినా, ఆ కోరిక తీర్చుకోవచ్చు.

'చింతామణిర్లోక సుఖం.....' భూలోకంలో మీరేది కోరుకున్నా, 'చింతామణి' అనేది మీ కోర్కెను తీరుస్తుంది.

సురద్రుః స్వర్గసంపదాం:- స్వర్గలోకంలో ఉన్న సుఖాలను 'కల్పతరువే' ఇస్తుంది. 'ప్రయచ్ఛతి గురుప్రీతో వైకుంఠం యోగి దుర్లభం' కానీ గురువు దుర్లభమైన టువంటిది, యోగులు కూడా పొందలేని వైకుంఠప్రాప్తిని ఇచ్చేస్తాడు. వైకుంఠమంటే పరిపూర్ణమైన మనోనియంత్రణ కల్గిన మస్తిష్కం. పరిపూర్ణమైన మనోనిగ్రహముంది. నువ్వేదనుకుంటే అది చేస్తావు. ఎక్కువా చెయ్యవు, తక్కువా చెయ్యవు. అదే 'సమత్వం యోగ ఉచ్యతే'. ఎక్కువా చెయ్యకుండా తక్కువా చెయ్యకుండా పరిపూర్ణమైన మనోనిగ్రహం కల్గిన మస్తిష్కం యోగికికూడా దుర్లభం అన్నారు. ఎందుకంటే వాళ్ళకి కూడా పరిపూర్ణమైన మనోనిగ్రహం లేదు. ఈ భాగవతం చదివే వ్యక్తులకు పరిపూర్ణమైన మనోనిగ్రహం ఉంటుంది.

*కథం పరీక్షితా రాజ్ఞా స్థాపితో హ్యశుచిః కలిః ।*

*ప్రవృత్తేతు కలౌ సర్వసారః కుత్రగతో మహాన్ ॥ (శ్లో । 63 )*

భక్తి చెప్పెను ' రాజా 'పరీక్షిత్తుడుఈ పాపి కలిని ఎందుకుండనిచ్చెను? ఇదిరాగానే అన్ని వస్తువుల సారం ఎక్కడికో పోయెను.

## పరీక్షిత్తు అంటే ఏం చెప్పాను

పరీక్షిత్ మహారాజు కలిని చంపటానికి కావల్సిన పరిస్థితులున్నప్పటికి ఎందుకు చంపలేదు? ఒక అద్భుతమైన, శక్తిసంపన్నుడైన రాజు జగద్గురువైన శ్రీకృష్ణుని ఆశీర్వచనంతో పుట్టినదగర్భుంచి నన్ను రక్షించిందెవరని పరీక్షగా అందరి ముఖాల వంక చూసిన వ్యక్తి ఒక్క పరీక్షిత్తేనా? అలా ముఖాలవంక చూసిన వ్యక్తులింకా ప్రపంచంలో ఎవరైనా ఉన్నారా? పరీక్షిత్తంటే ఏం చెప్పాను? ఎందుకతనికి పరీక్షిత్తు అనే పేరొచ్చింది? తల్లిగర్భంలో ఉన్నప్పుడు సుదర్శన చక్రంతో శ్రీకృష్ణుడు బాహ్యమైన ఆపదలు గర్భస్త శిశువు మీద పడకుండా రక్షిస్తాడు. అందుచేత ఆ రక్షించే చక్రం ఎక్కడుంది? ఎవరు నన్నీ "అంగుష్టమాత్ర దేహుండై" రక్షించారని ఈ శిశువు అందరి ముఖాలవంక తేరిపార చూసాడుట. శ్రీకృష్ణుడు ఒక్క పరీక్షిత్తు నేనా రక్షించింది? ఈ సృష్టిలో ప్రతీ జీవిని ఆ శ్రీకృష్ణుడే దశదిశల నుండి రక్షిస్తున్నాడు. కనుక అందరూ పరీక్షిత్తులే. అందుచేత భాగవతం నీ యొక్క జీవితమే. నీవు కూడా ఆ భగవంతుని అనుగ్రహం వల్లే పుట్టావు. తల్లి గర్భంలో శిశువెలా పెరుగుతాడనే విషయాన్ని ప్రతి గురువు చెప్పాడు. వీరబ్రహ్మంగారు చెప్పారు. దేవహుతికి కపిల మహర్షి చెప్పాడు.

తల్లి యొక్క గర్భంలో ప్రకృతికి ధీటుగా పిండోత్పత్తి ఎలా జరుగుతుందో మీకు తెలీదు. ఎందుకలాగే జరగాలంటే తల్లి శిరస్సు మీద గురువు పాదాలున్నాయి కనుక. ప్రతీ శరీరంలో ఉండే పిట్యూటరీ గ్లాండే 'గురుపాదుకలు'. దేవాలయాల్లో పెట్టే శఠగోపమునకర్థమదే. మీకింకో ధర్మాలేవీ అక్ఖర్లేదు. దేవాలయాలక్ఖర్లేదు. భాగవతం అంతా జీవితం గురించి చెపుతుంది. దాన్ని ఆచరిస్తే చాలు. మీరనుకున్నవి, కోరుకున్నవి జరిగిపోతాయి. జీవితంలో వచ్చే నివారణోపాయాలకి నారదుడు ఇలా చెప్తున్నాడు.



*యది పృష్ట స్త్వయా బాలే ప్రేమతః శ్రవణం కురు ।*

*సర్వం వక్ష్యామితే భద్రే కశ్మలంతే గమిష్యతి ॥ (శ్లో 65 )*

నువ్వడిగావు కనుక హే కల్యాణీ! నేను చెపుతున్నాను. నీవు చాలా ప్రేమగా విను. నీ దు:ఖం దూరమౌతుంది.

*యదా ముకుందో భగవాన్ క్ష్మాం త్యక్త్వా స్వపదం గతః ।*

*తద్దినాత్ కలిరాయాతః సర్వసాధన బాధకః ॥ ( శ్లో 66 )*

యధాముకుందో భగవాన్ - ముకుందుడైనటువంటి భగవంతుడు

క్ష్మాం త్యక్త్వా స్వపదం గతః - ఈ భగవంతుడు పృధ్విని వదిలేసి తన పదములోకి వెళ్ళిపోయినప్పుడు ఏమైందో చూడండి.

ముకుందో భగవాన్ - ముకుందుడైనటువంటి భగవంతుడు

క్ష్మాం త్యక్త్వా స్వపదం గతః - ఈ భగవంతుడు పృధ్విని వదిలేసి తన పదములోకి వెళ్ళిపోయినప్పుడు

తద్దినా కలిరాయాతః - ఆ రోజునుంచే కలి ప్రవేశించింది.

సర్వసాధన బాధకః - అన్ని సాధనలకి అది అడ్డు పడుతుంది.

ఇంతకీ ఏం చెపుతున్నాడు? నేను చెపుతున్నటువంటి భాషలో మీ కది అర్థమవ్వాలి. ఎప్పుడైతే మీ కనెక్షన్ పిట్యూటరీతో - అంటే ఆజ్ఞా చక్రంతో పోయిందో ఏది చూస్తున్నా కూడా ఈ శరీరం ఆ భగవంతుని వైబ్రేషన్స్‌తో ఉండదు. పురుష సూక్తంలో ఏం చెపుతున్నాం?

'సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్ సభూమిం విశ్వతో వృత్వ అత్యతిష్ట దశాంగులమ్ ॥ 'ఈ భూమిమీద పిట్యూటరీ అనే గురుపాదుకల నుండి వచ్చే శక్తి సర్వమావృత్య తిష్టతి - అక్కడనుంచి వచ్చే హార్మోనులె మన శరీరాలను నియంత్రిస్తాయి. అదందరికీ తెల్సు. ప్రతి డాక్టర్‌కీ తెల్సు కదా. కానీ ఆ హార్మోన్ సెక్రిషన్ ఎలా నియంత్రించుకోవాలో తెలీదు. ఆసన, ప్రాణాయామాలు సూటిగా దాని మీద ప్రభావం

చూపిస్తాయి. అందుకే నేనింతగా నొక్కినొక్కి చెప్పేది. చాలా సంవత్సరాలుగా నాకు వాటి యొక్క ఉపయోగం తెలీదు. ఆసనాలు 'స్వపనం గతః' ఎండోక్రైన్‌సిష్టమ్ తన పని తను చేస్తుంది. ఏమి చేస్తుంది. గుండె దానంతటది కొట్టుకుంటుంది. నీ ప్రమేయం లేకుండా అన్నం దానంతటది అరుగుతుంది. నీ ప్రమేయం లేకుండా రక్తప్రసరణ జరుగుతుంది. నీ ప్రమేయం లేకుండా స్వపదాం గతః - దాని పనది చేసుకుంటుంది. నువ్వు నీ పని చేసు కుంటావు. నీ శరీరంలో జరుగుతున్న కార్యక్రమాలకి సంబంధం లేదు.

## నదులు - శరీరంలోని రక్త ప్రసరణ

నీ గుండె కొట్టుకోవటానికి నువ్వు చేసే పనికి, ప్రకృతిలలో ప్రవహిస్తున్న నదులకి, నీ శరీరంలో ప్రవహిస్తున్న రక్తప్రసరణకి ఏమిటి సంబంధం? ఆ సంబంధం పోయింది. కలి ప్రవేశించింది. సంబంధం ఉందంటే మనకి నదులే చాలా ముఖ్యమై పోతాయి. ఒక్కొక్క నది మన శరీరంలో ఒక్కొక్క చోట ఉంటుంది. సరయూ నది మీ మస్తిష్కాన్ని సరిగ్గా రెండు భాగాలు చేస్తుంది. గంగానది మీ వెన్నుపూసలో ప్రవహిస్తుం టుంది. ఇడా - పింగళలు కృష్ణ, కావేరి. సరస్వతి - సుషుమ్న . భారతదేశంలో ఉన్న ఈ ఏడు నదులు మన శరీరంలో ఉన్న ఏడు అద్భుతమైన ప్రజ్ఞలకి సంకేతాలుగా పని చేస్తూంటాయి. మొత్తం ఏడు నదులు మన శరీరంలో ప్రవహిస్తూంటాయి. అదే మనం రోజూ ఏమని చెప్పుకుంటాం?

*గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతీ*
*నర్మదా సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు ॥*

అదెప్పుడైతే మనం మరచిపోయామో ఈ సంకేతాలు -స్వపదాంగతః అవి ఎక్కడున్నాయి. అవి పనిచేస్తూనే ఉన్నాయి. కనుక మన శరీరాలు పని చేస్తున్నాయి. ఎప్పుడైతే అవి కూడా పని చేయడానికి విసిగిపోతాయో మనం ఎందుకు పుట్టామో, ఎందుకు చనిపోతామో తెలియదు. అందుచేత కలి ప్రవేశం ఎప్పుడు జరిగింది.



## ఎండోక్రైన్ సిష్టమ్‌ని మీ వశంలోకి తెచ్చుకోవాలి

*కార్పణ్యదోషోపహత స్వభావః*
*పృచ్ఛామిత్వాం ధర్మసమ్మూఢచేతాః ।*
*యచ్ఛ్రేస్యాం నిశ్చితం బ్రూహితన్మే*
*శిష్యస్తేహం శాధిమాం త్వాం ప్రపన్నమ్ ॥ (భ॥గీ॥ 2 - 7)*

అని నిరంతరం మీరడుగుతుంటే కలి ప్రవేశించదు. మీరేమిచేస్తున్నా నిరంతరం మీరా స్థితిలో ఉండాలి. పూజలుచేయఖ్ఖర్లేదు. ఏమీచేయఖ్ఖర్లేదు.

*పానీయంబుల్ ద్రావుచున్ ..........భూవరా*

ఆ గురువుని, ఆ ఎండోక్రైన్ సిష్టమ్‌ని మన వశంలోకి తెచ్చుకోవాలి. ఎలా వశంలోకి తెచ్చుకోవాలి? దాన్ని నియంత్రించి కాదు. దాని నియంత్రణలోకి మనం వెళ్లిపోయి. దాన్ని నువ్వేమీ నియంత్రించలేవు. ప్రకృతినే శాశించే శక్తిని మీరేం నియంత్రిస్తారు? మరేం చేయగలం? దాని నియంత్రణలోకి మనం వెళ్ళిపోగలం. అలా వెళ్ళి పోయినప్పుడు కలిపోతుంది. కానీ దాన్ని వదిలేసుకుని నీ కోరికల నియంత్రణలోకి ఏ రోజైతే నువ్వు వస్తావో ఆ రోజునుంచి కలి ప్రవేశించింది. సర్వసాధన బాధకాః - నువ్వే పని చేసినా సవ్యంగా ఎప్పుడు జరిగిపోతాయంటే నిరంతరం ఆ మౌనస్థితిలో ఉంటే. కానీ మౌనస్థితిలో ఉండమండీ.... భౌతికజగత్తులో మౌనంగా ఉండమని కాదు. దాన్నిక్కడ అభ్యాసం చేసుకుంటూ ఉంటే మీకు అర్థమౌతుంది.

*దృష్ట్వా ద్విగ్విజయే రాజ్ఞీ దీన వచ్ఛరణం గతః ।*
*నమయా మారణీ యోయం సారంగ ఇవ సారభుక్ ॥ (శ్లో 67 )*

భావం: దిగ్విజయ సమయంలో పరీక్షిత్ మహారాజు యొక్క దృష్టి పడినప్పుడు కలియుగం దీనుడివలె ఆయన శరణుజొచ్చెను. తేనెని అన్ని పుష్పాలనుంచి స్వీకరించి, పుష్పాలనేమీ చేయకుండా, తేనెని మాత్రమే గ్రహించే భ్రమరంలాగ, తేనెటీగలాగ పరీక్షిత్తు ఏమను కున్నాడంటే ఈ కలి నేను చంపకూడదు. కలిని వదిలేద్దాం అనుకున్నాడుట. ఎందుకో చెప్తాడు.

యత్ఫలం నాస్తి తపసా నయోగే న సమాధినా ।
తత్ఫలం లభతే సమ్యక్ కలౌ కేశవ కీర్తనాత్ ॥ (శ్లో 68 )

## కలియుగమంటే ఏమిటి?

సత్య, ద్వాపర, త్రేతా యుగాలలో తపస్సు, యోగ, సమాధి సాధనలు చేసిన వాళ్ళే ఏ స్థితిని పొందలేరో వాళ్ళకి ఈ కలికాలంలో అంటే ఈ కలియుగంలో ఒక పెద్ద లాభం ఉంది. నామసంకీర్తన వల్ల అంతకంటే ఎక్కువ లాభాలొస్తాయి. అంటే నువ్వు తపస్సు చెయ్యఖ్ఖర్లేదు. యోగ సాధనలు చెయ్యఖ్ఖర్లేదు. సమాధులెలా ఉంటాయో అభ్యాసం చెయ్యఖ్ఖర్లేదు. **కలియుగమంటే ఏంటి? గురుపాదాల నుంచి చ్యుతి చెందినటువంటి స్థితి.** ఈ నిర్వచననాన్ని మీరు చాలా జాగ్రత్తగా అభ్యాసం చేసుకొండి. ఇవే ఒక నూతనమైనటువంటి జీవితానికి నాంది పలుకుతాయి. గురు పాదాలనుంచి చ్యుతి చెందిన స్థితి. అదే అచ్యుత స్థితి. "కేశవ నామ కీర్తన" అంటే 24 పేర్లు వస్తాయి.

ఎక్కడ? సంధ్యావందనంలో కృష్ణుడు యొక్క 24 పేర్లు వస్తాయి. అచ్యుత అనే స్థితేంటి? మీరెక్కడుండాలి అన్నమాట? నిరంతరం గురుపాదాల చెంత ఉంటే మీరు అచ్యుత స్థితిలో ఉన్నట్టు. అప్పుడే అచ్యుత అనే మాటకి అర్థం వస్తుంది. కీర్తించటం అంటే అదీ అర్థం. ఆచమనం చేస్తాం మనం. కేశవాయ స్వాహా, నారాయణాయ స్వాహా, మాధవాయ స్వాహా - ఈ మూడూ దేన్ని చెప్తాయి. అంటే చాలు మీరా స్థితిలోకి వెళ్ళిపోతారని చెపుతున్నాడు. సు + ఆహా = బాగా చెప్పామని. స్వాహా - అంటే అర్థము ఏంటి? సు+ ఆహా బాగా అన్నాను. ఏమని చాలా బాగా అన్నావు? కేశవా అని చాలా బాగా అన్నావు. నారాయణా అని చాలా బాగా అన్నావు. మాధవా అని చాలా బాగా అన్నావు. అదీ కీర్తనమంటే.

తత్ఫలం లభతే సమ్యక్ కలౌకేశవ కీర్తనః. దాన్ని మరవగాహన చేసుకుని ఆ నామాలకి మన శరీరానికి ఉన్నటువంటి సంబంధం తెల్సుకుంటే



'ఏకాకారం కలిం దృష్ట్వా సారవత్సార నీరసమ్ ।
విష్ణురాతః స్థాపితవాన్ కలిజానాం సుఖాయచ ॥ (శ్లో 69 )

కలియుగంలో ఎప్పుడైతే గురువు మీద భక్తిపోయి, గురువుకి చాలా దూరంగా వెళ్ళిపోతారో చాలా కష్టాలు వాళ్ళకి. ఇంక ఈ కష్టాల్లో ఒక పేరు తల్చుకుంటేనే సరైపోయే ఓ అద్భుతమైన ప్రక్రియ ఈ కలికాలంలో చాలా బాగా అభివృద్ధి చెందింది. ఎలా అభివృద్ధి చెందుతుందనేది సాధనా విజ్ఞానంలో చదువుకుందాం.

## శరీరంలో ఉండే గురువు

ఈ భాగవత మహాత్యం నేర్చుకుంటేనే చాలు. ఈ కాలంలో ఉన్న స్థితేంతంటే మన శరీరంలో ఉన్న ఎండోక్రైన్ సిస్టం మనకి తెలీదు. ఎండోక్రైన్ సిస్టం అంటే ఏంటో చెప్తున్నాను కదా. గుండె ఎందుకు కొట్టు కుంటోందో, ఆహారం ఎందుకు అరుగుతుందో, ఈ ఆహారం అరగటానికి కావల్సినటువంటి రసాయనాలు మన శరీరంలో ఎలా ఉత్పన్నమౌతున్నాయో తెలీదు. కానీ నీకు దాహం ఎప్పుడు వేస్తుంది? నీకు శరీరంలో నీరుతక్కువైతే. నీకు శక్తి కావల్సివచ్చినప్పుడే ఆకలి వేస్తుంది. అలాగ మన శరీరానికి కావల్సివచ్చిన అనేక కోరికలు గురువే తీరుస్తుంటాడు. ఎండోక్రైన్ సిస్టం యొక్క మాస్టర్ గ్లాండ్ పిట్యూటరీ గ్లాండ్ తీరుస్తుంటుంది. ఎప్పుడేది కావాలో అప్పుడది సరఫరా చేస్తూంటుంది. మనకి మనం దాన్ని నియంత్రించలేం.

## వాక్ శక్తి యొక్క వైశిష్ఠం

కానీ ఈ శరీరాలకి సత్య, త్రేతా, ద్వాపరయుగంలో ఉన్నటువంటి శరీరాలకి చాలా తేడా ఉంది. ఇది మీరు చాలా జాగ్రత్తగా అర్థం చేసుకొండి. మన శరీరాలకీ పైలోకాల్లో పుట్టిన శరీరాలకీ చాలా తేడాఉంటుంది. కొంచం సైన్స్ తెల్సిన వాళ్ళకి తెల్సు. వాళ్ళు మనలాగా మఠం వేస్కుని కూర్చోలేరు. వాళ్ళలా కూర్చోవాలంటే చాలా కష్టపడాలి. దాన్నే జీన్స్ అంటాం మనం. ఏంటి చాలా తేడా ఉందంటే ఈ శరీరం మాటకి లొంగుతుంది. మిగతా లోకాల్లో ఈ శరీరం వాక్శక్తికి లొంగదు. అది లొంగాలంటే తపస్సులు చెయ్యాలి. అహర్నిశలు కష్టపడాలి. ఇక్కడ కష్టపడి నువ్వెంత

ఏమీ చెయ్యఖ్ఖర్లేదు. మాటద్వారా నువ్వు జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చు. అంతేగా. కాలేజ్‌లో ఏం జరుగుతుంది. వాక్కే కదా. వీడి జ్ఞానాన్ని వాక్కు ద్వారా ఇతరులలోకి ప్రవేశపెడుతున్నాడు. వాడికా జ్ఞానం వచ్చేస్తోంది.

సైంటిస్ట్ చాలా కష్టపడి కంప్యూటర్ కనిపెడతాడు. ఎన్ని సంవత్సరాలు కష్ట పడుంటాడో మనకి తెలీదు. కానీ వాడు దాన్ని కనిపెట్టేసిన తర్వాత దాన్ని వాక్కుద్వారా అందిస్తాడు. ఈ 24 కేశవ.నామాల్లో చాలా అద్భుతమైన దిశానిర్దేశక సూత్రాలున్నాయి. దిశానిర్దేశక సూత్రాలంటే ఏంటంటే మన శరీరంలొ జరిగే రసాయన చర్యను సమానం చేస్తుంది. చాలామంది గందరగోళపడతారు మాటలు శరీరం యొక్క నిర్మాణాన్నెలా మారుస్తుందని. కానీ మీలో మీరు ప్రయోగాలు చేసుకుంటే చాలా తేడాలు తెలుస్తాయి. పిల్లలతో మాట్లాడేటప్పుడు, మన పై ఆఫీసర్‌తో మాట్లాడుతున్నప్పుడు మనం మాట్లాడే విధానంలో మార్పు వస్తుందా, రాదా? అంటే అర్థమేంటి. నీ యొక్క మాటలు నీ పనిని సానుకూల పర్చగలవు. కానీ వీళ్ళిక్కడేం చెపుతున్నారు. నీ కేశవ నామాలని నువ్వు తిరిగి తిరిగి చెపితే మీ శరీరంలో ఉన్న అనేక బాధలను అది తీర్చేయగలదు. ఈ యుగంలో ఈ శరీరాలకే. మళ్ళీ యుగం మారితే అది వర్తించదు. అందుచేత ఏమనుకుంటారు? మేలుకోరే వాళ్ళు. ఈ కలియుగంలో వాడుంటే బావుండునని. ఎంత కష్టపడినా మాట వాడనగలిగితే , ఎప్పుడైనా వాడికీ విషయం అవగాహనై పోతే చాలా సులభంగా ఏ సాధనా లేకుండా సరైన దారిలో పడిపోతాడు. చేతనత్వ విజ్ఞానంలోని ఈ ఆధారభూతమైన ఈ ఫార్ములాలు మీరు చాలా జాగ్రత్తగా వ్రాసుకుని ఫ్రేమ్ కట్టించుకుని పెట్టుకొండి.

## మాటమారితే - యుగం మారుతుంది.

మీ జీవితాలే కాదు, యుగాలే మార్చేయగలరు మీరు. మీ జీవితాలు మారటం ఓ లెక్కా ఏంటి! యుగం మారటమంటే మొత్తం మానవజాతి ఒక్కటే కాదు, ఖనిజ, వృక్ష జగత్తు నుంచి దేవలోకం వరకు ఉన్న పరిస్థితులు మారిపోతాయి. నువ్వు మాట మార్చుకోగలిగితే.



*కుకర్మా చరణాత్సారః సర్వతో నిర్గతో అధునాః ।*
*పదార్థా సంస్థితా భూమౌ బీజహీనాస్తుపాయధ ॥ ( శ్లో 70 )*

కుకర్మల్లో మనిషి ఉండటం వల్ల పృధ్వి మీదున్నటువంటి అన్ని పదార్థాలలోను.సారం పోయింది. ఇప్పుడదే మాట అంటూంటాం కదా. ఇది వరకు రుచి లేదు. ప్రతిదాంట్లోను సారం పోయింది. శక్తిపోయింది. అన్నీ నిస్సత్తువైపోయాయి. వాటిలో ఏవిధమైనటువంటి సత్వం లేదు అని.

*విప్రైర్భాగవతీ వార్తా గేహేగేహే జనేజనే ।*
*కారితా కణలోభేనా కధాసార స్తతో గతః ॥ (శ్లో 71 )*

పోనీ భాగవతం అంతద్భుతమైంది కదా. దీన్ని మనం వింటూంటే సరైన దారిలో పడిపోతామా అంటే లేదు. ఎందుకంటే ఈ కథ చెప్పేవాడు కూడా దేనికోసం చెప్తున్నాడు. దబ్బుకోసం చెప్తున్నాడు. దీనిలో ఉన్న సారాన్ని వాడు మర్చిపోయి ఎవరి చరణాలనాశ్రయిస్తే లక్ష్మీదేవికూడా నీ చరణాలను ఆశ్రయిస్తుందో దాన్ని ఆశ్రయించ కుండా, ఎవరింటికో వెడితే వాడో పావలా ఇస్తాడు అని చూస్తున్నందు వల్ల, కలికాలంలో భారతదేశంలో భాగవతం సారం కూడా పోయింది.

*అత్యుగ్ర భూరి కర్మాణో నాస్తికా రేరవాజనాః ।*
*తేపి తిష్ఠంతి తీర్థేషు తీర్థసార స్తతోగతః ॥ (శ్లో 72 )*

## తీర్థాల సారం పోయింది

పోనీ తీర్థాలకెళ్ళి మనంకూర్చుంటే దానికనుకూలమైన వాతావరణం వస్తుందా అంటే - అక్కడెవరు కూర్చున్నారు? రౌరవ నరకానికి తీసుకెళ్ళే పనిచేసే వాళ్ళక్కడ కూర్చున్నారు. వాళ్ళెప్పుడైతే అక్కడ కూర్చున్నారో ఏం జరిగిందక్కడ? తీర్థాల సారం పోయింది. తిరుపతి కొండ ఎక్కుతాడు. క్రిందికి రాగానే ఏముంటుందక్కడ? బార్ ఉంటుంది. అయోధ్యలో ఇప్పటికీ మాంసం అమ్ముతునే దుకాణాలు లేవు. సారా దుకాణాలు లేవు. అక్కడ రామనామం యొక్క ప్రభావం ఉంది. చాలా తీర్థస్థలాల్లో కూడా వాతావరణం సరిగా లేదు. అందుకే ఆ గురుపరంపర హిమాలయాల్లో కొంచెం

కొంచెం పైకెళ్ళింది. తీర్థాల యొక్క గొప్పతనం ఎందుకు పోయింది? ఏ తీర్థస్థలంలో ఏవిధమైన ఆచరణ ఉండాలో ఆ విధమైన ఆచరణ ఉండాలి. వెంకటరమణమూర్తి తీర్థస్థలంలో ఎవరి యొక్క విశేషమైన సాధనా సంపత్తి ఉండాలి? వెంకట రమణమూర్తి సాధన తప్ప ఇంకేం జరగకూడదక్కడ. శ్రీశైలంలో ఏ సాధన జరగాలి? అ భ్రమరాంబ, మల్లికార్జునుల యొక్క సాధనలు తప్ప ఇంకేం జరగకూడదక్కడ. కాని అక్కడేం జరుగుతోంది? ఏం చెస్తాం?

అందుచేత తీర్థాల యొక్క సారంకూడా పోతుంది. ఏకాలంలో? కలికాలంలో.

కామక్రోధాలు ....

*కామక్రోధ మహాలోభ తృష్ణావ్యాకుల చేతసః ।*
*తేపి తిష్ఠంతి తపసీ తపస్సార స్తతోగతః ॥ (శ్లో 73 )*

ఇంక తపస్సు చేస్తున్నాం, ధ్యానం చేస్తున్నాం అని కూర్చుంటారు మనుష్యులు. ఇళ్ళలో కూర్చోవచ్చు. ఆశ్రమాల్లో కూర్చోవచ్చు. కాని వాళ్ళ మనస్సుల్లో ఏముంది? కామ, క్రోధ, మహాలోభం ఉన్నాయి. మామూలు లోభం కాదు. మహాలోభం. ఎందుకంటే బాహ్యజగత్తులో నువ్వేదైనా ఒక పని చెయ్యాలంటే కొంత పెట్టుబడి ఉండాలి. నువ్వు చదువుకోవాలి అనుకున్నావనుకో పాఠ్యపుస్తకాలు కొనుక్కోవాలి. టీచర్ దగ్గరికి వెళ్ళాలి. అవంతా చెయ్యాలి. కాని ఇక్కడేంటి? నేను కళ్ళు మూసుక్కూర్చున్నాను. నా పన్లన్నీ అయిపోవాలి అనుకుంటారు. అందుకే మహా లోభం అనే మాటను వాడాను. అసలు మనిషి యొక్క ఆ నీచమనస్థితి ఎలా ఉందని? నిత్యజీవితంలోనే నువ్వు కష్టపడకుండా ఏ పనీ జరగదు. నువ్వు కళ్ళు మూసుక్కూర్చుని-మహాలోభంతో ఉన్నా ఇవంతా జరుగుతాయి. మరి అయిపోతాయని మీరేగా చెపుతున్నారు మాస్టారు? మీరు మీ మానసిక స్థితిని సరి చేసుకోమని చెపుతున్నాను.

నా దగ్గరికి వచ్చిన వాళ్ళందరికి నేనేం చెపుతున్నాను. మీరు నవ్వుతూ ఉండండి మీ పనులన్నీ జరిగిపోతాయని చెప్తుంటే మీరేమో ఏడుపు ముఖం పెట్టుకుని కూర్చుంటారు. నేను బలవంతంగా వాళ్ళ చేత నవ్విస్తాను. నవ్వినప్పుడు వాళ్ళ పనులై



పోతాయి. ఒకసారి నవ్వండి మీరు. అహహహ.....ఇంతేనా దానిక్కూడా లోభమేనాయే. ఇవాళిది పూర్తైపోతుంది కనుక ఈ భాగవత స్కంధాల్లోతుకు వెడుతున్నప్పుడు మనం తీవ్రంగా సాధనలు కూడా కలుపుకుంటూ చెప్పుకుంటాం. దాంట్లో మీరిది జాగ్రత్తగా నేర్చుకొండి. పోల్షిష్టింగ్ అతిశయోక్తి మాత్రం కాదు. మీరు పెద్దగా నవ్వగలిగితే. దీనికింత కష్టపడు తున్నానా నేను అని మీకు నవ్వొస్తుంది పని జరిగిపోయాక.

అందుచేత ఇలాంటి సక్రమమైనటువంటి మానసికస్థితి లేనటువంటి వాళ్ళవల్ల తపస్సు సారహీనమైపోయింది. తపస్సుకూడా దాని ఫలితాన్నివ్వటం లేదు. ఏది ఒక్కసారి గట్టిగా నవ్వండి. అ హహహ......

*మనసశ్చజయల్లోభాదంభాత్ పాఖండ సంశ్రయాత్ ।*
*శాస్త్రా నభ్యసనా చ్చైవ ధ్యానయోగ ఫలం గతమ్ ॥ (శ్లో 74)*

మనస్సు మీద వశం లేకపోవటం వల్ల లోభం, దంభం, పాఖండాన్ని ఆశ్రయించటం వల్ల శాస్త్రముల యొక్క అధ్యయనం కూడా ఫలితం ఇవ్వటం లేదు. సైన్స్ చదువుతారు కాని బ్యూరెట్, పిపెట్ పట్టుకోవటం రాదు. ఇంక మందులు తయారు చేయటం సంగతి వదిలెయ్యండి. మొత్తం విద్యావిధానం ఎలా అయిపోయిందంటే చెప్పే వారికీ రాదు. వినే వారికీ రాదు. చెప్పే వారికి రాకపోతే పోయే, నేర్చుకునేవారైనా సీరియస్‌గా నేర్చుకుంటే చెప్పేవాడు నేర్చుకునైనా చెపుతాడు. శాస్త్రాలు, సైన్స్ ఎందుకు నిస్సారమైపోతున్నాయంటే ఆ విషయాన్ని సక్రమంగా అధ్యయనం చేద్దామని ఉండదు. అందుకే మనమిక్కడ చాలా సీరియస్‌గా నేర్చుకుందామని చెపుతున్నాను. ప్రతీదీ

*పండితాస్తు కళత్రేణ రమన్తే మహిషా ఇవ ।*
*పుత్రస్యోత్పాదనే దక్షా అదక్షా ముక్తి సాధనే ॥ (శ్లో 75 )*

ఇక పండితోత్తములెలా అయిపోతున్నారు? వాళ్లకి పిల్లలు పుట్టించడమే తప్ప ముక్తి మార్గం తెలీదు అన్నాడు. అదికూడా వాళ్ళెలా జీవిస్తున్నారంటే గేదెల వలె జీవిస్తున్నారు అన్నాడు. ఒక్కొక్క ఉదాహరణ-ఒక్కొక్క మాటకి- చాలా చాలా శరీరగతమైన అర్థాలుంటాయి. పిండాండ -బ్రహ్మాండమైనవి ఉంటాయి.

మహిషాఇవ - మహిషాసురుడు ఎవరి చేతిలో చస్తాడు? దుర్గాదేవి చేతిలో రేపు 18వ తారీకు నుంచి అధిక దుర్గా నవరాత్రులు. వీని తర్వాత వచ్చే 18 నుంచి నిజ దుర్గా నవరాత్రుల్లో ఈ మహిషాసుర వధ జరగాలి కనుక ఈ శ్లోకాన్ని కాస్త జాగ్రత్తగా మననం చేసుకొండి మీరు.

*నహి వైష్ణవ తా కుత్ర సంప్రదాయ పురః సరా ।*
*ఏవం ప్రళయతాం ప్రాప్తో వస్తుసారః స్థలే స్థలే ॥ (శ్లో 76 )*

పోనీ వైష్ణవ మతమంటే కృష్ణుడనేం కాదు. భగవద్భక్తి యొక్క ఏ మతమైనా సాంప్రదాయంగా ఉందా? అక్కడక్కడుంది కాని అది కూడా ఒక క్రమంలో లేదు. గురుపరంపర అనంటామే మనం. సాంప్రదాయం అంటే అర్థమేంటి? ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు, ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు అందించుకుంటూ వస్తారు. అ సాంప్రదాయం కూడా లేదు. వాటి యొక్క విలువలు కూడా పోయాయి.

అయంతు యుగ ధర్మోహి వర్తతే కస్య దూషణం ।

అతస్తు పుండరీకాక్ష సహతే నికటే స్థితః ॥ (శ్లో 77 )

ఇది ఈ కలియుగ స్వభావం కనుక పుండరీకాక్షుడు అంత దగ్గరగా ఉన్నా కూడా దీన్ని భరిస్తున్నాడు. ఎవరీ పుండరీకాక్షుడు? దేనికి దగ్గరగా ఉన్నాడు? మన శరీరంలోనే ఈ విశ్వపరిణామమనే పుండరీకాక్షస్థితి ఒకటుంది. పుండరీకాక్షస్థితి అంటే విశ్వపరిణామక్రమం తెలిసున్న స్థితి. మనం ఖచ్చితంగా విశ్వపరిణామ క్రమంలో పాలుపంచుకోవటానికే ఒకచోట చేర్చబడ్డాము. ఒక సమాజంగా మనం చేర్చబడటానికి కారణం మీరు తిండితిని జీవించడానికి కాదు. విశ్వపరిణామ క్రమానికి ఒక రూపు ఇవ్వటానికి మనమంతా మానవ సమాజంగా ఒకచోట చేర్చ బడితే ఈ బోంబేలు, ఈ న్యూయార్కులు అవంతా కూడా లక్ష్యాన్ని మర్చి పోయాయి. ప్రతిమనిషిలోనూ ఈ పుండరీకాక్ష స్థితి ఉంది. కానీ ఆ విశ్వపరిణామ క్రమమును తెలుసుకుందామనే ఆలోచన వాడికి లేదు. ముందు వాడికా ఆలోచనుంటే ఎవరైనా చెప్పగలరు.



నువ్వు విశ్వపరిణామ క్రమంలో పాలుపంచుకుంటుంటే నీక్కావల్సినవన్నీ వాటి అంతటవే నీ దగ్గరికి వస్తాయని చెప్పినా అర్థం కావటం లేదు అదీ తమాషా. కలి యుగమంటే అది. నువ్వు నీకన్ని సుఖాలు ఈ దారంట వస్తాయంటే అఖ్ఖర్లేదండీ, తాత్కాలికమైన సుఖాలు వస్తే చాలు అంటున్నావు. అది కూడా కలిధర్మమే. అందుచేతేం చేస్తున్నాడు? నోరుమ్మూసుకుని ఊరుకున్నాడు అంటాడు.

*ఇతి తద్వచనం శృత్వా విస్మయం పరమం గతా ।*
*భక్తి యాచే వచో భూయః శ్రూయతాం తచ్చ శౌనకా ॥ (శ్లో 78)*

ఈవిధంగా నారదుడు భక్తికి చెప్పాడు. కథ మీకు గుర్తుంటోంది కదా. కానీ శౌనకుడిని సూతుడు అడుగుతున్నాడు. నారదుడు ఇలా చెప్పినప్పుడు మరి భక్తేం చెప్పింది అని? - నువ్వు కోరిక కోరుతున్నావు. ఏమని చెప్పింది? నువ్వు కోరేదంతా తుచ్ఛమైన, అల్పమైన, తాత్కాలికమైన కోరికలు. విశ్వపరిణామ క్రమంలో పాలు పంచుకోవటానికి, ఆత్మ సామ్రాజ్యానికి వారసత్వం కల్గినటువంటి వ్యక్తిగా నువ్వు జీవించాలి అని ఆ గురు పరంపర మొత్తం చెప్తున్నప్పటికీ కూడా వినటంలేదు. ఇది ఈ యుగధర్మం. కలికాలంలో ఇలాగే జరుగుతుంది. ఏం చేస్తాం? ఆ గురువులు మాత్రమేం చేస్తారు? అప్పుడు మరి భక్తి ఏమంది?

భక్తిరువాచ :-

*సురర్షే త్వంహి ధన్యోసి మద్భాగ్యేన సమాగతః ।*
*సాధునాం దర్శనం లోకే సర్వ సిద్ధి కరం పరం ॥ (79)*

ఇది చాలా జాగ్రత్తగా అర్థం చేసుకొండి. సాధువుల దర్శనం కానీ, మహాత్ముల దర్శనం కానీ..... మహాత్ముల ఫోటోలు చూట్టం చాలా మేలు కలుగచేస్తాయి. దాన్ని మనస్సులో చాలా జాగ్రత్తగా గుర్తుంచుకొండి. మీకు తెల్సినా, తెలీకపోయినా వాళ్ళ ఫోటోలు మీరు చూస్తే చాలు. అసలు వాళ్ళు సశరీరంగా ఉన్నప్పుడు ఇంకా లాభాలెక్కువగా ఉంటాయి. సురర్షేత్వంహి ధన్యోసి - హే దేవర్షీ నీవు చాలా ధన్యుడవు. మద్భాగ్యేన సమాగతః । నా యొక్క భాగ్యం వల్ల ఈ కలయిక జరిగింది.

ఈ శ్లోకం వ్రాసుకుని పెట్టుకొండి ఇంట్లో. వాళ్ళ దర్శనం సర్వ సిద్ధులను ఇస్తుంది. దాని కోసమే అరతులు మిస్ కావద్దని చెప్పేది నేను.

ఆరతిలో ఆ అగ్నిజ్వాలల్లో చూస్తారు మీరు. ఆరతిస్తున్నప్పుడు అగ్ని జ్వాలలేగా ఉండేది. అగ్నిజ్వాలల్లో ఎవరి రూపాన్ని చూస్తున్నారు మీరు. అగ్ని ఎవరి రూపం దాలుస్తుంది అన్నాం? భగవంతుడి రూపం దాలుస్తుంది. అప్పుడు మీరూ ఆ భగవత్స్వరూపంగా మారిపోవటానికి అవకాశం ఉంటుంది. మీకు తెల్సినా తెలీక పోయినా. అందువల్ల ఈ మహాత్ములకీ వాళ్ళకి ఆరతివ్వటం. కానీ ఇది మళ్ళీ చాలా జాగ్రత్తగా గుర్తుంచు కోండి. మీకు దగ్గరలో కానీ చుట్టుప్రక్కల కానీ ఎవరైనా ఓ గొప్ప వాడుంటే ముందు వెళ్ళి దర్శనం చేసుకుని రండి. మీరతనికి మార్కులు వేయటానికి మీరు ఎగ్జామినర్స్ కాదు. వీడు గొప్ప వాడేనా, వాడు ఎంత గొప్ప వాడు? వీడు మా గురువుకంటే గొప్పవాడేనా కాదా? అది వద్దు. మీరు దర్శనం చేసుకుని వచ్చేయండి చాలు. చాలా లాభాలుంటాయి. అలాంటప్పుడు ఈ శ్లోకాన్ని గుర్చుంచుకొండి.

*జయతి జగతి మామాం యస్య కాయాధ వస్తే ॥*
*వచన రచన మేకం కేవలం చాకల య్యా ।*
*ధృవ పదమపి యాతో యత్ కృపాతో ధృవోయం ।*
*సకల కుశల పాత్రం బ్రహ్మీపుత్రం నతాస్మి ॥ (శ్లో ॥ 80 )*

నారదుడనేటటువంటి ఒక మానసికస్థితి మనలో ఉంటుంది. బయట ఉండదది. దానికి తగినటువంటి మానసిక స్థితి మనం తయారుచేసుకుని కూర్చుంటే ఖచ్చితంగా నారదుడు మనకి తన ఉపస్థితిని చూపిస్తాడు.' సాధూనాం దర్శనం పుణ్యం' పైన చెప్పుకున్నాం కదా. మన శరీరంలో ఉన్నటువంటి, సర్వత్రా ఉన్న ఆ నారదుడు మనకి ఈ దర్శనం ఇస్తే , ఆ నారదుడు ఇతర శరీరాలలో ఏం చేశాడో ఉదాహరణగా చెపుతున్నాడు. ప్రహ్లాదుడికి ఒకసారి తల్లి గర్భంలో ఉన్నప్పుడే ఉపదేశం ఇస్తే వాడు మాయని గెల్చేశాడు. ధృవుడు మీ యొక్క కృప వల్లే శాశ్వతమైన పధాన్ని సాధించు కోగల్గాడు. ఎప్పుడో సత్యయుగంలో ఉన్న ధృవుడు ఈనాటికీ ఆకాశంలో కనిపిస్తాడు.



అలాంటి నారదుడి అనుగ్రహం వల్ల ఈనాడు మళ్ళీ మనం ఈ భాగవతాన్ని చదువుకుంటున్నాం. అందుచేత నారదుడు వాళ్ళకి కనిపించాడా అనకండి. వాళ్ళెవరికో కనిపిస్తే మనకేం లాభం? మనకి కూడా కనిపిస్తాడు. కనిపించాడా, లేదా? ఇదంతా నారదుడు చెప్పింది చదువుతున్నాం. న్యూటన్స్ లా చదివేటప్పుడు న్యూటనేగా ఉండేదక్కడ? కెమిస్ట్రీ లెక్చెరర్ ఉండడు. ఐన్‌స్టీన్ లా చదివినప్పుడు ఐన్‌స్టీన్ ఉన్నట్టే భాగవతం మనం చదువు కుంటున్నప్పుడు ఖచ్చితంగా నారదుడే ఉంటాడు.

## స్వస్తి

## ఆచరణీయాలు

1. నారదుడే నాకు గురువు అనుకోవాలి.

2. ఇది లభిస్తే చాలు, అన్నీ పోయినా ఫరవాలేదు అని దేనిమీద మనస్సు వుంటుందో అది భక్తి.

3. ఆజ్ఞాచక్రంలో జీవించడం, మౌనం అభ్యసించాలి.

4. నాటు - కోసుకో : ఈ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకునేందుకు గురుదేవుల ఆత్మకథ చదవాలి.

5. అధ్యాత్మికత అభివృద్ధికి చెట్లను ఉపయోగించుకోవాలి.

6. మీరు ఐదు గంటలు రెగ్యులర్‌గా జీవించగలిగితే, మీ 24 గంటలకు నేను బాధ్యుణ్ణి అవుతాను.

7. ఏది చేయాలనుకున్నామో అది అమలులో పెడితే కృష్ణం వందే వ్రజప్రియం

8. రాబోయే సంవత్సరాలలో తెరవబడుతున్న అద్భుత క్షేత్రం నిద్రా జగత్తు.

9. జీవితాన్ని చాలా సీరియస్‌గా తీసుకోండి - గురువులు చాలా కొద్దిమందికే అవకాశమిస్తారు.

10. అజ్ఞానస్థితిని జ్ఞానస్థితిగా మార్చేవి ఐదు స్థితులు.

11. భాగవతం మన చుట్టూరా వున్న నదులే మన కోరికలు తీరుస్తాయని చెబుతుంది.

12. మౌనంలేని చోటుకి శ్రీకృష్ణుడు రాలేడు.

13. క్యాన్సర్ పోవాలంటే మన ఆలోచనా విధానం మారాలి.

14. భాగవతంలో ఉన్న మంత్రాలన్నీ కూడా మందులుగా పని చేస్తాయి.

15. జరిగితే జరుగుతుంది, లేకపోతే లేదు - అన్న మానసిక స్థితే భాగవతవిద్య

16. శిష్యుడికి తన సమస్య ఏమిటో తెలియాలి - ఆ సమస్య తీరకపోతే నాకు సుఖం లేదు అనే మానసిక స్థితి ఉంటేనే గురువు లభిస్తాడు.

17. మీరు ఏ దేవత ఆసనాన్ని అభ్యాసిస్తే ఆ దేవత మీ మీదకి ఆవహిస్తుంది.

18.చేయదలచింది చేయకూడదు - చేయవలసింది చేయాలి.